# శ్రీ విష్ణు సహస్రనామము

( ద్వితీయ భాగము 101-205 నామ వివరణ )




మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీ విష్ణు సహస్రనామము

( ద్వితీయ భాగము 101-205 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతికుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపంలో, 1992 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణములో ప్రారంభించారు. ఇది కొన్ని సంవత్సరాలు కొనసాగింది. ఆ ప్రవచనములలో వారు విశదపరచిన విషయములు అమూల్యములు, సాధకునిగా మన జీవితములలో ఆచరించవలసిన సూచనలు కోకొల్లలు.

వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని  నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో లేని వివరణలను సేకరించే ప్రయత్నము ఒక ప్రక్క కొనసాగిస్తూ, అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపం లో అందజేయాలన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించడము జరిగింది. వారు ముందుగా  మన మాస పత్రిక 'నా వాణి'  లో నామాల వివరణ ప్రచురించమనగా, అది  శుభకృత్ ఉగాది సంచికతో ముద్రణ రూపం దాల్చుట మొదలైనది. అది ఒక ప్రక్క కొనసాగుతుండగా, అందుబాటులో ఉన్న నామాలన్నింటిని 11 భాగాలుగా e-Book రూపంలో అందజేద్దామన్న ఉద్దేశ్యాన్ని కూడా వారికి తెలియపరచడం జరిగింది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ  e-Book రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకొని రావటము జరుగుతున్నది.

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు యథాతథంగా, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు.

ఈ ప్రయత్నంలో పాల్గొంటున్న వారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి తమ ఆశీస్సులు అందజేయమని మాస్టరు గారికి మా ప్రార్థన.

ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై ఆనందము కలగజేయగలవని, గురుదేవుల సాన్నిధ్యములో ఉంచగలవని మా నమ్మకము.

శ్రీ విష్ణు సహస్రనామ వివరణ రెండవ భాగము- 101 నుండి 205 నామాలకు శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకొనేటపుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకొంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకొనేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళి తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధనగా లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన

తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు నేత్రములు, శ్రవణేంద్రియములు, ఘ్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకొనేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు చూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, ఆదిశేషువు వెనకాల పడగ పట్టి వుంటే, చతుర్భుజుడై, ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలిసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 108 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది, కొత్త అభ్యాసంగా మొదలు పెట్టాలి. ఏదైనా అభ్యాసం వలన మాత్రమే వశమవుతుంది కాబట్టి అభ్యాసవశమున మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు.

సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. “సహస్ర” అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూటిని వ్యాపించినది ఒకే ఒక తత్వము- ‘ఒకటి’. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే

ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో,( Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్ని భగవంతుని కీర్తించడమే! భగవంతుడిని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏది లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది. అది తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి

వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు . అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినదనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోటం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలాసమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు

చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం ౨౦ నిముషాలు పడుతుంది. ౨౦ నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే ౨౦ నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకం లో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ

ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని "విశ్వం విష్ణుర్వషట్కారో" అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ,"విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు" అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్ర నామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకం లో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం

మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction కింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటీ? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకోనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ fresh గా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకం లో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం

అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పుకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పుకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరం గా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పుకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పుకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పుకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పుకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు

రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం, అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్ళి పోతుంది. మంచి రోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచి రోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారం గా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశృతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశృతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి

తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి. విష్ణు సహస్రనామం వివరణలో ప్రత్యేకించి మనం గుర్తించాల్సిన అంశమేమిటంటే ప్రతీ నామం ద్వారా మనల్ని మనం గుర్తుచేసుకోవడమే! మన నిజస్వరూపాన్ని గుర్తుచేసుకొని అన్ని స్వరూపాలకు ఆధారభూతమైన ఒకే ఒక తత్వాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా ఆ మొత్తం తత్వంలో మనం భాగంగా ఇమిడి, జీవితాన్ని అనుభూతి చెందడానికి ఇది ఒక ప్రాతిపదికగా దీనిని వివరణ చేసుకొంటున్నాము. అందుకని ప్రతి నామం యొక్క వివరణలోంచి కూడా ప్రత్యేకించి మనల్ని మనం గుర్తించడం, దారి మళ్ళించడం చేస్తున్నామన్నమాట. తద్వారా మనమేమిటో మనం తెలుసుకున్న కారణంగా మనయొక్క స్వస్థానం తెలిసికొని, దాంతో ముడిపడి జీవిస్తూ వుంటాము. ఎప్పుడైతే మొత్తమంతా ముడిపడి జీవిస్తూ వుంటామో దాన్ని 'పురుషోత్తమప్రాప్తి యోగం' అంటారు. 'పురుషోత్తమః' అంటే ఈ మొత్తం వ్యాపించియున్న తత్వం. ఏది ఆధారంగా ఇవన్నీ జీవిస్తున్నాయో ఆ తత్వంతో మనం ముడిపడి వుండడానికి చేసే ప్రయత్నం. ఏ ఆరాధన చేసుకున్నా, ఏ ధ్యానం చేసుకున్నా, ఏ క్రతువులు చేసినా, ఏ యజ్ఞాలు చేసినా ఆ మొత్తం తత్వంతో అనుసంధానం చెందడం కోసం చేసే ప్రయత్నమే అది. అందుకని మొత్తాన్ని మరువకుండా మొత్తంలో మనం ఏ విధంగా వున్నామో మరువకుండా ఈ నామాల యొక్క అవగాహన చేసుకొంటూ వుండాలి. అలలుగా వేరుగా వున్నట్లుగా కనిపించినప్పటికీ సముద్రంలో భాగంగా ఎలాగ వున్నాయో అలలు, అలాగే ఇంతమంది వ్యక్తులు కూడా ఒకే ఒక తత్వానికి సంబంధించిన తరంగాల లాంటివాళ్ళు కాబట్టి అది గుర్తువుండి సాధన చేసుకోవడం భాగవత మార్గమవుతుంది. భాగవత మార్గంలో చాలా సులభంగాను, సామాన్యంగాను, సరళంగాను భగవత్ ప్రాప్తి కలగడానికి అవకాశం వుంది కాబట్టి ఆ మార్గంలోనే మనం ఈ నామములను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాము.

కంభంపాటి పార్వతి కుమార్

# విషయ సూచిక

101,102,103,104- అజః, సర్వేశ్వరః, సిద్ధః, సిద్ధిః............................... 5

105 సర్వాది.................................................................... 6

106 అచ్యుతః.................................................................... 7

107 వృషాకపిః ..................................................................19

108 అమేయాత్మా................................................................ 29

109 సర్వయోగవినిస్సృతః.........................................................30

110,111,112,113- వసుః, వసుమనాః, సత్యః, సమాత్మా .....................35

114,115 - సమ్మితః, సమః ........................................................36

116,(162)- అమోఘః ..........................................................37

117,118,119- పుండరీకాక్షః, వృషకర్మ, వృషాకృతిః ............................ 43

120,121,122- రుద్రః, బహుశిరాః, బభ్రుః .................................... 44

123,124,125- విశ్వయోనిః, శుచిశ్రవాః, అమృతః ............................. 45

126,127 - శాశ్వతః, స్థాణుః,.................................................... 46

128 వరారోహః .............................................................. 47

129 మహాతపాః .............................................................. 54

130 సర్వగః .....................................................................57

131 సర్వవిత్.....................................................................60

132 భానుః.......................................................................66

133 విష్వక్సేనః................................................................ 74
134 జనార్దనః ...............................................................77
135,136 వేద:, వేదవిత్ ......................................................81
137 అవ్యంగః ............................................................... 92
138 వేదాంగః............................................................... 94
139 వేదవిత్ ................................................................ 98
140 కవిః ...................................................................100
141,142,143- లోకాధ్యక్షః, సురాధ్యక్షః, ధర్మాధ్యక్షః .......................104
144 కృతాకృతః.............................................................109
145,146,147,148-చతురాత్మా, చతుర్వ్యూహః, చతుర్దంష్ట్రః,
చతుర్భుజః.............................................................. 110
149 భ్రాజిష్ణుః .............................................................141
150 భోజనం ...............................................................159
151 భోక్తా.................................................................167
152 సహిష్ణుః ..............................................................169
153 జగదాదిజః............................................................175
154,155,156- అనఘః, విజయః, జేతా.........................................176
157 విశ్వయోనిః ........................................................... 181
158 పునర్వసుః............................................................182
159 ఉపేంద్రః ..............................................................189
160,161- వామనః, ప్రాంశుః ................................................201

162,(116) అమోఘః........................................................ 204

163 శుచిః.........................................................................213

164 ఊర్జితః ..................................................................... 224

165,166,167- అతీంద్రః, సంగ్రహః, సర్గః.................................. 226

168 ధృతాత్మా ................................................................... 253

169,170 నియమః, యమః.................................................. 265

171 వేద్యః ......................................................................... 275

172 వైద్యః........................................................................... 282

173 సదాయోగీ.................................................................. 285

174 వీరః............................................................................292

175 మాధవః ..................................................................... 296

176 మధుః ......................................................................... 304

**177** అతీంద్రియః ...............................................................309

178,179,180-మహామాయః, మహోత్సాహః, మహాబలః..................... 311

181,182,183,184- మహాబుద్ధిః, మహావీర్యః, మహాశక్తిః,.................. 328

మహాద్యుతిః.......................................................................... 328

185,186,187,188- అనిర్దేశ్యవపుః, శ్రీమాన్, అమేయాత్మా, మహాద్రిక్... 345

189 మహేష్వాసః ................................................................ 346

190 మహీభర్తా ...................................................................356

191 శ్రీనివాసః........................................................................363

192 సతాంగతిః.......................................................................367

193 అనిరుద్ధః.............................................................370

194 సురానందః..........................................................380

195 గోవిందః ............................................................388

196 గోవిదాంపతిః ...................................................... 394

197 మరీచిః ...............................................................395

198 దమనః.................................................................401

199 హంసః................................................................. 407

200 సుపర్ణః ............................................................... 427

201 భుజగోత్తమః ........................................................ 439

202,203 హిరణ్యనాభః, సుతపాః .......................................... 453

204 పద్మనాభః ........................................................... 463

205 ప్రజాపతిః............................................................. 465

## 101,102,103,104- అజః, సర్వేశ్వరః, సిద్ధః, సిద్ధిః

( ఈ నామాలకు వివరణ సేకరించె ప్రయత్నం జరుగుతున్నది)

## 105 సర్వాది

మన ద్వారా అనేక కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. ఎలా జరుగుతున్నాయి? The space pulsate అనే అమృత వాక్యం ఒకటుంది. ఆ pulsation కారణంగా మనకి ఉద్భవం జరుగుతుంటుంది. ఈ ఉద్భవంలో నుండి వివిధమైన కార్యక్రమాలు వస్తుంటాయి. ఇది అర్థం చేసుకోవాలంటే మనలో స్పందన జరగబట్టి కదా ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నాము అని తెలియాలి. స్పందన మొత్తం ప్రతివాళ్ళలోనూ జరుగుతుంది. కుక్కలోనూ జరుగుతుంది. చూడగలిగినవాడు ఈ స్పందన అన్నిటా జరగడం చూస్తుంటాడు. అతడూ విశ్వాత్మకమైన భగవంతుని స్పందనాత్మకుడుగ దర్శనం చేస్తాడు. మిగతావన్నీ తరువాత చూస్తాడు. మనం అసలు విషయం చూడకుండా మిగతావన్నీ చూస్తాము. అసలు అది వుండబట్టి మిగతావన్నీ జరుగుతున్నాయి. ఉచ్ఛ్వాస - నిశ్వాసలు ఉండబట్టి, దానికి ఆధారంగా స్పందన వుండబట్టి, స్పందనానికి ప్రాణప్రవృత్తి ఉండబట్టి, ప్రాణప్రవృత్తిగా దిగి రావడానికి చైతన్యం ఉండబట్టి, చైతన్యంగా రావడానికి మనం వుండబట్టి. ఈ వుండడం వలన చైతన్యవంతులం అవటం, ప్రాణప్రవృత్తులు, ఇంద్రియప్రవృత్తులు పని చేస్తూ ఉండడం. ఇవన్నీ ఉన్నప్పుడు అన్నిటికి basis ఈ వుండడం. భగవంతుని చూడాలనుకుంటే ఉండడం అనేది గుర్తుపెట్టుకోవాలి. అట్లా ఉండడం చూడగలిగినవాడు రాయిలో కూడా ఉండడం చూస్తాడు. రాయిలో ఎక్కడ చూడాలీ అంటే? రాయిగా వున్నానంటాడు. చీమగా ఉన్నానంటాడు. దోమగా ఉన్నానంటాడు. జంతువుగా ఉన్నానంటాడు. ఈ ఉండడం అన్నది గమనించడం చేయగలిగితే, ఉండడం అనే ఒక dimension మనలో develop అయ్యి, మనం ఉండడం అంటే ఏమిటో మనం తెలుసుకొనడానికి దారి తీస్తుంది. అదీ ఈ సర్వాది అనే నామం.

## 106 అచ్యుతః

అచ్యుతః అంటే పతనం చెందనివాడని. అచ్యుతుడు అంటే "చ్యుతము కానివాడు". పడడుట ఎప్పుడూ! వాడు ఉంటాడు, వాడి ఆధారంగా కొంతమంది లేస్తుంటారు, కొంతమంది పడుతుంటారు. ఈ పడి, లేచేదంతా వాడికి సంబంధించినది కాదు. హాని- వృద్ధులు అంటారే అవన్ని కూడా అందులోంచి పుట్టుకు వచ్చినవాటికి సంబంధించింది తప్ప, వాడికి సంబధించింది కాదు. కానీ ఆలోచన పుట్టింది, వృద్ధి అయ్యింది. ఆ తరువాత ఇది బాలేదని మానేస్తాము కదా? మనలో ఆలోచనలు మనం ఉండడం వల్ల వస్తుంటాయి, పోతుంటాయి. ఆలోచనల్లో కూడా ఆలోచనగా మనం ఉన్నాం. ఆలోచనలు మాటగా మారినప్పుడు మాటగా మనం ఉంటాము. చేతగా మారినప్పుడు చేతగా మనం ఉంటాము. ఈ అన్నిట్లో ఆయన ఉంటాడు తప్ప పడడు. ఎట్లా పడడంటే ఒక రూపాయి బిళ్ళ పట్టుకొని ఒకడు కోటీశ్వరుడు అవుతాడు. అదే రూపాయి ఆధారంగా మళ్ళీ బీదవాడు కూడా అవుతాడు. కోటీశ్వరుడు నుండి బీదవాడుగా అయ్యే మధ్యలో అనేక ఇబ్బందులు పడడం కనిపిస్తుంటాయి కదా, ఈ పడే తంటాలు రూపాయి బిళ్ళకి సంభందిచినవా? పడేవాడికి సంభందిచినవా ? రూపాయి బిళ్ళ ఉంది కనుక దాన్ని పది రూపాయలు చేద్దామనుకున్నవాడొకడు, పది తరువాత వంద, వెయ్యి చేద్దామని మరొకడు, మరోటి చేద్దామని ఇంకోడు. అవి రూపాయికి సంబంధించినవా, వాడికి సంబంధించినవా? ఈ రూపాయిబిళ్ళ రూపాయి గానే ఉంటుంది. రూపాయిబిళ్ళ తో మార్కెట్ కి వెళ్ళి దానితో తోటకూర కొనుక్కుంటే మన leather purse లోంచి ఆ అమ్మేవాడి దగ్గర ఉండే గుడ్డ సంచిలోకి వెళ్ళిపోతుంది. కానీ రూపాయిగానే ఉంటుంది. వాడు వెళ్లి ఇంకో చోట ఒక రొట్టి కొనుక్కున్నాడనుకోండి. ఎక్కడికి వెళ్లినా రూపాయిబిళ్ళ రూపాయిబిళ్ళ ఉందికదా! మారదుకదా! ఇన్ని చోట్లు ఇంత మంది చేతులు మారినా సరే, ఇన్ని కార్యక్రమాలు చేసిన ఆ రూపాయి ఎట్లా మారదు, పతనం చెందదు, అట్లాగే ఉండిపోతుంది. ఎవరైనా వీలుంటే ReserveBan నించి ఒక రూపాయిబిళ్ళ పైకి వచ్చిన తరువాత అది ఎట్లా, ఎన్ని చోట్ల, ఎంతమంది చేతులు మారి ఎన్ని

కార్యక్రమాలు చేసి ఇంకా బతికుందో తెలుసుకుంటే తెలుస్తుంది. మనిషి చచ్చిపోతాడు తప్ప అన్ని చోట్లకి తిరిగిన రూపాయి అట్లాగే ఉంటుంది పతనం చెందకుండా! ప్రపంచంలో రూపాయి ఆధారంగా ఎంతో కార్యక్రమం జరుగుతోంది. అలా పతనం చెందండం, వృద్ధి పొందడం అనేది ప్రకృతి ధర్మాలుగా వర్తిస్తాయి తప్ప దానికి వర్తించవు. ఒరేయ్ అచ్యుతం, అని పిలుస్తాం కదా మనం, అంటే వాడు పతనం లేనివాడని అర్థం. పతనం లేకుండా ఎలా ఉంటాడండి అంటే ఈ రూపయి బిళ్ళే ఉదాహరణ. ఇంకొక ఉదాహరణ చోటు. చోటులో అన్నీ వస్తుంటాయి, అన్ని వెళ్లిపోతుంటాయి. చోటు చోటుగానే ఉంటుంది ఎప్పుడూ. మన పెద్దలు చెప్పే ఇంకో ఉదాహరణ మట్టి -కుండ. ఎన్ని కుండలైనా చేయవచ్చు మట్టితో. కుండకి నాశనం ఉంటుంది కానీ మట్టికి లేదు. కుండ పగులవచ్చు, కుండగా పతనం చెందవచ్చు కానీ మట్టి వుంటుంది. అది కుండా కావచ్చు or మనం పరిచే పెంకులు /tiles కావచ్చు. మట్టి మట్టిగా ఉంటుంది. అట్లా శాశ్వతం అయిన తన స్థితికి మార్పులేదు. తాను తానుగానే ఉంటాడు. అన్నిటా ఉండడం వలన అది ఆధారంగా స్థితి మార్పులు ఉంటాయి తప్ప అది మారదు. మన భావం భగవంతుని పట్ల రకరకాలుగా మారుతూ ఉంటుంది. కష్టాల్లో ఉంటే ఒక విధంగా ఉంటుంది, సుఖాల్లో ఉంటే మరో విధంగా ఉంటుంది. పనులు జరుగుతున్నప్పుడు ఒక విధంగానూ, జరగనప్పుడు ఇంకో విధంగానూ ఉంటుంది. ఇవన్నీ మనలో జరిగే మార్పులు తప్ప అసలు వస్తువులో జరిగే మార్పులు కావు. అన్నిట్లోకి దిగివచ్చినట్లు కనిపిస్తాడు కానీ దిగడు. ఆ స్థితిలోనే ఉంటాడుట. అది ఋషులు చెప్పిన పెద్ద వాక్కు. ఇది రకరకాల ఉదాహరణలు చెప్పుకుంటేగాని అర్థంకాదు. ప్రత్తి లోనుంచి దారం తయారవుతోంది. దారం మనకి కానీ ప్రత్తికి కాదు. దారం ఒకరికి చొక్కా అవ్వచ్చు, ఇంకొకరికి జాకెట్టు కావచ్చు, మరొకరికి బనియన్ కావచ్చు. ఇవన్నీ మనం పెట్టుకున్న పేర్లు. రూపంబట్టి పేర్లు తప్ప ప్రత్తిబట్టి కాదు. అన్నిట్లోనూ ప్రత్తి ప్రత్తిగానే వుంటుంది. మనం దానిమీద రకరకాల రంగులు, designs వేసుకుంటాం, Design బట్టి అది చొక్కా అనో, pant అనో decide చేసుకుంటాం. ఇవన్నిటి వలన అసలు వస్తువుని మరచిపోతాం. కానీ అసలు వస్తువు అలాగే ఉంటుంది. అలాగే బంగారం. అది ఉంగరం కావచ్చు, ముక్కుపుడక కావచ్చు, చేతిగాజు కావచ్చు. ఏదైనా అది బంగారంగానే ఉంటుంది. మనకే ఆ రూపాలన్నీ! బంగారంతో రాముడు విగ్రహం చేయవచ్చు, రావణాసురుడి

విగ్రహాము చేయవచ్చు అనుకుందాం. అప్పుడు ఒక్కసారి మాత్రం మనం సమస్యలో పడతాము. ఎందుకంటే బంగారం కాబట్టి. రాణాసురుడి విగ్రహం ఎత్తిపారేయలేం. నిజానికి రావణాసురుని విగ్రహాన్ని ఎక్కువ ఆదరిస్తామేమొ! ఎందుకంటే వీడికి పది తలకాయలు పెట్టాలంటే బంగారం ఎక్కువ పడుతుంది. మాములుగా మనం రూపాలు చూసేటప్పుడు వేరువేరుగానే చూస్తూ ఉంటాం రావణాసురుడిని, రాముడిని. కానీ మనదగ్గర బంగారంతో చేస్తే రెండింటిని కాపాడతామా? కాపాడమా? ఎవడైనా దొంగ వచ్చి ఈ రెండు విగ్రహాలలో ఒకటి ఉంచుకొని రెండోది ఇచ్చేయమని బెదిరిస్తే ఏది ఇస్తారు? రాముడినా? రావణాసురుడినా ? రాముడినే ! Because Ravanasurudu is three times more in weight than Rama. ఎందుకలా? అదే పరిస్థితి మిగతావాటిల్లో ఎందుకు చూడం? అందులో ముడిపదార్ధం value తెలుసు కాబట్టి. ముడిపదార్ధం ఎన్నడూ మారదు. మారినట్టుగా కనిపిస్తుంది . 'కదిలినట్లు తోచు కదలకుండు!' భాగవత పద్యం. కదిలినట్టు కనిపిస్తుంది కానీ కదలదు. 'కంచికాంతరంగబున' . ఎక్కడ? అంటే అటాఅటా పరుగెత్తి వెళ్లిపోతుందే మనస్సు. అంతరంగంలో బాగా కంపనం వున్నదనుకోండి, అలా కదలిపోతూనే ఉంటుంది. దానిలో ఏమి బలం? "కంచికాంతరంగబున కదిలినట్లు తోచు కదలకుండు" అన్నారు. నిజంగా ఎంత కష్టపడి మనకి ఉపమానాలు ఇవ్వడానికి ప్రయత్నం చేసారా అనిపిస్తుంది. కదలడం అన్నది మనస్సుకు సంబంధించిందే తప్ప లోపల వున్నటువంటి 'నేను' కు సంబంధించింది కాదు. మనం ఏడ్చినా, పెడ బొబ్బలు పెట్టినా, ఎగిరిగంతేసినా, మన మనోవైకల్యానికి సంబంధించేదే తప్ప అంతకు వెనుక ఉన్నటువంటి 'నేను' కు కాదు. అంటే తాను ఆధారంగా ఉంటాడు తప్ప తన participation లేనటువంటి స్థితిలో అన్నిటియందు ఉన్నట్టుగా ఉంటాడు. HE lends His support but HE is not involved. Involve అవడం అంటే 'పడిపోవడమే'! అదే మనకి జీసస్ జీవితం లో చక్కగా కనిపిస్తుంది. శ్రీరాముడు జీవితంలో చక్కగా కనిపిస్తుంది. పడిపోరు. పడిపోతే ఏమౌతుందంటే కదలిపోతాం. కదలిపోతే కేంద్రం నుండి భ్రష్టత చెందుతాం. భ్రష్టత చెందడం వలన, కదలికలలో ఎక్కువ జీవిస్తుండడం వలన, అలసిపోతుంటాం. మనని మనం మరచిపోతాం. తన నుండి తానె దిగివస్తుంటాడుట. నిజానికి దిగటం కాదు ఉండడం అంటాడు. 'నేను ఉంటె నన్ను పట్టుకొని నా నుండి పుట్టుకొచ్చినవన్నీ నన్ను వాడుకుంటున్నాయి. నేను అన్నిటిలో

ఉండటమే తప్ప పడిపోవటం జరగదు' అంటాడు. కొడుకు పుట్టాడండీ. తండ్రిలో నుండి కొడుకు పుట్టాక నిజానికి తండ్రిలో ఒక భాగం పోవద్దూ? కానీ. తండ్రి, తండ్రిగానే ఉంటున్నాడు కదా కొడుకు పెరుగుతున్నా కూడా. అలా వాడి నుండి ఎంత పెట్టుబడిగా తీసుకొని ప్రకృతి వాడుకున్నా తను తనుగా ఉంటాడు. తాను తానుగా ఉంటూ, తన చుట్టూ ఏర్పడుతున్న దాంట్లో తాను అట్లాగే ఉంటాడు. విశాఖపట్నం చుట్టూ ఎన్నిమేడలు కట్టినా విశాఖపట్నం ఉంటుందిగా. చాలా మేడలు కట్టారండి, విశాఖపట్నం లేదనడానికి ఉందా? ఇప్పుడు, భూమిమీద ఏమైనా చేస్తాం. భూమి ఎక్కడుంది? చోటులో ఉంది. చోటులో ఎన్నెన్నో ఉంటాయి. ఉన్నా చోటు చోటుగానే ఉంటుంది. ఏమీ లేకపోయినా చోటు ఉన్నది. ఈ చోటులో ఎన్నో ఏర్పరుచుకుంటాం చోటులో ఏర్పరచుకున్నవన్నీ చూస్తాం కానీ చోటు చూడం. ఇది వంటిల్లు, అది పాయిఖానా. దేనికి? మన సౌకర్యం కోసం. కానీ వంటిల్లులోనూ, పాయిఖానాలోనూ ఉన్న చోటు చోటులానే ఉంది. దానికి పతనం లేదు. దిగివచ్చినా పతనం లేనటువంటివాడిని 'అచ్యుతుడు' అంటారు. తన నించి ఒక సంకల్పం వచ్చిందిట. ఆ సంకల్పాన్ని 'ప్రకృతి' అన్నారు. మనకి కూడా అలాంటి సంకల్పాలు వస్తుంటాయి. అదీ ప్రకృతే! అయితే మనకి వ్యక్తిగత స్వభావాల నుండి సంకల్పాలు వస్తుంటాయి. శనివారం సాయంత్రం వస్తే మన స్వభావాల బట్టి సంకల్పం వస్తుంది. కొంతమంది శనివారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్దామనుకుంటారు. కొందరు శనివారం సాయంత్రం కాబట్టి cinema కి వెళ్దామనుకుంటారు. ఇంకొందరు శనివారం సాయంత్రం club కి వెళ్దామనుకుంటారు. ఈ సంకల్పాలన్నీ శనివారంలో లేదు కదా! మన స్వభావం లో ఉంది. తన నుండి వచ్చిన సంకల్పం నుండి శక్తి పుట్టుకొచ్చి, శక్తి, సంకల్పం ఒకదానికొకటి జమిలిగా అల్లుకుంటూ, సృష్టి ఏర్పరచుకుంటూ వెళ్తుంటే, ఈయన అక్కడ ఉంటాడుట. ఎందుకంటే తనలోనే అంతా జరుగుతోంది కాబట్టి. ఇది చాల important. మన నుండి ఒక సంకల్పం వచ్చింది. మన నుండి వచ్చిన సంకల్పాన్ని ప్రకృతి అంటారు. సృష్టి లో అసలు మొట్టమొదట బయటకు వచ్చిన సంకల్పాన్ని మూలప్రకృతి అంటారు. మనం ఉంటేనే ఏదైనా సంకల్పం వస్తుంది పూరికే ఉండం కదా? వాడిలో కూడా అలా సంకల్పం వస్తుంది కాబట్టే మనలో కూడా వస్తుందని చెప్తారు. ఒక సంకల్పం వస్తే దాన్ని నెరవేర్చడానికి మనలో శక్తి

ఉద్భవిస్తుంది కదా? ఓ ఆదివారం భీమిలి వెళ్దామనే సంకల్పం వచ్చిందనుకోండి, ఏమి జరుగుతుంది? సంకల్పం మనలో ఉండె శక్తిని ప్రేరేపిస్తుంది. 'ఇంక లే! భీమిలి వెళ్దామనుకున్నావుగా, లే మరి!' అక్కడ నించి శక్తి లేస్తుంది. మరి భీమిలి వెళ్ళాలిగ. అది ఇది తయారు చేసుకోవాలి కదా? లేక కొనుక్కోవాలి కదా? ఇహ అవన్నీ మనచేత శక్తి చేయిస్తుంది. అలా శక్తి, సంకల్పం జమిలిగా అల్లుకుంటూ అలా మన పనులన్నీ చేయిస్తాయి. సాయంత్రానికి ఇంటికి వచ్చేసి మళ్లీ 'మనం' అయిపోతాం. ఈ జరుగుతున్నదాంట్లో మనబోటి వాళ్ళం సాయంత్రానికి అలసిపోతాం. ఎందుకంటే ఆ కార్యక్రమంగా మనం మారిపోతాం, ఊసరవిల్లి ఏ చెట్టు మీద ఉంటె ఆ చెట్టు రంగు లోకి మారిపోయినట్లు. ఇట్లా మారుతూ మన నుండి వ్యక్తం అవుతున్న సంకల్పానికి మనం సహకారం ఇస్తూ, దాన్ని గమనిస్తూ ఉన్నట్లయితే అలసట రాదుట. ఇవన్నీ ఆధారం చేసుకొని మనలో నుండి మన స్వభావం, మన శక్తి ఆడుతున్నటువంటి నాటకం చూద్దాం అని తను సాక్షీభూతుడిగ జరుగుతున్నవి చూస్తుంటాడు. వీరిద్దరూ చేస్తున్నవి చూస్తుంటాడుట. ఈ శక్తిని 'శ్రీదేవి' అన్నారు. సంకల్పాన్ని 'భూదేవి' అన్నారు. అందుకని శ్రీదేవి - భూదేవి ఆడుతూంటే ఈయన చూస్తూంటాడు. చూస్తూ ఉండటమే కాదు ఈయన లేకపోతె వారిద్దరూ లేరు. మనం లేకపోతె మన సంకల్పం ఉండదు, మనలో శక్తి పని చేయడమూ ఉండదు. ఇది మొట్టమొదటి త్రిభుజం, అంటే త్రిమూర్తులు కూడా అవతరించని స్థితి. ఉండడం ఆధారంగా మనం పొద్దున్నే లేచాం. ఉన్నాం. ఏదో ఒక ఆలోచన వస్తుంది. అదే అమ్మవారుగా వ్యక్తం అవడం. ఆ వ్యక్తం అయిన అమ్మవారు ఊరుకుంటుందా? మన లోంచి ఇంకో అమ్మవారిని పుట్టిస్తుంది. రెండో అమ్మవారు ఆవిడ అందుకని, ఆ మొదటి అమ్మవారిని 'జ్యేష్ఠా' అన్నారు. రెండో ఆవిడని 'లక్ష్మి' అన్నారు. చిన్నమ్మవారు, పెద్దమ్మవారు. ఈ చిన్నమ్మవారు ఎక్కువ కాంతివంతంగా ఉంటుందిట. ఎందుకంటే ఆమె 'శక్తి' కనుక. పెద్దమ్మవారు 'పదార్థం'. పదార్థం దానంతటఅది కదలదు. పదార్థం కదలాలంటే ఈ శక్తిని ప్రేరేపిస్తుంది. ఎక్కడ నుండి? మన నుండే! ఈ రెండూ మన లోనే పుట్టుకొచ్చి ఆడుతుంటాయి. ఆట మనం చూస్తున్నంత సేపు మనకి ఇబ్బంది లేదు. ఆటలోకి మనం దిగాం అంటే అమ్మవారు ఓ పట్టు పట్టేస్తుంది. అయితే ఆటలో మనం పావులం ఎప్పుడు అయిపోతామంటె, మనం ఎవరో మనం మర్చి పోయినప్పుడు. మనం ఎవరో మనకి గుర్తు ఉన్నప్పుడు, మనం భగవత్ తత్వంతో అనుసంధానం చెంది ఉన్నాం

కాబట్టి చూసేదంతా ఆటగా ఉంటుంది. తన నుండి జరిగేదంతా ఆటగా ఉంటుంది.జరిగేదంతా తన ప్రాతపదికగా జరుగుతున్నాయి, జరగనియ్యి చూద్దాం అన్నట్టుగా ఉంటాడు. తాను తానుగానే ఉంటాడు. అన్ని తను చేస్తున్నట్టుగా, చేయిస్తున్నట్లుగా ఉంటాడు కానీ ఏదీ తను చేస్తున్నట్లుండడు. తాను ఆధారంగా జరగడమే తప్ప. ఇది శ్రీకృష్ణుడు జీవితంలో మనం దర్శనం చేయాలి. శ్రీకృష్ణుడు యుద్ధం చేసాడా? చేయలేదు. చేయలేదా చేసాడు. అట్లా చూపించాడు ఆయన తన జీవితంలో. 'ఈ చేసేదానిలో చేయనివాడిగా ఉండరా', అంటాడు. అంటే జరుగుతున్నవాటికి నువ్వు supportive role తప్ప, active role కాదు. అప్పుడు జరుగుతున్నది అంత బాధించదు. మనం జరుగుతున్న దాంట్లో పడిపోతుంటాం. మనల్ని అసంగం అనే అస్త్రాన్ని పట్టుకొమ్మన్నారు. 'అ' తో మనల్ని సంగమం చేయమన్నారు. అంతేగాని ఉన్నవి వదిలించుకోవడం అసంగం కాదు. అన్నిటిలో ఉన్న 'అ' అంటే 'నేను'. అక్షరాలలో 'అ' నేను అని చెప్పాడు విభూతియోగంలో. ఇలాంటి విషయాలు అంత కాకపోయినా peripheral గా నైనా తెలుసుకోవాలి. అక్షరాలలో 'అ' నేను, రుద్రులలో శంకరుడిని నేనయ్యా అంటాడు. పాండవులలో అర్జునుడిని నేనేనయ్యా అంటాడు. వృక్షాల్లో అశ్వథాన్ని నేనేనయ్యా, తిథుల్లో ఏకాదశిని నేనేనయ్యా అంటాడు. మాసాల్లో మార్గశీర్ష మాసాన్ని నేనేనయ్యా అంటాడు. అంటే ఏంటి? ఎక్కువ పరిపూర్ణంగా కనిపించే రూపం లో, కాలంలో కనిపించేట్లుగా అనిపించేవాడిగా అన్నమాట. అక్షరాలలో నేను 'అ' అని విభూతి నుండి 15వ అధ్యాయంలోకి వెళ్లేసరికి 'అసంగం' అనే అక్షరం పట్టుకో, అంటాడు. అంటే మనింట్లో ఒక మాదిరి పెద్దవాళ్ళు (నిజం పెద్దవాళ్ళు కాదు) అంటుంటారు సంగం వదిలించేసుకో, సంగం ఉండకూడదు అని. వదిలించేసుకుందాం అంటే ఎక్కువ అడ్డం అవుతుంది. ఏదైనా సరే. సంసారం వదిలి సన్యాసం లోకి వెళ్తే ఈ సంసారం కన్నా పెద్ద సంసారం ఉంటుంది. సంసారం లో ఉన్న వారికి మాములుగా ఇద్దరో లేక ముగ్గురో కానీ చాల ఎక్కువ మంది సంతానము సన్యాసం లో వాళ్ళకే కదా? మాస్టరుగారు అదే చెప్తారు. ఒక సన్యాసి ఆయన దగ్గరకి వచ్చాడు. ఆ సన్యాసికి చాల ఆశ్రమాలు, ఆ ఆశ్రమాలకు చాలా లావాదేవీలు వాటికి వచ్చే ఆదాయాలు, ఖర్చులు, ఆస్తులు కాపాడడానికి మనుషులు, accounts కి రసీదులు, అవి చూడ్డానికి మనుషులూనూ. ఉన్న ఆస్తులకి లావాదేవీలు ఉంటే చూడ్డానికి వకీళ్ళు. ఇవన్నీకష్టాలే మరి సన్యాసికి.

ఆయన - ఈయన చిన్నప్పటి నుండి బాల్యస్నేహితులు. ఆయన వచ్చి ఇలా మొర పెట్టుకుంటుంటే చెప్పారు, 'వీడూ నేను చిన్నప్పటి నుండి కలసి పెరిగాం. నేనేమో సంసారం లో ఉన్న సన్యాసిని. వీడేమో సన్యాసం లో ఉన్న సంసారి,' అని. మాస్టరుగారి జీవితం చూస్తే బాగా అర్ధం అవుతుంది. ఆయనకి దేనియందు రుచి? భగవంతుని దర్శనం! అంతే! ఈయనకి మత వాదం లేదు. దేనిమీదా ఆసక్తి లేదు లేదు, ఏ ఆశా లేదు అని గొప్పగా చెప్పుకుంటారు. వాళ్ళు somethig Mentally wrong అంటే sick అన్నమాట. దేనిమీదా ఆసక్తి లేనివాడు అనారోగ్యవంతుడు అవుతాడు తప్ప ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నవాడు అవడు. అన్నిటియందున్న భగవంతుని యందు ఆసక్తి ఉండాలి. మాస్టరుగారు అలాగే ఉండేవారు. అన్నిటిలో ఉండే భగవంతునితో తను సంగం చెందేవారు. అందరిలో ఉన్న భగవంతునితో సంగం చెంది, మిగతావాటితో సంగం చెందక ఉండేవారు. ఇంక దేనితో సంగం చెందినా అది 'చ్యుతమే' అందుకని 'అ' తో సంగం చెందితే 'అచ్యుతం' అవుతాం. మనం 'అ' తో కాకుండా ఇంక వేటితోనైనా సంగం పెట్టుకున్నామనుకోండి, మనం ఊహించనటువంటి సన్నివేశాలు అన్నీ మన దగ్గరకి వస్తుంటాయి. మనము ఎంత మనవాడు అనుకున్నప్పటికీ మనకి surpriseలు వస్తాయి. ఎందుకు వస్తాయంటే? మనవాడు అనుకున్నాం కాబట్టి. మనవాడు కాదు అనుకోవలసింది. 'అ' తో సంగం చేయి, అని శ్రీకృష్ణుడు చెప్పినప్పుడు దానికి మనవాళ్ళు విపరీత వ్యాఖ్యానం ఏం చేసారంటే, 'అసంగం' అని చెప్పారు. వదిలించుకోమని చెప్పారు. వదిలించుకొనేవైతే ఎప్పుడో వదిలించుకుంటాం. మనకు ఇష్టం లేనివి వదిలించుకుంటాం, మనకు ఇష్టమైనవి పట్టుకుంటాం. అట్లా ఉండదు కదా? నువ్వు వద్దనుకున్నవే నీ దగ్గరకు మరీ ఎక్కువ వస్తుంటాయి. కోరుకున్నవి రావు. 'కోరకుండని రూపము కొసకు మిగులున్' అన్నట్లు. కోరినకొద్దీ ఇష్టం లేనివన్నీ వస్తుంటాయి. కోరినవి రావు. వద్దన్నవి ఇబ్బంది పెడుతుంటాయి. కాబట్టి అసలు ఇష్టం లేనివి, ఇష్టం ఉన్నవి అని పెట్టుకోకుండా "అ " తో సంగం చేయాలి. సంగం చేస్తే ఈ ద్వంద్వాలకి పైన ఉంటావు. అది మరచిపోతే భ్రష్టే ! అది గుర్తుంచుకొంటే పతనం లేదు. మన వరకు సాధన కోసం 'అ' తో సంగం చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చాలి. మంచిరోజులు వస్తుంటాయి, చెడురోజులు వస్తుంటాయి. ఎవరికీ అన్నీ మంచి రోజులు లేకపోతే అన్నీ చెడ్డ రోజులు వుండవు. అంటే వాడిని పట్టుకు కూర్చుంటే ముందు బురదనీరు వచ్చిందిటా అంటే తరువాత

మంచినీరు వస్తుందని ఒక guarantee వుంది. అసలు నీరే రాకపోతే problem కానీ, ఎదో ఒక నీరు వస్తే అది బురదో, గిరదో తర్వాత ఇంకొకటి వస్తుంది. అందుకే అన్నమాచార్యులవారు చెప్పారు 'ఎంత విభవము గలదో అంతయును ఆటయని చింతించుట కదయా తెలివి' అని. నిజమైన బుద్ధి ఏమిటయ్యా అంటే మనకు వైభవం జరుగుతున్నదిటా అంటే దాని వెనకాతల కష్టం కూడా వుంటుందని గుర్తు పెట్టుకోండి అని. ప్రతి వెలుగు వెనకాల ఒక చీకటి వుంటుంది. వెలుగు కావాలనుకొంటే నీడ వుంటుంది. నీడ లేని వెలుగు కావాలంటే ఎలా? పైగా ఆ నీడ ఎక్కడుంటుంది తెలుసా? దీపం క్రిందే వుంటుంది నీడ. మరీ దగ్గరగా వుండేవాళ్ళకి వెలుగు కనిపించడం చాలా కష్టం. మరీ వెలుగుకు దగ్గరగా వున్నామనుకొండీ, ఏమీ కనిపించదు. మన మొహంమీద torchlight పడ్డట్టుగా ఓ మహాత్ముడు ఉన్నాడనుకొండి, ఏమవుతుంది? అంతా చీకటిగానే ఉంటుంది. ఋషులు ఏం చెప్పారంటే, కలియుగంలో మీకు ఇదే problem. దేవుడు మరీ ఎక్కువగా మీ దగ్గరకి వస్తాడు. మీరేమో దేవుడి నీడలో వుండి, దేవుడిని చూడలేక పోతారు. Groping for the light in the shadow of the lamp. దీపం నీడలో వెలుగు వెతుక్కుంటూ ఉంటాం. నిజానికి నీడ కొంచెమే మిగతాదంతా వెలుగే. Proximity వలన problems వస్తుంటాయి. తానుగా ఉండకపోతే పతనం ఉంటుంది. భగవంతుడు తానుగా అన్నిటిలోను ఉంటూ ఉంటాడుట కానీ తాను పడడు. తానే తన నించి వ్యక్తం అవుతున్నటువంటి సంకల్పం. దాన్నే ప్రధానం అన్నారు. తానే తన నించే వ్యక్తమయ్యే శక్తి. అది, సంకల్పంతో కలిపి ఒక ఆట ఆడుతుంటే దాంతోపాటు మరొకటి వచ్చి చేరిందిట 'కాలమని'. సంకల్పం వచ్చింది మొదలు కాలం లెఖ్ఖ. అంతకు ముందు ఏమీ లేదు. సంకల్పం బయటకి రాగానే 'ఒకటి' అని మొదలుపెడతాము. కానీ అది ఒకటా? ఒకటి కాదు నిజానికి. అంతకు ముందే ఒకటి ఉన్నది. ఒకటిగా వాడు ఉన్నాడు. కానీ మనం చూడడం మొదలైనప్పటి నుండి చూస్తాం కాబట్టి 'ఒకటి' అంటాం. తప్పు. అసలు మొదలే తప్పు అయిపోయింది. కాలము, సంకల్పము, శక్తి ఈ మూడు Three Fundamental Emergenses from the One exsistance. అంటే, అనిర్వచనం అయినటువంటి భగవత్ తత్త్వం నించి వ్యక్తం అయ్యేది సంకల్పం. సంకల్పం వ్యక్తం అవ్వంగానే ఈ మూడింటిలో ఏది ముందు అని చెప్పడానికి ఏమి లేదు. సంకల్పంతోపాటే శక్తి ఉధ్భవం, సంకల్పంతోపాటే కాలం. ఇవి ఒకదానితో ఒకటి కాలం ఆధారంగా

చేసుకొని భగవంతుడు కాలం రూపం లో దిగి వస్తుంటాడు. సంకల్పం రూపం లో దిగి వచ్చేదీ ఆయనే. శక్తి రూపంలో దిగి వచ్చేదీ ఆయనే. కానీ అన్నిటిలో ఉండడం తప్ప, మిగతా activity అంత ప్రకృతి తీసుకున్నదని చెప్తాడు శ్రీకృష్ణుడు. నాకేమి సంబంధం లేదంటాడు. నా నుండి వ్యక్తం అయిన ప్రకృతి, త్రిగుణాత్మకంగా తయారవడం వల్ల, అందులోంచి పుడుతున్న శక్తులు ఉన్నాయే, వాటికీ programme. నేను ఉంటే ఉంటాను తప్ప నాకు programme ఏమి లేదు. నా నుండి ప్రకృతి పుడుతోంది. ప్రకృతి నుండి పుట్టినవన్నీ ఇవన్నీ చేస్తున్నాయి. ప్రకృతి లోంచి ఇవన్నీ ఎలా పుడున్నాయంటే శక్తి, ప్రకృతి చేసే పరస్పరత్వం వల్ల పుడుతున్నాయి. ఈ పుట్టినవాటి అన్నిటిల్లో నేను ఉంటాను. ఈ ఉండటం తప్ప జరిగే వాటితో నాకు నిమిత్తం లేదు. నేను సాక్షీభూతుడిగా ఉంటాను. అన్నిటిలో పడకుండా ఉంటాను. నేను 'నేను' గానే ఉంటాను. తక్కువగా ఉండటానికి లేదు. ఎక్కువ 'నేను' గ ఉంటాను. కాబట్టి ఇష్టం లేనివాళ్లు కనబడ్డా 'నేను' గ ఉంటాడు. హానివృద్ధులు లేవు కృష్ణుడు face లో. మన face లో ఉంటాయి. మనకి చంద్రకళలు. మనకి ఒక్కొక్కరోజు బాగుంటుంది. ఒక్కోరోజు బాగుండదు. ఇవన్నీ మనకే ఎందుకుంటాయీ అంటే 'వాడిని' చూడం. అచ్యుతుడిని చూడడం ఒక programme, ఒక సాధన. ఇందులో ఏ ఒక్క నామం పట్టుకున్నా ఒక సాధన. అటువంటివి 1000 నామాలు ఇచ్చారు మనకి. కనీసం ఎదో ఒకటి పట్టుకుంటారని వాళ్ళ ఆశ. మనమే చేస్తున్నాం అనుకుంటాం మనం. వాళ్ళు అన్నీ చేసినప్పటికీ మనమే జయిస్తాం. ఎందుకంటే మనం ఏవీ పట్టుకోము కాబట్టి. 'అ' పట్టుకుంటే పడిపోకుండా ఉంటాం. పొద్దున్నే లేచినప్పటి నుండి మనకి పడిపోడం ఎక్కువ. First మనం ఎక్కడ పడిపోతామంటే wash basin దగ్గరకు వెళ్ళగానే నీళ్లు రావు. ప్రశాంతమైన మనస్సుతో లేచిన వాళ్ళం పతనం చెందుతాము. లేకపోతె పాలు రాలేదు, coffee లేదు. పతనం చెందుతాం. లైట్స్ వెలగడం లేదు డ్రాయింగ్ రూమ్ లో. మనబోటి వాళ్ళు తెల్లవారుఝామున లేవడం వలన lights వెలగవు. ఇవన్నీ ఎంత చిన్న విషయాలైనా పడిపోతూ ఉంటాం. దానికి కారణాలు బయట చూస్తుంటాము. ప్రతి భార్యా భర్త లో కారణాలు వెతికీ, ప్రతి భర్తా boss లో కారణాలు వెతికీ, ఇట్లా కదా జీవిస్తూ ఉంటాము. మన నష్టాలకి బయట ఎవరో బాధ్యులు అనుకుంటాం. ఇవన్నీ అనుకోడాలే. నిజాలు కావు. నిజం ఏంటంటే మనం మనంగా ఉండటం నిజం. జరిగేవన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. అట్లా

వచ్చి పోయి వచ్చి పోయి అలా. వాడినే గట్టిగ పట్టుకోమంటాడు నారదుడు ధర్మరాజుని. ధర్మరాజు అడుగుతాడు 'చాలా మంచి వాణ్ణి నేను అంటారు అందరూ, మరి నాకేంటి ఈ కష్టాలు? నేను మంచి వాణ్ణి కాదా?' అని. 'నువ్వు మంచి వాడివే,' అంటాడు. నారదుడు. 'నిజంగా చెప్పు' అంటాడు ధర్మరాజు. 'నిజంగా నువ్వు మంచివాడివే', అంటాడు నారదుడు. మరెందుకు నాకీ కష్టాలు, అంటాడు ధర్మరాజు. 'నీ ప్రశ్న ఒట్టి పిచ్చి ప్రశ్న' అంటాడు నారదుడు. 'మంచి వాళ్ళకి కష్టాలు రావని ఎక్కడైనా రాసుందా? నీ అవగాహనలో తేడా ఉంది మంచి వాళ్ళకి కష్టాలు రాకూడదు, చెడ్డ వాళ్ళకి కష్టాలు రావాలి అని ఉండదు. కష్టాలు, సుఖాలు కాలం బట్టి వచ్చి వెళ్లిపోతుంటాయి. వచ్చి వెళ్లిపోయేవాటిలో జీవించకు. ఎప్పుడూ ఉండే వాడిలో జీవించు. అదే నీ అసలైన మంచితనం' అంటాడు నారదుడు. 'మంచి - చెడులు మనం పెట్టుకున్నవే. నువ్వు మంచి అనుకున్నవి ఇంకొకరికి కావు. నువ్వు చెడు అనుకున్నవి ఇంకొకరికి మంచి. ఈ మంచి- చెడులు మన standards. అవన్నీ లెఖ్ఖ పెట్టుకోకుండా ఈ జరుగుతున్న వాటి యందు ఆధారంగా వున్నవాడి యందు లగ్నం చేసుకో. వాడే అదిగో అక్కడ కూర్చున్నాడు' అని శ్రీకృష్ణుని చూపిస్తాడు. ఇదంతా రాజసూయం జరుగుతుంటె ఒక పక్క జరిగే సంభాషణ. ధర్మరాజుకి నారదుడు చెప్తాడు. మనకి Demonstration కి శ్రీకృష్ణుడు దిగి వచ్చాడు! పుట్టిన దగ్గర నుండి ఎప్పుడూ, రోజూ చంపడానికి ప్రయత్నాలు జరుగుతునే ఉన్నాయి. ముఖం లో చిరునవ్వు పోలేదు. ఏనాడూ తనను చంపుదామనుకున్న వాళ్ళని పట్టించుకోలేదు. తాను చేయవలసిన పనులు దరహాసంతో చేస్తూనే ఉన్నాడు. అసలు తాను చేయవలసిన అవసరమే లేదు. అయినా చేస్తున్నాడు. అలా ఉండగలవా చూడుమరీ? ఆయన కన్నానా నువ్వు? అని. ఇంత చెప్పడు కానీ మనం ఇదంతా analyse చేసుకుంటే తెలిసేదేమంటే అక్కడ శ్రీకృష్ణుని రాజపురుషునిగా, మహాపురుషునిగా పాదపూజ చేయడానికి నిర్ణయం చేస్తారు. ధర్మరాజు నారదుడ్ని అడుగుతాడు. అడిగితే, అక్కడ example ఉంది చూడమని చెప్తాడు. ఏమి example ? పుట్టిన దగ్గరనుండి conspiracies ఉన్న life. Murder attempt on daily basis శ్రీకృష్ణునికి. Security లేదు. అయినా నవ్వుతూనే ఉన్నాడు. అన్ని పనులూ చేస్తూనే ఉన్నాడు. చేయవలసిన అవసరం లేకపోయినా అన్నీ చేస్తూనే ఉన్నాడు. ఈ example అక్కడ తీసుకోమని చెప్తాడు. ఈ వచ్చే పోయే వాటిని చూస్తూ ఏడుస్తూ, నవ్వుతూ ఉండేవాడి జీవితం

ఏమి జీవితం? స్థిరత్వం ఉండదు. వచ్చే పోయే వాటి గురించి ఏడ్వక దేని ఆధారంగా పెట్టుకొని ఇవన్నీ వస్తుపోతూ ఉన్నాయో దాన్ని పట్టుకోమన్నాడు. అందుకని అప్పుడు కృష్ణుని పట్టుకుంటాడు. రాజసూయ యాగం అయ్యాక కృష్ణుడిని చేరతాడు. ఎందుకంటే ఏమి అక్కరలేదు ఆయనకి. ఇది అక్కరలేదని గాని, ఇది కావాలనిగాని చెప్పేదీ ఏమీ లేదు. అచేతనం అనేటువంటి స్థితి శ్రీకృష్ణునిది. ఏంటయ్యా అంటే ఇది రావాలని ఉండదుట. ఇది పోవాలనీ ఉండదుట. అందుకని ఉండటమే ఉంటుంది. ఎన్నో వస్తూ - పోతూ ఉండవచ్చు. వచ్చిన వాళ్ళు వాళ్ళ accounts వాళ్లే చూసుకుంటారు. మన balance ఒక్కటే 'NIL'. వచ్చిన వాణ్ణి బట్టి వాడికేమి కావాలో వాడికి ఇచ్చి పోతుంటాడుట. ప్రేమ కావాలి అని ప్రేమ పట్టుకుపోయిన వాళ్ళున్నారు. చావు కావాలని చావు పట్టుకుపోయిన వాళ్ళున్నారు. వరాలు కావాలని వరాలు పట్టుకుపోయిన వాళ్ళున్నారు. According to them అంతే! అట్లా ఎవరికి ఏవి కావాలో వాళ్ళకి అది ఇచ్చాడు. ఆయన దగ్గర programmes ఏమి ఉండవు. అనే స్థితి ఆయనది. ఆయనకి అంతా NIL. ఎప్పుడూ దిగనటువంటివాడు. స్థితి భేదం లేనటువంటి వాడు. అసలు స్థితి / నిజ స్థితి యందు ఎప్పుడూ ఉన్నటువంటివాడు ఆయన. ఆ స్థితిలో శ్రీకృష్ణుడిని ఒక్క సారి తలచుకోండి. మొహం చిట్లించడం, విసుగు పడడం, భేదాలు, ఇటువంటివి ఏవి ఉండవు. నవ్వుతూనే ఉంటాడు. వాడికి భయం వేయాలి తప్ప ఈయనకి ఏమీ కావు. శిశుపాలుడికి నవ్వుతూ ఉంటె కోపం వస్తుంది. నవ్వుతూ ఉంటే దుర్యోధనుడికి అసూయ వస్తుంది. వాళ్ళల్లో ఉండేవి బయటకి వస్తుంటాయి తప్ప, ఈయనలో నుండి ఒకటే వెళ్తుంటుంది ప్రేమగా తన యొక్క సాన్నిధ్యం. అదీ పరాకాష్ఠ. ఈ ఋషులు చెప్పేవన్నీ నిదర్శనప్రాయంగా చూపించడానికి తానే దిగి వచ్చిన స్థితి శ్రీకృష్ణుడిది. భాగవతోత్తములు కూడా అలా చెదిరి ఉండరు. వాళ్ళే ప్రహ్లాదుడు, అంబరీష, నారద, శుక, పరాశర, వ్యాస వంటి వాళ్ళు. వాళ్ళు కూడా జీవితంలో వచ్చేటటువంటి సన్నివేశాలకి కదలిపోలేదు. అంటే పతనం చెందలేదు. కాబట్టి భగవంతుడిని యందు ఉంటే పతనం ఉండదు. పతనం యందు ఉంటె భగవంతుడు ఉండడు. దేంట్లో ఉంటాం అనే choice మనది. కష్టం వచ్చినప్పుడు అమ్మో! అని ఏడవకుండా, వాడి యందు ఎక్కువ ఉండాలి. సుఖం వచ్చినప్పుడు గంతులు వేయకుండా వాడి యందుండిపోవాలి. అప్పుడు మన జీవితం permanent కాదని గుర్తు ఉంటుంది. ఈ సన్నివేశాలన్నీ

permanent కావని గుర్తుంటుంది. మరి ఏది permanent? మనం permanent. మన రూపం కూడా permanent కాదని గుర్తుంటుంది. అప్పుడు మనం బెల్లం కొట్టిన రాయిలా చలించకుండా ఉంటాం. అదీ వసిష్టుడు. విశ్వామిత్రుడికి ఆయన్ని చూస్తే కోపం వస్తుంది. ఎందుకంటే వసిష్టుడు చలించకుండా చలిమిడి ముద్దలా ఉంటాడు. నిర్వికల్పం అయినటువంటి స్థితిలో ఉంటాడు. వికల్పం లేనటువంటి వాడు. అంటే ఏంటి? సంకల్పంకి opposite. వికృతమైనటువంటి కల్పం. ఎప్పుడూ 'ఆయన' యందే ఉంటాడు. దేని యందు? ఆ 'నేను' అనే తత్వంయందు ఉండేవాడు. అటువంటి వాడు పడడు. ఈ కింద పడ్డం, మీద పడ్డం మిగతా వాళ్ళకే ఉంటుంది. వాళ్ళు పడరు. అసలు పడకుండా ఉండే వాళ్ళ జీవితాలు భాగవతం లో చాల ఉన్నాయి. 'చూసుకోవయ్యా! నువ్వేదో కష్టాలని బాధ పడిపోతుంటావు. నీకన్నా భయంకరమైన కష్టాలు వచ్చిన వాళ్ళు అట్లా నిలబడే ఉన్నారు.' అంటాడు ధర్మరాజుతో నారదుడు. ఎన్ని భూగోళాలు కానీ, ఎన్ని సూర్యమండలాలు కానీ ఎంత విచ్చుకున్నట్లుగా చేసినా కూడా పడకుండా ఉంటాడు ఆయన. తాను అలాగే ఉంటాడు. ఆయన అన్నిటి యందు ఉండి, అన్ని భరిస్తూ ఉంటాడు. భగవంతుడిని అందుకే 'భర్త', అంటారు. భగవంతుడు ఎప్పుడు చికాకైన మొహం పెట్టడు. నలుగురు పిల్లలని పోషించేసరికే మనం మొహం ఎట్లా పెడతాం? అట్లా ఉండడు ఆయన.

# 107 వృషాకపిః

వృషాకపి అనేటటువంటి దానికి అర్థం ఇచ్చేవాడు - పుచ్చుకొనేవాడు. ఇచ్చేవన్నీ పుచ్చుకుంటుంటాం. ఏవీ వద్దనం. మనం అనుకుంటాం మనకి ఇచ్చినవన్నీ శాశ్వతం అని. ఏదీ కాదు. వచ్చినవన్నీ వెళ్ళిపోతాయి కదా? వచ్చిన వాళ్ళం కూడా వెళ్ళిపోతాం, ఉన్నవాళ్ళం ఉండడం తప్ప. ఆ timeకి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. క్రిందటి జన్మలో ఇవ్వనివాడు, ఎగేసి పోయిన వాడు ఇప్పుడు అలా పోగేసి పోగేసి ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టి పోతాడు కొడుకు అనుకొని. కొడుకు రూపంలో వస్తాడు ఇదివరకు మనం deny చేసినవాడు. అందుకే వాళ్ళు బాగా చెప్పారు. 'చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్థులు' అని. ఇదివరకు తీర్చవలసిన బాకీగా కొడుకు వస్తాడు. బాకి అంటే తీర్చం కానీ కొడుకు ఏమైనా కావాలంటే అప్పు చేసైనా కొంటాం. అప్పు చేసి చదివిస్తాం. అప్పు చేసి medical seat ఇప్పిస్తాం. అప్పు చేసి America పంపిస్తాం. వాడు అక్కడికి వెళ్లి ఎవరో ఇంకో దాన్ని పెళ్లి చేసుకుంటాడు. 'నాన్నా నేను పెళ్లి చేసుకోబోతున్నా, మీరు ఇక్కడికి వచ్చి ఏమైనా అశీర్వదిస్తారా?' అని అడుగుతాడు formal గ. అయిపోయింది, వాడి మీద మనము పెట్టిన ఖర్చు ఒక 15/ 20 లక్షలు ఉంటుంది. అది పోయినట్లే. మామూలుగా ఓ మనిషి మీద 15/20 లక్షలు ఖర్చు పెడతామండీ? 15 రూ/- కూడా పెట్టం. అదే కొడుకయితే మా బాబే, మా బంగారే! అని అప్పు చేస్తాం. చెవులు పిండి పని చేయించడం ప్రకృతికి బాగా తెలుసు. మనని పొగిడి మన చేత గాడిద చాకిరీ చేయించుకోరూ? మనల్ని పొగడంగానే మనకి ఏంటో అంత ఉబ్బిపోతుంది. మనం ఉబ్బంగానే వాళ్లకి మరి బాగా తెలుసు మన చేత పనులు చేయించుకోడం. ఎక్కువ మంది గురువులు పాపం ఇటువంటి ఇబ్బందులు లోనే ఉంటారు. 'మీరు చాల మహాత్ములు', అనేసరికి 'కామోసు', అనుకొని ఉబ్బిపోతుంటారు. వాడు అప్పు అడిగితే ఇవ్వకపోతే రేపు పొద్దుట నించి మళ్ళీ అనడేమోనని ఇస్తారు. గురువుల చేత పనులు చేయించుకొనే వాళ్ళు చాల మంది. పొగడందే పనులు చేయనివాళ్ళు చాల మంది. ఇట్లా రకరకాలుగ మన దగ్గరకి వచ్చినది వెళ్లిపోతుంటుంది. దాన్ని దాచుదామని చూస్తాము కానీ అది ఉండదు. అందుకని ఒక చెయ్యి ఇచ్చేది మరో

చెయ్యి పుచ్చుకొనేదని రెండు ముద్రలు ఉన్నాయి. ఇచ్చే చెయ్యి ఒకటి. పుచ్చుకొనేది ఒకటి. 'వృషాకపి' The One who showers and the one who absorbs. అన్నీ అంతే! వచ్చింది పోతుందని గుర్తు ఉంచుకోవాలి. ఏదైనా గుర్తుంచుకోండి, It is Given only to be Taken. It is Taken only to be Given. నీకు దేహం ఇచ్చానురా అంటే - చాల సంతోషం Sir, అంటాము. ఒరేయ్! నేను ఇచ్చిందే కదురా? నాకు ఇచ్చెయ్యరా, అంటే 'అమ్మో', అని నానా గోల పెడతాం. మనం ఇప్పుడు ఇస్తే మళ్ళీ సమయానికి వస్తుంది. ఉద్యోగం ఇస్తే? సంతోషం. ఉద్యోగం పోతే? అసలు retire అయిపోతుంటేనే ఏడుపు వస్తుంది. 30 ఏళ్ళు చేసాం ఏమి లాభం? అని. ఏదైనా వచ్చింది పోతుందని గుర్తు పెట్టుకోవాలి. ఎందుకని గుర్తు పెట్టుకోవాలి అంటే పడకుండా ఉంటామని, అదే పట్టుకొని ఉండకుండా. ఎంత దూరమని వెళ్తాము? ఊరంతా బంధువులు ఉంటారు. ఎంత దూరం వెళ్తాము? హనుమంతుడు ఎగురుతూ ఉంటె ఆ గాలికి చెట్లన్నీ ఊగాయట. చెట్లు పెళ్లగించుకొని కొంత దూరం సముద్రంలో వెళ్లి పడిపోయాయట. అప్పుడు దూర దేశం వెళ్లిన బంధువుల్లా వెళ్ళాయి ఈ చెట్లు అని చెప్తారు. అంటే ఏంటి? ఎంతో దూరం పోలేరు బంధువులు అని. ఇప్పుడు మన బంధువులు ఉన్నారు. మనం పోయాం అనుకోండి, ఎంత దూరం వస్తారు మనతో? స్మశానం వరకు వస్తారు. ఆ తరువాత రారుకదా? ఆ తరువాత ఎవరి దారి వారిదే. అంటే ఏంటి? ఈ వచ్చే వాళ్ళు, వెళ్లే వాళ్ళు మనతో ఉండరు. We have to be alone. నాటకరంగంలో ఏ విధంగా మన role ఉందో ఆ script ప్రకారము ప్రస్తుతానికి సరిపోయినట్లుగా ఆ విధంగా నటించడమే! ఆ role అయిపోతే stage మీద నుండి దిగిపోవలసిందే. అలా ఉండగలగాలి. నాటకం అయిపోయాక నేను రానంటే ఎవరు ఒప్పుకుంటారు? ఆ తరువాత dialogues చెప్తే పిచ్చివాడు అనుకుంటారు. Stage మీద చెప్తేనే అది రక్తి కడుతుంది. ఇంటికి వచ్చి నేను ఆంజనేయుడిని అని dialogue ల తో అందరి బుర్ర తింటానంటే అవదు కదా? ఏ సన్నివేశము అయినా కూడా వెళ్ళిపోతుంది. కష్టమైన సన్నివేశము వెళ్ళిపోతుంది. సుఖమైన సన్నివేశమూ వెళ్ళిపోతుంది. మనతో వచ్చిన వాళ్ళు కూడా వెళ్ళిపోతారు. నువ్వు ఒక్కడివే వచ్చావు, ఒక్కడివే వెళ్ళిపోతావు గుర్తుండాలి. అలా అని ఈ మధ్యలో వచ్చే వాళ్ళని neglect చేయకు. వాళ్ళంతా భగవంతుడి స్వరూపాలు కాబట్టి రసానుభూతిచెందు. అంతే కానీ మొత్తం అంతా ఏడవకు. ఎప్పుడూ నేను ఒక్కడినే

అని ఏడవక. ఇన్ని రూపాలలో నేనే దిగి వచ్చాను కాబట్టి అందరిలో ఉండేవాడితో జీవితం రక్తి కట్టించుకో. రసానుభూతి చెందు. కానీ అతికించుకోకు అని చెప్తున్నాడు. అతికించుకుంటేనే ఇబ్బంది. భగవంతుడే ఇచ్చేవాడు, పుచ్చుకొనే వాడు. ఇస్తినమ్మ వాయనం-పుచ్చుకుంటిని వాయనం అనే పద్ధతిలో ఉంటుంది.. భగవంతుడు ఏది ఇచ్చినా తిరిగి మళ్ళి పుచ్చుకుంటాడు. అది మర్చిపోతేనే problem. ఇంద్రుడికే మాటిమాటికి problem వస్తుంది. ఇచ్చినప్పుడల్లా తనదే అనుకుంటాడు. మనం కూడా మనకిచ్చింది మనదనుకుంటాం. కాదు. వాడిది మన దగ్గర పెట్టాడు. మనం దాని అనుభూతి పొందవచ్చు. అంతకు మించి మరేమి లేదు అని పెట్టుకోవాలి, వాడు పీకినప్పుడు మనకి కొంచం నొప్పి వస్తుంది అనేది గుర్తు ఉంచుకొని అన్నిటిలో వాడిని చూస్తూ జీవించాలి. వర్షాలు ఇస్తాడు. మళ్ళి ఆకాశం నుంచి ఇచ్చిన జలాలు మళ్ళీ ఆకాశం లోకి పట్టుకొని వెళ్ళిపోతాడు. కదా? అందుకే ఆయనకి ఇంద్రుడు అని ఒక పేరు. సృష్టి యొక్క పెరుగుదలే దక్షిణాయనం, ఉత్తరాయణం. ఉత్తరాయణ పుణ్యకాలం అంటుంటాము, కానీ అన్ని పట్టుకుపోతూ ఉంటుందండీ. చాల బాధాకరంగా ఉంటుంది. అన్ని ఒదిలించుకోడం ఉత్తరాయణం. అన్నీ పుచ్చుకోడం దక్షిణాయనం అండి. వర్షాకాలం వస్తే అన్ని వస్తుంటాయండి. ఎండాకాలంలో దోమలు ఉండవు కదా? వర్షాకాలం రాగానే పుట్టి చలికాలం రాగానే పెరుగుతాయి. మళ్ళి ఎండాకాలం వస్తేగాని అవి పోవు. అట్లా అన్ని పెరుగుతూ ఉంటాయి, తరుగుతూ ఉంటాయి. పెంచుతూ ఉంటాడు. తగ్గిస్తూ ఉంటాడు. ఆయన చేసే పనులన్నీ అవే! సినిమా ఉందనుకోండి కధ అలా నడిపించి మనల్ని climax కి తీసుకు వెళ్తాడు. Tragedy or comedy చేస్తాడు కదా? ఆటలోనూ అంతే! ఆటలో మధ్యలో పట్టు వస్తుంది. చివరకు మళ్ళి అయిపోతుంది. ఇట్లా ఏదైనా రావటం, పోవటంగా ఉంటుంది. పగలు - రాత్రిగా ఉంటుంది. ఉత్తరాయణం - దక్షిణాయనముగా ఉంటుంది. పెరగటం - తరగటంగా ఉంటుంది. ఈ పెరగటం తరగటం, ఇవ్వడం పుచ్చుకోవడం అనే భావన స్థిరపడాలంటే 'వృషాకపి' అనే పదం మనం గుర్తు పెట్టుకోవాలి. ఇస్తుంటాడుట ఒక పక్కన మళ్ళి తీసుకుపోతాడుట. ఎట్లా ఇస్తుంటాడంటే కొబ్బరికాయలో నీళ్లు ఎలా వచ్చాయో అట్లా వస్తుంటాయి. ఏనుగు మింగిన వెలక్కాయ లో పదార్థం ఎలా మాయం అయిందో అట్లా మాయం అయిపోతాయి. రెండూ వదిలేయాలి మనం. రావటం తెలీదు, పోవటం తెలీదు మనకి. కానీ వచ్చినప్పుడు సంబర పడుతుంటాం,

పోయినప్పుడు బాధపడుతుంటాం. మన చేతే అన్నీ చేయిస్తాడు మళ్ళీ. కానీ మనకి తెలీదు, చాల intelligent గ తీసుకెళ్ళి డబ్బంతా ఓ నెలలో పడే ఒక share లో పెట్టేస్తాం ఎవ్వరిని ఏమి అనడానికి లేదు. గట్టిగ చెప్పుకోడానికి లేదు. ఎందుకంటే నువ్వు చేసిందే కదా? లేకపోతె సినిమా తీయాలనిపిస్తుంది బాగా గాఢంగా. వాడెవడో సినిమా తీసాడు. వాడికి కోట్లు వచ్చాయి. మనకి తీయాల నిపిస్తుంది. మనకీ కోట్లు వస్తాయి అనిపిస్తుంది. ఎంత గాఢంగా అనిపిస్తుందంటే ఎలా అయినా తీయాలనిపిస్తుంది. పోవాలని ఉంటే వాడికేమి తెలీదు మనకి తెలిసినంత అనుకుంటాం. అసలు మనకే ఏమి తెలీదని ఎప్పుడు తెలుస్తుందంటే అంతా పోయినప్పుడు. ఇది అన్ని విషయాల లోను అంతే. ఆరోగ్యం, సంపద, కుటుంబం, వృత్తి వ్యాపారం, ఆర్థిక విషయాలలోనూ అంతే. వాడు యిచ్చినప్పుడల్లా వాడిచ్చాడనుకొని ఎప్పుడూ బాధ్యతతో నిర్వరిస్తుంటే, దానికేదో ఒక programme ఉండి వెళ్ళిపోతే వెళ్ళిపోయిదనుకోవాలి. అర్జునుడంతటివాడికే అట్లా చేరిన అస్త్రాలన్నీ టప్ మని పోయాయి ఒక రోజు. పని అయిపోయిందిగా! నా అస్త్రాలు అనుకుంటే ఎట్లా? ఒక పవిత్రమైనటువంటి కార్యక్రమంలో కనుక మన జీవితాన్ని భగవత్ సృష్టికి సమర్పణ చేసుకొని సృష్టి లో పుట్టినటువంటి జీవుల కోసం తాపత్రయం పడుతున్నాం అనుకోండి! ప్రకృతి శక్తులన్నీ మన దగ్గరకి వచ్చి చేరతాయి. మనం అనుకుంటే చేరవు. మనం అనుకుంటె పడిపోతాం. చేరితే ఇంకా బాగా వృద్ధి చెందుతూ ఉంటుంది. ఇంకా సత్కార్యాలు జరుగుతూ ఉంటాయి. ఎంతో మందికి ఉపకారాలు జరుగుతాయి. జరుగుతున్న కొలది, చేస్తున్న కొలది ఇంకా శక్తులు చేరుతుంటాయి. పుంఖాను-పుంఖాలుగా శక్తిసామర్థ్యాలు వచ్చి పనులు సానుకూలం చేస్తుంటాయి. ఎందుకంటే పవిత్రత ఉంది కాబట్టి. ఇప్పటికే చాల చేసాను, ఇకపై మరేమి చేయనని అనుకున్నాడు అనుకోండి, ఇంకేమి రాదు సృష్టిలో. ఒకాయన అలాగే. First time నా జీవితం లో చూసాను. College లో Lecturer గ పని చేస్తుంటే, తోటి lecturer కొడుకుకి విపరీతమైన జ్వరంగా ఉంటె, ఏరా నాన్నా నీకు జ్వరంగా ఉందా, అని మాములుగా ముట్టుకున్నాడు. ముట్టుకుంటే వాడి జ్వరం తగ్గిపోయింది. ఆశ్చర్యం వేసింది. ఆ తరువాత ఇంకొకడిని ముట్టుకుంటే వాడికి జ్వరం తగ్గిపోయింది. మనం ముట్టుకుంటే తగ్గుతుంది కామోసు అని తెలుసుకున్నాడు. చాల మందిని ముట్టుకున్నాడు. తగ్గడం మొదలు అయ్యింది. అలా జనం పోగవడము మొదలయ్యింది. ఈయన వాళ్ళకి

జ్వరాలు తగ్గించేవాడు. ఆయన్ని గురువుని చేశారు. ఎవరైనా పడాలంటే ముందు 'గురువు', కావాలి. ఆయనకి చివరికి తన గురించి, తానే శివుడేమో అని doubt వచ్చింది. ఇది నిజంగా జరిగింది. వచ్చాక రకరకాల బాధల్లో పడ్డాడు. తెలివితేటలు మనకంటూ ఉండవు. చుట్టూ ఉండి నడిపిస్తుంటే 'పంగుం లంగయతే గిరిం', అన్నారు కదా ? ఓ కుంటివాడు ఓ కొండ ని high jump చేసి దాటేస్తాడట. ఎప్పుడు? 'వాడి' కరుణ ఉంటే. 'మూకం కరోతి వాచాలం', మూగవాడు మాట్లాడేస్తాడట. ఎప్పుడు? 'వాడు' అనుగ్రహిస్తే! హనుమంతుడు మనకి చాలా శక్తిమంతుడనిపిస్తుంది కదా! కానీ హనుమంతుడు అంతటి వాడు సముద్రాన్ని రాముడు దాటిస్తే దాటాను అంటాడు. రాముడిదే కదా అంత దయా, అంటాడు. మనం అలా ఉండం కదా? ఈయన చూసాడు ఓ రెండు రోజులు మంచి పేరు, ప్రతిష్ఠా, పేపర్ లో పడటం అన్నీ. అసలు Paper లో పడటం అంటే కింద పడిపోవడమే! రకరకాల భావాలు వచ్చాయి. 'ఈ రోజు నించి ఓ ఆరు మంది కంటే చూడను. ఏంటి ఈ nuisance అంతా' అని చెప్పాడు. ఈ సమయం లోనే ఆయన మాష్టరుగారి దగ్గరకు వచ్చి ఇది చెప్పడం జరిగింది. మాస్టరుగారు ఇది నీది కాదుగా. 'ఇవన్నీ నువ్వు సాధించి తెచ్చుకున్నవా, నీ దగ్గరకు వచ్చినవా?' అని అడిగితే, 'లేదండీ, సాధించినవి కాదు. దగ్గరకి వచ్చినవే' అని అన్నాడు. 'అలా అయితే వాటి పని అవి చేసుకోని. నువ్వు వద్దంటే ఇంకా చాల మంది వున్నారు, వాళ్ళ దగ్గరకి వెళ్తాయి. నువ్వు చేసే మంచి ఆగిపోతుందనుకోకు. నీకన్నా బాగా చేసే వాడుంటే వాడి దగ్గరకి వెళ్ళిపోతాయి' అని చెప్పారు. ఒక్కొక్కప్పుడు మనం లేకపోతే పనులు బాగా జరుగుతాయి కదా! ఒక ఆదివారం ఇంట్లో ఉన్నాం అనుకోండి, ఇంట్లో వాళ్లకి రోజు జరిగే పనులు కూడా జరగవు. మాటిమాటికి కాఫీలు అడుగుతుంటాము. మాములుగా ఒకసారి కాఫీ తాగి మన దారిని మనం పోతాము కదా? ఇంట్లో ఉండేసరికి ఇంట్లో వాళ్ళు, కాఫీలు అన్నిసార్లు చేసి ఇచ్చేసరికి ఇటు వంట పనీ చేసుకోలేరు, మిగతా పనులూ చేసుకోలేరు. అంతకంటే వీళ్ళు office కి వెళ్తేనే బాగుంటుందనిపిస్తుంది. So sometimes our absence enables accomplishment of things. విజయవంతంగా కొన్ని పనులు జరగాలంటే మనం లేకపోతేనే అవుతాయి. మనం ఉంటే జరగవు. Things are better done if we do not do అంటారు మాస్టారు. మనం చేయకపోతే ఇంకా బాగా జరుగుతాయి. అట్లాగే 'రోజుకి ఓ ఆరు మందిని కంటే చూడను ఇక. అంత

కన్నా వద్దు అనుకుంటున్నాను. మీ ఉద్దేశ్యం ఏంటి మాస్టారు' అని అడిగాడు. ఉద్దేశ్యం ఏమీ లేదు. అవిక నీతో పని చేయడం మానేస్తాయి' అని చెప్పారు. 'అదేమిటి అలాగా' అంటే 'నీకు వాటి మీద అధికారం లేదు. అవి నిన్ను ఎందుకు ఎంచుకున్నాయంటే నీ స్వభావం బాగుందని. ఇప్పుడు నీ స్వభావం బాగాలేదని, మారిందని నువ్వు చెప్పిందాన్ని బట్టి తెలుస్తోందిగా' అన్నారు మాస్టరుగారు. 'కాబట్టి ఇక ఉండవు.' అలాగే పోయినాయి తర్వాత. అదేమిటి మాస్టారూ అంటే, 'నీకు, నాకు ఆ బ్రహ్మకయినా అంతే! సృష్టి ధర్మం అది. నలుగురు కోసం అనుకున్న వాడి దగ్గరకి అలా అన్ని పోగేసుకు తెస్తుంది ప్రకృతి. నాకోసం అనుకున్నవాడు కిందా మీదా పడ్డా ఎగరలేడట. అదే కర్ణుడు, అర్జునుడు. కర్ణుడికి ఒకటే programme. అర్జునుడ్ని జయించాలని. Individual programme! వ్యక్తిగత కారణమే కదా కర్ణుడిది. మానవ ప్రయత్నంతో అన్నీ సంపాదించాడు అర్జునుడితో సమానంగా, అర్జునుడ్ని జయించడం కోసం. ఏదీ పనికి రాకుండా పోయింది. అర్జునుడో! అడగకుండానే ఇచ్చేసిన వాళ్ళు ఉన్నారు. అప్రయత్నంగా అన్ని వచ్చేస్తుంటాయి. కొందరి కొందరి జీవితాలు చూస్తే అప్రయత్నంగా వాళ్ళ వద్దకి అన్నీ వచ్చేస్తుంటాయి. మనం ఎంత ప్రయత్నించినా అవి మన వద్దకు రావు. వాడి దగ్గర మంచి ఇల్లు, కారు, పిల్లలు, సంపద అన్ని ఉంటాయి. ఎందుకు అలా ఉంటుందీ? వాడు చేసిన కార్యక్రమాలని బట్టి వాడి దగ్గరకి చేరుతుంటాయి. వాడు చేసే కార్యక్రమాలు బాగా లేవనుకోండి, అవే వాడిని హింసిస్తాయి. శక్తులు వాడుకని బట్టి ఉపయోగపడటం, సరిగ్గా వాడకపోతె అవే వాడిని మింగెయ్యడం జరుగుతుంది. కాబట్టి ఈ పుచ్చుకున్నాయనకి కోర్టులు, లావాదేవీలు, ఆ కాగితాలు మిగిలిపోయినాయి. ఆ శక్తులు వెళ్ళిపోయినాయి. ఎందుకు వెళ్లిపోయినాయంటే, ఇవి ఇచ్చినవని గుర్తులేదు కాబట్టి. ఏవైనా సరే మనకి అన్నీ ఇవ్వబడినవి అని గుర్తు ఉండాలి. విద్య మనకి ఇవ్వబడినదని గుర్తుండాలి. ఈ దేహం మనకి ఇవ్వబడినది, సంపద మనకి ఇవ్వబడినది అని గుర్తుండాలి. భార్య మనకి భగవంతునిచే అప్పగించబడినదని గుర్తు ఉండాలి. మన చుట్టూ మన మీద ఆధారపడేవాళ్ళందరినీ మనకి భగవంతుడు అప్పచెప్పినవాళ్ళు సుమా, అని గుర్తు ఉండాలి తప్ప, వాళ్ళ చేత మన పనులు ఎట్లా చేయించుకోవాలా అనుకుంటే దెబ్బతింటాం. మన మీద ఆధార పడే వాళ్ళని మనం ఎక్కువ వినియోగించుకుంటున్నామనుకో, దెబ్బతింటాం. మన దగ్గర పనిచేసే గుమాస్తాని

'ఓ పనసకాయ పట్టుకు రావయ్యా పెద్దది సింహాచలం వెళ్లి,'' అని చెప్పామనుకో, అతను దారి ఖర్చులు ఓ 50/- రూపాయలు. పనసకాయ ఓ 50/- రూ. పెట్టి మనకి తెస్తాడు. ఆ డబ్బు విలువ మనకి, అతనికి చాలా తేడా ఉంటుంది. వంద నీకు, వంద అతనికి లెఖ్ఖ వేస్తే అతడి వంద నీ వేయి తో సమానం. అది మర్చిపోకూడదు. మనం మర్చిపోతుంటాం. మనం Free గా వస్తే మరి సవారీ చేసేస్తాం. అది కుదరదు ఇక్కడ. ఎందుకు కుదరదంటే? It is an entrustment. ధర్మకర్తలకి అప్పచెప్పిన దేవాలయం. దాన్ని ధర్మంగా నిర్వర్తించాలి. అట్లాగే మన దేహం ఒక దేవాలయం. ఏది అకస్మాత్ గా జరగదు. కార్యకారణ సంబంధం వల్లనే ఇంత మంది కలవటం ఉంటుంది. కాబట్టి మన దగ్గరకి వచ్చే వాళ్ళతో మనం ప్రవర్తించేప్పుడు ఇతన్ని భగవంతుడు మనవద్దకు పంపించాడని గుర్తు ఉంచుకుంటే తీరు బాగుంటుంది. సంగం ఉండదు. మనకి గుర్తు లేదనుకోండి, ఒక్కోసారి ఎక్కువ అతుక్కుపోతుంటాం. ఒక్కోసారి తక్కువ చేసి పోట్లాడుతుంటాం. ఒకటి రాగం, ఒకటి ద్వేషం. ఇవన్నీ జరుగుతుంటే మనకి ఒకటే గుర్తు ఉండాలి. మన చుట్టూ ఉండే వాళ్ళు కూడా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళాలి కదా? వచ్చే వాళ్ళు అందరు వెళ్తారు. వచ్చేదంతా వెళ్తుంది. మనకి కూడా వచ్చినవన్నీ, దేహం దగ్గర నుండి అన్నీ వెళ్ళిపోతాయని గుర్తు పెట్టుకోవాలి. ఇది 'వృషాకపి'. సృష్టి లో చూస్తే కంటి ముందు నుండి పోయేవాటికి ఒక Periodicity ఉంటుందని తెలుస్తుంది. ఏదైనా అంతే. దాని కాల పరిమితి ఉంటుంది. ఆ కాల పరిమితిలో అది అలా దగ్గర అవుతుంటుంది, మళ్ళీ దూరమవుతుంటుంది. ఈ వచ్చే పోయే వాటిలో ఇరుక్కోకుండా ఉండాలంటే ఇచ్చి-పుచ్చుకొనే వాడి గురించి గుర్తు పెట్టుకోవాలి. వాడు మనకి ఇచ్చేటప్పుడు బాగా చాటంత మొహం ఉంటుంది. పుచ్చుకొనేప్పుడు బాధ పడుతూ ఉంటాం. రావడం ఎంత సహజంగా ఉంటుందో పోవడం కూడా అంతే సహజం సుమ! అని, గుర్తు చేయడానికి ఈ 'వృషాకపి' అన్న పదాన్ని ఇచ్చారు. ఆయన Showerer and Absorber. కురిపిస్తాడట అనుగ్రహం. మళ్ళి పట్టుకుపోతూ ఉంటాడుట. కాలం ఒక్కోసారి అలా తీసుకొస్తుంది. మళ్ళా తీసుకుపోతుంది. అర్జునుడు అంతటి వాడికి అట్లా అయిపోయింది కదా? సృష్టినెరిగిన వాడు కాబట్టి వెళ్లిపోయే time కి ready అయిపోయాడు. అన్ని వెళ్లిపోతాయి. అంటే ఏంటి? The awareness that all that comes will also go away has to be remembered. In between మనకి దానితో

interaction ఒకటే మిగిలేది. అనుభూతి! ఆ అనుభూతి ఇస్తాడు. మనం రసవత్తరంగా చేసుకోవచ్చు, లేక మరోలా చేసుకోవచ్చు. సరసం అవచ్చు. విరసం అవచ్చు. దాన్నే ఓ రైలుపెట్టె లో ప్రయాణం చేసినట్టుగా చెప్తారు. మనం train లో కూర్చొని మాటలతో బాగా పరిచయం పెంచుకుంటాం కదా. ఒకరి address ఒకరం పుచ్చుకుంటాం. వాడి card వీడికి ఇస్తాడు. వీడి card వాడికి ఇస్తాడు. మా ఇంటికి తప్పకుండ రావాలంటాడు. అలా ఈ రైలు పెట్టెలో చేరి ఎట్లా విడిపోతామో, అలా కలుస్తుంటాం, తిరిగి విడిపోతాం, మళ్ళీ ఎప్పుడు కలుస్తామో, ఎవరిని కలుస్తామో, ఎప్పుడు విడిపోతామో ఎవరికి ఏమి తెలీదు కదా, అంటాడు కృష్ణుడు. మేఘాలు ఎట్లా కలుసుకుంటున్నాయి, ఎట్లా విడిపోతున్నాయి, ఎక్కడకి వెళ్లిపోతున్నాయి? వాటికి ఏమైనా programme ఉందా?

"వాయువసంబులై యెగసి, వారి ధరంబులు మింటన్ గూడుచుం పాయుచు నుండు",

కలుస్తూ ఉంటాయి, విడిపోతూ ఉంటాయిట. అట్లా కాలం నడిపిస్తుంటుంది. ఎప్పుడు కలిసి ఉంటామో, ఎప్పుడు విడిపోతామో, మనం ఏమి చెప్పలేము కదా? ఉన్నప్పుడు హాయిగా ఉండండి అన్నారు. పెట్టెలో ఉన్నంత వరకు హాయిగా ఉండవచ్చు కదా. ఇక్కడ నుండి మద్రాస్ వరకు వెళ్ళక తప్పదు. నా మొహం వాడు చూడాలి, వాడి మొహం నేను చూడాలి. మధ్యలో దిగడానికి వీల్లేదు. అప్పటి వరకు కలిసి ప్రయాణం చేయవలసినదేగా! ఇప్పుడు train వచ్చింది. ఎక్కాము. Train ఏమో Coromandel. ఎందాకండి? అంటాము. మరి మీరండీ అంటే Madras అంటాం. ఇహ అక్కడ నుండి వాడి మాటలు, వాడ్ని మనం భరించాలి. భరించాలన్న భావన పెట్టుకున్నామనుకోండి ప్రయాణం అంతా భయంకరంగా ఉంటుంది. ఒకళ్ళతో ఒకరు కాస్త స్నేహంగా ఉంటే! అదే ఆడవాళ్ళు అనుకోండి Madras ఎప్పుడు చేరామో తెలియకుండా చేరిపోతాము. అన్ని మాటలు ఉంటాయి వాళ్ళకి. అట్లా కలసి ప్రయాణం చేయడంలో ప్రయాణం బడలిక మరచిపోయి, ప్రయాణంలో ఉండేటటువంటి అనుభూతి పొందాము అనుకోండి. అరే! అప్పుడే వచ్చేసిందా Madras అనిపిస్తుంది. కదా? అటు వాడి మొహం చూడ్డం మనకి ఇష్టం లేక, మన మొహం చూడ్డం వాడికి ఇష్టం లేక ఉంటె? వీడు ఇటు తిరిగి, వాడు అటు తిరిగి పడుకోవాలి కళ్ళు మూసుకొని. అస్సలు నిద్ర పట్టదు. తిరగంగానే వీడు కనిపిస్తాడు. కనిపించగానే విసుగు

పుడుతుంది. Discomfort ఉంటుంది. అట్లా కూడా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణం అన్నది సుఖవంతం చేసుకోడం తప్ప, దిగిపోడం ఇద్దరికీ తప్పదు. ఎంతబాగా ఈ ఇద్దరూ అల్లేసుకున్నా మద్రాసు రాగానే దిగిపోవాలి కదా! ఇంకొకడు నిద్రే పోతాడనుకొండి వాడూ మద్రాసు చేరిపోతాడు. ఒక గురువుగారిని ఓ శిష్యుడు 'ఈ ప్రయాణం లో అందరూ భగవంతుడిని చేరుకుంటారు కదండీ? మీరు చెప్పినవన్నీ చేయకపోతే ఏమిటిటా' అని అడుగుతాడు. Very genuine question కదా! ఆ ప్రశ్న ఆ శిష్యుడికి అంతరాంతరాలలోంచి వస్తుంది. అందరూ ప్రయాణము చేసి అందరూ చేరతారన్నప్పుడు ఇవన్నీ చేయడం ఎందుకు? చేయకపోయినా చేరుకుంటాం కదా అని అడిగాడు. 'చేరుకుంటారు' అన్నారు గురువుగారు. తెలిసిన గురువులు కొందరు ఉండిపోతారని, కొందరు చేరిపోతారని చెప్పరు. ఎందుకు నేనివన్నీ చేయాలి అంటే అప్పుడు ఆ గురువు గారు చెప్తారు. నువ్వు ఇక్కడ నించి ఓ మూడు రోజులు ప్రయాణం చేస్తున్నావనుకో. ప్రయాణం లో నిద్ర పోయావనుకో. అక్కడకి చేరుకుంటావు. కానీ ప్రయాణం లో ఉండే అనుభూతి నీకు లేదు కదా? ఈ మూడు రోజులు ప్రయాణం లో కాళ్ళుచేతులు విరిగినట్లుగా కొట్టుకు చచ్చేరనుకో, ఆ రకమైన అనుభూతితో చివరకు చేరుకోవడం ఒక పద్ధతి. ఈ మూడు రోజులు ఒకరినొకరు ప్రేమగా, సహనంగా పలకరించుకుంటూ, ఆదరించుకుంటూ హాయిగా ఆనందంగా ఉంటే ఆ అనుభూతి వేరు. ఇది ప్రయాణమని కూడా అనిపించదు. అదే భగవంతుడు అంటే. భగవంతుడు అంటే రసానుభూతే కదా' అని చెప్తారు. మళ్ళి వాడిలో నుండే వస్తాము. మళ్ళి వాడి లోకే వెళ్ళిపోతాము. మళ్ళీ కలసినా వాడే వీడని గుర్తుండదు. కాని ఉన్నప్పుడు ప్రేమ, ఆదరము, సన్నిహితత్వం అనుభూతినిస్తాయి తప్ప మరేవి అనుభూతిని ఇవ్వవు. కాబట్టి ప్రయాణం లో ఎటువంటి అనుభూతి చెందాలన్నది choice నీదే! కానీ ప్రయాణం తప్పదు. వీళ్లంతా కూడా నాలో వచ్చేస్తున్నారు అంటాడు గీతలో. దుర్యోధనుడు, శకుని also included. ఉన్నప్పుడు ఎట్లా ఉండాలని ఉదాహరణగ మనకో కథ చెప్తారు. ఇద్దరు అన్నదమ్ములు, కవలపిల్లలు ఉంటారు. ఒకడేమో ఎప్పుడు శివాలయం లో ఉంటాడు. రెండో వాడు ఓ వేశ్య గృహంలో ఉంటాడు. ఈ శివాలయంలో ఉన్నవాడు కూర్చొని అక్కడ వేశ్య గృహంలో ఉన్నవాడి గురించి, తమ్ముడు బాగా హాయిగ ఉన్నాడు కదా అని ఆలోచిస్తూ ఉంటాడు. ఈ వేశ్య

గృహంలో ఉన్నవాడెప్పుడు నేనిక్కడ ఉండిపోయాను శివాలయం లో ఉన్న అన్న ఎంత అనుభూతి పొందుతున్నాడో అని అనుకుంటాడు. ఈ వేశ్య ఇంట్లో ఉండి శివ సాన్నిధ్యం వీడు పొందుతూ ఉంటాడు. శివాలయం లో ఉండీ వేశ్యసాన్నిధ్యం వాడు పొందుతూ ఉంటాడు. అంతా అయిపోయిన తరువాత ఇద్దరూ ఒకే సారి వెళ్ళిపోతారు. వెళ్ళిపోతే శివ భటులు వస్తారు. ఒకడిని తీసుకు వెళ్లడం కోసం. ఎవరిని? వేశ్య ఇంట్లో ఉన్న వాడిని తీసుకు వెళ్లడం కోసం. శివాలయం లో జీవితమంతా గడిపిన వాడి కోసం యమకింకరులు వస్తే, కవల పిల్లలు కదా ఏమైనా పొరపాటు పడుతున్నారేమో అనుకుంటారు. పొరపాటు ఏమి లేదు. మొత్తం జీవితమంతా మానసికంగా శివాలయంలో గడిపినది వీడు. వేశ్య ఇంట్లో గడిపింది వాడు అంటారు. దాని బట్టి result ఉంటుంది. జీవితంలో ఇక్కడ ఉన్నప్పుడు పొందేటటువంటి అనుభూతి ఒక్కటే సత్యం. కలసిపోయిన తరువాత అనుభూతి ఏమి లేదు. ఏంటో ఈ మధ్య ప్రతివాడికీ అదో fashion అయిపోయింది 'మోక్షం మోక్షం' అని. ఏమీ తెలీదు. మోక్షం అంటే భగవంతుడితో కలిసిపోవడం అని. Cinema లో అట్లాగే చూపిస్తాడు. అలా వెళ్లి భగవంతుడితో కలిసిపోయినట్లు. కలసిపోయినప్పుడు ఇంకే అనుభూతి ఉండదు. అనుభూతి ఎప్పుడయ్యా అంటే తను ఉంటూ, భగవంతుని దర్శిస్తూ ఉంటె ఉంటుంది. కలిసిపోతే ఏముంటుంది? ప్రయాణంలో ఉంటే మిగిలేది అనుభూతి. ప్రయాణం తరువాత అంతా ఒక్కటే. ప్రయాణం లో ఉండాలి అనుభూతి. ఈ రావటం పోవటం కాల పరిమితి ప్రకారం ఉంటాయి కాబట్టి, వచ్చే పోయే వాటిలో దేనియందు, ఎటువంటి విరక్తి రాకుండా ఉండాలి. వైరాగ్యం అంటే అదే కదా! వైరాగ్యం పేర్న అన్నిటిని అశ్రద్ధ చేస్తుంటారు. అన్నిటిలోను భగవంతుడిని చూస్తూ ఉంటేనే అనుభూతి ఎక్కువ వస్తుంది. అన్ని కాదనుకుంటే, ఎక్కడో ఒక మూల ముడుచుకు అట్లా కూర్చోవలసి వస్తుంది. అన్నిటిలో భగవంతుడిని అనుభూతి పొందుతూ ప్రయాణం చేస్తుంటె మనకు అవగతం అవుతుంది. అదీ ఈ నామము. ఇస్తాడు. పుచ్చుకుంటాడు. ఏమి మొహమాటంలేదు. రెండూ ఉన్నాయి అని గుర్తుపెట్టుకోవాలి. ఈ ఇచ్చిపుచ్చుకోడాలలో మనకి ఇచ్చే భగవంతుడు తప్ప. పుచ్చుకొనే భగవంతుడు వద్దనిపిస్తుంది కదా? కానీ రెండు రూపాలలో వాడే ఉన్నాడు. వాడు ఎంత కాదన్న పట్టుకెళ్లిపోతుంటాడు. రావడమూ అంతే. అలా రావడం పోవడం ఎప్పుడూ ఉంటాయి అని తెలుసుకోవడమే 'వృషాకపి' అన్న నామం.

## 108 అమేయాత్మా

అంటే కొలవలేనటువంటి ఆత్మను వాహికగా జీవులు పొంది ఉంటారు. ఆత్మకి ఆ తరువాత విలువ ఉన్నప్పటికీ కూడా, అది ఆధారంగా మిగతావన్నీ మనం కొలతలు చేసినప్పుడు దానిని కొలవడం అనేది వీలుపడే విషయము కాదు. మనం కొలతలు వేసుకున్నాము అనుకోండి, కొలతలు వేసేవాడిని కొలిచేవాడెవడు? మనం ఒక scale బద్దని తయారు చేసుకొని దాని మీద 12 అంగుళాలు పెట్టుకొని దానితో కొలుచుకున్నాము అనుకోండి. మనము కొలుస్తున్నాం. మనని scale కొలవగలదా? మనలో నుండి పుట్టుకొచ్చిన కొలత కదా అది. 'నేను' అనే తత్వం నుండి పుట్టుకొచ్చిన కొలత ఏదైతే ఉందో, అది దేనిలో నుండి పుట్టిందో దాన్ని
అది కొలవలేదు కాబట్టి అలా అన్నింటికీ ఆధారభూతము, అన్నింటికీ పుట్టుక స్థానము అయినటువంటి ఆత్మతత్వాన్ని మనం వాహికలుగా పొంది ఉన్నప్పటికీ, ఈ వాహికలు ఆ తత్వాన్ని కొలవలేవు. ఎట్లా ఉంటుందంటే చోటుని కొలిచినట్లుగా ఉంటుంది. చోటుని కొలిచే ప్రశ్నే లేదు. చోటులో మనం ఇల్లు కట్టుకున్నాము అనుకోండి, ఇంట్లో చోటుని కొలవచ్చు. ఇంట్లో చోటు కన్నా ముందు బయట చోటు ఉన్నది. బయట చోటుకి కొలతలు లేవు. ఎందుకంటే ఆ చోటులోనే గ్రహగోళాదులు ఉన్నాయి కదా? గ్రహములని కొలవ వచ్చు. గ్రహముల గోళాన్నీ, వాటి చుట్టూ కొలతలని కొలవవచ్చు. వాటి బరువునీ కొలవవచ్చు. ఇవన్నీ చేస్తున్నాము. కానీ గ్రహములు ఎందులో పుడుతున్నాయో ఆ చోటుని కొలవలేము. కొలవలేనటువంటి తత్వముగలవాడి నుండి కొలతలన్నీ దిగి వస్తాయి. 'భగవంతుడు కొలతలకు అతీతుడు', అని చెప్పడానికి ఈ నామం ఇవ్వబడింది.

# 109 సర్వయోగవినిసృతః

ఈ సృష్టిని ఇన్ని లోకాలుగా ఏర్పరిచి, ఇన్ని లోకాలలోనూ ఇన్ని జీవులు ఏ విధంగా అభివృద్ధి చెందుతారో అటువంటి కార్యక్రమాన్ని, సృష్టి పరిణామానికి అన్ని లోకాలలోను భగవంతుడు ఆధారంగా జరుగుతున్నటువంటి పరిణామం అంతా కూడా 'సర్వయోగ విని సృతః' అనే దానికి అర్ధం. చాల లోకాలు వున్నాయి కదా! 14 లోకాలు చెప్పిన వాళ్లు వున్నారు. 7 లోకాలు చెప్పిన వాళ్లు వున్నారు. 3 లోకాలని చెప్పేవాళ్ళు వున్నారు. 49 లోకాలు చెప్పే వాళ్లు వున్నారు. మీకెందుకు, ఎన్ని లోకాలు అంటే అన్ని లోకాలు ఉన్నాయి, అని చెప్పేవాళ్ళు ఉన్నారు. ఈ అన్ని లోకాలలోను అన్ని జీవులు భగవంతుడితోటి పొందే అనుభూతి, దానికి సంబంధించి అభివృద్ధి, ఆ కార్యక్రమము అంతా ఎలా నడుస్తుంది అనేది 'సర్వయోగ వినిః సృతః' నామం. అన్ని యోగములు చక్కగా తీర్చబడుతున్నాయి. అట్లా సర్వకాల సర్వావస్థలయందు భగవంతుడితో అనుభూతి పొందే ప్రవర్తనము మనం అలవరచుకోవాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎట్టి పరిస్థితులలోను భగవంతుని అనుభూతి పొందగలగాలి. ఎవరో వస్తారు కదాని ఎదురు చూసే మనస్తత్వం కాకుండా, వారు వచ్చేలోపల భగవంతుడి యందు ఉండవచ్చు. మిగతావన్నీ చేస్తున్నాం కాబట్టి, భగవంతుడి యందుండడం అనేది గుర్తుతెచ్చుకుంటే ఎక్కువగా భగవంతుడి వద్ద ఉండడానికి వీలవుతుంది. సముద్రంలో అలలులాగ మనం సముద్రంని విడిచి అల అస్థిత్వం ఎట్లా కలిగి ఉండదో, అదే విధంగ మనయొక్క జీవ ప్రజ్ఞలు అన్ని కూడా దైవప్రజ్ఞలో భాగంగా ఉన్నప్పటికీ, మరుపు కారణంగ ఆ తత్వానికి దూరంగా మనం వేర్పాటు చెంది ఉంటాం. ఆ వేర్పాటు లేకుండా ఉండాలంటే, ఎందులో ఉన్నా సరే అందులోనే ఉన్నటువంటి భావన ఒకటి ఎప్పుడు మన యందు స్థిర పరుచుకు ఉండాలి. అటువంటి ప్రయత్నం ఎంత ఎక్కువగా, సామూహికంగా చేస్తూ ఉంటె అంత త్వరగా మన యందు ఒక అలవాటుగా స్థిరపడుతుంది. ఏదైనా అలవాటు అయితే కానీ స్థిరపడదు. అభ్యాసం వలన అది మన యందు అలవాటుగా స్థిర పడాలి. పొద్దున్నే లేవంగానే coffee ఏ విధంగా గుర్తుకు వస్తుందీ? మనం గుర్తుతెచ్చుకో అక్కర్లేదు కదా coffee గురించి. అదే వచ్చేస్తుంది. అదే విధంగా భగవంతుడు కూడా అప్రయత్నంగా గుర్తు

ఉండే పద్ధతిలో మనం తయారుకావాలంటే అనుస్యూతమూ గుర్తు తెచ్చుకొనే ఒక అభ్యాసం చేసుకోవాలి. మనం ఏ కార్యక్రమం లో ఉన్నప్పటికీ ఆ విధమైనటువంటి గుర్తు తెచ్చుకుంటే, మన అన్ని కార్యక్రమాలు కూడా భగవంతుడు యందు ఉండే చేస్తూ ఉంటాం. అలా కాకుండా కాసేపు భగవంతుడు యందు ఉండడం, కాసేపు మన మనస్సు అనేటటువంటి వేరే గుహ యందు ఉండడం కాదు. ఆ గుహలో అభిప్రాయాలు అనేటటువంటి పురుగులు ఉంటాయి. ఆ గుహలో జీవించకుండా ఉండటానికి ఒక సదుపాయం ఉంది. ఏంటంటే ఆయన యందే మనం ఉన్నాం, ఆయన యందే తిరుగుతున్నాం, ఆయన యందే జీవించి ఉన్నాము అని గుర్తుంచుకోవడం. 'నాలోనే మీరంతా ఉన్నారు. నేను ఈ సర్వ జీవరాసుల యందు ఉన్నాను. నాయందే సర్వ జీవరాసులు ఉన్నాయి.' అని శ్రీకృష్ణుడు చెప్పినటువంటి జ్ఞానవాక్యం ఏదైతే ఉందో, అది జీవితం లో సత్యం చేసుకుంటూ ఉంటే, ఎటువంటి కార్యక్రంమంలో ఉన్నా సరే మనం భగవంతుడి యందు ఉన్నాము అనేటటువంటిది సత్యం. కేవలం మరుపు వలన మనం దాన్ని వెతుక్కోవడం జరుగుతుంది. మనకి వెతుక్కోనేటువంటి జీవితాలు వద్దు. ఎదురు చూసే జీవితాలు వద్దు. దేనికోసం ఎదురు చూస్తున్నామో అది మనమే! మనకి ప్రత్యేకంగా ఈ ఆధ్యాత్మిక సాధనలో ఉన్నటువంటి 'తలక్రిందులు' లేక ఒక inversion, లేక ఒక trick, ఒక మభ్య పడుట. లేక ఒక భ్రాంతి పడుట ఏమిటంటే ఎవరికోసం వెతుకుతున్నామో అది మనమే! అది మనమే అవటం వల్ల, వెతకడంలో మన గురించి మనమే బయట వెతికితే మనకి మనం ఎట్లా కనపడమో. ఆత్మవస్తువు అని చెపుతూ ఉంటారు, లేక పరమాత్మా అంటారు, లేక పరబ్రహ్మతత్త్వం అంటారు, లేక నారాయణతత్త్వం అంటారు. పేర్లు పెట్టి బయట వెతుకుతుంటే కనపడదు. ఎందుకంటే మన గురించి మనం బయట వెతుకుతున్నాం కాబట్టి. మన యందు ఉన్నదే చోటులో ఉన్నది, చోటులో ఉన్నదే మనయందు ఉన్నది. మనమే అది అని తెలుసుకొని ఉన్నట్లయితే, ఆ గుర్తు ఉండడమే మనకి సహజముగా మనయొక్క చైతన్య స్థితిలో మనం ఉండటానికి వీలు పడుతుంది. ఈ సహజ స్థితి నించి అసహజ స్థితికి ఎందుకు వస్తామంటే మన మనస్సు, మనస్సుకి సంబంధించిన అభిప్రాయాలూ, బహిర్గత లోకములో ఉన్నటువంటి సన్నివేశములు, వాతావరణములు, ఈ కారణంగా మనం అవస్థితి చెందుతూ ఉంటాము. అంటే ఉన్న స్థితి నుండి జారి పడిపోడాన్ని 'అవస్థితి' అంటారు. సహజముగా చైతన్య

స్వరూపులమైనప్పటికీ, అభిప్రాయాల రూపాలలోకి మనం దిగి వచ్చినప్పుడు సంకరణం జరుగుతుంది. అప్పుడు చేసేది సంసారం. సంకరణం అంటే జారి పడడము. జారి పడిపోయినది మాటిమాటికి ఎగలాక్కోడమే! ఈ ఎగలాక్కోడం అనేది గురువు చేస్తాడు. అది గుర్తు చేసేవాడే 'గురువు'. మనలో మనకి గుర్తు చేస్తూ ఉంటాడు. మరి మనం, మనలో మనం గుర్తుచేసుకోనటువంటి పరిస్థితిలో ఉంటే బయట నుండి వచ్చి, ఇంకో ఆకారం లో మళ్ళి మనకి గుర్తు చేస్తుంటాడు. గుర్తు చేసీ 'నీలో నీవే నేనుగా' ఉండేటటువంటి స్థితిని మరోసారి మనకి అంది స్తుంటాడు. భగవంతుడి యందు ఎప్పుడు ఉండేటటువంటి భాగముగానే ఈ కార్యక్రమాలని మనం నిర్వర్తించుతుంటాం. ఈ కార్యక్రమాలు నిర్వర్తించినప్పుడు మాత్రమే గుర్తు ఉండి, తదుపరి గుర్తు ఉండక, ఉందనుకోండి, అంటే సాధన లేదని అర్థం. సాధన ఉంటె గుర్తు ఉండకపోడము ఉండదు. ఏదైనా సరే, సాధన చేత సిద్ధి కలుగుతుంది. కాబట్టి, మనకి గుర్తు లేదంటే, సాధన లేదని తెలియాలి. 'ఏంటండీ, ఎన్నాళ్ళు సాధన చేసిన గుర్తు ఉండడం లేదు', అంటే , 'నీ ప్రశ్నలోనే సమాధానం ఉంది', అనేవారు మాస్టరుగారు. ఆయన చెప్పినట్లుగా సాధన లేదని అర్థం. సాధన చేయడం అనేది, సిద్ధి కలిగేది అని రెండు వేరుగా ఉండవు. సాధన కొలది సిద్ధి కలుగుతుంది. ఉడక పెడుతుంటే అన్నం ఉడుకుతుంటుంది. ఉడకపెట్టకపోతే అది ఉడికే ప్రశ్నే లేదు. ఆ పద్ధతిలోనే ఈ గుర్తు తెచుకొనేటటువంటి కార్యక్రమాలు అన్ని కూడా జరగాలి. ధ్యానంచేయండి, పూజలు, వ్రతాలూ చేయండి, దానాలు చేయండి, ఎన్నైనా చేయండి, ఇవన్నీ చేయటం వలన, మనకి నిత్య జీవితంలో జరిగేటటువంటి ఇతరములు అని మనం అనుకొనే కార్యక్రమాలలో కూడా ఆయన యందు మనం ఉండడమనేది స్థిర పడినప్పుడు మాత్రమే అది సత్యం తప్ప అది లేకుండా ఏమి చేసినా సత్యం కాదు. అది భేషజం. ఏవో చేస్తుంటాం, కాస్సేపు ఆనందిస్తుంటాం, కాస్సేపు క్రింద పడుతుంటాం. కాస్సేపు మీద పడుతుంటాం. కాస్సేపే ఉంటుంది ఆనందం. దాని కోసం చేసేది ఎక్కువ. ముఖ్యంగ విచారాలు, వికారాలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకుంటాయంటే? ఎప్పుడూ 'ఆయన' యందుండకపోవడం వలన. ఉండటం అలవాటైనవారికి, ఇవే పూజలు, ఇవే దానాలు, ఇవే హోమాలు, ఇవే కార్యక్రమాలు వేరే అనుభూతుని ఇస్తాయి. ఒక సిద్ధి పొందినవాడు ఒక పూజ చేయటం, ఒక సాధన చేస్తున్నవాడు ఒక పూజ చేయటంలో చాల తేడా ఉంటుంది.

సిద్ధి పొందినవాడు పూజ చేయడంలో ఉద్దేశం ఏంటంటే, అదొకరకమైన ముచ్చట. సాధనలో ఉన్నవాడికి పూజ చేయడంలో ఉద్దేశం ఏంటంటే తనయొక్క శరీరము, మనసు, ఇంద్రియములు పవిత్రీకరించుకోడానికి కార్యక్రమము. ఎందుకంటే రోజు అడ్డుపడుతుంటాయి. ఒకసారి చేస్తే ఒకసారి చేయము. అనుకున్నది అనుకున్నట్టుగా చేయము. అంతరాయాలు ఎక్కువ. దానికి కారణాలు బయట వెతుకుతుంటాము. ఇట్లా కదా మన సాధన జరుగుతుంది? సిద్ధి పొందినవారిలో కార్యక్రమాలు అప్రయత్నముగా జరిగి పోతుంటాయి. మనం ప్రయత్నించి సాధనలో ఉండాలి, సిద్ధి పొందిన వానియందు అవే కార్యక్రమాలు అప్రయత్నంగా జరిగిపోతాయి. ఎంత కూడతీసుకుంటే మనకు పనులు అవుతాయి? అది సాధకుని స్థితి. అప్రయత్నముగ కొంత మందికి అయిపోతాయి. కర్తవ్యాలు కూడా అప్రయత్నముగా నెరవేరే సహజ స్థితి నిజానికి మనది. ఆ సహజ స్థితిలో మనం ఎప్పుడు ఉండగలం అంటే 'అన్ని అవస్థలయందు, అన్ని కాలముల యందు' అని అన్నారు. అంటే మనం ఎటువంటి దైనందిన కార్యక్రమాలు చేస్తున్నా, 'వానియందే' జరుగుతున్నది ఇదంతా అని గుర్తు ఉంచుకొని సాధన చేసుకుంటే అవుతుంది. "సర్వయోగవినిసృతః" అంటే యోగము చెంది ఉంటాడు. మొత్తము సృష్టిలో ఉన్న అన్ని లోకముల యందు తాను యోగము చెంది ఉంటాడు కాబట్టి ఈ లోకాలన్నీ నిలబడి ఉన్నాయి. లేకపోతె నిలబడవు. మనలో 'నేను' అనే చైతన్యము ఈ దేహాన్ని వదిలి వెళ్ళిపోతే, ఈ దేహములో ఉన్నటువంటివి వేటికవి వెళ్ళిపోతాయి. మట్టి: మట్టిలోకి. నీరు: నీరులోకి. వాయువు; వాయువులోకి, అగ్ని; అగ్నిలోకి. అలా పంచ భూతాలు వీడి వెళ్లిపోతాయి. 'తాను లేక నేను' అనేటటువంటి ప్రజ్ఞ మన యందు ఉండటం వల్ల ఇవన్నీ కూడగట్టుకొని ఉన్నాయి. కూడగట్టుకొని ఉండటం అనేటటువంటిది కేవలం చైతన్యం యొక్క అస్థిత్వం వల్లనే జరుగుతున్నది కాబట్టి, ఇన్ని లోకములను సృష్టించిన భగవంతుడు ఎవరైతే ఉన్నాడో, ఎవని యందు ఇవన్నీ యోగం చెంది ఉన్నాయో, వాటిని ఆయన యొక్క అస్థిత్వమును నిలిపి ఉన్నాడు అనేటటువంటి భావము ఈ నామములో వెలువడింది. ఇన్ని లోకాలు ఏర్పడినప్పటికీ కూడా చోటులో రకరకాల సూర్య మండలములు, అందులో గోళములు ఉన్నాయి. ఒక గోళానికీ మరో గోళానికీ మధ్య పట్టి ఉంచడానికి మనకేమి కనిపించదు, కానీ పట్టి ఉంచబడ్డాయిగా గ్రహాలన్నీ కూడా ఆకాశంలో భూగోళం తో సహా! అన్ని గ్రహములు సూర్యుడూ మొదలైన గ్రహాలు ఏ బలం చేత నిలిచి ఉన్నారు అని మనం

ఎప్పుడైనా ఆలోచించామా ? భూమి ఉన్నది. అది ఏ బలం చేత ఆ చోటులో అట్లా నిలబడి తనంతట తాను తిరుగుతున్నది? ఇక్కడ ఒక బంతి పెట్టి పైకి వదిలేస్తే, అలా తిరుగుతోందనుకోండి అది magic కాదూ? అది Miracle కాదూ? మరి ఆ miracle జరుగుతూ ఉంది సృష్టి మొదలైనప్పటి నించి కూడా. గ్రహములను వాటి చోట్లలో అట్లా బంతిని నిలబెట్టినట్లుగా నిలబెట్టడమే కాకుండా, ఎప్పటికి ఒక పద్ధతిలో తిరగడం, దానికి ఒక కాల పరిమితి ఉండడము వాటి మీద జీవులు ఉద్భవించి రకరకములైన కార్యక్రమాలు నిర్వర్తించుకోడం, ఇవన్నీ ఏ బలం చేత జరుగుతోంది? ఏ బలాన్నిబట్టి ఈ భూమి చుట్టూ ఉన్నటువంటి నీరు జారిపోకుండా ఆకర్షణశక్తి వలన ఎలా నిలబడి ఉన్నది? ఇవన్నీ మనం ఆలోచించినట్లయితే భగవంతుడు యొక్క యోగ స్థితి, అంటే సర్వ లోకములయందు తన యోగబలం తో ఏ విధంగా నిలబెట్టి ఉంచాడు ఈ సృష్టిని అని గనక మనం ధ్యానం చేసినట్లైతే , సర్వయోగ విని సృతః'అనే నామానికి అర్ధం తెలుస్తుంది.

# 110,111,112,113- వసుః, వసుమనాః, సత్యః, సమాత్మా

( ఈ నామాలకు వివరణ సేకరించె ప్రయత్నం జరుగుతున్నది)

# 114,115 - సమ్మితః, సమః

( ఈ నామాలకు వివరణ్ సెకరించె ప్రయత్నం జరుగుతోంది)

## 116,(162)- అమోఘః

అంటే సృష్టిలో జరిగే కార్యక్రమాల్లో భగవంతుని యొక్క అస్తిత్వమునందు పొరపాట్లు వుండకపోవడమనే ఒక స్థితి. ఒక తత్త్వం. భగవంతుని యొక్క పనులలో మనకి అవగాహన లేదు కానీ తప్పు వుండదు. మహాత్ములు చేసిన కార్యక్రమాల్లో కూడా మనకి అవగాహన వుండకపోవచ్చునుగాని తప్పులుండవు. మనకి అవగాహనలేక తప్పు చేశాడేమో అని మనం అనుకుంటూ వుంటాము. మనకి మామూలుగా ఇతరులను నిర్ణయం చేసే బుద్ధి ఒకటి ఉంది. మహాత్ములకి అది లేదు. భగవంతుని విషయంలోనూ, మహాత్ముల విషయంలోనూ నిర్ణయాలు చేసామనుకోండి, అది మన యొక్క చిన్న బుద్ధికి తార్కాణము తప్ప, భగవద్ తత్త్వములో జరిగే ప్రతిదానికీ కూడా ఒక మంచి వుంటుంది. కనబడే apparent wrongలో ఒక real right వుంటుంది. బయటకి సవ్యంగా కనిపించకపోవచ్చు. లోపల అంతరాంతరాలలో దాని యొక్క ఉపయోగం, దాని యొక్క నిర్దిష్టమైన కార్యక్రమము, దాని యొక్క ప్రణాళిక వుంటుంది. ఇది మనకి భాగవతుల జీవితాల్లో ఎక్కువగా కనిపిస్తూ వుంటాయి. సుఖంగా ఉన్న సన్నివేశాలు కన్నా, కష్టంగా ఉన్న సన్నివేశాల నుంచే మనిషి ఉద్ధరింపబడతాడు. కష్టంగా వున్నప్పుడు దేవుడు మనని అనుగ్రహించడం లేదు అని, మనమనుకుంటాము. దేవుడు గట్టిగా అనుగ్రహిస్తే కష్టాలు రావచ్చు కూడా. Perfection cause-forth imperfection to the surface అన్నారు. అందుకని భగవంతుని యొక్క అనుగ్రహం కలగడం అంటే మనలో వున్న చైతన్యం ఇంకొంచెం ఎక్కువగా వెలగడం లేక ఆవిర్భవించడం. అంటే అగ్నికార్యం జరుగుతూ వుంటుంది. అగ్నికార్యం జరిగితే లోపల వున్నవి కొన్ని కాలిపోతాయి. అందుచేత కాలిపోతున్నప్పుడు కష్టంగా వుంటుంది. జ్వరం వచ్చినప్పుడు కష్టంగా వుంటుంది. కానీ జ్వరం అనేది అగ్నికార్యమే కదా! దానివలన దేహంలో ఉన్న బాధలు నిర్మూలించబడతాయి. జ్వరం వచ్చి తగ్గిన తరువాత మనిషి చాలా ఎక్కువ సున్నితంగా కనిపిస్తూ వుంటాడు మామూలుకన్నా. అంతకుముందు ఉన్న మాలిన్యములన్నీ జ్వరం ద్వారా eliminate చేయబడ్డాయి కాబట్టి, మనిషి ఎక్కువ పవిత్రంగా కనిపిస్తాడు. ఒక జబ్బులో నుంచి బయటికి వచ్చిన వాడు అలా

కనిపిస్తాడు. ఒక jaundice లో నుంచి బయటకి వస్తే చాలా బాగుంటాడు. రక్తమంతా కూడా శుభ్రంగా పరిశుద్ధి చేయబడుతుంది. కనుక భగవంతుని కార్యక్రమంలో మనకి ఇలా జరిగేవన్నీ అంత బాగున్నట్లు అనిపించవు. ఒక యుద్ధం వచ్చిందనుకోండి. యుద్ధం ఎందుకు రావాలి? అనిపిస్తుంది. ఒక తుఫాను వచ్చిందనుకోండి. తుఫాను ఎందుకు రావాలి? అనిపిస్తుంది. ఒక భూకంపం వచ్చిందనుకోండి. భూకంపం ఎందుకు రావాలి? అనిపిస్తుంది. ఇటువంటివన్నీ జరిగినప్పుడు కొంత adjustment జరుగుతూ వుంటుంది. ఈ అమరికలు జరుగుతున్నప్పుడు మనబోటివారికి వాటి యొక్క పన్నా తెలియక ఇందులో ఏదో పొరపాటు వున్నదనుకుంటాము. అగ్నిపర్వతం పగిలి, లేదా భూకంపం వచ్చి చాలామంది చనిపోయినప్పుడు, భగవంతుని నిందిస్తూ చాలా అంటాము ప్రకృతి యొక్క విలయ తాండవం, ప్రకృతి యొక్క రాక్షసత్వం అంటూ. అలా వుండవు. There is an adjustment. ఈ adjustment తెలిసిన వాళ్ళు ఇందులో ఉన్న అమోఘత్వాన్ని చూస్తూ వుంటారు. ఇంద్రజిత్తుతో యుద్ధం చేస్తూ లక్ష్మణుడు మూర్ఛపోయాడు కదా! అదే మనమయితే అయ్యో! అని గోల పెట్టేస్తాము. లక్ష్మణుడి మూర్ఛ ఎంతమందికి ఉపయోగించింది? లక్ష్మణుడి మూర్ఛ కారణంగా సంజీవినీ పర్వతం తీసుకురాబడింది. సంజీవినీ పర్వతం తేవడం కారణంగా అంతకు ముందు చనిపోయిన వానర సైన్యమంతా బ్రతికారు, కేవలం లక్ష్మణుడు ఒక్కడే కాదు. అందులో భగవంతుని యొక్క అమోఘత్వం కనిపిస్తుంది కదా! రాముడికి పట్టాభిషేకం జరగనప్పుడు, అరణ్యవాసానికి పంపించబడినప్పుడు, ధర్మసంస్థాపన కోసం సమస్త కార్యములు జరిగాయి. కాబట్టి మనకి మొట్టమొదట చూస్తే చాలా కష్టంగా వుంటుంది. ఇలా జరగకూడదు. ఇలా జరగడం చాలా తప్పు. విధి చాలా ఘోరం, అంటాము. ఇది ఘోరంగా వుందని అనిపించడం మన కళ్ళకి తప్ప, జరిగే సన్నివేశాల్లో సూక్ష్మమైన బుద్ధితో అవగాహన చేసుకున్న వారికి అందులో వున్న భగవంతుని యొక్క లీల కనిపిస్తుంది. దానినే అమోఘత్వం అంటారు. ఒక చెడులో నుంచి కొంత మంచి తీసుకొస్తుంటారు. Hitler రెండో ప్రపంచ యుద్ధం నిర్వహించినప్పుడు దాని వలన మంచి కూడా జరిగింది. అందుకని మన పరిధిలో కనిపించే సన్నివేశాల్ని బట్టి మొత్తం నిర్ణయం చేయడం అనేది తెలియనివారు చేసే పని. ఈ పరిధిలో జరిగిన కార్యక్రమములన్నింటికీ అంతర్లోకములో వున్న కారణములు

తెలుసుకోగలిగినట్లయితే భగవంతుని యొక్క అమోఘత్వం తెలుస్తుంది. జరుగుతున్న వైపరీత్యములలో ఉద్దేశింపబడిన మంచిని తెలుసుకోవాలి. అది మహాత్ములు చేసే కార్యక్రమం. సీతాదేవి అన్ని ఆభరణాలు అయోధ్యలో వదిలేసి అరణ్యవాసానికి వెళ్ళినప్పుడు, రావణుడు సీతాపహరణం చేయడానికి ముందు అగస్త్య ఆశ్రమంలో లోపాముద్రా దేవి సీతాదేవికి చాలా ఆభరణాలు ఇచ్చింది. ఈ ఆభరణాలే సీతాదేవిని వెతకడానికి పనికి వచ్చినట్లుగా తెలుస్తుంది. వామనావతారం కథలో బలిని అన్యాయం చేసినట్లు అనిపిస్తుంది. కానీ నిజానికి బలికి అంతకన్నా ఉత్తమమైన స్థితిని కల్పించడం అది. భాగవతుల జీవితాలలో అంటే భగవద్ సాధన చేసుకుంటూ, భగవదనుభూతి పొందుదామనుకునే వారి జీవితాలలో కూడా, కష్టనష్టములు ఎక్కువగా కనిపిస్తూ వుంటాయి. ఈ కష్టనష్టాలు ఎందుకు కనిపిస్తాయంటే లోపల వున్న imperfections are brought to the surface. అందుచేత హరిశ్చంద్రుడు, నలమహారాజు మొదలగువారి జీవితాలు ముందు శోభాయమానంగా వున్నా అవి మనసు, ఇంద్రియములు, శరీరమునకు సంబంధించిన శోభే తప్ప, ఆత్మకు సంబంధించిన శోభ ఇంకా రాలేదు. కాబట్టి అది తయారు కావడానికి మనసు, ఇంద్రియములు, శరీరమునకు వున్న శోభ తీసేస్తే అందులో పెరగడం మొదలుపెడతారు. అందుకని మనకి వ్యక్తిగతమైన స్థితిగతులను కొంత తీసి వుంచితే మనిషి మళ్ళీ భగవంతుని వైపు, ఆత్మతత్వం వైపు మరలి ఆత్మతత్వంలో జీవించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది ఒక భాగంగా జరుగుతుంది. భగవంతుడి పనే ఇది. "నేనెవ్వరి ననుగ్రహింప చూతు వాని సకల విశ్వంబు నేనపహరింతు" అన్నాడు శ్రీకృష్ణుడు. నేనెవరినైతే అనుగ్రహించాలనుకుంటానో వాళ్ళకి మిగతా బలాలేవయితే వున్నాయో ఆ బలాలన్నీ తీసేస్తానని చెబుతాడు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క బలమనుకుంటారు. ఒకరు తింటే బలమనుకుంటారు. తింటే బలమనుకున్నవారిని పశువులన్నారు. కొంతమందికి వుంటే బలమనుకుంటారు. బ్యాంకులోనో లేదా ఎక్కడో మరో చోట ఎంత వుంటే అంత బలమనుకుంటారు. అంత భయంగా కూడా వుంటారు. తనకి బలమనుకుంటాడు. తింటే బలం, వుంటే బలం. ఇలా భగవంతుడు కాక ఇతరములైన బలములను నమ్ముకుని వుండి, భగవంతుని యొక్క ఆరాధన చేస్తున్నాడనుకో, ఏదయితే నిజమైన బలమనుకుంటాడో అది నిజమైన బలం కాదని

తెలియాలి కదా! కాబట్టి ఆ బలం ఒక్కసారి లేకుండా చేస్తాడు. అదే నిరాలంబనం! 'నిరాలంబా' అని అమ్మవారికి పేరు. ఏదీ ఆలంబన లేకుండా చేస్తే అప్పుడు 'నేను'గా మనలో వున్న భగవంతునియందు ఆలంబనం ఏర్పరచుకోగలము. అప్పుడు మిగతా బలాలన్నీ నెమ్మదిగా తీసేస్తాడు. ధర్మరాజుకు ఉన్న బలమంతా కూడా ఒక్కసారి లాగేస్తాడు. నలుడికి, హరిశ్చంద్రుడికి అలా లాగేస్తాడు. ఇలా ఎందుకు లాగేస్తుంటారంటే అంతకు ముందు తను బలం అనుకుంటున్నది నిజమైన బలము కాదు. అసలైన బలం ఆత్మబలం! ఆ ఆత్మబలమునందు వీళ్ళు ప్రవేశించాలనే కారుణ్యము కలిగిన భగవంతుడు ఇటువంటి చర్యలు కొన్ని చేస్తుంటాడు. బయటికి చూడటానికి కొంచెం కష్టంగా వుంటుంది. లోపల దానికి చక్కని అగ్నికార్యం జరిగి, మనిషి మారడానికి ఆత్మబలం కలిగినవాడు అవడానికి, ఆత్మవంతులు అవడానికి పనికివస్తుంది. కొంతమంది వారి తెలివితేటలే బలమనుకునేవారు, వారి యొక్క బుద్ధే బలమనుకునేవారు వుంటారు. అందరికన్నా ఆత్మయందు నిలబడిన వాడే అందరికన్నా బలవంతుడు. ఆత్మవంతులై, ఆత్మయందు జీవించి, ఆత్మయే బలముగా వుండుట చేత సమస్త బలము వారిదై వుంటుంది. అందుకని ప్రహ్లాదుడు చూడడానికి గొట్టికాయలాగా వుంటాడు. వాళ్ళ నాన్న పెద్ద పహిల్వాన్ లా వుంటాడు. ప్రహ్లాదుడి బలం హిరణ్యకశిపుడి కన్నా ఎంత ఎక్కువ! 'ఏమిటి నీ బలం చెప్పు?' అని తండ్రి అడిగితే, 'నీకు నాకు సూర్యుడికి, చంద్రుడికి మొత్తం అందరికీ ఎవరు బలమో అతడే నాకు బలం' అని చెబుతాడు ప్రహ్లాదుడు. 'నీకు నాకు బ్రహ్మాదులకున్' అంటాడు. బ్రహ్మకి కూడా ఆయనే బలం ఇవ్వాలి. కాబట్టి ఆ బలంలోకి మనం ఎదగడానికి, ఈ బలాలని నమ్ముకున్న వాళ్ళని నెమ్మదిగా ఉద్ధరించుకుంటాడు. అంటే ఊళ్ళో రక్షకుడైన తండ్రి వుండగా కొడుకు రౌడీని నమ్ముకున్నాడనుకోండి ఎలా వుంటుంది? రౌడీ ఏమి చేస్తాడు? కొడుకుని వశపరచుకుంటాడు. నిజమైన తండ్రి కొడుకుని వశపరచుకోడు. యోగక్షేమాలు చూస్తాడు. మిగతావాళ్ళు వశపరుచుకుంటారు. భోజనమే బలము అనుకున్నవారు భోజనమునకే వశమై పోయారు. ఆస్తి బలమనుకున్నవారు ఆస్తికి వశమైపోయారు. ధనము బలమనుకున్నవారు, తెలివితేటలు బలమనుకున్నవారు వాటికి వశమైపోతారు. కాబట్టి ఎవరు ఏది బలం అనుకుంటారో ఆ బలానికి దాసత్వం చేస్తుంటారు. కానీ భగవంతుడే బలమనుకున్న చోట దేనికీ దాసత్వం

వుండదు. సరి అయిన జ్ఞానం మనలో ఏర్పరచడానికి భగవంతుని కార్యక్రమం ప్రతి జీవికి ఏదో సమయంలో మొదలవుతుంది. అందుకనే ఇన్నిరకములైన కార్యక్రమములలో పాల్గొనడం అనేది స్వచ్ఛందంగా చేస్తూ ఉంటాడు జీవుడు. ఇది ఒక station. ఈ station లో పూజలవి చేయడం, హోమాలు చేయడం, ధ్యానం చేయడం లేక అక్కడెక్కడో వారెవరో పూజలు చేస్తున్నారట అంటే అక్కడికి వెళ్ళడం, ఇక్కడేదో జరుగుతుందిట అంటే ఇటు పోవడం, ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుకోవడం, ఈ పుస్తకాల్లోంచి తెలుసుకున్నదంతా వ్రాసుకోవడం, వ్రాసినవన్నీ పంచిపెట్టడం ఇవన్నీ ఒక station. అటు నుంచి ఇటు వచ్చినది. బహిర్గతమైన ప్రపంచం బలం అనుకున్న వాడు, అంతర్గతంగా ఉన్న ప్రపంచంలో కేంద్రంగా ఉన్న బలాన్ని గ్రహించడానికి ముందు, జరిగే సన్నివేశాల్లో ఇటువంటివన్నీ జరుగుతూ వుంటాయి. లేదా ఎక్కడికో, ఒక గురువు వద్దకో, గుడివద్దకో చేరతాడు. పుణ్యక్షేత్రాలకి వెళుతుంటాడు. స్తోత్రాలు పఠనం చేస్తుంటాడు. ఇది కాదంటాడు, అదిఅంటాడు. అదీకాదంటాడు, ఇదిఅంటాడు. నదులంటాడు. పుణ్యమం టాడు. స్నానాలు చేస్తుంటాడు. ఇవన్నీ లోపల కార్యక్రమం మొదలవడం వలన జరుగుతుంది. ఈ కార్యక్రమం మొదలు కాలేదు అనుకోండి వీటికి దూరంగా వుంటాడు. అది పరిణామ దశలో ఏర్పడుతున్నప్పుడు ఇది వరకు అనుకున్న బలములు మారుతుండడంవల్ల వీరికి జరిగే సన్నివేశాల్లో అన్యాయం జరుగుచున్నట్లు అనిపిస్తుందితప్ప, అన్యాయంకాదు. అందుకనే Madam Blavatsky అంటారు "వ్యక్తిగతముగా తనకు జరిగిన అన్యాయములను ధీరతతో సహించుట". సహించినందువలన మనకి సహనం ఏర్పడుతుంది. Acceptance ఎర్పడుతుంది. అదొక కళ్యాణ గుణము. అందులోంచి చాలా మధనం ఏర్పడుతుంది. కాబట్టి 'అమోఘత్వం' కి సంబంధించిన భగవంతుని కార్యక్రమం ఆ విధంగా వుంటుంది. లోపల పొట్టంతా పాడైపోయింది. జ్వరం వస్తే మొత్తమంతా కూడా అగ్ని ప్రజ్వలనం జరిగి పొట్టను బాగు చేసి, రెండు రోజులు అన్నం తినకుండా చేసి, ఆ తరువాత మనని fresh గా తయారు చేస్తుంది. ప్రతిసారీ దేహంలో మనకి కనబడే జబ్బు నిజమైన జబ్బు కాదు. మనకి కనబడకుండా మనలో దాగి వుండి మనని హింసిస్తున్న జబ్బు వుందే అది నిజమైన జబ్బు. మనని హింసిస్తున్న జబ్బులు మనలో ఈర్ష్య, అసూయ, ద్వేషము, క్రోధము, మదము, మాత్సర్యము,భయము. ఇవి ఉన్నప్పుడు లోపలున్న అగ్ని వీనిని బయటికి నెడుతుంది. నెడితే మనకి దేహం

మీద బాధలుగా వస్తాయి. దేహం మీద వున్న బాధలకన్నా మనసు మీద వున్న బాధలు మనిషిని ఎక్కువ బాధ పెడతాయి. దేహం మీద వున్నవి తక్కువ బాధ పెడతాయి. అది దేహంకన్నా మనసులో ఎక్కువ బాధలున్న వారికి తెలుస్తుంది. శరీరం మీద వుంటే ఏముంది? మనసులో వుంటే ఎప్పుడూ పీడిస్తుంది. మనసులోనుంచి శరీరం మీదికి తీసుకు రావడానికి కారణమేమంటే అది అగ్నికార్యం. అందుకని మనకి జ్వరాలు, కడుపు నొప్పులు అవి వచ్చి ఇంక తినకుండా చేస్తాయి. మానేస్తే ఈ లోపల systemని అగ్ని బాగా సరిచేసి ఇస్తుంది. మరుసటిరోజు నుంచి బాగుంటుంది. కాబట్టి ఈ కడుపు నొప్పి మనకి ఇప్పుడు ఎందుకు రావాలి అని limitedగా చూస్తే దొరకదు. మొత్తం చూడగలగాలి. మొత్తం చూడ్డానికి వైఖరి కాకుండా మధ్యమ, పశ్యంతీ, పర తెలియాలి. అలా తెలిసిన వాళ్ళు నిజంగా తెలిసిన వాళ్ళు అవుతారు తప్ప, జరుగుతున్న సన్నివేశాన్ని భౌతికంగా మాత్రమే గ్రహించి, దానికి అంతర్లోకంలో వున్న విషయాన్ని గ్రహించలేక పోవడం నిజంగా జ్ఞానం అనేది లేదని అర్థం. జ్ఞానం లేని వాళ్ళు ఏమి చేస్తారంటే ఈ జరుగుతున్న బహిర్గతమైన కార్యాలన్ని నిమిత్తమాత్రంగా జరుగుతున్నాయి కాబట్టి, ఈ నిమిత్తానికి అతీతంగా వున్న కారణాలని చూసుకుంటారు. మనకి ద్రౌపదీ వస్త్రాపహరణం అటువంటి కథే! దాంతో ఒక్కసారి వాళ్ళందరినీ సంహరించడానికి ఒక అర్హత సంపాదించుకుంటారు పాండవులు. ఒక చెడులోంచి ఒక మంచి. అంటే అమోఘత్వమంటే ఇలా వుంటుంది. రేపు కాలంలో మనకి రాబోయే వైపరీత్యంలో ఒక మంచి వుంది. చెడులో మంచిని చూడగలిగినప్పుడు అమోఘత్వం అనే భగవంతుని యొక్క తత్వం అర్థమవుతుంది.

# 117,118,119- పుండరీకాక్షః, వృషకర్మ, వృషాకృతిః

( ఈ నామాలకు వివరణ సేకరించె ప్రయత్నం జరుగుతున్నది)

## 120,121,122- రుద్రః, బహుశిరాః, బభ్రుః

( ఈ నామాలకు వివరణ సేకరించె ప్రయత్నం జరుగుతున్నది)

## 123,124,125- విశ్వయోనిః, శుచిశ్రవాః, అమృతః

( ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది)

## 126,127 - శాశ్వతః, స్థాణుః,

( ఈ నామాలకు వివరణ సేకరించె ప్రయత్నం జరుగుతున్నది)

## 128 వరారోహః

ఒక పశువును పలుగుతో కట్టి ఉంచామనుకోండీ, ఆ పలుగు పట్టుకొని అది అలా మేస్తూ ఉంటుంది. ఒక పరిధి దాటి వెళ్ళడానికి వీలు ఉండదు. దాని కార్యక్రమాలన్నీ పూర్తి అయ్యాయని అనుకున్నప్పుడు దానంతట అదే ఆ గుంజ దగ్గరకి వచ్చి పడుకుంటుంది. అట్లాగే మనం కూడా దైవం అనే కేంద్రం నుండి వ్యాసంగా వ్యాపన చెందుతాము. ఒక పరిధిలో తిరుగుతుంటాము. కొన్ని కొన్ని సన్నివేశాలలో నుండి, కొన్ని క్లిష్టపరిస్థితులలో నుండి, కొన్ని అనుభవాలలో నుండి మనమెవరు? అసలు మనం ఎందుకొచ్చాము? అనే భావనలు కలుగుతాయి. "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై" అంటారు. అసలు ఎవరు వాడు? వాడి వద్దకు వెడితే బావుంటుంది కదా మనం, ఎందుకు ఈ గొడవలన్నీ పడుతున్నాము అనిపిస్తుంది. "ఈ నీరాశ నిటేల వచ్చితి భయం బెట్లోగదే ఈశ్వరా" అంటాడు గజేంద్ర మోక్షంలో గజేంద్రుడు. ముందు ఒకటిగా ఉన్నవాళ్ళమే, కానీ తర్వాత వేరుగా ఉన్నామన్న భావన మనలో కలుగుతుంది. అదే అహంకారం కలగడమంటే! ఆ వేరు భావన కలగడమే అహంకరించడం. ఆ భావనలో నుండి త్రిగుణాత్మకంగా దిగివస్తాం. మనస్సులోకి, మనస్సు నుండి ఇంద్రియములలోనికి, ఇంద్రియముల నుండి ఇంద్రియార్థములలోనికి దిగి వచ్చేస్తాము. ఇలా దిగి రావడమే అవరోహణ క్రమంలో వ్యక్తమవడం. ఇలా ఉన్నప్పుడు ఏదో ఒకరోజు మనకి విరక్తి కలుగుతుంది. అది భగవంతుడే కలిగిస్తాడు, కానీ మనకే విరక్తి కలిగిందని మనం అనుకుంటాం. 'చాల్లేరా' అని చెప్తాడన్నమాట. పిల్లవాడు బయట ఆడుకుంటుంటే కాసేపయ్యాక తల్లి 'చాల్లేరా ఇక లోపలికిరా' అని పిలవదూ? అట్లా పిలవడం లాటిదే ఇది. భగవంతుని పిలుపు లోపల నుండి మనకిగా మనం సంకల్పించుకున్నట్లుగా అనిపించేట్లు జరుగుతుంది. అందుకని ఆ స్ఫూర్తి కూడా ఆయన కల్పించిందే! కనుకనే ఆ స్ఫూర్తి కలిగినవాడు దాని యందు ప్రవర్తించడమే తప్పా, అది కలగనివారి మీద రుద్దకూడదు, సతాయించకూడదు. ఎందుకంటే స్ఫూర్తి కలిగినప్పుడే వస్తాడు. లేకపోతే వచ్చినట్లే వచ్చి పారిపోతాడు. ఇది సహజంగా లోపల నుండి కలగాలి తప్పా, బయట నుండి చెప్పే విషయం కాదు. భగవంతుడు మన లోపల "వరారోహుడి" గా నివసిస్తూ ఉంటాడు. మనకి అభివృద్ధి ఇస్తాడు. Call వచ్చిందంటామే అలా Call ఒకటి లోపల ఇస్తాడు. ఆ

Callని పట్టుకొని మళ్ళీ వెనక్కి ప్రయాణం చేయడం మొదలు పెడతాము. ఈ ప్రయాణం చేయడంలో సృష్టి ధర్మాలతో అనుసంధానం చెందడం, మన వికల్పముల నుండి సంకల్పముల లోనికి, సహజమైన స్థితి లోనికి రావడం, అక్కడ నుండి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఇంద్రియార్ధముల మీద విరక్తి కలిగి, ఇంద్రియములను సమమైన పద్ధతులలో వినియోగించుకుంటూ, మనస్సు, మనస్సు యొక్క ప్రయోజనము ఎరిగి, మనస్సుని సద్వినియోగము చేసికుంటూ బుద్ధిలోనికి ఎదిగి, బుద్ధిని భగవంతునికి సమర్పణ చేసి, భగవంతుని బుద్ధి మనయందు ప్రకాశమగునట్లుగా చేసుకొని, విజ్ఞానమయ లోకము నుండి ఆనందమయ లోకములోనికి ఎదిగి, అక్కడ నుండి భగవంతుని సాన్నిధ్యము పొందడమనే కార్యక్రమము జరుగుతుంది. ఇలా కొంత మంది జీవులు దిగి వస్తుంటే, కొంతమంది జీవులు ఎక్కి వెళుతుంటారు. ఇది శాశ్వత కథగా జరుగుతుంటుంది. అంతేగానీ ఒక batch దిగి రావడం, వాళ్ళంతా పైకి వెళ్లిపోవడం ఉండదు. ఈఎక్కి వెళ్ళే వాళ్ళు దిగి వచ్చే వాళ్ళతో balance చేస్తుంటారు. ''వరారోహుడనే'' భగవన్నామం మనకి ఉత్తమ మార్గమని గుర్తుచేస్తుంది. 'ఉత్' అంటే 'మీదకి' లేదా 'ఉర్ధ్వానికి' అని అర్థం. ఉదారమైన మార్గమని కూడా అంటారు. ఈ మార్గంలో మనిషి మళ్ళీ వికాసము చెంది తనకున్న పరిమితత్వము నుండి అపరిమితత్వము లోనికి అడుగు పెడతాడు. ఈ అడుగు పెట్టే కార్యక్రమానికి నాందీప్రస్తావన చేసే భగవతత్వాన్ని 'వరారోహ' అంటారు. మళ్ళీ తిరిగి పంపించేది, మళ్ళీ తెచ్చుకొనేది మొత్తం అంతా ఆయన లీలార్ధంగా జరుగుతుంది. ఇది తెలిసినవాళ్ళకి మనకి నచ్చింది కాబట్టి మనం ఇది చేస్తున్నాం, వాళ్ళకి నచ్చింది కాబట్టి వాళ్ళకి నచ్చింది వాళ్ళు చేస్తున్నారని గుర్తుంటుంది. లేకపోతే మనకి నచ్చిందే అందరికీ నచ్చాలనిపిస్తుంది. మనకి నచ్చింది పరిమాణ దశలో మనం ఉన్న సంస్కారానికి సంబంధించినది. మనకన్నా ఎక్కువ నచ్చుబాటైన వాళ్లు ఉంటారు, మనకన్నా తక్కువ నచ్చుబాటైన వాళ్ళూ ఉంటారు. ఇది ఒక ప్రయాణం. ఈ ప్రయాణంలో భాగంగా మనకు అందిన పిలుపుని బట్టి మనం ప్రవర్తిస్తుంటాం. ప్రవర్తించని వాళ్ళు తక్కువ అనే భావన ప్రయాణంలో అడ్డంకులు కలిగిస్తుంది. అందరికీ ప్రేరణ ఇచ్చేది భగవంతుడే! ఒక పది సంవత్సరాలు నాస్తికుడిగా ఉన్నవాడు ఒక్కరోజులో ఆస్తికుడిగా మార్తాడు. ఎలా మార్తాడు? వాడి లోపల ఉన్న పిలుపును బట్టి. వేమన కథ తీసుకుంటే అలా ఉంటుంది. చలంగారి కథ తీసుకుంటే అలా ఉంటుంది.

పుండరీకుని కధ తీసుకుంటే అలా ఉంటుంది. అంతవరకు బొత్తిగా నాస్తికుడిగా దేముడు లేడు అనేవాడు, పదుల సంవత్సరాల నుండి పూజాది కార్యక్రమాలలో నిమగ్నమైన భక్తునికన్నా ఎక్కువ అనుభూతిలో నిలబడతాడు. నిన్నటి వరకు ఆయన వేరు.ఈ రోజు ఆయన వేరు. ఇవన్నీ ఎలాగయ్యా అంటే, లోపల నుండి పిలుపు వచ్చిందన్నమాట. పిలుపు వస్తే దారి చాలా సులభం. లోపల నుండి పిలుపు రాకపోతే, వాళ్ళు చేస్తున్నారు, వీళ్ళు చేస్తున్నారు అని రుద్దుకుంటే ఏమీ రాదు. పరులు చెప్తే రాదు. అరణ్యాలకి పోయినా రాదు. ముక్కు మూసుకున్నా రాదు. దానాలు చేస్తే రాదు. వ్రతాలు చేస్తే రాదు. లోపల నుండి చేయాలనే భావన పరిపూర్ణమైన ఇష్టంగా రావాలి. ఎందుకు చేస్తున్నావూ అంటే, నాకు ఇష్టం కాబట్టి అంటాడు. అట్లా ఇష్టపడ్డ వాళ్ళకి కష్టం ఉండదు. మార్గంలో అడ్డంకులు ఉండవు. లోపల నుండి ప్రేరణ ఇస్తాడు. ఇలా ప్రేరణ ఇచ్చి, కాస్త అటూ ఇటూగా ఉన్నా మళ్ళీ అందులోనే దూరేట్లు చేస్తాడు. సాధన మొదలు పెట్టాక మనం చాలాసార్లు ఆపుతాము, చాలాసార్లు మొదలు పెడతాము. ఇలా ఆగినప్పుడల్లా మళ్ళీ మొదలు పెట్టినవాడు ఎవడు? వాడే! ఏమిటీ మన రొటీన్ అంతా పాడైపోయిందీ? ఇలాక్కాదు, మళ్ళీ పొద్దున్నే లేద్దాం, భగవధ్యానం చేద్దాం అని అనుకోమూ? ఈ అనుకొనేవాడే లోపల ఉండేవాడు. ఆయనే తోమేస్తుంటాడు. ఆయన పిలుపు మొదలైందంటే ఇక ఈ జీవుడి శక్యం కాదు. ఎందుకంటే కాస్త పాతవాసనలు ఇంకా అటూ ఇటూ లాగుతున్నా, సరైన మార్గంలో ప్రయాణం సాగిపోతుంటుంది. అంటే కాస్త అగుతుంటాడూ, పక్కచూపులు చూస్తుంటాడూ, ఇలా ఏం చేసినా మళ్ళీ పిలుపు వస్తుంటుంది. మళ్ళీ ముందుకు వెడుతుంటాడు. ఒకసారి ఈ పిలుపు మొదలైతే ఆగదు. దేహం మారినా లోపల అది కొనసాగుతూనే ఉంటుంది, అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. ఆ పద్ధతిలో ముందుకు సాగి మళ్ళీ తనలో, తనయందు మనమంతా స్థాపింపబడే వరకు ఆపడట. అదీ 'వరారోహ' అనే పదానికి అర్ధం. భగవదనుగ్రహం అలా ఉంటుంది. ఒకసారి నా చూపు మీ మీద పడిందంటే, జన్మ జన్మల వరకు మీరు నాతో కలిసి పని చేస్తారని, గురువు చెప్తూంటాడు. "ఒకసారి నాదృష్టిలో పడితే ఇంక మిమ్మల్ని ఆకర్షించి, మీరు ఉద్ధరింపబడేవరకు కూడా నేను మీ వెంట ఉండి నడిపిస్తాను." ఇదే ప్రతి గురువు చెప్పే వాక్యం. వెంట ఎందుకు ఉంటారంటే మనం అటూయిటూ పారిపోకుండా. పక్కన police వాళ్ళని పెట్టినట్లన్నమాట. ఎటూ పారిపోడానికి వీలుండదు.

పారిపోతున్నా మనలోంచి మనకి ఒక స్ఫూర్తిని, ఒక గుర్తుని ఇచ్చి మళ్ళీ దారిలో పడేస్తుంటారు. విష్ణు సహస్రనామం సామూహికంగా చేసుకుంటే చాలా బావుంటుంది. మళ్ళీ చేసుకోవాలని అనిపిస్తుంది. ఒక్కళ్ళమే ఉన్నామనుకోండీ, నెమ్మది నెమ్మదిగా చేసుకోవడం తగ్గిపోతుంది. అంతేకాదు చేసుకోకపోతేనేం, అసలు చేసుకోవాలా అనే భావనా, చేసుకుంటేనేనా అనే భావనా కలుగుతాయి. మళ్ళీ పది మంది చేసుకున్నప్పుడు అందులో తీపి తెలిసివచ్చి మళ్ళీ చేసుకుందాం అనిపిస్తుంది. ఇలా కలుపుతుంటాడు. మళ్ళీ రుచి చూపిస్తుంటాడు. రుచి చూపించి మళ్ళీ సాధనలో పడేస్తుంటాడు. ఒకసారి దిగిన తర్వాత మళ్ళీ ఆ మార్గంలో నుండి బయటకు రాలేని స్థితి కల్పించి, మళ్ళీ తనలో చేర్చుకుంటాడు. ఈ విధంగా భగవంతుడు చేసేదంతా కూడా ఆరోహణక్రమం. దానియందు ఆయనకి ప్రీతి ఎక్కువట. ఎందుకంటే తన నుండి వచ్చినవాళ్ళే కనక, తన దగ్గరకు రావాలనే ప్రేమ తత్వం కలిగి ఉంటాడు. ప్రేమ ఆధారంగా జీవులను ఆకర్షిస్తుంటాడు. ప్రతి గురువు వద్దకూ ప్రేమ ఆధారంగానే శిష్యులు ఆకర్షింపబడతారు. ఆకర్షింపబడినవారికి మార్గాన్ని నిర్దేశించి, ధర్మము నందు ప్రవర్తింప చేసి, కర్మలను నశింప చేస్తారు. కారణములుండి పని చేసేంటంత వరకు కర్మలుంటాయి. కారణము లేకుండా జగత్ కళ్యాణానికి పని చేసేంత వరకు శిష్యుని మీద తన దృష్టిని ఉంచి, కారణములైన లోకములు దాటిన తర్వాత, శిష్యుడిని గురువుగా పెట్టి ఆయన తప్పుకుంటాడు. ఇంక శిష్యుడు ఆ పని చేస్తుంటాడు. కనక దారి తప్పే ప్రశ్న ఉండదు.ఈ విధంగా నడిపే కార్యక్రమమంతా ‘‘వరారోహ’’. అంటే అత్యంత ఆకర్షణ ఉన్నవాడు. అత్యంత ప్రేమ కలిగి, ప్రేమ ఆధారంగా జీవులను ఆకర్షించేవాడు. ఆకర్షించి తనయందు ఉంచుకొని, తన అనుభూతినిచ్చి, తన చైతన్యమునందు స్థిరపరచి, తిరోగమనము చెందేలా చేస్తాడు. అంటే సృష్టిలోకి పురోగమించిన వారంతా మళ్ళీ తిరిగి ఆయనలోకి వెళ్ళడం. అదే గజేంద్రమోక్షంలో చెప్తారు. ఒక గుహలో నుండి ఓంకారమల్లే గజేంద్రుడు వ్యక్తమవుతాడట. మనమంతా కూడా అలా వ్యక్తమయినవాళ్ళమే! గుంపులు గుంపులుగా ఏనుగులన్నీ గుహలోంచి బయటకి వచ్చాయిట. వ్యక్తమయ్యాయన్నమాట. మనమూ అంతే! బయటకి వచ్చాక అవీఇవీ చూసుకుంటూ సృష్టి అనే వైభవంలో తిరుగుతున్నప్పుడు చాలా పొరలు దాటి మనం కిందకి దిగి వచ్చేస్తాం. ఆ ఒక్కొక్క పొరనే ఒక్కొక్క లోకంగా చెప్తారు. ఈ పొరలన్నీ దాటి ఇంద్రియార్థముల వరకూ వచ్చి,

ఇంద్రియార్థములలో చిక్కుపడిపోతాము. అదే మనని మొసలి పట్టులా పట్టి ఉంచుతుంది. మనని అవీఇవీ పట్టేస్తాయి కదా! మన కుటుంబం, మనవాళ్ళు, మనసంపద, మన అభిప్రాయాలు, మన నమ్మకాలు -- ఇవన్నీ పట్లే! ఇందులో ఇరుక్కొని గిలగిలలాడుతూ ఏవో ఆధారాలని అనుకొని జీవిస్తుంటాం. కాసేపు మన సంపద ఆధారమనుకుంటాం, కాసేపు మన బంధువులు ఆధారమనుకుంటాం, కాసేపు మిత్రులు ఆధారమనుకుంటాం. ఇంకాసేపు వాళ్ళని వీళ్ళని ఆధారం చేసుకొని మన ప్రయోజనాలని పరిపూర్ణం చేసుకోవాలని ప్రయత్నం చేస్తూంటాము. మనం చేసే పూజాది కార్యక్రమములు, మొక్కుబడులు, పుణ్యక్షేత్ర దర్శనములు కూడా ఎక్కువగా ఏవో కారణాలతో చేసేవే. నిష్కారణంగా చేసేవి తక్కువ. ఎందుకంటే మన సమస్యలకి దేవుడితో ఒక agreement రాసుకుంటాం. ఇది జరిగితే నీకు అది ఇస్తా అనుకుంటాం. Contact అంటే అదే కదా! Consideration ఒకటి పెడతాము. అలా జరుగుతుండగా ఒకరోజు, లోపల, వీటికి తెంపు లేదా, ఎప్పుడూ ఇంతేనా అనిపిస్తుంది. మనకి జరిగేవన్నీ వాడివల్ల జరుగుతున్నాయి, వీడివల్ల జరుగుతున్నాయి అనిపిస్తుంది. వీళ్ళాంతా కాదు ఆంజనేయస్వామివల్ల జరుగుతున్నాయి అనిపిస్తుంది. ఆయనవల్ల కాలేదనుకోండీ, మరొకడు వెంకటేశ్వరస్వామి best అని చెప్తాడు. అప్పుడు ఆయన photo పెడతాం. అదీ కాకపోతే వైష్ణవ దేవి అంటాం. ఇవన్నీ ఎందుకూ మీ ఊళ్ళో సింహాచలం ఉంది కదండీ అంటే ఇక్కడకి వస్తాం. ఇలా బహిర్గతమైన ఆలంబనాలు పెట్టుకొని పాకులాడుతూ ఉంటే, చివరికి బహిర్గత ఆలంబనము ఏదీ పనిచేయని స్థితి వస్తుంది. ఎవరి వలనా ఏదీ జరగదూ, జరిగినట్లుగా భ్రమ కలుగుతుంది అంతే, అనే స్థితి వస్తుంది. అప్పుడు లోపల ఉన్న ఆత్మయందే ఆలంబనము ఏర్పడుతుంది. బయట నిరాశ్రయుడైన వాడికి మాత్రమే లోపల ఆశ్రయం దొరుకుతుంది. Hopelessness, helplessness తో, చివరకు అన్నిటియందు బహిర్గతమైన సహాయములు నిరాకరింపబడినప్పుడు మాత్రమే జీవుడు లోపల ఉన్న దేవుని పాదాలు పట్టుకోవడం జరుగుతుంది. అంత వరకు పట్టుకోడు. వాడెవడో చేసి పెడతాడు, వీడెవడో చేసి పెడతాడు, లేకపోతే మనకున్న డబ్బుతో చేయించుకోవచ్చు, లేక మన పలుకుబడితో చేయించుకుందాం, లేక ఈ అధికారో చేస్తాడనో, లేక ఆ minister చేస్తాడని, ఇలా అనుకొని, అవి అవ్వక, ''మొత్తం మీద ఇవి పరిష్కారం ఇవ్వవు'' అనే స్థితి పరిణామ దశలో వస్తుంది. అంతవరకు రాదు.

వీళ్ళవల్లా, వాళ్ళవల్లా పనులు అవుతాయి అనుకొనేవాళ్ళు ఉంటారు. ఇవన్నీ కాదు. భగవంతుని యందు ఉన్నవాళ్ళకి అన్నీ చక్కగా నెరవేరుతాయి, అని అనుకొనేవాళ్ళూ ఉంటారు. ఈ చివర మెట్టు ఎక్కిన వారికి మిగతా బహిర్గతమైన ఆలంబనలు ఉండవు.

"అట్టి ఆత్మ భవున్ నే శరణంబు వేడెదన్ " అని అంటాడు గజేంద్రుడు.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై,

యెవ్వనియందుడిందు బరమేశ్వరుం డెవ్వండు మూలకారణం

బెవ్వండనాదిమధ్యలయుం డెవ్వండు సర్వముం దానయైన

వాడెవ్వండు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్."

ఆత్మభవుడైనవాడు, ఈశ్వరుడైన వాడు అయిన వాడ్ని నేను శరణు వేడుతాను అంటాడు. వాడికి పేరులేదు, ఊరులేదు. అసలు ఈ మొత్తానికి ఎవరు మూలమో వాడి కాళ్ళు పట్టేసుకుంటే చాలు, వాడు మినహా నన్ను రక్షించే వాళ్ళెవరూ లేరని గజేంద్రుడు మొర పెట్టినట్లుగా మనం కూడా మొరపెట్టుకుంటే! అదీ సాధకుని చరమ స్థితి. ఇహ అక్కడ నుండి పరమపదమే! అక్కడ నుండి మార్గము చాలా సుగమమై ఉంటుంది. మనం ఆ మార్గానికి వచ్చే వరకు, లోపల, భగవతత్వం పనిచేస్తుంటుంది. ''ఎవరు నేర్పారు ఇవన్నీ'' అని ప్రహ్లాదుడ్ని అడిగితే, "నిజేచ్ఛనైన నేమిచ్చిన నైన గానలకు నేగిన నైన హరిప్రబోధముల్ '' అంటాడు. 'అక్కడ నుండి ఇక్కడ నుండి రావూ, లోపల నుండీ పుట్టాలి' అంటాడు. 'పుట్టిన తర్వాత ఇహ ఆగదు' అంటాడు. ఎందుకురా అంటే -

"మామిడి చెట్ల మీద ఉండే కోయిల గబ్బిలాలుండే చెట్ల మీదకి వస్తుందా?

చక్కగా మానస సరోవరంలో తిరిగే హంస కుళ్ళు నీళ్ళవైపు చూస్తుందా?" అంటాడు. ఆ విధంగా నిర్మలమైన స్థితిలో తనని తాను స్థాపితం చేసుకున్నవాడవుతాడు. దీనంతటికీ కారకుడైనవాడు ఏదో ఒక విధంగా తన వద్దకు లాగుతాడు. ఒక గురువో, ఒక పూజో, ఒక దేవాలయమో ఆకర్షణ కలిగించేస్తాడు.

ఈ సృష్టిలో జీవులన్నిటివీ ఒక్కొక్క తత్వం, ఒక్కొక్క నచ్చుబాటు. అందుకే రకరక దుకాణాలు open చేసి, రకరకాల పద్ధతులలో అందర్నీ ఆకర్షించి, ధర్మమైన మార్గంలోనికి మళ్ళించి, అక్కడ నుండి ఊర్ధ్వగతికి ప్రయాణం చేయించే తత్వం, వరారోహ తత్వం. ఏ మహాత్ముడి కార్యక్రమాలు చూసినా సరే, జీవుడ్ని ధర్మబద్ధమైన మార్గంలోపెట్టే కార్యక్రమమే ఉంటుంది. Detailsలో తేడా ఉండవచ్చు కానీ main purposeలో తేడా ఉండదు. మతాలవనీండి, దేవాలయాలు కానీండి ధార్మికమైన మార్గాలన్నిటికీ basis ఒకటే, జీవుడు భగవంతుని వైపు మళ్ళీ చూడడం. చూడడం మొదలుపెట్టాక, దీని మీద ఆకర్షణ నిలబడిన తర్వాత జీవుడు తానే వెతుక్కుంటూ వెడతాడు.

## 129 మహాతపాః

వరారోహానికి అనుబంధమైన నామం. మహాతపాః అంటే బాగా తపస్సు అని, పెద్ద తపస్సు అని అర్ధం ఉన్నది. తపస్సు అంటే fiery aspiration అన్నారు మాష్టారు. అంటే ధృఢ సంకల్పము అని అర్ధము. ఒక సత్సంకల్పం బలమైనదీ, ధృఢమైనదీ అయి ఉంటే అందులోంచి ఒక వేడి పుడుతుంది. దాన్నే 'మహా ఆతపః' అని కూడా అంటారు. 'ఆతపః' అంటే వేడి పుట్టడం. ఏదైనా ఒక విషయంలో చూడండీ, మనకి వేడి పుడితే అది అయ్యేంత వరకు ఆగము కదా! అది ఏదైనా కావచ్చు. రావణాసురుడంతటివాడికి చెల్లెలు శూర్పణఖ, "నువ్వు ప్రపంచంలో చాలా చూశాననుకుంటున్నావు. అసలు విషయం వదిలేశావు.The best వదిలేసి ఏవో slums పట్టుకున్నావు. వెతుక్కుంటూన్నావు' అంటే అతనికి వేడి పుడుతుంది. వేడి పుట్టి ఎంత దూరం వెళ్ళాడో మనకి తెలిసినదే కదా! వేడి పుట్టడం అనేదే 'ఆతపః'. మనలో భగవంతునియందు అనురక్తి కలుగుట అనే వేడి భగవంతుడే పుట్టిస్తాడు. దాన్నే 'కుమారుడు' అంటారు. జ్యోతిషపరంగా 'కుజుడు' అంటారు. దాన్నే మనలో ఉండే సంకల్పబలం, అంటే మనలో ఉండే మొండిపట్టు ఉంటుంది చూసారా, దాన్ని 'కుజుడు' అంటాము. కాకపోతే ఆఖర్లేని మార్గంలో పనిచేస్తుంటుంది. అదే పట్టు మంచి విషయంలో ఏర్పడిందనుకోండి, ఎంతో బావుంటుంది. కనక మొండిపట్టులో తేడా లేదు. అది ఎక్కడ పనిచేస్తోందో, ఎలా ఉపయోగిస్తామో అనే దాన్లోనే తేడా ఉంటుంది. తుచ్ఛమైన విషయాల్లోనూ, వెలుగులేని విషయాల్లోనూ, అధర్మమైన విషయాల్లోనూ పట్టు ఉన్నవాడు అట్లా దిగిపోతాడు. మంచి విషయాల్లో పట్టు వచ్చిందనుకోండి ఇంకేం చాలా బావుంటుంది. పట్టు మంచిదికాదు అని అనుకోకూడదు. పట్టు మంచిదే. దాన్ని ఏ మార్గం వైపు మళ్ళిస్తావనే దాన్లోనే తేడా. అధ్యాత్మిక సాధన బాగా జరగాలంటే కుజుడు బావుండాలి. మనలోని పట్టుదల, కార్యదీక్ష, సంకల్పబలం ఎంత పెరిగితే, ఎంతబాగా ఉంటే అంత మనలో వేడి పుడుతుంది. ఆ వేడి ఆయన్ని చేరుకొనే వరకు ఉండాలి. ప్రయత్నం దాటిన స్థితి అనేది వచ్చే వరకు ఈ వేడి ఉండాలి. అందుకే సాధన కుమారస్వామితోనో, వినాయకునితోనో, ఆంజనేయస్వామితోనో మొదలు పెట్టాలి. పట్టుదల లేని వారికి వినాయకుడ్నో, కుమారస్వామినో, ఆంజనేయ స్వామినో ముందు ఉపదేశం చేయాలి. మంగళవారం పవిత్రంగా చూసుకోమని చెప్పాలి. ఆరోజు orange color

ని, వినాయకుడ్నిగాని, కుమారస్వామినిగాని, ఆంజనేయ స్వామినిగాని ఉపాసన చేస్తే, మనిషిలో మూర్ఖపు పట్టుదలపోయి సరైన విషయంలో పట్టు దొరికేట్లుగా ఉద్ధరిస్తారు. అది ఆ దేవతలలో ప్రత్యేకత. మన పెద్దలు, ఋషులు ఇవన్నీ దర్శనం చేసి ఇచ్చారు. ఆ విధంగా ఒక 10,15 సంవత్సరాలు ఆంజనేయస్వామి భక్తుడిగా పెరిగాడనుకోండీ, వాడికి జీవితంలో ఢోకా లేదు. మంచిమార్గంలో నడిపిస్తాడు లేదా తోక పట్టుకొని మంచిమార్గంలో పడేస్తాడు. 'నీదు వాలంబునన్ జుట్టి నేలన్ బడంగొట్టి' అన్నట్లుగా, ఆంజనేయస్వామి వదలడు, మార్గంలో పడేస్తాడు. 'శరవణభవాయ నమః' అంటూ కుమారస్వామి మార్గంలో వెడితే అరిషడ్వర్గాలను తొక్కిపెట్టి, మనల్ని పైకి లాగుతాడు. మనల్ని బంధించేవి కిందకి తోసేస్తాడుట. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఆరింటినీ తన అంకుశంతో అట్లా తొక్కిపెడతాడట. తొక్కిపెట్టడమంటే అవి మనలో ప్రకోపించకుండా, సద్బుద్ధి ప్రకోపించేట్లుగా స్ఫూర్తిని ఇస్తాడు. అందుకే కుమారుని ధ్యానం. మన జాతకంలో కుజగ్రహం బాగా లేకపోతే ఎక్కువగా కుమారుని ధ్యానం ఇస్తారు. అంటే మనం నశించిపోకుండా ఉద్ధరింపబడి వృద్ధి పొందాలంటే ఆంజనేయుడ్నో, కుమారస్వామినో ఉపాసన చేసికోవడం ద్వారా ఈ గ్రహము యొక్క స్థితి మనలో సరైన పద్ధతిలో పని చేయడం మొదలుపెడుతుంది. అదొక రహస్యం. ఈ ఉపాసన వల్ల మనకు తపశ్శక్తి పెరుగుతుంది. తపశ్శక్తి పెరగడమంటే మనలో వేడి పుట్టడం. వేడిపుట్టడమంటే అగ్నియే! అగ్ని పుట్టిస్తే సమిధ దగ్ధమై వెలుగు బయటకి వస్తుంది కదా! మన లోపల వెలుగు కట్టెలో నిప్పులా ఉంటుంది. మన లోపల వెలుగు 'నా లోన గల వెలుగు' అంటూంటాము కదా! కట్టెలో నిప్పు హోమం చేసినప్పుడు తప్పా తెలీదు. ఇంత నిప్పు ఉందా అనిపిస్తుంది. హోమం చేస్తుంటే జ్వాలలు ఎందులో నుండి వస్తున్నాయి? ఆ కట్టెలో నుండే కదా! కానీ అందులో వేడి పుట్టించాలి. అలాగే మనలో ఉన్న వెలుగులు కూడా వేడిమి కలిగిస్తే బయటకి వస్తాయి. అప్పుడు పదార్థం దారి ఇస్తుంది. లేకపోతే పదార్థంలో వెలుగు బంధింపబడి ఉంటుంది. కట్టెలో జ్వాల లేదా వెలుగు ఎలా బంధింపబడి ఉంటుందో, మనలో కూడా అలాగే వెలుగు బంధింపబడి ఉంటుంది. కట్టెలో వెలుగు బయటకి తేవాలంటే మంట పెట్టాలి. అలాగా మంట పెట్టడమే 'ఆ తపః'. 'అబ్బా, తట్టుకోలేకున్నామండీ వేడీ' అంటాం. వేసవికాలంలోనే దేహాలు బాగుపడతాయి. A.C.ల్లో కూర్చుంటే బాగుపడవు. లోపల ఉన్న అన్నిటినీ బాగా ఉడకబెట్టి, మలినాలన్నీ బయటకి

బహిష్కరింపచేస్తుంది వేసవికాలం. వేసవికాలం బాగా అనుభూతి చెందిన వాడికి వర్షాకాలం ఏమీ చేయదు. లేకపోతే జలుబులూ, తుమ్ములూ నానాబాధలు వస్తాయి. ఎందుకంటే ఈ అనారోగ్యాలు కూడా లోపల ఉన్నవాటి వల్లనే వస్తాయి. అందుకే ఎంత వేడికి తట్టుకుంటే అంత చలికి, వర్షానికి తట్టుకోవచ్చు. వేడిమి ద్వారా లోపల మలినములన్నీ కూడా ఆవిరి చేయబడి, బయటకి తోయబడతాయి. అలాగే ఈ తపస్సు అనే పద్ధతిలో ఒక పట్టుదలగా, ఒక దీక్షగా, ఒక క్రమంగా సాధన చేస్తుంటే మనలోంచి బోలెడు బయటకి వస్తుంటాయి. అప్పుడప్పుడు సమిధ బాగా లేకపోతే ఠప్ ఠప్ మని, పేల్తూంటాయి. అలాగే పచ్చిగా ఉంటే పొగ ఎక్కువగా వస్తుంటుంది. పొగని 'ధూమ్ర మార్గము' అంటారు. జ్వాలని 'అర్చిర్' మార్గమంటారు.ధూమ్ర మార్గంలో ఏమీ కనబడకుండా, కళ్ళుమూసుకుపోయి కళ్ళ మంటలుంటాయి. ధూమ్ర మార్గమంటే చంద్రలోకంలోకి వెళ్ళడం. పితృలోకంలోకి వెళ్ళడం. సుఖములనే భ్రమలో జీవించే వారిది పొగ మార్గము. జ్వాల ఎక్కువగా ఉంటే పొగ ఎక్కువగా ఉండదు. జ్వాల తగ్గినకొలదీ పొగ ఎక్కువ అవుతుంది. తపస్సు చేస్తున్నప్పుడు మనలో ఒక్కొక్కటీ బయటకు వ్యక్తం అవుతాయి. లోపల నుండి బయటకు తోసేసినట్లు. బావిలో ఏదో విలువైన వస్తువు పడిపోయిందనుకోండి. అది తీయడానికి గాలం వేసి దిగితే, అది దొరికే లోపల అంతకుముందు పడ్డ గిన్నెలు, తప్పేలాలు దొరకవూ? అలా అసలైన, విలువైన ఆత్మతత్వమునందు స్థిరపడే లోపల, మన లోపల భౌతికమైన దేహంలోను, ప్రాణమయ దేహంలోను, మనోమయ దేహంలోను, బుద్ధిమయ దేహంలోను ఉన్న మలినములన్నీ వ్యక్తము చేసేంత వరకు 'మహాతపా' అనే భగవంతుని తత్వము మనలో పనిచేసి, మనం నిగనిగలాడే మేలిమి బంగారం అయ్యేంతవరకు తపోదీక్ష ఏర్పడేట్లుగా చేస్తుంది. మరి మనకి తపోదీక్ష అంతంత మాత్రంగానే ఉంటుంది కదా! వరారోహా, మహాతపాః ఈ రెండూ ఒకదానికొకటి అనుసంధానంగా ఉంటూంటాయి. వరారోహంలో ఎక్కడో ఒకచోట ఆగిపోయి, settle అయిపోయామనుకోండి, మహాతపా కొంచం మంటెక్కిస్తుంది. ఏ పరిస్థితి రూపంలోనో మళ్ళీ భగవంతుడు గుర్తొచ్చేలా చేస్తుంది. మనం అన్నీ మానేసాం కదా, మళ్ళీ అవన్నీ చేస్తే బావుండు, అనే సంకల్పం కలిగిస్తుంది. ఒక్కసారి మనల్ని igniteచేస్తుంది. అదీ 'మహాతపాః.'

## 130 సర్వగః

సర్వము వ్యాపించి ఉన్న భగవత్ తత్వానికి ఇవ్వబడిన నామం. అంతటా వ్యాపించి ఉన్నాడు అనే అవగాహన మొదటి శ్లోకం లోనే ఇవ్వబడింది. సర్వము తన గమనము చేత వ్యాపింపబడి ఉంది. కేంద్రం నుంచి పరిధి వరకు మొత్తం తానుగా వ్యాపించి ఉన్న ఈ భగవత్ తత్వాన్ని దర్శించినప్పుడు ఈ నామం మన యందు సత్యం అవుతుంది. భగవంతుడు సర్వత్ర అన్నింటి యందు వ్యాపించి ఉన్నాడని అనుకుంటూ ఉంటాం. కానీ సాధనలో మరిచిపోతూ ఉంటాం. మనం కొన్ని కొన్ని పనులు భగవంతుడు సర్వత్ర ఉన్నాడని గుర్తులేక అలా చేస్తూ ఉంటాము. సర్వత్ర ఉన్నాడని భావన ఉన్నప్పుడు కొన్ని కొన్ని ప్రవర్తనలు మన దగ్గర ఉండవు. అలా మరచిపోకూడదనే మాటిమాటికి అన్ని గ్రంథాల్లో భగవంతుని సర్వవ్యాపకత్వం గురించి ఎక్కువగా చెబుతూ ఉంటారు. చివరికి ఈ సర్వావస్థలయందు ఆయనే నిండి ఉన్నాడు అన్న భావన మిగలాలి. అలా మిగిలిన వారే ప్రహ్లాద, నారద, శుక, వ్యాస, వశిష్ట, శౌనకాది మహర్షులందరూ కూడా. ఈ గుర్తు మనకు ఎలా ఉండాలంటే, ఎట్లా వ్యాపించి ఉన్నాడు అనేది ముందు మనకు తెలియాలి. ఒక చెట్టుని చూసాము.ఆ చెట్టుకి మూలం ఉంటుంది. కొమ్మలు ఉంటాయి. కొమ్మలకి రెమ్మలు ఉంటాయి. రెమ్మలకి ఆకులు ఉంటాయి. ఆ రెమ్మలకి ఆకులతో పాటు పువ్వు, పళ్ళు ఉంటాయి. ఈ కనిపించే దాంట్లో ఏది చెట్టు? మూలం చెట్టా? కొమ్మలు చెట్టా? రెమ్మలు చెట్టా? ఆకులు చెట్టా? పువ్వులు చెట్టా? పండ్లు చెట్టా? మనం వేటికి అవి చూస్తే ఇవి విడివిడిగా కనిపిస్తాయి. మొత్తం అన్నిటినీ కలిపి చూస్తే చెట్టుగా కనిపిస్తాయి. ఏ ఒక్క భాగాన్నో చూస్తే చెట్టుగా కనిపించదు కదా. అదేవిధంగా పెట్రోలియం పరిశ్రమ వివిధ రకములైన యంత్రముల సముదాయం. ఈ పెట్రోలియం ప్లాంటులో ఏ భాగాన్ని పెట్రోలియం ప్లాంటులా తీసుకుంటారు? మొత్తం సమగ్రంగా తీసుకుంటేనే పెట్రోలియం ప్లాంటు. అట్లానే మానవుణ్ణి తీసుకొని ఇతను మానవుడు అన్నా మనుకోండి. అంటే ఇందులో మానవుడు ఏ భాగం? శిరస్సు గాని, కళ్ళు గాని, ముక్కు, చెవులు, కాళ్లు, చేతులు విడివిడిగా తీసుకుంటే కనిపిస్తాయి తప్ప విడిగా చూసింది మనిషి అవడు కదా. అంటే మనం భాగించి చూసుకున్న వాటిల్లో భగవంతుడు కనిపించడానికి అవకాశం ఉండదు. చెట్టులో కొమ్మ భాగమైనప్పటికీ అది చెట్టు కాదు. అలాగే ఒక

యంత్రం పెట్రోలు పరిశ్రమకి సంబంధించిన భాగం అయినప్పటికీ అది పెట్రోలియం పరిశ్రమ కాదు. అలాగే మన అందరిలో కూడా మనం గా కనిపిస్తున్న దాంట్లో ఎవరు అని అడిగితే ఈ మొత్తం అంతా కలిపి అని. అంతేకానీ ఇందులో ఏదో ఒకటి తీసుకొనడానికి వీలు లేదు. తీసుకుంటే, నేనంటే ఈ శరీరం కాదు అన్నప్పుడు ఈ శరీరం ఎవరై ఉండాలి? శరీరం నేను లో భాగం. నేనే ఇవన్నీగా వ్యాపించి ఉన్నాను అనే సత్యం ప్రతీ వాళ్లకు బాగా అర్థం అవుతుంది. మన శరీరం వరకూ మనం వ్యాపించి ఉన్నాము. మనం లేకపోతే శరీరం లేదు. ఇంద్రియాలు లేవు, మనస్సు లేదు, బుద్ధి లేదు కాబట్టి, మనం ఉండ బట్టి ఇవన్నీ ఉన్నాయి. మనమే ఇవన్నీగా ఉన్నామని తెలుస్తుంది. ఇందులోపల ఉన్నాడు, అందులోపల ఉన్నాడు అని వెతకడం కాదు. ఇక్కడ ఈ నామం లో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, మొత్తంగా, సమగ్రంగా చూడాలి. ఇది పురుషుడు, ఇది ప్రకృతి ఇలా మనం ఎన్ని విభాగాలు చేస్తే అన్ని విభాగాలు కనిపిస్తూ ఉంటాయి. కనిపించే విభాగాల్లో దేవుణ్ణి చూడడం కొంత కొంత చూడడం అవుతుంది. సమగ్రంగా ఉన్న భగవంతుణ్ణి చూడడం మొత్తంగా ఉన్న భగవంతుణ్ణి చూడటమే అవుతుంది. సమగ్ర దృష్టి ఉన్న వారే సమగ్రులవడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే మనం ఎంత చూస్తే అంతే. మిగతాది పరిమితత్వం అయిపోతుంది. అంతకుమించి చూడలేని స్థితి మనలో ఉన్నప్పుడు అంతవరకే సంతోషం దక్కుతుంది. ఈ 'సర్వగః' అన్న నామంలో సర్వము వ్యాపించి ఉన్నాడు కాబట్టి సర్వము గా దర్శించి నట్లయితే దర్శనము పరిపూర్ణము అవుతుంది. మనం కొంత కొంత చూస్తూ ఉంటే కొంత కొంత కనిపిస్తూ ఉంటుంది. మిణుకు మిణుకు మనేటట్లుగా అది కూడా అప్పుడప్పుడు గుర్తుండి, చూసినప్పుడు అప్పుడప్పుడు గుర్తు ఉండేట్లుగానే కనిపిస్తుంటుంది. అందుకే మొత్తంగా చూడమంటారు. ఒక శిష్యుడు జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకని వెళ్లి 'చీమ లోనూ, దోమ లోనూ బ్రహ్మ ఉన్నాడని చెప్పారు కదా! ఎట్లా చూడాలి అమ్మా' అంటే 'చీమగా, దోమగా చూడు నాయనా' అని చెప్పారు. ఎందుకంటే చీమగా చూడమంటే ఎక్కడ చూస్తాడు. చీమను చంపి లోపలికి వెళ్లి చూస్తాడా? అలా కాకుండా మొత్తం చీమ యొక్క సమగ్ర రూపం భగవంతుడుగా చూడడం సులభం. అదేవిధంగా చెట్టులో దేవుణ్ణి చూడమంటే మొత్తం చెట్టుగా దైవాన్ని చూడడం సులభం. ఇట్లా సమగ్ర రూపంగా ఈ సృష్టి మొత్తం ఈ భూమి మీద ఉంది. ఈ భూమి కూడా ఇతర గ్రహగోళాదులతో సహకరించి పనిచేస్తుంది. వీటన్నిటికీ

కేంద్రంగా ఒక సూర్యుడు ఉన్నాడు. ఈ మొత్తం అంతా ఒకే ఒక చైతన్యం యొక్క వ్యాపనమే అని మనకి గుర్తు చేయడానికి ఎన్ని విభాగాలు చేస్తే అంత విభజింపబడతాయి. ఎంత సమగ్రంగా చూస్తూ ఉంటే అంత సమీకరణం చేయబడతాయి. సమగ్ర దృష్టి ఏర్పడినప్పుడు సమగ్రమైన భగవద్దర్శనం కూడా జరుగుతుంటుంది. సమగ్రమైన దృష్టి తప్ప తదితరమైన దృష్టి లేకపోవడం భాగవతోత్తముల జీవితాల్లో కనిపిస్తుంది. బ్రహ్మాండం నుంచి అణువువరకు అన్నింటిలోనూ చైతన్యం యొక్క విస్తృతి కనిపిస్తుంది. కనుక ఈ కనిపిస్తున్న దాన్ని అంతటినీ భగవంతుడిగా ధ్యానం చేయడం 'సర్వగః' అనే నామం నుంచి వస్తుంది. ఈ అవగాహన ఎంత మేరకు తగ్గితే అజ్ఞానం అంత మేరకి పెరుగుతుంది. మనం ఏ రూపం అనుకుంటే ఆ రూపం వరకే పరిమితమవుతుందని చాలాసార్లు చెప్పకున్నాం కదా! ఏ పేరు అనుకుంటే ఆ పేరు వరకే పరిమితం అవుతుంది. ఏ ప్రదేశం అనుకుంటే ఆ ప్రదేశం వరకే పరిమితం అవుతుంది. అలా అంతటా వ్యాపనం చెందినవాడిగా భగవంతుని దర్శనం చేసిన ఋషులు భగవంతునికి సర్వగః అనే నామం ఒకటి ఆయన పేరులా ఇచ్చారు.

# 131 సర్వవిత్

సర్వవిత్ అంటే సర్వము తెలిసినవాడు అని. విత్ అంటే తెలియడం. మనం ఎంతవరకూ వ్యాపనం చెందుతామో అంతవరకూ మనకు తెలిసి ఉన్నట్లుగానే భగవంతుడు కూడా సృష్టి అంతా వ్యాపనం చెంది ఉన్నాడు. కనుక సృష్టి అంతా తెలిసి ఉంటాడు. మనకి కొద్దికొద్దిగా తెలియడంగా ఉంటుంది. భగవంతుని తత్వంలో ఇక తెలియవలసింది ఏమీ ఉండదు. తెలియడం అంటే తానే. తనే తెలివిగా ఉంటాడు. తనే జ్ఞానముగా ఉంటాడు. పూర్తిగా తెలిసినప్పుడు ఇంకొకటి తెలియవలసిన అవసరం లేనపుడు తానే అది అన్న స్థితి ఉంటుంది. మనకి పరిపూర్ణమైన చైతన్యం లేనప్పుడు తెలుసుకునేవాడు, తెలుసుకునేది, తెలుసుకోవడం అని మూడు గా ఉంటుంది. అంటే మనం త్రిగుణాత్మకమైన స్థితిలోకి దిగి వస్తాము. కానీ అలా కాక ఈ మూడు తెలుసుకునేవాడు, తెలుసుకునేది, తెలుసుకోవడం ఒకటిగా ఏర్పడిన స్థితి భగవంతుడు. ఎందుకంటే తెలుసుకునేవాడు తనే. తెలుసుకునేది తనే. తెలుసుకోవడం కూడా తనే. మూడూ తనే ఒకటిగా ఉన్నాడు. ఇలా తెలియడాన్ని జ్ఞానం అంటారు. మంచి సంగీతం వింటున్నప్పుడు మొదట పాడేవాడు కనిపిస్తూ ఉంటాడు. హాలు కనిపిస్తూ ఉంటుంది. చుట్టూ అందరూ కనిపిస్తూ ఉంటారు. మనం వింటున్నట్లుగా తెలుస్తూ ఉంటుంది. కానీ సంగీతం వినడం సరిగా అభ్యాసం చేస్తే, సంగీతం అని ఎందుకు అన్నారు అంటే సమ్యక్ గీతం. చక్కగా ఆలాపన చేయబడినటువంటిది. ఏది పడితే అది కాదు. ఆ సంగీతాన్ని భక్తితో, శ్రద్ధతో వింటున్నప్పుడు చాలా సహజంగా కళ్ళు మూతలు పడిపోతాయి. చుట్టూ ఉండే వారు ఉండరు. నెమ్మదిగా జారిపోతారు. ఆ తరువాత పాడుతున్న కళాకారుడు జారిపోయి పాటే ఉంటుంది. వింటున్న మనం జారిపోయి వినడమే ఉంటుంది. అంటే సంగీతం వినేవాడు, పాడేవాడు, వినడం అనే మూడింటిలో వినడం ఒకటి మిగిలిపోతుంది. పాడే వాడు ఉండడు. వినే వాడు ఉండడు. చుట్టూ ఏమీ ఉండవు. అటువంటి స్థితి మనకు కలుగుతుంది. అదే ధ్యాన స్థితి లేక సమాధి స్థితి. ధారణ! ఇలా ఒక్కొక్కటి ఐక్యం అవ్వడం వలన పరిసరాల నుంచి మనం ప్రతిహరింప పడతాం. దానినే ప్రత్యాహారం అంటారు. అంటే అన్నీ మర్చిపోయి ఒకే దాంట్లో ఉన్న స్థితిలోకి వస్తాము. మనకి అత్యంత ప్రీతికరమైన ఈ కార్యక్రమంలో నిమగ్నం అయినప్పుడు కూడా మనం చేస్తున్నామన్న భావం

జారిపోతుంది. ఆ పని మనం గా తయారైపోతాం. కాలాన్ని కూడా మరిచిపోతాం. కాలము, దేశము మరిచిపోయి చేస్తున్న పనిలో నిమగ్నమైన సన్నివేశాలు శ్రద్ధగల వారికి జరుగుతూ ఉంటాయి. అంతా అయిపోయిన తరువాత చూసుకుంటే అబ్బా ఇంత సేపు పట్టిందా? ఇంతసేపు చేశామా? అనిపిస్తుంది. ఏదైనా పెద్ద సంబరమో, పెళ్ళో చేస్తున్నాము అనుకోండి అందులో బాధ్యత వహించి శ్రద్ధా భక్తులతో చేస్తున్న వారికి చేయడమే ఉంటుంది తప్ప, చేస్తున్నామనే భావన జారి పోతుంది. చేయబడేది జారిపోతుంది. చెయ్యడం మిగిలిపోతుంది. శ్రీకృష్ణుడు 'కర్మలు చేసేటప్పుడు సంకల్పాలు, ఫలితముల మీద దృష్టి రెండు తీసేసి చేయడంగా మిగిలిపోతే అది నీ యోగం అవుతుంది' అని చెప్పాడు. దానినే 'తన్మయ స్థితి' అంటారు. భగవంతుడు ఆ విధంగా ఇవన్నీ తనే అయి తన్మయుడై ఉన్నాడు. మనకి తెలిసినంత మేరకి మనం వ్యాపన చెందుతూ ఉంటాం. ఇంకా తెలియనిది ఉన్నది. కనుక ఆ తెలియనిది మనం కాదని తెలుస్తుంటుంది. మనకి దేవుడు కాని సన్నివేశాలు చాలా ఉంటుంటాయి. దేవుడు కాని రూపములు, ప్రదేశములు, ఇవన్నీ ఉంటాయి. ఈ సాధన చేసుకుంటున్న వారికి తనే ఇవన్నీగా వ్యాపనం చెంది ఉన్నాడని తెలుస్తుంది. తనలో తనే తన బుద్ధిగాను, తన మనసుగానూ, తన ఇంద్రియములు గాను, తన శరీరంగాను అల్లుకొని ఇదంతా ఏర్పరచుకున్నాడని తెలిసినట్లు. సూర్యుడికి 'వివస్వంతుడు' అంటే నేతనేసేవాడు అని ఒక పేరు ఉన్నది. నేత నేసేవాడట. దేంతో నేస్తాడు అంటే తన యొక్క కిరణములనే దారము చేత. ఈ గ్రహాలన్నింటిని నేతనేసి, వాటిమీద ఈ ప్రాణికోటి సంతతిని పుట్టించి, తనే ఈ మొత్తంగా వ్యాపనం చెంది ఉంటాడు. తనలో నుంచి ఈ నేత నేసే వాడుగా దిగిన వాడిని 'వైవస్వతుడు' అంటారు. మనం ఉండగా మనలో నుంచి ఒక మనసు పుట్టి పనులు చేయిస్తుంది కదా! మనం ఉన్నాం. మన మనసులో నుంచి వచ్చే సంకల్పాన్ని ఒక పద్ధతిలో పెట్టి దానికి ఒక రూపకల్పన చేస్తాం. అట్లాగే సూర్యుడిలో ఈ నేత పని చేసే సూర్యమండలమంతా తయారుచేసి, దానిమీద జీవులను తయారుచేసే సూర్యుని 'మనస్సు' అంటారు. సూర్యుని మనస్సునే 'మనువు' అంటారు. వివస్వతుడనే సూర్యునికి పుత్రుడు వైవస్వత మనువు. వైవస్వత మనువు వివస్వతుడనే సూర్యుని పుత్రుడు లేక సూర్యుని మనస్సు. తననుంచి వ్యక్తమైన మనస్సాధారముగా తనే ఈ మొత్తంగా వ్యక్తమవుతున్నట్లే, మనలో నుంచి వచ్చిన సంకల్పం మన మనస్సు ద్వారా అవతరణ జరిగేలా చూస్తూ ఉంటాము. దుర్గా

పూజలనే భావన మనసులో వచ్చినప్పుడు దానికి సంబంధించిన కార్యక్రమమంతా అవతరణ చెంది నిర్వర్తింప చేస్తుంది. పొద్దున్నే లేవాలి, రావాలి, పూజ చేసుకోవాలి, ప్రసాదం తీసుకోవాలి, వెళ్ళాలి అనే కార్యక్రమం అంతా ఒక సంకల్పం లోనుంచి పుట్టి దానికి అంతా ఏర్పాట్లు చేసుకుంటాం. ఈ సంకల్పాన్ని ఒక ప్రణాళిక ప్రకారం నిర్వర్తించే organising capacity మనసులో నుంచే వ్యక్తమవుతుంది. అదే మన మనస్సు. అట్లాగే సూర్యుడు మన మనసులో నుంచి తన ప్రణాళిక ప్రకారం వ్యక్తం చేస్తే ఈ సూర్య మండలం, అందులో ఉన్న గ్రహ గోళాదులు ఏర్పడినాయి. మనలో నుంచి వ్యక్తమైన సంకల్పాలను మన మనసు నుంచి వ్యక్తం చేయడానికి ప్రయత్నం చేస్తాం. కొన్ని అవుతుంటాయి. కొన్ని అవవు. ప్రకృతి సహజమైన కాలం, దేశం వీటికి సంకల్ప బలాన్ని అనుసంధానం చేస్తే తప్పక జరుగుతాయి. కానప్పుడు జరగవు. రాత్రి సమయాన సూర్యుణ్ణి చూద్దాం అనుకుంటే అవదు కదా! Timing, placement ఈ రెండు సరిగా తెలిసినవాడికి సంకల్పించినది సంకల్పించినట్లు అవుతుంది. ఈ రెండు తెలియని వాళ్ళకి సంకల్పం సరైన సమయంలో రాదు. రైలు వెళ్ళిపోయిన తరువాత హైదరాబాద్ వెళదామనిపించేటట్లు ఉంటుంది. లేదా విమానం వెళ్లిపోయిన తరువాత విమానాశ్రయమునకు వెళ్ళినట్లు ఉంటుంది. అంటే కాలము బాగులేదని! సంకల్పాలు ప్రతి ఒక్కరికి వస్తుంటాయి. ఒక వ్యక్తి లోనుంచి వచ్చిన ఒక సంకల్పం ఒక పెద్ద వ్యాపారం అవుతుంది. అది మొదట సంకల్పమే కదా! ఆ సంకల్పాన్ని ఒక పద్ధతిలో ఒక ప్రణాళిక ప్రకారం అమలు పరచుట వలన జరుగుతుంది. ఇల్లు కడదామని ఒక సంకల్పం వచ్చిందనుకోండి ఆ సంకల్పానికి మన మనస్సు చేసే పని planning. కనుక plan చేసిన తరువాత నిర్వర్తింప చేయడానికి ఇంద్రియములు, శరీరం ఉన్నాయి. మనసులో నుంచి ప్రణాళిక ఇంద్రియములు, శరీరము ద్వారా వ్యక్తమై చేద్దాం అనుకున్న పనులు అవతరిస్తున్నాయి కదా! వీటన్నిటి నుంచి ఎవరు వ్యక్తమవుతున్నారు? మనమే వ్యక్త మవుతున్నాము. మన మనసులో ప్రణాళికలు గా ఏర్పడేటప్పుడు మన యొక్క బలము తోనే మనసు ప్రణాళికలను తయారు చేస్తూ ఉంటుంది. మనం నిద్రపోతుంటే మనసు ఏమి చేస్తుంది? మనలో సంకల్పం వచ్చిన తరువాత నిద్రపోయాము అనుకోండి అది కూడా మనతోపాటు వచ్చేస్తుంటుంది. అంటే ఏమిటి? మనసులోకి మనం దిగి వస్తున్నాము కదా. మనసులోకి దిగి వచ్చిన తరువాత, మనసు ప్రణాళికను తయారు చేసిన తరువాత ఇంద్రియాల చేత

పని చేయించేటప్పుడు ఇంద్రియాల లోకి మనమే దిగి వస్తున్నాము కదా! నేత ఎట్లా ఉంటుందో అట్లా మనమే దారం లాగా వస్తుంటాము. అదే తరువాత నామం భానుః అని వస్తుంది. సర్వగః, సర్వ విత్, భానుః అని ఋషులు నామములను ఒక వరుసలో, పద్ధతిలో ఏర్పాటు చేస్తారు. చూడండి ఎలా వ్యక్తమవుతున్నామో! మన నుంచి మన సంకల్పం లోనికి, మన సంకల్పం లోనించి మన మనసు లోనికి, మనసు నుంచి ఒక ప్రణాళికగా, ఆ ప్రణాళిక నుంచి ఇంద్రియముల ద్వారా మన శరీరంతోనే మనమే కష్టపడి పని చేస్తుంటాము. కష్టపడి పని చేస్తేనే అవుతుంది. Do it your self అన్నట్లు గా ఉంటుంది. ఎక్కడ commision కొడితే అక్కడ ఆగుతుంది. మంచి plan వేస్తే మంచి ఇల్లు కట్టడం అయిపోతుందా? అవదు. ఇంద్రియాల లోకి దిగి సరైనటువంటి వస్తువులు ఏరుకొని దానికోసం శరీరాన్ని ఉపయోగించి చేస్తేనే అవుతుంది. అంటే Up to the physical. మనమే వ్యక్తమవుతున్నప్పుడు ఈ మొత్తం నేత పనంతా మన నుంచే వస్తుంది. అందుకనే మనలో నుంచి పుట్టిన దానిలోకి మనం వ్యక్తమవుతాము. ఎవరిదైనా కారు రోడ్డు మీద వెళ్తుంటే ఒక స్కూటర్ కొట్టింది అనుకోండి మనకు ఏమీ అనిపించదు కదా! మన కారుని కొడితే మనకి అనిపిస్తుంది. ఎందుకని? మన కారు వరకు మనం వ్యాపించి ఉంటాం. మన పిల్లల వరకు మనం వ్యాపించి ఉంటాం. ఇంకొక పిల్లవాడికి ఏదైనా అయిందంటే 'ఓహో అలాగా అయిందా' అని నిద్రపోతాం. మన పిల్లవాడికి ఏదైనా అయితే ఓహో అలాగా అని నిద్రపోము కదా! ఎందుకని? మనలో నుంచి వ్యక్తమైన వారు కాబట్టి. సంపద నీలో నుంచే వ్యక్తమయింది. కుటుంబం నీలో నుంచే వ్యక్తమయింది. నీలోనుంచి వ్యక్తమైన వాటిలోకి వ్యాపనం చెంది ఉన్నావు కాబట్టి వాటికి దెబ్బ తగిలితే నీకు దెబ్బ తగిలినట్లు ఉంటుంది. కొత్త కారుని రోడ్డు మీద పెడితే చిన్న పిల్లవాడు ఇలా కొట్టాడు అనుకోండి. సొట్ట పడనక్కరలేదు. ఊరికినే అలా కొట్టాడు అంతే. మనని కొట్టినట్లుగా ఉంటుంది. ఎందుకుంటుంది? అక్కడ కూడా మనం ఉంటాం. మన కారు వరకు మనం వ్యాపనం చెంది ఉంటాం. మన ఇల్లుగా, మన సంసారంగా, మన ఆస్తులుగా, మన భావనగా. భావం మీద ఎవరైనా దెబ్బ కొట్టారు అనుకోండి. ఎందుకండీ? ఇలా కాలాన్ని వృధా చేసుకుంటున్నారు అని ఎవరైనా విమర్శిస్తే ఊరుకుంటామా? ఊరుకోము. బాధ పడతాము కదా! వీలుంటే వాడిని నాలుగు తిడతాము కదా! ఎందుకిలా జరుగుతుంది అంటే సహజంగా మనం కూడా భగవంతుని యొక్క ప్రతి

రూపాలమే కనుక ఈ విధంగా వ్యాపనం చెంది ఉంటాం. కాకపోతే మనకి ఈ అవగాహన లేకపోయినందువలన భగవంతుడంత వ్యాపనం చెందం. మన వ్యాపనం మనది అనే concept వరకు ఉంటుంది. మహాత్ముల వ్యాపనం మొత్తం అంతా మనదే అని ఉంటుంది. మన మమకారం పరిమితము. వాళ్ళ మమకారం అపరిమితం. తెలిసినవాళ్లు మమకారం ఉండకూడదని అనరు. వ్యాపనం చేసుకోమని చెబుతారు. నువ్వూ, నీ పిల్లలూ, పక్క వాళ్ళ పిల్లలూ ఇలా వీలైనంత వరకు అందరినీ కలుపుకుంటూ వెళితే మనం కూడా అమ్మవారి తత్వం వరకు పెరిగిపోతుంటాము. మొత్తం కుటుంబమంతా ఆవిడది కనుక, సృష్టి కుటుంబం లేదా భగవంతుని కుటుంబం ఈ విధంగా తెలిసి వ్యాపనం చెంది ఉంటుంది. మనం ఏ విధంగా మన పరిధిలో వ్యాపనం చెంది ఉంటామో భగవంతుని పరిధిలో ఆయన అట్లా మొత్తం సృష్టి అంతా తానుగా వ్యాపనం చెంది ఉంటాడు. మనం, మన మనసు, ఇంద్రియాలు, మన శరీరము మనవి అనుకునేంతవరకు వ్యాపనం చెంది ఉంటాం. కాబట్టి మన వ్యాపనం మొట్టమొదట మన వరకే ఉంటుంది. పెళ్లయిన తర్వాత ఆవిడని కలుపుకుంటాం. కొంతమందిని మినహాయిస్తే మినహాయించవచ్చు. ఎందుకంటే పరిధి చిన్నది అయినప్పుడు ఒకరు లోపలికి వస్తే ఒకరు బయటికి వెళ్ళాలి. కానీ ఒకరు వస్తే వారిని కలుపుకొనీ, ఇంకొకరు వస్తే వారినీ కలుపుకొనీ, ఇలా చేస్తుంటే పెరుగుతుంటాం కదా! ఈ పెరిగే పద్ధతుల్లో అంతవరకూ వ్యాపనం చెందుతున్నాం. మనకి సర్వమును తెలుసుకోవాలన్న భావన ఒకటుంది. ఎంతవరకు కలుసుకుంటామో, ఎంతవరకు మనది చేసుకుంటామో, అంత వరకు తెలుసుకుంటాం కదా! మనది చేసుకోవడం అంటే వశం చేసుకోవడం కాదు. ఇతరులు అనే వాళ్లు కూడా మన వాళ్ళు అనే భావన వచ్చినప్పుడు ఇతరులు అనేవారు తగ్గిపోతుంటారు. ఇతరులనేవారు తగ్గిపోతుంటే వ్యాపనం జరుగుతుంది. సర్వవిత్ అనే ప్రక్రియ సృష్టిలో ఏ విధంగా జరుగుతున్నది తెలుసుకుంటే మనం వ్యాపనం చెందే స్థితి వస్తుంది. అందరిని తమవారుగా చూస్తూ, అందరి యోగక్షేమాలు చూస్తూ తమ ప్రేమ అనే పరిధిలో ఇముడ్చుకోవడంవల్ల వాళ్లు ఆయన యందు ప్రేమ కలిగి ఉంటారు. దీనికి ఆధారం ప్రేమ. ఆ పద్ధతిలో మనం కూడా పెరుగుతూ ఉండవచ్చు. By inclusion we expand. By exclusion we contract. ఎవరూ వద్దనుకుంటే చివరకు నీవు ఒక్కడివే మిగులుతావు. నీలో కూడా నీకు ఎవరూ వద్దు కదా! మేమెందుకని

ఒకటొకటి వెళ్ళిపోతూ ఉంటాయి. వెళ్ళిపోతే ఒక్కడు మిగిలిపోతాడు. మహాత్ముల జీవితాల్లో constricted life నుంచి expanded life కనిపిస్తుంది. కారణమేమిటంటే inclusion. ఎంతమందిని ప్రేమతో పలకరిస్తే అంత మంది నీ చుట్టూ చేరతారు. ఏదో ఆశించి చేరతారని కాదు. ఆ ప్రేమలో ఉన్న అయస్కాంత శక్తి. మన ప్రక్క ఇంట్లో కుక్క ఉందనుకోండి, రోజూ కాస్తోకూస్తో వేస్తే రోడ్డు మీదకు వెళ్ళేటప్పుడు తోక ఆడిస్తుంది. ఎప్పుడు ఏమి వేయలేదు అనుకోండి మనం అటు వెళితే అది ఇంకొక వైపు ముఖం త్రిప్పు కుంటుంది. అది ఏమిటది? There is a way to establish contact. Contact by being useful to others. ఇతరులకు ఎంత ఉపయోగపడుతుంటే అంత వారి ప్రేమను మనం పొందటానికి వీలుంటుంది. మన ప్రేమను వాళ్ళు పొందడానికి వీలుంది. ఇతరుల యోగము, క్షేమము చూస్తూ ఉన్నామనుకోండి, ఎంతమందిలో చూస్తే అంతమందిలోకి వ్యాపన చెందుతుంది. కానీ వాళ్ళంతా మనకి వశం అవ్వాలని చూస్తే మాత్రం అవదు. మనకది సహజమైన, నిష్కారణమైన ధోరణి అవాలి. అంతేకానీ నీ వశం చేసుకుందామని చేస్తే అందులో ఉన్న పవిత్రత లోపం వలన ఇంతమంది కలిసి ఒకటి అవుదాం అన్న స్థితి ఏర్పడదు. అందుకని ఈ సర్వవిత్ అనే భావన సాధకుల వరకూ through inclusion we can expand and we can permeate.

## 132 భానుః

భానుః అనే పదమునకు అర్థం ఏమిటంటే తన కిరణముల చేత తన ప్రకాశమును తెలియపరిచే వాడు. ప్రకాశం ఉందిట అని మనకు ఎట్లా తెలుస్తుంది? ఆయన కిరణాల ద్వారా తెలుస్తుంది. ఒక గురువుగారు మహాత్ముడని ఎట్లా తెలుస్తుంది? శిష్యుడి ద్వారా తెలుస్తుంది. సజ్జనుడని ఎలా తెలుస్తుంది? సజ్జనుడని చెప్పుకుంటే తెలుస్తుందా? అతని సజ్జనత్వాన్ని అనుభూతి చెందినవారు చెబుతుంటారు. అప్పుడు తెలుస్తుంది. ఆయన వలన నాకు ఆపద తొలగిందని, ఉపకారం కలిగిందని, ఊరట కలిగిందని ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుంటున్నందువలన, అదే విధమైన ఆపదలో ఉన్నవారు, అవసరాల్లో ఉన్నవారు, అక్కడికి చేరి వాళ్ల కూడా అనుభూతి చెందుతుంటారు. శిష్యుడు ద్వారా గురువు వ్యాపనం చెందుతుంటాడు. అదేవిధంగా కిరణముల ద్వారా సూర్యుడు వ్యాపనం చెందుతుంటాడు. అలాగే మనసు ద్వారా మనం వ్యాపనం చెందుతూ ఉంటాం. కాబట్టి ఎవరు వ్యాపనం చెందాలన్నా కేంద్రం నుంచి పరిధికి వారి యొక్క కిరణముల ద్వారా లేక తరువాతి వారి ద్వారా వ్యాపనం చెందవలసినదే. ఏ మహాత్ముల జీవిత చరిత్ర చదువుకున్నా తల్లిదండ్రులెవరో చెప్పనిది ఉండదు. ఎందుకంటే అసలు ఆధారం అక్కడినుంచి కనుక నాన్న ఎవరు? తాత ఎవరు? ముత్తాత ఎవరు? అన్నంత వరకూ వెళ్ళాలి. కనుక శిష్యుల వలన గురువు తెలుస్తాడు. కిరణముల వలన సూర్యుడు తెలుస్తాడు. అందుకనే కిరణము సూర్యుని యొక్క వైభవమే. సూర్యుని ఏడు కిరణాలు ఎలా ఏకంగా బయటకు వ్యక్తమై బయట ప్రపంచంలోనికి ఏడు గుర్రాల వలె పరిగెడుతూ వెళ్తాయో అలా మన నుంచి సంకల్పాలు మనసులో నుంచి, మాటల్లో నుంచి, చేతల్లో నుంచి వ్యక్తమవుతాయి. దానిని బట్టి మన నుండి వెలువడే కిరణములు కలుషితమైన రంగుతో కూడుకున్నవా, లేక స్వచ్ఛమైన రంగుతో కూడుకున్నవా, ప్రాణశక్తిని ఇచ్చేటటువంటివా, లేక ప్రాణశక్తిని హరించేటటువంటివా అని మనకు తెలుస్తుంది. 'భానుః' అన్న పదం ఈ వ్యక్తమయ్యే దానిలో ఉన్న స్వచ్ఛత వలన సూర్యుని గొప్పతనం ఏ విధంగా తెలుస్తుందో అలాగే మన మాటల్లోనూ, మన చేతల్లోనూ, మన యొక్క స్వభావము లేక తత్వము ప్రపంచానికి వ్యక్తమవుతోందని తెలుపుతుంది. ఒక వ్యక్తి సజ్జనుడా కాదా తెలుసుకోవాలనుకుంటే అతను చెప్పేది

కాక చేసేది చూడమన్నారు, what he does than what he speaks. చేసే దానిని బట్టి మంచి చెడులు ఎలా తెలుస్తాయో అట్లా ఈ 'భానుః' అనే తత్వం మనలో నుంచి మన సహజమైన స్థితిని బయటకి పంపించేస్తుంది. సూర్యుడికి సహజమైన స్థితి స్వయం ప్రకాశం. కనుక ఆ వెలుగు పెల్లుబికి సూర్య మండలం అంతా వ్యాపించి ఉంటుంది. సూర్యుడు అనగానే వెలుగు అనే గుర్తుకొస్తుంది. ఇంకొకటి గుర్తు రాదు కదా! ఒక మహాత్ముడు అంటే మంచితనమే గుర్తుకొస్తుంది. ఇంకొకటి గుర్తుండదు. ఆత్మ చేత వ్యాపనం చెంది మంచి పనులు చేస్తూ, ఇతరుల ప్రేమను చూరగొన్న వాడు మంచివాడు అవుతాడు తప్ప మహాత్ముడిగా manage చేసుకుందాం అనుకుంటే ఎక్కువ రోజులు ఉండదు. కొంత వ్యాపార సరళిలో చెల్లుబాటవుతుంది కానీ కాలం మింగేస్తుంది. ఆ తరువాత వస్తుంది మనకి. ఆ నామం కూడా ఇందులోనే ఉంది. కాలము శాశ్వతమైన ధర్మములను నిలబెట్టి ఉంచుతుంది. దానికి విరుద్ధమైన వాటినన్నింటినీ మింగేస్తుంది. ఈజిప్టు లేదా భారతదేశం తీసుకున్నారనుకోండి రెండువేల సంవత్సరాల క్రితం ఎవరండీ మహాత్ములంటే? చాలా తక్కువమంది గుర్తుంటారు మనకి. ఎందుకు గుర్తు ఉంటారు? వాళ్ళ ప్రవర్తనయందు పరిపూర్ణమైన ధర్మమును వ్యక్తం చేయడం వలన, లేక పరిపూర్ణమైన ధర్మం వారి ప్రవర్తన నుండి వ్యక్తం అవడం వలన, వ్యక్తిగతమైన స్వభావం లేకపోవడం వలన, ప్రకృతి యొక్క ధర్మములు వారి నుంచి వ్యక్తమవుతుంటాయి. అటువంటి వారే మనం ఎరిగిన క్రీస్తు, బుద్ధుడు. వాళ్లని మనం గుర్తు పెట్టుకున్నాం. మరి అప్పటి నుంచి చాలామంది వచ్చారు, వెళ్లిపోయారు. వాళ్ళందరూ గుర్తుండరు కదా! తాముండగానే ఎన్నో రకాలుగా సత్కారం చేయించుకొని, పూలమాలలు వేయించుకుని, పేపర్లో వేయించుకునే వారు చాలా మంది ఉంటారు. వాళ్లు వెళ్లిపోయిన తర్వాత వాళ్ళెవరో ఎవరికీ గుర్తు ఉండరు. ఎందుకు గుర్తుండరు అంటే it is all managed. కీర్తి తప్ప, సహజమైన కీర్తి కాదు. ఎక్కడో గుహల్లో కూర్చొని ఏదో చేసినవారిని ప్రకృతి బయటకి పట్టుకొచ్చేస్తుంది మంచి పనులు చేస్తే. అన్నమాచార్యులవారు వున్నారు. ఆయనేమీ తను వ్రాసిన పాటల నన్నింటినీ పుస్తకాలు అచ్చువేసి publishing h,ouse పెట్టి దానిని అందరికీ పంచి పెట్టాలనే తపన పడేవాడు కాదు. ఏం చేశాడు? తను పరిపూర్ణ భక్తి భావనతో తన నుంచి వ్యక్తమైన గీతాలను వ్రాసి, పాడి భగవంతునికి కైంకర్యం చేశాడు. తనకోసం తను వ్రాసిన గీతాలను వెంకటేశ్వరునికి సమర్పణ

చేసుకోవడమే తృప్తి ఆయనకు. అలా 32,000 కీర్తనలను వ్రాసుకున్నారట. ఆయన శరీరాన్ని వదిలి వెళ్లి ఇప్పటికీ దాదాపు 500 సంవత్సరాలు అవుతుంటే గత 30 సంవత్సరాల నుంచి ఆయన కీర్తనలన్నింటిని ప్రకృతి బయటకు తీయించింది. ఇటువంటి ధనం పెద్ద సంపద కదా! దైవీ సంపద అట్లా భూగర్భంలోనికి వెళ్ళడానికి వీలులేకుండా ప్రకృతే సత్పురుషులను పెట్టి బయటకు తీయించి, ఆయన వెళ్లిన 500 సంవత్సరాలకి ఆయన పాటలు బయటకి వచ్చినాయి. 500 సంవత్సరాలంటే సామాన్యం కాదు. శాశ్వతమైన ధర్మములతో అనుసంధానం చేసి, జీవనయాత్ర సాగించిన జీవితాలన్నింటిని ప్రకృతి వ్యక్తం చేసుకుంటుంది బయటికి. అవన్నీ models తరువాత వాళ్ళకి. అదే అన్నమాచార్యులవారి కాలంలో చాలామంది సంఘంలో పేరు పలుకుబడి కలవారు, బాగా ధనం ఉన్నవారు చాలామంది ఉన్నారు. వారెవరి పేర్లు ఎవరికీ అక్కర లేదు కదా! స్వీయమైన ధర్మప్రవర్తన అలా శాశ్వతముగా వ్యక్తమవుతూ ఉంటుంది. ఆకాశంలో వాటికి రికార్డు ఉంటుంది. వెళ్లిపోయిన తరువాత ఒక మనిషిని గుర్తు పెట్టుకోవడం ఆయన మంచితనానికి సంబంధించినటువంటిది. ఉన్నప్పుడు గుర్తుపెట్టుకుని వెళ్ళిపోగానే మరిచిపోయారట అంటే, ప్రజలు ఆయన వలన చాలా బాధపడ్డారన్నమాట. మనకి నానుడిగా ఒక చిన్న కథ ఉంది. జమీందారుగారింట్లో కుక్క చచ్చిపోతే ఊళ్లో వాళ్లంతా వెళ్లి పరామర్శించి వచ్చారట. ఎందుకని? కుక్కమీదేమీ ప్రేమ కాదు. జమీందారుకి కోపం వస్తుందేమోనని. అయ్యో మీ కుక్క చనిపోయిందా? మీకు ఎంత కష్టం వచ్చింది అని, ఆ జమీందారు గారు చనిపోతే ఊళ్ళో కుక్క కూడా వెళ్ళలేదుట. పోయాడు కదా వెళ్లకపోతే ఇక అడిగేవారెవరని. కొంతమంది ధనవంతులకి ఒంట్లో బాగుండ లేదని చెబితే చూడడానికి వెళ్ళినవారు disturb చేయడానికి వీలు లేదు కనుక ప్రక్కన పెట్టిన బుక్కులో తమ పేర్లు రాయించుకుంటారు. ఎందుకంటే ఎవరు వచ్చారో, ఎవరు రాలేదో తెలియాలి కదా! మనం కూడా వెళ్లి రాయించు కోకపోతే ఆ ధనవంతుడితో ఇబ్బంది వస్తుందేమోనని రాయించుకుంటూ ఉంటే ఒక తెలివైన వాడు, స్నేహితుడు వెళ్తుంటే నా పేరు కూడా నువ్వే రాసేయమంటాడు. ఎందుకంటే నేను ఇంత జబ్బులో ఉంటే నన్ను చూడడానికి రాలేదు. వీడి సంగతి చూద్దాం అనే పద్ధతుల్లో ఉంటారు కదా, అందుకని. అటువంటివాడు పోయాడు అనుకోండి అప్పుడు ఎవరు వెళ్తారు? ఎవరూ వెళ్ళరు. ఎందుకంటే వాడు లేడు కాబట్టి వెళ్ళవలసిన అవసరం లేదు. అటువంటి జీవితాలు కొన్ని ఉంటాయి. వాటికి

records ఉండవు. Record ఉంచడం దండగ. ప్రకృతి ఇటువంటి వాటిని maintain చెయ్యదు. కానీ కొన్ని records ఉంటాయి. వేల సంవత్సరాలు పోయినా అవి చెరగవు. పదిలంగా ఉంటాయి. శ్రీకృష్ణుని జీవిత చరిత్రని 5000 సంవత్సరాల క్రితం నుంచి అలా అలా జాగ్రత్తగా కాపాడుకుంటూ, ఎంతమంది ఈ దేశం మీదికి దండెత్తి వచ్చినా ఎక్కడా దెబ్బ తగలకుండా అలా తీసుకొచ్చేశారు. రాముడు, ఎప్పటి రాముడు? త్రేతాయుగంలో రాముని చరిత్ర చెక్కుచెదరకుండా అలా జాగ్రత్తగా పట్టుకొచ్చేశారు. నిలబడిపోయింది. ఎంతవరకు నిలబడిపోతుంది అంటే ఈ భూమి ఉన్నంత కాలం నిలబడి ఉండి పోతుంది. భూమి పోతే అది వేరే సంగతి తప్ప, భూమి ఉన్నంత కాలం రాముడి చరిత్ర ఈ భూమి మీద ఉండవలసిందే. ఎందుకంటే వ్యాపనం అనేది దాని తత్వం. మంచికి సహజమైన వ్యాపన స్థితి ఉంది. అదీ 'భానుః' అనే పదము లో నుంచి మనము తీసుకొనవలసిన అర్థం. మనమేదో ప్రాకుదామ్ అనుకుంటూ ఉంటాం. ప్రాకుదామ్ అనుకునేవాడు ప్రాక లేడు. అది యావ. కూర్చుని మంచి పనులు చేస్తుంటే కీర్తి, కిరణముల వలె వ్యాపనం చెందుతూ ఉంటాయి. పుట్టపర్తి అనే కుగ్రామం India map లో ఎక్కడ లేదు కదా. అక్కడ కూర్చుని ఈ రోజున భూగోళమంతా తెలిసి పోయారు కదా. ఎట్లా తెలిసి పోయారు? Only through those who come and interact with him. అంతే కదా! అలా ఉంటుంది. ఎక్కడో ఏదో మారుమూల ఉండేవారు ప్రపంచమంతా అలా వ్యాపనం చెందడం ఒక మంచి కార్యం. అట్లా వ్యాపనం చెందడం, ఒక మంచి మనిషి యొక్క కీర్తి, ఆయన వెళ్లిపోయిన తరువాత కూడా ప్రపంచానికి తెలియడం. జీసస్ క్రీస్తు బోధలు చేస్తూ జోర్డాన్ నది ఒడ్డున తిరిగినది మహా అయితే విశాఖపట్నం జిల్లా అంత తిరిగి ఉంటారు. అంతకన్నా తిరగలేదు. ఆయనేం మొత్తం భూగోళమంతా పర్యటన చేసినవాడు కాదు. ఏం చేశారంటే మన గోదావరి నదిలాగా వాళ్లకో నది ఉంది. నది చుట్టూ కొన్ని గ్రామాలున్నాయి. ఆ చుట్టు పక్కలంతా కాస్త మంచి విషయాలు చెబుతూ వచ్చారు. ఆయన జీవిత చరిత్ర ఎప్పుడు record అయిందో తెలుసా? ఆయన వెళ్లిన మూడువందల సంవత్సరములకు record అయింది. ఏమిటి? ఎవరికి పని బడుతుంది? ఎందుకు చేస్తారు ఇదంతా అంటే ప్రకృతే చేయిస్తుంది. అన్నమాచార్య వారి కీర్తనలను వేటూరి ప్రభాకరశాస్త్రి గారి చేత బయటకి తీయించారు. దానికి సంబంధించిన చైతన్యం ఉన్నవారి ద్వారానే ఆ పనులు

జరుగుతుంటాయి, దర్శిస్తుంటారు. ఈ మొత్తం అంతా కూడా ఆకాశంలో ఒక ఒక రికార్డు గా ఉంటుంది. కాబట్టి సూర్యుని కీర్తి, కిరణముల ద్వారా వ్యాపనం చెందినట్లు మనిషి యొక్క మంచితనం వ్యాపనం చెందుతుంది. దాచడానికి వీలు లేదు. చెడు కూడా దాచడానికి వీలు లేదు. దాచానని వీడనుకుంటాడు. అది నెమ్మదిగా వ్యక్తమై పోతుంటుంది. ఎందుకంటే వాడి ముందు చెప్పరు గాని వెనక చెప్పుకుంటూ ఉంటారు. ఒకరి చెవులు ఒకరు కొరుక్కుని ఆయన వెళ్లిపోయిన తర్వాత బాహాటంగా చెప్పుకొని, ఇట్లా ఉంటాయి. అందుకని ఈ వ్యాపనం ఈ విధంగా జరుగుతుంది కాబట్టి కీర్తి కోసం ప్రత్యేకించి సూర్యుడు పరిగెడుతున్నాడా భూగోళంలోకి. గ్రహ గోళాదుల చుట్టూ శని గ్రహం నుంచి బుధగ్రహం వరకూ మధ్య బోలెడు గ్రహాలు తిరుగుతున్నాయి కదా! ఈ గ్రహాలన్నిటికీ వార్తలు ఎవరు తీసుకువస్తున్నారు? సూర్యకిరణములే కదా! తాను కదలకుండా ఉన్నాడు కదా! తను తిరిగేవాడు. ఎక్కువ చేయలేడు. తాను కూర్చొని అందరిని తిప్పగలవాడు ఎక్కువ చేయగలడు. రామకృష్ణుడు కూర్చున్నాడు. వివేకానందుని తిప్పాడు. తిరిగే వాడొకడుండాలి. అప్పుడు మనం కూర్చోవచ్చు. అలాగే కిరణములు, మరి ఆ కాంతి సెకండ్లలో ఈ భూమికి చేరి మన అందరికీ వెలుగునిచ్చి, ప్రాణాన్నిచ్చి ఏవేవో చేస్తున్నాయి కదా! భూమికి ధాన్యాన్నిచ్చి, ప్రాణాన్నిచ్చి, వర్షాన్నిచ్చి, ఎండనిచ్చి ఇవన్నీ చేస్తున్నాయి కదా! మరి ఇన్ని చేస్తున్నప్పుడు సూర్యునికి దండం పెట్టనివారెవరు? ప్రతి వాళ్ళూ సూర్యునికి దండం పెడతారు. అందుకని ఉన్న చోట కూర్చుని అక్కడి నుంచి కీర్తి వ్యాపనం చేయడం సూర్యుని దగ్గర నేర్చుకోవాలి. అంతేకానీ, భూమి మీదకి సూర్యుడు వచ్చాడనుకోండి భూమి మొత్తం మాడిపోతుంది. కేంద్రం వదిలి పరిధి నందు వ్యాపనం చెందేవాడు, తిరుగుతూ ఉండేవాడు. కేంద్రము నందు ఉండి అంటే, భగవత్ తత్త్వము నందు మనం ఉంటే మనకెప్పుడూ మంచి స్ఫురణే కలుగుతుంది. అవే మాటలు వస్తాయి. అవే చేతల్లో కనిపిస్తాయి. అవే మాటలు, అవే చేతలు వస్తున్నప్పుడు వాటికి వ్యాపన శక్తి ఉంటుంది. ఇతరులకు దానివలన స్ఫూర్తి, ఒక విధమైన కట్టుబాటు, దైవత్వంలోకి ఉద్ధరింపబడటం, ఇటువంటివన్నీ జరుగుతాయి. ఇవన్నీ 'భానుః' అనే భగవంతుని వలన జరుగుతున్నాయి. అది కేవలం సూర్యుడే అనుకోనక్కరలేదు. మనం కూడా సూర్యులమే. కొన్ని కోట్ల అంటే లెక్కలేనన్ని సంవత్సరముల తరువాత మనమంతా కూడా ఒక సూర్యుడవుతాము. ఇదీ తమాషా. మనం సూర్యుడు అయినప్పుడు,

మనలో ఉండే మేషం నుంచి మీనం వరకు మనలో ఉన్న భాగాలు ద్వాదశ భావాలుగా వ్యక్తమవుతాయి. మనలో ఉండే ఏడు కేంద్రాలు ఏడు గ్రహాలుగా వ్యక్తమవుతాయి. అట్లా అయిపోయే scheme ఉంది. ప్రతి అణువుని ఒక సూర్యుణ్ణి చేస్తాడు. ప్రతి సూర్యుణ్ణించి, ఇక అలా అంతు లేని కథ. భాను అనే పదానికి విజయ చేర్చి విజయభాను అంటారు. అక్కర్లేదు. ఉత్త భానే. మళ్లీ విజయ అని చేర్చనక్కరలేదు. తెలియకపోతే పెట్టుకోవచ్చు. సూర్యుడికి అపజయమంటూ ఎప్పుడూ లేదు. అట్లా వెలుతూ ఉండడమే. కిరణాలు అలా వెలుతూ ఉంటాయి. అదేవిధంగా మహాత్ములకు జయాపజయములు దాటిన స్థితి కనుక భాను అని పెట్టుకున్నామంటే ఇక్కడి నుంచి వ్యాపనం చెందుతూ ఉంటారు. సూర్యుడు సృష్టి ధర్మాలను ఆశ్రయించి ఉండడం వలన వ్యాపనం చెందాడు. మనం కూడా ధర్మములయందు ఎక్కువ ఆశ్రయం పొందినట్లయితే మనకి తెలియకుండానే కీర్తిప్రతిష్టలు పెరిగిపోతూ ఉంటాయి. కీర్తిప్రతిష్టలు పెంచుకుందాం అనుకుంటే తగ్గిపోతూ ఉంటాయి. అందుకని ఏదైనా ఒకటి చేయాలంటే దానికి రహస్యం ఇంకొక చోట ఉంటుంది. అక్కడ ఫ్యాను తిరగాలంటే కర్ర పట్టుకుని గిర్రున తిప్పితే కాసేపు తిరిగి అలాగే ఆగిపోతుంది. కీర్తిప్రతిష్టలను మనం వ్యాపనం చేద్దామంటే అలాగే ఉంటుంది. వీడు కొంతసేపు తిప్పుతుంటాడు. కొంతసేపు తిప్పితే ఏమవుతుంది? 4,5 రౌండ్లు తిరిగి ఆగిపోతుంది. మళ్ళీ తిప్పుకుంటుండాలి. మళ్ళీ ఆగిపోతుంది. మళ్ళీ తిప్పుకోవాలి. మరచిపోతుంటారు ప్రజలు. పెద్ద సభ ఏర్పాటు చేసి ఏ బీచ్ లోనో ఒక యాగం అని పెట్టి చేసాము అనుకోండి. ఆ కొంతసేపే. తరువాత గుర్తుండదు. రెండు సంవత్సరాలు మానేశాం అనుకోండి. వాళ్ళెవరో కూడా గుర్తు ఉండరు. అలా అక్కర్లేదు. ఏదో ఒక పాక వేసుకొని పదిమందికి పది పన్నెండు సంవత్సరాలు పరిపూర్ణంగా మంచి పని చేస్తే మనిషి పోయిన తరువాత కూడా అది శాశ్వతంగా నిలిచిపోతుంది. అది ధర్మం. అదీ ధర్మాన్ని ఆశ్రయించి ఉన్న వాడికి, తన తెలివితేటలను ఆశ్రయించుకున్నవాడికి తేడా. ధర్మాన్ని ఆశ్రయించి ఉన్న వాడి కీర్తిని ఎవరు ఆపుచేయలేరు. తొక్కే ద్దామనుకున్నా ఇంకా పెరుగుతూ ఉంటుంది. నిజానికి సరైన భక్తుడు లోకంలోకి వచ్చినప్పుడు మాటిమాటికి అతనిని తొక్కేస్తుంటారు. క్రీస్తుకు శిలువ వేశారు కదా! సోక్రటీస్ కి రెండు వేల ఏళ్ళ క్రితం సీసం పోసారు కదా! సీసం పోసేసి చంపేస్తే అతడితో పాటు అతడి philosaphy కూడా చచ్చిపోతుంది అనుకున్నారు. సీసం పోస్తే ఆయన శరీరం పోయింది గాని

ఆయన యశో శరీరం ఈనాటి వరకూ పాలిస్తూ ఉంది. ఎక్కడికి పోతుంది? కనుక తెలివి తక్కువ వాళ్ళు కీర్తిప్రతిష్టల కోసం పని చేస్తూ ఉంటారు. తెలివైన వారు ధర్మాన్ని ఆశ్రయించినందు వలన అప్రయత్నముగా కీర్తిప్రతిష్టలు వస్తుంటాయి. భాను అనే నామం వలన ఇవన్నీ మనం నేర్చుకోవాలి. Every center has such permeation including us. మనమే కాదు. ఏ center అయినా మొత్తం భగవంతుని రూపములైన అన్ని కేంద్రముల నుంచి వ్యక్తమవుతూనే ఉంటుంది. మన నుంచి మనం సూర్యునివలె తయారవాలంటే, సూర్యుడు ఎట్లా పని చేస్తున్నాడో మనం అట్లా పని చేయాలి. అందుకని ఆ విధమైన భావం భాను అని మనలో బాగా పడాలి. విష్వక్సేనుడు. వైష్ణవ సాంప్రదాయంలో ఏ కార్యం చేయాలన్నా ముందు విష్వక్సేనుని కొలిచి తరువాత విష్ణువుని కొలవడం ఉంటుంది. శైవులు గణపతిని, కుమారస్వామిని ఆరాధన చేసి శివుణ్ణి ఆరాధిస్తారు. Meet the sun and then through him meet the father. రాజకీయాల్లో కూడా అదే పని చేస్తుంది. Through the son కదా. అందరి దగ్గర అదే పని చేస్తుందేమో మరి. బహుశా అచటి నుంచి వీరు కాపీ కొట్టి ఉంటారు. శివ తత్వంలో చెప్పుకున్నప్పుడు, గణేశుడు, కుమారస్వామి. దక్షిణాదిన ఏ శివుని గుడికి వెళ్ళినా, ఏ పార్వతి అమ్మవారి గుడికి వెళ్లినా వీళ్ళిద్దరూ చెరో ప్రక్కన నిలబడి ఉంటారు. వీళ్ళిద్దరిని దర్శించి వెళితేనే లోపల దైవదర్శనం అవుతుంది. అదేవిధంగా వైష్ణవ సాంప్రదాయంలో విష్వక్సేనుడు, కుమారస్వామి గణేశుడు ఇద్దరూ కలిసిన ప్రజ్ఞగా ఉంటాడు. గణేశునితత్వం అమరిక. మొత్తం గణములన్నింటిని విభజన చేసి, అమర్చి సృష్టిని ఏర్పాటు చేయడానికి కావలసిన కార్యక్రమం గణేశుని పని. ఆ తరువాత సృష్టిని నడిపించడం కుమారస్వామి పని. He is the leader of armies. సైన్యములకు నాయకుడు. దేవతల సైన్యానికి నాయకుడు అంటారు. దేవతల సైన్యం అంటే సృష్టిలో ఉన్న ధర్మములు లేక ప్రజ్ఞలు, లేదా intellegences అంటారు. Intellegences అన్నింటినీ lead చేసేవాడు కుమారస్వామి. Intellegence గా ఒకే తత్వాన్ని విభజన చేసేవాడు గణపతి. కనుక ఒకరు విభజన చేసి అమరిస్తే, రెండోవాడు lead చేస్తూ ఉంటాడు. ఒకరు సలహాదారుగా, రెండవవాడు executive గా ఉంటారు. Advisory board and executive committee. రెండూ కలిసి పనిచేస్తూ ఉంటాయి. ఒకటి బ్రాహ్మణ ధర్మం అన్నారు. రెండవది క్షాత్రధర్మం అన్నారు. మనలో కూడా ఒక సంకల్పం ఏర్పడినప్పుడు ఎట్లా చేయాలో సలహా ఇచ్చేది బుద్ధి. ఆ

సలహాలో ఇంద్రియాలు, శరీరం చేత పని చేయించేది మనసు. ఇలా ప్రతిదానిలోనూ సిద్ధి, బుద్ధి అనే ప్రతీకలు భార్యలుగా గణేశుడు అమరిక చేస్తుంటే, కుమారస్వామి execute చేస్తుంటాడు. అందుకని కుమారస్వామిని క్షాత్రధర్మంగాను, గణేశుని బ్రాహ్మణ ధర్మంగాను చెబుతారు. అంటే బ్రహ్మ తత్వాన్ని అమరిక ప్రకారం విభజన చేస్తే దానిని అనుసరించి పనిచేసుకుంటూ పోతాడు. Architect ఒకరు. ఇంకొకరు engineer. Architect ఇంతింత కావాలని చెబుతాడు. దాని ప్రకారం schedule of materials తయారుచేస్తారు. ఆ తరువాత engineer గారు దానిని దగ్గర ఉండి కట్టిస్తుంటారు. ఒకరిని సాధ్యులంటారు. ఇంకొకరిని సిద్ధులంటారు.

## 133 విష్వక్సేనః

వేదసంప్రదాయంలో meadiating and policy making intelligences ని సాధ్యులంటారు. వాటిని సిద్ధింప జేసే వారిని సిద్ధులంటారు. అలా రెండు రకాలుగా ఉండే రెండు ప్రజ్ఞలను విష్వక్సేనుడు అనే ఒక తత్త్వంగా దర్శనం చేస్తారు వైష్ణవులు. ఈయన యందు ఏమి జరుగుతుందంటే భగవంతుని ప్రణాళిక ప్రకారం అమరిక ఒకటయితే, రెండవది ఆ అమరిక ప్రకారం దేవతలందరికీ నాయకత్వం వహించి lead చేసి సృష్టి ధర్మాన్ని నిర్వర్తింప చేయడం. కనుక విష్ణుమూర్తి దర్శనానికి వెళ్లాలంటే ముందు విష్వక్సేనుని యొక్క అనుగ్రహం కావాలి. రాముని దర్శనం కావాలంటే హనుమంతుని అనుగ్రహం ఉంటే జరుగుతుంది. కృష్ణుని దర్శనం కావాలంటే ఈ భూమి వరకు మైత్రేయుని అనుగ్రహం కావాలి. శివుని దర్శనానికి వినాయకుడవ్వచ్చు, కుమారస్వామి అవ్వచ్చు లేదా నంది. గరుత్మంతుని పట్టుకున్నా విష్ణుదర్శనం అవుతుంది. వాహనములు అంటారు వారిని. వాహనములు అంటే వాళ్ళ ద్వారా వీళ్ళు వ్యక్తమవు తారు. వీళ్ళ కంటూ ప్రత్యేకమైన రూపం లేదు. విద్యుత్ వ్యక్తమవాలంటే fan గాని, tubelight గాని ఏదో ఒకటి కావాలి కదా. ఉన్నది విద్యుత్తు. ఇవన్నీ వాహికలు. అంటే వాహనములు. భగవత్ తత్త్వాన్ని రకరకాలుగా దర్శించారు ఋషులు. కొంతమంది ఒక పద్ధతిగా దర్శనం చేసి వైష్ణవం అన్నారు. ఇంకొక చోట శైవం అన్నారు. ఇంకొక చోట శాక్తేయం అన్నారు. సూర్యుని పరంగా చెప్పిన వారున్నారు. ఎన్ని చెప్పినా భగవత్తత్త్వంలో మనకి వీళ్ళు దొరకాలంటే ఏదో ఒక వాహనం ద్వారా లభిస్తారు. అలా విష్ణువుకి విష్వక్సేనుడు commander in chief. విష్ణువు యొక్క కార్యక్రమములన్నీ execute చేస్తున్న తత్త్వాన్ని విష్వక్సేనుడు అన్నారు. విష్వక్సేనుడు కూడా విష్ణు నామాలలో ఒకటి. హనుమంతుణ్ణి కొలిస్తే రాముడు పలుకుతాడు. ఎందుకంటే హనుమంతునిలో ఉండేది రాముడు కాబట్టి. రాముణ్ణి ధ్యానం చేస్తే శివుడు పలుకుతాడట. శివుణ్ణి ధ్యానం చేస్తే రాముడు పలుకుతాడట. విష్ణువుని ధ్యానం చేస్తే శివుడు పలుకుతాడట. శివుణ్ణి ధ్యానం చేస్తే విష్ణువు పలుకుతాడట. విష్ణువుని ధ్యానం చేసిన వారందరికీ శివుడు పలికి తనలాగా ఏమీ మిగల్చకుండా ఒక ఆనందం అనే స్థితిని కలిగిస్తాడట. శివభక్తులకి సంపద వస్తుంది. విష్ణు భక్తులకి ఉన్నదంతా పోయి శాంతి ఒక్కటే మిగులుతుంది. ఇదంతా ఉన్నా లేకపోయినా

పరవాలేదన్న స్థితిలో పెడతాడు. విష్ణువును కొలిస్తే శివుడనుగ్రహిస్తాడు. శివుణ్ణి కొలిస్తే విష్ణువు తన యొక్క వైభవాన్ని అనుగ్రహిస్తూ ఉంటాడు. చాలామంది వైభవం కోసం శివుణ్ణి ప్రార్థిస్తుంటారు. వాళ్లకు తెలియదు శివుణ్ణి ప్రార్థిస్తున్నందువలన విష్ణువు అనుగ్రహిస్తున్నాడని. ఒకరిని ప్రార్థిస్తూ ఉంటే రెండవవాడు ఆయన సంగతి చూసుకుంటాడు. అట్లా వారి మధ్య understanding. విష్ణుని ప్రార్థిస్తే, శివుడితో చెబుతాడు వాడి సంగతి చూసుకోమని. ఉన్నవన్నీ తీసేస్తాడు. శివుడిలా తయారవుతాడన్నమాట! శివుడిలా తయార్తై విష్ణువుని తలుచుకుంటుంటాడు. ఎందుకంటే శివుడు విష్ణువుని తలచుకుంటుంటాడు. విష్ణువు శివుణ్ణి తలచుకుంటాడు. కనుక విష్ణువుని తలచుకున్నవాడెలా తయారవ్వాలి? శివుడిలా తయారవ్వాలి. విష్ణు ఇష్టమైతే శివుడిలా తయారవచ్చు. శివుణ్ణి తలచుకుంటే విష్ణువులా తయారవుతాడు. పురాణాలు అదే చెబుతాయి. శ్రీకృష్ణుడు కూడా అదే చెబుతాడు. నన్ను తలుచుకున్న వారికి మొత్తం తీసేస్తానంటాడు. నన్ను ఎవరైతే ప్రార్థన చేస్తారో వాళ్ల సకల విత్తాన్నీ నేను హరిస్తానంటాడు. పేరు హరి. చేసే పనులన్నీ హర. హరాయిం చేశాడన్నమాట. అది ఒక చిత్రమైన విషయం. ఆధ్యాత్మిక మార్గంలో సాధన చేసుకుంటున్న వాడికి శివుడికి, విష్ణువుకి తేడా ఉండదు. ఎందుకంటే అది ఒక అజ్ఞానం. ఒకసారి ఒక పద్ధతిలో చెప్పారు. ఇంకొకసారి ఇంకొక పద్ధతిలో చెప్పారు. అగ్ని అని చెప్పారు ఒక చోట. సూర్యుడని చెప్పారు ఇంకొక పద్ధతిలో. సూర్యుడు వేరు, అగ్ని వేరు అని అనుకుంటే ఎట్లా? అనుకోవచ్చా? అనుకుంటే అనుకునేవాడిది తప్పు తప్ప, సూర్యుడి తప్పు కాదు. అగ్నిది తప్పు కాదు. అదేవిధంగా శివుడికి విష్ణువుకి భేదం చూస్తే వాడు పరిపూర్ణమైన జ్ఞానం లోకి అడుగుపెట్టే అవకాశం లేదు. రెంటి యొక్క తత్వాలు త్రిగుణాత్మకమైన శక్తి లో వేరుగా కనిపించినప్పటికీ త్రిగుణాతీతమైన స్థితిలో బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు ఒకటే. అందుకని వీరి మధ్య భేదం చూసే వాళ్లంతా పిల్లకాయలని చెబుతారు. ఇక్కడ విష్వక్సేనుడి పేరు మనం ఎక్కువగా వాడము. ఎందుకంటే ఆంధ్రదేశంలో స్మార్తులు ఎక్కువ. అంటే ప్రత్యేకించి ఆంధ్రదేశంలో శివుడికి, విష్ణువుకి భేదం చూడరు. మనం ఆ విధంగా అనుగ్రహింపబడ్డాము. అందుకని ఇక్కడ తొందరగా ఎక్కువమంది మహాత్ములు తయారవుతుంటారు. శ్రీపాద శ్రీ వల్లభుడు దత్తాత్రేయుని అంశ. నరసింహ సరస్వతి, సత్య సాయి బాబా, Mater C.V.V., M.N., E.K. ఇలా చూస్తే

ఎక్కువ పక్షపాతం ఉందేమో తెలుగు వారి మీద అనిపిస్తుంది. ఎందుకంటే ఇక్కడ ఒక విధమైన సమన్వయ స్వభావం ఎక్కువగా కనిపిస్తుంది. విష్ణువుని ఆరాధించేవారు శివుణ్ణి ఆరాధించ రాదని, శివుణ్ణి ఆరాధించేవారు విష్ణువుని ఆరాధించరాదని భేదం ఇక్కడ ఉండదు. భేదం లేకపోవడం వలన మనం ఒక మెట్టు ఎక్కడం అవుతుంది. ఇక్కడ విష్వక్సేనుడు, కుమారస్వామి గణపతి ఇద్దరూ కలిసిన స్థితి. ఆయన కుమారస్వామి, గణపతి చేసే కార్యక్రమాలు రెండూ చేస్తుంటాడు. వినాయకుడు చేసే అమరిక, కుమారస్వామి వలే నాయకత్వం రెండూ చేస్తాడు. He is advisor who is in action. దానినే రాజర్షి అంటారు. సాధారణంగా రాజులుంటారు. ఋషులు సలహా ఇస్తుంటారు. రాజర్షి అయిపోతే వాళ్లకి వాళ్లే చేసుకుంటూ పోతుంటారు. సలహాలు అక్కర్లేదు. Two in one.

## 134 జనార్దనః

కాలము రూపములో జీవులను హరించే వాడిగా ఒక అవగాహన ఉంది. జనార్ధనుడు అంటే జనః +అర్దనః. జనార్దనః. జనులు అంటే జీవులు. అర్దన అంటే మర్ధించేవాడు, సంహరించే వాడు లేక వాళ్ళలో ఉన్న అసురత్వమును పారద్రోలి దైవత్వము నందు మేల్కాంచునట్లు చేసేవాడు. మనలో ఉన్న జ్యోతి స్వరూపానికి భిన్నమైన దానిని పారద్రోలే వానిని జనార్ధనుడని చెబుతారు. మనకి కేశవ నామాలలో కూడా 'మధుసూదనాయ నమః, జనార్దనాయ నమః' అని వస్తుంది. మధుసూదనుడు అంటే మధువనే రాక్షసులను సంహరించిన వాడు. సురత్వము అంటే మనలో ఉన్న ప్రజ్ఞాకేంద్రములు, సృష్టిలో ఉన్న ప్రజ్ఞాకేంద్రములు. సృష్టిలో ఉన్న ప్రజ్ఞాకేంద్రములు, మనలో ఉన్న ప్రజ్ఞాకేంద్రముల యొక్క దివ్య ప్రణాళికలను నిర్వహిస్తున్న సమయంలో వాటికి అడ్డు వచ్చే వాటిని సంహరిస్తుంటాడు. మొత్తం సృష్టిలో ఆదిత్యులు, రుద్రులు, వసువులు, అశ్వినులు, 33 కోట్ల దేవతలు అనగా 33 వేల 33 ప్రజ్ఞలు పనిచేస్తున్నట్లు పెద్దలు దర్శించి మనకి వివిధములుగా చెప్పి ఉన్నారు. ఇవన్నీ మనలో గాని, సృష్టిలో గాని భగవంతుని యొక్క చైతన్యమును ఆధారంగా చేసుకొని వర్తిస్తున్న ప్రజ్ఞలు. వాటి కార్యక్రమానికి, మనలో నడుస్తున్న ఈ ప్రజ్ఞల కార్యక్రమానికి భిన్నమైన పరిస్థితి ఏదైనా వచ్చినప్పుడు ఆ దివ్యప్రణాళికకు అడ్డుగా వస్తున్న దానిని దేనినైనా సంహరిస్తాడు. అంటే అసురులను పారద్రోలేవాడు. చీకట్లను పారద్రోలేవాడు. మనలో ఉన్న అపవిత్రతను పారద్రోలే వాడు. మన స్వభావంలో ఉన్న పరిమితత్వాన్ని పారద్రోలేవాడు. మనలో క్షుత్, పిపాస, మలములు అని మూడు ఉంటాయి. క్షుత్ అంటే ఆకలి. పిపాస అంటే దాహం. మలములు అంటే అపవిత్రత. ఈ మూడు మనసు, ఇంద్రియములు, శరీరముగా ఏర్పడి, దేహమును ఎల్లప్పుడూ అంటిపెట్టుకొని ఉంటాయి. అవి దేహంలో ప్రతినిత్యం ఏర్పడుతూ ఉంటాయి. వాటి వలన మన ప్రజ్ఞ యొక్క ప్రవాహం తగ్గిపోతుంది. తగ్గిపోతున్నందువలన దాని నుంచి సంకల్పములు వ్యక్తమవుతున్నపుడు అవి వికల్పములుగా మారుతూ ఉంటాయి. ఎందుకు మారతాయి అంటే అవి refraction చెందుతూ ఉంటాయి. సంకల్పం మంచిదే అయినా చేసేటప్పుడు అందులో నుంచి పొరపాట్లు వస్తూనే ఉంటాయి. మంచి సంకల్పాలతో పనిచేస్తున్న చోట రకరకములైన సమస్యలు తలెత్తడానికి మనసు,

ఇంద్రియములు, శరీరము ఈ మూడు కారణం. వీటితో తయారయిన దేహమునందు ఏర్పడిన అపవిత్రత కారణంగా సత్సంకల్పాలు వికల్పాలై వికారాలుగా తయారవుతాయి. తరువాత అందులో నుంచి సంకల్పములు పుట్టడం మాని నెమ్మదిగా దుస్సంకల్పములు పుట్టడం జరిగి వాటి వలన తనకి, పరిసరములకి ధర్మగ్లాని జరుగుతున్నప్పుడు, భగవంతుడు దిగివచ్చి దీనిని సరిచేయవలసిన కార్యక్రమం ఒకటి ఉన్నది. జనార్దన నామం దీనికి సంబంధించింది. శ్రీకృష్ణుని 'జనార్దన' అని పిలుస్తారు. విష్ణువుని 'జనార్దన' అని పిలుస్తారు. భగవంతుని నామములలో భగవంతుని యొక్క సంహార క్రియను తెలిపే నామమిది. సృష్టి అంతా అగ్నికార్యం కనుక మరణం ఏర్పడుతున్నది. అగ్నికార్యం జరిగేచోట బొగ్గుపులుసు వాయువు ఏర్పడుతున్నట్లే, చైతన్యము దేహముతో చేసే పరస్పర ఘర్షణ అనే అగ్ని కారణంగా పుట్టిన మలినములుంటాయి. ఈ మలినములు మూడు లోకములయందు వ్యాపించి ఉంటాయి. దానినే 'చీకటి' అని కూడా చెబుతారు. దానిని మనం సంహరించు కోవాలి. అంటే కుమారస్వామి యొక్క అవసరం వుంటుంది. అదే తారకాసురవధ. చీకట్లు కమ్మేసుంటే కుమారుడు సైన్యములను నడిపించి తారకాసురుని అంతం చేస్తాడు. అంతవరకూ దేవతలందరూ భయపడి ఉంటారు. ప్రజ్ఞలన్నీ చీకటి పడుతుంటే భయపడి పారిపోతున్న సందర్భం అన్నమాట. మనలో అపవిత్రత పెరుగుతున్న కొలదీ పవిత్రమైన భావముల యందు, కార్యములయందు ఒక రకమైన నిరాదరణ ఉంటుంది. నిర్లక్ష్యము ఉంటుంది. మంచి విషయములయందు విరాగము ఏర్పడుతుంది. పూజ చేసుకోవాలా? చేయకపోతే ఏం? ప్రార్థన చేసుకోవాలా? చేయకపోతే ఏం? ఎవరికైనా ఉపకారం చెయ్యకపోతే ఏం? చెయ్యాలని ఎక్కడ ఉంది రూలు? అని అడిగేవాళ్లు ఈ విధముగా సద్గుణములు యందు ఒక విధమైన వెటకారము, అశ్రద్ధ, వాటిపై విచికిత్స చేసే చోట మనసు వరకు మలినములు బాగా వ్యాపనం చెంది ఉంటాయని గుర్తించాలి. ఇంద్రియములు శరీరమునందు ఉండే మలినములను బట్టి సత్కార్యములకు అర్హత కోల్పోతుండటమనేది జరుగుతుంది. సత్సంకల్పములు పుట్టడానికి అవకాశం ఉండదు. అక్కడ పుట్టేదల్లా బొగ్గు పులుసు. Carbon మాత్రమే. అదే మనకి లోపల gas గా తయారవుతుంది. తయారై ఎటూపోదు. మనలోపలే మనల్ని తిప్పుతూ ఉంటుంది. ఊర్లో municipality పని చేయకపోతే compost అంతా ఊరినిండా చేరినట్లు మలినములు ఎక్కువగా

ప్రోగవుతాయి. ఆ పరిస్థితిలో ఊరు దుర్గంధంగా ఉందంటే ఊరి నుంచి వెళ్ళిపోవలసినట్లే. దేహం దుర్గంధమైనప్పుడు దేహం నుంచి వెళ్ళిపోవాలి. దేహం నుంచి వెళ్లి పోవడం అంటే ఆయా శరీర భాగాలలో పనిచేస్తున్న ప్రజ్ఞలు, దేవతలు ఇక్కడ మనకి స్థానం లేదని అక్కడినుంచి బయలుదేరి వెళ్ళిపోతారు. సంఘంలో మంచి వారిని అవమానించారనుకోండి, వాళ్లందరూ వెళ్ళిపోతారు. వెళ్ళిపోతే ఆ సంఘం పతనమవుతుంది. అది ఒక ధర్మం. ఆ విధంగా దేవతలు ఆయువు పట్లు అన్నీ వదిలేసినప్పుడు అనారోగ్యం బాధలు మొదలవుతాయి. అప్పుడు జీవుడు పడే బాధలు జనార్ధనతత్వం నుంచి వస్తాయి. అది మనల్ని శిక్షించే తత్వం. ఆహార విహారాదుల యందు జరిగే తేడాలనుంచి మనల్ని తప్పించడానికి తగు శిక్షణనిచ్చే తత్వం. Self balancing system. ఎక్కడికక్కడ మనని మనం రక్షించుకునే పద్ధతిలో బాధ కలిగి, ఆ బాధ నుంచి ఇటువంటి పనులు మరల చేయకూడదు అనే నిర్ణయానికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. ఒక మాట వలన గాని, ఒక చేత వలన గాని, ఒక నడత వలన గాని మనకి ఏర్పడుతున్న ఇబ్బందుల వలన మనమే మరొకసారి తప్పక ఆలోచించవలసి వస్తుంది. వాటిని సరిదిద్దుకుంటే సుఖపడతామని తెలుస్తుంది. ఆ విధంగా మనలో ఉన్న అసురత్వం తొలగింపబడుతుంది. సురత్వం లేక పోవడమే అసురత్వం. సురత్వం అంటే వెలుగుతో కూడుకున్నది. వెలుగులేని చోటుకి మరల వెలుగు తీసుకురావాలంటే చీకట్లను పారద్రోలాలి. చీకట్లో నిండి ఉన్న మనసు, ఇంద్రియములతో కూడిన శరీరమనే ఈ క్షేత్రంలో మరొకసారి వెలుగులు నింపాలంటే అంతకు ముందున్నవన్నీ తీసేయాలి. అంతకుముందు ఉన్నవన్నీ తీసేయడం అంటే మనకి వాటితో ఉండే రాగము, మమకారం తీసేస్తుంటే మనకి చాలా బాధాకరంగా అనిపిస్తుంది. హిరణ్యకశిపుడిలో ఉన్న దుర్గుణములను తీసేయడానికి లేదా అరిషడ్వర్గముల నిర్మూలనకి పూనుకోవడానికి ప్రహ్లాదుడు సంకల్పిస్తాడు. అలాగే రావణ కుంభకర్ణాది రాక్షసులలో కూడి ఉన్న అసురత్వాన్ని నిర్మూలనం చేయడానికి నారదుని రూపంలో దైవం పూనుకుంటూ ఉంటాడు. అసురత్వం పెరుగుతుంటే తానే దిగివచ్చి దానిని దమించి తద్వారా సృష్టిలో కాంతులను ప్రసరింపజేసి, ప్రజ్ఞను మళ్ళీ యధాతథంగా పని చేసేలా చూసేవాడు జనార్ధనుడు. మనలో కూడా జనార్ధన అనే తత్వమే శ్రీకృష్ణుడు గానో, విష్ణువు గానో ఏదో ఒక మూర్తిని ఆవాహనం చేసుకుంటే మనసు, ఇంద్రియములు, శరీరములో జరిగే ప్రకోపములు

కొంత శమిస్తాయి. ఎందుకంటే కాంతి వెంటనే వ్యాపనం చెంది మలినాత్మకమైన స్థితి నుంచి రక్షించే ఒక పద్ధతి ఈ జనార్దన నామంలో ఉంది. విష్ణు సహస్ర నామావళిలో కొలికి పూసల వంటివాటిని వెతికి తీసి కేశవనామాలుగా ఇచ్చారు. కేశవ నామాలన్నీ విష్ణు సహస్ర నామాలలో కనిపిస్తాయి. అందులో ముఖ్యమైనది జనార్దన నామం. జనార్దన నామం ఎవరికైనా ఉంటే భయపడాలి. ఎందుకంటే అది ఒక పద్ధతి. జనార్ధనుడేమి చేస్తాడంటే కాలం రూపంలో హరిస్తాడు. ఏమిటి హరిస్తాడంటే జీవులకుండే క్షరత్వమునకు సంబంధించిన సమస్తమునూ హరిస్తాడు. జీవుడు క్షరుడు కాదు. అక్షరుడే! జీవుడికుండే క్షరత్వమేమిటంటే తన స్వభావము. నామరూపాత్మకమైన జగత్తు నందు తను ఏర్పరచుకున్న మమకారం. వీటినుంచి జీవులను రక్షిస్తాడు. తరువాత ప్రళయకాలంలో జీవులందరిని కూడా హరించి తనలో లయం చేసుకుంటాడు. అంటే తిరిగి వెళ్ళే దారికి సంబంధించిన వాడు జనార్దనుడు. అలాగే స్థితి యందు దుస్థితి కలగకుండా రక్షించేవాడు జనార్దనుడు. ఈ తత్వం రామావతారంలో కనిపిస్తుంది. కృష్ణావతారంలో కనిపిస్తుంది. వామనావతారంలో కనిపిస్తుంది. భగవంతుడు దిగి వచ్చి రాక్షసుణ్ణి సంహరించిన ప్రతి సందర్భమూ నిజానికి వాడిని రక్షించడమే! కంసుణ్ణి, శిశుపాలుణ్ణి ఆ విధంగా రక్షించాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను ఆ విధంగా రక్షించాడు. వీరందరూ మొదట విష్ణు భక్తులే. ఈ రూపాల్లో దిగివచ్చే కారణమేదైనా వారు చేసిన నామస్మరణ నిరంతరమైనటువంటిది. కంసునికి జరిగిన స్మరణ, శిశుపాలునికి జరిగిన స్మరణ, హిరణ్యకశిపునికి జరిగిన స్మరణ ఎంత దూరం వెళ్లిందంటే భగవంతుడు దిగివచ్చి వారిని, వారి స్వభావం నుంచి ఉద్ధరించి తనలోకి లీనం చేసుకునేంత వరకూ జరిగింది. స్మరణలో అంత శక్తి ఉంది. మనకి fair weather లో స్మరణ అంతంత మాత్రమే జరుగుతుంది. ప్రతికూల సన్నివేశంలో స్మరణ ఎక్కువ జరుగుతుంది. అనుకూల సమయంలో జరిగిన స్మరణ కన్నా ప్రతికూల సమయంలో స్మరణ ఉద్ధృతంగా చేస్తాము. విద్యార్థులు పరీక్ష ముందు, మనమంతా కూడా కష్టం వచ్చినప్పుడు ఎక్కువగా ఆయన్ని పిలుస్తాం కదా! ఏదో ఒక విధంగా మనం ఆయన్ని పిలుచుకునేలా చేసి, తద్వారా మనలను ఉద్ధరించే తత్వం జనార్దన నామంలో ఉంది.

## 135,136 వేద:, వేదవిత్

ఈ నామానికి మనందరం వేదం వేదం అనుకుంటాము. వేద అనే పదానికి భగవంతుని యొక్క శ్వాస అని అర్థం. మొత్తం వేదం అంతా అదిట. భగవంతుని యొక్క ఒక ఉచ్ఛ్వాసము, ఒక నిచ్ఛ్వాసము. ఒక నిచ్ఛ్వాసము చేసినందువలన ఈ సృష్టి అంతా బయటకి వస్తుంది. ఆయన గాలి వదిలితే ఇన్ని కోట్ల జీవులు, ఇన్ని గ్రహగోళాదులు, ఇన్ని మండలాలు, భూమండలాలు, సూర్య మండలాలు, తేజో మండలాలు అన్నీ అంతరిక్షంలో ఏర్పడతాయి. గాలి పీల్చేస్తే మొత్తం అంతా లోపలికి వెళ్ళి పోతుంది. ఈయన వదలటం, పీల్చడం. దీనికి సంబంధించిన సమస్త విజ్ఞానాన్ని వేదమన్నారు. అనగా గ్రహగోళాదుల పుట్టుక, జీవుల పుట్టుక, ఇవి పుట్టక ముందు ఉన్న ప్రజ్ఞ యొక్క పుట్టుక మొదలైనవి. తన నుంచి వ్యక్తమైన ప్రకృతిలో, తన నుండి వ్యక్తమైన అగ్ని చేసే పరస్పర సంఘర్షణము వలన మొదటి త్రిభుజం ఏర్పడి, తద్వారా చతుర్ముఖుడు ఏర్పడి, చతుర్ముఖుడి నుంచి మరల త్రిభుజాత్మకమైన సృష్టి ఏర్పడటం, ఆ ఏర్పడేటప్పుడు ప్రకృతి నుంచి కొన్ని ధర్మములు పుట్టుకురావడం, అగ్నికి సంబంధించిన కొన్ని ధర్మములు పుట్టుకురావడం, ఈ రెండు ధర్మముల యందు తాను సాక్షీభూతుడై నిలబడి ఉండగా, అవి పరస్పరము వ్యక్తమవుతూ ఈ సృష్టినంతా తయారుచేయడం జరిగింది. ఈ మొత్తం అంతా ఏర్పడడం, వృద్ధి చెందడం, మళ్ళీ లయమవడం. దీనికి సంబంధించిన వివరములను వేదము అన్నారు. భగవంతుని నామములలో వేదము ఒక నామము. ఎందుకంటే ఆయనే ఈ అన్నిటిగా దిగి వస్తుంటాడు. ఆయన వృద్ధి పొందుతుంటాడు. ఆయనలోకే లయమైపోమంటాడు. ఆయనలోకే మొత్తం వెళ్ళిపోతుంది. ఆయనలో వృద్ధిచెంది, ఆయనలో ఒకటిగ ఏర్పడిన ఈ మొత్తం కథ, జగత్ కథలో ఉన్న అంశములు, వాటి క్రమము. అంటే ఇక్కడి నుంచి మద్రాస్ వెళ్ళి మళ్ళీ విశాఖపట్నం రావడానికి సంబంధించిన సమస్త వివరాలు మనకి తెలిశాయనుకోండి, ప్రతి చిన్న స్టేషన్ గురించి, దారిలో ఎటువంటి వారు ఎక్కుతారు, ఈ వివరాలను ఎప్పుడూ ప్రయాణం చేసేవారు చాలా సులభంగా చెబుతారు. స్టేషను లేకపోయినా ఇక్కడ ఆగుతుందని చెబుతారు. విశాఖపట్నం స్టేషనుకి వచ్చే లోగా ఒకసారి ఆగుతుంది. ఎందుకు ఆగుతుందో రోజూ ప్రయాణం చేసేవారికి తెలుస్తుంది. అప్పుడప్పుడు చేసేవారికి అంత తెలియదు. ఈ లోకంలో

ఉండే అవరోహణ, ఆరోహణ క్రమములకు సంబంధించిన సృష్టి ధర్మములు సమస్తమును అతి సన్నిహితముగా ఎరిగినటువంటి వారిని 'వేదవిదులంటారు'. ఈ మొత్తం కార్యక్రమాన్ని కలిపితే అది 'వేదం' అంటారు. దానిని నాలుగుగా విభజన చేశారు. ఋగ్వేదము, సామవేదము, యజుర్వేదము, అధర్వణవేదము. ఇందులో ఋగ్వేదం అంటే తన నుంచి వ్యక్తమవడం ఒక ప్రక్కన జరుగుతుంటుంది. ఒక స్థితి నుంచి మరియొక స్థితిలోనికి, మరియొక స్థితినుంచి ఇంకొక స్థితిలోనికి వ్యక్తమవుతూ ఉంటాయి. Utterance. Uttered forth. That which is uttered forth. దానిని ఋషభము అంటారు. ఆ విధంగా వ్యక్తమవడానికి సంబంధించినదంతా 'ఋగ్వేదం' అంటారు. ఆ వ్యక్తమవుతున్న దానికి background లో pulsating activity గా, స్పందనాత్మకమైన పద్ధతిలో తాళ లయాత్మకమైన చందస్సులను ఏర్పరుస్తూ, ఒక విధమైన rhythm ఏర్పరచే తత్వాన్ని 'సామము' అన్నారు. అందుచేత సామవేదం వింటే పాటలాగా ఉంటుంది. అలా ఒకచెవి పట్టుకొని రాగాలు తీస్తుంటారు. ఎడమ చెవి కొంచెం మూసి పాడుతూ ఉంటారు. ఎడమచెవి ఎందుకు మూస్తారు? ఎడమ చెవిలో నుంచి వారికి వినిపించాలి. ఇది జరుగుతున్నది. చోటులో ఒక గానం జరుగుతూ ఉంటుంది. ఆ గానం ప్రకారం శబ్దములు ఉత్పన్నం అవుతూ ఉంటే వాటి నుంచి సృష్టి వ్యక్తమవుతుంది. అందువలన ఋగ్వేదం ముందా? సామవేదం ముందా అంటే చెట్టు ముందా?విత్తనం ముందా అన్నట్లుంటుంది. ఏది ముందు అనే ప్రశ్న కాదు. అంతా ఒకటే. మనకి విభాగం చేశారన్న మాట. అవగాహనకి విభాగమే తప్ప వాటి మధ్య అటువంటి విభజన ఏమీ లేదు. లేకుండా కలిసి పనిచేస్తుంటాయి. మన అవగాహనకి ఆ విధంగా వర్గీకరించారు. తాళ లయాత్మకము, ఛందోబద్ధమైన గానముగా చోటులో ఉన్న దానిని ఎడమ చెవి నుంచి వింటాము. అంటే ఎడమ చెవికి వినే గుణం ఎక్కువ. కుడి కన్నుకి చూసే గుణం ఎక్కువ ఉంటుంది. ఇవి కొన్ని రహస్యాలు. ఈ దేహం పాంచజన్యమని చెబుతుంది. కుడి కన్ను 'సుదర్శన' మనే చక్రం ఉన్న వైపు ఉంది. మంచిని చూడమంటుంది. వినడానికి ఎడమచెవి బాగా పని చేయాలి. అది reverse అయితే ఇంకొక విధంగా ఉంటుంది. ఎడమ చెవి విష్ణుమూర్తి యొక్క శంఖం ఉన్న వైపు ఉంటుంది. శంఖంలో నుంచి శబ్దం వస్తూ, అందులో నుంచి ఉత్పన్నమవుతున్న గానం అంతర్వాహినిగా పని చేస్తుంటే, దాని ప్రకారం పైన కట్టుబాట్లన్నీ ఋగ్వేదం ప్రకారం జరుగుతుంటాయి. Utterance

సరిగా ఉండాలంటే మనలో కూడా శ్వాస ఉండాలి కదా! శ్వాస ఒక పద్ధతిగ జరుగుతున్నప్పుడు మనం అనుకున్న వాటిని చేయగలము. సంకల్పాలు వ్యక్తం అవడానికి సామం కావాలి లేదా శ్వాస కావాలి. దగ్గు వస్తుంటే మాట్లాడలేము. దగ్గ వలసిందే. అంటే శ్వాసకి ఏదైనా అడ్డు వస్తే దగ్గు వస్తుంది. శ్వాసకి అడ్డు వచ్చినట్లే సామమునకు అడ్డు వస్తే ఋక్ లేదు. There is no ruk if Sama is in disturbance. అందుకనే సామమనేది ఋక్కులకు అంతర్గతమైన ప్రవాహంగా పనిచేస్తుంది. అనగా నదీ ప్రవాహం లాగా ప్రవాహం ఉంటే దానిమీద ఎన్ని కార్యక్రమములైనా చేయవచ్చు. ప్రవాహమే లేదనుకోండి, ఏమి చేస్తారు? ఆ ప్రవాహాన్నే సరస్వతి అన్నారు. ఆ ప్రవాహం ఉండబట్టి, దాని మీద నుంచి అట్లా జీవులన్నీ, కాగితం పడవలు చేసి నీటిలో వదిలినట్లు బ్రహ్మ నుంచి జీవులు అలా చక్కగా సాగి వెళ్లిపోతుంటారు. ప్రవాహం లేకపోతే సాగి వెళ్లక, ఎక్కడ పుట్టిన వాళ్ళు అక్కడే పోగై ఉండి పోవాలి. ఈ సాగి వెళ్లడం అనేది, అణువు నుంచి అణువుకు అట్లా చోటులో కదలిక ఒకటి ఏర్పడుతుంది. గమనము ఏర్పడుతుంది. ఆ విధమైన గమనాన్ని ఏర్పరచే ప్రజ్ఞగా మనలో కూడా ఆ గమనం ఉంది. అది ఉండబట్టే ఎక్కడో పుట్టిన సంకల్పం భాషగా మారి మనకి వ్యక్తమవుతుంది. లేకపోతే వ్యక్తం కాదు. శ్వాస లేకపోతే వ్యక్తం చేసేది ఏదీ లేదు. ఇలా సంకల్పం వ్యక్తమవుతున్నప్పుడు దానిని ఏ విధంగా నిర్వర్తించాలి అనేది మరొకటి వస్తుంది. ఒకటి అనుశ్రుతముగా, నిరంతరము వ్యక్తమవుతున్న ప్రణాళిక. అదే ఋక్ ఋగ్వేదం. దానికి సంబంధించిన జ్ఞానమంతా ఋగ్వేదమవుతుంది. ఎట్లా వ్యక్తమవుతుంది? వ్యక్తమవడానికి వెనకాల ఉన్న ఈ ప్రవాహం యొక్క తీరుతెన్నులు ఏమిటి? ఈ ప్రవాహం నుంచి బయటకి వ్యక్తమవుతున్న దానిని ఏ విధంగా work out చేయాలి? అనగా plan of work. ప్రణాళిక. అంతకుముందు సామవేదాన్ని song of breath అంటారు. అంతకుముందు ఋగ్వేదాన్ని utterance expression అంటారు. ఈ expression కి ఒక భాషకు సంబంధించిన గానంగా ఒకరు work out చేస్తూ ఉంటే, దానిని plan out చేసేది ఇంకొకటుంది. దానినే యజుర్వేదమన్నారు. యజుర్వేదం అంటే ఏ విధంగా చేయాలో know how అన్నమాట. మన దైనందిక జీవితంలో వీటినన్నింటిని మనం చూస్తూనే ఉంటాము. దాని పరిధి నాలుగో స్థితిగా చెబుతారు. ఇలా నాలుగు విధాలుగా వ్యక్తమవుతున్న దానిని నాలుగు రకములుగా చూడగలిగి,

మరల పగలగొట్టే పద్ధతులు ఏర్పడి, మరల తిరోగమనం చెందాలంటే దానికి కొంత breaking process ఉంటుంది కదా! అవన్నీ అధర్వణ మంత్రాలు. ఇవి అధర్వణ వేదం లోనివి. ఇలా నాలుగు విధములుగా సృష్టి వ్యక్తమవడం, దానికి అంతర్వాహినిగా ప్రవాహముండటం, దానిని ఆధారంగా పెట్టుకొని ఒక పద్ధతి ప్రకారం సృష్టి ఏర్పడడం, ఏర్పడిన సృష్టి మరలా తిరోధానం చెంది భగవంతుని దగ్గరకు చేరడం. ఈ సమస్తానికి సంబంధించిన శాస్త్రం వేదం. కనుక వేదమనేటపుడు ఆయనే వీటన్నిటిగా తయారవుతున్నాడు. మననించే, మనమే శ్వాసగా వ్యక్తమై, మనమే మన సంకల్పంగా వ్యక్తమై, మన సంకల్పములను నిర్వర్తించడానికి మనమే ఒక ప్రణాళికను ఏర్పరచుకుని ఆ ప్రణాళిక ప్రకారం మనమే పని చేస్తుంటాము. So we are sacrificed on a minute to minute basis to that which he is expressed out of us. మనం చేసే పనులన్నింటికీ మనమే పెట్టుబడి. మనని మనం పెట్టుబడిగా పని చేసుకుంటూ ఈ మొత్తం లోకి వ్యాపనం చెందుతూ ఉంటాము. అలాగే భగవంతుడిని పెట్టుబడిగా, దేవతలు ఈ సృష్టి యజ్ఞాన్నంతా చేశారని చెబుతారు. 'తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్' చేసిన యజ్ఞంలో పుట్టిన జలములను వెదజల్లితే మండలాలు మండలాలుగా ఇవన్నీ ఏర్పడ్డాయి. కనుక ఈ వేదమునకు సంబంధించిన వర్గీకరణని క్లుప్తంగా చెప్పడం జరిగింది. మనలో వీటిని దర్శించాలి. సామవేదాన్ని మన శ్వాసగా, పుట్టే సంకల్పాన్ని ఋగ్వేదంగా దర్శించాలి. How systamatic in our plan of work, how do we plan our work. దానిని యజుర్వేదంగా దర్శనం చేయాలి. అలా దర్శనం చేసి ఈ మూడు వేదాలతో పని చేస్తుంటే మనకి ఒక రకమైన త్రిభుజం ఏర్పడుతుంది. ఆ త్రిభుజం మధ్య నుంచి దూసుకు వెళితే వేదంలో నిలబడతాము. త్రిగుణాత్మకమైన సృష్టికి అతీతంగా ఉన్నవాడు భగవంతుడు. దానికి అటుండే వాడిని దేవుడంటారు. ఇటుండే వాడిని జీవుడంటారు. మనం ఉండగా మన నుంచి ఒక సంకల్పం ఏర్పడితే మనమే మన సంకల్పంగా మారతాము. అందులో ఉన్నది మనమే, 'ఏకో నారాయణో హరిః' అన్నట్లు. ఉన్న వాళ్ళం ఉన్నట్లు ఉండం కదా! ఒక సంకల్పం వస్తుంది. అది ఆవిడ. అమ్మవారంటే సంకల్పం. మన అమ్మవారు మనకున్నది. ఆయన అమ్మవారు ఆయనకున్నది. ఆయనకి అమ్మవారు ఉండడం బట్టి మనకీ అమ్మవారు ఉన్నది. ఆయనకి లేనిది మనకి ఉండదు. అమ్మ వారి నుంచి వచ్చే సంకల్పాలను సిద్ధి పొందాలనే కార్యక్రమం మూడుగా దిగి

వస్తుంది. అంటే మనమున్నాం, ఉండబట్టి మనకొక సంకల్పం వచ్చింది, సంకల్పాన్ని ఏ విధంగా పరిపూర్తి చేసుకోవాలనే plan వస్తుంది కదా! ఈ మూడే మొదటి మూడు. మనమే మూడూ అయిపోయాం. మనం మనంగా ఉండక మనలో నుంచి సంకల్పం వచ్చి, సంకల్పాన్ని నెరవేర్చుకోవాలనే know how వచ్చి అందులో నుంచి మనమే దిగివచ్చి కిందికి వెళ్తామన్నమాట. క్రిందికి వెళ్లి work out చేస్తూ ఉంటాము. అంటే ఏమిటి? త్రిగుణముల నుంచి దిగి వస్తుంటాయి. అందుకని ఈ మూడూ ఎప్పుడూ ఉంటాయి. ఈ మూడింటికి అవతల ఉన్న వాడిని త్రిగుణాతీతుడంటారు. అమ్మవారి నామాల్లో 'త్రిగుణాతీత' అనే నామముంది. ఎందుకంటే ఆమె రెండవది. మూడు కాదు. ఆయన ఒకటి అయితే రెండు ఆమె. మూడు సంగతి ఆ తరువాత కాబట్టి అయ్యవారు, అమ్మవారు త్రిగుణములకు అటువైపు ఉంటారు. త్రిగుణములకు ఇటువైపు ఉన్నవారంతా జీవులు. ఈ జీవులు ఆ దేవునిగా తయారవ్వాలంటే, ఈ మూడింటి యొక్క సమన్వయము బట్టి ఉంటుంది. మనలో ఉండే ఉఛ్వాస నిఛ్వాసములకు సంబంధించి తాళలయాత్మకమైన, ఛందోబద్ధమైన దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగము కలుగని జీవన సరళిని ఏర్పరచుకోవడం, అంటే మాటిమాటికి కోప్పడటం, ఆవేశపడటం, ఆదుర్దాపడటం, కంగారుపడటం, భయపడటం ఇటువంటివన్నీ చేస్తుంటే సామవేదానికి దెబ్బ తగులుతుంది. ఇంటి పేరు సామవేదం వారు అన్నా ప్రయోజనం లేదు. భయం ఎక్కువైపోతుంటే ఊపిరి మీద, శ్వాస మీద దెబ్బ కొడుతుంది. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు ఆరూ అంతే. శ్వాస కున్న ఛందస్సును, రాగాన్ని, తాళాన్నీ దెబ్బతీస్తాయి. వాటిని దెబ్బ తీస్తే చాలు మిగతాదంతా గబగబా దెబ్బలు తగులుతూ ఉంటాయి. కనుక మన జీవన సరళిలో వీటికి అవకాశము లేని స్థితికి ఎదగాలి. తరువాత సంకల్పములు. సంకల్పములను బట్టే వస్తుంటాయి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు, రాగద్వేషాలు. ఇవన్నీ సంకల్పాల్లోంచి వస్తుంటాయి. సంకల్పంలో ఉండే అపవిత్రతను బట్టి వస్తుంటాయి. పవిత్రత ఉన్నచోట ఇవి ఉండవు. పవిత్రమైన సంకల్పం ఉన్నచోట భయానికి తావు లేదు. కోపమునకు తావులేదు. అసూయకు తావులేదు. వేటికీ తావులేదు. ఎందుకు తావులేదంటే సంకల్పాలు బాగున్నాయి కాబట్టి. మనలో పుట్టే సంకల్పాలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటే మనలో ఋగ్వేదం ఏ విధంగా పనిచేస్తుందో తెలుస్తుంది. సంకల్పాలు బాగుంటే ఋగ్వేదం బాగుంటుంది. ఋగ్వేదం బాగుంటే ఉఛ్చారణ బాగుంటుంది.

ఉచ్ఛారణ బాగుంటే వ్యక్తత చక్కగా ఉంటుంది. ఎంత పవిత్రము లైన సంకల్పములు ఉన్నా, మన వద్ద ఎంతటి చక్కటి సామమున్నా, ఎలా చేయాలో తెలియక పోయినా దెబ్బ తగులుతుంది. కనుక ఎలా చేయాలి? అనే జ్ఞానాన్ని యజుర్వేదమంటారు. Know how. కనుక ఇది తెలిసి ఉండి, సంకల్పములు పవిత్రములైవుండి, జీవన సరళియందు శ్వాసకు ఏ విధమైన భంగమూ కలగని రీతిలో జీవించేవారు ఈ మూడు భుజములనూ చక్కగా నిర్మాణం చేసుకుంటారు. వీటినే మూడు సమిధలుగా చెబుతారు. అమ్మవారి పరంగా చెప్పినప్పుడు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా అని మూడు శక్తులుగా చెబుతారు. బ్రహ్మ, విష్ణు మహేశ్వరు లనే త్రిమూర్తులుగా చెబుతారు. రజస్సు, సత్వము, తమస్సు అనే మూడు గుణాలుగా చెబుతారు. ఎన్ని రకాలుగా చెప్పుకున్నా ఉన్నవి ఈ మూడే. ఈ మూడింటి నిర్మాణం బట్టి అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు రాకపోకలు బాగుంటాయి. అంటే దేవునికి జీవునికి మధ్య సంబంధములు బాగుంటాయి. ఈ త్రిభుజం ఏర్పడనిచో అవి దెబ్బతింటుంటాయి. ఆయన అటుండిపోతాడు. మనం ఇటుండిపోతాం.మనం ఇటు నుంచి పిలిస్తే ఆయనకు వినబడదు. ఆయన ఏదైనా చెబితే మనకి వినబడదు. అదే అంటుంటారు. నేను ఎప్పుడూ కనబడుతూనే ఉంటాను మీరు చూడరు, నేను ఎప్పుడూ వినబడుతూనే ఉంటాను మీరు వినరు అని. నిజం అది. ఈ త్రిగుణములను సరిగ్గా మననం చేసుకోకపోవడం వలన ఏర్పడే స్థితి అది. జీవుని స్థితి త్రిగుణములచే తన్ను తాను బంధించుకున్న స్థితి. ఎవరో బంధించరు. మనమే బంధించు కుంటాం. బంధించుకొని ఎవరో బంధించారని ఏడుస్తుంటాం. ఎవరో కాదు మనమే అని తెలియడం మొదటి జ్ఞానం. మనకుండే సమస్యలకి, మనమే చాలా expertise తో కాళ్లు చేతులు కట్టేసుకున్నామని తెలుసుకోవాలి. ఇంకొకరు కట్టేసారు అనుకునేటప్పుడల్లా ముడులు విడువవు. మనమే కట్టేసుకున్నాము. మన దగ్గరే ఉంది ఇదంతా. అందరూ బాగుంటే మనకెందుకిట్లా ఉంది? అంటే మన పద్ధతిలో ఎక్కడో తేడా ఉంది. ఆ procedure లో తేడా సంకల్పంలో ఉండవచ్చు. లేదా execution లో ఉండవచ్చు. మన భారతదేశంలో పెద్ద సమస్య ఏమిటంటే సంకల్పములు పెద్దపెద్ద ఆశయములతో చాలా వస్తుంటాయి. అది ప్రత్యేకించి మనకి ఇవ్వబడిన వరం. కేవలం భూమినే కాదు సూర్యమండలాన్నంతా ఉద్ధరించే సంకల్పాలు వస్తూ ఉంటాయి. కానీ వాటిని నిర్వర్తించవలసిన చోట చాలా పెద్ద failure. అంటే know how లేదు. Initiation ఉంది. ఒక మంచి advisory

board ఉంది. కానీ executives లేరు. అందరూ సలహాలు ఇవ్వగలరు. ఎవ్వరూ ఏమీ చేయలేరు. మానవజాతిలో ఇంట్లో పెద్దాయన వంటి వాళ్ళం. తాత, తండ్రి, తను ఉన్న పరిస్థితుల్లో తాత ఏమి చేస్తాడు? ఎట్లా చెయ్యాలో చెప్పగలడు కానీ చెయ్యలేడు. అలా ఉంటుంది మన పరిస్థితి. సంకల్పముల వరకు మనకేమీ లోటు ఉండదు. కూర్చొని ఎంత పెద్ద సంకల్పం అయినా చెయ్యగలం. కానీ దానికి రూపాన్ని ఇవ్వడం మనకన్నా పాశ్చాత్యులకే ఎక్కువ తెలుసు. ఊర్ధ్వలోకముల నుంచి సంకల్పములను నిర్వర్తింపజేయగల శక్తి సామర్థ్యాలు సామాన్య జీవులకు తక్కువ. Average oriental. తూర్పు దేశాల వాళ్లకి సంకల్పములను నిర్వర్తింపజేయగల శక్తి సామర్థ్యాలు చాలా ఎక్కువ. అందుకని వాళ్ళు, మనం ఈ రెండు aspects కలిస్తే మొత్తం భూమి మీద ఉన్న మానవజాతి అంతా ఉద్ధరింపబడుతుంది. అదే fusion of East and West. ఏదో మన నమ్మకాలు వాళ్ల మీద రుద్దేయడం fusion అనుకుంటే పొరపాటు. Our idealogy and their capacity to execute. ఈ రెండూ కలవాలి. అప్పుడు East and West fusion అవుతుంది. అలా అయితే మానవజాతి ఉద్ధరింపబడుతుంది. మానవజాతి ఉద్ధరింపబడితే భూమి ఉద్ధరింపబడి భూమికి బరువు తగ్గుతుంది. మనం బాగుంటే మన తల్లిదండ్రులు కాస్త హాయిగా ఉంటారు. మనము కొట్టుకోకపోతే వీళ్ళు ఇన్నాళ్ళకి హాయిగా ఉన్నారని హాయిగా ఉంటారు. మన బరువు వాళ్ళకి తగ్గినట్ల వుతుంది. అట్లా భూమి బరువు తగ్గుతుంది. ఈ పద్ధతులన్నీ తెలిసిన వారిని 'వేదవిదులు' అంటారు.

'వేదవిత్' అంటే ఈ సృష్టి ఏ విధంగా అవరోహణ క్రమంలో దిగి వస్తుంది? ఆరోహణ క్రమంలో మరల భగవంతుని దగ్గరకు ఏ విధంగా చేరుకుంటుంది? ఈ మొత్తాన్ని పైన చెప్పిన చతుర్ వర్గములుగా అవగాహన చేసుకున్నవారు, వారెవరైనా, వారి రూపంలో భూమి మీద నడుస్తున్నది భగవంతుడు. వారి రూపంలో వస్తాడు. అందుకనే భగవంతుడు కనబడితే గురువవుతాడని అంటారు. గురువవుతాడంటే మనకి ఆయన గురువవడం కాదు. ఆయన భగవంతుడే. ఆయన్నుంచి సలహా సంపత్తులు పొంది తమను తాము ఉద్ధరించుకొనేవాళ్ళుంటారే వాళ్ళకి ఆయన దేవుడే! రహస్యం ఏమిటంటే మనం భగవంతుడ్ని బాగా ప్రార్థన చేస్తున్నామనుకోండి, ఎందుకైనా చెయ్యవచ్చు. ఆర్తితో

చేస్తుండవచ్చు. కష్టాలు వచ్చినప్పుడు చేస్తుండవచ్చు. అర్థం కోసం చేస్తుండవచ్చు. చతుర్విధ భక్తులు జిజ్ఞాస కొద్దీ చేస్తుండవచ్చు. ఏమిటిదంతా? ఎందుకిట్లా ఉండాలి? ఇంకొక పద్ధతిలో ఎందుకుండకూడదు? అని మొదలు పెట్టినవాడు జిజ్ఞాసువు అవుతాడు. అవి కావాలి, ఇవి కావాలని, అవి ఆయన దగ్గర దొరుకుతాయని తెలిసి వచ్చే అర్థార్థి ఒకడుంటాడు. ఆర్తితో ఒకడు వస్తుంటాడు. నాలుగో వాడు స్వతహాగా తెలిసినవాడు. వీళ్ళు ముగ్గురూ భగవంతుని గురించి ఆర్తనాదాలు చేస్తుంటే, తెలిసినవాడుగా తనే భూమి మీద తిరుగుతుంటాడు. వచ్చి సన్నిహితత్వాన్నిచ్చి మార్గాన్ని చూపిస్తూ ఉంటాడు. అంటే దేవుని ప్రతినిధులుగా భూమి మీద తిరిగే వారిని గురువులంటారు. మనం దేవుని పిలవడం వలన వాళ్ళు మన దగ్గరకు వచ్చి దేవుణ్ణి చేరే మార్గాన్నిస్తారు. అటువంటి మార్గాన్ని ఇచ్చినవాడు గురువు. మార్గమేమీ లేకుండా ఒక విధమైన ఆవేశంలో జీవింపజేసేవాడు గురువు కాదు. 'కుంభినీధవుడు చెప్పెడు గురువు గురువన్నాడు' ప్రహ్లాదుడు. రెండు రకముల గురువులున్నారు. ఒక రకం గురువులు అందరూ తమకి లోబడి ఉండేలా చేసుకుంటూ ఉంటారు. రెండవ రకం గురువులు భగవంతునికి లోబడి ఉండడానికి మార్గాన్ని చూపించేలా ఉంటారు. కాబట్టి ఈ వేదవిదులందరూ భగవత్ తత్వమే. నామరూపాత్మకమైన జగత్తులో నామమును, రూపమును ధరించి తిరుగుతూ ఉంటాడు. కాబట్టి వాళ్ళని కూడా భగవంతుడిగా గుర్తించాలి. దేవుని ప్రార్థన చేసే వాళ్ళకి దేవుడు ఒక గురువును పంపిస్తాడన్నమాట. అందుకనే గురువును మనం వెతుక్కుంటూ వెళ్ళనక్కర్లేదు. గురువే మనలను వెతుక్కుంటూ వస్తాడు. అలా అని మన సాంప్రదాయంలో చెబుతారు. గురువు ఎందుకు వెతుక్కుంటూ వస్తాడంటే నీలో ఉన్న జిజ్ఞాసను బట్టి. నీలో ఉన్న need ను బట్టి. Requirement ను బట్టి వస్తుంటాడు. ఆ వచ్చిన వాడిని నిర్లక్ష్యం చేస్తే వేరొక కథ వస్తుంది. పంపించిన వాడిని మనం అశ్రద్ధ చేసామనుకోండి, చేస్తే అక్కడ నుండి మనకి ఎంత మొత్తుకున్నా మళ్ళీ ఇంకొకసారి రారు. అంతకుముందు పంపిస్తే మేకులు కొట్టి పంపారు కదా! మళ్ళీ నేనెందుకు పంపిస్తాను? అన్నట్లుంటుంది. మహాత్ములు మన మధ్య తిరుగుతున్నప్పుడు మన కర్తవ్యం ఏమిటంటే ఆయనకి మనం ఉపయోగపడగలగాలి. ఆయన మనకి ఉపయోగపడటానికి అన్ని విధాలా సంసిద్ధుడై ఉంటాడు. మనంతట మనం ఆయనకి ఉపయోగపడడంలో మనం ఉద్ధరింపబడటం ఉంటుంది. మనం ఆయన్ని ఎట్లా ఉపయోగించుకుందాం అన్న దాంట్లో ఉన్నది

పతనం. జీవుల స్థితిని బట్టి, అర్హతను బట్టి గురువు వచ్చి సాన్నిధ్యము నిచ్చి మార్గమును చూపుతాడు. ఇలా మార్గమునిచ్చే గురువు సర్వశక్తిమంతుడు. వాడుకున్నాం అనుకోండి, యాదవులు అలా వాడుకున్నారు. యాదవులేమిటి? వెధవలందరూ వాడుకుంటూనే ఉంటారు. వెధవలు వాడుకుంటుంటే ఇంకొంచెం ఎక్కువ వెధవలై పోతుంటారు. ఎందుకంటే ఆయన భగవంతుని యొక్క ఆదేశం మేరకు వచ్చి మనమధ్య మెదులుతూ ఉంటాడు. భగవంతుని యొక్క దర్శనము, స్పర్శనము, సారూప్యము, సాన్నిధ్యము వీటిని ఇవ్వడానికి, ఇవన్నీ పొందే పద్ధతులివ్వడానికి వస్తాడు. వచ్చిన వాడిని అది తప్ప మిగిలిన వాటిని అడుగుతుంటే, ఆయన ప్రేమమూర్తి, కరుణామూర్తి, అవడం వలన అడిగినవన్నీ ఇస్తూ ఉంటాడు. కానీ మనం పాడై పోతాము. అడిగినవన్నీ పిల్లలకిస్తుంటే పిల్లలు పాడైపోరూ? అంతేకాక పూర్తిగా వాడుకొని, అపవాదులు ఏవేవో వేసి, ఎంతోమంది మహాత్ములను ఈ సమాజం శిలువ వేసింది. కొంతమందికి సీసం పోసింది. మరి కొంతమందిని హత్యలు చేశారు. మరి కొంతమందిని ఊళ్ళో నుంచి వెళ్ళగొట్టారు. ఇలాగే మహాత్ముల జీవితాలుంటాయి. ఎందుకంటే వాళ్ళేదో మనకి మంచి చేద్దామని భగవంతుని ఆదేశం మేరకు మన వద్దకు వస్తారు. వాళ్ళు స్వంతంగా వీళ్లందరినీ ఉద్ధరిద్దామని రారు. వారికా కార్యక్రమము లేదు. ఎందుకంటే వాళ్ళున్నది భగవంతుని యందు. భగవంతుడు వారియందు ఉంటాడు. ఉన్నప్పుడు, 'నాయనా! నా వాళ్ళు కొంతమంది అక్కడ ఉన్నారు, వాళ్ల సంగతి కాస్తచూడు' అని పంపిస్తాడు. వచ్చి తన సర్వస్వమును వాళ్లకి ధార పోస్తాడు. ఎందుకని? భగవంతుని యొక్క ఆజ్ఞ కాబట్టి. ధారపోసినపుడు మనం నిజంగా ఉద్ధరింపబడాలంటే, మనం చేయవలసిందేమిటంటే వచ్చిన వానికి ఉపయోగపడాలి. వచ్చిన వానిని ఉపయోగించు కొనకూడదు. హిమాలయముల ఆశ్రమంలో ఉన్న ఒక వాక్యం ఏమిటంటే, ఒక కుమారుడు తండ్రిని అడుగుతాడు, Father how should we make use of the teacher?( మనం మన teacher ని లేదా గురువుని ఏ విధంగా ఉపయోగించుకోవాలి?) అప్పుడు తండ్రి సమాధానం usefull to him అన్నాడు. How to use అంటే being usefull itself is a use అన్నమాట. నిజంగా వాడుకొనడం అంటే ఆయనకి ఉపయోగపడటం వలన సరిగ్గా వాడుకున్న వాళ్ళము అవుతాము. ఆయనకి ఉపయోగపడకుండా మనకి ఆయన్ని ఉపయోగించుకుంటే సరైన వినియోగము లేక

ఒక అవకాశము దాటి వెళ్లిపోతుంది. మరల వెతుక్కోవాలి. దీనికి సంబంధించిన కథే భాగవతంలో ఉంది. ఇంద్రుడు రాక్షసుల బారి నుంచి రక్షింపబడి, fresh గా సింహాసనాసీనుడై ఉంటాడు. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ మొదలైన నర్తకీమణులు నృత్యం చేస్తూ ఉంటారు. అంతా వైభవంగా ఉంటుంది. ఎందుకంటే reappointed వాడు. అంతకుముందు పదవిపోయిన వాళ్ళు మళ్ళీ పదవిలోకి వస్తే ఎలా ఉంటారు? ఆయన పదవిలోకి రావడానికి కారణం గురువు ఇచ్చిన ఆశీర్వచనమే. భగవంతుడు గురువు రూపంలో వచ్చి ఆశీర్వదిస్తే, ఎక్కడైనా కూర్చోవచ్చు. ఇక్కడ అక్కడ అని లేదు. తను ఇంద్ర సింహాసనం మీద కూర్చోడానికి ఎవరైతే కారణభూతులో ఆయన సభలోనికి వస్తే, చూసి కూడా చూడనట్టుగా ఉండిపోతాడు. లేచి నిలబడడు. నమస్కరించడు. ఆసనం చూపించడు. చూపించకపోతే బృహస్పతి 'ఓహో మనవాడు otherwise busy' అనుకొని వెళిపోతాడు. ఆయన వెళ్లిపోయిన మూడు నిమిషాలకి, అనగా ఒక ముహూర్త కాలానికి ఇంద్రుడికి పొరపాటు చేశాననిపిస్తుంది. ఉన్నప్పుడు ఇంద్రియాలు వెలగలేదు. వెళ్ళిపోయిన తరువాత వెలిగింది. పొరపాటు తెలుసుకొని ఆయన వస్తే ఆయనను అమర్యాద చేశాను ఏమిటి అనిపించి, ఈ మొత్తం కార్యక్రమము మీరు నడిపించుకోండి అని లేచి వెళ్ళిపోతాడు. గురువు కోసం ఇంటికెళితే ఇంట్లో కనబడడు. ఎక్కడికెళ్ళాడు అని అడిగితే తెలియదంటారు. ఇంట్లో వాళ్ళకి నిజంగానే తెలియదు. మొత్తం అంతా వెతికేస్తాడు. తన క్రిందే ఉంటాయి కదా అన్ని లోకాలు. ఎక్కడా కనబడడు. గురువు కోసం చాలా తాపత్రయ పడతాడు. ఇక కనబడేదేమీ ఉండదని వినిపిస్తుంది. దగ్గరకి వచ్చిన గురువుని నిరాదరణ చేశావు కాబట్టి ఇప్పుడు నీవు చేయవలసినదేమిటంటే, విశ్వరూపుడనే ఇంకొక గురువు ఉన్నాడు, ఆ గురువుని ఆశ్రయించమని వినిపిస్తుంది. విశ్వరూపుడనే గురువంటే విశ్వమంతా అన్ని రూపములలో నిండి ఉన్న అతనిని గురువుగా చూసుకొనడమే. ఇంక ప్రత్యేకంగా తనకి గురువు కనబడేది ఉండదు. ఆ స్థితిలో పడతారు. అది ఇంకొంచెం కష్టమైన స్థితి. అట్లా భగవంతుడు వేదవిదుడై మన దగ్గరికి వచ్చినపుడు మనం వారిని ఉపయోగించుకొనడం అంటే వారికి మనం ఉపయోగపడటమే! అంటే మహాత్ములు ఎవరి దగ్గరకైనా మనం వెళ్ళినప్పుడు వాళ్ల దగ్గర నుంచి మనము ఏమి పొందుదాం అనేది వదిలేసి, వాళ్ళకి మనమేమి సహాయం చేయగలం అని తపించాలి. మనం సహాయం చేసే స్థితిలో లేరు వారు. కానీ ఈ దృక్పథము వలన

ఉద్ధరింపబడతాము. To be servicable to a Teacher. To be servicable to a Master. To be servicable to a Guru as He is embodiment of God. భగవంతుని యొక్క వ్యక్త రూపమే గురువు కాబట్టి ఆయనకి మనం ఏమి సేవ చేసుకుందాం అనే దానిలో తరింపు ఉంది తప్ప, ఆయన్ని మనం వినియోగించుకొనడంలో తరింపు లేదు. వేదవిదులు అనే నామం భగవంతుని నామంగా విష్ణు సహస్రనామంలో పెట్టడంలో ఉన్న రహస్యం ఏమిటంటే వేదవిదుల రూపంలో నేనే ఉన్నాను. పరిపూర్ణంగా వ్యక్తమై ఉన్నాను. అన్ని జీవులుగా నేనే ఉన్నప్పటికీ ఇక్కడ కేవలం జీవుడుగా కాక, దేహము కూడా దివ్యమై ఉంటుంది. స్పర్శ దివ్యమై ఉంటుంది. నడత దివ్యమై ఉంటుంది. అన్నీ దివ్యమై ఉంటాయి. అవతరణం అంటే ఇది. అవతరణము అంటే up to the physical వ్యక్తమవుతుంది. ముట్టుకుంటే మనలో ఉండే చైతన్యం మేల్కాంచుతుంది. చూస్తే మనలో ఉండే చైతన్యం మేల్కాంచుతుంది. వింటే మనలో ఉన్న చైతన్యం మేల్కాంచుతుంది. వాళ్ళు అంతటి శక్తి సంపన్నులు. కాబట్టి వాళ్ళు కనబడ్డప్పుడు we must make ourselves usefull to them. వాళ్ళు కనబడగానే నా సంగతి ఏమి చేసావు అని అడగకుండా కనిపెట్టి చూడాలి వాళ్ళకేం చేయగలమని. వాళ్లకి మనమేం చేయగలం అనే చోట ఉద్ధరింపు. ఇదీ వేదవిదులు అనే భగవంతుని నామానికి అవగాహన.

## 137 అవ్యంగః

అవ్యంగములంటే సరిగా ఏర్పడనటువంటి అంగములు. వంకరగా ఏర్పడిన అంగములు. భగవంతుడు ఈ వంకరంతా ఎందుకు పెట్టాడని అనిపిస్తుంది. లోపల ఉన్న జీవికి లేని వంకరలు బహిర్గతమైన జీవునికి ఏర్పడుతుంటాయి. ఈ వంకరలు ఎక్కడ వచ్చాయంటే every distortion of every limb is an indication of distortion of the sankalpa. సంకల్పములకు అపవిత్రత ఏర్పడినపుడు దేహము నందున్న అంగములకు వైకల్యం వస్తుంది. కొంత ఎక్కువ శిక్షణ పొందడానికి అవకరమైన అంగములతో దేహము ఇవ్వబడింది అని అర్థం. అంటే ఇంకొంచెం ఎక్కువ మార్పు చేసుకోవలసిందని సంకేతం. అందుచేత అవ్యంగన రూపం కూడా భగవంతుని రూపమనే చెప్పారు. It is an indication through that he is giving a message. అందులో నుంచి మనకి ఒక చక్కటి సూచన ఇస్తున్నాడు. సందేశం ఇస్తున్నాడు. ఏమిటా సందేశమంటే, స్వతహాగా జీవుడుగ నీవు సుందరాకారుడవైనప్పటికీ నీలో నుంచి వ్యక్తమైన కార్యక్రమముల యొక్క అవతరణము వలన నీకు ఈ అవకరములైనటువంటి అంగములు ఏర్పడినవని తెలియజేసే తత్వముగా భగవంతుడు పని చేస్తున్నాడు. శిక్షవేసి శిక్షణ ఇచ్చే పద్ధతి కనిపిస్తుంది. తద్వారా తనని మెరుగుపరుచుకుంటాడు. సగటు మనిషి లోపల దివ్యమైన ఆకారం ఉన్నా బయటకి బండ రాయిలా ఉంటాడు. బండరాయిని దివ్యమైన ఆకారంగా తయారు చేయాలంటే, అక్కరలేని రాయిని తీసేయాలి. మనలో కూడా అక్కరలేనివన్నీ తీసేస్తే అందంగా ఉంటాము. 3 అడుగుల ఎత్తు 12 అంగుళాల వెడల్పు ఉన్న ఒక రాయి ఉందనుకోండి, ఆ రాయిలో శిల్పి ఒక చక్కని సుందరమైన కృష్ణ విగ్రహాన్ని చూడగలడు. లేకపోతే మరియొక విగ్రహాన్ని చూడగలడు. చూసి ఏమి చేస్తాడు? తను దర్శనం చేసిన ఆ మూర్తి కన్నా అదనంగా ఉన్న రాయిని తీసి వేస్తాడు. అంతే శిల్పి చేసేది. అంతేగానీ పక్కన బొమ్మ పెట్టుకుని దానిని చూసి చెక్కి, మళ్లీ చూసి చెక్కి అలా ఉండదు. శిల్పికి మొదట దర్శనం జరుగుతుంది, ఒక బండరాయిని చూడగానే అందులో ఉన్న మూర్తి దర్శనం. ఆ మూర్తిని చూస్తుంటే ఆ మూర్తికి ఏవైతే అడ్డు ఉన్నాయో వాటన్నిటినీ తీసేస్తుంటాడు. మన మొహం మీద బొద్దింక ఉందనుకోండి ప్రక్కవాడు తీసేయడూ? రెట్ట పడిందనుకోండి తీసేస్తాం కదా!

ఎందువలన? రెట్ట extra. మనతో ఉండవలసింది కాదు కదా! మనతో ఉండవలసినవి కానపుడు, వాటిని తీసేస్తుంటే ఏడుస్తుంటాము. అదీ తమాషా. Otherwise beautiful గా ఉన్న వాళ్ళ వికారాలన్నీ మన చుట్టూ ఏర్పరచుకున్నపుడు ఈ వికారములను నిర్మూలనం చేయడానికి భగవంతుడు చేసే కార్యక్రమములలో భాగములుగా ఇటువంటి నామాలన్నీ వస్తూవుంటాయి. If there is a distortion of a limb, it indicates that certain rectifications to be made. అందుకని పురాణాల్లో కూడా వాడు కాళ్ళు లేకుండా పుట్టాడని, కళ్ళు లేకుండా పుట్టాడని, చేతులు లేకుండా పుట్టాడని, మూగవాడిగా పుట్టాడని ఇస్తారు. అవన్నీ జాగ్రత్తగా చదువుకుంటే మనకుండే ఈ అంగవైకల్యాలకి సరైన కారణాలు కనిపిస్తాయి. వేదవిదులు ఆ విధంగా తెలిసినటువంటి వారు కాబట్టి చూస్తారు. ఎందువలన అంటే ఇందువలన అని చెప్ప గలుగుతారు. కనుక ఈ రూపాల్లో భగవంతుని సందేశం అందుతూ ఉంటుంది. We shall have to rectify. There are certain things required for rectification. అని గుర్తు చేయడానికి ఆ విధమైన సందేశం మనకి వస్తుంది.

## 138 వేదాంగః

వేదాంగములు 6. చందస్సు, వ్యాకరణము, కల్పము, శిక్ష, జ్యోతిష్యము, నిరుక్తము. ఈ సృష్టి కల్పము ఏ విధంగా ఏర్పడుతుందో దానికి సంబంధించిన science కల్పము. వ్యాకరణమంటే శబ్దము లేక కలయికగా రూపములెట్లా ఏర్పడతాయో, రంగులు ఎట్లా ఏర్పడతాయో చెప్పే శాస్త్రం. శబ్దం చెయ్యడంలో నుంచి ఏ విధంగా వృద్ధి చెందుతామో వివరించే శాస్త్రం శిక్ష. గ్రహ గోళాదుల తీరుతెన్నులు, వాటి ప్రభావము, దానివల్ల అంతరిక్షం నుండి మన వరకు ప్రజ్ఞల యొక్క ప్రసారము వివరించే జ్యోతికి సంబంధించిన శాస్త్రం జ్యోతిష్యం. The activity of sight అని చెప్పవచ్చు. ఒకే కిరణం ఏడు రంగులుగా మారి ప్రభావం చూపిస్తుంది. ఒకే తెల్ల కిరణం వలన ఏడు రంగులు వస్తున్నట్లే ఒకే సూర్యుడు నుంచి ఏడు గోళములు వస్తున్నాయి. ఒక్కొక్క రంగు ఒక్కొక్క గోళానికి సంబంధించింది. ఈ గోళములో ఉండే జీవుల్లో కూడా ఈ తెలుపు రంగుకి సంబంధించిన ఏడు రంగులు ఉంటాయి. మన భూమండలం చుట్టుప్రక్కల ఉండే సూర్య మండలము, సప్తర్షి మండలం, కృత్తికా మండలము, జ్యేష్టా మండలము, ఆశ్లేషా మండలము ఇవన్నీ తెలిసిన వారికి వేదము పరిపూర్ణముగా తెలుస్తుంది. వేదము నందు జీవిస్తున్న వారికి ఇవన్నీ దాస్యమైపోతాయి. రెండు పద్ధతులు, ఇటు నుంచి అటు. అటు నుంచి ఇటు. మూడు వేదములూ మన యందు సమన్వయం చేయబడ్డాయనుకోండి, ఈ వేదాంగములన్నీ దర్శనమిస్తాయి. అప్రయత్నముగా లోపలనుంచి వ్యక్తమై గ్రహింపుకు వస్తాయి. ఇంకొక పద్ధతి, ఒక్కొక్కటే చదువుకోవడం. చదువుకుంటే తేలే విషయంకాదు. మన ఋషి ప్రోక్తమైన మార్గంలో, from downwards to onward, from general to particular. అనగా ఏకత్వం నుంచి భిన్నత్వంలోకి వెళ్లడం సులభం తప్ప, భిన్నత్వంలో నుంచి ఏకత్వం లోకి వెళ్లడం కష్టం. ఊరు మధ్యలో వదిలేసి ఊరు బయటకి వెళ్లిపోమంటే ఎటు పోయినా ఊరి బయటకు వెళ్ళిపోతాం. From center to circumference. వెళ్లడమంటే ఏ దిక్కుకు వెళ్ళినా కేంద్రం నుంచి వెళ్లిపోవచ్చు. Circumference నుంచి center కి రమ్మంటే దారులు తప్పిపోతూ తిరుగుతూ ఉంటాం. కేంద్రంకి రావడం అంత సులభం కాదు. అందుచేత పెద్దలు చెప్పింది ఏమిటంటే ఏకత్వంలో నుంచి భిన్నత్వం లోనికి, వేదములో నుంచి వేదాంగముల

లోనికి రావడమనేది ఋషి ప్రోక్తమైన మార్గము. వేదాంగః నుంచి వేదముల లోనికి అడుగు పెట్టడమనేది పండితుల మార్గం. వీరిని వేదవాదరతులంటాడు శ్రీకృష్ణుడు. They are only interested in discussions. వాదం. వేదవాదరతులు చేసేదేమయ్యా అంటే ఈ శాస్త్రం గొప్పదా? ఆ శాస్త్రం గొప్పదా? నిరుక్తం గొప్పదా? జ్యోతిష్యం గొప్పదా? అనే చర్చలు. నిరుక్తము అంటే ఒక శబ్దాన్ని పట్టుకొని దానిలో ఉన్న పొందికను చూసి మూల శబ్దంలోకి వెళ్ళి దాని నుంచి దానియొక్క అవతరణాన్ని అవగాహన చేసుకొనడం. అది ప్రత్యేకమైన ఒక విధానము. మనకి దేని గురించియినా తెలియాలంటే దాని నామం తెలియాలి. అదీ సంస్కృత భాష. Latin, Greek కూడా దాదాపు అలానే ఉంటాయి. మనం మాట్లాడుకునే భాషలో కొంచెం వికృత రూపాలుంటాయి. సంస్కృతంలో వ్యుత్పత్తిఅర్థం లేనటువంటి పదం లేదు. అంటే ఆ పదంలో ఉన్న శబ్దముల సముదాయం తెలిస్తే ఆ వస్తువు లేక ఆ రూపము ఏ విధంగా ఏర్పడుతుందో తెలిసిపోతుంది. గురు అనే పదం ఉంది. దానిలో 'గ' 'ఉ' 'ర' 'ఉ' అనే అక్షరాలు ఉన్నాయి. 'గ' గమనమునకు అంటే వ్యాపనం చెందే ప్రజ్ఞ. 'ఉ' అనే శబ్దం విష్ణు తత్వానికి సంబంధించినది. 'ర' శబ్దం రక్షణ చేసే తత్వం. మళ్ళీ 'ఉ' శబ్దం విష్ణు తత్వం. రెండు విష్ణు శబ్దాలు, ఒక రక్షణ శబ్దం, ఒక వ్యాపన శబ్దం కలిపితే గురువు. అనగా గురువు లో ఇంత మంది ఉంటారు. గురువులో రక్షించే వాడుంటాడు. గురువులో చైతన్యం యొక్క వ్యాపనము జరిగే శక్తి ఉంది. వాటిని మనకివ్వటానికి వస్తుంటాడు. తరువాత 'ఉ'కారములు. ఉకారము చైతన్య స్థితి నిస్తుంది. ప్రశాంతత కలిగి ఉండటము, శమము కలిగి ఉండటము, నిష్ట కలిగి ఉండటం, ఎప్పుడూ చెదరనటువంటి స్థితిలో యోగము నందు ఉండటము, గురువనగానే ఇలా చెప్పారు. సంస్కృత పదముల యొక్క, శబ్దముల యొక్క సముదాయమును బట్టి వాటికున్న గుణింతములు బట్టి చెప్పచ్చు. 'అ' అంటే భగవంతుడు. 'ఈ' అంటే అమ్మవారు. ఒకటి సత్ లేక సత్యము. రెండవది చైతన్యము. 'అ' 'ఇ' కలిస్తే 'ఎ'అవుతుంది. మన భాషలో అ మొదలైతే, ఇంగ్లీష్ భాషలో ఎ మొదలు. అంతకుముందున్న రెండు మెట్లు లేవన్నమాట. మొదలు పెట్టడమే 'ఎ' తో మొదలవుతుంది. మనం 'అ' తో మొదలు పెడతాము. 'అ' plus 'ఇ' -'ఎ' ఈ సంధులు చిన్నప్పుడే నేర్పుతారు. అప్పుడు చాలా తమాషాగా ఉంటుంది. ఇప్పుడు అర్థమవుతుంది. 'ఆ' plus 'ఏ' - 'ఐ' అవుతుంది. 'అ' అనే భగవత్ తత్వం 'ఇ' అనే అమ్మవారు కలిపి ఏర్పడే 'ఎ' అనే పదానికి మరల 'ఎ'

కలిస్తే భగవత్ తత్వం దానికి రెండుసార్లు తగిలిందన్నమాట. 'అ' కి 'ఉ' కలిస్తే 'ఓ' అవుతుంది. అందుచేత 'ఓం' అన్నదానికి ' అ ఉ మ ' అని చెప్తారు. అనగా 'అ' పరతత్వమునకు 'ఉ' దిగివచ్చే తత్వము. పైన ఉన్న తత్వాన్ని 'హర' అంటారు. దిగి వచ్చిన తత్వాన్ని 'హరి' అంటారు. 'హర' కి 'హరి' కి ఏమిటి తేడా 'అ' 'ఇ' అంతే. శివుడు దిగివస్తే విష్ణువు. విష్ణువు పైకి వెళితే శివుడు. దిగితే అమ్మవారు. ఎక్కితే అయ్యవారు. మరి ఇవన్నీ తెలియాలంటే నిరుక్తం, వ్యాకరణం, జ్యోతిష్యం, చాలా ప్రధానమైనవి. జ్యోతిష్యం తెలిస్తే తెలిసినంత అది ఒకటీ లేకుండా మిగతా వన్నీ ఉన్నా తెలియదు. బ్రహ్మాండమైన శరీరం, మంచి పటుత్వం, మంచి ఆరోగ్యం అన్నీ ఉండి కళ్ళు లేవనుకోండి, ధృతరాష్ట్రుడిలా ఉంటుంది. ధృతరాష్ట్రుడు చాలా అందమైన వాడు. చాలా బలమైన వాడు. చాలా తెలివైనవాడు. అన్నీ బాగున్నాయి. ఒక్కటే లేదు. చూపు లేదు. అట్లాగే వేదాంగములలో జ్యోతిషము తెలియకపోతే అంతే. ఇంకెందుకు? 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం. వేదాంగానాం జ్యోతిషం ప్రధానం.' అక్కడ మాస్టారు మనకి చల్లని స్పర్శనిచ్చారు. మనబోటి వాళ్లంతా ఏమీ తెలియక పోయినా కూడా జోతిష్యం మనలో విచ్చుకుంటుంది. అది మామూలుగా గోళాలు, వాటి అంకెలతో సంబంధించిన వ్యవహారం కాదు. జ్యోతికి సంబంధించినటువంటిది. అది దర్శనం జరుగుతుంటుంది. అది గురువు ఇచ్చి వెళ్ళడం వలన జరిగే దర్శనం. ఈ ఆరు అంగములుగా భగవంతుడే దిగివస్తాడు. ఇందులో ఏ ఒక్క అంగము వలనా దర్శనం కాదు. అన్నిటి యొక్క సమన్వయము వలన భగవంతుని యొక్క దర్శనం బాగుంటుంది. అందుకని వేదమునందు నిలబడిన వారికి వేదాంగముల వ్యక్త స్వరూపం తెలుస్తుంది. 'వేదాంగో' అన్నది భగవంతుని నామాల్లో ఒకటి. ఈ వేదాంగముల గురించి విపులంగా తెలుసుకోవాలి. ఈ ఆరూ తాళం చెవులు. ఆరు తాళంచెవులను మనమీద ప్రయోగం చేసుకోవాలి. ప్రక్కవాళ్ళ మీద కాదు. ఎదుటివాళ్ళ మీద అంత కన్నా కాదు. మన జ్యోతిష్యం, మన పాండిత్యం ఇంకొకరి మీద కాదు. మన జాతకంలో ఎక్కడెక్కడ లోట్లు ఉన్నాయో జాగ్రత్తగా చూసుకుని సరి చేసుకోవాలి. బాగు చేయించుకొని పని చేయించుకోవాలి. ఈ గోచారంలో మన జాతకంలో ఉన్నవి ఏవేవి బయటికి వస్తున్నాయి చూడవచ్చు. పూర్వకర్మ అంతా బయటికి వస్తుంది. దానిని అంగీకరించి కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించుకుంటూ ముందుకు సాగిపోతూ ఉండాలి. ఇట్లా మనకి దర్శన జ్ఞానమివ్వడానికి అంగాలున్నాయి తప్ప

మన పాండిత్యపటిమను ప్రపంచానికి చూపడానికి కాదు. అందుచేత ఈ 6 తాళం చెవులు ఎవరైతే తన మీద పరిపూర్ణంగా ప్రయోగం చేసుకుంటారో వారికి 6 తలుపులు తెరుచుకొని ఏడవ వాడైన తాను దర్శనమిస్తాడు. తాను సహజముగా భగవంతుని యొక్క స్వరూపమే కాబట్టి తనను తాను దర్శించడం జరుగుతుంది. 6 తాళములు మనమీద apply చేసుకున్నందువలన, 6 తలుపులు తెరుచుకోవడం వలన, ఆరు గుమ్మాలు దాటిన తరువాత ఏడవ గుమ్మం దగ్గర ఏడుకొండల వెంకటేశ్వరుడు కనిపిస్తాడు. అలా 'మన' దర్శనం మనకి జరుగుతుంది. ఆత్మ దర్శనం జరుగుతుంది. 'నేనంటే' ఏమిటో తెలుస్తుంది. దానికి సంబంధించిన అంగములన్నీ ఆరు శాస్త్రములుగా, ఆరింటిని తనపై ప్రయోగించుకొనే వారికి దర్శనం లభిస్తుంది. ఒక్కొక్క అంగాన్ని భగవంతుని స్వరూపంగా దర్శించాలి. అంతేగాని ప్రత్యేకించి ఇది ఒక శాస్త్రంగా నేర్చుకుంటే భగవత్ దర్శనానికి అవకాశం తగ్గిపోతుంది. పాండిత్యం పెరిగిపోతుంది. దానివలన పేరు ప్రతిష్టలు వస్తాయి కానీ అసలు దేనికయితే ఉద్దేశింపబడిందో దాని సాఫల్యత మనకు దక్కదు.

## 139 వేదవిత్

వేదములను తెలిపే తత్త్వమున్నది భగవంతుని వద్ద. వేదములను తెలుసుకున్న వారి గురించి ఒక నామం. వేదములను తెలిపే గ్రంథముల గురించి ఒక నామం. గ్రంథ రూపంలో ఉంటుంది వేదము. భగవద్గీత వేదము. రామాయణము, భాగవతము, భారతము వేదము. పురాణములు వేదములు. నాలుగు వేదములున్నాయి. ఇవన్నీ గ్రంథస్తమై ఉన్నాయి. అవి కూడా 'నేనే' అంటున్నాడు. వాటిని పట్టుకున్నా 'నన్ను' పట్టుకున్నట్లే. గురువుల్ని మనం పట్టుకోలేము. వాళ్ళు మనని పట్టుకోవాలి. గురువు దొరికే లోపల మనం పట్టుకోవాల్సింది గ్రంథాల్ని. పట్టుకొని అందులో చెప్పిన పద్ధతిలో, ఆచరణలో నియుక్తులమై ఉండాలి. అలా ఉంటే living పుస్తకం మన దగ్గరకు వస్తుంది. Paper book నుంచి అంతకన్నా more living, more lively మన వద్దకు వస్తుంది. ఒక గురువుగారు ప్రక్కనున్న దానికి, ఒక పుస్తకం ప్రక్కనున్న దానికి తేడా ఉంది కదా! పుస్తకంలో నుండి కూడా దర్శనం జరుగుతూ ఉంటుంది. ప్రక్కన గురువుంటే ఇంకా ఎక్కువ దర్శనం జరుగుతుంది. అందుకని 'నన్ను' తెలిపేదేదైనా వేదమే. 'నన్ను' అంటే 'నేను'. నేనుగా ఈ సృష్టి మొత్తానికి ఆధారభూతంగా ఉన్నదానిని, తెలిపే దానిని వ్రాసిన వారు ఉంటారు కదా! కవులు. అందుకని వాళ్ళూ 'నేనే'. పుస్తకాలలో వ్రాసిన దానిని ఒప్పుకొని, పుస్తకాలని ఒప్పుకొని, పుస్తకాలు వ్రాసిన వాడిని ఒప్పుకోకుండా ఎట్లా ఉంటాము? వాళ్ళు దర్శించి మనకిచ్చారు. మన బోటి వాళ్ళ కోసం. అందుకని వాళ్ళని 'కవిః అని పెట్టారు. వేదవిత్ కవిః అనే పదానికి అర్థం, గ్రంధములను ఇవ్వడానికి 'నేనే' దిగి వచ్చాను అని. అది భారతీయుని ప్రత్యేకమైన అవగాహన. అన్నీ భగవంతుడు ఇచ్చాడని. మందులు కూడా భగవంతుడే దిగి వచ్చి ఇచ్చాడని మన నమ్మకం. ధన్వంతరి రూపంలో. మనమేదో ఇటు నుంచి కనిపెడుతున్నామని ఒక పద్ధతి. అటు నుంచి దిగి వచ్చి అన్నీ ఇచ్చాడు. రాజుగా తానే దిగివచ్చి ఎలా పరిపాలించుకోవాలో ఇచ్చాడు. అది పృథు చక్రవర్తి కథ. అటు నుంచి దిగి వచ్చి, ఇటు నేర్పి వెళ్లినటువంటివాడు. రామాయణం అంటే ఒప్పుకుంటాను కానీ వాల్మీకి అంటే ఇష్టం లేదంటే ఎలా? వాల్మీకి దేవుడు. ఆయనిచ్చింది రామాయణమని మనం గుర్తుంచుకోవాలి. రామాయణంలో ఏమిచ్చాడు? భగవంతుని చరిత్ర. అలాగే

కృష్ణద్వైపాయనుడు దేవుడు. ఆయన ఇచ్చిన పురాణ సంహిత, భారత భాగవతాది గ్రంథముల ద్వారా మనం భగవంతుని చేరుకొనవచ్చు. భగవద్గీత. అది కూడా వేదవ్యాసుడు రచించి ఇచ్చినటువంటిదే. వ్యక్తమైనది భగవంతుని నుంచే సరాసరి. అది వేదము, ఉపనిషత్తులు మొత్తం అన్నిటి యొక్క సమీక్ష. మనం వీటన్నిటిని, వాటిని వ్రాసిన గ్రంథకర్తలను కూడా భగవంతునిగానే దర్శించాలి. ఇంతకుముందు విష్ణువు అన్నప్పుడు, విశ్వం అన్నప్పుడు అందరినీ భగవంతుడన్నాడు కదా! ఇక్కడ కొంత మందిని ప్రత్యేకించి చూపిస్తున్నాడన్నమాట. All are equals. But some are more equal to other అంటారు. అన్నీ జంతువులే. అందులో ఆవు ఆవే. ఆవుకి, పులికి ఒకే సామ్యం చూడగలమా? రెండూ జంతువులే కదా! పులి లాంటి మనిషి, ఆవు లాంటి మనిషి ఉన్నాడు అనుకోండి. ఇద్దరూ మనుషులే. అనగా మనుషులుగా సమానులు. కానీ one is more equal to another అన్నారు. ఆవు ఆవే. పులి పులే. పిల్లి పిల్లే. పిల్లికి, పులికి ఎంత తేడా ఉంది? ఎలుక, సింహము ఉన్నాయనుకోండి. రెండూ జంతువులే. ఒక బొద్దింక, ఇంకొక నల్లి, మరొక పేను. కానీ తేడా ఉంది. ఎందులో తేడా అంటే చైతన్యంలో ఉన్న తేడా. అట్లాగే అంతా భగవంతుడే అని మొదలుపెట్టి, generals నుంచి particulars కి వస్తుంటారు. వీళ్ళలో కొంత ఎక్కువ చూడు, వీళ్ళలో కొంత తక్కువ చూడు, ఎక్కువ కనిపిస్తాను 'నేను'. నువ్వెక్కువ చూడనక్కరలేదు. నీ చూపు ఎప్పుడూ ఒకటే. నేనెక్కువ కనిపిస్తూ ఉంటాను. దానిని బట్టి నీవు పట్టుకో.

## 140 కవిః

అందరికన్నా కవి ఎవరూ అంటే బ్రహ్మగారు. ఆయన కవిత్వమే ఈ సృష్టి అంతా. ఆయనకి, ఆయనలో కవిత్వంగా ఉన్నటువంటి వాడు, భగవంతుడు. కవిలో కవిత్వముగా ఉంటాడన్నమాట. అందుకనే కవి తను రాద్దామనుకున్నప్పుడు ఏమీ రాయలేడు. అది వచ్చినప్పుడు తను రాస్తూ ఉంటాడు. రాద్దామని కూర్చునేవాడు కవి కాదు. వచ్చినపుడు రాసే వాడే కవి. మామూలుగా ఏదో రాద్దామని కూర్చునేవారు, పెద్ద పెద్ద పుస్తకాలు రాయలేరు. చింపి పక్కన పడేసి, మరల చింపి పక్కనపడేసి ఆ రాతలు రాసే వారు వేరు. ఒక నిజమైన కవికి ఒక భావావేశం వస్తుంది. అందులో నుంచి ఇవన్నీ బయటకి వచ్చేస్తుంటాయి. అది అంతకు ముందు రాదు. అంతకు తరువాతా రాదు. అంటే అతడితో సంబంధం లేదన్న మాట. అతడిని వాహికగా తీసుకొని ఎవరో దానిమీద వ్యక్తమవుతున్నారు. అంటే, కవి అంటే ఎవరు అంటే ఒక చక్కటి సంగీత వాయిద్యం. Musical instrument. మంచి musical instrument ఉంటే ఎవరైనా పాటగాడు వస్తే వాయించవచ్చు. అట్లా వాహికలుగా ఉంటారు కొంతమంది కవులు. ఎవరికీ? 'నాకు' 'నేను' అనే భగవత్ తత్వానికి. వీడి నుంచి ప్రపంచానికి ఏమైనా చేద్దామనుకుంటే వ్యక్తమవుతాడు. అట్లా సమర్పణ చేసుకున్నందువలన వారి నుంచి భగవంతుడు వ్యక్తమవుతాడు. ఆ స్థితిలో వాళ్ళు భగవంతుడే. అదీ గ్రంథములు, వాటిని రచించినటువంటి కవులు! వాళ్ళలో నుంచి కవిత్వముగా వ్యక్తమవుతున్నది 'నేనే' అని చెప్పాడు. ఎవరైనా కూర్చుని కవిత్వం రాద్దామనుకుంటే అయ్యేపని కాదు. కవిత్వానికి కొంతమందే ఉంటారు. They are fit instruments for expression of certain thoughts of higher lokas. ఊర్ధ్వ లోకముల నుంచి వ్యక్తం అవడానికి కొన్ని కొన్ని వాహికలు అలా తయారై ఉంటాయి. వాటి నుంచి వ్యక్తమవుతుంటాడు. Instrument లేకపోతే వ్యక్తం ఎలా అవుతుంది? Music వాయించాలి అంటే గొంతు లేదు, వాయిద్యం లేదు ఏమిటి వ్యక్తమౌతుంది. అందుకని వ్యక్తమవాలంటే మనబోటి వాళ్ళతో అవసరం ఉంది. అందుకని కొంచెం బుజ్జగించుకుంటాడు. అర్జునుడిలాంటి వాడితో తిప్పలు పడుతుంటాడు కదా శ్రీకృష్ణుడు. ఎందుకంటే వాడు కావాలి. వాహిక కావాలి. వాహిక లేకపోతే దిగి రావడం కష్టం. కనుక ఈ వాహిక కవి. కవిత్వం భగవంతుడు. కనుక 'సృష్టి చేయడానికి ఇదంతా నువ్వు రచించు, ఇది

సృష్టి రచన' అన్నాడు. అంటే, 'బాబూ ఈ పని పెట్టక, చాలా పెద్ద volume అయిపోతుంది, రాయలేం కదా' అన్నాడు. 'నేను రాస్తాను కదా నీవు ఊరికే కూర్చో' అన్నాడు. అని కూర్చొని ఆయనలో నుంచి వ్యక్తమవుతూ, మొత్తం సృష్టి యొక్క వ్యూహ రచనంతా చేశాడు. ఆయన మరచిపోయినప్పుడు సృష్టి ఆగిపోదు. రచన ఆగుతుంది. ఆయన గుర్తున్నపుడు రచన సాగుతుంది. రచన అలా సాగుతుంది. వ్యాసుడు రాసినా అలాగే రాసాడు. వాల్మీకి రాసిన అలాగే రాసాడు. మన అదృష్టం కొద్దీ పోతన భాగవతం అలాగే రాసాడు. తను కూర్చొని ఊరికే పెనవేసుకోలేదు. తనకి వ్యక్తమైనప్పుడు రాసాడు. అట్లాగే చూసాము మన మాస్టారు దగ్గర గ్రంథముల రచన. గబగబా లోపలికి వచ్చేసి, కూర్చోరా అని కూర్చుండ పెట్టి చెప్పేసేవారు. వస్తుంది రాసుకో అని చెప్పేవారు. రాయండి మాస్టారు చాలా పుస్తకాలు pending ఉన్నాయి కదా! అంటే మనం రాయడం కాదు. రావాలి. వచ్చినప్పుడు రాయడమే అనేవారు. అంతేకానీ రాద్దామని ఒక వ్యామోహం ఉండరాదు. మన పుస్తకాలు ప్రపంచానికి ఎక్కించాలని బాధ ఏమీ లేదు. భగవంతుడు తనని వాహికగా వాడుకొని, ప్రపంచానికి ఏదైనా ఇద్దామనుకుంటే తాను సిద్ధంగా ఉంటాడు. అందుకని ఆ పుస్తకాలు శాశ్వతంగా ఉంటాయి. భగవంతుని యొక్క వ్యక్త స్వరూపాలే తప్ప, అందులో మాస్టర్ E.K యొక్క personality ఏమీ ఉండదు. Impersonal writings అంటారు వాటిని. 'అపౌరుషేయాలు' అంటారు. ఎవరు వ్యక్తమవుతున్నారంటే, భగవంతుడే! ఇదంతా జీవులను ఉద్ధరించడానికి భగవంతుడు పడే పాట్లు. ఎవరయ్యా అందరికన్నా పెద్దకవి? ఆయనే! ఆయనకి వాహికలే అందరూ. బ్రహ్మ ఒక వాహిక. బ్రహ్మ వాహిక అయితే అతని నుంచి పుట్టిన ప్రజాపతులు, మనువులు, ఋషులు, సిద్ధులు, సాధ్యులు వీళ్ళందరూ కూడా వాహికలే. వీళ్ళ నుంచి వ్యక్తమవుతున్నటువంటి ఒక ఒకే కవి, వ్యూహరచన చేసినటువంటి వాడు భగవంతుడు. మనం ఎవరైనా కవిని చూశామనుకోండి వానిలో కవి శరీరమా? కాదు. ముఖమా? కాదు. వానిలో ఉన్న కవిత్వాన్ని చూస్తాం. కనుక వానిలో ఉన్న కవిత్వాన్ని దర్శనం చేసినప్పుడు భగవంతుని దర్శించినట్లు. ఒక కళాకారుడిలో ఉన్న కళ భగవంతుడు. వాడి ముఖం కళాయిలా ఉన్నా, వాడిలో నుంచి వ్యక్తమైన కళ భగవంతుడు. దానిని చూడాలి. అదే విధంగా తన స్వంత జీవితంతో కవికి సంబంధమేమీ లేదు. ఆయన నుంచి వ్యక్తమైన కవిత్వము ఆయన యొక్క అస్తిత్వము. దానిని దర్శనం చేసుకొని

దానిని ఆరాధన చేసుకోవాలి. కనుక మనలో కూడా కవి అనే భావన, వ్యూహరచన చేసే భగవంతుడిగా తయారవచ్చు. మనమేదో కొన్ని రచనలు చేసాము. వాటిని అమ్ముకోవడం, మోసుకోవడం, నెత్తి మీద పెట్టుకొని తిరగడం ఇలా జరుగుతుంది.  మనం చేసే రచనంతా మన కర్మగ అలా మన నెత్తిమీద ఉంటుంది. ఎప్పుడూ head load పెట్టుకొని తిరుగుతుంటాం. పక్కన పెట్టము. అలా కాకుండా తలమీద బరువు లేనివాడికి ఇంకొక అవకాశముంటుంది. ఏమిటంటే రచనలు లేక expressions, for others to enable to get rid of their loads. అంటే రైలు పెట్టెలో తన పెట్టెను తన తల మీదే పెట్టుకున్నట్లు ఒకడికి ఉంటుంది. ప్రక్కవాడి పెట్టె బరువును తీసేసి సాయం చేసే వాడింకొకడు ఉంటాడు కదా! వాళ్ళకేం బరువు ఉండదు. Less luggage is more comfortable. కనుక ఈ బరువులను తీసేయడానికి జగత్ కళ్యాణంగా ఈ రకమైన వ్యూహ రచనలు జరుగుతూ ఉంటాయి. కవి అంటే అందరూ కూర్చొని కవిత్వమే వ్రాయనక్కరలేదు. ఒక సత్సంకల్పానికి రూపకల్పన చేసి లోకము వరకు తీసుకువచ్చే ప్రతి వాడు ఒక కవే. అనగా ఒక creator. ఒక బ్రహ్మ. అలా మనం చేసే ప్రతి సంకల్పానికి, అది భూమి మీద స్థాపితం అయ్యేంతవరకు చేయడమే Magic అంటారు. ఒక మంచి పని మనం చేస్తూ, తద్వారా ఆ ప్రేరణ చెందిన వాళ్ళు మనతో చేరి, అందరూ కలిసి చేసే మంచి పనితో లోకానికి మేలు జరిగింది అనుకోండి, అంతకన్నా మంచి పని ఇంకేముంటుంది? ఇలా సంకల్పమును నిర్వర్తించే సామర్థ్యము కలిగినటువంటి వాడు కవి అవుతాడు. కవికి వచ్చిన సంకల్పాన్ని రాతగా పెట్టి పుస్తకంగా ఇస్తాడు. ఇంకొక రకమైన కవులున్నారు. వారి ద్వారా జీవులను ఉద్ధరించే కవిత్వమొస్తుంది. అనగా వ్యూహరచన భగవంతుని సన్నిధికి అలా చేర్చుతుంది. వారిని వాహికలంటారు. ఈ విధంగా ఒకే ఒక భగవత్ తత్వం మనం చెప్పలేనన్ని విధములుగా వ్యక్తమై మనుషులను ఉద్ధరిస్తూ ఉంటుంది. ఎంతోమంది తెలుగు మాస్టార్లున్నారు. వాళ్ళందరి పాదాల మీద పడలేదు కదా! కానీ మాస్టారు కాళ్ళ మీద ఎందుకు పడ్డాము? ఆయనలో నుంచి వ్యక్తమైన  చైతన్యం మనలో చైతన్యాన్ని ఆకర్షిస్తుంది. ఎందుకంటే, A magnet attracts the iron piece. మనలో కూడా చిన్న magnet గా ఉంటుంది. ఈ విధంగా ఆ వ్యక్తమైన దానికి ఆకర్షింపబడతాము.  అదే mastary. మాస్టారి గారిలో ఉన్న మాస్టరీ చేత మనం ఆకర్షింపబడ్డాము. లేకపోతే ఆకర్షింపబడము. అందరియందు ఈ విధంగా

వ్యక్తమవుతున్నటు వంటివాడు భగవంతుడు. గురువుని చూసినపుడు దేవుణ్ణే చూసామనుకోవాలి.

## 141,142,143- లోకాధ్యక్షః, సురాధ్యక్షః, ధర్మాధ్యక్షః

మనలో వున్నవి మనం గమనించినట్లయితే భగవంతుని యందు ఏం వున్నాయో మనకు గమనికకు వస్తుంది. దానికి ఏవో లోకాలు వున్నాయట అని చెప్పకోనక్కర్లేదు. ఉదాహరణ మనం ఏం చెప్పకోవచ్చంటే ఇల్లు. చోటు వుంది. చోట్లో ఇల్లు నిర్మాణం చేశాం. ఇంట్లో ఏడు ఆవరణలున్నాయి. లేదా గుడి అనుకోండి. గుళ్ళో ఏడు ఆవరణాలు వున్నాయనుకోండి. ఏడు ఆవరణలలో మనం గోపురం దాటి లోపలికి వెళ్ళగానే గుళ్ళోకి వెళ్ళాం అనుకుంటాం కదా! అంతకుముందు బయట అనుకుంటాం. ఆ తరువాత లోపల అనుకుంటాం. ఈ లోపల, బయట దేనివల్ల ఏర్పడినాయి? ఆవరణల వల్ల ఏర్పడినాయి తప్ప ఆ గుడి లేనప్పుడు అంతా ఒకటే కదా! చోటు ఒకటే అయినప్పటికీ ఆవరణలు ఏర్పడటం వల్ల మనం వేరే భావన చేసుకుంటూ ఉటాం. అది భగవంతుని యొక్క మాయ! మనం సృష్టిలో ప్రవర్తించడానికి ఇటువంటి మాయ ఒకటి వ్యక్తమవుతూ వుంటుంది. భగవంతుని నుంచి దానిని అనుసంధానం చేసుకొని మనం ప్రవర్తిస్తూ వుంటాం కానీ, ఈ ఆవరణలు కూడా భగవంతుడే అని గుర్తుపెట్టుకోవాలి. గేట్లోంచి లోపలికి వచ్చినప్పుడు ఇంట్లోకి వచ్చాం అనుకుంటాం. కదా! అది బయట, ఇది లోపల అవుతుంది. అంతకుముందు బయట లోపల లేని స్థితి నుంచి, బయట లోపల అనే స్థితి ఏర్పడుతుంది. లోపల వెలుపల లేనటువంటి భగవంతుణ్ణి నారాయణుడంటారు. లోపల వున్నటువంటి భగవంతుడిని వాసుదేవుడంటారు. లోపల వెలుపల లేనటువంటి వాడిని శివుడన్నారు. లోపల వెలుపల అనే తేడా లేనటువంటి భగవంతుణ్ణి విష్ణువు అన్నారు. ఇట్లా మనకి పేర్లు ఏమైనప్పటికీ కూడా తెలుసుకోవలసిన విషయం ఏంటంటే, ఒకే చోటుని మనం లోపల వెలుపలగా చూస్తున్నాం కదా! లోపలకు వచ్చిన తరువాత ఇంకా చాలా చూస్తాం. గేట్లోంచి లోపలికి వచ్చేసరికి, గేటు నుంచి వరండా వరకు ఒక భాగంగా చూస్తాం. వరండా ఒక భాగంగా చూస్తాం. ఆ తరువాత సింహద్వారం దాటి లోపలికి వెళితే అక్కడ ఇంకొక గది చూస్తాం. అతిధులను ఆహ్వానించే ఒక గది. అక్కడ నుంచి మన వాళ్ళంతా కూర్చోవడానికి ఇంకొక గది. అక్కడ నుంచి భోజనాలగది, వంటగది, పడకగది, ఇట్లా పెట్టుకున్నాం కదా! ఇవన్నీ ఎక్కడ ఏర్పడినాయి? చోట్లోనే ఏర్పడినాయి. చోటులో ఏర్పడినప్పటికీ కూడా వాటిలో అన్నిటా నిండి వున్నది

చోటైనప్పటికీ కూడా ఇది bedroom, ఇది bathroom, ఇది dining room, ఇది drawing room అని అనుకుంటుంటాం గదా! ఇన్నిట్లోనూ నిండి వున్నది చోటే అని గుర్తించిన వాడు బుద్ధిమంతుడు. అలా అయినప్పటికీ కూడా ఏ చోటులో ఏ ఆవరణలో వున్నప్పుడు ఆ ఆవరణకి సంబంధించిన ధర్మముల యందు నియమితుడై వుంటాడు. వరండాలో చెసే పని లోపల చెయ్యము. వంటింట్లో చేసే పని భోజనాల గదిలో చేయం. భోజనాల గదిలో చేసే పని పడగ్గదిలో చేయం కదా! ఏ గదికి ఆ గదికి సంబంధించినటువంటి కార్యక్రమములు వున్నాయి కదా! అట్లాగే ఈ చోటులో ఏర్పడిన ఇన్ని లోకములలో ప్రతి లోకమునకు వాటికి సంబంధించిన ప్రజ్ఞలు వున్నాయి. ఆ ప్రజ్ఞలకు ధర్మములు వున్నాయి. ఊరికే రాయలేదు మూడు నామములు. లోకాధ్యక్ష, సురాద్యక్ష, ధర్మాధ్యక్ష అని. లోకములు, లోకములలో వున్నటువంటి ప్రజ్ఞలు, ప్రజ్ఞలకి వున్నటువంటి ధర్మములు అన్ని ఒకేలా ఉండవు. ఏ లోకములకు వుండే దేవతలు ఆ లోకంలో వుంటారు. ఆ దేవతలకి ఆ లోకములకు సంబంధించిన ధర్మములు వుంటాయి. ఆ ధర్మముల ప్రకారం ఆ దేవతలు నడుస్తూ వుండటం వల్ల ఆ లోకం అట్లా వుంటుంది. వంటగది లోకం వంటగదే. వంటగదికి సంబంధించినటువంటి ధర్మములన్నీ అక్కడ వుంటాయి కదా! వంట గదిలో ఏం చేయాలో, మనం చేయవలసినవి, కావలసినవి మన బుద్ధికి తోపించే వాళ్ళు వుంటారే, వాళ్ళు వంటగది దేవతలు. మీకు అవగాహన అవడానికి చెప్తున్నా. అట్లాగే చావిడి యందు వుండే దేవతలు చావిడి యందు ఏం చేయాలో మనకి ధర్మమును అవగతమయ్యేటట్లు చేస్తారు. అంటే ధర్మము, దేవత, ప్రజ్ఞ. ప్రతి లోకములకు కొన్ని ప్రజ్ఞలుంటాయి. ఆ ప్రజ్ఞకు సంబంధించిన ధర్మములు వుంటాయి. ఆ ధర్మముల ప్రకారం ప్రజ్ఞలు నిర్వర్తిస్తుంటే ఆ లోకం అక్కడ చక్కగా వుంటుంది. మనం పని చేసే చోటు మిగతా పనులన్నీ చేయకూడదు. ఉదాహరణకు మనం ఆఫీసులో కూర్చుని ఏ టేబుల్ మీద అయితే ఇతరులకు ఉపయోగపడే పనులు చేస్తున్నామో, Office అయిపోయిన తర్వాత అదే table మీదే పేకాట ఆడామనుకోండి, ఈ పేకాట ఆడటానికి సంబంధించిన దేవతలు, వాటికి సంబంధించిన ధర్మములు ఏం చేస్తాయంటే మర్నాడు office పనికి అడ్డొస్తాయి. పేకాటకొచ్చే ఉత్సాహం వేరు. అవి confuse చేస్తాయి. వచ్చిన వాళ్ళకు కూడా confusion వస్తుంది. ఏ పనికి నిర్ణయించిన స్థలమునందు ఆ పని చేయాలి. పూజకి నిర్ణయించిన గదిలో పూజ ఎప్పుడూ చేసుకుంటుంటే భగవంతుని

యొక్క సాన్నిధ్యం అప్రయత్నంగా లభించే అవకాశం వుంటుంది. భగవంతుడు మన యందు పరిపూర్ణంగా స్థిరపడే అంతవరకు కూడా మనము ఎక్కడ చేయాల్సిన పనిని అక్కడ చేయటమనే నియమమును కలిగి వుండాలి. పూర్ణామార్కెట్లో కూడా భగవంతుని దర్శనం చేయగలిగిన మహాత్ములు వుంటారు. కానీ పూజ గదిలో కూడా భగవంతుని దర్శనం చేయలేనటువంటి సామాన్యులు వుంటారు. కదా! పూజ గదిలో పూజగది పని, పడకగదిలో పడకగది పని, భోజనాల గదిలో భోజనాలగది పని ఇట్లా మనకి ఎట్లా నిర్ణయం అయినాయో, అట్లాగే సృష్టిలో కూడా నిర్ణయమై ఉన్నాయి. ఈ లోకములన్నిటిలో కూడా వాటికి సంబంధించిన దేవతలు, ఆ దేవతలకు సంబంధించిన ధర్మములు ఉన్నాయి. భూలోకముందనుకోండి, పదార్ధమయమైనటువంటి లోకం. అందులో వాటి ధర్మాలవి చక్కగా నిర్వర్తిస్తూ వుంటాయి. ఉప్పు ఉప్పగానే వుటుంది. పంచదార తియ్యగా వుంటుంది. బంగారం, బంగారం ధర్మం నెరవేరుస్తుంటే, రాగి, రాగి ధర్మాన్ని నిర్వర్తిస్తుంటే, ఇనుము, ఇనుము ధర్మం నిర్వర్తిస్తుంది. వేటి ధర్మములు అవి వాటిలో వున్న దేవతల ద్వారా నిర్వర్తింపబడుతుంటాయి. ఇవన్నీటినీ ఈ విధంగా ఎప్పుడూ శాశ్వతముగా, ఇవే ధర్మములను అవే ప్రజ్ఞల ద్వారా నిర్వర్తిస్తూ, ఈ లోకములను రక్షిస్తున్నటువంటి భగవంతుణ్ణి అధ్యక్షుడంటారు. వేటికి? లోకములకు అధ్యక్షుడు. దేవతలకు అధ్యక్షుడు. ధర్మములకు అధ్యక్షుడు.

సురలు అంటే, మనలో ప్రజ్ఞా కేంద్రంగా పనిచేస్తున్నటువంటి వారు. సృష్టిలో ప్రజ్ఞా కేంద్రములుగా వున్నారు. భూమి ఒక కేంద్రము. ప్రతి గ్రహగోళము ఒక కేంద్రము. సూర్యుడు వీటన్నిటికీ కేంద్రము. ఇటువంటి సూర్యలోకం పైన సవితృ అనే కేంద్రం ఒకటి వుంది. ఇటువంటి సవితృ మండలాలన్నిటికీ ఒక కేంద్రం వుంది. ఇట్లా కేంద్రములు, కేంద్రములు గా ఎన్నో కేంద్రములు వున్నాయి. ఒక్కొక్క నక్షత్ర మండలం ఒక్కొక్క కేంద్రం. ఒక్కొక్క తార ఒక్కొక్క కేంద్రం. ఇవన్నీ కేంద్రములుగా వాటి చుట్టూ పరిధుల్లో కార్యక్రమములు ఏర్పడుతున్నప్పుడు ఒక కేంద్రాన్ని ఒక్కొక్క ప్రజ్ఞ పరిపాలిస్తుంటుంది. పదార్ధం అనే కేంద్రాన్ని పరిపాలించే ప్రజ్ఞలు వసువులు. సృష్టి అనే ప్రజ్ఞకు సంబంధించిన కేంద్రములు నిర్వర్తించే దేవతలు రుద్రులంటారు. వెలుగుకు సంబంధించిన కేంద్రములను నిర్వర్తించే వాళ్ళని ఆదిత్యులు అంటారు. ఆదిత్యులు, రుద్రులు, వసువులు. ఇట్లా పదార్ధానికి సంబంధించిన ధర్మములు

పదార్థం నిర్వర్తిస్తుంటుంది. జలమునకు సంబంధించిన ధర్మములు జలదేవతలు నిర్వర్తిస్తూంటారు. అగ్నిలోకమునందు ధర్మము అగ్నిదేవత నిర్వర్తిస్తూ వుంటుంది. అట్లాగే వాయువులో వాయు ధర్మాన్ని వాయుదేవత నిర్వర్తిస్తూ వుంటుంది. ఆకాశ ధర్మాన్ని శబ్ద దేవత నిర్వర్తిస్తూ వుంటుంది. ఆకాశానికి గుణము శబ్దము. ఆకాశం నుంచి శబ్దం వస్తే శబ్దం నుంచి మనకు స్పర్శ, వెలుగు తర్వాత వేడిమి, రుచి. ఇవన్నీ మనకి గంధములు లేక వాసనలు. ఇలా ఏర్పడేటటువంటివన్నీ కూడా వేటి ధర్మములు అవి నిర్వర్తిస్తుంటాయి. ఇపుడు మనకి చెవి వుందనుకోండి, వినే ధర్మాన్ని నిర్వర్తిస్తూ వుంటుంది. ఆకాశ ధర్మాన్ని చెవి ద్వారా మనం వినేటటువంటి అవకాశం అన్నమాట. అంటే మనకు ఆకాశం బాగా తెలియాలంటే చెవులు బావుండాలి. అగ్ని దర్శనం బాగా జరగాలంటే అగ్ని అనేటటువంటి దేవత మనలో పూర్తిగా దర్శనం ఇస్తూ వుంటుంది. దేహంలో వేడిమిగా వుంటుంది. మనసులో బుద్ధిగా వుంటుంది. కళ్ళల్లో వెలుగుగా వుంటుంది. మూడు. అలాగే వాయువు మనలో కూడా ఉచ్ఛ్వాస నిశ్వాసముల రూపంలో వుండి ప్రాణస్పందనము జరిపిస్తూ ఈ దేహమును నిలబెట్టేటటువంటి కార్యక్రమం, ఆ ధర్మములను నిర్వర్తిస్తూ వుంటుంది. అంతేకాకుండా మనకి స్పర్శజ్ఞానాన్ని ఇస్తుంది. స్పర్శజ్ఞానం కావాలంటే చర్మం వుండాలి. చర్మం స్పర్శ జ్ఞానాన్ని బట్టి వేడిగా వుండేది ముట్టుకోకపోవడం, చల్లగా వుండేది ముట్టుకోవడం, ముళ్ళ మీద కూర్చోక పోవడం తివాచీ మీద కూర్చోడం, ఇవన్నీ మనకు ఎట్లా తెలుస్తుంది? స్పర్శ ద్వారా తెలుస్తుంది. ఆ ధర్మములను నిర్వర్తిస్తూ వుంటుంది. మనలో ఇన్ని ధర్మములు, ఇంతమంది దేవతలు వుంటే మన కార్యక్రమాలు నడుస్తూ వున్నాయి. ఒకటి ధర్మము, ధర్మమును నిర్వర్తించేటటువంటి దేవత, ఆ దేవతకి రూపము ఇట్లా వుంటుంది. వీటన్నిటికీ అన్ని లోకములలో అధిష్టించి వున్నటువంటి భగవంతుడు.

ఆకాశం- శబ్దము-చెవి.

వాయువు-స్పర్శ-చర్మము.

అగ్ని-చూపు-కన్నులు.

జలము-రుచి-నాలుక.

నాలుక మీద జలం లేకపోతే రుచి తెలియదు. అందుకని నాలుక ఎప్పుడూ తడిగా వుంటుంది. పొడిగా వుందనుకోండి. నాలుక పిడచగడుతుంది. రుచి తెలియదు. జలము, నాలుకకు రుచిని సంధానం చేస్తుంది. అలాగె

పృథ్వి—గంధము, శరీరము – ధాతువులు, దేవత-రూపము, ఇట్లా వ్యక్తమవుతూ వుంటాయి.

ఇవన్నీ వేటి వలన వ్యక్తమవుతున్నాయి? లోపల వాడు లేకపోతే అవుతాయా? వీటన్నిటికీ అధ్యక్షత వహించి వున్నవాడు ఎవరు? మనలో లోకములు పృథ్వి నుండి ఆకాశం వరకు ఒకదాని నుంచి ఒకటి లోపలగా వుంటూ వుంటాయి. సృష్టిలో ఒకదానికొకటి బయటగా వుంటాయి. అంటే ముందు పృథ్వి, పృథ్వి చుట్టూ జలము, పృథ్వి లోపల జలము. జలము లోపల వేడిమి. బయట వేడిమి. తరువాత వేడిమి పైన వాయువు. లోపల వేడిమి పుట్టించడానికి వాయువు బావుండాలి. గట్టిగా నాలుగు సార్లు గాలి పీలిస్తే వేడి పుట్టుకొస్తుంది. అక్కడ వాయువు అంతకన్నా బహిర్గతంగా వుంది. ఆపైన ఆకాశం. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అనేటటువంటి ఒక క్రమములో సృష్టి ఏర్పడితే, దానికి సరిగ్గా opposite గా మనం ఏర్పడటం వలన దానితో మనం అనుసంధానం చెంది వున్నాం. ఒక negative ఒక positive కనుక, interact అయితే attraction వుంటుంది. లేకపోతే వికల్పం అయి పడిపోతుంది.

## 144 కృతాకృతః

( ఈ నమాలకి వివరణ సేకరించే ప్రయత్నము జరుగుతోంది)

## 145,146,147,148-చతురాత్మా, చతుర్వ్యూహః, చతుర్దంష్ట్రః, చతుర్భుజః

బ్రహ్మ నాలుగు. బ్రహ్మకు ముందు ముగ్గురు. దేవతలందరు మామూలుగా సృష్టిలో సంక్షోభం కలిగినప్పుడు బ్రహ్మ వరకు వెళ్ళగలరు కాని అంతకు పైకి వెళ్ళడానికి అవకాశము లేదు. బ్రహ్మ దగ్గరకు వెళ్తే, బ్రహ్మ తన పైన ఉన్నటువంటి, తన లోపల ఉన్నటువంటి, తనకి ఆధారభూతం ఉన్నటువంటి తత్వము యందు లగ్నమై, అక్కడ నుంచి పరిష్కారం తీసుకు వచ్చి దేవతలకి ఇస్తూ ఉన్నట్లుగా మనకి పురాణాలలో బాగా కనిపిస్తుంది. రావణుడు, సోమకుడు, నరకుడు ఇటువంటి వాళ్ళు ఉద్భవించి బాధలు పెడుతున్నపుడు దేవతలు అందరు వెళ్లి బ్రహ్మకి మొర పెటుకుంటారు. ఎందుకంటే కనిపించేది, వ్యక్తమయ్యేటటువంటిది- బ్రహ్మ. అవ్యక్తమయ్యేటటువంటి స్థితులో అంతకు ముందు మూడు. మొత్తం నాలుగు. ఆ నాలుగో అంకెకి సంకేతముగా ఈ నాలుగు తలకాయల బ్రహ్మను ఇచ్చారుతప్ప, ఇట్లా నాలుగు తలకాయలు పెట్టుకొని ఒకాయన ఆకాశములో కూర్చున్నాడనుకోండి! అంటే తత్త్వం అంతకు ముందు, (తత్ అంటే? దేనిని మనము నిర్వచించలేమో ఆ పరబ్రహ్మ తత్త్వం.) దిగి ఇలా వచ్చినప్పుడు నాలుగో స్థితి చెందటాన్ని 'బ్రహ్మతత్త్వం' అంటారు. అంటే creativity of earth. అంతకు ముందు ఈ మూడు శాశ్వతంగ ఉంటాయి సృష్టిలో. శాశ్వతమైనటువంటి ఈ మూడు లోంచి బ్రహ్మం ఏర్పడి, బ్రహ్మ లోంచి ఏడు లోకాలు ఏర్పడతాయి. అంటే బ్రహ్మ పైన మూడు లోకాలు, కింద మూడు, మొత్తం పది. బ్రహ్మ నుంచి ఆ మూడు దిగి వస్తూవుంటాయి. అందుకని దీన్ని Pythagoras అనే ఒక పరమగురువు, ఒక decad అంటే పది చుక్కలు సంకేతంగా ఇచ్చి, పది చుక్కలు ఒక త్రిభుజం లో చూపించి, చుట్టూ ఉండే మూడు చుక్కలు తీసేసి, ఏడు చుక్కలు creation కి ప్రతిరూపంగా చెప్తారు. ఈ మూడు ఎప్పుడూ ఉంటాయి. ఆ మధ్యన ఉన్న ఏడు చుక్కలు ఆ మూడు ఆధారంగా మారుతుంటాయి. ఈ మూడూ ఏమిటి? శాశ్వతుడైనటువంటి భగవంతుడు స్థితిగ ఉంటాడు. అంటే ఉన్నట్టుగ ఉంటాడు. ఆ ఉండటం లోంచి ఒక సంకల్పం వస్తుంది. ఆ సంకల్పాన్ని అమ్మవారంటారు. ఒక భాషలో. మనలో సంకల్పం ఎలా ఏర్పడుతుందో అక్కడ కూడ అలా ఏర్పడుతుంది. అలా ఏర్పడిన సంకల్పాన్ని నిర్వర్తించడానికి అదే భగవంతుడి నుండి శక్తి

పుడుతుంది. భగవంతుడు తనుగా ఏమీ చేయకపోయినా తన నుండి ఒక సంకల్పం వ్యక్తమవడం, ఆ సంకల్పాన్ని నిర్వర్తించడానికి తన నుండి శక్తి ఉద్భవించడం. ఇది మనం అవగాహన చేసుకోవలసిన అతి ముఖ్యమైన విషయము. మనం కూడ ఉట్టి పుణ్యానికి ఊరికే కూర్చుంటే, మన లోంచి ఓ సంకల్పం వచ్చి మన చేత పని చేయిస్తుంది. అంటే మనలోంచి ఒక సంకల్పము వచ్చిన తరువాత ఆ సంకల్పాన్ని నిర్వర్తించడానికి మనలోంచే శక్తి ఉద్భవిస్తుంది. అంటే మనం ఆధారంగా ఒక సంకల్పము, అది నిర్వర్తించడానికి కార్యక్రమము, అందులోంచి ఏర్పడే సృష్టి. కాబట్టి, భగవత్ తత్త్వం నుండి ఏర్పడే సంకల్పాన్ని 'ప్రకృతి' లేదా 'మూలప్రకృతి' అంటారు. ఎందుకంటే అంత సూక్ష్మంగా ఉంటుంది. ఆ సంకల్పాన్ని, ఆ ప్రకృతిని పరస్పరత్వం గావింపబడడానికి భగవంతుని నుండి శక్తి వికసిస్తుంది. భగవంతుడు ఉద్భవింపచేయడు. భగవంతుడి నుండి ఉద్భవిస్తుంది. అలాగే ఆలోచన మన నుంచి ఉద్భవిస్తుంది. మనం ఆలోచిద్దామంటే వస్తుందా? మనం ఆలోచించకూడదు అనుకున్నా మనలోంచి ఒక ఆలోచన వస్తుంది. అలాగే, ఆ తత్త్వం,  స్థితి అనే పరబ్రహ్మ తత్త్వం నుండి లేదా ఎప్పుడు ఉండేది అనే ఒక స్థితి లోంచి ఒక సంకల్పం వస్తే ఆ సంకల్పంతో పరస్పరత్వం కావించడానికి భగవంతుడి నుంచే శక్తి ఉద్భవిస్తుంది, అందుకే భగవంతుడు ఏమి చేయడు, అమ్మవారే అంతా చేస్తుందంటారు. ఈ ఉద్భవించిన సంకల్పాన్ని 'మూలప్రకృతి' అన్నారు. అదే భగవంతుడి నుంచి ఉద్భవించినటువంటి శక్తిని 'శక్తి స్వరూపం' అంటారు. అందుకే 'పరా- ప్రకృతి', పరాశక్తి' మనకి ఉన్నవి. పరాప్రకృతి, పరాశక్తి, రెండూ రెండుగ దర్శించడం. పదార్ధము, పదార్థములో ఉన్నటువంటి శక్తి. మాములుగా రెండు కలిపి మనం ఒకటిగ  మనం భావిస్తాము. ప్రకృతిశక్తులు అంటారు. ఇవి ఒకటి కాదు. ప్రకృతి, శక్తి వేరు వేరు. భగవంతుని ఆధారంగా ఈ రెండు బయటకి వచ్చేసరికి మొదటి త్రిభుజం ఏర్పడుతుంది. దీన్ని triangle. ఇప్పుడు సంకల్పము దానంతట దానికి చలనం లేదు. శక్తి ఆధారంగా అది కదులుతూ ఉంది. సూక్ష్మం నుంచి స్థూలానికి పదార్థాలు ఏర్పడతాయి. కాబట్టి శక్తి లేనిదే, అటు సంకల్పానికి కాని, ఇటు భగవంతుని యందు దిగిరావడానికి కాని రెండిటికి కార్యక్రమం లేదు. అందుకని మనం మాములుగా భగవంతుడిని నిర్వచించినపుడు ఈ శక్తినే. భగవంతుడి నుంచి దిగివచ్చిన శక్తి. అందుకని దిగిరానటువంటి భగవంతుడిని 'హరుడు' అంటారు, దిగివచ్చిన భగవంతుడిని 'హరి' అంటారు. ఆయన దిగి రాడు.

ఈయన దిగి వస్తాడు. ఆయన పెట్టుబడిగా ఈయన దిగి వస్తూ ఉంటాడు. ఈయనలో  ఆయనే ఉంటాడు. అందుకని 'హరి' భావన వలన 'హరుడు' సంతోషిస్తాడు, 'హరుని' భావన వలన 'హరి' సంతోషిస్తాడు . ఇద్దరి మధ్య భేదం చూసేవారికి భగవంతుడి దర్శన, స్పర్శన, సాన్నిధ్యం లభించవు.  హరుడికి, హరికి బేధం ఇంకా మనలో ఉంది అంటే భగవద్దర్శనంకి అవకాశం లేదు. నిజానికి సృష్టిలో హరిని ఎప్పుడు హరుడు స్మరిస్తూ ఉంటాడు. హరుని ఎప్పుడూ, హరి ఎప్పుడు స్మరిస్తూ ఉంటాడు. శివుని ఎప్పుడూ ఏమి చెస్తుంటావంటే  రామనామం చేస్తూ ఉంటానని చెప్తాడని మనకి పురాణాలు చెప్తుంటాయి. రాముడు ఏమి చేస్తుంటాడంటే, శివనామం చేస్తుంటాడు. అది ఒకరికి ఒకరంటే ఉన్న అవినాభావ సంబంధము. ఒకరు లేకపోతే ఇంకొకరు లేరు. దిగివస్తే హరి. దిగి రాకుండా ఉంటె హర. హరి హరుని యొక్క మోహన రూపం.  హరుడు హరి యొక్క శక్తి రూపం లేక మూలప్రకృతి. అందుకని మూలతత్వం  నించి దిగి వచ్చినపుడు తానే సంహారకర్తగా, తానే ధర్మకర్తగా  శ్రీకృష్ణుడు దర్శనం ఇస్తుంటాడు.  కాబట్టి ఈ దిగి రావటం  అనేదే సృష్టిలో శివపురాణంగా లేక కుమారసంభవముగా, అగ్ని ఆవిర్భావంగా కూడా చెప్తారు. మనలోంచి శక్తి ఉద్భవం, అగ్ని ఉద్భవంగా చెప్తారు. కుమారస్వామి పుట్టడం అంటే అది. పార్వతీదేవిని ప్రకృతిగా భావన చేస్తే, శివుడు పరతత్త్వంగా భావన చేస్తే, పరతత్త్వము పరాప్రకృతి ఈ ఇద్దరి మధ్య ఈ ప్రకృతితో పని చేయించడానికి పరస్పరత్వం కార్యక్రమాన్ని నిర్వర్తించడానికి దిగి వచ్చిన అగ్నితత్వాన్ని కుమారస్వామిగా చెప్తారు. అగ్నితత్త్వము దిగి రావడానికి ముందు మొత్తం సృష్టి అంతా చీకటిగ ఉంటుంది. దిగి వచ్చిన తరువాత గాని,  ప్రకృతితో అనుసంధానము వలన కాని సృష్టి ఏర్పడుతుంది. సృష్టి ఏర్పడాలంటే శక్తి / చైతన్యము / english లో Force అంటారు. ఇది దిగి వచ్చి ప్రకృతిని దానితో అనుసంధానము చేసినపుడు, ఆ interaction వల్ల మొత్తం సృష్టి అనే chemistry, సృష్టి అంతా కూడ తయారవుతుంది. ఎందుకంటే దీనంతటికి మూలం ఆ original గ ఉండేటటువంటి తత్త్వం. ఆ తత్త్వం అధారంగా సంకల్పం దిగి వస్తే, ఆ సంకల్పం ఆధారంగా శక్తి దిగి వస్తే, శక్తి, పరతత్వం క్రీడగ మొత్తం ఈ సృష్టి అంతా ఏర్పడుతుంది. శక్తి దిగి రాకముందు మొత్తం అంత చీకటిగ ఉండటాన్ని తారకాసురుడు ఆవరించి ఉన్నాడు. దేవతలు అశక్తులై ఉన్నారు అని చెప్తారు. ఎందుకంటే ఇంకా శక్తి ఆవిర్భావం కాలేదు కాబట్టి. శక్తి ఆవిర్భావం అవడం ఏమిటి,

అగ్ని పుట్టడం ఏమిటి, చీకట్లు తొలగటం ఏమిటి, ఇదంతా ఒక్కసారే జరుగుతాయి. అందుకని కుమారస్వామి, పుట్టిపుట్టగానే ఐదేళ్ళ పిల్లవాడు అయిపోయి దేవతా సైన్యాన్ని నడిపించుకుంటూ తారకాసురుడనే అసురుని సంహరించినట్లు చెప్తారు. ఎప్పుడైతే ఈ శక్తి ఉద్భవించిందో అప్పుడు చీకట్లు ఉండడానికి వీల్లేదు. మొత్తమంతా వెలుగు ఉంటుంది. అంటే అంతకుముందు ఉన్న చీకటే ఇప్పుడు వెలుగుగా మారింది. ఇలా మారడానికి అగ్ని ఉద్భవించి ప్రకృతితో అనుసంధానము వలన creavitive activity పుట్టుకు వచ్చింది. ఎప్పుడైతే ఈ పదార్థము లేక ద్రవ్యముతో శక్తి అనుసంధానము జరుగుతుందో అందులో నుంచి క్రియాశీలమైన ఒక programme మొదలు అవుతుంది. అదే creativ Intelligences. ఏమిటి create చేస్తాడు? ప్రకృతి శక్తులు ఆధారంగా అనిర్వచనమైనటువంటి తత్వం ఏదైతే ఉందో ఆ తత్వాన్ని, ఈ ప్రకృతి శక్తులును కలిపి జమిలిగా అల్లుకుంటూ మొత్తం ఈ సృష్టి వ్యక్తం చేస్తారు. బ్రహ్మ నుంచి వ్యక్తము అయ్యేదంతా కూడ ఆ మూడే. అంటే భగవంతుని నుంచి వ్యక్తమైన ప్రకృతి, శక్తులు రెండు కలిపి అమ్మవారంటారు. అయ్యవారు, అమ్మవారు నుంచి వ్యక్తం అయ్యే బ్రహ్మ, అయ్యవారిని, అమ్మవారినే బయటకు వ్యక్తము చేస్తూ ఉంటాడు మొత్తము అన్ని లోకాలుగాను. ఆ లోకాలన్నీ ఏర్పడటానికి పెట్టుబడి ఎవరయ్యా అంటే ఈ ముగ్గురే! వీళ్ళు లేకపోతే ఏమి లేదు. ఇందులో నుంచి శక్తి ఆవిర్భావం ఎక్కడ ఆగిపోతే అక్కడ పదార్థం పడిపోతుంది. పదార్థం కలిసి ఉండడానికి, మార్పు చెందటానికి దాంట్లో ఉన్న చైతన్యమే ఆధారం. ఆ చైతన్యం ఉద్భవించడానికి ఒక కేంద్రం ఉంటుంది, ఆ కేంద్రం ఆధారం. అణువుకు ఒక కేంద్రం, దాని చుట్టూ కొన్ని electrons. ఆ electrons ఈ కేంద్రం ఆధారంగా ఏర్పడి, వాటి చుట్టూ తిరుగుతు వీటిమధ్య activity, movement జరుగుతుంది. అందులో జరిగే movement అంతా కూడా శక్తి. ఈ శక్తి ఎక్కడ నుంచి ఉద్భవిస్తోందంటే, ఆ కేంద్రం నుంచే ఉద్భవిస్తుంది. ఉద్భవించిన ఆ శక్తి, ఆ పదార్థాన్ని అప్పటికప్పుడు మారుస్తూ ఉంటుంది. అందుకని మార్పు జరుగుతూ ఉంటుంది. అలాటి మార్పే జరిగి ఖనిజాల్లో బొగ్గే వజ్రంగా మారే స్థితికి చేరుతుంది. ఇవన్ని కాలం రూపం లో శక్తి, పదార్థం తో కూడిన interaction వలన, ఈ రసాయన చర్యలవల్ల సూక్ష్మంలో ఉన్న ప్రకృతి స్థూలంలోకి రావటం, స్థూలంగా ఉన్న ప్రకృతి సూక్ష్మంలోకి వెళ్ళడం జరుగుతూ ఉంటాయి. సూక్ష్మం నుంచి స్థూలంకి ఎట్లా

వెళ్ళున్నామో చెప్పగలిగిన వాళ్ళు ఋషులు. స్థూలం నుంచి సూక్ష్మం లోకి ఎలా వెళ్ళున్నామో  చెప్పగలిగిన వాళ్ళు ఆధునిక ఋషులు లేక శాస్త్రజ్ఞులు. రెండిటిని దర్శించి మనకి ఇచ్చినటువంటి వాళ్ళు ఋషులే. వాళ్ళు రెండు పక్కల చూసారు. అవరోహణ చూసారు ఆరోహణ చూసారు. అవరోహణం నుంచి ఆరోహణం దర్శనం చేసారు.  మనకి ముందు నాలుగు బాగా స్థిర పడాలి. ఆధ్యాత్మిక మార్గములో ప్రతివారు తెలుసుకోవలసిన ముఖ్యమైనటువంటి తాళం చెవి  ఈ నాలుగు. అందుకనే ప్రతి దేవుడికి నాలుగు చేతులు పెట్టి, యుగాలు నాలుగని చెప్పి, మాసానికి వారాలు నాలుగని చెప్పి. వర్ణాశ్రమధర్మాలు నాలుగని చెప్పి, ధర్మము నాలుగు పాదాలని-- ఇట్లా మనకి ప్రతిదీ నాలుగు, నాలుగు గ ఎందుకు చెప్పారంటే, నాలుగు ఒక set. ఇందాక చెప్పిన మూడు బ్రహ్మ నుండి వ్యక్తము అవడాన్ని చతుర్ముఖమైన కమలం, నాలుగు దళాలు అయినటువంటి కమలం విచ్చుకుంటే బ్రహ్మ అందులోంచి వచ్చాడు. నాలుగు తలకాయలు ఉన్నాయి. కనిపించేది ఆ నాలుగోవాడు తప్ప, ముందు ఉన్న( లేదా వెనక ఉన్న) ఆ మూడు కనబడవు. మనలో కూడా ఈ నాలుగు ఉన్నాయి. నాలుగు చతురాత్మలు మనము, మన మనసు, మన ఇంద్రియాలు, మన శరీరము. మాములుగా ఎవరికైనా కనిపించేది మన శరీరమే తప్ప అంతకు లోపలున్నటువంటి విషయాలు కనపడవు. అలాగే సృష్టిలో కూడ మనకి కనిపించే ప్రతీ వాటి వెనకాల మూడు dimensions ఉన్నాయి. ఏది మనం చూసినా దాని వెనకాల మూడు ఉన్నాయని గుర్తు పెట్టుకోవాలి. ఒక ఆకు చూసినా, ఒక మొక్క చూసినా, ఒక చెట్టు చూసినా, ఒక మనిషిని చూసినా, ఒక జంతువుని చూసినా ఏదైనా సరే భౌతిక కక్ష్య లోనికి దిగి వచ్చిన దాని వెనకాల మూడు ఉన్నాయని గుర్తు పెట్టుకోవాలి. ఈ కనిపించే దాని వెనకాల ఆ మూడుని అవగాహన చేసుకుంటే నాలుగోది పూర్తిగా అవగాహన అవుతుంది. అందుకనే ఆ మూడు తత్వాలు ఎప్పుడూ దివ్యముగాను, అమృతముగానే ఉంటాయని చెప్పారు. "త్రిపాదస్య అమృతం దివి," అని చెప్పింది అందుకు. మూడు పాదాలు అమృతత్త్వం కలిగి ఉంటాయి. ఒక పాదము మారుతూ ఉంటుంది కాబట్టి, మార్పే మృత్యువు అన్నారు కాబట్టి ఇది మృతత్త్వము కలిగిందని చెప్తారు. అమృతత్త్వసిద్ధి ప్రతి దాంట్లోనూ ఉంటుంది. మనము ఎరిగిన దేహము మారుతుంది తప్ప, అంతకు పైన ఉన్నవన్నీ ఎప్పుడూ ఉంటాయి. ఈ మార్పు చెందేదాంట్లో  మార్పు చెందని దాన్ని చూడడం అనే దర్శనాత్మక విజ్ఞానాన్ని

ఋషులు మనకి ఇచ్చారు. అది దర్శనము చేయడానికి మనకు రకరకాలుగా చెప్పారు. పాశ్చాత్యదేశాలలో ఇటువంటి దర్శనము జరిగినటువంటి Pythagoras అనేటటువంటి మహర్షి తన Pythagorean Theory లేదా సిద్ధాంతంలో లంబకోణ త్రిభుజం యందు కర్ణము మీద చతురస్రము మిగిలిన రెండు భుజముల మీది చతురస్రములతో సమానము అని చెప్తారు. లంబ కోణం ఎలా ఏర్పడుతుందంటే ఒక vertical ఒక horizontal మధ్య ఉన్నటువంటి పరస్పరత్వము సమానముగా ఉంటె సమకోణము లేదా ౯౦ డిగ్రీల లంబకోణము. Spiritual Mathematics లో verticals ని భగవత్ తత్త్వము, horizontals ని ప్రకృతి తత్త్వము అని చెప్తారు. ప్రకృతి తత్త్వము, భగవత్ తత్త్వము మధ్య జరిగే అనుసంధానము వలన పుట్టుకొచ్చేది శక్తి. అది కర్ణంగా ఏర్పడుతుంది. కర్ణం చాల శక్తివంతమైనది. ఎందుకంటే ఇద్దరి లోంచి పుట్టుకొచ్చినది. ఇద్దరు ఉండగా పుట్టుకొచ్చినది కాబట్టి. అందుకే కర్ణుడు కూడాచాల శక్తివంతుడు. కర్ణుడని పేరు పెట్టడానికి కారణం అదీ. భారతంలో మిగతావాళ్ళ కంటే కర్ణుడి గురించే ఎక్కువ భయపడతారు. జయించడం కష్టమైన శక్తి. శ్రీకృష్ణుడు కూడ చాల సమాలోచన చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది కర్ణుడితో యుద్ధం చేయడానికి. మహా శక్తివంతుడు. ఎందుకంటే కర్ణం కాబట్టి! కర్ణము మీద ఏర్పడే చతుర్భుజం ఏదైతే ఉన్నదో దాన్ని 'చతుర్ముఖ బ్రహ్మ' అంటారు. త్రిభుజంలో కర్ణము మీదుగా చతుర్భుజం ఏర్పడుతుంది. ఎందుకని? కర్ణము is the product of the vertical and the horizontal. ఒక vertical ఒక horizontal ఈ రెండు ఏర్పడగానే మూడోది శక్తి ఉద్భవించక తప్పదు. ఎందుకు తప్పదంటే సంకల్పం వచ్చింది కాబట్టి దాన్ని నిర్వర్తించేటటువంటి శక్తి పుట్టకపోవడం జరగదు. త్రిభుజం ఏర్పడటం తప్పదు. త్రిభుజం ఎప్పుడైతే ఏర్పడిందో దాని మీదే చతుర్భుజం ఏర్పడుతుంది. ఎక్కడ ఏర్పడుతుంది? కర్ణము మీదే ఏర్పడుతుంది. ఇంక ఎక్కడా ఏర్పడదు. శక్తి ఆధారంగా నాలుగవ వాడు బయటకి వస్తాడు. అందుకని 'కర్ణము మీద చతుర్భుజము' అన్నారు. కర్ణము మీద చతుర్భుజములో ఏముంటుందీ? ఈ verticals కి సంబంధించిన తత్త్వం, horizontals కి సంబంధించిన తత్త్వం ఆ చతుర్భుజంలో ఉంటుంది. అందుకని కర్ణం మీద ఉన్న చతుర్భుజము, మిగిలిన రెండు భుజాల మీద ఉన్న చతుర్భుజములతో సమానము. The sum total of two squares on the other three sides of the triangle is equal to the

square on the hypotenuse. ఇది మనకి చిన్నతనములో పాఠముగ అందరికి చెప్తారు. మంచికో చెడుకో ఈ పాఠం మాత్రం చెప్పడం దైవ నిర్ణయం అనుకుంటా. కానీ ఇది ఆధ్యాత్మిక మార్గములో spiritual geometric తెలిసినవారికి సంకేతాలున్నాయి. Vertical line కి ఒక సంకేతము ఉంది. Horizontal line కి ఒక సంకేతము ఉంది. Vertical అంటే భగవత్ తత్త్వం. అగ్ని కూడా అందుకనే ఊర్ధ్వ ముఖంగా వెళ్తూ ఉంటుంది. నీరు? Horizontal. అందుకనే నీరుని అమ్మవారుగ చూసుకోవాలి, అగ్ని శక్తి స్వరూపముగ చూసుకోవాలి. పదార్థములో అన్ని ఇమిడి ఉన్నాయి. వాయువు permeating agent! వ్యాపనము చెందిన భగవత్ శక్తి వాయువు. నిట్టనిలువుగా అట్లా ఆకాశములోకి పెరిగిపోయేది అగ్ని. భూమి మీద పరచుకొనేది జలం. వీటన్నిటికీ ఆధారం ఆకాశము. ఇట్లా మనం అవగాహన చేసుకోవాలి. ఈ hypotenuse మీద ఉన్నటువంటి చతురస్రం లోంచి ఏమి దిగి వస్తుందంటే భగవత్ తత్త్వము, ప్రకృతి తత్త్వము రెండు చక్కగా మేళవింపబడి శక్తితో కూడి అందులోకి దిగి వస్తుంది. ఆ చతురస్రాన్నే 'విరాట్ స్వరూపం' అంటారు. 'తస్మాత్ విరాడజాయతః' ఏమి జరిగిందయ్యా అంటే బ్రహ్మగారి లోంచి 'అండం' పుట్టుకొచ్చింది. దాన్నే 'బ్రహ్మాండం' అన్నారు. బ్రహ్మాండం అంటే బ్రహ్మ నుండి వ్యక్తమైన అండం. ఈ అండం లోంచి రాగానే అండంలో ప్రకృతికి సంబంధించినటువంటిది , శక్తికి సంబంధించినటువంటిది తత్త్వాలు ఒక దానికి ఒకటి పరస్పరత్వం చెందడం వలన ఇరవై నాలుగు తత్త్వాలు గుర్తుకు పుట్టుకు వచ్చినాయి. అవే మనకి గాయత్రి మంత్రంగా ఇస్తారు. The formative principles of the creation. 24 తత్త్వాలతో కూడిన గుడ్డు ఒకటి తయారైనది. అన్నీ పుట్టుకు వచ్చాయి కాని దేనితోనూ దేనికీ అనుసంధానము లేదు. అట్లా ఉండిపోయింది. ఎందుకుండిపోయిందంటే ఈ లోపల బ్రహ్మగారికి మన నుండి ఒక బ్రహ్మాండమైన గుడ్డు పుట్టుకొచ్చిందనే భావన కలిగింది. మన నుంచి పుట్టుకొచ్చినదనగానే అయిపోయింది. మన ద్వారా అనేది మరచిపోయాడు. తన నుండి అంతకు ముందు వచ్చినటువంటి వాళ్ళు వ్యక్తమయ్యారు. వ్యక్తమైతే, అందులోని గొప్పదనం తనకి ఆపాదించుకోగానే ఆ ఇరవై నాలుగూ అలా ఉండిపోయినాయి. ఎందుకంటే భగవత్ తత్త్వము అందులోకి జొరబడలేదుట. ఈ మహత్యమంతా నేనే చేశాను అనుకోడం వల్ల. ఈ మైకు లోంచి అంటే విశుద్ధి మనకు మైకు. ఈ పార్వతి కుమార్ మాట్లాడుతున్నాడని అనుకున్నారనుకోండి,

పార్వతి కుమార్ ఆగిపోవచ్చు. ఇక్కడ ఎవరు మాట్లాడుతున్నారు? నేను! ఆ నేను ఎక్కడదీ? ఆ 'నేను' ఏమి చేస్తున్నాను అంటే సుషుమ్నలో ఉండె భగవత్ తత్త్వము ఏదైతే ఉందో అది హృదయ కేంద్రము నంచి వ్యక్తమై అక్కడ నుంచి మనకి విశుద్ధి ద్వారా బయటకి వచ్చింది. దాని అనుభూతి వేరు. మిగతా అనుభూతి వేరు. అట్లా ఉంటుంది. కాబట్టి ఎవరు ఎప్పుడు ఏది చెప్పినా సరే అందరిలోంచి వ్యక్తమయ్యేది ఒకడే అని గుర్తు పెట్టుకున్న వారు నుంచి భగవంతుడు వ్యక్తము అవుతాడు. లేకపోతే కార్యక్రమము కొంత దూరమే వెళుతుంది తప్పా తర్వాత  ముడి సరుకు ఉండదు. నువ్వు పై tank ఎంత పెద్దది పెట్టుకున్నా అందులో నుంచి నీళ్లు రాకపోతే ఏమి లాభం? Wire ఎంత ఉంటె ఏమి లాభం అందులో నుంచి విద్యుత్ ప్రసారము కాకపోతే. ఎంత మంచి మైకు పెట్టుకుంటే ఏమి లాభం అందులో నుంచి విద్యుత్ రావాలి కదా. కాబట్టి మూల పదార్థము దిగలేదు. అసలు  ఇదంతా ఎందుకు అనుకుంటాడు.  తర్వాత తాను ఎక్కడ నుంచి పుట్టుకు వచ్చాడన్న భావన చేస్తాడు బయటకి వచ్చాక. ఈ మూడింటి లోంచి బయటకి వచ్చినవాడు తాను ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాడో తనకి తెలియదు. నేను ఎక్కడున్నాను అనుకుంటాడు. చూస్తే పద్మం ఉంటుంది. ఈ పద్మము యొక్క కాడ ఎక్కడుందో వెతకటానికి వెళ్తాడు. పోయి పోయి ఎంత దూరం వెళ్ళినా కనబడదు. భయము వేస్తుంది. ఎందుకేనా మంచిదని వెనక్కి వచ్చి అందులో కూర్చుంటాడు.  కొలతలు లేనటువంటి తత్త్వము నందు ఉద్భవించిన కేంద్రము అన్నమాట ఇది! అంతకు ముందు మూడు ఉన్నాయి కానీ అదృశ్యముగ ఉన్నాయి. అప్పుడు తాను ఏమి చేయాలి అన్న భావన పుట్టంగానే, 'తప' అని రెండు శబ్దాలు వినిపించాయి. తను సత్యలోకం. తరువాత పుట్టవలసింది తపోలోకం. 'తపః' అని రెండు శబ్దాలు వినిపించేసరికి, తపస్సుచెయ్యి అని తెలిసింది. తపస్సు చేసేసరికి తనలో అగ్ని పుడుతుంది. అగ్ని పుట్టేసరికి కార్యక్రమం గోచరిస్తుంది. ఏమిటంటే 'సృష్టి జరుగుతుంది నీ ద్వారా' అని. 'అమ్మో! ఇదివరకు నేను చేసినప్పుడు చాల ఇబ్బంది పడ్డాను, మళ్ళీ చేయమంటే కష్టము' అనుకుంటాడు. అనుకుంటే 'నువ్వు కాదు కదా చేసేది, నేను చేస్తుంటాను నువ్వు అట్లా నిలబడు' అంటాడు. అంతా మనమే చేయాలా అని అనుకున్నప్పుడు భయంగా ఉంటుంది. చేసేవాడు ఒకడున్నాడు మనము  ఊరికే అలా నిలబడితే అని అనుకుంటే ఎంతైనా చేయగలడు. మనమే చేద్దాం అనుకునేవాడు తన పెట్టె తన నెత్తినే మోసుకొనే వాడిలా ఉంటాడు రైల్ లో

కూర్చోని. మామూలుగ రైలు ఎక్కిన తరువాత కనీసం మన పెట్టె తీసి కింద పెడితే రైలు మోస్తుంది. రైలు లో కూడా తన పెట్టె తన నెత్తిన పెట్టుకొనే సామెతలా ఉంటుంది మన జీవితము మామూలుగా. 'మన సమస్త కార్య భారములు, మనమె మొయ్యాలి' అనే ఒక భావనతో ఉండడం వల్ల. అలా కాక పోతే ఏమి చేస్తామంటే, ఇంకోరి నెత్తిన పెడదాం అని చూస్తుంటాము. అలాకాక ఈ సమస్తమూ భగవంతుని అర్పణగా జీవిస్తే తేలిక అవుతుంది. ఆ విధముగా ఇది నేను ఇదివరకు చేసినపుడు చాల ఇబ్బందులు పడ్డాను అని బ్రహ్మ కొంచం సంకోచిస్తాడు. సంకోచిస్తే 'నీవు కాదు కదా నిర్వర్తించేది, నేను నిర్వర్తిస్తాను, నువ్వు అట్లా నిలబడు' అని చెప్తాడు. సరే నిలబడతాను అని నిలబడే సరికి వ్యక్తము అయినది తనలో బ్రహ్మాండము! బ్రహ్మాండము అంటే మనము ఊహించలేనటువంటి dimension అది! అందులోనే మనమెరిగిన భూమి, సూర్యుడు, గుంపులు గుంపులు సూర్య మండలాలు, తారక మండలాలు, మరి ఎన్నో దాన్నిండా ఉన్నాయి. ఈ సూర్య మండలాల గుంపుని ఒకసారి బయట నుండి దర్శిస్తే ఒక మత్స్యములా కనిపిస్తుందిట మొత్తము చోటులో. మొత్తము ఒక సముద్రములా భావించినట్లైతే ఆ సముద్రములో తేలుతున్నటువంటి ఒక మత్స్యము లాగ ఈ సృష్టిలో ఉన్నటువంటి సమస్త గోళములు, మండలములు కనిపిస్తాయి. ఒక్కొక్క మండలము చేపమీద ఒక్కొక్క పొలుసులా ఉన్నట్టు కనిపిస్తుందట. అది వ్యాసుని దర్శనము. భూమి నుంచి చంద్రుడికి వెళ్ళేసరికే మనకి కడుపు ఏమిటో అయిపోతుంది. వాళ్ళు ఏమి చేసారంటే, వారియొక్క చైతన్య స్ఫూర్తితో సృష్టి మొత్తాన్ని దర్శనము చేశారట. ఎలా అనిపించిందిట సృష్టి, గుంపులు గుంపులుగ సూర్య మండలాలు ఒక 5 గుంపు. ఆ ఐదుకి మరో ఏడు కలిపి పన్నెండు ఒక గుంపు. అందుకనే మనకి పన్నెండు అంటే డజన్ వాడుకలోనికి వచ్చింది. Twelve times twelve అన్నమాట. ఈ పన్నెండుకి కేంద్రము ఒకటి ఉంది దాన్నే 'సవితృ' అంటారు. అటువంటి సవితృ మండలాలకు కేంద్రముగ ఇంకొకటి. భర్గోదేవుడు అనే మండలం. దీన్నే english లో solar center or cosmic center అంటారు. ఈ గుంపులుగా ఉన్నటువంటివన్ని ఒక్కసారిగా దర్శనము చేసారు. చేస్తే, ఇపుడు ఆకాశము చీకటిగ ఉండి ఏమి లేనట్టుగ కనిపిస్తుంది కదా. ఆ ఏమి లేనటువంటి చోటులో మిలమిల మిలలాడుతూ, ధగ ధగ మెరిసిపోతున్నటువంటి సవితృ మండలాలు, ఒక్కొక్క సవితృ మండలం ఒక పెద్ద చేప మీద ఒక పొలుసులాగ కనిపిస్తున్నదిట. అటువంటి

గుంపుగా ఉన్న సవిత్ర మండలాలన్నీ చూస్తుంటే ఒక పెద్ద చేప ఒక మితము లేని సముద్రములో తేలుతోందిట. అదీ మత్స్యావతారం. అంత అండము పుట్టుకొచ్చిందండి బ్రహ్మలోంచి! మరి వాడికి గర్వము రాదా? ఖచ్చితముగా రావాలి. ఆయనకి రాకపోతే మనకి ఎక్కడ నుంచి వస్తుంది? మూలంలో లేకపోతే తరువాత వచ్చిన జీవుల లోకి రావు. ఇవన్నీ ఉండబట్టే మనలో కూడాఉన్నాయి. ఉండబట్టి కొన్ని పనులు చేస్తూ ఉంటాము. మామిడిపండులో ఉండే అన్ని రకాల అణువులని వివరణ చేసుకొని మనము గుర్తించాం అనుకోండి, అవన్ని పోగేస్తే ఒక మామిడి పండు అవుతుందా?. అవటానికి అవకాశము లేదు. అవన్నీ లేకపోతే మామిడిపండు అవదు, అవన్నీ ఉన్నంత మాత్రానా మామిడిపండు అవదు. పులిహోర వండుకున్నామనుకోండి, పులిహోర కి కావలసిన పదార్థాలన్నీ పోగేస్తే పులిహోర అవుతుందా? ఎలా పులిహోర అవుతుంది? దాన్ని వండితే అవుతుంది. వండే వాడు ఉండాలి కదా! వాడు చెయ్యి పెట్టినప్పుడు కదా ఉంటె అవన్నీ కలిసి పులిహోర వస్తుంది. అందులో ఏ ఒక్కటి పులిహోర కాదు. అలాగే మామిపండులో ఉండే రసాయన ద్రవ్యములు ఏవి కూడా మామిడి పండుని సృష్టించగల సమర్థత కలిగి ఉన్నవి కావు. అందులోకి భగవంతుడు రసస్వరూపుడుగ దిగివస్తే అది మామిడి పండు అవుతుంది. అందుకని 'రసోమృతః' లేకపోతే అన్ని అట్లాపొడి ముక్కల్లా, ఎండిపోయిన వడియాల్లా ఉంటాయి తప్ప కలిసి ఉండటానికి అవకాశము ఉండదు. ఈ కలిసి ఉండటం దేనివల్ల జరుగుతుందంటే ఆయన దిగి రావటం వల్ల జరుగుతుంది. ఆయన దిగి రాకపోతే మొత్తం ఇవన్నీ మనం కలిపేసినా, వీటన్నిటికీ ఏకత్వములో ఉన్నటువంటి స్థితి కలపటం వల్ల రావు. మందార పువ్వుకు ఐదు దళాలు ఉంటాయి. అందుకని మందారం చాల ముఖ్యము. ఐదు దళాలు మనం విడిగా కలిపి చేస్తే మందార పువ్వు అవదు. యోగం అంటే చాల మంది కలపటం అనుకుంటారు. కలపటం యోగం కాదు, అందులో ఉన్న ఏకత్వాన్ని దర్శనము చేయటం యోగము. మందార పువ్వులో ఒక ఏకత్వము ఉండి దళాలను కలిపి ఉంచుతుంది. అందుకని ఏకత్వము అంటే మొట్టమొదట చెప్పిన ఆ ఆది తత్త్వము ఏదైతే ఉందొ, ఆ అనిర్వచనమైన తత్త్వం, ఆ తత్త్వము దిగి రాక ఈ ఇరవై నాలుగు principles ఏవైతే ఉన్నాయో అవన్నీ అట్లా తేలుతూ ఉన్నాయిట ఆకాశములో, ఈ అండంలో. కాని దానికి ఒక సమన్వయము ఏర్పడలేదు. ఆ సమన్వయము ఏర్పడకపోయేసరికి బ్రహ్మ కొంచము బాధ

పడతాడు. ఏమిటి ఇలా అయినదని. మళ్ళీ 'తప' అని వినిపిస్తుంది. తపస్సు చేసుకుంటాడు. ఆ తపస్సులో గుర్తుకు వస్తుంది, 'మనము కాదు కదా చేసేది, ఆయన నేను చేసుకుంటాను, నువ్వు నిలబడమన్నాడు కదా, నువ్వు చేస్తున్నావు అని అనుకుంటున్నావేమిటి' అని భావన వస్తుంది. అప్పుడు మళ్ళీ నిలబడతాడు. నిలబడితే అందులోంచి దిగి వస్తాడు అపరిమితమైనటువంటి స్థితి నుంచి అండము లోకి దిగి వచ్చి నిర్వర్తిస్తాడుట అయన వాసుదేవుడు. అంతకు ముందు ఉన్నటువంటి వాడు నారాయణుడు అంటారు వైష్ణవ పరముగ. శైవ పరముగ పరమశివుడు అంటారు. శాక్తేయ పరముగా ఆదిపరాశక్తి అంటారు. త్రిగుణాతీత అంటారు త్రిగుణాతీతము అయినటువంటిది ఈ త్రిభుజము ద్వారా దిగి వచ్చి త్రిగుణాత్మిక అయినదని అంటారు. అందుకని ఎవరు ఏ terminology పట్టుకుంటే ఆ terminology లోంచి అవగాహన చేసుకోవచ్చు కాని అదే ఆ పేర్లే అనుకోడంలో ఇబ్బంది వస్తుంది. వాడు నారాయణుడు అంటాడు, వీడు పరమ శివుడు అంటాడు. ఇద్దరూ పోట్లాడుకొని కొట్టుకుంటూ ఉంటారు. ఇద్దరు తిన్నది పులిహోరే అయినా, ఒకడు పులిహోర అంటాడు. ఇంకోడు చిత్రాన్నము అంటాడు. మరొకడు tamarind rice కదా అంటాడు. ఎందుకంటే చింతపండు ఉంటుందని. హరిద్రాన్నం అంటాడు సంస్కృతము వచ్చినవాడు. ఇవన్నీ పేర్లే! మన దురదృష్టము ఏమిటంటే ఈ పేర్లలో ఇరుక్కుపోతుంటాము. వైష్ణవులు వైష్ణవ నామాలలో ఇరుక్కుపోతుంటారు, శైవులు శైవనామాలలో ఇరుక్కుపోతుంటారు, శాక్తేయులు శక్తికి సంబంధించిన నామాలలో ఇరుక్కుపోతుంటారు. ఇవన్నీ చాలవన్నట్టు కొత్త పేర్లు పట్టుకొస్తుంటారు మరి కొంతమంది. పేర్లలో ఇరుక్కుపోడం అంటే concept లో ఇరుక్కుపోడమే. Concept లో ఇరుక్కు పోయేవాడికి conception ఉండదు. ఎప్పుడైతె సత్యమును సిద్ధాంతీకరించి దానికొక crystalized form తీసుకొస్తామో, ఆ form పట్టుకు తిరుగుతుంటారు తప్ప అందులో ఉండే తత్త్వాన్ని అవగాహన చేసుకోరు. తత్త్వము అవగాహన చేసుకోవాలంటే భక్తి, శ్రద్ధ కావాలి. అన్ని నామములు, అన్ని రూపములుగా భగవంతుడే ఉన్నాడనే openness ఉండాలి. ఉంటె వ్యక్తమై ఇవన్నీ తెలుస్తాయి. అప్పుడు Pythagoras అన్న మహర్షిని నిరాదరణ చేయనక్కరు లేదు. అయన విజ్ఞానము కూడ తెలుస్తుంది. ఏదైనా తెలుస్తుంది. కాబట్టి ఈ విధంగా వ్యక్తమయ్యేది ప్రతీది కూడ మూడుగా ఏర్పడటం, మూడు నుంచి నాలుగుగా ఏర్పడటం. మూడు పునాదిగ, నాలుగు కనబడేటట్టుగా ఏర్పడుతుంది. మనం

మాట్లాడే మాటలు కూడా అట్లాగే వస్తుంటాయి. మనం ఉండబట్టి, మనలోంచి ఒక idea పుట్టబట్టి, ఆ idea కి ఒకభాష ఏర్పరచబట్టి, ఆ భాష వ్యక్తము చేయబట్టి మాట వస్తుంది. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అంటారు వీటినే. అంతకు ముందు మూడు స్థితులు లేకపోతే మాట్లాడే మాట లేదు కదా. మనం లేకపోతే మాటలేదు మనకి ఒక ఆలోచన రాకపోతే మాటలేదు. ఆలోచన భాషగా మార్చకపోతే మాట లేదు. కాబట్టి, మూడు స్థితులు దాటి నాలుగో స్థితిలో వ్యక్తము అవుతుందయ్యా మొత్తము అంతా. కనబడుతుంటే వెనకాల ఇంకా ఏమి లేదంటావేమిటి, అంత కన్న అజ్ఞానము ఇంకేమైనా ఉందా అంటారు ఋషులు. ఋషి అంటే ఏమిటి? కనబడుతున్న దానిలోంచి చూసేటటువంటి వాడు ఋషి. లోదృష్టి గల వాడు ఋషి. పైదృష్టి కలిగినటువంటి వాడు మన బోటివాడు. సామాన్యులు. లోదృష్టి ఏర్పడితే ఏమౌతుందంటే లోపలకి మూడు మెట్లుగా ఎక్కి చూడవచ్చుట. బయట కనిపించేదానికి లోపల మూడు సోపానాలున్నాయి. అందుకనే గర్భాలయములోకి వెళ్ళేటపుడు Hall of Learning, Hall of Wisdom and Sanctum Sanctorum, అందులో దేవుడు. కనీసము మూడు ఆవరణాలుండాలిట గుడి అంటే. అందుకనే కనీసము మూడు ప్రదక్షిణలేనా చేయమంటారు. మొదటి ప్రదక్షిణతో భౌతికమైన స్థితి దాటాలి, రెండవ ప్రదక్షిణతో ప్రాణమయ లేక మన ఇంద్రియములకు, కామమునకు సంబంధించిన లోకములన్నీ దాటాలి. మూడవ ప్రదక్షిణతో మనస్సనే లోకాలని దాటాలి. ఈ మూడు దాటితే నాలుగుగా మనకి మనమే భగవంతుడుగా దర్శనము ఇస్తాడు. మన ఎదురుగ ఉన్నవాడు మనం అంత ఒకటే అయిపోతాం. అది 'అసావాదిత్య బ్రహ్మ'. అతడు అని పిలవబడే సూర్యుడు, నేను ఒకటే అని చెప్పడం. కాబట్టి Sanctum sanctorum గార్భాలయము లేదా గర్భ గుడి లోకి మనం వెళ్లేసరికి ఈ మూడు వదిలేసినవాడికే దర్శనము తప్పా, లేకపోతే దర్శనం అయ్యిందా అంటే, అయ్యింది అంటాడు. ఏ దర్శనం అయ్యిందంటే వాడికి రాయి కనిపిస్తుంది. నిజముగా గుడిలో దర్శనము చేసుకోవాలంటే దానికో పద్ధతి ఉంది. మూడు ప్రదక్షిణాలు చేయాలి. ప్రదక్షిణాలు చేసేసరికి మూడు వదిలేయాలి. ఏమి వదిలేయాలి? మన ఆలోచనలు, మన కోరికలు. కోరికలతో నువ్వు గర్భాలయము లోకి వెళితే నువ్వు physical గా వెళ్ళావే తప్పా, నీకు గర్భాలయము తెరచి ఉంచబడదు. అదీ తమాషా! అందుకని మొదట ఈ ప్రదక్షిణ అయ్యేసరికి దేహస్మృతి పోవాలి. అంటె మన బట్ట బాగుందా.

బొట్టు బాగుందా? తల చెరిగిపోయిందా? ఇవన్నీ చూసుకుంటూ గుడిలో తిరగడం బయట తిరగడమే! Physical aspects ఉంటాయి కదా. పక్క వాళ్ళు ఏమి చీర కట్టుకున్నారు, ఏమి నగలు పెట్టుకున్నారు? జరి ఎంత ఉంది? ఇట్లా చూసేవాళ్ళు లేరు? ఇంకెవరు వస్తున్నారో చూసేవాళ్ళు ,మనము ఎట్లా తిరుగుతున్నామో చూస్తున్నారా అని చూసేవాళ్ళు. ఇట్లా భౌతికమైన కక్షలో భావన మొదటి round లో దాన్ని neutralize చేసేయాలి. రెండో round ప్రదక్షిణ అయ్యేసరికి ఇంకేమి కోరికలుండకూడదుట. మనకి ప్రదక్షిణ చేసే time కూడ ఉండదు. సరాసరి గుడిలోకి వెళ్ళి, అది కూడ recommendation పట్టుకొని చూసేసి బయటకి వచ్చి, ఆ కొబ్బరికాయ తినేసి వెళ్ళిపోతాము. అది కూడ కొబ్బరికాయ తెచ్చే time ఉంటె. మూడో round ప్రదక్షిణ అయ్యేసరికి ఆలోచనలు ఎత్తేసేయాలిట. అప్పుడు ప్రదక్షణలు పూర్తి అయ్యేసరికి ధ్వజ స్థంభము దగ్గర నిలబడమన్నారు. అప్పుడు నీకు ఏమి తెలియాలంటే, 'నేను కూడా ఈ ధ్వజస్తంభము వలే స్తంభమును' అని తెలియాలి. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడ్ని ఈ స్తంభములో ఉన్నాడా అంటే, ఫెళ ఫెళ మంటూ వచ్చేస్తాడు బయటకి. అంత వెలుగుంటుంది లోపల. Tubelight inside. మన వెన్నెముకలో చక్కటి చిన్న దారం కన్న సన్న వెలుగు ఒకటి ఉంటుంది. 'బిసతంతుతునీయసీ' అంటాము లలిత సహస్రనామములో. ఒక కమలము తీసుకొని దాని కాడలోచూస్తే దారాలు మనం ఊహించలేనంతగా కనిపిస్తాయి. అందులో ఎన్ని ఉంటాయో. ఒకదాంట్లో ఒకటి, ఒకదాంట్లో ఒకటి అలా మనకి అరటి బోదలో ఉన్నట్టుగా ఉంటాయి. అంత సూక్ష్మాతి సూక్షమైనటువంటి వెలుగు దారముల వలె లోపల మనకి ఒక స్తంభము ఉంటుంది. అది మనకి ధ్వజ స్తంభము. అది చూడంగానే మిగతావి మనకి గుర్తు ఉండకూడదు.. నా పేరు ఇది, నా ఊరు ఇది, ఇవన్నీ పోవాలి. అంటే personality drop అవ్వాలి. ఇలా లోపలకి మనము వెళ్తే ముందు దేవుని వాహనము కనిపిస్తుంది. దేవుని వాహనం మనం. దేవుడికి జీవుడు వాహిక, జీవుడికి శరీరం వాహిక. దేవుడు దిగ రావాలంటే. వాహికలు కావాలి. మనతో పనుంది ఆయనకి. Current ఉంది. దిగి రావాలంటే మరి ఏదో ఒకటి, wire లేకపోతే current దిగి రాదు. ఉంటుంది కాని దిగి రాదు. దిగి రావటానికి వాహిక కావాలి.అట్లా దేవుడికి జీవుడు వాహిక, జీవుడికి శరీరం వాహిక. అందుకనే దేవుడిని పురుషోత్తముడు అన్నారు, జీవుడిని పురుషుడు అన్నారు, అక్షర పురుషుడు అన్నారు. దేహాన్ని క్షర పురుషుడు అన్నారు. మూడు -

క్షర పురుషుడు అంటే శరీరం, అక్షర పురుషుడు మనం జీవులుగా. పురుషోత్తముడు - ఇంత మంది జీవులుగా లోపల కేంద్రముగాను ఉన్నటువంటివాడు. గుడిలో ఎప్పుడైతే మనం దైవం యొక్క వాహనము దగ్గరకి వెళ్ళామో మనకి అక్కడ గుర్తు రావాలి, ఏమిటి? ఇంత వరకు మనం వాహనము, ఇక్కడ నుంచి ఆ స్థితి కూడా మైమరచి తన్మయమై గర్భాలయములోనికి  అడుగు పెట్టాలి. తన్మయము అంటే, తత్ మయమే తన్మయము. 'తత్' ఆయన పేరు. 'అది' దాని పేరు. ఎందుకంటే దానికి ఏ పేరు పెట్టినా ఇబ్బందే, అందుకని అది అనేసారు. కాబట్టి 'అది' అయిపోవాలి అక్కడనుంచి. నందిని చూసి అది అయిపోవాలి తప్ప మనం ఇంకోటేదో అయిపోకూడదు. అలా దేవాలయము లోకి ప్రవేశానికి, నిర్గమముకి ఒక శాస్త్రము ఉన్నది. అట్లా దేవాలయము లోకి వెళ్లిన వాడికి దర్శనము తప్పా, గబగబా వెళ్ళిపోయి, లోపలకి వెళ్ళిపోయి, మిగతా వాళ్ళని తన్నుకుంటూ, పక్క వాళ్ళను గుద్దుకుంటూ ముందుకు వెళ్ళిపోయి, మనవాళ్ళందరూ చూస్తున్నారా లేదా. వాళ్ళ గురించి తాపత్రయం — ఏమీ లాభం లేదు. వాళ్ళ సంగతి వదిలేయండి. దేవాలయములోకి అట్లా ఎట్లా enter అవుతామో, అక్కడ నుంచి భగవంతుడు దిగి వచ్చాడనుకోండి. గర్భాలయము లోంచి భగవంతుడు బయటకి రావాలంటే ఏమి చేయాలి? First step ఆయన వాహనము ఎక్కాలి. వాహనము ఎక్కి, ధ్వజ స్తంభము దగ్గరకు వచ్చి, మూడు ప్రదక్షిణలు  చేసి బయటకి రావాలన్నమాట దేవుడు. అంటే, నేను అనేటటువంటి తత్త్వము నాలుగుగా బయటకి వస్తుంది. నేను, నా మనస్సు, నా ఇంద్రియములు, నా శరీరము. అంతా నేనే. ఇది నాది కాదు అనుకొనే వాళ్ళు మెట్ట వేదాంతులవుతారు. ఇది కాదు అన్నపుడు లెంపకాయ కొడితే ఎందుకు ఏడుపు రావాలి? మెట్టఎక్కితే వేదాంతం  ఒక రకముగా ఉంటుంది. పనుల్లో ఉంటె ఒక విధముగ ఉంటుంది. అందుకనే, 'నేను నడుస్తున్నాను' అనుకున్నపుడు భౌతికమైన చైతన్యము ఒకటి కలిగి ఉన్నట్లు. 'నేను' కోరుతున్నాను అన్నపుడు కామమయమైన, ప్రాణమయమైన ఆత్మగ ఉన్నట్లు. నేను ఆలోచిస్తున్నాను అన్నపుడు మనోమయమైన ఆత్మగా ఉన్నట్టు. నేనుగ ఉన్నాను, ఆలోచనలు దాటి. ఇది మనకి తెలీదు మాములుగా. ఎందుకంటే, సాధన చేసుకుంటే కాని తెలిసే విషయము కాదు. మన original అది. నేను అనే  original నాలుగుగా వ్యక్తము అవుతుంటుంది. కాని మనకి వ్యక్తమైన నాలుగోదే తెలుసు తప్ప దాని వెనకాల ఉండే మూడు తెలియదు. అందుకనే గుడి ఆకారం  ఒక చతురస్రం మీద ఒక

త్రిభుజం నిర్మాణము చేసి ఇస్తారు. ఇంకో రకముగ కట్టవచ్చుగా గుడి? అంటే ఒక cube మీద ఒక pyramid. చతురస్రం నాలుగుకు సంకేతము. దానిమీద ఉండే pyramidicle లేదా triangular structure మూడుకి సంకేతము. అంటే మూడే నాలుగుగా దిగి వచ్చిందిరా అని మనకి తెలియజేయడానికి అలా structure చేసారు. ఇళ్ళు కూడ ఇదివరకు అట్లాగే కట్టేవారు. అది Complete house. మానవుడు కూడ అంతే. He is a temple of three and four. ఇప్పుడు మనము ఇళ్ళు తలకాయలు తీసేసినట్లు కట్టుకుంటున్నాము. అంటే slabs వేసేసుకుంటున్నాము కదా. ఇదివరకు మనకి slabs లేవు. ఆ మూడు అన్న తత్వానికి, మనకి మధ్యలో slab లాగ concrete ఒకటి అడ్డు పడుతూ ఉంటుంది. గుడిలో ఓంకారము చేస్తే అట్లా వెళ్లి, ఆకాశములోకి చొచ్చుకుంటు వెళ్లి పైనుంచి తత్వాన్ని మనకి గోపురం నుంచి ఆ కలశాల లోంచి తీసుకొచ్చి భగవంతుని దగ్గరకి వచ్చి భగవంతుని కళ్ళల్లో నుండి మనలోకి ప్రవేశిస్తుంది. లేకపోతే భగవంతుని పాదముల నుంచి ప్రవేశిస్తుంది. అది అక్కడ పెద్దలు ఆగమశాస్త్ర ప్రకారం ఎలా నిర్ణయం చేశారో దాని ప్రకారం ప్రసారం జరుగుతుంటుంది. కొన్ని కొన్ని దేవతలు కొన్ని కొన్ని గుళ్ళల్లో కళ్ళలోంచి ప్రసారము ఇస్తారు. మరి కొన్ని విగ్రహాలకు కాళ్ళల్లోంచి ప్రసారము అవుతుంది. మరి కొన్ని విగ్రహాలకి వరద (హస్తం)లోంచి ప్రసారము ఉంటుంది. వరద అంటె 'వర' 'ద' , వరాలు ఇచ్చేది. మన వెంకటేశ్వర స్వామికి కూడ దర్శనము అప్పుడు ఆ చెయ్యిని చూస్తూ ఉంటారు. ఇంకా కొన్ని చోట్ల అభయ. మరి కొన్ని చోట్ల ముక్కు. కన్య కుమారి వెళ్తే ముక్కు చూసి వస్తారు. ఒక్కోచోట ఆ దేవతకి ఆగమ శాస్త్ర ప్రకారము మహాత్ములు, శాస్త్రాలు తెలిసినవారు ఏ విధముగా గుడి నిర్మాణము జరగాలో నిర్ణయిస్తారు. దాని ప్రకారము ప్రసారము జరుగుతూ ఉంటుంది. అక్కడకి వెళ్తే దర్శనములో ఆయా విధాలుగా ఆ ప్రసారము జరుగుతుంది. గోపురము లేని చోట అవతరణము జరగదు. ఎందుకంటే మూడు లేని చోట నాలుగు రాదు. ఇలాంటి నిర్మాణాలు భగవత్ పరంగా మానవుడు జీవిస్తున్న సమయములో ప్రకృతిని అర్థము చేసుకొని ఆ విధముగా కట్టుకున్నారు గుళ్ళు గోపురాలు. మొత్తం ప్రపంచమంతా ఇట్లాగే కట్టారు. కొంతమంది pyramids కట్టారు. ఇంకొకరు conical pyramids శంఖాలు లాగ కట్టుకున్నారు. మరి కొంతమంది the triangle over the square. ఇళ్ళు కూడ అట్లాగే కట్టుకున్నారు. మానవ శరీరము కూడా అలాగే. మన తల triangle అయితే,

body దగ్గర నుంచి rectangle. తల లేకుండా మానవ శరీరము ఎంత ఉపయోగమో, గోపురము లేకుండా కట్టడము అంతే ఉపయోగము. మూడు నాలుగుకు ఆధారము. నాలుగు మూడుకి ఆధారముగా కనిపిస్తుంది. ఎప్పుడు తల క్రిందులుగాను, వంకర గాను మనము అవగాహన చేసుకుంటాము ముందు. మనము ఇల్లు కట్టినపుడు గోపురాలు ముందు cube మీద కదా triangle ఏర్పరుస్తాము. కాబట్టి triangle కి basis ఏమిటి? Square ఉంటుంది. కాని నిజానికి square is a product of the triangle. ఇది Geometry. అటునుంచి ఇటు రావటం అనేటటువంటిది పెద్దలు నేర్పించిన విద్య. ఇటు నుంచి అటు వెళ్ళటం అనేది మనం నేర్చుకున్న విజ్ఞానము లోంచి జ్ఞానములోకి వెళ్ళటం. అక్కడ ఒకటి లోంచి ద్వివిత్త్వం చెందటం. ఇక్కడ ద్వివిత్త్వం లోంచి ఏకత్వం చెందటం కొంచం కష్టం. మామిడి పండులో ఉన్నటువంటి మొత్తం chemicals , దాని పదార్థములన్నీ మనం  పోగు చేసినా మామిడిపండు ఎట్లా తయారు కాదో, Analysis లోంచి Synthesis లోకి వెళ్ళటం అంత దుర్లభమైన విషయం. Synthesis లోంచి Analysis లోకి రావటం అంత సులభం అయినటువంటి విషయం. అదే మనకి 15వ అధ్యాయము భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్తాడు. ఇది క్రింద నుంచి పైకి, పైనుంచి క్రిందకి చాల జమిలిగ గందరగోళముగ అల్లుకొని ఉంటాయి, కార్య కారణాలు బాగా అల్లుకుపోయి ఉంటాయి. దేనికి ఏది మొదలో ఏది చివరో తెలియదు. అటువంటి వృక్షములో నువ్వు మొదలు ఎక్కడో చివరి ఎక్కడో తెలుసుకుందామనుకుంటే చాల confuse అయిపోతావు, నన్ను స్మరించు, నేను కేంద్రము కాబట్టి ఈ మొత్తానికి నన్ను స్మరిస్తే మొత్తమంతా కూడ బావుంటుంది. అంటే ఏకత్వము లోంచి భిన్నత్వం లోకి దిగటం. ఆ పద్ధతిలో ఈ మూడుని అవగాహన చేసుకుంటే నాలుగు అవగాహన అవుతుంది. నాలుగు వెనకాల ఉన్న మూడుని మర్చిపోతే మనిషికి ఉన్నదీ, మిగిలినది గుడ్డితనమే! అందుకని మనకి వేదవ్యాసుడు ఆ మూడింటికి సంబంధించిన సమస్త విజ్ఞానము ఇవ్వడానికి ప్రయత్నము చేసాడు. మొత్తము 24 తత్వాలుగ తీసుకుంటే అందులో మనకి కనిపించేవి 6 తత్వాలు. 18 తత్వాలు కనిపించకుండా దివ్యముగ ఉండేవి. Three - fourth is invisible, divine and immortal. అమృతం అంటే immortal. దివ్య అంటే Divine. అవి సూక్ష్మంగా ఉంటాయి. నాలుగోది కనిపిస్తూ ఉంటుంది. ఈ కనిపించే నాలుగో దాంట్లో ఆ మూడింటిని దర్శనము చేయాలి. దర్శనం

చేయాలంటే, 24 లో 18 important తప్ప, 6 important కాదని కాదు. అందుకనే Pythagoras మహర్షి ఏమి చెప్పారంటే మొత్తము creation అంత కూడ ఒక Tetragrammaton అని. అంటే the triangle within the square అని. దీన్నే Tetractys అంటారు. ఒక త్రిభుజము దాని చుట్టూ ఒక చతుర్భుజము ఏర్పడిందంటే ఆ మొత్తం అంతా ఒక సృష్టి అంటాడు ఆయన. మన పెద్దలు చెప్పింది కూడా అదే. వేదవ్యాసుడు ప్రత్యేకించి అదే చెప్తుంటాడు. ఏమని? "చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణాయే మనీషిణః" అనేటటువంటి ఒక శ్లోకం. "చతుర్ వర్గ ఫలం జ్ఞానం కాలావస్తా చతుర్ విధ" అనేటటువంటిది ఇంకొకటి. అలాగే ఇంకోటి ఏమిటంటే, "చత్వారి శృంగా త్రయోస్య పాదా ద్వే శీర్షే సప్తహస్తాసో వినియోగః" ఎక్కడ చూసినా ఈ నాలుగుని జాగ్రత్తగా చెప్తూ అందులో నాలుగో దాంట్లో కనపడని 18 అంశాలు చెప్తాను మీకు అని, పూనుకొని మనకి ఆయన 18 పురాణాలు, 18 పర్వములుగా మహాభారతం, అందులో 18 అధ్యాయములుగా భగవద్గీత, 18 రోజులు యుద్ధము మహాభారతములో. 18 అక్షౌహిణీలు సైన్యము ఇలా .... ఇవన్నీ 18 18 అంటె ఈయనకి ఏమన్నా కొంచం వ్యామోహమా అని అనిపించేట్లుగా ఉంటుంది. అంకెల పరముగ తీసుకుంటే, 18 అంకెలో ఒకటికి 'య'అనే శబ్దము వస్తుంది. 'య' అనే శబ్దానికి ఒకటి సంకేతము. 'జ'అనే శబ్దమునకు 8 సంకేతము. అందుకనే '81' ని జయముగ చదువుకోవచ్చు. భారతానికి 'జయము' అని పేరు పెట్టారు. ఎందుకంటే, అందులో ఉన్న ధర్మాలను ఆచరిస్తే ఈ సృష్టిలో జయము తప్ప ఇంకొకటి ఉండదు కాబట్టి. జయము కలగాలి అంటే యజము చేయాలి. యజము చేస్తే జయము కలుగుతుంది. 'యజ' అంటే 18. జయ అంటే 81. అందుకని 18 అధ్యాయాలను రాసి దానికి ఆయన "జయము" అని పేరు పెట్టారు. జయము అనే పేరు పెట్టగానే ఏమి జరుగుతుంది? 'జ' అంటే 8 అంకె, 'య' అంటే 1 అంకె. అందుకే అంకె ఏమి ఇచ్చారు? 18 ఇచ్చారు. పేరేమో జయము, అంకేమో 18. అంటే, 81 ఇవ్వాలి మామూలుగా. కాని తెలిసిన వారు అంకెలని అటునుంచి ఇటు చదువుతారు. "అంకానాం వామతో గతిః" అని ఆ పద్ధతిలో అటునుంచి ఇటు చదవాలి. 81 ని అటునుంచి ఇటు చదివితే 18 అవుతుంది. 18 జయము అని ఇచ్చారు ఆయన. యజము చేస్తే జయము కలుగుతుంది. యజము చేయడం అంటే సృష్టి కార్యక్రమములో తనను తాను సమర్పణ చేసుకుంటూ జీవించడం. భగవంతుడు సమర్పణ చెందటం వలన ఈ

సృష్టి ఏర్పడినది. అది 'పురుషమేధము'. తనను తాను సమర్పణ చేసుకోబట్టి భగవంతుడు ఇన్నిటిలోకి దిగివచ్చి ప్రతి దాంట్లో ఉన్నాడు. అడ్డమైనా దాంట్లో కూడా ఉన్నాడు విలువైన దాంట్లోనే కాకుండ. మనము అనుకొనే మంచి, మనం అనుకొనే చెడులో కూడా భగవంతుని అస్థిత్వము ఉన్నది. మనకి పంది అంటే యిష్టము లేదనుకోండి, అయినా ఉన్నాడు దానిలో. కుక్క, చీమ, పాము, కొంత మంది మనుషులు అంటే ఇష్టము లేదు కాని వాటిలో కూడ ఉన్నాడు. మనకి ఇష్టము ఉన్నవి, లేనివి దాంట్లో కూడ ఉంటాడు. అంతటా వ్యాపించి ఉంటాడు భగవంతుడు. ఆ విధముగా వ్యాపించిన భగవంతుని తాత్త్వాన్ని ఏమని చెప్పారంటే, తనను తాను అనగా పురుషుడిని మథనం చేయతం వలన పురుష మేథయజ్ఞము కారణముగ ఏర్పడినది. పురుషుడు ఎవరు అంటే, ఈ అండము లోకి దిగి వచ్చిన వాడిని పురుషుడు అంటారు. దిగి రాకుండా ఉండేవాడిలో నుంచి కొంత భాగము ఇందులోకి దిగి వస్తుంది. అంతే కాని వాడు అక్కడ మాయమై ఇందులోకి రావటము కాదు. మాములుగా మనము సృస్టిలోకి భగవంతుడు దిగి వస్తే ఇక పైన లేడు కదా అని అనుకుంటాము. అది ఎలా ఉంటుందంటే, తండ్రికి కొడుకు పుడితే తండ్రి అయిపోయాడని! 10 మంది కొడుకులు పుట్టినా తండ్రి ఉన్నాడుగా! తండ్రి ఉండగానే తండ్రి లోంచి కొడుకు పుట్టుకొచ్చాడు కదా. తండ్రి లేకపోడము ఉండదుకదా. అలాగే ఆ అతీతమైనటువంటి తత్త్వం ఈ అండము లోకి దిగి వచ్చి వాసుదేవతత్త్వముగా ఏర్పడితే, ఈ వాసుదేవతత్త్వాన్ని అందులో ఉన్న ప్రజ్ఞలు వాడుకొని మొత్తము సృష్టిలో తత్త్వాన్ని అంతా కూడా ప్రకృతి పురుషులు తయారుచేయడం వల్ల ఆయనని మథనం చేసారు. ఆ మధనము వల్ల పురుషమేథ యజ్ఞముగా సృష్టి ఏర్పడింది. కాబట్టి సృష్టి ఎవరికైనా అర్ధము కావాలన్నా, భగవత్ తత్త్వము అర్ధము కావాలన్నా, ప్రకృతి తత్త్వము అర్ధము కావాలన్నా తమ జీవితమునందు తమను సమర్పణ, త్యాగము చేసుకొనే బుద్ధి ఉంటేనే భగవంతుని దర్శనము తప్ప, తాను గుండ్రాయి వల్లె మిగిలిపోవాలి మిగతా అందరిని యజ్ఞములో హవిస్సులుగ వాడాలనుకొనే వాళ్ళకి అవదు. 'త్యాగే నైకేన అమృత మానసః'. అమృతత్త్వము త్యాగ నిరతి కలిగిన వారికి వస్తుంది తప్ప, పండితులకి రాదు, వేదాంతం తెలిసినవారికి రాదు, భాష్యాలు చెప్పేవారికి రాదు, దానితో పాటుగా జీవితమునందు సృష్టి కార్యములో తనవంతు త్యాగము ఉండాలి. తన వంతు సేవ ఉండాలి. తన వంతు సమర్పణ ఉండాలి. తన్ను తాను సమర్పణ

చేసుకోవాలి, తనకు ఉన్నవి సమర్పణ చేసుకున్నా రాదు. తనకు తాను సమర్పణ చేసుకోడం గొప్ప. తను సమర్పణ అయితే, తనకు ఉన్నవి కూడా సమర్పణ అవుతాయి. అటువంటి సమర్పణ ఎవరైతే పరహితము కొరకు చేస్తుంటారో వారికి సృష్టి అవగాహన అవుతుంది. ఈ పెద్దలు ఇచ్చిన రకమైనటువంటి రహస్యములు వారియందు వికసించి మళ్ళీ వ్యక్తము అవుతాయి. అది వేదవ్యాసునకు జరిగి అయన ఏమి చేసారంటే, ఈ నాలుగుగా కనబడుతున్న దాని వెనకాల ఉన్నటువంటి మూడు మనకి చూపించడానికి ప్రయత్నము చేస్తానని చెప్పి ఇంత పెద్దపని చేసాడు. తెలిసిన ఒక విజ్ఞానాన్ని నాలుగుగ ముందు వర్గీకరించాడు. జ్ఞానం అనే ఒక వేదాన్ని ఏమి తెలిస్తే ఇంకేమి తెలియక్కర్లేదో , ఏది సమగ్రమైన, సంపూర్ణమైన స్థితియో ఆ స్థితిని నాలుగు భాగాలుగా వర్గీకరించి ఆయన వేదవ్యాసుడు అయినాడు. ఆ తరువాత కూడ తృప్తి చెందక అందులో ఈ నాలుగు తెలియాలంటే, దానికి ముందు ఉన్న ఈ మూడు తెలియాలి. అవీ ఋగ్వేదము, సామ, యజుర్ వేదములు తెలియాలి. ఇవి తెలియాలి కాబట్టి పురాణాలు కూడ రాసి, మహాభారతము రాసి, 18 అంకెతో సాధన చేసి చివరికి దీనికి 'జయము' అనే పేరు పెట్టి, జయము యజము చేస్తే జయము కలుగుతుందని చెప్పాడు. యజము అంటే sacrifice. ఏమిటి sacrifice అంటే 'సర్వహుతః' అనే sacrifice. 'తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః'. సర్వహుతము అనే యజ్ఞము ఏమిటంటే సమస్తమును అర్పణ చేయడము అది మహాత్ముల జీవితములలో దర్శనము అవుతుంది. వాళ్లు సమస్తమును అర్పించి జీవిస్తారు. అట్లా సమస్తమును అర్పణము చేసిన యజ్ఞమును అవగాహన చేసుకోడానికి వేదవ్యాసుడు ఈ తాళము చెవిని ఒకటి ఇచ్చాడు. ఆ తాళం చెవి తెరచి తెలుసుకోవలసినది ఏమిటంటే, there are three preceding steps for the fourth step. అందుకని ఆ మూడు అడుగులు ముందు తెలియాలి. అది తెలిస్తే సమస్తము తెలుస్తుంది. నాలుగో అడుగు మనకి మనం ఉంటున్న, మన బాగా తెలిసిన బహిర్గత ప్రపంచము. దీనికి ముందు ఉన్నటువంటి మూడు స్థితులు తెలియటానికి తనే మూడు వ్యూహములుగ ఉంటాడు. వాసుదేవ వ్యూహము ఒకటి ఏర్పడుతుంది. ఎప్పుడైతే తను అండము లోకి దిగి వచ్చాడో, అండము ఒక్కసారి charge చేయబడుతుంది. ఆయన సాన్నిధ్యము వలన దానికి ఒక charged state ఏర్పడుతుంది. ఆ వెలుగుని 'అదితి' అన్నారు. మొత్తము చోటులో కొంత భాగము ఒక అండముగా వస్తే, ఆ

అండములోకి భగవత్ తత్త్వం వాసుదేవతత్త్వముగా దిగి వస్తే, ఆ దిగి వచ్చిన కారణముగ ఒక్కసారి అక్కడ భళ్ళున వెలుగు వస్తుంది. ఆ వెలుగులో మొత్తము ఈ సృష్టి జరిగింది. ఆ మొత్తము ఎంత వెలుగుందో, ఆ వెలుగుని కురుక్షేత్రము అన్నారు. కురుక్షేత్రం అంటే ఏదో Delhi దగ్గర ఉండే కొంత land కాదు. అది కురుక్షేత్రం ఎందుకు అయినదంటే, the field of action, ఎవరికి? For the Creator and the three above. వాళ్ళ ముగ్గురు, ఈ Creator తో కలసి ఇంత మేర ఆడుకుందాము అనుకున్నారన్నమాట. వాళ్ళ play ground అన్నమాట. అది కురుక్షేత్రం. అక్కడ 'కురు' అంటే action కి క్షేత్రం అది, base. ఆ field లో ఈ action జరగటానికి ఏర్పడినదంతా కూడ charge అయినది. Charge అయిన తరువాత ఇహ అందులోంచి దిగి రావటం మొదలు అవుతుంది. అందుకని అక్కడ నుంచి చెప్పకొస్తారు వేదంలో. ఆ అదితిని గురించి వర్ణన చేయటానికి ఋషులు సర్వ ప్రయత్నాలు చేసి, చెప్పి, అయినా కూడా పూర్తిగా చెప్పలేకపోయామంటారు. అది ప్రొద్దున్న సూర్యోదయంగ కూడ చెప్తారు. మన బోటి వారికి సూర్యోదయమే అదితి. ఆదిత్య వర్ణము. ఆ అదితి తత్త్వాన్ని అక్కడ మనకి అవగాహన చేస్తారు. వాసుదేవ తత్త్వం దిగి రావటం వలన ఏర్పడిన వెలుగుని 'ప్రద్యుమ్నుడు' అన్నారు. అందులోంచి వచ్చే కదలికలన్నిటిని 'సంకర్షణుడు' అన్నారు. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అని నాలుగు వ్యూహాలుగ సృష్టి దిగి వస్తున్నది. చతుర్వ్యూహః. నాలుగు వ్యూహాలు ఏవయ్యా అంటే వాసుదేవ తత్త్వము, అక్కడనుంచి ఏర్పడుతున్న కదలికలు. ఎప్పుడైతే ఒక్కసారి తెల్లవారిందో, తనలో చైతన్యము ఉద్భవించిందో అంటె నారాయణుడు హరి అయి దిగి వచ్చేసరికి మనకి మెలుకువ వస్తుంది. ఇది శాశ్వత కథ! ప్రతినిత్యము జరుగుతున్నటువంటి కథ ఇది. అవ్యక్తమైనటువంటి స్థితి లోంచి వ్యక్తమైనటువంటి స్థితి లోకి మనము దిగి వస్తున్నాము నిద్రలోంచి బయటకి వచ్చేసరికి. వచ్చేసరికి మనకి ఒక charged field of action, filled with consciousness. అది మన అదితి తత్త్వం. లేచిన తరువాత కదలిక మొదలు, చైతన్యమునకు కదలిక warmup అవడానికి ఒక స్థితి. కదలికనే Successively changing consciousness అంటారు. అందులోంచి సంకర్షణుడు పుట్టుకు వస్తాడు.ఆ కదలికే మనలో మనసు, ఇంద్రియాలుగా పనిచేసి ఒక పక్క activity, intelligent activity conduct చేస్తుంది. మరొక పక్క వాసుదేవ తత్త్వం నుంచి దిగి వచ్చిన వెలుగు ప్రద్యుమ్నుడుగ దానికి బుద్ధిగా, వెలుగుగ ప్రసారం జరుగుతూ

చేసే కార్యక్రమాలకి ఒక advisor గ నిలబడి ఉంటుంది. ఇలా ఉండగా వాసుదేవ తత్త్వమే స్పందనాత్మక తత్త్వముగా దిగి వస్తాడు. ఇన్ని ధారలుగా ఈ వాసుదేవ తత్త్వము నుంచి సంకర్షణ వ్యూహము, ప్రద్యుమ్న వ్యూహము ఏర్పడి, ఈ వెలుగు ప్రద్యుమ్నుడు, ఆ వెలుగు లోంచి పుట్టిన ఇంద్రియములు ఏర్పరిచే కార్యక్రమాలన్నీ అనిరుద్ధ వ్యూహముగా చెప్పబడతాయి. ఈ విధముగా ఏర్పడినటువంటి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగ ఉండే 'చతుర్వ్యూహః' నామము ఒకటి భగవంతుడికి ఉన్నది. ఈ నాలుగు స్థితులని చతురాత్మా అంటారు. ఇవి మనం ఉండటం అనేటటువంటి స్థితి మనకి ఉన్నది. దాని ఆధారంగా చైతన్యవంతులము అవుతూ ఉంటాము ప్రతి ప్రొద్దున్నే. చైతన్యవంతం ఆధారంగా మనలోనుంచి మనోప్రవృత్తి వ్యక్తం అవుతూ ఉంటుంది. అంటే ఇంద్రియములు, మనం, మన కదలికలు, ఆలోచనలు అనేటటువంటి మూడో స్థితిలోకి వస్తాము. ఈ ఆలోచనల ఆధారంగా బయట ప్రపంచం లో మనం వ్యక్తం అవుతుంటాము, అది నాలుగో స్థితి. ఇలా నాలుగుగ దిగి వస్తుంటాము ప్రతి నిత్యము. మనము ఏ పని చేసిన నాలుగుగా దిగి రావటమే. కాబట్టి చతురాత్మా. ఈ నాలుగుగ దిగి రావటానికి నాలుగు models ఉన్నాయి. ఆ models ని వ్యూహములు అన్నారు. చతుర్ వ్యూహ . ఏమిటా models? అపరిమితమైనటువంటి స్థితి, నేనున్నానని అనే స్థితి నుంచి చైతన్యవంతులము అవుతాము ప్రొద్దున్నే. చైతన్యవంతము అవటానికి నేనున్నాను అనే స్థితి ఆధారంగానే అవుతుంది తప్ప, నేను అనే స్థితి నుంచి చైతన్యవంతము అవటం అనేది లేదు. కాబట్టి నేనే చైతన్యముగా మారాను. చైతన్యవంతమైన స్థితి లో మన నుంచి ఆలోచనలు వ్యక్తము అవుతున్నాయి కాబట్టి చైతన్య స్థితి లేకుండా వ్యక్తమయ్యే ఆలోచనలు లేవు. కాబట్టి చైతన్యమే సంకల్పంగా మార్పు చెందుతోంది. Mutate అవుతోంది. Trans - mutation. అంటే నేనే మారుతున్నానన్నమాట నా ఆలోచనలతో. నేను లేకపోతే లేవటం లేదు. నేను లేకపోతే ఆలోచనలు లేవు. నేను లేవటం వలన, ఆలోచించటం వలన ప్రవర్తించటం అనే నాలుగో స్థితికి వస్తాము. అది నాలుగు పని చేస్తాము. పనిచేసేటప్పుడు శూద్రుడు, ఆలోచించేటప్పుడ వైశ్యుడు, చైతన్యవంతముగా ఉన్నప్పుడు, శుద్ధ స్ఫటికముగ ప్రకాశవంతముగ ఉన్నప్పుడు క్షత్రియుడు నేనుగా ఉన్నప్పుడు బ్రాహ్మణుడు. ఈ నాలుగూ మనలోనే ఉన్నాయి. ఏ భావన ఎక్కువగా ఉంటె దాని ప్రకారము వారిని దానిగా categorize చేసారు. కొంతమంది only

physical action believe చేసేవారుంటారు. Workers అన్నమాట. అంటే ఊరికే ఖాఖీ వస్త్రాలు వేసుకొనే Workers అని కాదు. మనలో కూడ worker గ శరీరము పని చేస్తోంది. శరీరానికి చేసే ధర్మమూ. మనసుకి ఆలోచించి పని చేసే ధర్మమున్నది కాబట్టి మంచి చెడ్డలు అలోచించి, విచక్షణ చేసి పని చేసుకుంటూ పోయేదొక స్థితి. అంతకు ముందు కేవలము ప్రకాశము కలిగినటువంటి స్థితి. అది రక్షణ కలిగిస్తూ ఉంటుంది. అంతకు ముందు తానుగా ఎట్లా ఉన్నాడో అన్న స్థితి. ఈ నాలుగు స్థితులు మనలో వ్యక్తము అవుతుంటాయి. కాబట్టి మనం పరోపకారం చేసి స్వంతం కో సం ఆలోచించకుండ చేసే కార్యక్రమాలు మన జీవితములో జరుగుతున్నపుడు మనం బ్రాహ్మణులం. ఇరుతరులను రక్షిస్తున్నపుడు, మన కుటుంబమును రక్షిస్తూ పోషిస్తున్నపుడు క్షత్రియులం. ఇతరులకు ఉపయోగపడుతు, వారిని మనం ఉపయోగించుకున్నప్పుడు మనం వైశ్యులం. ఇవన్నీ నిర్వర్తిస్తున్నపుడు దేహమునందు ప్రవర్తిస్తున్నపుడు శూద్రులం. ఇలా ఆశ్రమ ధర్మాలున్నాయి. ఇవి నాలుగు నాలుగు నాలుగుగా వ్యక్తము అవుతుంటాయి. మనం నాలుగు వ్యూహాలు లోంచి వ్యక్తము అవ్వాలి తప్ప ఇంకో పద్ధతిలో వ్యక్తము అవలేము. There is a model into which we come out. ఏదైనా ఒక product బయటకి రావాలంటే ఒక్కొక్క process దగ్గర ఒక్కొక్క model ఉంటుంది. అక్కడ mould అయి బయటకి వస్తుంది. అట్లాగే 'నేను' అనేటటువంటి అంతర్యామి తత్త్వము నేననే చైతన్యముగా మేల్కొంచి, నేను అనే మనోభావముగా మార్పు చెంది. నేను అనేటటువంటి శరీర ధర్మముగా వ్యక్తము అవుతుంటుంది. నాలుగుగా వ్యక్తము అయ్యేది మొత్తము నేనే! కాబట్టి పని చేస్తున్నపుడు శరీరంలో ఎక్కువ భాగం మేల్కొంచి ఉంటాడు. ఆలోచిస్తున్నపుడు మనసులో ఎక్కువ భాగం మేల్కొంచి ఉంటాడు. కోరికలు కలిగినప్పుడు ఎక్కువగా శరీర భాగంలో మేల్కొంచి ఉంటాడు. మరి ఇవేవి లేనపుడు, 'నేను నేనైన నేనుగా' మేల్కొంచి ఉంటాడు. వాడూ వ్యక్తి! అంటే నాలుగు ఆత్మలు. ఈ నాలుగు ఎప్పుడు వ్యక్తము అయిన ఈ నాలుగు models లోంచి వ్యక్తము అవటమే. ఇంకో పద్ధతి లేదు. అందుకే నాలుగు వ్యూహాలు. There is no other way. ఈ నాలుగు తప్ప. ఈ నాలుగుకి నాలుగు రకములైనటువంటి భుజములు. వ్యక్తము అయేవి నాలుగు భుజాలు. అంటే Fourfold Expression. అదే పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి అనేటటువంటి నాలుగు స్థితులుగా ప్రతిది అలా నాలుగుగా వ్యక్తము అవుతుంది. ఏదైనా సరే ఇదే

పద్ధతిలో వ్యక్తము అవుతుంటుంది. నాలుగు భుజాలుగ ఇస్తూ ఉంటారు. ఏ దేవతలకైనా నాలుగు భుజాలు వేసేస్తూ ఉంటారు మనవాళ్ళు. మనకి రెండే ఉన్నాయి, వాళ్ళకి నాలుగు ఉన్నాయి. మనం రెండు విషయాలలో చాల గట్టి. మన పని మనము చేసుకోడములోనునూ, అందులో మనకి ఏ లాభము వస్తుంది అన్నదాంట్లోను. అంటే వైశ్య ధర్మమూ, శూద్ర ధర్మమూ పరిపూర్ణముగ అవగాహన కలిగిన వాళ్ళము మనం అంతకు మించి రక్షణ అన్నటువంటిది మనకి తెలియదు. మనకి ఉపయోగము లేకపోయి ఇంకొకరికి ఉపయోగపడే ఆనందము ఏమిటో పరిపూర్ణముగ తెలియదు. అందుకనే మనకి రెండు చేతులు. దేవతలకు నాలుగు చేతులు. వాళ్ళకి ఆ రెండు తెలియదు. ఏదైనా four fold ,నాలుగు భుజములుగ వ్యక్తము అవుతుంది తప్ప ఇంకో expression ఉండదు. ఇల్లు కట్టారనుకోండి, ఇల్లు కట్టక ముందు ఎక్కడ ఉంది? Plan లో ఉంటుంది, blue print లో ఉంటుంది. ఏదైనా blueprint municipality వాడికి ఇవ్వకపోతే వాడు ఇవ్వడు కూడ permission. Municipality లేనపుడు కూడ ముందు plan ఒకటి గీసుకొని ఇల్లు కట్టుకోవాలి కదా! Mind లోకి రాకుండా paper మీదకి రాదుకదా plan? కాబట్టి, paper మీదికి వచ్చే ముందు plan ఎక్కడ ఉంది? Mind లోంచి plan లోకి దిగి, plan లో నుండి భూమి మీదికి దిగిందికదా. ఇవి మూడు. అంతకు ముందు మనలో మనముగ ఉంటుంది. మనలో మనముగా ఉన్నదే ఒక రోజు ఇల్లు కడదామనిపిస్తుంది. వెంటనే మనసులో ఎట్లా కట్టుకుంటే బాగుంటుంది. మూడోది paper, నాలుగోది ఇల్లు. అయిదోది తిరోగమనము. మళ్ళి వెనక్కి వెళ్ళిపోతుంది. వచ్చినదల్లా మళ్ళి వెనక్కి వెళ్లిపోవలసినదే. దానికో time cycle. ఆ time cycle ప్రకారం వెనక్కి వెళ్ళిపోతుంది. దాన్నే నాలుగు యుగాలుగా చెప్తారు. ప్రతిదీ పుట్టటం, పెరగటం, peak point reach అవటం , తిరిగి వెనక్కి వెళ్ళటం. అందుకని నాలుగు యుగాలుగాను, నాలుగు అవస్థలుగాను చెప్తారు. ఒకదానికన్న మరొకటి మించి ఉంటుంది. ఒకటి రెండు అయితే రెండింతలు అవుతుంది. రెండు మూడు అయ్యేసరికి మూడూ, నాలుగు అయ్యేసరికి నాలుగింతలు అవుతుంది. 1+2+3+4=10. ఇది ఒక చాల పెద్ద విజ్ఞానం. అందులో '1' లేకపోతే మిగతాదంతా ఏమి లేదుట. 10 లో 1 తీసేస్తే ఏమి అవుతుంది? కాని ఆ '1' ఈ 9 లో గిరగిరా అన్ని తిప్పుతుంటాడు.అందుకే "9" అంకె circular number అంటారు. Cyclic number అంటారు. 9, 6,3 cyclic numbers

అంటారు. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే మీలో ఎవరో physics చదివితే పనికి వస్తాయి మీకు. అదే చూస్తుండగా విచ్చుకొని మహావృక్షాలు అయిపోతాయి ఎప్పుడో. అలాగే 1+2+3+4లో, నాలుగు stages ఉండేసరికి, 1+2=3, 3+3=6, 6+4=10. అందుకని 1, 2, 3, 6 - 10 గ ఏర్పడినాయి అంటారు కొంత మంది. ఇంకొకళ్ళు ఏమంటారంటే, 1, 2 , 3 అయ్యి, 3 , 6 అయ్యి, 6, 10 అవుతుందంటారు. దాన్నే మనకి కలి , ద్వాపర, త్రేత, కృత అంటారు. కలి అంటే 1. ఒక unit. ద్వాపర అంటే 2. త్రేత అంటే 3 times, కృత అంటే 4 times. అంటే మన కలి యుగానికి 2 times ద్వాపర యుగం, కలియుగానికి 3 times త్రేతా యుగం, కలియుగానికి 4 times కృత యుగం కలిపి మొత్తం 10 యుగాలు. అది ఒక మహాయుగం. అట్లా అన్ని నాలుగు నాలుగుగ కాలం కూడ నాలుగుగ వస్తుంది మనకి. ఉత్తరాయణము నుంచి ఉగాది వచ్చి, ఉగాది నుంచి దక్షిణాయనము వచ్చి, దక్షిణాయనము నుంచి ఆశ్వియుజ మాసము వచ్చే వరకు నాలుగు భాగాలుగా ఉంటుంది. రోజు కూడ ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, అర్ధరాత్రిగ ఉంటుంది. ఇలా కాలం కూడా నాలుగుగ విభజించబడింది. ఈ నాలుగు భుజాలుగ అన్ని ఏర్పడటం అనేటటువంటిది తెలియాలంటే, నాలుగుగా కనిపించే దాంట్లో మూడు వెతికి తెలుసుకోగలగటం అనేది అసలైన దర్శనం. ఈ దర్శనము మొత్తము తెలుసుకున్న వాళ్ళు భగవంతుని యొక్క దర్శనము తెలిసిన వాళ్ళు అవుతారు. ఈ నాలుగుగ దిగి వచ్చిన వాడు ఇంకా అక్కడే ఉంటాడు. వాడు ఉంటె ఈ నాలుగు దింపుతూ ఉంటాడు. తాను ఖర్చు అవకుండ ఇదంతా జరుగుతూ ఉంటుంది. ఎట్లా అంటే తండ్రి ఖర్చు అవకుండా నలుగురు పిల్లలు పుట్టుకు వచ్చారుట. ఆ విధముగా జరిగే దాన్ని 'చతుర్భుజః' అంటారు. దీన్నే పాశ్చాత్యదేశాలలో The book of Revelation అని రాసుకున్నారు. ఏమని, 4 horsemen ఉన్నారుట 4 sides, మధ్యలో కుర్చీ ఉందిట, కుర్చీలో ఎవరూ లేరట. లేరంటే ఏమిటి? ఉన్నట్టుగా తెలియదు కాబట్టి. ఆకాశములో ఏమి ఉన్నట్టుగా కనబడదు కానీ అన్ని అందులోనే ఉన్నాయి. అందులోంచి అన్ని వస్తు ఉంటాయి 'ఏమిలేనట్టి గగనాన ఇమిడి ఉండి అన్ని ఉన్నట్టి భూమికి అవతరించు', అని. కాబట్టి ఏమి లేనట్టుగా ఉంటుందని చెప్పటానికి Seeming Nothingness అని అన్నారు. దాన్ని కుర్చీ ఖాళీ అన్నారు. ఆ కుర్చీలో ఎవరు కూర్చోరట. ఎందుకంటే అందులో కనబడకుండ కూర్చొని ఒకడు ఉంటాడు. అందుకనే పెద్ద పెద్ద ఆశ్రమాలలో గురువుగారికి కుర్చీ వేసి ఉంచుతారు.

'ఏమిటి ఖాళీగా ఉంచారు ఆ కుర్చీ?' అనిపిస్తుంది అది చూసినప్పుడు మన బోటివాళ్ళకి. కానీ అక్కడ ఒకడు కూర్చొని ఉంటాడు. ఆ కూర్చున్నవాడు మొత్తము నడిపిస్తూ ఉంటాడు, వాడు కనబడడు. వాడి చుట్టూ నలుగురు horsemen ఉన్నారు. ఆ నలుగురు చుట్టూ 12 మంది ఉన్నారు. ఆ 12 మంది చుట్టూ 24 మంది ఉన్నారు. ఇట్లా రాసుకొచ్చాడు ఒకాయన. ఇదే తత్త్వం! ఎవరు చెప్పినా, సృష్టిని అవగాహన చేసుకున్నపుడు ఈ విధంగానే చెప్పబడుతుంది. ఈ విజ్ఞానం చాల సంవత్సరాల తరబడి చెప్పుకోవలసిన విజ్ఞానం ఈ నాలుగు నామాలలోను ఉన్నదీ. ఊరికే ప్రస్తుతానికి ఒక అవగాహన. About anything that we see, there are three precedings behind what we see. మనము చూసే ఒక ఆకారానికి వెనకాల ఒక రంగు ఉంది. రంగు వెనకాల శబ్దము ఉంది. శబ్దం వెనకాల చైతన్యము ఉంది. అట్లా ఉంటుంది. అది ఒక తాళం చెవి. Pythagoras మహర్షి ఏమి చెప్పారంటే, 'I will give you a keyboard of wisdom' అని. ఏమిటయ్యా అంటే? Numbers అంటే ఏమిటో తెలుసుకో అని. Sounds అంటే ఏమిటో తెలుసుకోమన్నాడు. Colours అంటే ఏమిటో తెలుసుకోమన్నాడు. Shapes అంటే ఏమిటో తెలుసుకోమన్నాడు. అపుడు మొత్తము తెలిసిపోతుంది అన్నాడు. ప్రతి ఆకారమునకు కొన్ని రంగుల కలయిక ఉన్నది. ఆ రంగులు శబ్ద తరంగములు కారణముగ ఏర్పడతాయి. కాబట్టి అంకెలు ఆధారంగా శబ్దములు, శబ్దములు ఆధారంగా రంగులు, రంగులు ఆధారంగా రూపములు ఏర్పడుతున్నాయి. ఈ నాలుగుతో కూడిన fourfold keyboard కనక అర్థమైతే సృష్టి అర్థము అయిపోతుంది సుమా అని చెప్పారు. Pythagoras ఎవరు అంటే, పెద్దలు వల్ల తెలుసుకున్నది వారణాసిలో ఉన్న వేదవిద్యాపీఠంలో సమస్త విజ్ఞానమును తన యందు అనుభూతి చెందినవాడికి 'పీఠ గురు' అని బిరుదు ఇచ్చేవారు convocation conduct చేసి. పీఠ గురువులు అక్కడ తయారై, వారు భూమి నలుచెరగులా వెళ్లి ఈ విజ్ఞానాన్ని పంచి ఇస్తుండేవారు. ఆ రోజులలో Egypt, Greece ఆ దేశాలలో నుంచి భారత దేశము వచ్చి ఇటువంటి విజ్ఞానాన్ని అందుకొని వెళ్తూ ఉండేవారు. మన ఉజ్జయిని, వారణాసి, తక్షశిల ఇవన్నీ కూడా మహత్తరమైనటువంటి విద్యా పీఠాలు. అక్కడ నుంచి వారణాసి వచ్చి ఈయన సమస్తమును దర్శనము చేసి, వాళ్ళకి సంబంధించిన భాషలో ఎక్కువగ Mathematical expressions తో వాళ్ళకి ఇచ్చారు. ఇక్కడ పొందిన 'పీఠ

గురువు' అనే బిరుదును 'పీథ గురు' అనే అంటారు Greek దేశములో. అది English లో Pythagoras అయింది. ఎందుకంటే English వీళ్ళు అందరి పేర్లు మారుస్తూ ఉంటారు. విశాఖపట్నం ని vizag అని. రోమకపురం అని మన పురాణాలలో ఉన్నది. వారు రోమకపురం అనే దాన్ని Roma అని పిలుచుకుంటారు. Rome అంటారు. Pythagoras ని Greek, Latin భాషలలో (ఆంగ్లం తెలియనివారు) పీథగురు అనే అంటారు. Pythagoras ఈ చతుర్ వర్గము అయిన విజ్ఞానాన్ని అక్కడ పంచడం జరిగింది. అందుకు జ్ఞానము, విజ్ఞానము ఒకరి సొత్తు అనుకోడానికి వీలులేదు. ఎవరైతే తనను తాను సమర్పణ చేసుకుంటారో వారియందు మరి ఒక్కసారి నాలుగు వేదములు Fresh గ పుడతాయి. పుస్తకాల లోంచి నేర్చుకోనక్కరలేదు. Every time you go to the center you come out with the four Vedas. ఎప్పుడైతే నువ్వు ఒక్కసారి అంతర్యామి అయిన భగవంతుని యందు ఒక్క మునక వేశావో అక్కడ నుంచి నాగులు చేతులలో నాలుగు వేదాలు పట్టుకొని బయటకి వస్తావు. అంటే You are as much as a Creator. అట్లా భగవంతునిలో ములక వేసి మళ్ళీ బయటకి వచ్చినటువంటి వారు మనము ఎరిగినటువంటి రమణ మహర్షి, అరవింద మహర్షి, Master E.K, Master C.V.V. అవతార మూర్తులుగా మనము గమనించిన వారు అందరు కూడా అక్కడ మునిగి మళ్ళీ బయటకి వచ్చారన్నమాట. అక్కడ మునిగి బయటకి రావడం వల్ల మళ్ళీ ఇంకోసారి మనకి అర్ధము అయ్యే భాషలో, మనకి అర్ధము అయ్యే రీతిలో, మనకి ఇవ్వగలిగి ఉంటారు. వాళ్ళకి భాష అడ్డు రాదు. Language is only a medium కాబట్టి అప్పుడు ఎక్కడ ఏ పరిస్థితిలో ఏ Language చెప్తే అర్ధము అవుతుందో ఆ భాషలోకి దాన్ని తీసుకొచ్చి మనకి అందించే ద్రష్టలుగ ఉంటారు. ఎందుకంటే వాళ్ళు వచ్చేటపుడు ఒక్కళ్ళు రారు. వాళ్ళతో పాటు వాడు వస్తాడు. ఎవడు? ఎవడికి పేరు, ఊరు లేదో , రూపం లేదో, వాడు వీరిలో తిష్ఠ వేసుకొని, వీడినొక mic గ వాడుకొని మొత్తము ప్రపంచానికి ఒక దారి చూపిస్తూ వుంటారన్నమాట. ఆ విధంగా జరుగుతుంటుంది. అందుకనే వేదాలు ఎవరు దొంగిలించలేరు, పుస్తకం దొంగిలించగలరు. పుస్తకాలు దొంగిలిస్తే మాత్రం ఏమిటి మనకి వేదాలు తెలిసి ఉంటే! అందుకనే విద్యని దొంగిలించడము అని ఏమి ఉండదు. ఇంక దేనినైనా దొంగిలించవచ్చు. కాని భగవంతుని యందు ఈ యజము అనేటటువంటి కార్యక్రమములో పరిపూర్ణముగా సర్వహుతము

అవాలి. పూర్ణాహుతి అంటారే ! పూర్ణాహుతి అంటే సర్వహుతము. ఎప్పుడైతే ఈ పూర్ణాహుతి జరుగుతుందో అందులోంచి మళ్ళి పుట్టుకొస్తాడు యజ్ఞ పురుషుడు. పూర్ణాహుతి లేనిదే యజ్ఞ పురుషుడు పుట్టుకొచ్చేది లేదు. ఎవరికైనా సరే! తన్ను తాను పరిపూర్ణముగా భగవంతుని యొక్క కార్యక్రమములో సమర్పణ చేసుకొని తనను తాను మరచినటువంటి స్థితి యందు ఉంటాడు. అలాంటి వాడికి తాను ఎవరు, తన పేరు, తన ఊరు ఎవరైనా గుర్తు చేయాలి మాటిమాటికి. భగవంతుని కార్యక్రమమే తన కార్యక్రమముగా ఉంటుంది. వాక్కు భగవంతునిదే తన నుంచి వ్యక్తము అవుతుంటుంది. భగవంతుడే తన చూపు నుంచి వ్యక్తము అవుతూ ఉంటాడు. అందుకనే చూస్తే అనుగ్రహం దొరుకుతుంది. మాట్లాడ్డం ద్వారా అనుగ్రహం ప్రసరిస్తుంది. స్పర్శ ద్వారా జరుగుతూ ఉంటుంది. అంటే అన్నిటి ద్వారా వ్యక్తము అయినది భగవంతుడే! ఎందుకంటే తాను భగవంతునికి వాహికగ తయారైపోయాడు. అంటే దేవుడు జీవుడు నుంచి, జీవుడు శరీరము నుంచి రెంటి నుండి ఆయనే వ్యక్తము అయిపోతూ ఉంటాడు. వారూ మహాత్ములు. అట్లా ఒకసారి వ్యక్తము అయ్యేటపుడు మళ్ళి ఒకసారి విజ్ఞానము వ్యక్తము అవుతుంటుంది. దాన్నుండి కొంతమంది తరిస్తూ ఉంటారు. మళ్ళి ఎప్పుడెప్పుడు అవసరమో అప్పుడు కాలము బట్టి, దేశమును బట్టి తానే వ్యక్తము అవుతూ ఉంటాడు. దాన్నే 'హరికళ' అంటారు. పరిపూర్ణముగా తాను దిగి రానక్కరు లేదు. తన వాహికలు నుంచి వ్యక్తము అవుతుంటాడు. వారిని 'హరికళలు' అంటారు. వారి యందు భగవంతుడు ఉండి వ్యక్తము అవుతూ పరిసరములను పరిరక్షిస్తూ ఉంటారు. పరిసరములను ప్రచోదనం చేస్తుంటారు. పరిసరములను వెలిగిస్తూ ఉంటారు. రక్షణ, పోషణ కలిగిస్తూ ఉంటారు, వారు భగవంతుని యందు మళ్ళి కలుస్తారు. ఆ విధముగా జరుగుతూ ఉంటుంది. ఈ నాలుగు అనే కార్యక్రమము లోంచి మనము తెలుసుకోవలసినది ఈ కనబడే భౌతిక సృష్టిలో, దానికి వెనకాల ఉండే ఈ మూటిని అవగాహన చేసుకోవాలి. అంటే, ఒక ఆకారం చూస్తే ఆకారం వెనకాల ఉండే రంగు. ఆ రంగు వెనకాల ఉండే శబ్దము. ఆ శబ్దము వెనకాల అది ఏర్పడటానికి ఉన్న చైతన్యము. ఇక ఈ నాలుగు నాలుగు ఆత్మలుగా చెప్పారు. చతురాత్మ. చతుర్ వ్యూహము. అవి దిగి రావటము అంటే ఒక plot / model పెట్టుకున్నారు, అట్లాగే దిగి వస్తుంది ఎప్పుడొచ్చినా. భగవంతుడు దిగి రావాలన్నా ఇవన్నీ తయారు చేస్తారు. ఒక model లో నుండి దిగి వస్తు ఉంటాడు. చతుర్

భుజః. చతుర్ దంష్ట్ర అంటే నాలుగు కోరలు ఉన్నాయిట దేవుడికి. నాలుగు కోరలు ఏమిటంటే కాస్త మనని, అడ్డ దారిని పోతున్నవాడిని మళ్ళి కట్టి పెట్టటానికి. Beachలో మనం ఆడుకుంటున్నపుడు గుడి కడతాం కదా! అది సరిగా రాకపోతే మళ్ళి చెరిపేస్తాము. చిన్న పిల్లలు ఆడుకుంటూ ఒకదాని మీద ఒకటి ఒకదాని మీద ఒకటి పెట్టి, బావుండకపోతే మొత్తం అంతా పీకేస్తారు కదా! అట్లా చేయాలంటే అదో శక్తి. మనలో కూడా ఉంది ఆ శక్తి. బాగులేదు అన్నది మార్చేస్తాము కదా. మళ్ళా from the beginning చేయమూ ఏదైనా బాగా లేకపోతే? ఒక drawing గీస్తున్నాము అనుకోండి, బాగా రాకపోతే మళ్ళి గీస్తాము. మార్పు చేయటానికి కావలసినటువంటి శక్తి భగవంతుని యందు ఉంటుంది. అది అత్యవసర పరిస్థితులలో దానిని వాడుకో అంటాడు భగవంతుడు. ఎప్పుడూ వాడడు. బాగున్నంత కాలం దానిని వాడడు. బాగుండకపోతే అప్పుడు నాలుగు కోరలతోను చీల్చేస్తాడు. ఎందుకంటే మార్చి మళ్ళి fresh గ తయారు చేద్దామని. మొత్తము అంత కూడా కరిగించి ఇంకో నగ చేయించుకోము బంగారముతో. పాతది అయిపోయిందని, సొట్ట పడిందని వెండి, బంగారము కరిగించినపుడు 'అయ్యో కరిగిస్తునామే' అని ఏడవము కదా. ఎందుకంటే మళ్ళి చేసుకోవచ్చును అని మనకి ధైర్యము ఉంది కాబట్టి. బంగారము, వెండి ఎక్కడకీ పోదనే ధైర్యం. అలా భగవంతుడు కూడ ఈ సమస్తము ఎక్కడికి పోదు, వీళ్లంతా ఎక్కడికి పోరు కాబట్టి ఒక సారి కరిగించి మళ్ళీ పెడుతూ ఉంటాడు fresh గ. కరిగించడం అనే కార్యక్రమానికి మరి ఆయనకి కూడా కొన్ని instruments కావాలి కదా అందుకు చతుర్దంష్ట్ర. మార్పు చేయాలంటే, వీడికి కొంచము ఏమైనా కష్టాలు కలిగిస్తే మారుతాడేమో అని చూస్తాడు. రోగము కుదరాలంటే కష్టము కలిగించాలి. కష్టము లోంచి మార్పు చేసుకొనే వాళ్ళు ఉంటారు. మనకి ఈ కష్టము ఎందుకు వచ్చింది అని అలోచించి, ఇలాంటి పనులు చేసాము కదా అందుకే వచ్చింది. ఇహ నుండి అలాంటి పనులు మానేద్దాము అనుకోవచ్చు. కష్టాలలోంచి మారకపోతే కష్టాలలోంచి వచ్చే దుఃఖానికి సంబంధించే భావనలు నుంచి రోగాలు పుట్టుకు వస్తాయి. (4 కోరలు లేదా 4 దంష్ట్రలు కదా!) అందుకు మొదటి కోర కష్టముట. రెండో కోర రోగముట. కష్టాలు, రోగాలు వచ్చిన వాళ్ళు తొందరగా ముసలి వాళ్ళు అయిపోతారు. ఈయన అలా అవలేదు. ఈ జగన్మోహన మూర్తి, శ్రీకృష్ణుడు. 126 ఏళ్ళ దేహంలో ఉన్నా, ఎప్పుడూ 16 ఏళ్ళ కుర్రవాడిలా ఉన్నాడట. ఆయనకి కష్టాలు

లేవా? ఉన్నాయి, కష్టము అనుకోలేదు. To Him nothing is a difficult situation. ప్రతిదీ నవ్వుతూ తీసుకున్నాడు. ఆయన మారవలసినది ఏమి లేదు. మార్చుకోవలసినది ఏమి లేదు. మార్చుకోవలసిన వాళ్ళు ఏమి లేని వాళ్ళు నవ్వుతు ఉంటారుట. మారాల్సిన చోట కష్టము వస్తుందిట. కష్టము వస్తేనే మనిషి మారుతాడు. కొంచెం కరగాలి అంటే కొద్దిగా సెగ పెట్టాలి. సెగ పెడితే కాని మనిషికి మార్పు రాదు. సెగ పెట్టినా కూడ మారలేదు అనుకోండి, రోగము వస్తుంది. అందుకు రోగం రెండో కొరట.ఈ రెండు కోరలు సరిగా పని చేయకపోతే ముసలాడిని చేసేస్తాడు. కాలం రూపంలో వాడు ముసలాడయిపోతాడు. అప్పుడు ఇంకా బాధలు. దేహములో అవి ఇవి కదలవు. కోరికలన్నీ ఉండిపోతాయి దేహము మాట వినదు. అది మూడో కోరట. నాలుగో కోర చావుట. ఏమిటి చంపటం అంటే, రూపము మార్చటం కదా. నగ మార్చి నగ చేయించుకోవడము లేదూ? అంతే! అట్లా నాలుగు కోరలని వాడుతూ ఉంటాడుట. ఆ నాలుగు కోరలు కష్టము, రోగము, ముసలితనము, మృత్యువు. ఎంత వరకు ఆ నాలుగు కోరలు వాడతాడంటే మృత్యువుని అధిగమించే వరకు వాడుతూ ఉంటాడుట. అంటే అమృతత్వ స్థితి పొందే వరకు ఈ నాలుగు కోరలు మనమీద వాడబడుతూ ఉంటాయి. అమృతత్త్వ స్థితిలో ఒక్కసారి అడుగు పెట్టిన తరువాత కష్టసుఖాలు అంటవు. రోగములు అంటవు. ముసలితనము అంటదు. ఏవి అంటని స్థితి లో ఉంటాడు కాబట్టి ప్రత్యేకించి వాడి మీద ఈ కోరలు వాడటం ఉండదు. మిగతా అందరిని ఈ నాలుగు కోరలతోను rectify చేస్తూ ఉంటాడు. దుర్మార్గుడా భగవంతుడు? అంటే కాదు. సృష్టించేవాడు. దుర్మార్గులను మంచి మార్గములో ఉంచడానికి సృష్టిస్తూ ఉంటాడు. పొట్టలో పెద్ద పుండు పెట్టుకున్నావు, తీయకపోతే చస్తావు. పుండు తీయాలంటే పొట్ట కోయాలి. అట్లాగే మనకి మనసులో చాల కుళ్ళు ఉంటుంది. మనసులో కుళ్ళు ఉంటె పురుగులు ఉంటాయి. ఆ పురుగులు తీసేయాలంటే బ్రెయిన్ operation చేయాలి. "నాకు పడేయిరా ఆ పురుగులన్ని" , అని తిరుగుతూ ఉంటాడుట దత్తాత్రేయ రూపంలో చిప్ప పట్టుకొని. అది దత్తాత్రేయ రూపం. ఆ చిప్పలో మనం ఏమిటి వేయాలిట? ఆయనకి డబ్బులు అక్ఖరు లేదుట, అన్నం అక్కర్లేదుట ఎందుకంటే అవన్నీ ఆయనకి అవసరము లేదు. నీకు ఏవి dangerous అవన్నీ అయన ఆ పుత్రెలో/ చిప్పలో వేసేయమంటాడు. వేసేస్తే నీ బుర్ర clean గ ఉంటుంది. అందుకని దత్తాత్రేయ రూపములో చిప్ప పట్టుకొని

శివుడు మొత్తము తిరుగుతూ ఉంటాడుట . తిరిగి, వేసేయి ఇందులో వేసేయి, నేను చూసుకుంటాను. నీలో ఉంటె danger. నా దగ్గర ఉంటె నువ్వు safe అని. ఇట్లా చెప్పారు శంకరాచార్యులవారు. 'ఏమి అఖ్ఖరు లేదు కదా నీకు, అయినా ఎందుకు ఇలా చిప్ప పట్టుకొని ప్రతివారింటికి ముష్టికి వెళ్తావు?' అని ఆలోచించి, ఆలోచించి ఆలోచిస్తే అప్పుడు ఒక మెరుపు వచ్చిందట శంకరాచార్యులవారికి. ఏమిటంటే? 'నాకు ఏమి అఖ్ఖరు లేదురా, వీరందరి బుర్రల్లో చూస్తుంటే బాధ వేస్తుంది, అవి ఇందులో వేస్తారని.' అదే షిర్డీ సాయి కూడా 'నా కోసము కాదు నేను భిక్షం అడుగుతున్నది, వీళ్ళు ఈ చిప్పలో వేస్తే ఈ పాపాలన్నీ నేను క్షాళన చేసుకుంటూ ఉంటాను.' అంటాడు. చౌతి అనే ఒక ప్రక్రియ ద్వారా నది వొడ్డుకి వెళ్లి ప్రేగులు అన్ని తీసి కడిగి మళ్ళీ లోపలికి వేసుకుంటూ ఉంటాడు అయన అప్పుడప్పుడు, Noodles లోపల వేసుకుంటాడు. బయటకి తీస్తుంటాడు, లోపలికి వేస్తుంటాడు. He is capable of absorbing others impurities. వాళ్ళు మహాత్ములు. ఇంకొకరికి సేవ చేయడం కోసం తన మొత్తము ప్రాణాన్ని , దేహాన్ని, శరీరాన్ని, సమస్తాన్ని అర్పణము చేసుకునేవాడే కదా అవతారమూర్తి. ఆ విధంగా తిరుగుతూ ఉంటాడు. అందుకని దగ్గరున్నది ఎంత వదిలించుకుంటే అంత మంచిది. దానము రూపం లో చేయటంలో, త్యాగము చేయటంలో అంత మెరుపు వస్తుంది. ఎంత పోగేసుకుంటే అంత తుప్పు పడుతుంది. అందుకని ఆ విధంగా తిరుగుతూ ఉంటాడుట భగవంతుడు. అట్లా తిరిగి ఈ నాలుగు కోరలు బంధించకుండ మనని రక్షిస్తూ ఉంటాడుట దత్తాత్రేయుడు. అది దత్తాత్రేయ అవతారము యొక్క ముఖ్య లక్షణము. భగవంతుడు సృష్టి గా దిగి వచ్చినపుడు జీవులకు వచ్చేటటువంటి కష్టాలు తీర్చడానికి తానే గురువుగా దిగి వచ్చి అనుగ్రహిస్తుంటాడు. అనుగ్రహించడానికి మన దగ్గరకి వచ్చి, ఏదైతే మనకి అపాయకారమో, అంటే మనలో మందుగుండు సామానుంటుంది, ప్రేలుడు సామానుంటుంది, విషం ఉంటుంది ఇవన్నీ తీసేయటానికి గురువుగా తానే దిగి వస్తాడు. అట్లా దిగి వచ్చిన గురుమూర్తిని దత్తాత్రేయుడుగా దర్శనము చేసుకుంటూ ఉంటారు. అందుకని భగవంతుడు చేయలేనిది గురువు చేసి పెడతాడు. భగవంతుడు సృష్టి ఆట ఒకటి తయారు చేసి, ఆటలో రకరకాల complications ఇస్తూ ఉంటాడు. ఏమిటయ్యా అంటే 'ఆటేకదా' అంటాడు. మరి ఆటలో ఎట్లాగయ్యా నేను బతికి బట్ట కట్టాలంటే అంటే. నేర్పడానికి నేనే దిగి వస్తానయ్యా అని నీకు ఆట ఆడించడానికి అని గురువుగా దిగి వస్తాడు.

అందుకని గురువు దగ్గర కూర్చుంటే, సులభంగా ఆట ఏమిటో తెలుస్తుంది, ఎలా ఆడాలో తెలుస్తుంది. అలా ఆడేస్తే సరిపోతుంది. 'ఏముందయ్యా మొత్తమంతా skillful గ ఆడడమే కదా' అంటాడు ఆయన. 'యోగః కర్మసు కౌశలం' దోహదమైనది. అలాంటి కౌశలం  మనకి గురువు యొక్క అనుగ్రహము వల్ల లభించుగాక!

## 149 భ్రాజిష్ణుః

ప్రకాశము లేక వెలుగు తన స్వభావముగా కలవాడు. వెలుగు చేత వ్యక్తమయ్యేవాడు. భగవంతుడు నల్లగా వుంటాడు. ఆయన యొక్క వెలుగు తెల్లగా వుంటుంది. అదీ రాధాకృష్ణులు. మనం వ్యక్తమవాలంటే మన స్వభావం ద్వారా వ్యక్తమవుతూ వుంటాము. అలాగే భగవంతుడు తన యొక్క స్వభావం లేక ప్రకృతి ద్వారా వ్యక్తమవుతూ ఉంటాడు. వ్యక్తమయ్యే భగవంతుని యొక్క స్వభావం ఏమిటంటే వెలుగే! ప్రకాశమవడమే ఆయన యొక్క స్వభావము. అనగా అమ్మవారి తత్వం వెలుగు తత్వమయితే, ఆ వెలుగుతున్న దాని వెనకాల ఉన్న అవ్యక్తమైన తత్వం భగవంతుని తత్వం. వెలుగుకి ఆధారమేమిటి అని మనం గమనించినట్లైతే, అది 'ఆయన' అన్నమాట. 'తత్ సవిత్ర వరేణ్యం' ఏ వెలుగయితే సూర్యుని నుంచి వెలుగుతూ మనకి వస్తుందో, ఆ వెలుగుకి ఆధారభూతమైన మూర్తిని మనం ధ్యానం చేస్తున్నామని అర్థం. వెలుగు మనకి వ్యక్తంగా కనిపిస్తూ వుంటుంది. విద్యుత్తు అవ్యక్తంగా వుంటుంది. అంటే అవ్యక్తమైన విద్యుత్తుకి వ్యక్త స్వరూపంగా వెలుగు కనిపిస్తుంది. అలా భగవంతుని యొక్క స్వభావము లేక ప్రకృతి ఏమిటంటే వెలుగు. వెలుగు ద్వారా వ్యక్తమయ్యే భగవంతుని 'భ్రాజిష్ణుః' అంటారు. ఈ వెలుగు ఎంత చేరితే అంత భగవంతుని యొక్క అస్తిత్వం అక్కడ నిగూఢముగా ఉన్నదని అవగాహన చేసుకోవాలి. భగవంతుని యొక్క అస్తిత్వము లేని చోట వెలుగు లేదు. భగవంతుని యొక్క అస్తిత్వమే వెలుగు రూపంలో వుంటుంది. ఆ వెలుగునే 'చైతన్యం' అని అంటారు. ఆ వెలుగునే 'ఆకాశము' అని అంటారు. ఆ వెలుగునే 'ప్రకాశము', 'వికాసము' అని అంటారు. ఆ వెలుగునే 'భా' అంటారు. 'భా' అనే పదానికి అర్థం పరిపూర్ణముగా వెలిగి వున్న ఒక స్థితి. 'ప్రభ' అన్నపుడు ఇంకొంచెం విశిష్టంగా వెలిగి ఉండే స్థితి అన్నమాట. 'భ్రాజిష్ణుః' అనే నామానికి అవగాహన, వెలుగు తన స్వభావముగా వ్యక్తమయ్యే భగవత్ తత్వము. కనుక మనకి ఎక్కడ ఎక్కువ వెలుగు ఉంటే అక్కడ ఎక్కువ భగవత్తత్వం

వుంటుంది. ఎక్కడ ఎక్కువ వెలుగు ఉందో, అక్కడ ఎక్కువ ఆనందం వుంటుంది. దీపావళి నాడు ఎక్కువ దీపాలు పెట్టుకుంటే ఎక్కువ ఆనందం వస్తుంది. మన ఇంట్లో పూజ చేసి ఎక్కువ దీపాలు వెలిగిస్తే, అమ్మవారు కళకళలాడుతూంటే, 'అయ్యో మన వారంతా చూస్తే బాగుండును కదా' అనిపిస్తుంది. ఎందుకంటే వెలుగున్న చోట అటువంటి వికాసము. ఆకాశము ప్రకాశము లాగా, వికాసము అంటే మనలో ఉన్న వెలుగే వికసించడం అన్నమాట. అంటే వ్యక్తమవడం. అందుకని ప్రత్యేకించి ఎక్కువ వెలుగుని మన జీవితాల్లో నింపుకోవడానికి ప్రయత్నించినట్లయితే, ఎక్కువ వెలుగుతో పాటుగా భగవంతుడు వస్తాడు. ఎక్కడికైనా నడిచి వెళితే, ఆవిడతో పాటు నడిచి వెళుతున్న ఒక భర్త లాగా, ఆవిడ నడిచి వెళుతూంటే వెనకాల నేనూ ఉన్నానని వస్తాడు, ఎందుకంటే ఆయన నడవటమే ఆమె నడవటము. ముందు ఆవిడ, వెనక ఆయన. ముందు వెలుగు, ఆ వెలుగుకి వెన్నపూస వలే ఆయన ఉంటారన్నమాట. ఈయన లేకపోతే వెలుగు లేదు. వ్యక్తమైనపుడెపుడూ వెలుగుగా వ్యక్తమవడమే జరుగుతుంది. వెలుగుగా వ్యక్తమయ్యే తత్వాన్ని ఎక్కువగా మన యందు నింపుకోవడానికి ప్రయత్నం చేయవలసి ఉంది. అది ఎట్లా ప్రయత్నించడం? దానికి సంబంధించే మనకి వెలుగు ధ్యానములు ఇవ్వబడినాయి. వెలుగును ధ్యానం చేసుకుంటుంటే, ఈ వెలుగును ఎంత మనం హృదయ మందిరంలో నిలబెడితే అంత భగవంతుని యొక్క అస్తిత్వం ఏర్పడుతుంటుంది. అందుకని హృదయమునందు, భ్రూమధ్యమునందు, వెలుగును ధ్యానం చేయడం మనకి పెద్ద వాళ్ళిచ్చారు. గాయత్రీ మంత్రం కూడా వెలుగుకి సంబంధించిన ధ్యానం. అలాగే అగ్నిని, సూర్యోదయమును ధ్యానం చేయడం. ఈ విధంగా ధ్యానం చేసే పద్ధతి మనకి ఎందుకిచ్చారంటే, వెలుగుని ఎంత ఎక్కువ ఆవాహనం చేసుకుంటే, తద్వారా ఈ 'భ్రాజిష్ణుః' అనే భగవంతుని యొక్క అస్తిత్వము మన యందు ఎక్కువగా ఏర్పడుతుంది. వెలుగుకి అవరోధము అపవిత్రత ఒకటి. అపవిత్రత అనేది స్వభావము నందు ఉన్నట్లయితే, అక్కడినుంచి అది భౌతిక ప్రపంచంలో మాలిన్యంగా కనిపిస్తుంది. మలం అంటాం. మాలిన్యములు మనలో బాగా

పేరుకొనివుంటే, భావమయ లోకంలో బాగా వెలుగు తగ్గింది, చీకటి ఎక్కువగా ఉంది అని అర్థం. చీకటి ఎంత ఎక్కువగా ఉంటే భావమయ లోకంలో, భౌతికమయ లోకాల్లో అంత మాలిన్యం చుట్టూ పేరుకుని ఉంటుంది. ఎంత మాలిన్యం అంటే మన చుట్టూ పరిసరములో ఉన్న మలినమును కూడా అశ్రద్ధ చేసి, పెరగనిచ్చి తద్వారా వెలుగును అడ్డుకునే స్థితి. 'కొండి పెరిగి దీపం ఆరిపోయిందిట' అని అంటారు. దీపం పెట్టినప్పుడు ఎప్పటికప్పుడు కొండి తీసేస్తుండాలి. కొండి తీసేయకపోతే దీపం ఆరిపోతుంది. ఆ కొండే దీపాన్ని మింగుతుంది. అంటే అచట నుంచి అదృశ్యుడయ్యాడు. దీపం ఆరకుండా ఉండాలంటే ఏ విధంగా కొండిని తీసేయాలో, ఆ విధంగా మనలో ఏర్పడుతూండే మాలిన్యాలను ఒక దైనందిక కార్యక్రమముగా తీసేయాలి. అలా తీసేయక పోతే మలినమైన భావమయ లోకం స్థిరపడి, అందులో వచ్చిన భావములు పవిత్రతకి సంబంధించిన కార్యక్రమములకు ఉన్ముఖమై ఉండవు. విముఖమై ఉంటాయి. కనుక మంచి కార్యక్రమాలు జరుగుతూ వుంటే వెళ్లకపోతే ఏం? అనిపిస్తుంది. ఎక్కడైనా మంచి విషయాలు చెబుతున్నారట అంటె వెళ్లకపోతే ఏం? అనిపిస్తుంది. ఒక మహాత్ముడు వచ్చాడుట అంటె చూడకపోతే ఏం? అనిపిస్తుంది. అనగా భావమయ ప్రపంచంలో బాగా పవిత్రత పూర్తిగా కోల్పోయిన స్థితిలో ఈ రకమైన ఆలోచనలు వస్తాయి. పవిత్రత ఎంత తగ్గితే, అంత పవిత్రతకి సంబంధించిన కార్యక్రమములకు విముఖత వస్తుంది. పవిత్రత ఎంత పెరుగుతుంటే అంత పవిత్రమైన కార్యక్రమాల్లో పాల్గొనడానికి అవకాశం ఏర్పరుస్తూ వుంటుంది. ఎక్కడైనా ఒక మంచి కార్యం జరుగుతుంటే మనం వెళ్లలేదని నిర్ణయం చేసుకోవచ్చు కానీ, రాకూడదనే నిర్ణయం వాళ్ళు చేసారని కూడా తెలుసుకోవాలి. ఒక మహాత్ముణ్ణి దర్శనం చేసుకోవడానికి నేను రాకూడదని నిర్ణయం చేసుకున్నానని అనుకోండి. అంటే ఆ మహాత్ముడు నిన్ను రావద్దని నిర్ణయం చేశాడని అర్థం. మనమొక్కరమే కాదు నిర్ణయం తీసుకోవడానికి అటు నుంచి కూడా నిర్ణయం జరుగుతుంది. అందుకని మహాత్ముల దర్శనం, మహత్కార్యములయందు పాల్గొనుట, మంచి

విషయములయందు బుద్ధి పెట్టుట, సద్గ్రంథముల పఠనము, సత్పురుషుల దర్శనము ఇలాంటి వాటి యందు ఒక విధమైన విముఖత ఏర్పడుతుంది. విముఖత్వమేర్పడి దూరమై పోతాము. అందుకని కోరి సత్సాంగత్యం పెట్టారు. సత్సాంగత్యానికి దూరమయ్యామనుకోండి, అంటే routine లో ఏదో తేడా వచ్చిందన్నమాట. అందుకని దూరమయ్యామని అర్థం చేసుకోవాలి. Routine లో ఈ వికాసం పెరిగే పద్ధతిలో మన యొక్క దైనందిన కార్యక్రమములు ఎక్కువగా మననుంచి జరుగుతుండాలి. Routine లో కనుక మనకి చక్కటి అలవాట్లు ఏర్పడుతూ వచ్చాయనుకోండి, మనసు, ఇంద్రియములు, శరీరం ఈ మూడు కూడా ఒకదానికొకటి చక్కటి సహకారాన్ని రూపొందించుకొని, తద్వారా కార్యక్రమములను ఎగ్గొట్టడం కాకుండా, వీలున్నంతవరకూ వాటిలో పాల్గొనడానికి బుద్ధి కలుగుతుంది. మంచికి సంబంధించినవి, భగవత్ పరమయిన భావనకి సంబంధించిన కార్యక్రమములు జీవితంలో పెరుగుతూ వుంటాయి. అలాగే చీకటికి సంబంధించిన కార్యక్రమాలు చోటు చేసుకొంటే అవీ పెరుగుతాయి. అనగా ఒకరు ఇటు లాగుతూ వుంటారు. ఒకరు అటు లాగుతూ వుంటారు. ఎటు లాగబడతాం అనేది మనని బట్టి వుంటుంది. మహాత్ముల జీవితాలు చూసుకుంటే ఒక కార్యక్రమం నుంచి ఇంకొకటి, అందులో నుంచి మరొకటి అట్లా ఎడతెరిపి లేకుండా సత్కార్యములయందే జీవించే ఒక ప్రణాళిక ఏర్పడుతుంది. అంటే భగవంతుని యొక్క కార్యక్రమము తప్ప, ఇంకొకటి లేని స్థితి మహాత్ముల జీవితాల్లో కనిపిస్తుంది. జీవితం మొత్తం కూడా భగవత్ తత్వంతో నిండి వుంటుంది. కారణమేమంటే ఇదే కారణం. మంచిని తనలో పెంచుకుంటూ, తన భావన భగవత్పరంగా పెంచుకుంటూ వెళుతుంటే, పవిత్రత పెరుగుతూ ఉంటుంది. ఎంత పవిత్రత పెరుగుతుంటే అంత వెలుగు అస్తిత్వం చోటు చేసుకుంటూ వుంటుంది. ఎంత వెలుగు అవతరణ చేసుకొంటుంటే అంత ఎక్కువ తన నుంచి లోకహితమైన కార్యక్రమములు వ్యక్తమవుతూ వుంటాయి. మాస్టారి జీవితంలో మనకి ఆ విధంగా కనిపిస్తూ వుంటుంది. నెమ్మదిగా మొదలు పెట్టి విశ్వ ప్రణాళికకు సంబంధించిన కార్యక్రమములు ఆయన నుంచి నిర్వర్తింపబడినాయి. అన్నీ

ఒకసారి మొదలుపెట్టినవి కాదు. సన్నగా, చిన్నగా ప్రొద్దున 6 గంటలకు ప్రార్థనతో మొదలైన జీవన ప్రణాళిక, విశ్వ ప్రణాళికగా రూపొందింది. ఎలా రూపొందింది అంటే అది ఈ వెలుగుకి సంబంధించిన ఒక సాధన. మనలో కూడా ఆ సాధన జరుగుతున్నంతసేపు ఆ వెలుగు వ్యక్తమవుతూ వుంటుంది. ఎంత వెలుగు వ్యక్తమవుతూంటే అంత ఆనందం వస్తుంది. ఈ ఆనందాన్ని దైనందిన జీవితంలో మనం వ్యాపనం చేసుకుంటూ, కార్యక్రమాల్ని నిర్వర్తించుకుంటూ ఉన్నట్లయితే అది మన యందు స్థిరపడుతుంది. లేకపోతే బయటకి వెళ్ళినప్పుడు చీకటికి సంబంధించిన భావనలు మనలో పెరగడం వలన భగవంతునికి సంబంధించిన కార్యక్రమముల యందు, పుణ్యక్షేత్రములు దర్శించడం, పుణ్యపురుషుల సాంగత్యము నందు విముఖత ఏర్పడుతుంది. కాంతిని పెంచుకుంటూ పోతూ ఉంటే చీకటిని లేకుండా చేస్తుంది. కానీ ఆ కార్యక్రమముల యందు మనకి శ్రద్ధ తగ్గిన కొలదీ కాంతి తగ్గిపోతుంది. కాంతి తగ్గిపోతూ వుంటే, otherwise busy గా మనకు బోలెడన్ని కార్యక్రమములు కనిపిస్తూ వుంటాయి. ఎట్లాగండీ ఇవన్నీ వీలు పడతాయి? ఇవన్నీ వీలుపడే విషయాలు కాదు కదా, అని అంటారు. ఎందుకు వీలుపడదని అంటారంటే, వీలుపడదని మీరు నిర్ణయం తీసుకున్నారు కాబట్టి వీలుపడదు. లేకపోతే వీలుపడుతుంది. మొత్తం జీవితం ఆ విధానానికి సమర్పణమై నడిచే పద్ధతిలో వెళ్ళడానికి అవకాశం కల్పిస్తుంది. అదీ చేస్తున్న పనుల్లో వ్యక్తిగతమైన కారణాలు లేకుండా ఉన్నప్పుడు. మనకి మంచి కార్యక్రమాల్లో లేక మంచి కాలక్షేపం జరుగుతుందనుకోండి అందులో కారణం ఏమీ లేదు. అందులో నుంచి వచ్చిన ఆనందం కారణంగా ఈ రకమైన వికాసం వస్తుంది. ఎంత అది పెరుగుతూ వుంటే అంత ఆనందం కలుగుతుంది. అంత వెలుగుకి ఉన్ముఖమై వుంటాము. మనము తెల్లటి కలువను గానీ, పూవునుగానీ, కుక్కనుగానీ, తెల్లటి మేఘాన్ని, తెల్లటి గుర్రాన్నిగానీ చూశామనుకోండి. మనకి అప్రయత్నంగానే ఒక విధమైన ఆనందం వస్తుంది. తెల్లటి గుర్రాన్ని చూస్తే ఒక్క క్షణం ఆగి చూడాలనిపిస్తుంది. తెల్లటి కుక్కను చూసినా, పూవును చూసినా అంతే. తెల్లని ఇల్లును చూసినా అంతే. ఎందుకంటే తెలుపులో కాంతి

పరిపూర్ణంగా వుంటుంది. మిగతా రంగుల్లో కాంతి తెలుపులో భాగంగా వుంటుంది. తెలుపంత కాంతివంతం కాదు. కాబట్టి తెలుపును చూడగానే మనం సహజంగా చైతన్య స్వరూపులము, తెలుపు వంటి కాంతివంతమైన వాళ్ళము కాబట్టి ఆ వెలుగు చూడగానే మనకి ఆనందాన్నిస్తుంది. అందుకని తెల్లటి విషయాల యందు ఎక్కువ లగ్నం అయ్యేటట్లుగా మనసుని ఒక సాధన చేసుకోవచ్చు. తెల్లటి బట్టలు, తెలుపు, తెల్లటి రంగు ఎక్కువ పెంచుకోవడం. ఎంత కాంతి పెరిగితే అంత ఆనందం పెరుగుతుంది. అందుకనే మనకి ఒక దీపం లేకుండా ఆరాధన గానీ, ప్రార్థన గానీ చేయకూడదని చెబుతారు. దీపం పెట్టుకుంటే ఏం జరుగుతుంది? అచ్చట ఉండే భగవంతుని అస్తిత్వం దీపం రూపంలో వున్నది. అందుకని దీపం పెట్టుకోవడం. చీకట్లో ప్రార్థనలు, ఆరాధనలు జరగకూడదు. మనలో ఉండే వెలుగును చూడగలిగే స్థితికి చేరుకుంటే అది వేరే స్థితి. ఈ లోపల చేసే సాధనంతా వెలుగు ఆధారంగా చేసుకోవాలి. వెలుగునే ఆవాహనం చేసుకుంటూ వుండాలి. వెలుగును ఆవాహనం చేసుకోవడం అంటే, భగవంతుని ఆవాహనం చేసుకోవడమే. అటువంటి వెలుగు మనలో బాగా పెరిగి పెరిగి, పెరిగితే మన శరీరమే ఒక వెలుగుగా తయారవుతుంది. అటువంటి వెలుగు శరీరములు పొందిన వారందరినీ కూడా మహాత్ములంటారు. వారు ఆ శరీరముతో భూమి మీద తిరుగుతూ ఉంటారు. దానినే 'భాగవత శరీరం' అంటారు గ్రంథాల్లో. ఆ వెలుగు శరీరాన్ని ఆధారంగా చేసుకుని, ఈ భౌతిక శరీరంతో సంబంధం లేకుండా, భూమి చుట్టూ తిరుగుతూ పరహితమైన కార్యక్రమములను నిర్వర్తిస్తుంటారు మహాత్ములు. ఆ వెలుగు శరీరాన్నే 'వజ్రశరీరం' అంటారు. దాన్నే 'వజ్రాంగశరీరం' అంటారు. అటువంటి వజ్రాంగశరీరం కలవాడే హనుమంతుడు. అందుకని 'వజ్రాంగబలుడు' అంటారు. అదే 'బజరంగబలి'. అంటే మనకి మామూలుగా ఉండే స్థితి నుంచి బజరంగబలి అనే స్థితి వరకు కార్యక్రమం నడుస్తుంది. బజరంగబలి ఎటువంటి వాడయ్యా అంటే వాయుపుత్రుడు. వాయువు నందు ఎగరగలిగినవాడు. సంకోచ వ్యాకోచములు కలిగినవాడు. శరీరమును తను సంకోచింపగలడు,

వ్యాకోచింపగలడు. వ్యాపనం చేయగలడు. అలాగే దానిని ఒక వెలుగు ఆధారంగా ఈ కార్యక్రమములను నిర్వర్తిస్తూ, ఆకాశము నందు ఎగిరే స్థితికి తీసుకురావడం కూడా మానవునికి ఈ యుగంలో సాధ్యమని మహాత్ములు చెబుతున్నారు. కాలం దానికి అనుకూలంగా ఉంది కాబట్టి, పవిత్రతకి సంబంధించిన కార్యక్రమములు పెరుగుతున్నకొద్దీ వెలుగు పెరిగి, వెలుగు శరీరాలు తయారవుతాయి. ఈ వెలుగు శరీరం తయారయినవాడు భగవంతుని యందు పరిపూర్ణముగా వున్న వాడు. 'తన శరీరమే వెలుగైందిట' అంటే, తన నిండా భగవంతుడు నిండాడు అని అర్థం. వెలుగున్నచోట భగవంతుడు ఉన్నాడు కాబట్టి, మన శరీరం మొత్తం అంతా వెలుగుతో నిండి వున్నది. అనగా మన వెలుగు శరీరం మందిరంగా భగవంతుడు తిష్ట వేసి వున్నాడు. మాస్టారు ఎవరికైనా కలలో కనిపించారనుకోండి, తెల్లటి బట్టలు వేసుకొని కనిపిస్తారు. తెలుపు అనే కాంతిశరీరంగా కలిగి కనిపిస్తారు. కొంతమంది మహాత్ములు, బంగారురంగు శరీరం కలిగి కనిపిస్తారు. మరికొంతమంది మహాత్ములు అరుణం అనగా కాషాయ రంగు/ orange రంగు వర్ణంలో కనిపిస్తారు. ఇవన్నీ వెలుగుకు సంబంధించిన కాంతులే. అన్నిటికన్నా మించి తెలుపు రంగు పరిపూర్ణమైన రంగు. ఎందుకంటే అన్ని రంగులు అందులో లీనమై ఉంటాయి. అటువంటి శరీర నిర్మాణానికి ఇవ్వబడిన సాధనే మనకివ్వబడిన యోగ సాధన. భగవద్గీతలో చెప్పినా, పతంజలి యోగ సూత్రములలో చెప్పినా, భాగవత సాధనా రహస్యములలో చెప్పినా వారు చెప్పినదేమిటంటే మనసు, శరీరము, ఇంద్రియములు ఈ మూడింటిని వెలుగుతో నింపడం. వెలుగుతో పరిపూర్ణముగా నింపడం అనేది ఒక కార్యక్రమంగా చేసుకుంటూ వెళ్ళామనుకోండి, వెళితే దాని యొక్క భావన చేత, ఆవాహనం చేసుకొనడం ద్వారా, మన యందు అది స్థిరపడే ఒక పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని వెలుగు ధ్యానం పెద్దలిచ్చారు మనకి. ఎవరు ఇచ్చినా అన్నిటికీ మించిన వెలుగు ధ్యానంగా 'గాయత్రి' ఇచ్చారు. కళ్ళు మూసుకొని భ్రూమధ్యమునందు వెలుగును ధ్యానించమన్నారు. వెలుగును మనకి కావలసిన మూర్తిగా కూడా

ధ్యానించమన్నారు. దానిని దర్శించగలగాలి. వెలుగుగా దర్శించడం అంటే భాగవత శరీరం తయారవుతుంది అన్నమాట. అందుకని నిద్రపోయేటప్పుడు కూడా మనం వెలుగును పూర్తిగా ఆవాహన చేసుకుని లోపల, బయట పూర్తిగా వెలుగు నింపుకొని నిద్ర పోతుండవచ్చు. అలాగైతే తేలిగ్గా నిద్ర పోవచ్చు. ఎంత చీకటి, దేహంలో చోటు చేసుకుంటుందో అంత దేహం బరువెక్కువౌతుంది. సాంద్రత పెరుగుతుంది. శరీరంలో అణువుల యొక్క సాంద్రత పెరిగితే బద్ధకం పెరుగుతుంది. బద్ధకం వస్తే చేయవలసిన మంచి కార్యములకు అడ్డొస్తుంది. చేయకపోతే ఏం? అనిపిస్తుంది. ఇప్పుడు చేస్తేనేనా తర్వాత చేసుకోవచ్చు కదా కనిపిస్తుంది. శరీరము తేలికవడం అనేది వెలుగుకు సంబంధించినది. గాలికి ఏ విధంగా ఒక ఎండిన ఆకు తేలి వెళుతుందో అట్లా శరీరం తేలికయ్యే స్థితి ఏర్పడుతుంది. బరువెక్కి పోయిన శరీరం ప్రతీ పనికి అడ్డు వచ్చే పద్ధతిలో తయారవుతుంది. మనకి స్వానుభవం మీద తెలిసిన విషయాలే! శరీరం బరువెక్కి కర్తవ్యములకు అడ్డు రావడం అనేది ఒకటి జరుగుతుంటే, శరీరం తేలికై మన కర్తవ్యములను ఇంకా కొంచెం విశ్వ ప్రణాళికగా పెంచి ఎన్నో కర్తవ్యాలను తన జీవితంలో నిర్వర్తించే మహాత్ముల జీవితంగా కూడా మార్పు చెందుతుంది. కాబట్టి వెలుగుకు సంబంధించిన కార్యక్రమము ఇంత ఉంది. వెలుగు తన స్వభావంగా కలవాడు అంటే, ఎక్కడ వెలుగు పెంచుకుంటే అక్కడ భగవంతుడు వుంటాడు. అందుకనే దీపాలు పెట్టుకుంటూ వుంటాము. అందుకని లైట్లు వేసుకుంటూ వుంటాము. అందుకని చూస్తూ వుంటాం సూర్యుణ్ణి. స్వతఃసిద్ధముగా వెలుగు రూపములు కాబట్టి, వెలుగుకు సంబంధించినవి, తెలుపుకి సంబంధించినవి కనిపించినప్పుడు ఆ విధమైన భావన మనలో కలుగుతూ వుంటుంది. ఈ విధంగా వెలుగుకి ఆకర్షితులవడం జరుగుతుంది. కొంతమందికి వెలుగు పడితే తల బాధ వస్తుంది. అంటే శరీరం యొక్క పరిస్థితి చాలా diagonally opposite to what we intend to become. ఎండ కన్నా మబ్బు ఎక్కువ నచ్చే వారున్నారు. మబ్బుగా ఉంటే బాగుండే వాళ్ళు కొందరు ఉంటారు. చీకటిగా

ఉంటే బాగుండటం, ఇంట్లో దుమ్ము ఎక్కువగా ఉంటే బాగుండటం, బూజు ఉంటే బాగుండటం, తుడుచుకోకపోతే బాగుండటం, కడుక్కోకపోతే బాగుండటం, ఎండిపోయినవి, పగిలిపోయినవి అంటే బాగుండటం, పులిసి పోయినవి, చలిది వాసన వేసినవి బాగుండటం ఇవన్నీ మనలో ఉన్న అపవిత్రతకి తార్కాణం. పులిసి పోయినవి, ఎండిపోయినవి, చద్దివి అంగీకరింపబడుతుందట శరీరం అంటే ఇంకా శరీరాన్ని మార్పు చేయవలసినది చాలా వుందన్నమాట. అలాగే బూజు, దుమ్ము, ధూళి, చీకటి వీటియందు, వాటిని నిర్మూలనం చేసుకుందామనే భావన లేదుటా అంటే శరీరంలో చెందవలసిన మార్పు చాలా వుందట. అనగా ఈ 'భ్రాజిష్ణుః' అనే పదానికి అనుభూతి చెందే అవకాశం తక్కువగా వుందని అర్థం. అందుకనే మొట్టమొదట ఏ గురువాశ్రమంలోనైనా శిష్యుడికి పవిత్రీకరణమనే కార్యక్రమాన్ని ఇస్తారు. ఆ పవిత్రీకరణ మూడు రకాలుగా వుంటుంది. అది మనసుయందు పవిత్రత, వాక్కుయందు పవిత్రత, చేతలయందు పవిత్రత, ఇది కాక పరిసరములయందు పవిత్రత. అన్నిటికన్నా ఎక్కువ ప్రాముఖ్యత భావము నందు పవిత్రతకి ఇస్తారు. భావము నందు పవిత్రత ఏర్పడితే, వాక్కు నందు పవిత్రత సహజంగా వస్తుంది. భావము నందు పవిత్రత ఏర్పడితే, శరీరమును పవిత్రంగా వుంచుకుందామనే భావము సహజంగా వస్తుంది. భావము నందు పవిత్రత వున్నప్పుడు పరిసరములన్నీ పవిత్రంగా వుంచుకుందామనే భావము కూడా సహజముగా వస్తుంది. భావ పవిత్రతని ఆధారంగా పెట్టుకొని మిగతా పవిత్రతలన్నీ సాధించుకోవాలి. నేను భావనలో పవిత్రంగా వున్నాను కదా మిగతా వాటిలో పవిత్రత లేకపోతే ఏం అనుకుంటే ఏం జరుగుతుందంటే పవిత్రంగా లేని మిగతా పరిసరములు, వాక్కు లేక చేతన అవి ఈ పవిత్రమైన భావాన్ని, రాహువు సూర్యుణ్ణి మింగినట్లుగా మింగేస్తుంది. అపవిత్రమైన పరిసరాలు, అపవిత్రమైన చేతలు వుంటే, పవిత్రమైన భావనని నెమ్మదిగా మింగేస్తుంది. అందుచేత ఈ కార్యక్రమము రెండు పక్కల నుంచి సవ్యంగా నడిపించుకుంటుండాలి. పవిత్రత అనేది అన్ని కోశముల లోనూ, భావమయ లోకంలోనూ వుండాలి. వాఙ్మయ లోకంలో

వుండాలి. కార్యక్రమములయందు కనబడాలి. పరిసరములయందు కనబడాలి. వెలుగు ప్రసరించడం మొదలుపెడితే ఎలా మూల మూలలయందు వెళ్ళి చీకటిని పారద్రోలుతుందో అలాగే మనలో కూడా ఈ రకమైన పవిత్రతను ఒక సాధనగా చేసుకున్నట్లయితే, అది ఒక పెద్ద తపస్సుగా పరిగణింపబడుతుంది. పరిణమించి తెల్లని తెరలాగా, వెండితెర లాంటి మనసు మీద పవిత్రమైన భావన పడటం వలన ఇంద్రియములు, శరీరము క్రమశః పవిత్రత చెందుతాయి. తద్వారా పరిసరములు పవిత్రత చెందుతూ వుంటాయి. మనమున్న ఇల్లు గానీ, గది గానీ, మనం తిరిగే కారు గానీ అన్నీ ఆ విధంగా పవిత్రీకరణ చెందుతూ వుంటాయి. మనలో భావన పవిత్రత అనే పదానికి సంబంధించినది. ఇది భగవత్ సంబంధమైన వెలుగు. ఇందుకు సంబంధించినది బాగా స్థిరపడుతూవుంటే అన్నిటిలోకి అది వ్యాపనం చెందుతూ వుంటుంది. చెంది, ప్రతి విషయాన్ని వెలుగుగా మార్చుతుంది. కనుక భావ పవిత్రత daily basis మీద చేసుకోవడానికి ధ్యానమిచ్చారు. దైనందిన జీవితంలో ధ్యానం, భావములను పవిత్రీకరించుకొనడం! తెల్లటి వెలుగుని దర్శించినట్లుగా ధ్యానం చేయాలి. తెల్లటి వెలుగుని దర్శించినట్లుగా భావన చేయాలి. మన 'మనోఫలకం' మీద. ఇది ఒక సారి శుభ్రం చేయబడుతుంది. అది శుభ్రం చేయబడినందువలన దానిమీద అ తరువాత శుభ్రమైన భావములు రావడానికి అవకాశం వుంటుంది. పిచ్చి గీతలు గీసిన పలక మీద ఎంత మంచి శ్లోకాలు వ్రాసినా ప్రయోజనం లేదు కదా! అలా ధ్యానం అనే కార్యక్రమం ద్వారా మనసును పవిత్రీకరింపచేయాలి. అంతర్లోకములకు, బహిర్లోకములకు వాక్కు చాలా పెద్ద సంధానకర్త. వాక్కు నందు పవిత్ర తగ్గినట్లైతే, మనిషిలో అంతకు ముందున్న పవిత్రత కూడా క్షణాల్లో నాశనమైపోతుంది. భావము నందు పవిత్రత లేకపోయినా, దాన్ని వాక్కులోకి దించకుండా జాగ్రత్త పడడం అనేది పెద్దలు చెప్పారు. పవిత్రమైన వాక్యములను ఉచ్చరించటమనేది మన దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. అందుకని మనకు సూక్తములను ఇచ్చారు. సూక్తములు అంటే సు+ఉక్తములు అని. అంటే చక్కగా ఉచ్చరింపబడునవి. చక్కగా

ఉచ్ఛరించటమనేది  అభ్యాసం చేయించాలి. దేనికి? వాక్కుకి. మనలోనుంచి వ్యక్తమవుతున్న వాక్కుకి, శుభ్రమైన విషయములను వ్యక్తం చేయించటమనే ఒక కార్యక్రమాన్ని మనం అభ్యాసం చేయాలి. చేస్తే అటు భావమయమైన లోకాన్ని పవిత్రీకరిస్తుంది. ఇటు మిగతా కోశములను పవిత్రీకరిస్తుంది. పరిసరములనూ పవిత్రీకరిస్తుంది. అంత గొప్పతనం వేదసూక్తములకు వుంది. అందుకనే పురుష సూక్తము, శ్రీ సూక్తము, అగ్ని సూక్తము, విష్ణు సూక్తము, సరస్వతీసూక్తము, దుర్గాసూక్తము ఇటువంటివన్నీ ఇచ్చారు. ఈ సూక్తముల యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, they conduct Alchemy in the body. మట్టిని బంగారం చేయగలిగే మహత్తరమైన శక్తి సూక్తాలలో వుంది. స్తోత్రములలో వుంది. విష్ణు సహస్రనామ స్తోత్రం, లలితా సహస్రనామ స్తోత్రం, మిగతా అష్టోత్తరములు మనలో ఉన్న మాలిన్యాన్ని పారద్రోలి వెలుగును ఆవాహనం చేయడానికి కావలసిన రసాయనిక చర్య అంతా కూడా, ఈ ఉచ్ఛరించడం ద్వారా మనం ఏర్పరచుకుంటాం. అందుకే మహత్తరమైనటువంటి విషయాలు ఋషులు సాధించి ఇచ్చారు. గొప్పతనానికి బీజాక్షరాలు, మంత్రాలు చదవడం కన్నా, చక్కగా రోజూ ఒక అరగంట గనుక సూక్తములను ఉచ్ఛరిస్తున్నట్లయితే సంవత్సరం లోపల మన వాక్కు యొక్క స్థితి మారిపోతుంది. ఎట్లా మారుతుంది అంటే మంచి విషయాలు ఉచ్ఛరింపబడేటువంటి నాలుక వేరే విషయాలను ఉచ్ఛరించడానికి ఇంక నిరాకరిస్తుంది. ఒక మనిషి నాలుక నుండి  దుష్టము, అవినీతికి సంబంధించిన వాక్కులు వస్తున్నాయి అంటే ఆయన ఎంత మంచి సూక్తాలు చదువుతున్నా, అవి ఊరికే డంబాచారము అని తెలుస్తుంది. ఏ నాలుకనైతే పవిత్రమైన కార్యక్రమాలకు వినియోగిస్తుంటామో ఆ నాలుక అపవిత్రమైన వాక్యాలను ఉచ్ఛరించదు. It refuses. ఎట్లా నిరాకరిస్తుందంటే "మందార మకరంద మాధుర్యమున తేలు మధుపంబు వోవునే మదనములకు" ఎప్పుడూ మంచి తేనె అట్లా ఊరుతున్న పువ్వులలో రసాన్ని ఆస్వాదన చేస్తున్న తేనెటీగ అడవులలోకి పోతుందా? "నిర్మల మందాకినీ సలిల వీచికల తూగు రాయంచ" ఎంతో చక్కగా నిర్మలమైన, ఆకాశం ప్రతిబింబిస్తూ వుండే

జలములో, నీటి అడుగున వున్న చిన్న చిన్న గులకరాళ్ళు కనిపిస్తుంటాయో అటువంటి స్వచ్ఛమైన నీటిలో ఎప్పుడూ తిరిగే హంస వచ్చి మన తాటిబాండ reservoir లో తిరగమంటే తిరగదు. దాని వరకు వెళ్ళనక్కరలేదు మనమే చెయ్యం. ఎప్పుడూ చక్కగా పారే ఏటి యందు స్నానం చేసే వాడికి, మన మున్సిపాలిటీ నీటితో స్నానం చేయామంటే చాలా బాధపడతాడు. మనకి అది ఏదో తెలియదు కాబట్టి దీనికి స్థిర పడిపోయాము. రోజూ స్నానం చేసే వాడిని స్నానం చేయవద్దని చెప్పినా గిలగిలలాడి పోతాడు. చలిగా ఉంది ఈరోజు మానేస్తే బాగుంటుందని అనుకునే వాళ్ళ సంగతి అట్లా వుంచండి. చెయ్యకపోతే ఏం? చెమట ఎక్కువ పట్టలేదు కదా! చలికాలం చెమట ఏం పడుతుందీ అని అనుకునే వాళ్ళు కొంతమంది వున్నారు. చెమటని కాదు. లోపల ఒక అగ్నికార్యం జరుగుతూ వుంటుంది దేహంలో. దానినుండి మాలిన్యం ఎప్పటికప్పుడు బయటకు వస్తుంటే వాటిని శరీరం వ్యక్తం చేస్తుంటుంది. వాటిని ఎప్పటికప్పుడు కడుక్కుంటూ ఉండాలి. ఎవరూ చూడలేదు కదా ఇవాళ పళ్ళు తోముకో కపోతే ఏం? అన్నట్టుగా వుండరాదు. ఈ పద్యం చాలా చక్కగా పనిచేస్తుంది. హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు చెబుతాడు.

"మందార మకరంద మాధుర్యమున తేలు మధుపంబు వోవునే మదనములకు, నిర్మల మందాకినీ సలిల వీచికల తూగు రాయంచ తరంగిణులకు, లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల చేరునే కుటజములకు."

మంచి రసాలున్నటువంటి పళ్ళ తోటలో వుంటుందిట కోయిల. అందుకనే కదా మామిడి తోటలోనే ఎక్కువగా కనిపిస్తూ వుంటుంది. పుల్ల పుల్లగా ఉండే పళ్ళు వున్న చోటుకి, వగరు వేప చెట్టు మీదకి రమ్మంటే రాదు. ఒకసారి రుచి మరిగిన తరువాత రాలేదు కదా! అలాగే భగవంతుని యొక్క పాదారవింద చింతన అమృత ఆస్వాదన నందు నిమగ్నమైన మనసు ఇంకొక చోటుకి ఎట్లా పోతుంది? అని ప్రహ్లాదుడు అడుగుతాడు. భగవంతుని యొక్క పాదములనే

అరవిందములు అంటే పాదకమలములు! వాటిని సర్వకాల సర్వావస్థల యందు చింతిస్తూ వుండే మనసు, చింతనామృతముట. మనకేదో ఇది routineగా అయిపోతుందే తప్ప, భగవంతుని పాదకమలముల యందు మన దృష్టి ఉంచి, నామము స్మరిస్తూ వుంటే, చింతన చేస్తుంటే అమృత స్వాదనం చేసినట్లుగా వుంటుందిట. మనకు ఇంకెప్పుడు అయిపోతుందా ఈ విష్ణు సహస్రనామం అని అనిపిస్తుంది కదా! కానీ ఇక్కడ చింతనామృత మత్త చిత్తమది. ఆ భగవంతుని యొక్క పాద కమల చింతన అనే అమృతం పొంది మత్తెక్కి పోయిందట. ఇలా మత్తెక్కిన వాళ్ళకి బయటకి రావడం ఎంత కష్టమో! ఇట్లా ఎందుకు చెబుతున్నానంటే పవిత్రమైనటువంటి సూక్తములను ఉచ్చరించడం ద్వారా we can get a cut off from the impure planes of existence right from thought plane upto the physical plane. ఈ సూక్తముల యొక్క ఉచ్చారణ యందు శ్రద్ధ వహించినట్లయితే మనోమయ లోకాల నుంచి, ఇంద్రియ లోకాలనుంచి, భౌతికమైన లోకాల నుంచి అపవిత్రమైన కార్యక్రమములోనికి వెళ్లకుండా మనల్ని రక్షిస్తూ ఉంటుంది వాక్కు. మూడురోజులు చేసాక మనకి చేసుకోపోతేనేమి అని అనిపిస్తుంటుంది. అలాకాకూడదు. పెద్దలు అన్నిటికన్నా అతి వైజ్ఞానికముగా, శాస్త్రీయముగా ఉన్న వేదములు మనకి ఇచ్చిఉన్నారు. వాటిని చక్కగా ఉచ్చరించడం అనేది ప్రతి ఉదయము లేచిన తరువాత మనసు, పంచేంద్రియములు, శరీరము పరిశుభ్రము చేసుకొని ఒక అరగంట సేపు ఉచ్చారణ చేసుకున్నట్లైతే, మన లోనుంచి 'ఇది ఎట్లా మానేయాలో అనే ప్రబోధాలు ఎన్ని రకాలుగా వస్తాయో మనమే గుర్తించవచ్చు. ఎందుకంటే, అంతకు ముందు మనలో ఉన్నవి ఇది వద్దులే అని అనిపించేటట్లుగా అంతరాయాలు కల్పిస్తుంది. ఎందుకంటే పవిత్రతకు భిన్నంగా ఉన్న భావాలు, మనలో పవిత్రీకరించబడే భావాలను లోపలకి రానీకుండా చేస్తూ ఉంటాయిట. దాన్నే 'పెద్దమ్మ' అంటారు. జ్యేష్టాదేవి. నీ తలమీద పెద్దమ్మ నాట్యం చేస్తున్నదిరా అంటారు. అందుకే మంచివిషయానికి విముఖత ఉందట అంటే టైం బాగలేదన్నమాట. సంస్కారములు లేవని అర్ధము. పవిత్రత

పోయిందని అర్థము. సంస్కరించుకోవాలి అంటే ఒక technic ఉన్నది. 'ఈ రోజు నుంచి నేను మంచిగా ఉంటాను,' అని అనుకున్నంత మాత్రాన మంచివాళ్ళం అయిపోము. ఎందుకంటే  అంతకు ముందు మనలో ఉన్న స్వభావ మనల్ని అంత సులభముగా మారనివ్వదు. కాబట్టి, ఈ సూక్తముల ఉచ్చారణ నిరంతరముగా కొన్ని సంవత్సరములు జరిగినట్లయితే it conducts Chemistry, Alchemy. ఒక రసాయన చర్య దేహమునందు ఏర్పడి, దేహము సంస్కరింపబడి, మాలిన్యములు వ్యక్తము చేయబడి, పవిత్రత ఆహ్వానం చేయబడి తద్వారా మార్గము సులభము చేయబడుతుంది. అలాటి మార్గం ఇచ్చారు ఋషులు. 'ఆ, ఇవన్నీ చేస్తేనేనా' అంటే అలా అనిపించడమే మొదటి జబ్బు! అస్వస్థతకి అది మొదటి చిహ్నం. కొంతమంది రోజు విష్ణుసహస్రనామం చదువుతారు. కొంతమంది రోజుకి రెండు సార్లు చదువుతారు. కొంతమంది వారానికోసారి, కొంతమంది నెలకోసారి, లేక సంవత్సరానికోసారి చదివే వాళ్ళు ఉన్నారు. అస్సలు చదవని వాళ్ళు కూడా ఉంటారు. లలిత సహస్రనామం రోజు చదివే ప్రయత్నం చేయండి. లోపల ఎంతో పవిత్రత ఉంటే తప్పా చదవలేరు. వాక్కు యొక్క పవిత్రత అలాగ వస్తుంది. వాక్కుని ప్రతిరోజు ఒక అరగంటో, గంటో ఉదయాన్నే పూజాది కార్యక్రమాలలో పవిత్రీకరించిన తరువాత ఇంకో విషయము స్వభావము propose చేసినా మనసు ఒప్పుకోదు. అంటే, something taken hold on you. You are prevented you from your previous behaviour. మనకో స్వభావము ఉంది కదా. అది bayaTaki వచ్చినప్పుడల్లా ఇది చాల్లే అని వేసేస్తుంటుంది. అందుకని 'వాక్ నియమము' అది పెట్టుకుందామని తిప్పలు పడుతుంటారు చాలా మంది. 'అనవసరంగా మాట్లాడుతున్నాను. మాట్లాడి ఇబ్బందులు తెచ్చుకుంటున్నాను. నేను మాట్లాడకుండా ఉంటే బావుండేది కదా' అని అనుకుంటూంటారు. అది కొంత సేపే! తరువాత మళ్ళీ మామూలే. దాన్నే భాగవతములో 'గజస్నానము' అన్నారు. ఏనుగు స్నానము చేసి బయటకు వచ్చి ఎదురుగా ఉన్న మట్టి పూసుకుంటూ ఉంటుందిట. మళ్ళీ వెళ్లి స్నానం చేస్తుంది. మళ్ళీ మట్టి పూసుకుంటుంది మళ్ళీ స్నానం

చేస్తూంటుంది. మళ్ళీ మట్టి పూసుకుంటుంది మళ్ళీ స్నానం చేస్తూంటుంది. అట్లాగే మన జీవితములో జరుగుతూ ఉంటాయి. కాస్తసేపు భగవంతుని ధ్యానము, పూజాది కార్యక్రమాలు. నవరాత్రి పూజలు వస్తే ఫెళఫెళ మంటూ చేసేసి ఆ మర్నాడు నుంచి మళ్ళీ మామూలే. ఇట్లా ఉంటుంది. ఇట్లా స్నానం, మురికి గుంట. స్నానం మురికి గుంట, ఇలా ఉంటే స్నానం చేసిన ఫలితము ఏమి ఉంది? అందుకని ఈ నియమము ఎప్పుడైతే చేసారో, (సూక్తములు ఉచ్చరించుట) దాని లోంచి ఒక బలం వస్తుందన్నమాట. అందుకనీ కనీసము రోజు షోడశోపచార పూజ చేయాలి అనేవారు మాస్టరుగారు. అందరూ ధ్యానము చేయలేకపోవచ్చు, కానీ ఎలుగెత్తి చక్కగా ఉచ్చరించటం అనేది నాలుకకు అలవాటు చేయాలి. అలా 5 సం|| లు చేయాలి. ఏదైనా 5సం||లు చేయకపోతే మనకి వశం కాదు. 5 రోజులు చేసే సరికే చాలా తేడా పడుతుంది. ఇట్లా చేసుకుంటూ వెళ్తుంటే, వాక్కు కారణముగా పవిత్రీకరణ చాలా బాగ జరుగుతుంది. Tremendous power ఉన్నది. ఆలోచనకన్నా చాలా power ఉన్న. అందుకని మంచి విషయాలు ఉచ్చరించటానికి మనకి సూక్తములు, స్తోత్రములు, ప్రార్ధనలు, భజనలు ఉన్నాయి కాబట్టి అవి ఎక్కువగా నాలిక ఉచ్చరించేటట్టుగా చేయండి. మిగతావి అప్రయత్నముగా పడిపోతాయి. ఈ ఉన్నవి పోవాలని కాకుండా ఆ ఋషిప్రోక్తమయిన వాక్కు ఉచ్చరించడం వలన వాక్ నియమము ఏర్పడుతుంది. ఎప్పుడైతే వాక్కు నియంత్రించబడుతుందో , వాక్కు అంతర్లోకాలకి బహిర్ లోకాలకి సంధాన కర్త కనక , ఇటు అటు కూడా అది పవిత్రీకరణము మొదలు పెడుతుంది. మొత్తం 'నేను' అనే దైవప్రజ్ఞ నుండి శరీరము వరకున్న రహదారి ఏదైతే ఉందో దాన్ని అంతటిని కూడా వెలుగుమయముగా చేస్తుంది. కాబట్టి ఆ విధంగా మనం 'భ్రాజిష్ణు'ని ఎక్కువ మనలో పెంచుకుంటూ ఉండాలి. దానికి సరైన తాళం చెవి 'చక్కగా వాక్కుని వినియోగించడం'. దానికి ముందు స్తోత్రపఠనాదులని అభ్యాసము చేయాలి. అదీ ప్రాతిపదిక. దానిమీద మిగతావన్నీ ఉంటాయి. ఎప్పుడో ఆర్నెలలకోసారి ఒక అపశబ్దము రావడం వేరు, On a daily basis అపశబ్దాలే రావడం వేరు. ఎప్పుడో ఒకసారి

అసత్యం రావడం వేరు. అసలు మాట్లాడితేనే నోట్లో నుండి అసత్యాలు రావడం వేరు. అంతే కాదు. ఒకరి నుంచి ఒకరికి విషయము చెప్పాలంటే misrepresentation అవుతు ఉంటుంది. అలా ఎందుకవుతుంది? ఎందుకంటే సత్యం పలుకట నాలుకకు అలవాటు కావాలి. పవిత్రీకరింపబడిన జిహ్వ మాత్రమే సత్యం పలుకగలదు. పవిత్రత లేనప్పుడు మన proposal లేకుండానే మన నాలుక అసత్యాన్ని మాట్లాడేస్తుంటుంది. మనం ఒక విషయం ఇంకొకరికి చెప్పే లోపల మన స్వభావము కొంత దానికి తగులుతూ ఉంటుంది. ఎందుకంటే పవిత్రత లేక! అందుకని పవిత్రతను పెంచుకోడానికి ఈ ప్రయత్నము చేసుకుంటూ ఉంటే సత్య వాక్కు అనేది ఒక కళ్యాణ గుణముగా లోపల నుంచి వ్యక్తమవుతుంది. ఎప్పుడైతే అంతర్ బహిర్ లోకాలలో పవిత్రత యొక్క నాందీ ప్రస్తావన జరుగుతుందో, పవిత్రత బాగా విప్పారి అందులో వెలుగు బాగా ప్రసరించి మనయందు స్థాపన చేయడం జరుగుతుంది. వాక్కుకి మనకి విశుద్ధి కేంద్రమును నిర్వచించారు పెద్దలు. విశుద్ధి మూలాధారము, స్వాధిష్టానము, మణిపూరకం అనే మూడుకేంద్రాలని తన అధీనం లో ఉంచుకోగలదు. ఎప్పుడూ? ఎప్పుడూ దానికి ఈ పవిత్రత వచ్చినప్పుడు. అందుకని ఏ గురువైనా ఏ శిష్యునకైనా మొట్టమొదట చేపట్టే కార్యక్రమము తన శిష్యుడి విశుద్ధిని పవిత్రీకరించటం. అది పవిత్రమైన శిష్యుడికి మణిపూరకం, స్వాధిష్టానం, మూలాధారం కేంద్రములు అంటే అగ్ని, జలము, పదార్థము మూడింటికి సంబంధించిన తత్వములన్నీ కూడా రసాయనిక మార్పు చెంది సరైన పద్ధతిలోకి మలచబడతాయి. అప్పుడు యోగ్యత వస్తుంది దేనికీ? అంతకు ముందు ఉన్నటువంటి ఆజ్ఞా చక్రమునందు, హృదయమునందు సహస్రారమునుండే దివ్య తత్త్వము విశుద్ధి ఆధారంగా మనలోకి అవతరించటానికి అవకాశాన్ని ఏర్పరుస్తుంది. విశుద్ధి is the Fulcrum. అది మనకి సింహ ద్వారం అంతర్ లోకాలకి బహిర్లోకాలకి. దాన్ని మనం చక్కగా తయారుచేసుకోవాలి. చక్కగా ఉచ్ఛరించడం, పవిత్రమైన మాటలు మాట్లాడడం, సత్యము మాట్లాడడం, ప్రియముగా మాట్లాడడం. ఇవన్నీ జరగాలంటే , మనము అనుకున్నంత

మాత్రాన జరగవు కాబట్టి దానికి ముందు preparatory work ఈ purification కి జరగాలి. ఈ విధంగా మనకి ఋషులు భావమయ ప్రపంచానికి ధ్యానం, వాఙ్మయ ప్రపంచానికి స్తోత్ర పఠనము చెప్పారు. భావమయ ప్రపంచాన్ని mould చేసుకోటానికి 'సద్గ్రంథ' పఠనము on a daily basis. ఎప్పుడో ఒకసారి కాదు. రోజూ ఒక్క 10 నిమిషములు చదవమన్నారు. 10 నుంచి 15 నిమిషములు చదువు, 10 నుంచి 15 పేజీలు చదువుదామని పెట్టుకోమాకు అన్నారు. 10 నిమిషాలు time లేదు అంటే దొంగ అని అర్థము. 15 పేజీలు చదవటానికి time లేకపోవచ్చు కానీ, 10 నిమిషాలు చదవటానికి time లేదా? సద్గ్రంథమూ, సత్పురుషునివలె చక్కని సాన్నిధ్యాన్ని ఇస్తుంది. రోజు ఒకే ప్రదేశములో కూర్చుని, ఆ ప్రదేశాన్ని పవిత్రీకరించుకొని, ఒక దీపము, అగరుబత్తి పెట్టుకొని ఆ పుస్తకము తెరిచి 10 నిమిషములు చదివి, ఆ రోజు చదివిన విషయములు నీకు అవగాహన అయినది notes లా రాయటం మొదలు పెడితే చాలు. ఇట్లా 10 నిమిషాలు రోజు చదివేటటువంటి వాళ్ళు రామాయణ, భారత, భాగవతాలు అన్నీ కూడా చదివేస్తారు జీవితములో. ఎప్పుడు చదివారంటే ఈ విధంగా చదువుకోవడంవల్ల ఎన్నో గ్రంథములు చదువుకున్నవారున్నారు. రోజుకి 10నిలు చదువుతాను. ఎన్ని పేజీలు చదువుతాను అని లేదు. అది భగవద్గీత, అది రామాయణము, భగవద్గీత ఏదైనా అవ్వచ్చు. లేక సత్పురుషుని యొక్క జీవిత చరిత్ర! అందులో కూడా సందేశాలు ఉంటాయి. ఆ సందేశాలు ఆ రోజుకి మనకి వచ్చినవి భావమయ ప్రపంచములో పరిశుద్ధత కలిగిస్తుంది. ధ్యానము ద్వారా ఎక్కువ పరిశుభ్రత కలిగించటం అనేది బాగా advanced state లో తప్ప వీలు పడే విషయము కాదు . కనుక సద్గ్రంథ పఠనము ద్వారా ఆ విధంగా భావనకి పవిత్రీకరణ ఏర్పడిపోతుంది. లేదంటే సద్విషయముల యొక్క శ్రవణము ద్వారా ఏర్పరచుకోవచ్చు. శ్రవణానికి ఎక్కడికో వెళ్ళాలి. పుస్తకము మనింట్లోనే ఉంటుంది కాబట్టి తెరచుకొని చదువుకోవచ్చు 10 ని|. ఆ విధముగా భావ ప్రపంచాన్ని, ఉచ్చారణ ద్వారా వాఙ్మయ ప్రపంచాన్ని ఎప్పుడైతే పవిత్రీకరించుకున్నామో అప్పుడు

ఇంద్రియములు, శరీరము లొంగుబాటులో ఉండని పరిస్థితి లేదు. అప్రయతంగా అది వినయాన్ని సంపాదించుకుంటుంది. ఎందుకంటే, ఇంద్రియముల సముదాయం మనసుగా పని చేస్తుంది కాబట్టి మనసుకి ఈ రెండు విధమైనటువంటి సాధనాలు జరుగుతూ ఉంటె మనకి అంతకు ముందు ఉండే గుణములు అన్నిటిలో కూడా చాల ఆనందం కలిగే మార్పులు వస్తూ ఉంటాయి. ఇవి మనము నిరంతరము చేయక పోవడం వల్లనే, పుట్టుకతో వచ్చిన గుణాలు పుడకల వరకు అట్లా ఉంటాయి. మార్చుకుందాము అనుకుంటూ జన్మ అంతా వెళ్ళిపోయిన case లు ఉంటాయి. అంటే cronic అన్నమాట. మనలో కణకణాలలో జీర్ణించుకుపోయిన కొన్ని గుణాలు ఉంటాయి అవి పొమ్మన్నా పోవు. అందుకు ఈ కార్యక్రమము మొదలు పెడితే వెలుగు వస్తుంది. వెలుగు లేకపోతే దేవుడు రాడు. ఆ విధంగా "భ్రాజిష్ణు" ని మనము మన యందు స్థాపితము చేసుకొనే ప్రయత్నము చేయాలి. చాల మంచి కార్యక్రమము. ఎందుకంటే భగవంతుడు మన దగ్గరకి సరాసరి వెలుగు ద్వారా వస్తాడు. దాన్నే 'బుద్ధి లోకము' అంటారు. బుద్ధికి పైన ఉండేది, వెలుగుకి పైన ఉండే విద్యుత్ వలె అంతర్యామి అయిన భగవంతుడు. ఆ భగవంతుడిని మనలోకి ఆవాహనము చేసుకోవడానికి రకరకములైన సాధనలు ఉన్నాయి. ఇవాళ చెప్పుకున్నది సద్గ్రంథ పఠనము, సద్గ్రంథ శ్రవణము, ధ్యానము, సూక్తముల యొక్క పఠనము, నిరంతరముగ చేసుకోవడం ద్వారా ఇది జరగడానికి అవకాశము ఉంది.

## 150 భోజనం

భోజనం ఎంతో ఆనందమైన విషయం. 'భో' అనే శబ్దంలోనే వుంది. ఆనందాన్ని అలా వెల్లివిరిసేటట్లు చేస్తుందిట. బాగా ఆకలిగా వున్నప్పుడు ఒక్క ముద్ద నోట్లో పెడితే మొత్తము శరీరము అంతా కూడా తృప్తి అనేది వ్యాపనము చెందుతుందో నాలుక ద్వారా, అట్లా భగవంతుడు భోజనం రూపంలో మనిషికి తృప్తిని, ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాడు. ఒక రొట్టె అలా వేస్తే ఎంత వేగంగా ఒక కుక్క వచ్చి దానిని తినడానికి ప్రయత్నిస్తుంది? ఆకలిగా వున్న జంతువులన్నిటికీ (జంతువులంటే అంటే పుట్టిన వాళ్ళందరికీ, అంటే మనం కూడా) భోజనంగా ఎవరయ్యా వున్నారంటే భగవంతుడే! భగవంతుడే భోజనం. ఆయన్నే తింటూ వుంటాముట. తినేవారు ఎవరట? అంటే భోక్త కూడా ఆయనే. ఆయన తినబడటమే ఈ సృష్టి. అదే పురుషమేధ యజ్ఞం. తనని పెట్టుబడిగా దేవతలు ఈ సృష్టిని తయారుచేయటము జరుగుతుంది. అంటే మూలపదార్థం/ raw material లేకుండా products రావుకదా! అట్లాగే ఈ మొత్తం సృష్టికి ఆయన మూలతత్వం. బ్రహ్మ ఆయననే తననుంచి వ్యక్తంచేసి 24 సృష్టి శక్తులు తయారుచేసాడు. మళ్ళీ వాటిలోకి ఆయనే దిగివస్తూంటాడు. తను దిగివచ్చి, అంటే తనని తాను త్యాగం చేసుకోవడం వలన ఈ మొత్తం ఏర్పడింది. విత్తనం తనని తాను త్యాగం చేసుకుంటే చెట్టు వచ్చినట్లు. చెట్టు నుంచి వివిధములైనవి విత్తనములు. సృష్టిగా ఏర్పడటం కోసం తనని తాను త్యాగం చేసుకోవడం. పూరీ పిండి పూరీలుగా తయారైంది. పిండి లేకపోతే రొట్టె లేదు. అలాగే ఈ మూలతత్వం తనని తాను భోజనంగా తయారు చేసుకుంది. ఒకదానికొకటి భోజనం. పదార్థములని భోజనం చేస్తూంటాయి వృక్షాలు. మనం కూడా చేస్తూ ఉంటాము. వృక్షాలని మానవుడు, జంతువులు భోజనం చేస్తూంటారు. జంతువులను మానవులు భోజనము చేస్తుంటారు. మానవుల్ని కాలం భోజనం చేస్తుంది. మన ఆలోచనలు మనల్ని భోజనం చేస్తుంటాయి. అంటె దేవతలు భోజనం చేసినట్లు. ఒక స్థితిలో ఉండే జీవులని ఇంకో స్థితిలో ఉండే జీవులు

భోజనము చేసేట్లుగా ఒకరికి ఒకరిని భోజనముగా ఏర్పరచినవాడి పేరే 'భోజనము'. అందుకని భోజనము చేసేటప్పుడు ఆయనని తింటున్నామని గుర్తుంచుకొని తింటుండాలి. ఆ reverence చూపించడమే ఆర్ష సాంప్రదాయము. భారతీయుల సాంప్రదాయములో దానికి అంత పవిత్రత ఇచ్చారు. ఇంక ఏ సాంప్రదాయాలలోను ఇంత పవిత్రత చూపించరు. ఇది ప్రపంచములో ఎక్కడా ఉండదు. 'ఈ భోజనము నాకు ఇచ్చావు కనుక నేను నీకు సదా కృతజ్ఞుడనై ఉంటాను' అని అంటారు కొంతమంది ప్రార్థనలలో. భోజనము ఏమిటండి? భోజనముగా 'ఆయనే' వచ్చాడు. భోక్తగా ఆయనే ఉన్నాడు. భోజనము, భోక్త. అంటే one becoming three. తనే భోజనము, తనే భోక్త, తనే భుజించేటటువంటి ప్రక్రియ. తాను భోజనముగా ఎట్లా వచ్చాడయ్యా అంటే తనను తాను త్యాగము చేసుకోడము వలన ఈ మొత్తముగా తయారయ్యాడు. తయారయ్యి ఒకదానిని ఒకటి తినడము కార్యక్రమముగా ఏర్పడింది. ఈ కార్యక్రమములో ఎవరైతే తమని తాము సమర్పణ చేసుకుంటారో వాళ్ళు అందరూ కూడా భగవంతునితో సమానమే! అది మహాత్ముల జీవితములో కనిపిస్తుంది. తాను ఎట్లా జీవుల కొరకు సమర్పణ చెందాడో ఆ విధముగా సృష్టిలోని జీవులకు తన్ను తాను సమర్పణ చేసే ప్రక్రియకి 'భగవంతుడి వలె అయిపోతారు. 'త్యాగేనైతేనా అమృత మానస', త్యాగము ద్వారా అమృతత్త్వస్థితిని పొందడం. ఏమిటి త్యాగము అంటే? Jesus blood cleanses the world అన్నారు చూసారా. ఆయన యొక్క ప్రజ్ఞ పాటవం, బలము, శక్తి, సామర్థ్యము సమస్తము లోకమునందలి జీవులకు త్యాగము చేయుట లేక పణముగా పెట్టడము. అది మహాత్ముల చేస్తూ ఉంటారు. మాస్టరుగారు చేసింది. లోకహితం! లోకహితము కోసము సమస్తము పణంగా పెట్టడము అనేది 'భోజనము' అవడము అంటారు. అందరికి ఉపయోగ పడటంలో తన్ను తాను అదృశ్యమైపోయాడు. శ్రీశ్రీ పాటలోలాగ ఒక సమిధగా అర్పింపబడ్డాడు. అదే హోమం అంటే! హోమంలో సర్వము హుతము అయిపోతుంది. పరుల హితము కొరకు హుతము కాగల స్థితి ఎవరికి ఏర్పడుతుందో వారంతా 'భోజనం'. వంకాయ

కనిపించిందనుకోండి. మనకి సమర్పించడానికి వంగమొక్క వంకాయను తీసుకువస్తుంది. తానే వంకాయగా మారుతుంది. అది మనకి సమర్పణ చెందడానికే కదా! వంగమొక్కకి వంకాయ యొక్క ఉపయోగం ఏముంది? తనకు తాను ఉపయోగపడటమనేది మిగతా జీవులకు దేనికీ లేదు ఒక్క మానవుడికే వుంది. అది ఒక reverse or inverted understanding. జంతువుకి పాలు పడ్డాయనుకోండి. తన పాలు తనకి ఎందుకు? పనికిరావు. దూడకి, ఇంకొకరికి పనికివస్తాయి. మనబోటి వాళ్లందరికీ  పనికివస్తాయి. కాబట్టి తనలో నుంచి ఉద్భవించేవన్నీ కూడా తనకి కాదు పనికిరావడం. ఇతరులకి పనికిరావడం అనేది సృష్టిలో కనిపిస్తుంది. ఇతరులకు సమర్పణ చేసుకోవడము అనే తత్వం మనలో ఏర్పడితే 'భోజనము' అనే భగవంతుని నామమునకు సరయిన అవగాహన ఏర్పడుతుంది. దానినే 'యజ్ఞము' అన్నారు. మనదగ్గర వున్నవి ఇతరులకు ఏ విధంగా ఉపయోగపడతాయి అన్నది గుర్తుండి, తద్వారా ఇతరులకి వాటిని ఉపయోగించడం, ఆ ఉపయోగించడంలో కూడా వివేకానందుడు ఒక మంచి మాట చెప్పాడు. 'ఇతరులకి help చేస్తున్నానన్న భావనతో ఇవ్వకు, ఇతరులని ఆరాధించుకుంటున్నానని భావనతో చెయ్యి'. మనమెవరం సహాయం చేయడానికి ? ఈ మొత్తం సృష్టిలో  ఇంకొకడికి సహాయం చేయడం అంటూ లేదు. ఒక్కడే వున్నాడు, వాడే చెయ్యాలి. నువ్వు చేసేది ఆరాధన తప్ప, సహాయం అనుకోబోక. సహాయం అనుకున్నావంటే  నీలో క్రొత్త రోగాలు పుడతాయి. Work as help వద్దన్నారు. Work as worship. Work is worship అంటాము కదా మనం. ఆరాధనగా జరగాలి చేసే కార్యక్రమము. Work is worship అని వ్రాయడమే తప్ప ఆరాధన ఏ విధంగా చేయాలిఅనేది తెలియదు. నీలో వున్న సమస్త శక్తులు, సామర్థ్యములు ఇతరులకు  సమర్పణ చేస్తున్నపుడు వాళ్లందరికీ మనం సేవ చేస్తున్నాము. అట్లా మనం చేయకపోతే వీళ్ళేమైపోతారు? బలహీనులు, బడుగు వర్గాలు ఇటువంటి భావనలతో నలుగురు పేదవాళ్ళని భోజనం పెట్టడానికి పిలిచి, వీళ్ళకి లేదు కాబట్టి మనం పెడుతున్నాం అనే భావన, నారాయణ సేవ అంటూ

చేసేవారికి 'భోజనం' అనే నామానికి 'భగవంతుడు' అనే అవగాహన అవడానికి అవకాశం లేదు. తను భోజనం చేసినప్పుడు కూడా భగవంతుడు భోజనం చేస్తున్నాడని గుర్తుంచుకోవడం భోక్త! మనం భోక్తల్ని పిలిచి భోజనం పెడుతూంటాం కదా! తింటుండేవాడు ఎదో  బ్రాహ్మణుడనుకున్నా, మన friend అనుకున్నా  లేదా ఇంకొకరనుకున్నా, మన పెద్దలు చెప్పినదేమిటంటే "ఈ తినేవాడిలో నన్ను చూడరా" అని చెప్పేసి . వాడిని పిలిచి భోజనం పెడుతూ భోజనంగానూ, భోజనం తినేవాడిగానూ 'వాడిని' చూడగలవా? చూడగలగడం అనేది అభ్యాసం చేయాలి. ముందు మనం భోజనం అవాలి. తరువాత భోక్త అవాలి. విష్ణుసహస్ర నామాలలో ఈ రెండు పదాలూ అలాగే ఉన్నాయి. ముందు భోజనం అని, తరువాత భోక్త అని. ముందు భోక్త అనలేదు. మనం భోంచేసి ఇంకొకరికి భోజనం పెట్టడం కాదు. నువ్వు 'భోజనం' అయ్యి తరువాత 'భోక్త'  అవాలి. అంటే  ఏమిటి? నిన్ను నువ్వు ఇతరులకు సమర్పణ చేసుకో, ఆ తరువాత నీకు అలాగే ఇంకొకళ్ళు సమర్పణ చేసుకుంటారు. అప్పుడు తినాలి. ముందు తినేవాడు దొంగ అన్నాడు శ్రీకృష్ణుడు. అందరికీ తను తిండిగా తయారై, ఆ తరువాత చివరికి మిగిలింది తినేవాడు 'యజ్ఞఫలం' తిన్నవాడవుతాడు. ముందు తినేసేవాడు దొంగ అవుతాడు. నువ్వు ముందు 'భోజనం' గా ఉండి, 'భోక్త' గా మారాలి. నువ్వు భోజనముగా ఉన్నా, భోక్తగా ఉన్నా భగవంతుడే అన్న భావనతో ఉండాలి. అందుకని భోజనాన్ని భగవంతుడిగా భావన చేయడం ధ్యానం చేసుకోవాలి. "అన్నం న నింద్యాత్ తత్ వ్రతమ్" అన్నారు. అది ఒక వ్రతంగా పెట్టుకోవాలి. తినేదాన్ని గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడకూడదు. తింటున్న దానియందు శ్రద్ధ లేకుండ ఉండుట కూడా అమర్యాదయే. తింటున్నపుడు శ్రద్ధ ఉండాలి. భగవంతుడిని తింటున్నామని.  "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని అంటాం కదా! ఆ భావనతో ముందు నువ్వు 'భోజనం' అవ్వు. అంటే, You be sacrificed. అంటే, సృష్టి కార్యంలో నీవంతు సమర్పణ జరిగిన తరువాత 'భోక్త' అవ్వు.  'ఈ భోజనంగా నేనే వున్నాను. భోక్తగా నేనే వున్నాను' అనే భావనతో  నీలో, తింటున్నపుడు వారిలో భగవంతుణ్ణి చూసుకోవాలి.

ఎందుకంటే భగవంతుడే తింటున్నాడు. ఒకదాన్ని ఒకటి తింటూ హద్దుల్లో పెడుతుంటాడట. అదో తమాషా. ప్రతిదానికి  హద్దులు ఒకటి పెట్టాడు. ఊరికే చెట్లు పెరిగిపోయాయనుకోండి. చాలా కష్టం. అందుకని చెట్లను తినడానికి కొంతమందిని పెట్టాడు. ఆ చెట్ల కొమ్మల దగ్గర్నుంచి ఇల్లు కట్టుకోవడానికి విరగ్గొట్టుకోవడంగా చెట్లు ఎక్కువ పెరగకుండ ఒక arrangement. జంతువులు పెరగకుండ ఒక arrangement. మనుషులు పెరగకుండా ఒక arrangement. ఇలా ఒకదానికొకటి పంచభూతాలకి కూడా హద్దులు. ఒకదానికొకటి హద్దు పెట్టాడు. అమ్మో వాడున్నాడు అని హద్దులో వుండటం కోసం. హద్దు వున్నచోట భయం కూడా ఉంటుంది. అలా హద్దుల్లో వుంచి అన్నింటినీ చక్కగా ఒకదానికొకటి ఆహారంగా చేసాడట. అంటే Recycling అనేది. చెత్త పుట్టిందల్లా ఎక్కడో పారబోస్తున్నాము అనే point లేకుండా ఒకదానికొకటి ఆహారంగా చేసి, చక్కటి recycling process పెట్టాడు. అదే మనకి బ్రహ్మ చూపిస్తాడు.  ఒకదానికొకటి ఆహారంగా ఏర్పడింది. ఒకటినొకటి తింటుంటే ఇంకొకటి దీనిని తింటుంటే ఇలా ఈ cycleని మొత్తం అంతా 'చక్రభ్రమణము' అన్నారు. ఈ చక్రభ్రమణములో నువ్వు కూడా ఇలా ఆహారమైపో. వాడు అట్లా ఆహారమైపోయాడు కాబట్టి ఈ సృష్టి ఏర్పడింది. ఈ సృష్టి ఏర్పడింది కాబట్టి ఈ సృష్టి అనే మహాయజ్ఞం పురుషమేధ యజ్ఞంగా జరిగింది. అలాగే ప్రతి మహాత్ముడు పురుషమేధ యజ్ఞాన్ని demonstrate చేస్తాడు. ఆచరించి చూపిస్తాడు. అలా ఆచరణ యుక్తంగా మనం భోజనం అవాలి. నువ్వు అవుతున్నా కాకున్నా,  అవుదామనుకోకపోయినా నిన్ను భోజనం చేసేస్తారు. అది గుర్తు పెట్టుకోవాలి. నేను ఖర్చయిపోవడానికి ఒప్పుకోనండి అన్నామనుకోండి. అన్నంతమాత్రాన ఆగదు. నిన్ను ఖర్చు చేయడానికి నీ దగ్గర చేరతారు. ఎవరు? చుట్టాలు దొంగలు, సుతులు, ఋణస్తులంటారు కదా! వచ్చి పట్టుకుపోవడానికి, భార్య, పిల్లలు, స్నేహితులు, వాళ్ళు వీళ్ళు ఇలా బోలెడుమంది చేరతారు. ఎట్లాగూ నువ్వు దొరకలేదనుకో మొత్తం కాజేయడానికి ఒకడు వచ్చి ఈవేళ లక్ష పెడితే, వచ్చే సంవత్సరానికి one crore అవుతుందని వస్తాడు. ఈ లక్ష పది సంవత్సరాల నుంచి కష్ట పడి

సంపాదించి వుంటావు.. ఈ లక్ష రూపాయలు వాడు ఒక ఆశ చూపించి అలా మెరుపులాగ మొత్తాన్ని హరించివేస్తాడు. నువ్వు వద్దనుకున్నా సరే భగవంతుడు మిగతావాళ్ళకి ఆహారంగా ఎలాగూ నిన్ను వాడుకుంటాడు. ఆఫీసుకి వెళ్ళి కొంతమందికి పనిచేసి, అలా రోజుకి పదిమందికైనా పనిచేసి, అలా 30 రోజులూ పనిచేస్తేనే కదా వాడు జీతమిస్తున్నాడు. ఎవడు ఏ పనైనా తనకోసం చేస్తున్నాను అనుకుంటున్నా. పదిమందికీ చేస్తేనే గాని వీడి పని అవడం లేదు. అది అందరి విషయంలోనూ సత్యం. ఏ ఒక్కడూ కూడా వాడి పని వాడు చేసుకుంటున్నాను అని అనుకొని చేసుకున్నప్పటికీ కూడ ఇతరులకి చేయకుండా ఎవడి పని అవటం లేదు. ఎవరైనా సరే , ఏ example అయినా చెప్పండి. తనకోసం చేసుకుంటున్నా ననుకున్నవాడు ఎంతోమందికి చేస్తేనేగాని వీడికి ఏమి జరగడంలేదు. అది సృష్టిలో వున్న రహస్యం. నీకోసం చేసుకుంటావా? అయినప్పటికీ ఆహుతి అవుతావు. ఖర్చయిపోతావు. ఇతరుల కోసం చేస్తావా? అపుడూ ఖర్చయిపోతావు. ఎలాగైనా ఆహుతి అయిపోవడం తప్పదు. ఇతరులకోసం అనుకున్నందువలన ఆనందం మిగులుతుంది. నీకోసం అనుకున్నందువలన భయం, ఆందోళన, ఆవేశం, రక్తపోటు ఇటువంటివన్నీ వస్తాయి. కనుక choice నీదే అని చెబుతాడు శ్రీకృష్ణుడు. ఎలాగూ ఈ భోజనం కార్యక్రమం తప్పదు. భోజనం కార్యక్రమం తప్పనపుడు, తెలివిగ తను ఉన్నపుడు ఇతరులకు భోజనము అయిపోతాను అనుకున్నపుడు, ఆనందంగా అవుదాము అనుకొనే వాడు ఒకప్రక్క ఖర్చయిపోతున్నా, రెండోప్రక్క మంచి ఆనందిస్తాడు. లేకపోతే వీడు ఖర్చయిపోవడం తప్పదు. వీడి శక్తిసామర్థ్యములతో వీడు ఇంతా చేసుకొనివస్తే, వీడి ముందే వీడి కొడుకు హుష్ కాకి అని చేసేసిన కేసులు లేవూ? ఉంటాయి. ఊరికే మింగేస్తుంటే కొడుకు రూపంలోనో, స్నేహితుల రూపంలోనో, అన్నదమ్ముల రూపంలోనో ఏదో ఒక రూపంలో చేరి దాన్ని సాపు చేస్తూంటాడు. మనం దాన్ని దాచుకొనే ప్రయత్నాల్లో చేసే ఖర్చులు. బాగా బంగారం పెట్టుకున్నాడనుకోండి. దాని కాపలాకి ఒకడిని పెట్టాలి. కదా! వాడిని మేపాలి కద! ఒక గూర్ఖా, ఒక German Shepard dog

వున్నాయనుకోండి. ఇంట్లో బంగారం వుంది కదా! dog  అంటే చాలా style వుంటుంది. అది ఇంట్లో A.C. లో వుండటం మంచిది. మరి కాపలా కాయాలి కదా!  మరి వాటికి పెట్టాలి కదా! మనం walking కి వెళ్ళకపోయినా, రోజూ దానిని walking కి తీసుకువెళ్ళాలి. ఇలా రకరకాలుగా నిన్ను వాడటానికి ప్రకృతివద్ద రకరకములైన ప్రణాళిక లున్నాయి. దానిని resist చేసి ఉపయోగం లేదు. దానికి నువ్వు శృతి అయినట్లైతే ఆనందం నీవంతు అవుతుంది. ప్రవాహం ఎలాగూ ఆగదు కాబట్టి ఆనందం నీవంతు చేసుకోవడం జరుగుతుంది. అది 'భోజనం' లో వున్న మొత్తం. ఈ చుట్టూ వున్న పూలమొక్కలు అలా భోజనం అయిపోతూంటాయి. చెట్లు, జంతువులు అలా భోజనం అయిపోతున్నాయి. చర్మం దగ్గర్నుంచి సమర్పణ చేసుకుంటున్నాయి. మన చర్మం ఎవడికీ పనికిరాదు. జంతుచర్మం ఎంత ఉపయోగపడుతుంది? అబ్బే మనుష్య చర్మం ఏమీ లాభం లేదండీ అంటాడు చెప్పులు కుట్టేవాడు. గేదె చర్మం పనికి వస్తుంది. మన చర్మం కన్నా గేదె చర్మానికి there is a better status. దాని కొమ్ములుకి, దాని గోళ్ళకి కూడా  value వుంది. ఏనుగు దంతానికి  value వుంది కానీ మన దంతానికి ఏం value వుంది? పీకేసిన తరువాత బుట్టలో పారేయాలి. ఇలా సృష్టిలో ప్రతీదీ కూడా ఇతరులకు ఉపయోగపడటమనేది ఒక రహస్యం. అదే భోజనమవడం అంటే. ఎంత భోజనం అయితే అంత ఆనందం మిగులుతుంది. అంత వ్యాపనం జరుగుతుంది. అంత వెలుగు ఏర్పడుతూ వుంటుంది. భ్రాజిష్ణు మనం ఎంత భోజనం అవుతూ వుంటే, ఎంత చేస్తూ ఉంటె అంత దగ్గరకి వచ్చేస్తాడు. ఎంత భోజనం చేస్తూ వుంటే, అంత దూరంగా వెళ్ళిపోతూంటాడు. ఎందుకని? మనం ఖాళీగా వుంటే అతడు వస్తూ వుంటాడు. మనం ఖాళీగా లేకపోతే ఎట్లా? అన్ని కుర్చీల్లో మనం కూర్చొని ఇంటికొచ్చిన పెద్దాయన్ని కూర్చోండి సర్ అంటే ఎక్కడ కూర్చుంటాడు? కూర్చోడానికి చోటు లేదు. అలా లోపలంతా tight గా మనమే వుంటే ఆయన రావడానికి వీలు లేదు. అందుకని 'భోజనం' అయిపోతే 'భ్రాజిష్ణు'! అంటే కాంతి యొక్క రూపంలో భగవంతుని యొక్క ఆస్తిత్వం మనలో

ఏర్పడుతుంది. అందుకని ఇతరులకు ఉపయోగపడటమనే కార్యక్రమాలు దీనిలోనుంచి మొదలైనాయి.

# 151 భోక్తా

తాను భోజనమై మనం భోక్తలమై, తాను భోక్తయై మనం భోజనమై అట్లా కార్యక్రమములను నడిపిస్తూ వుంటాడు. మనం భోజనం చేసినపుడు మనం భోక్తలం, ఆయన భోజనం. కార్యక్రమాల రూపాల్లో మనని ఆయన భోజనం చేస్తూ వుంటాడు. అందుకని మన శరీరం నెమ్మదిగా హరింపబడుతుంది. మనం భోజనం చేసినపుడు భగవంతుని ఆహారంగా స్వీకరిస్తున్నామని గుర్తుపెట్టుకుని, ఆ ఆహారం స్వీకరించేటప్పుడు 'నేను కూడా నీవలెనే ఇతరులకు ఆహారమయ్యేదను' అనే భావనతో భోజనం చేసేవాడు నిజంగా భగవద్భక్తితో భోజనం చేసినట్లు. తను ఆహారం తీసుకొని ఇతరులకు ఆహార్యము అవ్వాలి. ఆహార్యము మవడమే పురుషమేధము అని చెప్పబడినది. భగవంతుని చేత మనం పోషింపబడి, మనం ఇతరులకు పోషక పదార్థములై జీవించాలి. అంటే మన వలన ఇతరులు పోషింపబడాలి. ఎందుకంటే మనం భగవంతుని చేత పోషింపబడుతున్నాం కాబట్టి. భగవంతుడు తాను పోషిస్తూ, తాను భోజనం చేస్తూ వుంటాడు. మనం ఇతరులకు పోషక పదార్థంగా తయారవటం, అవకపోవటం అనే సంకల్పం ఉన్నప్పటికీ, లేనప్పటికీ కూడా మనని భోజనంగా, భగవంతుడు భోక్తగా భోజనం చేస్తూ వుంటాడు. మన స్వంత కార్యక్రమాలనుకుని ఎంత నిర్వర్తిస్తున్నప్పటికీ కూడా మనలో ఉండే శక్తిసామర్థ్యాలను తాను ఇతరుల రూపంలో హరిస్తూ వుంటాడు. తెలిసి చేసిన వారికి ఆనందం మిగులుతుంది. తెలియక చేసిన వారికి దుఃఖం మిగులుతుంది. ఆ ఒక్కటే తేడా. జీవితంలో ఎలాగూ ఇతరులకు ఉపయోగపడటం అనేది తప్పదు. తనకోసం అనే భావనతో ఉపయోగపడటం ఒక పద్ధతి. ఆనందంగా ఇతరుల కోసం ఉపయోగపడటం అనే భావనతో ఉపయోగపడటం మరియొక పద్ధతి. ఈ రెండవ పద్ధతిలో ఆనందం ఎక్కువ వుంటుంది. మొదటి పద్ధతిలో ఘర్షణ, అంతర్యుద్ధములు ఎక్కువగా వుంటాయి. అందుకని ఎలాగూ ఇతరులకు మనం భోజనంగా సమర్పణ చేయబడాలి కాబట్టి భగవంతుడు కూడా ఆ విధంగానే సమర్పణ

చేసుకుంటూ ఈ సృష్టిని తయారు చేశాడు కాబట్టి ఆ అవగాహన మనలో ఏర్పరచుకొని తద్వారా మనం కూడా ఇతరులకి భోజన పదార్ధంగా తయారవడమనే కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేపట్టినట్లైతే ఆనందం మనవంతు అవుతుంది.

## 152 సహిష్ణుః

సహిష్ణు అంటే, ఎప్పుడూ మనతో కలిసి నడిచే ఒక మిత్రుని లాంటి భగవంతుడు. మనం ఎచటికి వెళ్ళినా భగవంతుడు మనతో పాటు నడిచి వస్తున్నట్లైతే మనకి చక్కగా ఆనందదాయకంగా, అనుభూతి పరంగా, పరిపూర్ణంగా వుంటుంది జీవితము. విష్ణుసహస్రనామం అందుకు చదువుకోవాలి. విష్ణుసహస్రనాము చదువుకుంటున్నప్పుడు ఆపాదమస్తకము మన దేహమునందు భగవంతుని దేహభాగాలని ఆపాదించుకోవాలి. దానిని 'న్యాసవిద్య' అంటారు. భగవంతుని యొక్క రూపమును మన రూపము నందు, మన కన్నుల నుండి ఆయన చూస్తున్నట్లు, చెవుల నుంచి ఆయన వింటున్నట్లు, మన లోపల ఆయన వున్నట్లు, ఆ కిరీటం మన నెత్తిన వున్నట్లు, ఒక చేతిలో గద, ఇంకొక చేతిలో కమలము, అదృశ్యంగా పైనున్న రెండు చేతులలో కుడి చేతియందు సుదర్శనము, ఎడమ చేతియందు శంఖము ధరించినట్లు, మనకి గొడుగు వలె ఆదిశేషువు మన వెంట నడిచి వస్తున్నట్లు, భావన చేసుకొని దైనందిన కార్యక్రమాల్లో నడిచి వెళుతూ వుంటే మన నుంచి భగవంతుడు ఎప్పుడూ వ్యక్తమవుతూ, మన వ్యక్తిగత స్వభావం వ్యక్తం కాకుండా జీవించే ఒక పద్ధతి ఉన్నది. అదీ మహాత్ములు నడిచే పద్ధతి. మహాత్ములు నడుస్తూ వుంటే వారిననుసరించి భగవంతుడు నడిచి వస్తూ వుంటాడు. వారి రూపములో భగవంతుడు నడుస్తూ ఉంటాడు. వారు కేవలం నిమిత్తమాత్రులుగా వుంటారు. తాను నిమిత్తమాత్రమై భగవంతుడు తన నుంచి వ్యక్తమయ్యే వాళ్ళందరూ కూడా మహాత్ములే. శ్రీకృష్ణుడు, రెండు చేతులతోనూ బాణాలు వేయ్యగలిగిన అర్జునునితో అదే చెప్పాడు. నువ్వు రెండు చేతులతో పని చేయగలవు కానీ అవి అలా ఉంచి నన్ను పనిచేయనీ అంటాడు. 'నిమిత్త మాత్రం సవ్యసాచి' అని పిలుస్తాడు. 'సవ్యసాచి' అని అక్కడ అనడం లో ఉద్దేశ్యమేమిటంటే అందరూ ఒక చేత్తో బాణాలు వేయగలరు, నువ్వు రెండు చేతులతో వేయగలవు. అయినప్పటికీ నిమిత్తంగా ఉంటేనే పని జరుగుతుందని. అంటే మన నుంచి వేల్పు వ్యక్తం కావాలంటే

వేల్పుని మన యందు ఆవాహనం చేసుకోవాలి. ఆపాదించుకోవాలి. ఈ ఆపాదించుకోవడమే మనకి 'న్యాసవిద్య' గా ఇచ్చారు. మన చెవుల యందు భగవంతుని యొక్క పలుకు వినబడాలి. మన నాలుక నుంచి భగవంతుని యొక్క పలుకు వెలువడాలి. మన చూపులనుండి భగవంతుని యొక్క చూపు వెలువడాలి. మనం చూస్తుంటే చూసేది భగవంతుడవాలి. మనం మాట్లాడుతుంటే మాట్లాడేది భగవంతుడవాలి. ఇలా ఒక పద్ధతిగా ఈ దేహము మీద భగవంతుని ఆవాహన చేసుకోవాలి. చేసుకుంటే మనకి అదృశ్యంగా మన వెనుక, మన చుట్టుప్రక్కల విష్ణు స్వరూపం ఒకటి ఏర్పడి, మనం అక్కరలేని చోటుకు వెళ్ళకుండా, అపాయకరమైన పరిస్థితుల్లో కూడ మనకి అపాయం జరగకుండా ఇలా రక్షణ చేసే ఒక కవచము ఏర్పడుతుంది. ఈ కవచం ఏర్పడడానికి విష్ణు సహస్రనామం చదువుకోటం. నారాయణ కవచం చదువుకోటం. అది కవచము, నారాయణ కవచం గాని, విష్ణు సహస్రనామము గాని పఠనం చేసిన తర్వాత దేహము కదల్చి బయటకి తెచ్చే లోపు మనం మర్చిపో కూడదు. ఇది మన దేహమును ఆవరించి విష్ణు రూపం వున్నదని గుర్తుపెట్టుకుని జీవించేవాడు అహర్నిశలు విష్ణువునందు జీవిస్తున్నట్లుగా ఉంటుంది. ఈ విధంగా విష్ణువునందు జీవిస్తుంటే ఎక్కడికి వెళ్ళినా విష్ణువు మనవెంటే వస్తూ ఉంటె, ఆయన యందు మనమెంత ఎరుక కలిగి ఉంటే మన యందు ఆయన మన మాటల నుంచి, మన చేతల నుంచి అంత వ్యక్తమవుతూ వుంటాడు. కుడి ప్రక్కన సుదర్శనముండి, చక్కటి దర్శనం చేయిస్తూ వుంటుంది అన్నిటినీ. 'సుదర్శనము' అంటే మంచి దర్శనము అనే భావన కూడా వుంది. కుడి ప్రక్కన ఉండి చక్కని దర్శనం చేయిస్తూ వుంటాడు సుదర్శనుడు. అంటే కుడి కన్నుల నుండి చక్కని దర్శనమౌతుంది. అలాగే ఎడమ ప్రక్కన శంఖము వుండి భగవంతుని వాక్యములు వినే ఒక అమరిక మన ఎడమచెవికి కలుగుతుంది. అన్ని అవస్థలయందు మన తోడుగా భగవంతుడు నడిచి వస్తున్నాడు అన్న భావన మన యందు స్థిరమైనపుడు ఈ విధమైన వైచిత్ర్యములు మన యందు కనిపిస్తూ వుంటాయి. కనిపించి ఒక దివ్యమైన శరీరము మన చుట్టూ ఆవరింపబడి, అది నడుస్తూ ఉంటుంది

మనం నడుస్తూ ఉంటే! అది తిరుగుతుంటుంది మనని ఆధారం చేసుకుని! మన నుంచి వ్యక్తమవుతూ వుంటుంది. అది మాస్టారి జీవితంలో నేను చూసిన ఒక సత్యం. ఆయన ఎక్కడికి వెళ్ళినా 'ఈ రోజున మాస్టారు ఫలానా వారి ఇంటికి వెళ్లారు. ఫలానా వారికి ఫలానా మందు ఇచ్చారు. ఈరోజు మాస్టారుగారు ఫలానా వారి ఇంట్లో అందరూ బాగుండాలని ప్రార్థన చేశారు' అని డైరీలో వ్రాసుకొనేవారు. మాస్టారు ఎట్లా వెళ్ళారంటే ఈయన రూపంలోనే, ఈయన్ని ఆవరించి, ఈయన్ని వాహికగా గొని, అందరి ఇళ్ళను సందర్శించి వారికి దర్శన, స్పర్శన, సాన్నిధ్యాదులు ప్రసాదిస్తూ వుండేవారు. అట్లా మాస్టారు తను నమ్మిన దైవానికి ఒక వాహికగా నిలబడడం వలన తన నుంచి అద్భుతమైన విషయములు వ్యక్తమవడం జరిగింది. అలాగే మన నుంచి కూడా ఎప్పుడు వ్యక్తమవుతుందంటే ఈ విష్ణుసహస్రనామము గాని, నారాయణ కవచము గానీ మరి ఏ దేవతా ప్రార్థన గానీ చేస్తున్నప్పుడు ఆ దేవతని మన యందు పూర్తిగా ఆపాదించుకోవాలి. ఆపాదించుకొని మనం నడుస్తుంటే, ఆ దేవత నడిచి వస్తున్నట్లుగా చూడాలి. దేవత మనతో నడిచి వస్తుంది కాబట్టి అడ్డమైన చోట్లకి వెళ్లడం మానివేస్తాము. అడ్డమైన మాటలు మాట్లాడటం మానివేస్తాము. అడ్డమైన మాటలూ వినడం మానేస్తాము. అడ్డమైన చేతలు చేయడం మానివేస్తాము. ఎందుకంటే ఈ ఎరుకలో ఉన్న వాళ్ళు ఆ పనులు చేయలేరు.

"మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు, నిర్మల మందాకినీ సలిల వీచికల తూగు రాయంచ చనునే తరంగిణులకు, లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల చేరునే కుటజములకు." అలాగే

"అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత

మత్త చిత్త మేరీతి ఇతరంబు చేరనేర్చు"

అంబుజోదరుని పాదములనే అరవిందములలో ఉన్న ఆ రసమును ఆస్వాదించి మత్తెక్కిన తుమ్మెద ఇంకొక పువ్వు మీద వ్రాలుతుందా? వాలదు. అలా ఈ భావన మన యందు స్థిరపడినపుడు మన నుంచి వేరే రకమైన ప్రవర్తనలు కనిపించవు. కనిపిస్తున్నాయంటే ఆయన్ని వదిలేసి పూజగదిలోనో, ఎక్కడో ఒకచోట వదిలేసి వచ్చినట్లు. ఎందుకంటే ఉంటే ఇబ్బంది కాబట్టి. వెంట పెట్టుకు తిరిగితే పది కాలాల పాటు, అంటే కనీసము 10 సం లు, అలా వెంట పెట్టుకు తిరగండి. మీరు నమ్ముకున్న దైవమునో, గురువునో. మీరు నడుస్తుంటే ఆయన మీతో నడుస్తున్నట్లు, అది 'సహిష్ణుః' అంటే. మనం ఒక్కళ్ళమే నడుస్తున్నాం అనుకోకూడదు. అందరూ ఎన్నిసార్లు చెప్పినా అడుగుతుంటారు ఒక్కరే వెళ్తున్నారా అని. ఒక్కరే వెళ్ళడం ఎప్పుడూ వుండదు. ఎప్పుడూ దేవుడు ఉంటాడు ప్రక్కన. ఒక్కడే వెళుతున్నాడు అనుకున్న వాడు అజ్ఞానంలో వున్నట్లు. కలిసి వెళుతున్నామనుకున్నవాడు సరియైన సాధనలో వున్నట్లు. ఎప్పుడూ కలిసి వెళ్ళడమే వుంటుంది. భావన చేత నడిచి రావడానికి భగవంతుడు సిద్ధంగా వున్నాడు. భావన చేత మనమలా నడిచి, మనతోపాటు సహవాసియై జీవించి మనకి ఇష్టత చేకూరుస్తూ ఆనందం కలిగించే పద్ధతులలో నడిపించే భగవంతుణ్ణి 'సహిష్ణు'డంటారు. ఈ సంవత్సరములో ఎన్ని సార్లు మనం ప్రవర్తిస్తున్నప్పుడు ఆయనని వదలి ప్రవర్తించామో గుర్తు పెట్టుకోండి. దాని వలన బద్దలు తీసిన కుక్కతోక వలె ఉంటుంది మన ప్రవర్తన. తోక బద్దలు వేసి కడితే వంకర లేకుండా వుంటుంది. బద్ద తీస్తే మామూలే! కనుక బద్ద అలా కొన్ని జన్మల తరబడి కట్టేస్తే ఆ తోక వంకర లేకుండా తయారైపోతుంది. దానికి వంకరవడానికి కావలసిన సామర్థ్యం కోల్పోతుంది. అటువంటి స్థితి మనకి కావాలనుకుంటే మనం కూడా ఈ బద్ద వేసి కట్టుకోవాలి. ఏదీ? మనం నమ్ముకున్న దైవం రూపం మనతో నడిచి వస్తున్నది. మనం మాట్లాడే మాటలు వింటున్నది. మనం వినే మాటలు తాను కూడా వింటున్నది. మనం చేసే చేష్టలు చూస్తున్నది. మన ఆలోచనను గమనిస్తూ వున్నది అని గుర్తుంటే మనం చేసే వాటిలో 2/3 వంతులు చేయడం వుండదు. ఆ 1/3 కూడా

మార్గంలో నడుస్తున్నాం కాబట్టి  బాగుంటుందని అనుకుందాము. మిగతా 2/3 వంతులు కూడా బాగుండేటట్లుగా తయారవుతుంది. ఎప్పుడు? ఈయన ప్రక్కన వుంటే. ఎప్పుడూ మాస్టారురు  ప్రక్కనున్నారనుకోండి, తప్పకుండా బుద్ధిగా వుంటాము. ఎంత మనకు ఇష్టం లేని వాడు ఎదురుపడినా, ప్రక్కన మాస్టారుగారు  ఉన్నారు కాబట్టి తోక విప్పము. అందుకని ఎప్పుడూ మాస్టారుగారు  మన ప్రక్కన వున్నారు అనుకోవడం, ఎప్పుడూ విష్ణుమూర్తి మన ప్రక్కన ఉన్నాడనుకోవడం, ఎప్పుడూ శ్రీకృష్ణుడు మన ప్రక్కన వున్నాడనుకోవడం, మనం నమ్మిన గురువు ఎప్పుడూ మన ప్రక్కన వుంటాడు, మనం చేస్తున్న వెధవ పనులు చూస్తుంటాడు అని గుర్తుంటే వెధవ పనులు చేయడం తగ్గుతుంది.  అందుకని ఈ నామం ఒక సాధనగా తీసుకుంటే ఎంత చక్కనైన మిత్రత్వం భగవంతునితో ఏర్పడుతుందో మనం వాక్ రూపంలో చెప్పకోలేము. అంతటి  ఏర్పడుతుంది దైవంతో. ఇంక అట్లాగే నడుస్తుంటాడు. ఇంకొక పద్ధతిలో నడవడు. అప్పుడు ఆయన పనులు చేస్తుంటే ఏమవుతుంది? అవన్నీ  భగవంతునికి చేసిన అర్చనలు లాగా వుంటాయి. "కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ". నోరు వాడాడుట అంటే దైవదత్తంగా వాడాడు తప్ప, దైవం పలకడమే తప్ప తను వేరుగా పలకడం వుండదు. అంటే  అపశబ్దములు రావు. అదే కదా అంటాడు పోతనామాత్యుడు "కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ". అని "సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు". మనలో  మన నుంచి ఆయన చూస్తూ వుంటాడు. ఆయనలో నుంచి మనం చూస్తూ వుంటాము. మనం ఆయన లోకి చూస్తుంటే, ఆయన మన వైపు చూస్తుంటాడు. ఇట్లా పరిపూర్ణంగా ఈ విధమైన ఒక గూడు కట్టుకొని, ఆ గూడులో కనుక చిరకాలం మనం జీవిస్తున్నట్లైతే భ్రమర కీటక న్యాయంగా ఈ కీటకం ఆ భ్రమరం వలే మారి, తాను కూడా భ్రమరం వలే ప్రవర్తించడానికి అవకాశం ఏర్పడుతుంది. అదీ భక్తిమార్గమంటే! నిజమైన భక్తి అది. మనయందు ఎప్పుడూ మాస్టారు ఉన్నారన్న భావన చేసుకోవాలి. నిజంగా మాస్టాబు గారి  మార్గాన్ని అనుసరిస్తే. మాస్టరుగారు మన యందు

ఉన్నారంటే మనము ఎట్లా మాట్లాడతాం? ఎట్లా ప్రవర్తిస్తాం ఇతరులతో? రాగద్వేషాలు చూపిస్తామా? మన likes and dislikes impose చేస్తామా? ఇటువంటివన్నీ మనకే  తెలుసు చేయలేము అని. కాబట్టి ఎప్పుడూ ఆయన్ని మనలో వుంచుకున్నట్లైతే మనం పని చేయడం మానేసి ఆయన పని చేసే పద్ధతిలో మనం పనిచేయడం ఏర్పడుతుంది. తద్వారా అప్రయత్నంగా మనకున్న వంకరలు తీయబడతాయి. సాఫ్ చేయబడతాయి. చక్కగా ఉపయోగపడతాము. ఆ విధంగా మనం వినియోగం చేసుకున్నట్లైతే సాధనలో 'సహిష్ణుః' అనేటటువంటి పదం మనకి కొంత వరకు ఉపయోగ పడ్డట్టు.

## 153 జగదాదిజః

( ఈ నమనికి వివరన సెకరించె ప్రయత్నం జరుగుతొంది)

## 154,155,156- అనఘః, విజయః, జేతా

మనకున్నది త్యాగం చేయటం వేరు, మనని మనం త్యాగం చేసుకోవటం వేరు. తనని తాను త్యాగం చేసుకున్నవాడు శాశ్వతంగా నిలబడిపోతాడు సృష్టిలో. అంటే సృష్టి యొక్క కథలో శాశ్వత కథగా వుండిపోతాడు. అంటే ఎన్నిసార్లు సృష్టి వచ్చినా ఆ కథ మరల వస్తుంది. అట్లా నిలబడిపోయిన వారిని 'యశః కాములు' అంటారు. అంటే వాళ్ళు ఈ విధమైన యశమును కోరినవారు. శాశ్వత కథలో భాగమై పోయాడు శిబి చక్రవ అలాగ. ఏ విధంగా అంటే, ఒక డేగ, ఒక పావురము, పావురాన్ని డేగ తరుముకుంటూ వస్తుంది. భారతము లో ఈ కథ తప్పక చదువుకోవాలి. ఇది మనకి మంచి స్ఫూర్తిని ఇస్తుంది. పావురము వచ్చి శిబి చక్రవర్తిని శరణు వేడుకుంటుంది.. శరణిస్తాడు. శరణిచ్చిన తరువాత డేగ వస్తుంది. డేగ వచ్చేసరికి శరణిచ్చాడు కాబట్టి మరి శిబి చక్రవర్తితో పోట్లాడగలిగే పరిస్థితి లేదు డేగకి. ఇది న్యాయమా? అని అడుగుతుంది డేగ శిబి చక్రవర్తిని. ‘పావురము నాకు ఆహారము కదా! నువ్వు బలవంతుడవు నా కన్నా. అందువలన నా ఆహారాన్ని నువ్వు రక్షణ చేసి నన్ను ఆకలిగా ఉంచుతున్నావు. నేను ఆకలికి పావురాన్ని తింటున్నాను తప్ప వేరే ఉద్దేశ్యం లేదు కదా! నా ఆహారాన్ని నాకు దక్కకుండా చేసినందువలన నువ్వు సృష్టి ధర్మాన్ని పాలిస్తున్నావాడివి అవుతావా’ అని అడుగుతుంది. అప్పుడు శిబి చక్రవర్తి ‘నీకు ఈ పావురాన్ని తప్ప వేరే ఆహారాన్ని ఇస్తాను’ అంటే, ‘నాకు ఆ పావురమే కావాలి’, అంటుంది. అంటే, పావురంలో ఏ మాత్రం మాంసం వుంటుంది? ఆ మాత్రం మాంసం నీకిస్తానంటాడు. ‘అన్నిరకాల మాంసాలు నేను తినను’ అని డేగ అంటుంది. అప్పుడు శిబి చక్రవర్తి ‘అంత మాంసం నా ఒంట్లో నుంచి తీసి నేనిస్తాను’ అంటాడు. మనం ఇవ్వగలమా ? ‘నీ మాంసమంటే, నువ్వు చక్రవర్తివి, నీ మాంసం అతి పవిత్రమైనది కనుక ఒప్పుకుంటున్నాను, మాంసం తీసి ఇవ్వు తింటాను’ అంటుంది. త్రాసులో ఒకవైపు పావురాన్ని పెట్టి, రెండవ వైపు తన శరీరంలో నుండి ఒక కండ తీసి

పెడతాడు శిబి చక్రవర్తి. పావురం ఇంకా బరువుగా వుంటుంది. చేతి కండలు తీసి పెడతాడు. తొడల్లో కండలు పెడతాడు. అన్నీ అయిపోతాయి. కానీ పావురమే బరువుగా వుంటుంది. ఏదో మోసం చేస్తున్నాడనుకొని శిబి చక్రవర్తి పారిపోలేదు. తనే వెళ్ళి త్రాసులో కూర్చుంటాడు. 'నన్ను తినేసేయి. ఇంతకన్నా ఇచ్చేది లేదు కాబట్టి నన్ను పరిపూర్ణంగా తీసుకో ఆహారంగా' అంటాడు. కాబట్టే ఆయన కథ ఈ రోజు వరకు గుర్తు పెట్టుకున్నారు. అంతేకానీ ఎంతో మంది రాజులు ఎన్నో రాజ్యాల్ని గెలిచారు, ఓడిపోయారు. ఎవరికి కావాలి ఈ కథలు? మరచిపోతారు. ఆ విధంగా ఒక పావురం కోసం తను త్యాగం చేయడం వలన శిబి చక్రవర్తి కథ మన్వంతరాలు దాటినా అలా వుండిపోతుంది. సామ్రాజ్యాల్ని మానవజాతిని నిలబెట్టడం కోసం త్యాగం చేయడం కాదు. ఒక పావురం కోసం త్యాగం చేయడం. మనబోటి వారికి meaningless గా, silly గా కనిపిస్తుంది. ఒక పిట్ట కోసం ఇంత చేయాలా అని. అది విశిష్టమైన యజము. దానివలన విశిష్టమైనటువంటి జయము. ఎటువంటి జయము? మన్వంతరాలు మార వచ్చుగానీ ఈ కథ మాత్రం వుంటుంది. సృష్టి లయమైపోవచ్చు. సృష్టి మరల రావచ్చు. మరల ఈ కథ వుంటుంది. ఇది శాశ్వత కథ. అంటే శాశ్వతంగా మిగిలిపోయే పద్ధతులలో చేసే కార్యక్రమముల వలన విజయం కలుగుతుంది. ఊరిలో ఒక పెద్దాయన బాగా డబ్బు ఉన్న వాడు వెళ్ళిపోయాడనుకోండి మరునాడు నుంచి ఆయన్ని మర్చిపోతారు. ఒక మంచి మనిషి వెళ్ళిపోయాడనుకోండి, ఆయన పేరున ఆరాధనలు మొదలవుతాయి. ఆయన ఉన్నప్పుడంత వుండదు. లౌకికంగా జయం పొందినవాడికి, పారలౌకికంగా జయం పొందినవాడికి తేడా చూడండి. లౌకిక జయం పొందినవాడు వాడున్నప్పుడే వాడికి ఆరాధనలు. ఎందుకంటే మిగతా వాళ్ళకి భయం. వాణ్ణి ఆరాధించక పోతే వాడి వలన మనకి ఇబ్బంది కలుగుతుందని వెళుతుంటారు. జమీందారుగారింట్లో కుక్క చచ్చిపోతే ఊరంతా జమిందారుగారిని పరామర్శించడానికి వెళ్తారు. ఎందుకని? కుక్క చచ్చిపోయినప్పుడు పరామర్శించడానికి ఎవరెవరు వెళ్ళలేదో వాళ్ళందరూ చచ్చారే వీడి దగ్గర.

జమీందారుగారు చచ్చిపోతే ఊళ్ళో కుక్క కూడా రాలేదుట. అలా వుంటుంది. జీవితములయందు ఆసక్తి ఉన్నటువంటి వారికి వాళ్ళున్నప్పుడే వాళ్ళ శిలా విగ్రహాలు పెట్టుకోడంలాటివి చేస్తుంటారు. ఎందుకంటె వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత ఎవరూ పట్టించుకోరు. ఇలా వుంటుంది. కానీ మహాత్ముల విషయం మనం తీసుకున్నట్లైతే, వారున్నప్పుడు వారు సేవ యందు ఆసక్తి కలిగి వుంటారు తప్ప, మన్ననల యందు ఎక్కువ ఆసక్తి కలిగి వుండరు. మనకెవరు దండం పెట్టారు? ఎవరు పెట్టలేదు? అని చూసే వాడు లౌకికుడు. మనం ఎవరికి సేవ చేసుకుంటున్నాం? ఎవరికీ చేయలేదు? అని చూసుకొనేవాడు మహాత్ముడు. ఇతరులకి అట్లా సేవ చేసుకుంటూ మన్ననలకి లొంగకుండా తన కార్యక్రమములను తను నిర్వహించుకుంటూ దాటి వెళ్ళి పోతాడు. వెళ్ళిపోయిన తర్వాత ఆరాధన పెరుగుతుంది. సహజంగా లోపల ఆయన నుంచి పొందిన స్ఫూర్తి వలన ఆరాధన పెరుగుతుంది. మహాత్ముల యొక్క ఆరాధన అట్లా వుంటుంది. ఎక్కడో షిరిడిలో గట్టిగా ఒక రెండువేల మంది కూడా వుండి వుండరు. 80 ల్లో మనం వెళ్ళినప్పుడే షిరిడీలో ఏమీ లేదు. ఈరోజు చూస్తే ఎంత జనమో! అంతే ఇంక అంతు లేదు. అలా పెరుగుతూనే వుంటుంది. తరగడం వుండదు. ఎందుకు తరగడం వుండదు? చేసిన యజము అటువంటిది. ఏం చేశారు? ఎక్కడో మారుమూలగ్రామం లో మొక్కలు నాటడం, పిల్లలతో గోళీకాయలాడుకోవడం మాత్రమే చేస్తే, ఓ పదిమందికో, ఇరవైమందికో సేవ చేస్తే ఇంతెందుకు అవ్వాలి? ఇప్పుడు షిరిడి సాయి విగ్రహం లేని గ్రామమే లేదు. ఇప్పుడు షిరిడీకి, పది సంవత్సరాల క్రిందటి షిరిడీకి అసలు పోల్చుకోలేము. ఆయన లేరు కదా! ఎందుకు వెళ్ళాలి? అదీ మహాత్ముల జీవితం అలా వుంటుంది. క్రైస్తు వెళ్ళిపోయిన మూడు వందల సంవత్సరాల తర్వాత, క్రైస్తు అనే మహానుభావుడు జోర్డాన్ నదీతీరాల్లో నలుగురికీ జ్ఞానబోధ చేశాడని 300 సం ల తర్వాత తెలిసిందట. ఈ రోజున భూమి మీద 80 శాతం మానవులకి క్రైస్తు యొక్క జీవిత కథ తెలుసును. అందుకని మనం ఉండగానే ఇదంతా కమ్మేసుకొని, ప్రపంచానికంతా మనం మహాత్ములమని తెలియాలని ప్రయత్నం వుండదు. జరగవచ్చు. ఒక్కోసారి

కొంతమందికి వాళ్ళుండగానే అంత శోభ వస్తుంది. శోభ ముఖ్యము కాదు. యజము ముఖ్యము. అంటే ఎంత త్యాగం జరిగింది? జరిగితే అట్లా సృష్టిలో ఎప్పుడూ ప్రకృతే స్వచ్ఛము, పరిశుద్ధము అయిన జీవితాన్ని దాచుకొని అందిస్తూ వుంటుంది. అటువంటివి కానివి ఎంత మనం ప్రయత్నించి వ్రాసుకున్నా అవన్నీ కాలగర్భంలోకి వెళ్ళిపోతాయి. రామాయణం, భారతం, భాగవతాది గ్రంథములు ఇన్ని వేల సంవత్సరాల నుంచి మిగిలి వున్నాయి. క్రిందటి శతాబ్దంలో వ్రాసిన నవలలు ఈ శతాబ్దంలో ఎవరికీ పట్టవు. నవలకున్న జీవిత పరిధి, గ్రంథమునకున్న జీవిత పరిధి చూసుకోండి. ఒక వ్యక్తి యొక్క యశస్సు పారలౌకికంగా, మహాత్ముడైన వాని యశస్సు, వాళ్ళ యొక్క జీవన పరిధి లెక్క వేసుకోండి. మహాత్ముల యొక్క కార్యములన్నీ కూడా విజయములు. శ్రీకృష్ణదేవరాయల ది అటువంటి విజయం. ఎందుకంటే వీళ్ళు చేసిన దాంట్లో చాలా త్యాగముంది. సృష్టికి అనుసంధానం చెందిన త్యాగం కలిగివుంటుంది, కాబట్టి వాళ్ళకి అంతా జయమే. ఎక్కడ? ఇక్కడ కాకపోవచ్చు. అదే విధముగా మాస్టర్ C.V.V, మాస్టర్ M.N, మాస్టర్ E.K. అలా ఎంతో మంది మహాత్ములు ఉన్నపుడెపుడూ గుర్తులోకి రారు. ఎందుకంటే వాళ్ళు గుర్తింపు కోసం చేయరు. వాళ్ళు వెళ్ళిన తరువాత తెలుస్తుంది. అట్లా ఎంతోమంది మహాత్ములు దేహంలో ఉంటున్నప్పుడు తెలియకుండా వాళ్ళ కార్యక్రమాన్ని చక్కగా నిర్వర్తించుకుంటూ వెళ్ళిపోతారు. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా, వేసినటువంటి విత్తనాలు మహావృక్షాలై అందరికీ నీడనిచ్చి, అందరికీ పళ్ళనిచ్చి, అందరికీ ఆశ్రయాన్నిచ్చి ఇట్లా తయారవుతారు వీళ్ళు. వీళ్లు జేతలు. 'అనఘో విజయో జేతా' జయించినటువంటివారు వాళ్ళు. మిగతావాళ్ళు కాదు. ఎందుకంటే వాళ్ళతోనే వాళ్ళ యొక్క కార్యక్రమాలకి సమాప్తి. The End అని ఒక ముద్ర కొట్టేస్తారు . అలా వుంటుంది. అంటే భగవంతుడు మానవరూపంలో నడిచి వెళుతుంటే, హరి కళగా నడిచి వెళ్ళినా సరే ఈ విధమైన అనఘ స్థితి, సహిష్ణు స్థితి కనిపిస్తుంది. విజయ స్థితి కనిపిస్తుంది. జయించడం కనిపిస్తుంది. క్రైస్తుని అడుగుతారట. 'నువ్వు రాజాధిరాజువట కదా!' అని. ఎందుకంటే అప్పటికి

రాజాధిరాజు రోమన్ చక్రవర్తి సీజర్. ఆయన యొక్క సామ్రాజ్యంలో ఒక చిన్న పరగణాలో క్రైస్తు ఉండేది. క్రైస్తు 'నేను రాజాధిరాజును' అని చెబుతుంటాడు. అంటే రాజాధిరాజు ఒకడుంటే ఇంకొక రాజాధిరాజు ఎక్కడనుంచి వచ్చాడు? అనే ప్రశ్న వచ్చింది. ప్రశ్న పుడితే, 'నువ్వనుకున్న సామ్రాజ్యానికి రాజాధిరాజుని కాను. నేననుకొనే సామ్రాజ్యానికి రాజాధిరాజును' అంటాడు. అందరూ నవ్వుకుంటారు. వీడేమిటి? వీడి రాజ్యమేమిటి? వీడి రాజ్యానికి వీడు చక్రవర్తి ఏమిటి? రాజాధిరాజు అంటే రాజులకే రాజులకే రాజు అవ్వాలి కదా! అని. అప్పుడు నవ్వుకున్నారు. ఇప్పుడు రెండువేల సంవత్సరముల తర్వాత చూసుకుంటే ఆయన చెప్పినది సత్యము. అది నిజమైన జయించడం. తాను ఓడి జయించాడన్నమాట. ఓడటమంటే తాత్కాలికమైన ఓటమి తప్ప, శాశ్వతమైన గెలుపు. శాశ్వతమైన గెలుపు యందు ఆసక్తి మనలో ఎంత పెరిగితే అంత భగవంతుని యొక్క తత్వానికి దగ్గరవడానికి అవకాశం వుంది.

## 157 విశ్వయోనిః

విశ్వమునకు పుట్టుక స్థానము. మన సృష్టికి మనం పుట్టుక స్థానం. మనం పుట్టిన తర్వాత కదా మనం సృష్టిస్తాం మన సృష్టిని. ప్రొద్దున లేచిన తర్వాత కదా ఈరోజు సృష్టంతా చేస్తాము. మన ఆలోచనలు, మన మాటలు, మన సృష్టి. అలాగే భగవంతుడు పుట్టుకలో నుంచి వచ్చిన తరువాత పుట్టుకొచ్చినటువంటిది విశ్వం. ఇది ఇదివరకు చాల వివరముగా చెప్పుకున్నాము. ఇప్పుడు కూడా ఈ పదానికి అర్థము ఏమిటంటే, విశ్వమునకు పుట్టుక స్థానము.

## 158 పునర్వసుః

ఇది చాలా ముఖ్యమైన నామం. 'పునర్వసుః' అంటే మనం ఏదైనా ఒకటి వాడేసుకుంటే మరల అది నిండిపోతూ వుంటుంది. బావిలో నుంచి ఓ bucket నీరు తీసుకుంటే మరల బావి నిండుతుంది. మళ్ళీ వసించడానికి వచ్చిందన్నమాట నిండా. ఒక గెల కొబ్బరికాయలు దించామనుకోండి. మరల ఒక గెల కొబ్బరి కాయలు వస్తాయి. చెట్టున్నంతకాలం దించుకుంటాము. ఈ చెట్టు లేకపోతే ఇంకొక చెట్టు వస్తుంది. అందుకని ఒక ప్రక్క అయిపోయినట్లు కనిపించినా, ఇంకొక ప్రక్క నుంచి replenish అవుతుంది. అదీ సృష్టిలో ఉన్న ఒక రహస్యం. ఒక పువ్వు ఈ చెట్టు నుంచి ఈవేళ వచ్చింది. దీనిని ఆరాధనకి తీసుకున్నాము. రేపు ఇంకొకటి వస్తుంది. అట్లా మనుష్యుల దగ్గర నుంచి ఏమైనా వస్తాయా? మనం ఎంతో కష్టపడి, అలిసి నిద్రపోయామనుకోండి. రేపు ప్రొద్దున ఆ అలసట వుండదు. అంటే ఏమి చేశారు? ఎవరు చేశారు? ఎవరు replenish చేశారు మన energies ని. ఇలా సృష్టిలో అయిపోతూ ఉన్నచోట మరల replenish అవుతూ వుండటమనేది సృష్టి ధర్మం. పునర్వసు నక్షత్రంలో పుట్టిన వారందరికీ సహజంగా ఈ స్వభావం వుంటుంది. శ్రీరాముడు పునర్వసు నక్షత్రంలో పుట్టాడు. పునర్వసు నక్షత్రంలో పుట్టిన వాడి దగ్గర అయిపోవడమంటూ ఏమీ వుండదు. సృష్టిలో అయిపోవడమంటూ లేదని తెలిసినటువంటివారు వారు వాళ్ళు. అయిపోతుంటే మళ్ళీ వస్తుందని తెలుసుకున్న వారు. అయ్యో అయిపోయిందే అన్న point లేదు. మాస్టారు శంఖారావంలో చక్కగా వ్రాశారు. కుండలో నీళ్ళున్నాయి. నీకు దాహం వేసింది. ఒక గ్లాసెడు నీరు తీసి తాగావు. ఒక గ్లాసు చొప్పున అందరూ తాగితే కుండలో నీళ్ళు అయిపోవాలి కదా! ఎవరో నింపుతున్నారు కదా! ఇన్నేళ్ళ నుంచి fridge లోంచో, కుండ లోంచో నీరు తీసి త్రాగుతున్నావు, ఆ నీరు ఎవరు నింపుతున్నారు? నింపేవాడి గురించి ఆలోచించావా? అని రాసారు మాష్టారు. ఇంట్లో పప్పులు, బెల్లాలు, బియ్యం తింటుంటే అయిపోతున్నాయి. మళ్ళీ వస్తున్నాయి కదా! ఈ మళ్ళీ వచ్చేటట్లుగా

చేసేవాడి గురించి ఆలోచించమన్నారు మాస్టారు. అది ఈ పునర్వసు తత్వానికి సంబంధించినది. కొన్ని ప్రజ్ఞలు సృష్టిలో అయిపోతున్నా మళ్ళీ నింపుతూ వుంటారు. ఒక గొయ్యి తీశామనుకోండి. కొన్నాళ్ళు పోయిన తర్వాత గొయ్యి దానంతట అదే కప్పుకుపోతుంది. ఎవరు నింపారు? బావిలో నీళ్ళు తోడాము. మళ్ళీ నీళ్లు వచ్చాయి. ఎవరు నింపారు? కొబ్బరికాయలు దింపాము. ఇంట్లోకి కొబ్బరికాయలు వచ్చినాయి. అదే కదా మనకి profit. మనం పెట్టిన పెట్టుబడి ఏమిటి? అదే నీరు పీల్చుకొని ఇస్తుంటే మనం తీసుకొని అమ్ముకుంటున్నాము. మాస్టారు అదే అనేవారు. ఒక కొబ్బరి మొక్క నాటితే ఇన్ని కొబ్బరికాయలు వచ్చాయి. ఒక్క రూపాయి నాటితే అన్ని రూపాయలు వస్తాయా అని. రావు కదా! సృష్టిని నమ్ముకోండి. డబ్బుని నమ్మకండి అని పదే పదే చెప్పేవారు. సృష్టిని నమ్ముకున్న వాడు ఎప్పుడూ మోసపోడు. నమ్ముకున్నవాడు మోసపోతాడు. నిజమే కదా మాస్టారు అన్నది. అట్లా వుంటుంది. డబ్బు చుట్టూ రకరకాల మోసాలు, రకరకాల బాధలు. మనం ఎక్కడ నుంచైనా ఏదైనా తీసుకున్నామనుకోండి. అక్కడ మళ్ళీ replenish అయ్యేటట్టు చేయగలిగితే అది పునర్వసు తత్వం. అటువంటి సంఘాలున్నాయి ఈ భూమి మీద. వాళ్ళందరూ కూడా సత్సాధకులు. కలిసి ఒక కుటుంబంగా జీవిస్తూ వుంటారు. ఎవరి యొక్క శక్తి ప్రకారం వాళ్ళు అక్కడ నింపుతూ ఉంటారు. నిత్యావసరమైనటువంటి వాటిని నింపుతుంటారు. ఎవరు ఏమిచ్చారో ఏమీ తెలియదు. తీసుకుంటూ, కావలసినవి వాడుకుంటూ వుండవచ్చు. నీకు తోచినవి నీవు అక్కడ replenish చేస్తూ వుండవచ్చు. కావలసింది అక్కడ వుంచాలి. అదీ నిజమైన సహజీవనం. సహజీవనం అని కబుర్లు చెప్పుకుంటే కాదు. సాముహిక సహజీవనం ఏమిటంటే , కాస్తో కూస్తో మన గురుపూజలలోకనిపిస్తుంది. అక్కడ ఎట్లా నిండుతున్నాయి kitchen లో సామాన్లు? భోజనాలు ఎక్కడనుంచి వస్తున్నాయి? ఏ ఒక్కరో చేస్తే అవుతుందా? ఎవరినీ, ఏమీ అడగకుండా అవుతుంది కదా! ఇది pythagorean community అని ఒకటుంది. లేక దేవాపి మహర్షి నిర్మాణం చేసిన ఒక జీవన విధానం. ఆ

జీవన విధానంలో ఎవరి దగ్గర ఏ విధమైన శక్తి సామర్థ్యాలు ఉంటే వాటికి సంబంధించిన వనరులన్నీ అక్కడ పోగేసుకుంటారు. అందులో నుంచి ఎవరికి కావలసినవి వాళ్ళు తీసుకోవచ్చు డబ్బుతో సహా. చీరలు కొన్నామనుకోండి , ఓ 400 చీరలు కొనేసి అక్కడ పెట్టేస్తారు. చీర కావలసిన వాళ్లు తీసుకోవచ్చు. నిన్న ఒకటి తీసుకున్నావు. ఈరోజు మరల ఇంకొకటి తీసుకుంటున్నావేమిటి అని ఎవరూ అడగరు. అటువంటి సంస్కారం గల వాళ్ళెవరూ వుండరక్కడ. తీసుకోవడం భయంగా, బాధ్యతగా భావిస్తారు. అలా ఒక చీర పెట్టడం అన్నది ఎక్కువ సంతోషంగా భావిస్తారు. పుచ్చుకోవడంలో సంతోషమున్నవారు కారు. ఇవ్వడంలో సంతోషము కలవారు. అక్కడ replenish అవుతుంటుంది, అక్కడ నుంచి కావలసినవి ఎవరైనా తీసుకొని వాడుకుంటూ ఉండవచ్చు. ఎవ్వరు అడగరు. ఎంత కావాలంటే అంత తీసుకోవచ్చు. బీరువా నిండా బట్టలు ఉంటాయి. ఇంకో బీరువా నిండా తినే పదార్థాలు ఉంటాయి. ఇంకో room నిండా పప్పు దినుసులు ఉంటాయి. ఇంకో room నిండా బియ్యము వగైరాలు ఉంటాయి. నీకు ఏది కావాలంటే అది తీసుకోవచ్చును, ఎవ్వరు ఏమి అడగరు కానీ అవన్నీ మళ్ళి నింపబడుతుంటాయి. అటువంటి సహజీవనము కలిగి ఉన్నటువంటి సంఘాలు! అవి ఎలా ఉంటాయంటే వాటికి సంబంధించిన కథ ఒకటి ఉంది. నిజంగా జరిగింది. ఈ సంఘం నుంచి ఒక వ్యక్తి దూరప్రయాణానికి వెళుతూ, దారిలో అనుకోకుండా చపాతీలు, టీలు ఇచ్చే చోటికి వెళ్ళిన తరువాత అనుకోకుండా వ్యాధిగ్రస్తుడై, అక్కడ రెండు మూడు నెలలపాటు వుండిపోతాడు. తన దగ్గర వున్నది అయిపోతుంది. అయినప్పటికీ అక్కడ ఉన్న hotel యజమాని 'నీకేం పరవాలేదు. నిన్ను చూస్తే నాకు చాలా ఆనందంగా వుంది. నీకు కావలసిన సమస్తమైన సౌకర్యములు నేను చేస్తాను' అని చెప్పి అతనికి మందులు, పోషణ అన్నీ చేస్తాడు. చేసి ఏమీ అడగడు. అతను మరణిస్తాడు. ఒక 15, 20 సంవత్సరముల తర్వాత అదే సంఘానికి సంబంధించిన సభ్యుడు అక్కడికి రావడం తటస్థించింది. ఈ ప్రయాణంలో కొంచెం tiffin తిందామన్నట్టు, అక్కడికి వచ్చి కూర్చొని ఫలహారం చేస్తూ, టీ తాగుతూ గోడ మీద చూస్తే

కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. Hotel యజమానిని పిలిచి తన సంచీలోంచి కొంత డబ్బు తీసి ఇస్తాడు. ఇది ఎందుకు ఇస్తున్నానంటే, "కొన్ని సంవత్సరముల క్రితం ఇచటికి  ఒకతను వచ్చి ఇక్కడ ప్రాణాలు వదిలాడు కదా! అతనికి నీవు చాలా సేవ చేశావు. ఆ సేవకి అతడు ఇచట ఒక ఎకౌంటు maintain చేశాడు. Maintain చేస్తే  దానికి నీకు ఎంత ఇస్తే తన రుణం తీరుతుందో వ్యక్తిగతంగా ఇక్కడ సంకేతాత్మకంగా చెప్పాడు. నేను ఆ సంఘానికి సంబంధించిన వాడిని. ఇవాళ వచ్చాను. ఆ సంకేతాలు గమనించాను. గమనించి ఇది నీకు ఇస్తున్నాను. తప్పకుండా తీసుకో" అంటే అతను చాలా ఆశ్చర్యపోతాడు. ఈ రోజుల్లో తండ్రి చేసిన అప్పు కొడుకే తీర్చడు. నాకేం తెలియదండి మా నాన్నగారు నాకు ఏం చెప్పలేదు, అంటాడు. అక్కడ తనతో సాధన చేసిన ఒక సాధక సోదరుడు మార్గమధ్యంలో మరణించాడు. అ సమయములో అప్పు అయ్యింది. అతనికి hotel యజమాని ఇచ్చిన అప్పు అడగకుండానే ఇతను వచ్చి తీర్చే replenishment  అనేది అలా జరిగింది. ఆ  యజమానికి అటువంటి బుద్ధి ఉన్నది కాబట్టి  అక్కడ replenish జరిగింది. అలా ఈ సంఘంలో replenishing  attitude వుంది. వీటినే 'పునర్వసు సంఘాలంటారు'. మహాత్ములందరూ అంతే! వాళ్ళు ఎక్కడ నుంచి తీసి ఇస్తున్నారో తెలియదు. నిండి పోతూ ఉంటుంది. పనులు జరిగిపోతూ వుంటాయి. ఎందుకంటే నమ్ముకున్నది ఈ సృష్టిని తప్ప, మనం అనుకున్నటువంటి డబ్బుని కాదు. అందుకని సృష్టి సంపదను నమ్ముకున్న వాళ్ళకి ఈ విధమైన replenishment ఎప్పుడూ  జరుగుతూనే వుంటుంది. కనుక ఈ replenishment  మనం సృష్టిలో చూసినపుడు Are we also replenishing in the same way? మనం పుచ్చుకున్నది పుచ్చుకున్నంత ఇవ్వగలిగామా? లేదా? సంఘం దగ్గర పుచ్చుకుంటాము. మన సంపాదనంతా సంఘం దగ్గర తీసుకున్నదే కదా! కొంతమంది కొంత తీసుకుంటారు. కొంతమంది ఎక్కువగా తీసుకుంటారు. కొంతమంది దోచేస్తారు. దోచిన కొద్దీ తెలివైనవాడినని అనుకొంటూ వుంటాడు. తీసుకున్నది తిరిగి ఇవ్వగలిగిన స్థితి లేనటువంటి వారందరూ కూడా

భగవంతుని యొక్క ఈ తత్వము నందు నిలబడరు కాబట్టి సంపద యొక్క అనుభూతి వుండదు. సంపాదన వుంటుంది కానీ దానిని అనుభవించే అర్హత కోల్పోయి వుంటారు. ఎంతో సంపాదిస్తుంటారు. వాటన్నిటికీ కాపలా కాసుకుంటారు. వాటి గురించి భయపడుతూ వుంటారు తప్ప వాటిని అనుభూతి చెందలేరు. కారణమేమిటంటే తీసుకున్న చోట మళ్ళీ దానిని replenish చేసే తత్వము లేకపోవడం వలన, ఆ సంస్కారం లేకపోవడం వలన సంపదకి సంబంధించిన వైభవము వుండదు. సంపాదన చాల ఉంటుంది. దానికి సంబంధించిన అనుభూతి వుండదు. అది ఎవరికోసమో? 'ఈన గాచి నక్కల పాలు', అంటారు. అలా అయిపోతుంది. భగవంతుని '**పునర్వసు**' అనే ఈ తత్వం ఈ context లో చాలా important. పునర్వసు నక్షత్రము అటువంటిది. అందుకని కనీసము చంద్రుడు పునర్వసులోకి వచ్చినప్పుడైనా మనకది గుర్తుకొచ్చి మనం ఎన్నోరకాలుగా, ఎంతో మంది దగ్గర నుంచి ఎన్నో తీసుకుంటూ వుంటాము. మనకెవరైనా ఒక gift ఇచ్చారనుకోండి. చాలా ఆనందంగా వుంటుంది. ఊరికినే వచ్చింది కాబట్టి. మనం ఎంత మందికి gifts ఇచ్చామన్నది కదా! Gift ఇచ్చే టప్పుడు ఆనందంగా వుండదు. పుచ్చుకునేటప్పుడు ఆనందంగా వుంటుంది. కానీ మహాత్ములకి ఇవ్వడంలో ఆనందం వుంటుంది. పుచ్చుకోవడంలో ఆనందం వుండదు. అపరిగ్రహస్థితి వుంటుంది. కనుక మనం శరీరం పుచ్చుకొన్నాం. తల్లిదండ్రుల యొక్క సేవలు పుచ్చుకొన్నాం. సంఘం దగ్గర నుంచి పుచ్చుకొన్నాం. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ దగ్గరనుంచి పుచ్చుకున్నాం. స్నేహితుల దగ్గర నుంచి పుచ్చుకొన్నాం. ఎవరి దగ్గర నుంచి ఏం పుచ్చుకొందాం అని పుచ్చుకొనేవాడు పునర్వసు కాదండి. ఈ పుచ్చుకోవడమనే దానికి ఒక లెక్క ఉంచి పుచ్చుకున్నంత మళ్ళీ ఇచ్చి వెళ్ళగలవా? నీవు వెళ్లి పోయిన తర్వాత ఎట్లాగూ మిగిలిన వాళ్ళు పుచ్చుకుంటూ వుంటారు. అది వేరే సంగతి. నీవు వుండగానే ఇచ్చుకోమన్నారు గరుడపురాణంలో. గరుడపురాణంలో ఏం చెప్పారంటే అన్ని దానాలు నిన్నే చేసుకుని వెళ్ళమన్నారు. ఏదో పోయిన తరువాత పది రోజులు నువ్వు అక్కడే

ఉంటావు కాబట్టి నీ పేరున వాళ్ళు చేస్తూ వుంటారు. అట్లా కాదు వుండగానే చేయి. మనం వెళ్ళిపోయిన తర్వాత ఎవరో గోదానం చేస్తే దాన్ని అనుభూతి మనకుండదు. మనకి అనుభూతి వుండాలంటే మన చేత్తో మనం చేయాలి. అట్లాగే అన్ని దానాలు మనముండగానే మన చేత్తో  మనం చేసుకోవడం ధన్యం. అదీ గరుడపురాణము లో ఉండేది. అది ఎప్పుడూ మనిషి పోయిన తరువాత చదువుతాము కాబట్టి సినిమాలో పోలీసుల్లాగా వుంటుంది. అయిపోయిన తరువాత తెలియడం కాదు కదా! వున్నప్పుడు తెలియటం కావాలి. కాబట్టి నీవుండగానే నీ చేతులతోనే ఎక్కడెక్కడ ఎంతెంత పుచ్చుకున్నావో అంత కనీసం ఇవ్వగలిగితే గొప్ప. అంతకుమించి ఇస్తే ధన్యం. అన్ని విషయాల్లో కూడా ప్రకృతి నుంచి  పుచ్చుకుంటావు. మనుషుల వద్ద పుచ్చుకుంటావు. జంతువుల వద్ద నుంచి పుచ్చుకుంటావు. జంతువుల దగ్గర నుంచి  పుచ్చుకుంటాం కదా! జంతువులకి పెట్టండి. చెట్ల దగ్గర నుంచి పుచ్చుకుంటాం కదా! చెట్లకి కాస్త నీళ్లు పోయండి. మనుషుల వద్ద నుంచి పుచ్చుకుంటాం కదా అని మనుషులకి కాస్త ఏదైనా చేస్తూ వుండండి. పంచభూతాల దగ్గరనుంచి పుచ్చుకుంటుంటాం కనుక పంచభూతాలకి ఏమైనా చేస్తూ వుండండి. ఇట్లా చేస్తూ వుంటే మనకీ, వాళ్ళకి మధ్య ఆ రకమైన పరస్పర అనుబంధం ఏర్పడుతుంది. ఎప్పుడూ పుచ్చుకొనే వాళ్ళని చూస్తే ప్రకృతి కూడా మొదట్లో కొంచెం సంకోచిస్తుంది. కొన్నాళ్ళు పోయిన తర్వాత 'ఇంక చాలు ఆపు'  అని ఆపేస్తుంది. రోజూ అడగడానికి ఎవరైనా వస్తున్నారనుకోండి. నాలుగైదు రోజులిస్తాం. ఆ తరువాత ఇంట్లో వుండి లేమనిపిస్తాం. Busy గా వున్నారనో, పూజలో ఉన్నారనో ఇలా ఏవేవో పంపించేస్తుంటాము. ఎందుకంటే ఎప్పుడూ పీక్కు తినే వాడిని చూస్తే లోపల అంత హర్షించదు. అందుకని సృష్టిలో నలుగురూ సంతోషించాలంటే we have to be distributors not receptors. ఆ విధంగా distribute చేయడం వలన అటువంటి distribute చేసేవారి ప్రజ్ఞలుగా అన్ని లోకాల్లోనూ, అన్ని రాజ్యాల్లోనూ అంటే వృక్ష సామ్రాజ్యం, జంతు సామ్రాజ్యం, మనుష్య సామ్రాజ్యం అన్ని చోట్లా వున్నారు కాబట్టే , పుచ్చుకున్న వాళ్ళు

పుచ్చుకుంటారు. ఇస్తున్న వాళ్ళు ఇస్తుంటారు. మన గ్రంథాల్లో ఎక్కడా కూడా భూమిలోని ఖనిజాలు అయిపోతాయని, నీరు, oil అయిపోతాయని చెప్పరు. ప్రకృతిని నమ్ముకున్న వాళ్ళ science లో అయిపోవడం వుండదు. Replenish అవుతుంది. Everything is again replenished . ప్రతిదీ అక్కడ మళ్ళి  పునరావృతమౌతుంది. అదే మనకి విశ్వరూప సందర్శనంలో కూడా ఒక ప్రక్క నుంచి వెళ్ళిపోతూ వుంటే, ఇంకొక ప్రక్క నుంచి దిగి వస్తూ వుంటారు. పునర్వసు అంటే మళ్ళీ వసించడానికి వస్తుండడం. It comes back. ఎవరూ ఎక్కడికీ పోరు. అందరూ ఇక్కడే తిరుగుతూ వుంటారు అనే కదా చెప్పాడు కృష్ణుడు. చక్రం తిప్పుతున్నాను అని చెబుతూ వుంటాడు శ్రీకృష్ణుడు. ఈ తిరిగే చక్రం లో ఎంతమంది వెళ్ళారో అంతమంది వస్తున్నట్లుగా ఉంటుంది. స్కూలు కథ కూడా అంతే. స్కూలు అయిపోయి కొంతమంది వెళ్ళిపోతుంటే, మళ్ళీ కొంతమంది స్కూల్లో చేరుతుంటారు. స్కూలు ఎప్పుడూ వుంటుంది. అట్లాగే సృష్టిలో అన్నీ కూడా  వెళ్ళేవి వెళుతుంటాయి. వచ్చేవి వస్తుంటాయి. అట్లా ప్రతీది replenish అవుతుంది కాబట్టి అయిపోతుంది  అన్న  బాధ పడమాక . భయమున్న  వాడికి పునర్వసు అనే భగవంతునితత్వం అవగాహన కాలేదన్న మాట. ఈ తత్త్వము అర్థము అయినవాడికి దేని గురించి B . P . ఉండదు.

## 159 ఉపేంద్రః

ఇంద్రుడికి తమ్ముడు అని మామూలుగా అర్థము. ఇంద్రుడికి "proximity problem." మన తమ్ముడే కదా! అనిపిస్తుంది. వీడు మన తరవాత పుట్టిన వాడే కదా, వీడి ముఖం, వీడికేం తెలుస్తుంది అని అనిపిస్తుంది. బలి దానం ఇవ్వటము అనే చక్కటి కార్యక్రమము పెట్టుకుంటాడు. భక్తరాజ్ మహారాజ్ గారు చెప్పారు. చెయ్యి ఇచ్చేదిగా వుండాలి గాని పుచ్చుకునేటట్టుగా ఉండరాదు. ఎప్పుడూ అడుగుతున్నట్లు చేయి చాపిన వాడి చేతికి పక్షవాతం వస్తుంది. పదిసార్లు ఇవ్వగలిగే వాడికి ఒకసారి పుచ్చుకునే అర్హత వస్తుంది. బహుశా శుక్రాచార్యులవారు బలికి ఇదే చెప్పివుంటాడు. శుక్రాచార్యులవారు 'దేవతలని గెలవాలంటే బలంతో గెలవగలం గానీ, విష్ణువు యొక్క యుక్తి ముందు మనకి వీలు పడడంలేదు కాబట్టి, ఏదైతే ధర్మంగా చెప్పబడుతుందో, వికాసంగా చెప్పబడుతుందో, దేని వలన అయితే భగవంతుడు మనని శిక్షించలేడో, అలా గెలుచుకొద్దాము' అని చెప్పిఉండవచ్చు. అది కదా బలి కార్యక్రమం. సింహాసనమును ఆక్రమించిన తర్వాత, దానాలు చేయడం మొదలు పెడతాడు. దానాలు ఎంత బాగా చేస్తాడంటే, ఇంద్రుని కన్నా ఈయనే better అన్నట్టుగా ఉంటుంది. మొత్తం సృష్టి అంతటికీ కూడా he is better administrator. కాబట్టి మొత్తము అంతా కూడా ఈయననే చూస్తారు. ప్రజలందరు కూడా ఆయన్నే కోరుకుంటారు. సృష్టంతా ఆయన్నే కోరుకుంటారు. పైగా తీసేయడానికి, ఆయన అంతకు ముందాయనకన్నా కూడా బాగా పని చేస్తున్నాడు. ఎలా తీసేస్తారూ? ఒక యుక్తితో గెలవాలనే ఉద్దేశ్యంతో, గురువు ఉపదేశంపై ఈ విధమైన కార్యక్రమం మొదలుపెట్టాడు. బలి చక్రవర్తిలో ఇవ్వడం వలన వికాసం విపరీతంగా పెరిగింది. ఇచ్చుకోవడం పుచ్చుకోవడం సమానంగా balance అయినటువంటి వాడు యోగి. ఇచ్చుకుంటూ వెళితే పదార్థము నుంచి ముక్తి, విముక్తి కలుగుతూ వుంటుంది. పుచ్చుకుంటూ వెళితే పరమార్థంకి దూరం అవుతాము. పదార్థం నుంచి దూరమవడం అంటే ఇచ్చుకోవడం. ఒకటి positive functioning, ఇంకొకటి negative functioning. South pole అంతా gather చేసుకుంటుంది. North pole అంతా distribute చేస్తుంది. రెండూ వున్నాయి కాబట్టి Globe వుంది. ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ పని చేస్తే, అటో ఇటో అవుతుంది. కనుక ఇక్కడ ఈయన ఇస్తూ వెళుతుండడం వల్ల ఏమవుతుందంటే

పదార్థం మీద grip పోయింది. రాజ్యం మీద, సింహాసనం మీద వీటన్నిటి మీద grip పోయింది బలికి. Grip పోయి అసలు వున్నాడు తప్ప అతని యందు పట్టు పోయింది. భగవంతుణ్ణి మనం వైరంలో దిగి ఆయనని జయించలేము కాబట్టి, ఏది జయించటానికి భగవంతుని యొక్క కళ్యాణగుణం మనము practise చేస్తున్నామో దాని వల్ల బలికి ఇతరుల సింహాసనం occupy చేసేటటువంటి  స్థితి ఉందే, దాని మీద పట్టుపోయింది. That which is not ours, దానిమీద బలికి పట్టు లేదు. అది భగవంతుని యొక్క ప్రణాళిక! కనుక బలి చక్రవర్తి వామనుడికి  ఆ విధంగా ఇవ్వడం జరుగుతుంది. తెలిసి ఇస్తాడు. అతనికి వికాసం ఎంత పెరిగింది అంటే, తనది అనేదాని మీద పట్టు వదిలింది అని కూడా తెలియదు. పెరగడం వలన భగవంతుని యొక్క అనుగ్రహమునకు పాత్రుడై, వచ్చిపోయే ఇంద్రస్థానం కాకుండా భక్తికి సంబంధించిన లోకంలో బలిచక్రవర్తి స్థాపింపబడతాడు.  'ఆ తరువాత వచ్చే కల్పంలో నిన్ను ఇంద్రుడిగా తయారు చేసుకుంటాను. అందాకా ఇక్కడ వుండు. ఇప్పుడు వాడి seat వాడికి ఇచ్చేద్దాం,' అంటాడు. అక్కడ మనం చూస్తే సొంత తల్లి కూడా కుమారుడిని ఏమి కోరాలో కోరలేకపోయింది. విష్ణువు కనిపిస్తే తల్లి కూడా పిల్లవాడి సంగతి అడిగింది. మాస్టారు అట్లా చెప్పారు. ఇంద్రుడి కన్నా బాగా పరిపాలిస్తున్నవాడు  ఇంకొకడు ఉన్నప్పుడు ఎందుకిలా ఆవిడకి ఇహమైన లోకానికి సంబంధించిన కోరిక తీర్చబడింది. ఎవరిని శిక్షించాడనుకుంటున్నారో అతనికి 'పరానికి' సంబంధించిన వరం ఇవ్వబడింది. అలా ఉంటుంది వామనచరిత్ర. మనలో కూడా అదే జరుగుతుంది. మనలో బుద్ధి కుదరాలంటే భగవంతుని స్థానము మార్చుకున్నట్లైతే మనలో బుద్ధి పనిచేస్తుంది. భగవత్ స్మరణ చేస్తుంటే బుద్ధి వికాసం చెందుతుంది. భగవత్  స్మరణ  చేస్తూ వుంటే సద్గ్రంథ పఠనం చేద్దామనే బుద్ధి కలుగుతుంది. మామూలుగా అడ్డమైన పుస్తకాలు చదివేవారు కూడా నెమ్మదిగా స్మరణ మొదలుపెడితే, ఈ పుస్తకాలు కూడా చదవడమనే అభ్యాసం మనసుకి ఉంది కాబట్టి, ఇటు diversion వస్తుంది. Salmon Rushdi నవలలు చదివే బదులు రామాయణం చదవాలనిపిస్తుంది. లేదా భగవద్గీత కానీ భాగవతం గాని చదవాలనిపిస్తుంది. లేదా మహాత్ముల జీవిత చరిత్ర చదవాలనిపిస్తుంది. అంతకుముందు అనిపించనివి ఇప్పుడు అనిపిస్తుంది. ఎందుకంటే స్మరణ వలన! అలాగే పుణ్యక్షేత్ర దర్శనం, మహాత్ముల దర్శనం, సత్సాంగత్యము ఒకదాని తర్వాత ఒకటి pick చేస్తూ ఉంటుంది బుద్ధి. అది నెమ్మదిగా ఏమి చేస్తుందంటే,  ఎప్పుడైతే

బుద్ధిని మనస్సు ఆవాహనం చేస్తుందో, అప్పుడు మనలో బుద్ధి భగవంతునికి సంబంధించిన కార్యక్రమములు పెంచుతుంది. పెంచితే, మనలో వామనుడుగా వున్న భగవంతుడు 'రామ్ సబ్ ' అనే స్థితికి పెరుగుతాడు. మూడు లోకాలు తాను ఆక్రమిస్తాడు. మనలో మూడు లోకాలు ఏమిటి ? ఒకటి మనసుకు సంబంధించిన లోకం, దాని ముందు ఇంద్రియములకు సంబంధించిన లోకం అంటే కామలోకం, తర్వాత భౌతికమైన లోకం. ఈ మూడు లోకాలూ ఆక్రమిస్తాడు. మనిషి మాస్టరుగా మారిపోతాడు. భావనలో భగవంతుడే! మాటల్లో భగవంతుడే! చేసే చేతల్లో భగవంతుడే! చేసే కార్యక్రమాలన్నీ భగవంతునికి సంబంధించినవే! ఈ మూడు లోకాలు భగవంతుడు ఆక్రమిస్తాడు. అదీ బలికి జరిగినది. ఇహ అక్కడ బలి ఏడీ? మనము అప్పుడప్పుడు కాస్త పిలుస్తుంటాం, మిగతా సమయం అంతా మనమే వుంటాం. మహాత్ముల్లో పూర్తిగా భగవంతుడే నిండి ఉంటాడు మనస్సు నిండా. మనం అప్పుడప్పుడు పిలుచుకుంటూ వుంటాం. పంపించేస్తూ వుంటాం. మహాత్ముల్లో పంపించుకోవడం వుండదు. పిలుచుకోవడం వల్ల అక్కడ ఉండడం వుంటుంది. అక్కడ నుంచి వ్యక్తమవుతూ వుంటుంది. ఇంద్రియాల్లోనుంచి, శరీరంలోనుంచి, కార్యక్రమాల్లో నుంచి, చేసే పనుల్లో నుంచి, అన్నింటిలో నుంచి ఆయనే వికాసం చెందుతూ వుంటాడు, ఇంక 'బలి' లేడు. అంటే అహంకార స్వరూపుడైన జీవుడు లేడు. ఎందుకు లేడంటే వాడెంత దిగుతుంటే మనకి అంత పట్టు తగ్గిపోతుంది మిగతా వాటిమీద. అది ఒక test మనకి. ఒక Self examination. పట్లు సడలినాయి అంటే భగవంతుడు ఎక్కువ దిగాడు అని అర్థం. దేని మీద పట్టు సడలిందీ? పదార్థం మీద పట్టు సడలింది. నిజంగా పదార్థం మీద పట్టుఉన్నా పరమాత్ముని ధ్యానం చేసినకొద్దీ పరమాత్ముడు దిగివస్తే, ఇక పదార్థం మీద పట్టు వుండదు. బలిచక్రవర్తి కథలో పదార్థం మీద పట్టుతో మొదలుపెట్టిన ఒక సత్సాధన, పదార్థం మీద పట్టును తీసేసింది. యుద్ధంచేసి వాడి వద్దనుంచి సింహాసనం తీసుకోవలసిన అవసరం లేకుండా వాడే ఇచ్చేసేటట్టుగా. అక్రూరుడి జీవితంలో కూడా మనకది అనిపిస్తుంది. అక్రూరుడు భగవంతుని యొక్క తత్వం పరిపూర్ణంగా తెలిసి ఉన్నప్పటికీ కొన్ని పట్లున్నాయి. ఆ పట్లలో శమంతకమణి పట్టులో పడ్డాడు. శమంతకమణి సత్రాజిత్తు దగ్గరనుంచి నెమ్మదిగా అక్రూరుని వద్దకి చేరుతుంది. ఆ సంగతి ఎవరికీ తెలియదు. ఒక్క కృష్ణుడికి తెలుసేమో అని అక్రూరుడికి భయం. ఎందుకంటే కృష్ణుని చూసినప్పుడల్లా, ఆ నవ్వుతున్న కృష్ణుడి చూపులో అక్రూరుడికి

కొంచం బెరుకు చూపించినట్లుగా వుంటుంది. ఆ చూపు గుండుసూది గుచ్చుకున్నట్లుగా వుంటుంది. చూసి నవ్వుతాడు, ఏమీ అనడు. మనిషి చూసి నవ్వితే ఏమవుతుందంటే మనలో ఉన్న తప్పులు మనకి గుర్తుకు వస్తాయి. తెలుసేమో అందుకే అలా నవ్వుతున్నాడని. అది చాలా ఇబ్బందిగా వుంటుంది. ఇబ్బందిగా వుండి ఏమి చేశాడంటే కృష్ణుడు చూడడంవలననే కదా ఈ బాధ వస్తున్నది అని, తను చేసినదాని వలన కదా ఈ బాధ వచ్చింది అని గుర్తించక యాదవుల రాజ్యాన్ని వదిలేసి దూరంగా ఎక్కడికో వెళ్ళిపోతాడు అక్రూరుడు. అలా వుంటుంటే ఒక season లో వర్షాలు పడలేదు. వర్షాలు పడకపోతే ప్రజలందరూ వచ్చి, నువ్వు మహాత్ముడివి. నువ్వు తలుచుకుంటే వర్షాలు పడతాయి కదా తలచుకుని మనకి వర్షాలు వచ్చేట్లుగా చూడమంటారు. అప్పుడు కృష్ణుడు ఏం చేస్తాడంటే ఆ వెళ్ళిపోయిన వానిని తీసుకు రావాలి కదా! ఆయన్ని ఇబ్బందిపెట్టడం కార్యక్రమం. 'అసలు మనకు ఎందుకు వర్షాలు పడటం లేదో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఆయనంత మహాత్ముడు మన మీద కోపంకొద్దీ వదిలేసి వెళ్ళిపోయాడు. ఆయన పాదం పెడితే వర్షం పడుతుంది. కాబట్టి ఆయన్ని పూజించి, ప్రత్యేకించి నేను చెప్పానని చెప్పి తీసుకొని రండి'అని చెబుతాడు. వెళ్ళి అడుగుతారు. 'అయ్యా! మీరు రావాలి వర్షాలు పడడం లేదు. శ్రీకృష్ణుడే సాక్షాత్తు మీరు లేకపోతే వర్షాలు పడవని చెబుతున్నాడు', అంటే సందిగ్ధంలో పడతాడు. ఒక ప్రక్క పొగుడుతున్నారు. కృష్ణుడికి బహుశా మణి సంగతి తెలియకపోయి వుండచ్చు అనుకుంటాడు. అక్రూరుని పాదంలో కొన్ని రేఖలు వున్నాయి. ఆయన ఎక్కడ పాదం పెడితే అక్కడ వర్షం పడుతుందని మామూలుగా సాముద్రికము తెలిసిన వారు చిన్నప్పుడే చెబుతారు. కాబట్టి అది తెలిసి శ్రీకృష్ణుడు నన్ను పిలుస్తున్నాడు. ఆయన నవ్వుతుంటే ఊరికే నేనేదో అనుకున్నాను తప్ప, ఆయనకి ఆ భావన ఏమీ లేదని అనుకొని, వస్తాడు. వచ్చి, 'శ్రీకృష్ణుని కూడా యజ్ఞానికి పిలవండి', అంటాడు. పెద్దవాళ్ల దగ్గర మన గొప్పదనం చూపించడం కోసం. తన గొప్ప శ్రీకృష్ణుడికి కూడా తెలియాలి, పిలిస్తే శ్రీ కృష్ణుడు వస్తాడు. చాలా అట్టహాసంగా యాగం చేస్తాడు. చేసిన తరువాత వర్షం పడదు. వర్షం పడకపోతే అప్పుడు వ్యాసుడు చెబుతాడు 'నువ్వు అహంకారంతో చేసావు అందుకు వర్షాలు పడలేదు. పక్కన భగవంతుడున్నాడు అంటే ఉపేంద్రుడన్నమాట. ఆయన్ని మరిచిపోయి నువ్వు చేసిన యజ్ఞం ఒక యజ్ఞమేనా? ఆయనకి నీ మీద వాత్సల్యం ఎలా వుందీ, ఆయనపై నీ భావన ఎలా

వుంది? వెళ్ళి ఆయన కాళ్ళు పట్టుకో వర్షం పడుతుంది. నీకు పరువు దక్కాలి వీళ్ళందరిముందు'. Private గా అయినా కాళ్ళు పట్టుకో అలాగైతే వర్షం పడుతుంది అని చెబుతాడు. వ్యాసుడు, అక్రూరుడు చిన్నప్పుడు నుంచీ పరాశరుని స్కూల్లో చదువుకున్నారు. కాళ్ళు పట్టుకోగానే, చిటపటలాడుతూ వున్న ఎండ పోయి, కారు మబ్బులు ఏర్పడి వర్షం పడుతుంది. పడితే అప్పుడు మళ్ళీ కృష్ణుడు నవ్వుతాడు. నవ్వితే ఇక భరించలేక పోతాడు, ఆ మణిని తీసి ఇచ్చేస్తాడు. భగవంతుడు ఎంత దిగి వస్తే అంత మనలోని పట్టు పోతుంది. లేకపోతే ఉంటాడు. మన పట్టూ వుండాలి, భగవంతుడూ ఉండాలి అంటే 'అలా ఉండని అట్లాగ', అంటాడు. నన్ను పిలుస్తున్నాడు కదా! నేను చూసుకుంటాను అంటాడు. నన్ను తలుచుకుంటున్నావు కదా నీకెందుకు నేను చూసుకుంటాను కదా, అంటాడు. కనుక తలచుకున్నకొద్దీ పట్టు సడలుతుంది. బుద్ధి పెరుగుతుంది. బుద్ధి పెరిగితే పట్టు సడలుతుంది. విదురుడికి అలాగే జరిగింది. విదురుడెటువంటివాడు? సకల ధర్మాలు తెలిసినవాడు. అన్నీ తెలుసు. పాండవులకు అన్యాయం జరుగుతుందని తెలుసు. ధృతరాష్ట్రుడు అడిగినప్పుడల్లా చాలా ఖచ్చితంగా చెబుతుంటాడు. ఎంత ఖచ్చితంగా చెబుతాడంటే ధృతరాష్ట్రుడికి అప్పుడప్పుడు భయం వేస్తుంది తప్పు చేస్తున్నానని. ధృతరాష్ట్రుడు సహజంగా మంచివాడు. అతనికున్న ఒకే ఒక బాధ ఏమిటంటే కొడుకు మీద మమకారం. ఎవరికుండదు కనుక? విదురుణ్ణి పిలిచి సలహా అడిగినప్పుడల్లా చక్కగా అన్ని విషయాలు విడమరచి చెబుతుంటాడు ఇదిగో ఇట్లా ప్రవర్తించు అని. అతని నీతి అటువంటిది. ధర్మాలన్నీ పరిపూర్ణంగా తెలిసినటువంటి వాడు. ధృతరాష్ట్రుడికి అది correct అనిపిస్తుంది. ఎన్నోసార్లు విదురుడు చెప్పింది correct అని కొడుకుని పిలిచి చెబితే కొడుకు ఒక logic చెబుతాడు. అప్పుడు కొడుకు చెప్పిందే correct అనిపిస్తుంది. ఇది విదురుడు చెప్పాడని ధృతరాష్ట్రుడు చెప్పడు. వాడి మీద విరుచుకుపడతాడని, తన ఆలోచనలో ఇట్లా ఉంది, నీవు ఇట్లా చేస్తున్నావు కదా? ఇది తప్పు కదా? అంటే, అప్పుడు వాడు అసలు ఇది మనదే కదా! వాళ్లకు అది ఇవ్వకూడదు కదా! అని చెబితే, correct అనిపిస్తుంది. ఇటువెళితే విదురుడు correct అనిపిస్తుంది. అటు వెళితే ధుర్యోధనుడు correct అనిపిస్తుంది. అది ధృతరాష్ట్రుని సమస్య. విదురుడికి మంత్రి పదవి ఒకటి వుంటుంది కదా! కనుక సలహాలిస్తుంటాడు రాజసభలో కూర్చుని. అక్కడ ఏ రాజయితే నీతిని పాటించడంలేదో ఆ రాజు సభలో తాను మంత్రి. ధర్మాలు సులభంగా చెబుతూ

వుంటాడు. ఎందుచేత? తన దాకా రాలేదు కాబట్టి సులభం. ద్రౌపది వస్త్రాపహరణం అయిన తరువాత కూడా ఇంకా కొలువులో వుంటాడు. అప్పుడు ధర్మం చెబుతాడు. ఎవరూ వినరు. వినకపోతే తను చెప్పిన ధర్మం పాటించకపోతే, తను వుండచ్చా? ఎందుకింక మంత్రిగా వుండడం? మన సలహా పాటించడట, మనకి జీతం ఇస్తాడట అన్నట్టుగా వుంటుంది. మీ consultation నాకు అక్కర్లేదండి, ఈ fees తీసుకోండి అన్నట్లుగా వుంటుంది. ప్రతిసారీ వచ్చి consultation పుచ్చుకొని, పాటించకుండా fee పుచ్చుకొని వెళుతున్నామనుకోండి బావుంటుందా? అలా వుంటుంది విదురుడి పరిస్థితి. సమస్తమూ తెలిసి, మంత్రి పదవి మీద వ్యామోహంతో అక్కడ వుంటాడు. ఈ యుద్ధం వుండకూడదు, అందరూ కలిసి వుండాలి, ఇటువంటివి కొన్నికొన్ని చెబుతూ వుంటాడు. అందుకని కృష్ణుడు కొంచెం మనం ఇతనికి కూడా చెప్పాలనుకుంటాడు. అందరూ బాగుండాలని ఏమీ తెలియని వాడు easyగా చెబుతాడు. అన్నీ తెలిసిన వాడు అలా చెప్పలేడు. కొంతమంది బాగుండకుండా వుండడం వలన సృష్టి బాగుంటుంది. కొంతమంది బాగుండకుండా వుండటం వలన సృష్టి బాగుండదు, పాండవుల వంటి ధర్మపరులు అలా ఉండరాదు. ఇద్దరూ సమానమే. ఇద్దరూ అన్నదమ్ముల బిడ్డలే, కలిసుండచ్చు అంటూ, వాళ్ళేమో వీళ్ళకి బట్టలూడదీస్తుంటే, అయినప్పటికీ కలిసుండొచ్చు కదా! అని చెప్పే న్యాయం న్యాయమా? విదురుడు అలా చెబుతుంటాడు. పైగా కృష్ణుడు భగవంతుడు కాబట్టి, భగవంతుని దృష్టిలో అందరూ సమానమే కాబట్టి, ఆయన యుద్ధం లేకుండా చేయవచ్చు కదా అనే భావన ఉంటుంది. ఒక్కొక్కరి logic ఒక్కొక్కలా ఉంటుంది. ఎవరూ ఏమీ చేయలేరు కదా. అందుకని రావటం రావటం రాయబారానికి వచ్చినప్పుడు కృష్ణుడు, ఇతడికి ముందు ఒక కష్టమంటే ఎలా వుంటుందో రుచి చూపించాలనుకుంటాడు. అంతవరకూ రాచమర్యాదలతో తలపాగా పెట్టుకోవడము, కత్తి పట్టుకోవడము, బిళ్ళ జవానులు ముందు నడవడం అంతా వుంటుంది కదా! అందరూ ఓహో! ఆహా! అని అంటారు. అలా వచ్చి హాయిగా కుర్చీలో కూర్చోవడం, మనకేమీ కుట్టినట్లుండదు కదా ఇంకొకరికి ధర్మం చెప్పడం. తను ధ్యానము చేస్తూ ఉంటాడు. భగవంతునికి ధ్యానము ఉన్నది.

ధర్మం తెలుసు, కానీ ఈ విషయంలో అధర్మంగా వున్నాడు. ధర్మం పేరున అధర్మంతో వుండడం జరిగింది. అధర్మం జరిగేచోట ఆ కొలువులో ఉంటే

అధర్మంలో participate చేసినట్లే! నీ మాట వినని చోట అసలు నీవెందుకు కూర్చోవాలి? ఇవాళ కాదు, రేపు కాదు, మొన్న కాదు, ౨౦ సం లు నుంచి నీ మాట వినడం లేదు. కానీ నీకు మర్యాద ఇస్తున్నారు. అక్కడున్నాడన్నమాట. పాండవులు కౌరవుల యుద్ధం వాళ్ళ ౨౦ ఏళ్ల వయసులో జరిగింది. పుట్టిన దగ్గర నుంచి పాండవులకి వరుసగా జరిగినవన్నీ ఘోరాలే కదా! అవన్నీ తప్పులని రాజుకి చెబుతున్నాడు మంత్రిగా. రాజు వినడం లేదు. ఎందుకుండాలి?You are advisor to someone who does not listen to you and you have been advising for ౨౦ years.And now నీకు ఎటువంటి భావన? భగవంతుడైన సరే ఇప్పుడు వీళ్ళిద్దరూ కలిసినట్లుగా చేయాలే తప్ప లేకపోతే వాడేం భగవంతుడు? అనుకుంటాడు విదురుడు. అందుకని రాయబారానికి రాగానే శ్రీకృష్ణుడు, ఓ మామయ్యా! రాజా! మొత్తమంతా correct గ clear గ ఉన్న picture ఏమిటో, statement of facts, వున్నది వున్నట్లుగా, clear గా ఒక్కసారి విదురుడి చేత చెప్పిద్దాము. విదురుడు సమస్తమూ తెలిసినవాడు అతన్ని పిలిపించమంటాడు. First time దుర్యోధనుడు సభలో వుండగా, విదురుడు వున్నది ఉన్నట్లుగా సత్యం మాట్లాడతాడు. అంతవరకు అన్నయ్య అడుగుతున్నాడు ఈయన చెబుతున్నాడు. అన్నయ్య వెళ్ళి కొడుకుని అడుగుతున్నాడు. కొడుకు అన్నయ్యకి చెబుతున్నాడు. Direct confrontation లేదు. వాళ్లకి ౨౦ ఏళ్ళ నుంచి direct confrontation. ధుర్యోధనుడు అక్కడ పాండవుల లక్కఇల్లు కాల్పించేసి, ఇక్కడ బట్టలు వూడదీసేసి, రాక్షసులని పంపించి నానా దరిద్రం చేస్తాడు కదా! అందుకని direct confrontation ఒకటిపెట్టి చూద్దామని పెట్టాడు. పెడితే ధృతరాష్ట్రుడు మాట్లాడడానికి ముందే దుర్యోధనుడు లేచి ఒక అష్టోత్తరం విదురుడి మీద చదివేస్తాడు. 'వీడేమిటి వీడు దాసీపుత్రుడు. మనం వాడిని మంత్రిగా చేసాము కాబట్టి, లేకపోతే వాడేమిటి? వాడి నోటికి వచ్చినట్లుగా వాడు మాట్లాడుతున్నాడు. మన కూడు తింటున్నాడు. కూడు తింటే పడి వుండాలి. వాడు చెప్పేది ధర్మమేమిటి? పైగా శూద్ర స్త్రీకి పుట్టిన వాడు. మన పంక్తిలో వుండవలసిన వాడు కాదు.' ఇలా మన భాషలో మాట్లాడితే విదురుడికి బాగా systolysis పెరిగి, మొహం కందగడ్డ అయిపోతుంది. అయిపోయి అన్నయ్య ప్రక్క చూస్తాడు అంటే రాజు పక్క చూస్తాడు. రాజు ఈ విషయంలో స్థితప్రజ్ఞుడు కదా! ద్రౌపదీదేవికి అవమానం జరిగినప్పుడు అట్లాగే వున్నాడు. లక్కగృహం దహనం అప్పుడూ అట్లాగే వున్నాడు. ఇప్పుడూ అట్లాగే

వున్నాడు. ఉంటే  అప్పుడు విదురుడికి కోపం వస్తుంది. 'ఇంత సభలో నా అంతటి వాడిని నీ కొడుకు ఇలా మాట్లాడుతుంటే నువ్వు మౌనం వహిస్తావా?' అని అప్పుడు అన్నీ వూడదీసి అక్కడ పెడతాడు. ఏవీ? తన మంత్రి పదవికి సంబంధించిన లాంఛనాలు తలపాగా, కత్తి మొదలైనవి. 'ఛీ! నీ కొలువులో నేను వుండకూడదు', అని వెళ్ళిపోతాడు. అది కృష్ణుని plan. ఇప్పుడు ఈయన్ని ఊరికే తిట్టాడు దుర్యోధనుడు. అంతేగా! దీన్ని ద్రౌపదిదేవికి జరిగిన అవమానంతో compare చేస్తే ఎంత? పాండవులకి జరిగిన అవమానంతో పోల్చి చూడండి. అప్పుడేమీ లేదా? అప్పుడనిపించలేదా? నిన్ను అంటేనే నీకనిపించింది, అది కూడా వాళ్ళతో compare  చూస్తే చాలా తక్కువ. ఊరికే తిట్టారు అంతే కదా! బట్టలూడదీయలేదు కదా! గుండుకొట్టించేసి, గాడిదనెక్కించేసి, సున్నబొట్లు పెట్టి ఆ పనేమి చేయలేదు కదా! పొమ్మని కూడా అనలేదు. ఊరికే తిట్టారు. ఏం అంత వచ్చిందేమిటి? ఎంతొచ్చింది లోపల్నుంచి? 30 ఏళ్ళపాటు మళ్లీ ఇటు పక్క రాకుండా వెళ్ళిపోయాడు. యుద్ధం అయిపోయి, కృష్ణుడు కూడా పోయాక మళ్ళీ ఇటు రాలేదు. అంతొచ్చింది. అంటే మామూలుగా పైపైన తిరుగుతూ circumference లో, ధర్మాన్ని బోధించేవారు కొందరుంటారు. బాధ్యత పడేవారు కొంతమంది వుంటారు. కృష్ణుడు బాధ్యత పడినవాడు. బాధ్యత పడిన వాడు కాబట్టి, ఎవరు వుండడం వలన శ్రేయస్సో, ఎవరు వుండడం వలన శ్రేయస్సు కాదో తెలిసిన వాడు. దానికి విదురుడొకడు అడ్డం. ఒక పెద్ద advocate అన్న మాట అక్కడ. Advocate general. వాడు మాట్లాడితే భీష్ముడు కూడా బుర్రతిరిగి, తలకాయ పట్టుకునేవాడట! ఇంక అక్కరలేదు నీవు ఆపు, అని చెబుతాడు భీష్ముడు. అంత logic వుంది అతనిలో. అంత intellectuals విదురుడు, అక్రూరుడు. అందుకని ఇద్దరికీ కలిపి పెట్టేశాడు 'విదురాక్రూరవరద' అని. వాళ్ళకి కూడా Through His presence He has bestowed the kind of life to enable them to get rid off. విదురుడు వెళ్ళిపోతాడు. అప్పుడు గానీ అది వదలదు ఆయనకి. భీష్ముడికి, ద్రోణుడికి వేరే ధర్మాలున్నాయి. వీళ్ళకి అవి లేవు. వాళ్ళ కన్నా ఈయనతో problem ఎక్కువ. భీష్ముడికి, ద్రోణుడికి యుద్ధం జరుగుతుంది, అందులో మనం చచ్చిపోవాలని తెలుసు. విదురుడు ఎంతసేపు వీళ్లంతా కలిసి వుండాలి అని. కలసి ఉండాలంటే  there must be some kind of equality. To treat two unequals as equals is the worst thing. Ignorance. అంతకన్నా అధర్మం

ఇంకొకటి లేదు. Unequalsని equals గా చూడటమనేది తప్పు. ఒకసారి సద్గురు శివానందమూర్తి గారి ఆశ్రమంకి వెళ్ళినప్పుడు జరిగిందిది. 'మా ఇంట్లో పని చేసే వాళ్లలో పెరడు ఊడ్చేవాడు, పాకీ దొడ్లు వూడ్చే వాడు లోను కూడా భగవంతుడు వున్నాడు. మీలోను కూడ భగవంతుడు ఉన్నాడు, Police Officer ఒకాయన వచ్చాడు. ఆయనికి చెప్తూ మీలోనూ భగవంతుడున్నాడు, అంత మాత్రం చేత భోజనం పెట్టినప్పుడు ఇద్దరికీ ఒకే చోట విస్తరి వేసి పెట్టకూదు. మీరిద్దరూ కలిసి తినటం వేరు. నేను పెట్టడం వేరు. Because you are not equals, ఎక్కడ? In the worldly plane. భోజనం worldly plane లోనే కదా చేస్తాము. నువ్వు చేస్తానంటావా మంచిదే. నేను పెట్టకూడదు' అని చెప్పారు.' ఒక మూర్ఖుణ్ణి, ఒక తెలిసిన వాడిని నేను సమానంగానే treat చేస్తాను. మూర్ఖునియందు దయ ఉండాలి. కానీ వివేకవంతునికి ఇవ్వవలసిన స్థానం వివేకవంతునికి ఇవ్వాలి. ఏ సందర్భంలో ఎలా చెయ్యాలో అలా చెయ్యి. వివేకవంతుడుకి ఎక్కువ విలువ ఇవ్వాలి, ఇవ్వు. మూర్ఖుడికి కావలసింది training. ఆ విధంగా treat చెయ్యాలి. మూర్ఖుణ్ణి వివేకవంతుడుని చేయాలి. కాబట్టి దానికి సంబంధించిన training ఇవ్వాలి. వివేకవంతుడుకి నువ్విచ్చే training ఏమీ లేదు. ఆదరణే! అదీ, సరి అయిన సమత్వమవుతుంది.' అలా దుర్యోధనుడి యొక్క మూర్ఖత్వానికి, ధర్మరాజు యొక్క మంచితనానికి రెండింటికి treatment equal గా ఇస్తానంటే ఎలా? విదురుడికి తనకి తగిలింది కాబట్టి తెలిసింది, అంత వరకు తెలియలేదు. అటువంటివి ఎన్ని తగిలినాయి ధర్మరాజుకి. ౨౦ సంవత్సరాలలో విపరీతమైన దెబ్బలు తగిలాయి. శరీరమంతా పుళ్ళే. దెబ్బ మీద దెబ్బ. అయినా అతను మౌనంగా వున్నాడు. ఈ విదురుడేమిటి ఊరు వదిలి వెళ్లిపోయాడు అనిపిస్తుంది. వెళ్ళిపోయి 36 సంవత్సరాలు అరణ్యాలలో తిరుగుతాడు. అప్పటికి కృష్ణుడు వెళ్ళిపోతాడు. అందరూ వెళ్ళిపోయారు. ఉద్ధవుడు కనిపిస్తే, కృష్ణుడు ఎట్లా వున్నాడు? అని అడుగుతాడు. మనల్ని వదిలి వెళ్ళిపోయాడు. మనలో వుంటే మనము ఏమాత్రం గుర్తించాము కనుక? మనలో ఒకడు అనుకున్నాము. కాదు, మనలో ఒకడు కానేకాదు. మనం సముద్రంలో చేప పిల్లల్లాంటి వాళ్ళం. ఇది భాగవతంలో ఇచ్చిన చాలా మంచి ఉపమానం. మనమంతా సంసారమనే సముద్రంలో చేపల్లాంటి వాళ్ళం. ఆయన ఆ సముద్రం మీద తేలుతున్న నావ లాంటివాడు. సముద్రంలోని సంసారంలో వున్న విషయాలకి, నావకి ఏమి సంబంధం లేదు. మనం లోపల

వున్నాం, ఆయన బయట వున్నాడు. అయినా మనతో ఉన్నట్లుగా గోచరించాడు. అంటే మనం సముద్రంలో తిరుగుతున్న చేపలట! పడవ సముద్రంలో తేలుతూ, సగం నీళ్ళలో మునిగి ఉంది. అది చూసి చేపలు మనలాగే మరో పెద్ద చేప అని అనుకుంటాయిట, ఆ సగం నీళ్ళలో మునిగి ఉన్న నావను చూసి. మనలాంటివాడే ఆయన అనుకున్నారు. మనతోపాటే, కాకపోతే మనకన్నా కాస్త పెద్దవాడు, అనుకున్నారు. అది కాదు. ఆయనకి సముద్రంతో సంబంధం లేదు. ఆయన సముద్రంలో తేలి ఉండగలడు. ఆయన సముద్రంలో వుండగలడు, ఒడ్డున వుండగలడు. మనం సముద్రంలో నుంచి బయటకు వస్తే చచ్చిపోతాము. మనకీ ఆయనకీ చాలా తేడా వుంది. వూరికే మనతో తిరగడానికి వచ్చాడు తప్ప మన వాడు కాదు, అని చెబుతాడు ఉద్ధవుడు. విదురుడికి చాలా కష్టం అనిపిస్తుంది. ఉద్ధవుడు కృష్ణుడు యొక్క దివ్యస్థితి చెబుతాడు. మనం కూడా సామాన్యులం కాదు. మనం కూడ కారణం జన్మలము కాకపోతే గురువుగారి దగ్గర ఎందుకు ఉంటాము? అని అంటాడు. విదురుడు అంటాడూ, అదంతా బాగానే వుంది కానీ అప్పుడు రాయబారానికి వచ్చినప్పుడు ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు వాళ్ళంతా వాళ్ళింటికి ఆతిధ్యానానికి రమ్మంటే వెళ్ళక, అతి సామాన్యుడనైన మా ఇంటికి వచ్చాడు. ఎందుకు వచ్చాడూ? అంటాడు విదురుడు. అప్పుడు ఉద్ధవుడు ఎందుకు వచ్చాడు మీఇంటికి? దుర్యోధనుడు ఎంత క్రూరుడో, ఎంత దుష్టుడో, ఎంత వెధవో. వెధవలింటికి వెళ్ళలేక మరేంచేస్తాడు? నువ్వు మంచివాడవని నీ ఇంటికి రావడం కాదు. వాళ్లు వెధవలని నీ ఇంటికి వచ్చాడు అని చెబుతాడు. ఊర్లో తొమ్మిదిమంది వెధవలు ఉన్నారు పదిమందిలో. అంటే పదోవాడు మంచివాడని కాదు, అంతే! కాబట్టి వచ్చాడు నీ ఇంటికి తప్ప, నువ్వేదో అంతకన్నా అనుకోబోక అని చెబుతాడు. అంటే ఆ మాట చెప్పకుండా అంత చెబుతాడు. ఆ ప్రశ్నకి సమాధానం వుండదు. ఎందుకొచ్చాడు నా ఇంటికి? అన్నదానికి. నా ఇంటికి ఎందుకు వచ్చాడు? అన్న దానికి వీళ్ళందరూ ఎటువంటి వారో చెబుతాడు. అంతే సమాధానం! తరువాత విదురుడు కూడా ఏమీ మాట్లాడడు. అక్కడికి వెళ్ళకూడదు కాబట్టి నీ ఇంటికి వచ్చాడు కానీ, నీకు ఏ విధమైన preference ఇచ్చి రాలేదు. He did not prefer to come, but because He has no other choice. అప్పుడు తెలుస్తుంది. తెలిసి బాధపడతాడు. అప్పుడు ఉద్ధవుడు తనకు జరిగిన దర్శనమును చెబుతాడు. నీ సంగతి అలా వుంచు. నేను చిన్నప్పటి నుంచి, from childhood

వున్నాను. ఏమీ అంతుపట్టలేదు చివరికి కూడా. నువ్వు పట్టుకోవలసింది వేరొకటి వుంది, అన్నాడు. నాకు అది అక్కరలేదు, ఇదే కావాలి, అన్నాను. ఏడ్చాను గోల చేశాను ఇదే కావాలని. అయినప్పటికీ ఆయనకి నా మీద వుండే కరుణ కారణంగా నాకు 'అది' చూపించాడు. అప్పుడు మైత్రేయుడు కూడా వున్నాడు. నీకు కూడా చూపించాలని, 30 ఏళ్ళపాటు వేచి వున్నాడట. నాతో చెప్పాడు. అంటే అప్పుడు గొల్లుమని ఏడుస్తాడు విదురుడు. అప్పటికి గానీ ఈ తెలివితేటలు అనే స్థితి కరగదు. కరిగి అప్పుడు ఏడ్చి, నా సంగతేమిటి? అంటే ఉద్ధవుడు అతడు పరిపూర్ణంగా పశ్చాత్తాపపడ్డాడని చూసి, నీకు ఇప్పుడు past మీద ఏ విధమైన భ్రమ/ grip లేదు కాబట్టి ఇప్పుడు నీవు అర్హుడివి. కాకపోతే ఇదంతా నాకు అనుభూతిపరంగా మాత్రమే తెలుసు కనుక, నేను బాగా చెప్పలేను. చెప్పే ఆయన  ఒక ఆయన ఉన్నాడు. ఆయన దగ్గరికి తీసుకొని వెళ్తాను, అని మైత్రేయుని వద్దకు తీసుకెళ్తాడు. ఉద్ధవునిది అనుభూతి. మైత్రేయునిది అనుభూతితో కూడిన వికాసం. ఆ వికాసానికి నియమింపబడిన వాడు మైత్రేయుడు. ఈ 36 సంవత్సరముల పాటు విదురుడికి లోపల, 'పిలిపించి ఉద్యోగం తీయించేసాడు' అని వుంటుంది. మామూలుగా అయితే పోయేది కాదు. కావాలని తీసుకొచ్చి నాకు ఉద్యోగం ఊడగొట్టించాడు కదా కృష్ణుడు, అని వుంటుంది. అదంతా పోదు. ఆ విధంగా ఇన్నాళ్ళు కృష్ణ ధ్యానం జరిగింది. అప్పుడు కృష్ణుడు చెబుతాడు. నన్నలా 30 ఏళ్ళ పాటు నిరంతరం ధ్యానిస్తున్నాడు. వాడికి మాత్రం ఎందుకు న్యాయం చేయకూడదని, వాడు కూడా వస్తాడని చూశాను. ఇంకా reaction లో వున్నాడు, నేను పోయాక గాని వాడికి reaction పోదు. అప్పుడు మీరు చెప్పండి, అని చెబుతాడు. ముదురు అంటాము కదా, ఈ అక్రూర విదురులు అటువంటి intellectuals. కనుక వాళ్ళ intellectualism నుంచి వాళ్లని రక్షించడానికి ఇంత చేస్తాడు కృష్ణుడు. ఎటువంటి వాడైనా సరే, ఏ భావంతో ఉన్నా సరే, స్మరణ బాగా జరుగుతుంటే, బుద్ధి వికాసం పెరుగుతూ వుంటే, లోపలవున్న భగవంతుడు పెరుగుతాడు. మూడడుగులు వేసాడుట. అక్కడికి వెళ్ళిపోయాడట. ఇక్కడికి వెళ్ళిపోయాడట. వీటి వలన మనకేం లాభం లేదు. మనలో పెరగాలి. మనలో మూడడుగులు వేసి మూలాధారంలోకి వచ్చేయాలి. హృదయం వరకు వుంటాడు భగవంతుడు. అక్కడి నుంచి మణిపూరకం, మణిపూరకం నుంచి స్వాధిష్టానం, స్వాధిష్టానం నుంచి

మూలాధారం.ఈ మూడడుగులు వేసాడనుకోండి చక్రాల మీద, అప్పుడు చక్రవర్తులమవుతాము మనం. He functions through us.

## 160,161- వామనః, ప్రాంశుః

ప్రాంశుః అన్న పదానికి అర్ధం మరుగుజ్జులా మొదలై త్రివిక్రముడవుతాడు. ఈ కథ మనలో జరగాలి. ఈ కథ మనలో జరగడం చాలా ముఖ్యం. జరిగితే మళ్ళీ mind gains its own original splendour. అంటే Plan of work. ఏమిటి ఆplan of work? అంటే, the Plan is Divine Plan, and the work relates to Him. "నా ప్రణాళికను దివ్య ప్రణాళికగ వ్యాప్తమై" విశ్వమూర్తి రూపంబునందు నిలుచుగావుత శాశ్వత నిలయమగుచు. దీని గురించి ధ్యానం చేయండి. స్వంత ప్రణాళిక పోయి దివ్య ప్రణాళిక నిలుస్తుంది. మనం విష్ణుమూర్తియందు జీవిస్తాము. ఎందుకంటే విష్ణుమూర్తి మననంతా ఆక్రమించేసాడు కాబట్టి. ఇంకేంలేదు కదా! ఎక్కడ పెట్టమన్నావు అని అడిగాడు. అంటే నెత్తి మీద పెట్టాడు కదా! అప్పుడు బలి క్రిందకెళ్ళి మొత్తమంతా విష్ణువే అయిపోయాడు కదా! అప్పుడు ఇంద్రుడు మళ్ళీ function చేయడం మొదలు పెట్టాడు. ఇది, మనకి మామూలుగా భోగినాడు చెప్పుకుంటారు. ఉత్తరాయణం వచ్చే ముందు ఈ ఉపాఖ్యానం చెప్పుకోవాలని. ఎందుకు చెప్పుకోవాలి ఈ ఉపాఖ్యానం? ఉత్తరాయణం నుంచి మళ్ళీ వెలుగు పెరుగుతూ వుంటుంది. అంతవరకూ చీకటి పెరుగుతూ వుంటుంది. అక్కడి నుంచి వెలుగు పెరుగుతూ వుంటుంది. కాబట్టి చీకటిని తగ్గి వెలుగు పైకి రావడం క్రింద, ఈ కథగా చెప్పుకోమన్నారు. మనలో కూడా ఆ చీకట్లు తగ్గి, వెలుగు పెరగాలని చెప్పుకోవాలి. చెప్పుకుంటే వామనుడు త్రివిక్రముడవుతాడు. ఆజానుబాహువుడు అవుతాడు. అంతా ఆక్రమించి ఉంటాడు. అలా ఆక్రమించి వున్నట్లయితే ఇక అక్కడ నుంచి కథ వేరుగా వుంటుంది. ఈ మూడు నామాలలో మనకి ఒక మనిషి భగవత్ దర్శనానికి చేరుకోడానికి మధ్యలో జరిగే కథలో ఆయన యొక్క స్మరణ కారణంగా బుద్ధి వెలుగుతుంది. బుద్ధివెలగడం కారణంగా భగవంతుడు ఎక్కువ వ్యాపనం చెందటానికి అవకాశము ఉంటుంది. అది కారణంగా మనం తక్కువయి ఆయన పెరుగుతాడు. వామనుడు త్రివిక్రముడయితే మనం వామనుడు అవుతాము. మనం చిన్నవాళ్ళమవుతాము. అందుకని సహజంగా చిన్నవాళ్ళుగా, వినయంగా, గుప్తంగా తెలియకుండా వుంటారు మహాత్ములు. వాళ్ళ ప్రణాళికను బట్టి వ్యక్తత పెరగవచ్చు కానీ, ఇలా ప్రకటమయిన వాళ్ళ కన్నా, ప్రకటం కాని వాళ్ళు ఎంతో మంది పరిపూర్ణమైన

మానవులు ఈ భూమి మీద వున్నారు. ఎందుకంటే వాళ్ళకి ప్రకటనం అవటం, కాకపోవడంతో సంబంధం లేకుండా భగవంతుని ప్రణాళికలో participate చేస్తారు. Simple గా చెప్పుకోవాలంటే, మనకి Master E.K, Master CVV అంత తరచుగా Master M.N గుర్తు రారు. కొంతమందికి ప్రకటనయ్యే కార్యక్రమాలు వుంటాయి. కొంతమందికి ప్రకటన కాకుండా అంత కార్యక్రమమూ వుంటుంది. MN గారు తన ఫోటో కూడా దొరక్కుండా చూసుకున్నారు. MN గుర్తేరారు. ఎవరు కొంచెంగా వున్నారో వాడిని పట్టుకుంటే పెద్దవాడ్ని చూపిస్తాడు. అందుకని గుర్తించడమనేది మనలో వున్న నిశ్శబ్దత స్థితిని బట్టి వుంటుంది తప్ప, డప్పు కొడుతుంటే శబ్దాన్ని గుర్తుపట్టడం కాదు. నిశ్శబ్దంలో శబ్దాన్ని గుర్తుపట్టినవాడు ధన్యుడు. అది మాస్టర్ EK చేశారు. మాస్టర్ EKకి MNకి ఏమిటి సంబంధం? మాస్టర్ EK ప్రతి ప్రార్థన లోనూ ఎందుకు మాస్టర్ MN ని పిలిచారు? ఏమైనా ఎక్కడైనా పుస్తకాల్లో గాని, మాస్టారు చెప్పినదానిలో గాని వుందా? ఎందుకు మాస్టర్ MN ని invoke చేశారు? కనబడ్డది CVV మన భాషలో చెప్పుకోవాలంటే after all CVV గారి శిష్యుడే కదా MN అనిపిస్తుంది. మనకి direct గా CVV గారే కనబడ్డారు. ఇంక MN తో మనకేమి పని? ఎందుకు MN గారిని పిలిచిన తర్వాత CVV గారిని పిలిచారు మాస్టారు? ఎప్పుడైనా ఆలోచించారా? అసలు MN గారి photo పెడదామని ఎవరికీ అనిపించదు ప్రత్యేకించి చెబితే తప్ప. M.N. గారి పేరు రాద్దామనుకోరు. E.K., C.V.V. పేర్లు ఈ మూల ఆ మూల వ్రాసి వూరుకుంటారు. అంటే అది మన తప్పని కాదు. That is how He decided. దొరక్కుండా పనిచేశారు. అయినప్పటికీ గుర్తించారు మాస్టారు. అదీ గొప్పతనం. Master EK's beauty is in recognizing the light wherever it is and not speak about it. మూడు రకాలు వుంటారు. ఏమి చూడకుండా అన్నీ చూసినట్లు మాట్లాడడం, చూసి చూసిందాని గురించి మాట్లాడడం, చూసి మాట్లాడకుండా వుండడం. మాస్టర్ గారు అది! అన్నీ చూసి, అన్నీ తెలుసుకుని, ఏమీ మాట్లాడకుండా పనిచేశారు మాస్టారు. కొంతమంది అన్నీ చూస్తూ, అన్నీ చెబుతూ పనిచేసుకుంటారు. M.N. గారి గురించి ఎవరూ కూడా అడగనూ అడగలేదు. C.V.V. గారు కదా కనిపించారు. M.N. గారి పేరు prayer లో ఎందుకు ఇచ్చారు? ఎవరైనా అడిగారా? అదీ మాస్టారు. ఆయన చూడగలిగారు. There are many more grand lights who are

functioning without being known to us. There are grand lights functioning known to us. వీళ్ళు కావాలనుకుని మనకి తెలియాలనుకున్న వాళ్ళు కాదు. కాబట్టి వాళ్ళ ప్రణాళికలో భాగంగా వాళ్ళు తెలుస్తారు. తెలియని వాళ్ళు, వాళ్ళ ప్రణాళికలోని భాగంగా వాళ్ళు తెలియరు. తెలియనివాళ్ళు అలా పనిచేస్తుంటారు. తెలుపబడిన వాళ్ళు ఇలా పనిచేస్తుంటారు. అందరిలోనూ చూడగలిగిన వాళ్లు ఎవరయ్యా అంటే, వాళ్లతో పూర్తిగా నిండగలిగిన వాళ్ళే! మాస్టరుగారు నడిచి వస్తుంటే నర్మదా నదీతీరంలో, ఒక తేజోరూపం నడిచి వస్తున్నదని భక్తరాజ్ మహారాజ్ గారు చెప్పారు. మొత్తం. లోపలేదో మిణుకు మిణుకుమంటూ వుంటే చూడడం కాదు. మొత్తమంతా ఒక తేజోరూపం నడిచి వస్తున్నట్లుగా చూశారుట, ఆశ్చర్యపోయారు. అమాంతం లేచారు. మనకేం తెలియదు. మన మధ్య తిరిగితే అది ఏ రూపమో మనకేం తెలియదు. ఎందుకు చెప్తున్నానంటే వాళ్ళ యొక్క స్థితి ఎలా వుంటుందో అని. అదే ఉద్ధవుడు చెబుతాడు శ్రీకృష్ణుడి గురించి. మనతో వున్నాడు తప్ప మనవాడు కాదోయ్ అని. మనతో వున్నాడు లోపల. మనవాడు కాదు. మనవాడే! ఎప్పుడూ? గుర్తు తెచ్చుకున్నప్పుడు. లేకపోతే ఆయనకి మనతో ఏమి సంబంధం? వుంటాడు. వుండటం వలన ఏమి జరుగుతుందంటే మననం చేత వ్యాపనం చెందుతాడు. అంటే ఆయన్ని స్మరించడంతోనే, switch వేసినట్లు అవుతుంది. స్మరణ చేత బుద్ధి పెరుగుతుంది. బుద్ధి వెలిగినందు వలన వెలుగు వ్యాపనం చెందుతుంది. ఒకసారి light వెలిగితే ఆ tubelight చుట్టూ ఏమీ వుండదు కదా! ఇదంతా వచ్చింది కదా! అలా మొత్తం ఇల్లంతా కూడా మూడు లోకాల్లోనూ వెలిగిస్తాడు. ఆ వెలుగులో పని చేసుకుంటే దిగి వస్తాడు. ఇది ఈ మూడు నామాలు ఉపేంద్రుడు, వామనుడు, ప్రాంశు. ఈ మూడు నామాలూ ఇలా 3 steps లాగ ఒక పద్ధతిలో కలిపి ఉంటాయి.

## 162,(116) అమోఘః

అమోఘ అంటే ఏది జరిగినా దానిలో ఒకటి నిర్దేశింపబడి వుంటుంది. ఒక ఉపదేశముంటుంది. భగవంతుడితో మనం కార్యక్రమాల్లో వున్నప్పుడు మనకి ఏవో జరుగుతుంటాయి కదా! మంచీ-చెడూ రెండూ కూడా. అందులో ఉద్దేశింపబడనిది ఏదీ లేదు. మన మంచికి, మన పురోగతికి, మన యొక్క ప్రయాణానికి, ఉద్దేశింపబడే వుంటుందిట ప్రతి విషయం కూడా. ఉద్దేశింపబడవు అని వుండదు. దాన్ని చూడగలగడం అనేది, ఈ మూడు steps అయిన వాళ్ళకి తెలుస్తుంది. అది కూడా బలిచక్రవర్తి కథలో మనం చూడవచ్చు. 'అన్యాయం కదా! మా ఆయన్ని అట్లా తోసేశావు', అన్నట్లుగా చూస్తుంది బలి చక్రవర్తి భార్య. అలా ఆకాశంలో చూస్తే, ప్రహ్లాదుడు కూడా నా మనమడు, బొత్తిగా కాలేసి మట్టేశావు అన్నట్లుగా భావన, మాట్లాడడు. బాధవేస్తుందన్నమాట. దేవుడు చూసి నవ్వుతాడు. 'ఇతనేమిటి ఇతను నాకు కావలసిన వాడు, నాతో పట్టుకుపోతున్నాను. ఇంద్రుడికి ఇంకోటి కావాలి, అది ఇంద్రుడికి ఇచ్చేస్తున్నాను' అంటాడు. 'సుతలం' అంటే భక్తికి సంబంధించిన లోకము. భక్తి అంటే, విభక్తి లేని చోట భక్తి వుంటుందని చెప్పారు భక్తరాజ్ మహారాజ్ గారు. ఎక్కడ branch from God వుంటుందో, branching of separativity, దేవుణ్ణుంచి separate అయి ఉండటం అది విభక్తి అన్నమాట. భక్తులు అంటే ఎవరుట? ఎప్పుడు భగవంతుని అంటిపెట్టుకుని, araldite వేసి అంటించేసుకున్నట్టుగా. భగవంతునితో ఒకటై పోయినవాడు భక్తుడు. అందుకని ఆయనను 1+1=1 అన్నారు. అదీ సుతలం! భక్తుల లోకం! ఆయనతో ఇమిడిపోయిన లోకం. కుర్చీ కావాలా? ఆయన కావాలా? ప్రహ్లాదుని పక్క అట్లా చూశాడు. 'నువ్వు అదే కదా చేశావు, నీ మనవడికి అదే ఇచ్చాను నేను, ఏమిటి నీ complaint?' అంటాడు. బలిచక్రవర్తి భార్య కూడా సంతోషిస్తుంది. ఆయనకిది అఖ్కర్లేదు. దీని మీద మోజు తీరిపోయింది. సింహాసనం మీద పట్టులేదు. పట్టు వుంటే, శుక్రాచార్యుడు చెప్పాడు కదా! 'వద్దురా వచ్చినవాడు సామాన్యుడు కాదు' అని. 'ఎప్పుడూ ఎవరినీ ఏది అడగనివాడు నన్ను వచ్చి అడిగే స్థితికి నేను వచ్చానంటే చాలు నాకది.' అని అంటాడు. చాలు ఇంకేమీ అక్కర్లేదు, అంటాడు.The very virtuous practice he is carrying out has released himself from everything. మాస్టారుగారు అదే అంటూ ఉంటారు, సన్యాసం

వచ్చేది కానీ, పుచ్చుకునేది కాదు అని. వైరాగ్యం వచ్చేది కానీ, పుచ్చుకునేది కాదు. ఎలా వస్తుంది? ఇది పెంచుకుంటుంటే అది పడిపోతూ వుంటుంది. మనకి priorities వేరేగా పెట్టుకొని, ఇది కూడా వుంటే అన్నీ అలా ఉంటాయి. ప్రతిదీ వుంటుంది. అన్నీ అన్ని ప్రక్కలా కదలకుండా స్తంభాల వలె వుంటాయట. ఇది priority అయిన వాడికి అవే పడిపోతూ వుంటాయి. వదిలించుకోనఖ్ఖరలేదు. ఈ వదిలించుకోవడం బాధ. అలా వాటంతట అవే తగ్గి వాటి యందు grip అటు పెరుగుతుంది. కాబట్టి, ఆయనతో ఒకటైపో చాలు. అదీ సుతలంలో వుండడం అంటే. మాస్టారుగారు రాశారు దీనినే It is a plane of భక్తి అని. భక్తి అంటే దేవునితో విడిపడని స్థితి. పీకినా రాడు అందులోంచి. ఎందుకురా ఎప్పుడూ అక్కడే ఏడుస్తావు అంటే ప్రహ్లాదుడు ఎన్ని, 4 పద్యాలు చెబుతాడు? మూడు సీస పద్యాలు, ఒక కంద పద్యం చెబుతాడు. పొరపాటున అడిగాననేటట్లుగా చెబుతాడు. ఇంకా ఆయనకి అర్థం కాకపోతే, పందికి సుగంధాల వాసన తెలుస్తుందా, అని కూడా చెబుతాడు. అలా అందులో ఇమిడి పోవడం జరుగుతుంది. అంటే ఏమిటి? ఇంత కార్యక్రమంలో కూడా అటు dimension వుంటుంది. మాస్టారు ఈ అమోఘ తత్వాన్ని చాలా దాంట్లో చూపించారు. జయ విజయుల్ని శాపం పెట్టిన సందర్భంలో ఎవరు ఎవరికి శాపం పెట్టినట్లో చూపించారు. వృత్రాసురుడు-ఇంద్రుడు వీరిలో ఎవరు తన భక్తుడు? Dimensions. అవన్నీ ఏమిటంటే in every seeming punishment, there is a blessing event. అదే జ్వాలాకూల్ గారు, 'Let the pain bring due reward of light and love' అన్నారు. ఒక కష్టం నీకు వచ్చిందంటే అందులో నుంచి చాలా వెలుగు, చాలా ప్రేమ అనే తత్వాలు బయటికి వస్తాయి. బాగా సుత్తి దెబ్బలు తిన్న తర్వాతే ముద్దవుతుంది అంతా. కాబట్టి painని invite చేయఖ్కర్లేదు. వస్తే దాంట్లోంచి ఇవి కూడా వస్తాయి. అది అమోఘమనేటటువంటి దానిలో దర్శనము. In every difficult situation there is a silver line. కారుమబ్బుకి కూడా అంచుల్లో సూర్యుడి వెలుగుంటుంది. అలా చూసే ఒక తత్వం వుంది. మనకి ప్రపంచ యుద్ధం వచ్చిందనుకోండి. అందులో మంచిని చూడడం. భారతయుద్ధం రాకూడదనుకున్న వాళ్ళు కొందరు. రావడంలో మంచిని చూసిన వాళ్ళు మరికొందరు. ఏం జరిగినా అందులో మంచిని చూస్తారు. మీరేం అనుకోండీ గానీ నాకు Hitlerలో మంచిని చూశాను అని చెప్తారు అక్కడక్కడా పుస్తకాలలో జ్వాలాకూల్ గారు. మనం రావణుడు మంచివాడు

కాదనుకుంటాం. కానీ రావణాసురుడి వలన కదా రామాయణం, రాముడు మన భూమి మీద తిరగడం. అలా చూసే వాళ్ళుంటారు. నాలుగు దెబ్బలు తింటే తిన్నాం, అనుభూతి దక్కిందన్నట్లుగా ఉంటుంది సృష్టి. ఎప్పుడూ ఒక నిమిత్త కారణంలో భగవంతుడు ఉద్దేశించిందేమిటి అని చూసేది ఒకటి వుంటుంది. మాస్టారుగారు వెళ్ళిపోయేటప్పుడు నిమిత్త కారణం గురించి చెప్పారు. ఒక మంచి పని జరగడానికి నిమిత్తాలుగా కొన్ని వస్తాయి. మనం అనుకున్న చెడ్డపని, మనం అనుకున్న మంచిపని మనకున్న standard ని బట్టి దాన్ని నిర్ణయం చేస్తాం తప్పా సృష్టిలో ఏదీ కూడా ultimate analysis లో అంతా మంచికే వుంటుంది. పుండు తీసేయాలి అనుకోండి ఒంటిమీద, లేకపోతే ఒళ్ళంతా కుళ్ళిపోతుంది. కత్తితో పుండును కోయడం మాత్రమే అనుకుంటే మంచి పనిగా అనిపిస్తుంది. దేనికోసం కోస్తున్నారు? For the general good. General good కి past sacrifice అనేది ఒకటుంటుంది. ఇలా జరిగే ప్రతి దాంట్లో కూడా భగవంతుని యొక్క ప్రణాళిక ఏమిటి? Nothing happens without a purpose. కష్టంలో కూడా purpose చూసుకునే వాళ్ళు ఉంటారు. సుఖంలో purpose ఏమి చూస్తాము? సుఖపడడమేగా! అన్నింటిలో కూడా భగవంతుని యొక్క ఉద్దేశము గుర్తించడం అనే తత్త్వం చాలా అమోఘంగా వుంటుంది. ఒక్కోసారి విమానం ఎక్కుదామనుకుంటే tire puncture అయిపోయి మనం విమానం ఎక్క లేదనుకోండి, ఆ విమానం పడిపోయింది అనుకోండి, మొదట విమానం ఎక్కలేదని ఏడుస్తాం, పడిపోయిన తర్వాత భగవంతుడు మనని కాపాడాడు అనిపిస్తుంది. విమానంలో వున్న వాళ్ళ సంగతి ఏమిటి? నిన్ను కాపాడాడు. వాళ్ళనేం చేశాడు? వాళ్లకీ ఉంటుంది అట్లాగే programme. అది కూడా తెలుసుండడం భగవంతుని యొక్క అమోఘత్వం! అదే అర్జునుడికి చెప్తాడు. అందరూ ఎక్కడికి పోరు. అందరూ నా వాళ్ళే. అందరూ నాలోనే వుంటారు. నేను మార్చుకుంటూ వుంటాను. క్రిందికి పట్టుకొస్తాను. పైకి తీసుకు వెళుతుంటాను. దీని గురించి ప్రత్యేకంగా events, మనకి రాముడి జీవితం లో, కృష్ణుడిజీవితం లో , మహాత్ముల జీవితాలలోనుంచి, ఈ అమోఘత్వం అనే తత్త్వాన్ని మనము గమనించవచ్చు. ఈ తత్త్వాలన్నీమనలో ఉన్నాయి, సృష్టిలోనూ ఉన్నాయి. సృష్టిలో చూడటం, మనలో చూడటం, మనలో లేకపోతే పెంచుకోటం. మనలో లేకపోటము ఉండదు. మనలో బీజప్రాయంగా ఉంటె వాటిని వృద్ధి చేసుకోవడం, ఇట్లా వుంటుంది మనవిష్ణు సహస్రనామ

కార్యక్రమం. అమోఘ అంటే సృష్టిలో జరిగే కార్యక్రమాల్లో భగవంతుని యొక్క అస్తిత్వమునందు పొరపాట్లు వుండకపోవడమనే ఒక స్థితి. ఒక తత్త్వం. భగవంతుని యొక్క పనులలో మనకి అవగాహన లేదు కానీ తప్పు వుండదు. మహాత్ములు చేసిన కార్యక్రమాల్లో కూడా మనకి అవగాహన వుండకపోవచ్చును గాని తప్పులుండవు. మనకి అవగాహనలేక తప్పు చేశాడేమో అని మనం అనుకుంటూ వుంటాము. మనకి మామూలుగా ఇతరులను నిర్ణయం చేసేటటువంటి బుద్ధి ఒకటి ఉంది. మహాత్ములకి అది ఉండదు. భగవంతుని విషయంలోనూ, మహాత్ముల విషయంలోనూ నిర్ణయాలు చేసామనుకోండి, అది మన యొక్క చిన్న బుద్ధికి తార్కాణము తప్ప, భగవద్ తత్త్వములో జరిగే ప్రతిదానికీ కూడా ఒక మంచి వుంటుంది. కనబడే apparent wrongలో ఒక real right వుంటుంది. బయటకి సవ్యంగా కనిపించకపోవచ్చు. లోపల అంతరాంతరాలలో దాని యొక్క ఉపయోగం, దాని యొక్క నిర్దిష్టమైన కార్యక్రమము, దాని యొక్క ప్రణాళిక వుంటుంది. ఇది మనకి మామూలుగ భాగవతుల జీవితాల్లో ఎక్కువగా కనిపిస్తూ వుంటుంది . కొన్ని కష్టంగా ఉన్న సన్నివేశాల నుంచి మనిషి ఉద్ధరింపజేయడానికి పనికి వస్తాయి. సుఖముగా ఉన్న శాన్నివేశాలు కొన్ని కష్టముగా ఉన్న సన్నివేశాల లోంచి మనిషి ఉద్ధరింపబడతాడు. కష్టముగా ఉన్నపుడు దేవుడు మనని అనుగ్రహించడం లేదు, అని మన మనుకుంటాము. దేవుడు గట్టిగా అనుగ్రహిస్తే కష్టాలు రావచ్చు కూడా. Perfection cause-forth imperfection to the surface అన్నారు. అందుకని భగవంతుని యొక్క అనుగ్రహం కలగడం అంటే మనలో వున్న చైతన్యం ఇంకొంచెం ఎక్కువగా వెలగడం లేక ఆవిర్భవించడం. అంటే అగ్నికార్యం జరుగుతూ వుంటుంది. అగ్నికార్యం జరిగితే లోపల వున్నవి కొన్ని కాలిపోతాయి. అందుచేత కాలిపోతున్నప్పుడు కష్టంగా వుంటుంది. జ్వరం వచ్చినప్పుడు కష్టంగా వుంటుంది. కానీ జ్వరం అనేది అగ్నికార్యమే కదా! దానివలన దేహంలో ఉన్న మాలిన్యములు కొన్ని నిర్మూలించబడతాయి. జ్వరం వచ్చి తగ్గిన తరువాత మనిషి చాలా ఎక్కువ సున్నితంగా కనిపిస్తూ వుంటాడు మామూలుకన్నా. అంతకుముందు ఉన్న మాలిన్యములన్నీ జ్వరం ద్వారా eliminate చేయబడ్డాయి కాబట్టి, మనిషి ఎక్కువ పవిత్రంగా కనిపిస్తాడు. ఒక జబ్బులో నుంచి బయటికి వచ్చిన వాడు అలా కనిపిస్తాడు. ఒక jaundice లో నుంచి బయటకి వస్తే చాలా బాగుంటాడు. రక్తమంతా కూడా శుభ్రంగా పరిశుద్ధి చేయబడుతుంది కాబట్టి . ఇట్లా

జరుగుతున్నటువంటి భగవంతుని యొక్క కార్యక్రమంలో మనకి కనిపించేవి, జరిగేవన్నీ అంత బాగున్నట్లు అనిపించవు. ఒక యుద్ధం వచ్చిందనుకోండి. యుద్ధం ఎందుకు రావాలి? అనిపిస్తుంది. ఒక తుఫాను వచ్చిందనుకోండి. తుఫాను ఎందుకు రావాలి? అనిపిస్తుంది. ఒక భూకంపం వచ్చిందనుకోండి. భూకంపం ఎందుకు రావాలి అనిపిస్తుంది. ఇటువంటివన్నీ జరిగినప్పుడు కొంత adjustment జరుగుతూ వుంటుంది. ఈ అమరికలు జరుగుతున్నప్పుడు మనబోటివారికి వాటి యొక్క పన్నా తెలియక ఇందులో ఏదో పొరపాటు వున్నదనుకుంటాము. అగ్నిపర్వతం పగిలి, లేదా భూకంపం వచ్చి చాలామంది చనిపోయినప్పుడు, భగవంతుని నిందిస్తూ చాలా papersలో వచ్చింది. ప్రకృతి యొక్క విలయ తాండవం, ప్రకృతి యొక్క రాక్షసత్వం—అలావుండవు. There is an adjustment. ఈ adjustment తెలిసిన వాళ్ళు ఇందులో ఉన్న అమోఘత్వాన్ని చూస్తూ వుంటారు. ఇంద్రజిత్తుతో యుద్ధం చేస్తూ లక్ష్మణుడు మూర్ఛపోయాడు కదా! అదే మనమయితే అయ్యో! అని గోల పెట్టేస్తాము. లక్ష్మణుడి మూర్ఛ ఎంతమందికి ఉపయోగించింది? లక్ష్మణుడి మూర్ఛ కారణంగా సంజీవినీ పర్వతం తీసుకురాబడింది. సంజీవినీ పర్వతం తేవడం కారణంగా అంతకు ముందు చనిపోయిన వానర సైన్యమంతా బ్రతికారు, కేవలం లక్ష్మణుడు ఒక్కడే కాదు. అందులో భగవంతుని యొక్క అమోఘత్వం కనిపిస్తుంది కదా! రాముడికి పట్టాభిషేకం జరగనప్పుడు, అరణ్యవాసానికి పంపించబడినప్పుడు, ధర్మసంస్థాపన కోసం సమస్త కార్యములు దాని నుండి నిర్వర్తించడము జరిగింది. కాబట్టి మనకి మొట్టమొదట చూస్తే చాలా కష్టంగా వుంటుంది. ఇలా జరగకూడదు. ఇలా జరగడం చాలా తప్పు. విధి చాలా క్రూరంగ ఉందని అనిపిస్తుంది మనకి. ఇది ఘోరంగా వుందని అనిపించడం మన కళ్ళకి తప్ప, జరిగే సన్నివేశాల్లో సూక్ష్మమైన బుద్ధితో అవగాహన చేసుకున్న వారికి అందులో వున్న భగవంతుని యొక్క లీల కనిపిస్తుంది. దానినే అమోఘత్వం అంటారు. ఒక చెడులో నుంచి కొంత మంచి తీసుకొస్తుంటారు. Hitler రెండో ప్రపంచ యుద్ధం నిర్వహించినప్పుడు దాని వలన మంచి కూడా జరిగింది. అందుకని మన పరిధిలో కనిపించే సన్నివేశాల్ని బట్టి మొత్తం నిర్ణయం చేయడం అనేది అజ్ఞానులు చేసే పని. తెలియనివారు చేసే పని. ఈ పరిధిలో జరిగిన కార్యక్రమములన్నింటికీ అంతర్లోకములో వున్న కారణములు తెలుసుకోగలిగినట్లయితే భగవంతుని యొక్క అమోఘత్వం

తెలుస్తుంది. జరుగుతున్న వైపరీత్యములలో ఉద్దేశింపబడిన మంచిని తెలుసుకోవాలి. అది మహాత్ములు చేసే కార్యక్రమం. సీతాదేవి అన్ని ఆభరణాలు అయోధ్యలో వదిలేసి అరణ్యవాసానికి వచ్చినప్పుడు, రావణుడు సీతాపహరణం చేయడానికి ముందు అగస్త్య ఆశ్రమంలో లోపాముద్రా దేవి సీతాదేవికి చాలా ఆభరణాలు ఇచ్చింది. ఈ ఆభరణాలే సీతాదేవిని వెతకడానికి పనికి వచ్చేటట్లుగా ఇస్తుంది. వామనావతారం కథలో బలిని అన్యాయం చేసినట్లు అనిపిస్తుంది. కాని నిజానికి బలికి అంతకన్నా ఉత్తమమైన స్థితిని కల్పించడం అది. భాగవతుల జీవితాలలో అంటే భగవద్ సాధన చేసుకుంటూ, భగవదనుభూతి పొందుదామనుకునే వారి జీవితాలలో కూడా, కష్టనష్టములు ఎక్కువగా కనిపిస్తూ వుంటాయి. ఈ కష్ట నష్టాలు ఎందుకు కనిపిస్తాయంటే లోపల వున్న imperfections are brought to the surface. అందుచేత హరిశ్చంద్రుడు, ధర్మరాజు, నలుడు, వాళ్ళ జీవించిన శోభాయమానమైన జీవితాలు కూడ మనసు, ఇంద్రియములు, శరీరమునకు సంబంధించిన శోభే తప్ప, ఆత్మకు సంబంధించిన శోభ ఇంకా రాలేదు కాబట్టి అది తయారు కావాలంటే ఈ మనసు, ఇంద్రియములు, శరీరమునకు వున్న శోభ తీసేస్తే అందులో పెరగడానికి మొదలుపెడతారు. అందుకని personality , అంటే మనకి వ్యక్తిగతమైన స్థితిగతులను కొంత తీసి వుంచితే భగవంతుని వైపు మనసు మరలి,ఆత్మతత్వం వైప ఆత్మతత్త్వములో జీవించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది ఒక భాగంగా జరుగుతుంది. భగవంతుడి పనే ఇది. "నేనెవ్వరి ననుగ్రహింప చూతు వాని సకల విశ్వంబు నేనపహరింతు" అన్నాడు శ్రీకృష్ణుడు. నేనెవరినైతే అనుగ్రహించాలనుకుంటానో వాళ్ళకి మిగతా బలాలేవయితే వున్నాయో ఆ బలాలన్నీ తీసేస్తానని చెబుతాడు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క బలమనుకుంటారు. ఒకరు తింటే బలమనుకుంటారు. తింటే బలమనుకున్నవారిని పశువులన్నారు. కొంతమందికి వుంటే బలమనుకుంటారు. బ్యాంకులోనో లేదా ఎక్కడో మరో చోట ఎంత వుంటే అంత బలమనుకుంటారు. అంత భయంగా కూడా వుంటారు. తనకి బలమనుకుంటాడు. తింటే బలం వుంటే బలం. ఇలా భగవంతుడు కాక ఇతరములైన బలములను నమ్ముకుని వుండి, భగవంతుని యొక్క ఆరాధన చేస్తున్నాడనుకో, ఏమి చేస్తాడంటే ఏదయితే నిజమైన బలమనుకుంతున్నామో అది నిజమైన బలం కాదని తెలియాలి కదా! కాబట్టి ఆ బలం ఒక్కసారి లేకుండా

చేస్తాడు. అదే నిరాలంబనం! 'నిరాలంబా' అని అమ్మవారికి పేరు. ఏదీ ఆలంబన లేకుండా చేస్తే అప్పుడు 'నేను'గా మనలో వున్న భగవంతునియందు ఆలంబనం ఏర్పరచుకుంటాం. అలా ఏర్పరుచుకోవాలనే మిగతా బలాలన్నీ నెమ్మదిగా తీసేస్తాడు. ధర్మరాజుకు ఉన్న బలమంతా కూడా ఒక్కసారి లాగేస్తాడు. నలుడికి, హరిశ్చంద్రుడికి అలా లాగేస్తాడు. ఇలా ఎందుకు లాగేస్తుంటారంటే అంతకు ముందు తను బలం అనుకుంటున్నది నిజమైన బలము కాదు, అసలైన బలం ఆత్మబలం! ఆ ఆత్మబలమునందు వీడు ప్రవేశించాలనే కారుణ్యము కలిగిన భగవంతుడు ఇటువంటి చర్యలు కొన్ని చేస్తుంటాడు. బయటికి చూడటానికి కొంచెం కష్టంగా వుంటుంది. లోపల దానికి చక్కని అగ్నికార్యం జరిగి, మనిషి మారడానికి ఆత్మబలం కలిగినవాడు అవడానికి, ఆత్మవంతులు అవడానికి పనికివస్తుంది. కొంతమందికి వాళ్ళ ఆస్తులే బలం, కొంతమందికి తిండే బలం. కొంత మంది తెలివితేటలే బలమనుకుంటారు, వారి యొక్క బుద్ధే బలమనుకునేవారు వుంటారు. అందరికన్నా ఆత్మయందు నిలబడిన వాడే అందరికన్నా బలవంతుడు. కొంతమంది తెలివితేటలతో మొత్తం ప్రపంచాన్ని manage చేసుకుంటూ వుంటారు, అదొక బలం. కొంతమంది కండపుష్టితో manage చేసుకుంటూ వుంటారు. కొంతమంది తిండి పుష్టితో manage చేసుకుంటూ వుంటారు. కానీ వీళ్ళు ఆత్మవంతులై, ఆత్మయందు జీవించి, ఆత్మయే బలముగా వుండుట చేత సమస్త బలము వారిదై వుంటుంది. అందుకని ప్రహ్లాదుడు చూడడానికి గొట్టికాయలాగా వుంటాడు. వాళ్ళ నాన్న పెద్ద పహిల్వాన్ లా వుంటాడు. ప్రహ్లాదుడి బలం హిరణ్యకశిపుడి కన్నా ఎంత ఎక్కువ! ఏమిటి నీ బలం చెప్పు? అని తండ్రి అడిగితే, నీకు నాకు సూర్యుడికి, చంద్రుడికి మొత్తం అందరికీ ఎవరు బలమో అతడే నాకు బలం అని చెబుతాడు ప్రహ్లాదుడు. 'నీకు నాకు బ్రహ్మాదులకున్' అంటాడు. బ్రహ్మకి కూడా వాడే బలం నాన్న అని చెప్తాడు. కాబట్టి ఆ బలంలోకి మనం ఎదగడానికి, ఈ బలాలని నమ్ముకున్నటువంటి వాళ్ళని నెమ్మదిగా ఉద్ధరించుకుంటాడు భగవంతుడు . అంటే ఊళ్ళో రక్షకుడైన తండ్రి వుండగా కొడుకు రౌడీని నమ్ముకున్నాడనుకోండి, కొడుకు తండ్రి మీద కన్నా రౌడీ మీద నమ్మకం పెట్టుకున్నాడనుకోండి ఎలా వుంటుంది? రౌడీ ఏమి చేస్తాడు? కొడుకుని వశపరచుకుంటాడు. నిజమైన తండ్రి కొడుకుని వశపరచుకోడు. యోగక్షేమాలు చూస్తాడు తండ్రి . మిగతావాళ్ళు

వశపరుచుకుంటారు. భోజనానికి వశమై పోయిన వాళ్ళు చాలామంది వున్నారు. భోజనమే బలము అనుకున్నవారు భోజనమునకే వశమై పోయారు. ఆస్తి బలమనుకున్నవారు ఆస్తికి వశమైపోయారు. ధనము బలమనుకున్నవారు, తెలివితేటలు బలమనుకున్నవారు వాటికి వశమైపోతారు. కాబట్టి ఎవరు ఏది బలం అనుకుంటారో ఆ బలానికి దాసత్వం చేస్తుంటాము మామూలుగ. కానీ భగవంతుడే బలమనుకున్న చోట దేనికీ దాసత్వం వుండదు. ఈ విధముగా సరి అయిన జ్ఞానం మనలో ఏర్పరచడానికి భగవంతుని కార్యక్రమంలో ప్రతి జీవికి ఏదో సమయంలో మొదలవుతుంది. అందుకనే ఇన్నిరకములైన కార్యక్రమములో పాల్గొనడం అనేది స్వచ్ఛందంగా చేస్తూ ఉంటాడు జీవుడు. ఇది ఒక station. ఈ station లో పూజలవి చేయడం, హోమాలు చేయడం, ధ్యానం చేయడం లేక అక్కడెక్కడో వారెవరో పూజలు చేస్తున్నారట అంటే అక్కడికి వెళ్ళడం, ఇక్కడేదో జరుగుతుందిట అంటే ఇటు పోవడం, ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుకోవడం, ఈ పుస్తకాల్లోంచి తెలుసుకున్నదంతా వ్రాసుకోవడం, వ్రాసినవన్నీ పంచిపెట్టడం ఇవన్నీ ఒక station. అటు నుంచి ఇటు వచ్చినది. బహిర్గతమైన ప్రపంచం బలం అనుకున్న వాడు, అంతర్గతంగా ఉన్న ప్రపంచంలో కేంద్రంగా ఉన్న బలాన్ని గ్రహించడానికి ముందు, జరిగే సన్నివేశాల్లో ఇటువంటివన్నీ జరుగుతూ వుంటాయి. లేదా ఏదో, ఎక్కడికో, ఒక గురువు వద్దకో, గుడివద్దకో చేరతాడు. పుణ్యక్షేత్రాలకి వెళుతుంటాడు. స్తోత్రాలు పఠనం చేస్తుంటాడు. ఇదికాదంటాడు, అదిఅంటాడు, అదీకాదంటాడు,ఇదిఅంటాడు. నదు లంటాడు. పుణ్యమంటాడు. స్నానాలు చేస్తుంటాడు. ఇవన్నీ లోపల కార్యక్రమం మొదలవడం వలన జరుగుతుంది. ఈ కార్యక్రమం మొదలు కాలేదు అనుకోండి వీటికి దూరంగా వుంటాడు. అది పరిణామ దశలో ఏర్పడుతున్నప్పుడు ఇది వరకు అనుకున్న బలములు మారుతుండడంవల్ల వీరికి జరిగే సన్నివేశాల్లో అన్యాయం జరుగుచున్నట్లు అనిపిస్తుంది తప్ప, అన్యాయం ఉండదు. అందుకనే Madam Blavatsky ఒక మాట చెప్పారు. "వ్యక్తిగతముగా తనకు జరిగిన అన్యాయములను ధీరతతో సహించుట" అని అన్నారు. సహించినందువలన మనకి సహనం ఏర్పడుతుంది. Acceptance ఏర్పడుతుంది. అదొక కళ్యాణ గుణము. అందులోంచి చాలా మధనం ఏర్పడుతుంది. కాబట్టి 'అమోఘత్వం' కి సంబంధించిన భగవంతుని కార్యక్రమం ఆ విధంగా వుంటుంది. లోపల పొట్టంతా

పాడైపోయింది. జ్వరం వస్తే మొత్తమంతా కూడా అగ్ని ప్రజ్వలనం జరిగి పొట్టను బాగు చేసి, రెండు రోజులు అన్నం తినకుండా చేసి, ఆ తరువాత మనని fresh గా తయారు చేస్తుంది. ప్రతిసారీ దేహంలో మనకి కనబడే జబ్బు నిజమైన జబ్బు కాదు. మనకి కనబడకుండా మనలో దాగి వుండి మనని హింసిస్తున్న జబ్బు వుందే అది నిజమైన జబ్బు. మనని హింసిస్తున్న జబ్బులు మనలో ఈర్ష్య, అసూయ, ద్వేషము, క్రోధము, మదము, మాత్సర్యము, భయము. ఇవి ఉన్నప్పుడు వీటి యొక్క బాధలను ఏమి చేస్తాడంటే, లోపలున్న అగ్ని దీనిని బయటికి నెట్టుతుంది. నెడితే మనకి దేహం మీద బాధలుగా వస్తాయి. దేహం మీద వున్న బాధలకన్నా మనసు మీద వున్న బాధలు మనిషిని ఎక్కువ బాధ పెడతాయి. దేహం మీద వున్నవి తక్కువ బాధ పెడతాయి. అది దేహంకన్నా మనసులో ఎక్కువ బాధలున్న వారికి తెలుస్తుంది. శరీరం మీద వుంటే ఏముంది? మనసులో వుంటే ఎప్పుడూ పీడిస్తుంది. మనసులోనుంచి శరీరం మీదికి తీసుకు రావడానికి కారణమేమంటే అది అగ్నికార్యం. అందుకని మనకి జ్వరాలు, కడుపు నొప్పులు అవి వచ్చి ఇంక తినకుండా చేస్తాయి. మానేస్తే ఈ లోపల systemని అగ్ని బాగా సరిచేసి ఇస్తుంది. మరుసటిరోజు నుంచి బాగుంటుంది. కాబట్టి ఈ కడుపు నొప్పి మనకి ఇప్పుడు ఎందుకు రావాలి అనుకుంటే, అలా limitedగా చూస్తే దొరకదు. మొత్తం చూడగలగాలి. మొత్తం చూడ్డానికి ఏమన్నారంటే వైఖరీ కాకుండా మధ్యమ, పశ్యంతీ, పర తెలిసిన వాళ్ళు నిజంగా తెలిసిన వాళ్ళు అవుతారు తప్ప, జరుగుతున్న సన్నివేశాన్ని భౌతికంగా మాత్రమే గ్రహించి, దానికి అంతర్లోకంలో వున్న విషయాన్ని గ్రహించలేక పోవడం నిజంగా జ్ఞానం అనేది లేదని అర్థం. జ్ఞానం లేని వాళ్ళు ఏమి చేస్తారంటే ఈ జరుగుతున్న బహిర్గతమైన కార్యాలని నిమిత్తమాత్రంగా జరుగుతున్నాయి కాబట్టి, ఈ నిమిత్తానికి అతీతంగా వున్న కారణాలని చూసుకుంటారు. మనకి ద్రౌపదీ వస్త్రాపహరణం అటువంటి కథే! దాంతో ఒక్కసారి వాళ్ళందరినీ సంహరించడానికి ఒక అర్హత సంపాదించుకుంటారు పాండవులు. ఒక చెడులోంచి ఒక మంచి. అంటే అమోఘత్వమంటే ఇలా వుంటుంది. రేపు కాలంలో మనకి రాబోయే వైపరీత్యంలో ఒక మంచి వుంది. చెడులో మంచిని చూడగలిగినప్పుడు అమోఘత్వం అనే భగవంతుని యొక్క తత్వం అని అర్థమవుతుంది.

## 163 శుచిః

శుచి, పవమానుడు, పావకుడు అనే ముగ్గురు అగ్ని యొక్క పుత్రులుగా చెబుతారు పురాణాల్లో. మనకి మూడు అగ్నులని చెబుతుంటారు. ఆ మూడు అగ్నులకి, వీటికి అనుసంధానం చేసుకోవాలి. ఆహవనీయగ్ని, గార్హపత్యఅగ్ని, దక్షిణాగ్ని. దక్షిణాగ్ని అంటే బహిర్గతమైన ప్రపంచంలో మనం పని చేయడానికి పనిచేసే అగ్ని అక్కడ వుంటుంది. దేహంలో వున్న అగ్ని బుద్ధిలో వుంటుంది. మనలో జీవుడిగా దేవుడు నుంచి ఆవహింపబడిన వాడు ఆహవనీయాగ్ని. శుచి అనే అగ్ని మన మనస్సు, శరీరం, ఇంద్రియాలకు సంబంధించిన అగ్నిగా చెబుతారు. అగ్నికిముగ్గురు కుమారులు అని చెబుతారు. శుచి, పవమానుడు, పావకుడు. ఈ ముగ్గురు కుమారులకు ఒక్కొక్కరికి 15 మంది కుమారులు ఉన్నారు-

15x 3=45. 45+3=48. 48+1=49.

మొత్తం 49 రకాల అగ్ని వున్నవి అని మనకి పెద్దలు చెప్తారు .

49 fires in 49 flames. 7 times 7. కాబట్టి భగవంతుడు తనను తానే సృష్టిగా ఏర్పరచుకున్న సందర్భములో He becomes the sacrificial fire. తనే తాను దిగి వస్తాడు కాబట్టి పురుషుడన్నారు. తనని తాను సమర్పించుకుంటున్నాడు కాబట్టి ఆవాహనం చేయబడిన అగ్ని ఆహవనీయ అగ్ని. ఆ తరువాత అక్కడి నుంచి వ్యాపనం చెంది, ఈ పదార్ధమునందు కూడా వ్యాపనం చెంది వుంటాడు. పదార్ధమునందు వుండే అగ్ని, వెలుగులా కనిపిస్తున్న అగ్ని, వెలుగుకి మూలమయిన అగ్ని. మనము అగ్ని, పావకుడు, పవమానుడు, శుచి అనేవి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగా తెలుస్తుంది. ఈ నాలుగు వ్యూహాలు ఒకటేమో the basis, ఇంకోటేమో దాని యొక్క ignition, మూడవది దాని యొక్క permeation, నాలుగవది దాని యొక్క existence. మనకుండే పదార్ధంలో అంతా కూడా నిండి వున్న అగ్నిని శుచిగా భావన చేయాలి, లేక అనిరుద్ధుడుగా భావన చేయాలి. శుచి అనే అగ్ని పదార్ధంలో నిండి వుంటుంది కాబట్టి పదార్ధములన్నీ మన చుట్టూ వున్న వాటిని శుచిగా వుంచుకోవడం వలన, ఈ శుచి అనే అగ్ని మనలో బాగా ప్రజ్వలించి పని చేస్తాడు. మన

శరీరం, మనస్సు, ఇంద్రియములలో నిండి వున్న అగ్నిని చక్కగా శుచిగా వుంచుకోవడం వలన తేజోవంతులుగా మనం వ్యక్తమవుతూ వుంటాము. లేకపోతే వ్యక్తమవడానికి అవకాశం లేదు. అంటే the fire in matter, పదార్థమందున్న చైతన్యం. మనలో మనస్సు, ఇంద్రియములు, శరీరము పదార్థమునకు సంబంధించినటువంటివి. ఆ పైన వున్న బుద్ధి మనకి సంబంధించినది. ఆనందం మనకి సంబంధించినది. మనము దేవునికి సంబంధించినవారము. దేవుడే దిగివచ్చి జీవుడయితే, ఈ జీవుడికి మూడు కళ్యాణ గుణాలున్నాయి. ఒకటి సంకల్పబలం, రెండు జ్ఞానం, మూడు బుద్ధికౌశలం. ఈ మూడు పనిచేయాలంటే శరీరం లో నించి పని చేస్తాయి. శరీరంలో నుంచి పని చేయాలంటే శరీరమునకు శుచి వుండాలి. శుచి లేని శరీరంలో ఇవి పనిచేయవు. శుచి లేనివారికి భగవద్ తత్వం అవగాహన అవడము అవకాశం లేని విషయము. ప్రతి విషయమునందు శుచి వుండాలి. శుచి పెంచుకునే కార్యక్రమాలు మొదలు పెట్టుకుంటాము. అవి ఏవంటే, ఎక్కువ అగ్నిని ఆవాహనం చేసుకోవడం లేదా సూర్యతత్వమును ఆవాహనం చేసుకోవడం. ఈ సూర్యుని వెలుగూ అగ్నికి సంబంధించినదే కాబట్టి ఈ వెలుగును ఎక్కువ ఆవాహనం చేసుకుంటే, లోపల అంతకు ముందు పదార్థంలో వున్న మాలిన్యములకు ఈ వెలుగుకి మధ్య సంఘర్షణ ఒకటి జరుగుతుంటుంది. అది సాధకుని యందు మామూలుగా మంచి-చెడుల సంఘర్షణ లోపల జరుగుతూ వుంటుంది. దానినే 'మథనం' అన్నారు. మథనం between right and left force.

పదార్థమయమైనటువంటి బహిర్గత జీవితం ఒకటి వుంటుంది. అది మనని ఎప్పటికప్పుడు బయటికి లాగేస్తూ వుంటుంది. Earthly things keep attracting towards so many aspects. సినిమాల్లో చూడండి రెండు కాళ్ళకి, రెండు చేతులకి, తలకి ఐదింటికి ఐదు తాళ్ళు కట్టి ఐదు ప్రక్కల ఐదు దూలాలు పట్టుకొని చెరో ప్రక్క వెళ్ళిపోతుంటే మధ్యలో ఉన్నవాడు ఏమయిపోతాడు? There is the destruction. అదేవిధంగా పంచేంద్రియములతో బహిర్గతమైన ప్రపంచంలోకి బాగా ఈడ్చుకొని పోతున్న వాళ్ళందరికీ కూడా they get destroyed. ఆ destruction లో లోపలనుంచి మళ్ళీ వీళ్ళు ఐదు తాళ్ళతో ఐదు ప్రక్కల నుంచి లాగుతుంటే అక్కడున్న మనిషి ఐదు పక్కలనుంచి తనను కేంద్రీకృతము చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఐదు గుర్రాలూ రెండు చేతులు, రెండు కాళ్ళు, తల ఐదు వైపులా లాగేస్తుంటే, కట్టివేయబడిన మనిషి తనని తాను

రక్షించుకోడానికి ప్రయత్నం చేస్తాడు. అంతర్లోకాల లోనికి ప్రవేశించడం అంటే బహిర్గతమైన వైముఖ్యంలో నుంచి మళ్ళీ కేంద్రీకృతమవడమనేది నిజమైన సాధన. భక్తిలో మనిషి ఒక్కసారి సమీకరించబడతాడు. అదే మనకి తరువాత వస్తుంది నామం 'సంగ్రహః'అనే దానిలో. సమీకరణ జరుగుతూ ఉంటుంది ఓ పక్క. ప్రతిరోజు పగలు విపరీతంగా వ్యాపనం చెందుతుంటాము. మనకుండే వ్యాపకాలతో. ఇలా జరిగే వ్యాపనం ఎంత దూరం వెళుతుందంటే, సాయంత్రం అయ్యేసరికి అలసిపోతాము. అలసిపోవడం వలన మనకి నిద్ర కల్పించి రాత్రి మళ్ళీ మనని సమీకరించి వుంచుతాడు కాబట్టి ప్రొద్దునే మనం మళ్ళి పూవు వలె fresh గా వుండి మళ్ళీ కార్యక్రమాలు మొదలుపెడతాము. 10/15 రోజులు నిద్ర లేదనుకోండి త్వరగా వాడిపోతాము. సమీకరణం జరగదు కాబట్టి. That is what is called gathering. మనకుండే ప్రజ్ఞలన్నీ మళ్ళీ రాత్రిపూట gather చేసి ఇస్తుంది ప్రకృతి. ప్రొద్దున పూట మళ్ళీ విసిరేసుకుంటూ వుంటాము. పగలు మనం బహిర్గత జీవితంలో విసిరేసుకున్నవన్నీ రాత్రి అంతర్లోకములో మళ్ళీ సమీకరణం చేయబడి ఒక cogent unit of consciousness గా తయారు చేస్తారు. ఈ విధంగా కార్యక్రమం జరుగుతూ వుంటుంది. సాధకులు ఇదే సాధనని తెలిసి చేస్తుంటారు. ఏమవుతుందంటే పగలు జరిగిన కార్యక్రమంలో మనస్సు, ఇంద్రియములు, శరీరము ద్వారా విపరీతముగ బహిర్గతములోకి వ్యాపనం చెందడం అనేది జరగడము కాకుండా, కేంద్రము నందు తను నిలబడి, తన ప్రజ్ఞల యొక్క ప్రసారం జరిగేటట్లుగా చూసుకుంటాడు. తాను కేంద్ర మందు వుంటాడు. పరిధి యందు తన ప్రజ్ఞలు పనిచేసుకుంటూ వుంటాయి. తను పరిధికి పరిగెట్టి వెళ్ళిపోడు. తను కేంద్రంలోనే వుంటాడు. అదీ సాధన! కానీ అంతకుముందు మనకున్న అలవాటు వలన ఏమి జరుగుతుందంటే మనం విపరీతముగా బయటకి వెళ్ళిపోవటం అనేది ఒక habit అయిపోయింది కదా, ఐదు ఇంద్రియములు ద్వారాను, ఆరవదైన కామప్రవృత్తి ద్వారా మనము బయటకి వెళుతూ వుంటాము. ఆరు కోణాల్లోనుంచి బయటికి వెళ్ళిపోతూ వుంటాము. ఈ సాధన ద్వారా ఈ ఆరు కోణాల్లో నుంచి మరల కేంద్రీకృతం అవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాము. ఒక ప్రక్క వికేంద్రీకరణము జరుగుతూ, మరియొక ప్రక్క కేంద్రీకరణం జరుగుతూ ఈ మథనం ప్రతీ సాధకునిలోనూ జరుగుతూ వుంటుంది. ఈ మథనం జరగడానికి పవమానుడు, పావకుడనే వాళ్ళని తోడు

తీసుకున్నట్లయితే కార్యం శుచికి సులభమవుతుంది. శుచి అనేది పదార్థంలో వున్న అగ్ని కాబట్టి, పదార్థంతో వున్న అగ్నిని మనం సమీకరణం చేసే ప్రయత్నంలో మనకి కావలసిన వాళ్లు, మిగతా ఇద్దరు అగ్నిదేవుని యొక్క కొడుకులు పవమానుడు, పావకుడు. శుచి పదార్థంలో వున్నవాడు అంటే మనసు, ఇంద్రియములు, శరీరంలో వున్న చైతన్యమన్నమాట. ఈ చైతన్యం సామాన్యంగా బహిర్గతమవుతుంటుంది. దానిని కేంద్రీకృతం చేయడానికి మనం వీళ్ళ యొక్క సహాయం తీసుకోవాలి. వాళ్ళ యొక్క సహాయం తీసుకోవడమే మనం చేస్తున్న ఆరాధన! అగ్ని ఆరాధన అనండి, వెలుగు ఆరాధన అనండి, సూర్యుని యొక్క ఆరాధన అనండి, విష్ణువు యొక్క ఆరాధన అనండి, రాముని ఆరాధన అనండి. ఏదైనా చెప్పండి. ఈ ఆరాధనలోకి తోడు పవమానుడు. పవమానుడంటే అది కూడా అగ్నియే. ఏ అగ్ని అంటే గాలిచేత వ్యాపనం చెందే అగ్ని! అగ్ని వుంది, అగ్ని గాలిచేత ఇంకా వ్యాపనం చెందుతుంది. అగ్నికి వాయువు తోడైతే పరివ్యాప్తి ఎక్కువగా వుంటుంది. మనస్సు, ఇంద్రియములు, శరీరం లోను బంధింపబడిన జీవులం, మనని మనం ఉద్ధరించుకోవాలంటే ఇద్దరు కావాలి. ఒకటి వాయువు, రెండు వెలుగు లేక ఆత్మతత్వం లేక సూర్యుడు లేక గాయత్రి. ఈ రెంటినీ కలిపి సహాయంగా చేసుకున్నట్లయితే, అంటే ఒకటి శ్వాసగా పని చేస్తుంది. రెండవది మనలో వున్న బుద్ధిగా పనిచేస్తుంది, లేక సూర్యుని యొక్క అంశగా మనలో పనిచేస్తుంది. కనుక రాముడు, హనుమంతుడు కలిస్తే లంకను శుభ్రంగా దగ్ధం చేయవచ్చు. హనుమంతుడు ఒకడే చాలా పనిచేసి పెడతాడు. ముందు వెళ్ళి కొంత కాల్చి వస్తాడు కదా! ముందు వెళ్ళి కాల్చి వచ్చేవాడు వాయువు లేక పవమానుడనే అగ్ని. మనసు, ఇంద్రియములు, శరీరంలో ఇరుక్కున్నవాడికి పవమానుడనే అగ్ని యొక్క సహాయం దొరికినట్లయితే కేంద్రీకృతం అవ్వడం అనేది కొంచెం సహజంగా జరుగుతూ వుంటుంది. వికేంద్రీకరణం నుంచి బయటపడతాము. అందుకని మనకి ప్రాణాయామం ఇచ్చారు. ప్రతి పొద్దున, ప్రతి సాయంత్రము, మనకి తీరిక వేళల్లోనూ మనం శ్వాసను observe చెయ్యడం మొదలు పెడితే శ్వాస rhythmic గా తయారయి వికేంద్రీకృతులమైన వాళ్ళం కేంద్రీకృతమవుతాము. ప్రతీ కార్యక్రమమునకు మధ్యన వున్న interval లో ఈ విధంగా మనం శ్వాసయందు లగ్నం చేసుకుని మనసుని, పరిపూర్ణంగా శ్వాసని పీల్చడం వదలడం చేసినట్లయితే, ఆ శ్వాసని పీల్చడం వదలడంలో నుంచి అగ్ని

పుడుతుంది. ఈ పుట్టిన అగ్ని మన శరీరంలో వున్న శుచి అనే అగ్నికి సహాయం చేసి, మనలోని చైతన్యాన్ని centralise చేసి పెడుతుంది. అందుకని మనకి ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలకు చాలా ప్రాముఖ్యత సాధనలో ఇచ్చి వున్నారు. దీనికి వెలుగు ఆధారం చేసుకుని చేసినట్లయితే, వెలుగు అంటే రాముడు, హనుమంతుడు, మనం లేక రాముడు, హనుమంతుడు, సీత. సీత భూమి నుండి పుట్టిన జీవిగా భావన చేసినట్లయితే, లంకలో బంధింపబడినది. దేని వల్ల బంధింపబడినదీ? బహిర్గతమైన మెరుపులకి లోనై ఏదో కోరుకోవడంవలన దానికి సంబంధించిన వాడు వచ్చి ఎత్తుకు పోయాడు. మనం కూడా అంతే. మనం కూడ అంతే! మనం చాల కోరుకుంటాము కాబట్టి వాళ్ళు మనని ఎత్తుకు పోతుంటారు. మన కోరికలే రావణాసురుడు. రకరకాలుగా మనం కోరుకుంటున్న కొద్దీ రకరకాలుగా మనని ఎత్తుకు పోతుంటారు. మన కోరికల్లో మనం బంధింపబడతాం. అదీ లంకలో బంధింపబడటం. లంక అంటే పెద్దలు చెప్పిన మార్గంలో భూమధ్యరేఖ క్రింద వున్నటువంటిది. నాభికి క్రింద వున్నటువంటిదంతా లంకే. మనం బొడ్డు, బొడ్డు కన్నా క్రింద వుంటూ వుంటాం. అంటే కోరికలు, అన్నిటినీ పొందాలనే భావనలు, వీటిలో వున్నవారందరూ లంకలో బంధింపబడిన వారే. ఈ లంకలో బంధింపబడినవారిని ఉద్ధరించాలంటే, ఒకటి హనుమంతుడు రెండు సూర్యాంశ అయిన తత్వం. సూర్యాంశకి సంబంధించిన వారమే మనమందరము కూడా. కిరణముల ద్వారా దిగివచ్చిన వారమే కానీ ఇచట ఇరుక్కుపోయాము. కాబట్టి ఈ రెండు తత్వాలని మనం జోడించుకోడానికి ఈ ఆరాధనలు చేస్తూ వుంటాము. గాయత్రి అనండి, విష్ణు సహస్రనామం అనండి, ఏదైనా అనండి. భగవంతుని యొక్క ఆరాధనలన్నీ ఆ తత్వాన్ని పెంపొందించుకోవడానికే. ఇది అంతా మనకి ఉఛ్వాస నిశ్వాస కార్యక్రమంలో ఎక్కువ నిమగ్నం అవడం వలన ఆ వాయువు యొక్క బలం కూడా మనలో పెంపొందింపబడి మనసు, ఇంద్రియములు, పదార్థమయమైన శరీరమునందు బంధింపబడిన జీవుల చైతన్యశక్తి ఒక్క సారిగా ఉద్ధరింపబడుతుంది. ఈ మథనం జరగాలి. ఈ మథనం జరుగుతున్నప్పుడు అమోఘత్వమనే తత్త్వము ఎక్కువ పని చేస్తు ఉంటుంది సాధకుల్లో. ఎందుకు జరుగుతుందంటే మథనం జరుగుతున్నంతసేపు బయటకు వచ్చేది మొదట విషం, తరువాత అమృతం కదా! ముందే అమృతం రాలేదు కదా! విషం పుట్టి తరువాత అమృతం వస్తుంది. విషం అంటే ఏమిటి? మన

శరీరమందున్న మాలిన్యములన్నీ ముందు బయటికి వచ్చేస్తాయి. In any processing ముందు impurities అన్నీ బయటికి తీసేసిన తరువాత clear material end product లోకి వస్తూ వుంటుంది. ఈ impure material అంతా బయటికి రావడమే ఈ విషం రావడం. మనలో కూడా వున్నాయి కాబట్టి అవి they are called forth to be surfaced అని అన్నారు జ్వాలాకూల్ గారు. When you work for perfection it calls forth the imperfection to the surface అన్నారు. పరిపూర్ణతకి మనం ప్రయత్నం చేసినప్పుడు మనలో వున్న అపరిపూర్ణత బయటకి వస్తూ వుంటుంది. ఎందుకు వచ్చిందంటే లోపలదాన్ని బయటికి తీసాము కాబట్టి. ఎలా తీశామంటే ఈ అగ్నికార్యం ద్వారా తీసాము. ఈ మథనం ద్వారా తీసామని తెలుస్తుంది. తెలుసుకొని దాన్ని ఇంకా చిలికి ఇంకా చిలికితే విషం పోయి అమృతం రావడం ఖాయం. ముందు హనుమంతుడు వచ్చి కొంత కార్యం చక్కబెట్టిన తరువాత, రాముడు వచ్చి మొత్తం లంక అంతటిని కూడ ఓడించి, అక్కడ వున్న జీవి అయిన సీతను తనతో మళ్ళీ తీసుకువెళ్లినట్లుగా ఉంటుంది కథ. ఇది శుచికి సంబంధించినది. కనుక మనలో శుచిని పెంచుకోవడమంటే ప్రాణాయామము, సూర్యోపాసనము రెండూ కలిపి చేసుకోవాలి. ఊరికే కడుక్కోవడాలు, తోముకోడాల వలన అవ్వదు. మామూలుగా మన వాళ్ళు శుచి అంటే మాటిమాటికి తోముకోవడం, కడుక్కోవడం చేస్తుంటారు. శుచికిఇద్దరు brothers ఉన్నారు పావకుడు, పవమానుడు. వీళ్ళిద్దరిని పట్టుకొచ్చుకోవాలి. పట్టుకొచ్చుకుంటే automatic గా శుచియొక్క బలం threefold అయ్యి పదార్థంలో వున్న మాలిన్యాన్ని బయటికి గెంటుతుంది. కట్టెలో వున్న అగ్ని, కట్టెలో బంధింపబడినట్లుగా వుంటుంది. మనం బయట నుంచి అగ్ని యొక్క సహాయం అందిస్తే లోపల వున్న అగ్ని, బయట వున్న అగ్ని కలిసి కట్టెను బూడిదగా మార్చేస్తుంది. మార్చేటప్పుడు అందులో నుంచి వచ్చే అగ్ని వలన కట్టెను బట్టి వాసన వుంటుంది. కొన్ని కొన్ని రకాల కట్టెలు వాసనలిస్తాయి. బూడిద అయిపోయిన తరువాత ఇంకేం వాసన ఉండదు. పచ్చిగా వుంటే ఒక రకమైన వాసన. బోలుగా వుంటే ఇంకొక వాసన. ఇందులో దుమ్ము చేరిందనుకోండి ఇంకొక రకమైన వాసన. మరి ఆయన అగ్నికార్యం మొదలుపెట్టాడూ అంటే మొత్తమంతా తీసేసి, అంతా కాలిపోయిన తరువాత మిగిలినదంతా సమానంగా వుంటుంది. ముందు కట్టెలు వేరుగా వుండొచ్చు. రావి

పుల్లలు, మర్రి పుల్లలు, ఉత్తరేణి పుల్లలు ఇవన్నీ వాటి వాటి తత్వాల్లో అవి వుంటాయి. కానీ చివరికి పదార్థము అంతా సమానం చేయబడుతుంది. అందుకని దానిని తీసుకోమన్నారు. It is purified by fire. విభూతి గురించి చాలా చెప్పారు పురాణాల్లో. విభూతి రాసుకోమని ఎందుకిచ్చారు? ఎందుకు రాసుకోమన్నారంటే it is the purest matter. Fully purified by the fire. అగ్నిచే పరిపూర్ణముగ పరిశుద్ధము చేయబడినది కాబట్టి పూసుకోమన్నారు. అది పూసుకుంటే అపరిశుభ్రమైన జీవములు, భూతములు మన చుట్టూ చేరవు. ఆ భూతములు మనోమయ లోకంలోనూ, కామమయ లోకంలోనూ వుంటాయి. మాటిమాటికీ తాకుతూ వుంటాయి. అలా రోడ్డు మీద నుంచి వెళుతుంటే బోల్డు తాకుతాయి. విభూది పూసుకున్న వారిని అవి తాకవని చెప్పారు. శుచికి, ఈ రెండిటి యొక్క( వాయువు, అగ్ని) అనుసంధానం కల్పించాలి. Triangle work చేయాలి. అందుకనే వాయు బీజాన్ని ముందు ఆరాధన చేసుకొని, తర్వాత అగ్ని బీజాన్ని ఆరాధన చేసుకునే ఒక పద్ధతి పెద్దలు మనకిచ్చారు. ముందు హనుమంతుణ్ణి, తర్వాత రాముణ్ణి. 'ముందు నా దగ్గరికి రా. సరాసరి రాముడి దగ్గరకు వెళ్ళొద్దు' అని హనుమంతుడు చెప్పాడు. ద్వారం దగ్గర హనుమంతుడుంటాడు. "రామ ద్వారే తుమ్ రఖ్ వారే, హోతన ఆజ్ఞా బిను పైఠారే" రామ ద్వారం దగ్గర ఆయన వుంటారట. అంటే ఆత్మతత్వానికి ముందు ఈ వాయువు, మనలో పదార్థతత్వంలో వున్న చైతన్యాన్ని దానితో అనుసంధానం చేసి, పదార్థానికి పరిశుభ్రత ఏర్పరుచుతాడు. అందుకు హనుమంతుని ధ్యానం చేయాలి. అంటే వాయువుని అనుసంధానం చేయాలి. వాయువును అనుసంధానం చేయడం వలన, కట్టె బాగా గాలి కి expose అవ్వడం వలన, ఆ గాలిలో వున్న వేడి వలన కట్టె బాగా ఆరుతుంది. ఆరిన కట్టెకి నిప్పు పెట్టడం సులభం, ఆరని కట్టెకి నిప్పు పెట్టడం కొంచెం కష్టం. హనుమంతుని ధ్యానం లేని రాముని యొక్క ఆరాధన వలన తొందరగా కాలదు. అంటే వాయువు సహాయం లేని సాధన తొందరగా తెమలదు. వాయువుతో కనుక మొదలు పెట్టినట్లయితే అది తప్పక పదార్థాన్ని దానిలో ఉన్నటువంటి వేడి ద్వారా, (గాలిలో వున్న వేడిని పవమానుడంటారు) ఆ తత్వం ద్వారా పదార్థాన్ని చక్కగా ఎండబెడితే ఆ తరువాత మనం బాగా కాల్చామనుకోండి! బాగా ఎండిపోయినది కొంచెం అగ్ని తగిలితే చాలు

అంటుకుంటుంది. ఆ విధంగా మనం హనుమంతుని ఆరాధించిన తర్వాత రాముని ఆరాధించాలి. వినాయకుడు లేదా విఘ్నేశ్వరుని యొక్క ఆరాధన ద్వారా శివుని ఆరాధన. విశ్వక్సేనుని ఆరాధన ద్వారా విష్ణువు ఆరాధన. ప్రతి దానికి అట్లా ఉంటుంది. శివుని దర్శనానికి వెళ్ళినప్పుడు నందిని నిర్లక్ష్యం చేస్తే రావణాసురుడి పద్ధతిలా వుంటుంది. We have to approach the officer through his P.A. P.A. దగ్గరికి వెళ్లి చెబితే, P.A. ఆయనతో చెప్పి పని జరిపిస్తారు. సరాసరి ఆయన్ని పట్టుకున్నామనుకోండి ఇబ్బందుల్లో పడతాము. 'ఆయన దగ్గరికి వెళ్ళఖ్కర్లేదు నీకేం కావాలో నేనే చేస్తాను', అని అంటాడు హనుమంతుడు. రాముల వారి వద్దకు వెళ్ళే అవసరం లేదు. నేను చేయగలిగితే చేస్తాను. నా వలన కాకపోతే ఆయన వద్దకు పంపిస్తాను, అంటాడు. క్రింద officers చేయగలిగింది చేయించేసి, ఆ తర్వాత officers వద్ద పని చేయించుకోవాలి. అంతేకానీ సరాసరి పై officer వద్దకు వెళ్తే వాళ్ళు File అట్లా mark చేసి పంపిస్తారు. అంతే కానీ చేయరు. లేదూ సరాసరి highest officer దగ్గరకి వెళ్ళాము అనుకోండి అతను Joint secretary కి, అతను Deputy Secretary కి, అతను District కి పంపిస్తే మళ్ళి Collector గారు, అక్కడ నుండి ఆయన P.A ఇలా వచ్చేస్తాము వెనక్కి. అలా మనం ఒక్కసారి ఆకాశాన్ని భగవంతుడుగా ధ్యానం చేసి, మింగేద్దామనుకుంటే అవదు. ఎందుకు అవదంటే అందుకోలేం కాబట్టి. అందుకోడానికి మన వాళ్ళు చక్కగా మెట్లిచ్చారు. ఆ మెట్లు ఎక్కడం సులభం. శుచి అనే మెట్టు ఎక్కకుండా బుద్ధి మెట్లు ఎక్కలేరు. శుచిత్వం లేని వారికి బుద్ధి పనిచేయదు. ఏమీ సందేహం లేదు. బుద్ధిమంతులు కాని వాళ్ళు ఆత్మవంతులు కాలేరు. ఏమి సందేహం లేదు. నాకు బుద్ధి అఖ్కర్లేదు. జ్ఞానం అఖ్కర్లేదు. సరాసరి నానుంచి CVV గారు పని చేస్తున్నారు అని చెప్పుకున్నామనుకోండి, తెలియని వాళ్ళు నమ్ముతారు. తెలిసినవారు నవ్వుకుంటారు. ఎందుకంటే there is a process. ఆ process లో జరగాలి. అలా జరిగినట్లయితే మనకి శుచి అనే విషయం బాగా అర్థమవుతుంది. అగ్నికార్యం అవ్వాలంటే మనలోపల పదార్థంలో వున్న అగ్నికి, బయట అగ్ని తోడు కావాలి. తోడు కావాలంటే మథనం జరగాలి. మథనం జరిగినందువలన పుట్టే అగ్ని పదార్థాన్ని పరిశుభ్రం చేస్తుంది. పరిశుభ్రం చేసిన తరువాత అశుచి మనకేది అంటదు. శుచిలో వున్న భగవంతుడికి ఎందులో వున్నా ఏమి అంటవు. శుచిత్వం వున్న మహాత్ములు ఎక్కడ

వున్నా, ఎక్కడకి వెళ్ళినా అంతటా శుచిత్వమునే చూస్తారు తప్ప, ఆ ప్రదేశంలో ఉన్న అశుచిత్వము లోని ప్రభావము వారికి అంటదు. అంటే అయస్కాంతం ఇనుప ముక్క వద్ద వున్నప్పుడు అయస్కాంత ప్రభావము ఇనుప ముక్క మీద వుంటుంది. ఇనుప ముక్క ప్రభావం అయస్కాంతం మీద వుండదు. ఆత్మతత్వంలో వున్న వారి దగ్గరికి ఏమైనా వస్తే వారి వలన అవి శుచి అవుతాయి. ఆ స్థితి ఏర్పడుతుంది. ఎందుకని అంటే లోపల తేజోమయమైన పరిస్థితి ఏర్పడడం వలన వాళ్లు కనుక ఏదయినా ముట్టుకుంటే అది శుచి అయిపోతుంది. ముట్టుకోవడం వలన వాళ్ళు మైల పడరు. భగవంతుని యొక్క శుచిత్వము పదార్ధము మీద పని చేస్తు ఉంటుంది. అందుచేతనే భగవధ్యానము. అన్నిట్లోనూ తాను అగ్ని స్వరూపుడై వున్నప్పటికీ, ఆ పదార్థం యొక్క తత్వం అందులో ఉన్న అగ్నికి అంటదు. అలాగే సాధనలో ఈ విధమైనటువంటి మధనం జరిగి,ఈ అగ్ని కార్యము అంత జరిగి, వాయువు సూర్య, అగ్ని తత్వంతో చేరడం వలన జీవులు ఉద్ధరింపబడి, తరువాత వాళ్ళు ప్రపంచంలో ఎక్కడ వున్నా అశుచి అంటదు. తేడా వుండదు. ఎందుకు తేడా వుండదంటే he is already transformed. కనుక మళ్ళీ పాడు చేయడానికి ఏమీ లేదు. దానితో అనుసంధానం చేసుకునే ప్రతీదీ కూడా 'దాని' లాగా మారిపోయే స్థితిలోకి వస్తుంది. అది శుచి అంటే! ఈ శుచి మామూలుగా మనం అనుకునే శుచికి ఎంతో తేడా వుంది. మామూలుగా వున్న శుచి ప్రాథమికమైనది. అది మనకి కావాలి. ఇందులో భగవంతుని తత్వంగా ఏర్పడిన శుచి అటునుంచి దిగివచ్చిన శుచి. కాబట్టి పదార్థం దానిని ప్రభావితం చేయక, అదే పదార్థాన్ని ప్రభావితం చేస్తుంది. ఆ శుచికి ఇద్దరు అన్నదమ్ములు. పావకుడు, పవమానుడు. ఈ ముగ్గురికి తండ్రి వున్నాడు అగ్ని. అగ్నిని బిందువుగా తీసుకుంటే దాని చుట్టూ వున్న త్రిగుణాత్మకమైన కార్యక్రమముగా పవమానుడు, పావకుడు, శుచి పని చేస్తున్నట్లు మనం దర్శించాలి. వాసుదేవుడు కేంద్రంగా వుంటే సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు పని చేస్తున్నట్లుగా తీసుకోవచ్చు. 'పర' అనే స్థితి కేంద్రంగా వుంటే పశ్యంతి, మధ్యమ, వైఖరీలు త్రిభుజాకారంగా త్రిగుణాత్మకంగా పని చేస్తున్నట్లుగా భావన చేయవచ్చు. పరతత్వం కేంద్రంగా త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పని చేస్తున్నట్లుగా భావన చేయవచ్చు. ఇలా basis చుట్టూ త్రిగుణాత్మకంగా అన్నీ ఏర్పడుతున్నాయి. ఇలా ఏర్పడేవన్నీ ఇచట భగవంతుని నామం, తత్వంగా

చెప్పకోవడానికి ఇవ్వబడినది. ఆ శుచిని మనలో పెంచుకోవాలి. పెంచుకోవాలంటే మనము వాయువుతో అనుసంధానం చేసుకోవాలి. పవిత్రమైన గాలి కావాలి. దానితో అనుసంధానం కావాలి. అనుసంధానము కావాలంటే ప్రాణాయామం చేయాలి. ప్రాణాయామం చక్కగా జరుగుతున్నవారికి శుచి బాగా జరుగుతుంది. ఏది శుచి, ఏది అశుచి అనేది బాగా తెలుస్తుంది. ప్రాణాయామం సూర్యోదయం సమయములో చేసుకుంటున్న వారికి, శుచి పెరగటం అనేది సహజంగా జరుగుతుంది. భౌతికమైన బాహ్య ప్రపంచములో కూడా మంచి ఆలోచనలే వస్తాయి గాని అశుచి అయిన ఆలోచనలు రావు. మలినముతో కూడిన ఆలోచనలు రావు. పరధనమును ఆశించడముగాని, పరస్త్రీని ఆశించడముగాని, ఇతరుల మీద వేరే అశుచి భావములు ఆలోచనలోకి రావు. ఆశించడమనేదే వుండదు. అసలు అవి మనోమయ లోకంలోకి రావు. ఎందుకు రాదంటే- he is regularly linked up with the divine in the morning, evening, and in the night. ప్రొద్దున ప్రాణాయామం సూర్యోదయం ముందు 24 నిమిషములు, సూర్యోదయానికి తరువాత 24 నిమిషములు చేయాలి. ఇది పెద్దలు చెప్పిన మార్గము. అసలు 49 నిమిషములు. 7 టైమ్స్ 7. దానికి మరల 24 నిమిషములు. Slow, soft, deep and uniform గా ప్రాణాయామం చెయ్యాలి. గట్టిగా 3-4 సార్లు చేస్తే మనలో నుంచి ఆవలింతలు వస్తాయి. అదే మనలోని Inertia. తమోగుణంగా అది ఆవలింతలుగా బయటికి వస్తుంది. ఆవలించి మరల మొదలుపెట్టాలి. ఎన్నిసార్లు ఆవలింతలు వచ్చినా అన్నిసార్లూ మరల మొదలు పెట్టాలి. ఎందుకంటే తమోగుణాన్ని కెలికినట్లు అవుతుంది. కొందరికి కొత్తల్లో నిద్ర వస్తుంది. చేస్తూ ఉండగా నిద్ర రాకపోగా చైతన్యవంతులమవుతాము. అందుచేత మాస్టారుగారు ఏం చెప్పారంటే సూర్యోదయానికి ముందే లేచి స్నానం చేసినవారికి చాలా fresh గా వుంటుంది. మొత్తం system కదలడానికి ఇది అవసరం. ఇది scientific process of enlightening and illuminating oneself. మొత్తం సృష్టి అంతా ఒక క్రమంగా ఏర్పడింది తప్ప అడ్డదిడ్డంగా ఏర్పడ లేదు. సూర్యుడు గానీ, గ్రహములుగానీ, గోళములుగానీ, వాటిమీద జీవులుగానీ క్రమం తప్పలేదు, ఒక్క మానవుడు తప్ప. ఎట్ల పడితే అట్ల వుంటే కుదరదని తెలిశాక, ఒక క్రమపద్ధతి ఏర్పడి శ్రద్ధ పెరుగుతుంది. శ్రద్ధ లోంచి జ్ఞానం వస్తుంది. అందుకే 'శ్రద్ధా

వాన్ లభతే జ్ఞానం’ అన్నాడు కృష్ణుడు. ఇవన్నీ శుచి పెరిగే కార్యక్రమాలన్నమాట. అలా శుచి బాగా పెరిగితే, మనం కేంద్రంగా మనచుట్టూ అన్నీ లాగబడి ఉంటాయిట. అదీ ఊర్జితః అంటే.

## 164 ఊర్జితః

ఒక చెట్టు వేళ్ళు, లోపల కింద పదార్థాన్ని భోజనంగా లాక్కొని ఆ చెట్టు అలా నిట్ట నిలువుగా పెరిగిపోతూ వెళ్ళిపోతుంది. కదా! అక్కడే వున్నట్లుంటుంది, ఏం తింటున్నట్లుగా కూడా ఉండదు. లోపల నుండి తెగ తినేస్తుంటుంది. అలా తినేస్తుంటే వ్యాపనం చెందుతుంటుంది. ఊర్జత్వమ్ అంటే పరిసరములలో వున్న పదార్థంతో మనయొక్క కేంద్రం కూడగట్టుకోవడం. సూర్యుని కేంద్రంగా ఈ మొత్తమంతా ఏర్పరిచి వాటన్నిటిని కూడగట్టి వుంచుతాడు. వృక్షము అలాగే పెరుగుతుంది. జంతువు అలాగే తిని పెరుగుతుంది. తింటూ, నీళ్ళుతాగుతూ. మనిషి కూడా అలాగే తన భావాల ద్వారా, శరీరాన్ని అణువులని కూడగట్టుకుంటాడు. ఈ కూడగట్టుకోడం వలన సూర్యకిరణం అనే cementing తో బలముంటుంది. ఆకలిగా ఉన్నప్పుడు రుచికరమైన పదార్థము కనబడితే ఎలా లాగేస్తాము? ఆ లాగడము ఉందే ability to attract. Law of attraction ప్రకారము అంతా మన చుట్టూ కూడగట్టుకొని, దానియందు మనము నివసిస్తామన్నమాట. అలాంటి చేసే తత్వం భగవంతునియందు వున్నది, మన యందూ వున్నది. ఆ తత్వాన్ని రెంటి యందు అనగా మన యందూ, ఆయన యందు కూడా చూడగలగాలి. ఆ తత్వాన్ని మనలో చూడగలిగితే మనం పెరగడానికి అవకాశముంటుంది. కాని అది మనయొక్క బలంగా ప్రపంచంలోని పంచభూతాలలోని తత్వమును లాగేసుకుంటాం. మనుష్యుల్ని లాగేస్తుంటాము. ఆస్తులు లాగేస్తుంటాం. డబ్బులు లాగేస్తుంటాం.చాలా లాగేస్తాం ఈ లాగేయ్యడమనే తత్వాన్ని వంకరగా కూడా మనము వాడి అందులో నివశించేస్తూ ఉంటాం. కాని కొన్ని విషయాలలో Unless you gather you cannot live in it. చెట్ల నుండి కలప (లాక్కొని) తెచ్చుకొని తలుపులూ, ద్వారబంధాలు ఏర్పాటు చేసుకున్నాం. అలాగే కొండల నుండి రాళ్ళు తెచ్చేసుకున్నాం. ఇసుక తెచ్చేసుకున్నాం. ఇంకో చోటు నుండి నీళ్ళు తెచ్చాం. ఇలా తెచ్చినవాటితోనే కదా ఇల్లు తయారవుతుంది. ఇలా లాగేసుకోవడం అనే ప్రజ్ఞ మనలో ఏదైతే ఉందో దాన్ని ఊర్జితం అంటారు. ఇలా భూమి మీదున్న సరుకంతా మనం attract చేసి అందులో మనము ఉంటూ ఉంటాం. అట్లాగే ఈ జీవితమును ఇట్లా లాగుతూ ఉంటాం. ఏమిటి లాగుతూ ఉంటాము. That has to be answered కదా! ఇట్లా లాగటం వల్ల ఉపయోగము

ఏమిటి?   This is the attracting part of it. అందులో వుంటూ వద్దనుకుంటూ మనం పైకి వెళ్ళిపోతాం. ఇల్లు కట్టడం ఒకటి, ఇల్లు పడగొట్టడం ఒకటి. The ability to attract is called ఊర్జిత. 'ఈషేత్వా ఉర్జేత్వా' అని మనకి ఋగ్వేదము లో ఉన్నది. అవతల విడిచి పెడతాడట, ఆటాడించడానికి ఇవతల దాన్ని పంచి పెడతాడట. ఆటాడిస్తూ జీవిస్తుంటాడు. ఒకళ్ళతో ఒకళ్ళకి ఆటాడిస్తూ ఉంటాడు. Mutuality మీద పనిచేస్తుంది సృష్టి అంతా. ఈ తత్వాన్ని ఉర్జితత్వం అంటారు. ఇది భగవంతుని యొక్క తత్త్వముగా చూడాలి. పెంచడం అనేది భగవద్ తత్వం. అది కానిది మానవ జీవితంలో కానీ, సృష్టిలో కానీ ఉండడానికి వీల్లేదు. Micro, Macro రెంటినీ అవగాహన చేసుకుంటే ఈ విధమైన భగవతత్వాన్ని అవగాహన చేసుకోవడం అనేది జరుగుతుంది. అంటే ఇతరులలో ఏమిటి attract చేస్తారంటే ఆ రకం, ఈ రకం అని లేదు. ఒక మహాత్ముడు శుచి, దివ్యత్వాన్ని attract చేస్తుంది. -----------

(మిగిలిన భాగము దొరకలేదు).

## 165,166,167- అతీంద్రః, సంగ్రహః, సర్గః

ఇంద్రుడికి పైన వుండేవాడు. ఇంద్రుడికి అతీతమైన వాడు. 'ఇదం ద్రా' అనే భావన ఇంద్ర అనే పదంలో వుంది. ఇదంతా రక్షించేవాడు ఇంద్రుడు. ఈ'ఇది' కి ఒక'అది' వుంది, 'అది' ని 'తత్' అంటాము. మన మనసు మన కార్యక్రమాలని ఎలా అయితే చక్కబెడుతూ వుంటుందో సృష్టికి సంబంధించిన దివ్య ప్రణాళికని చక్కబెట్టడానికి సృష్టికి ఒక మనసు వుంది. ఏర్పడినటువంటి ఈ సృష్టిని రక్షించేవాడు ఇంద్రుడు. మనం చేసుకున్న సృష్టిని మనం రక్షించుకుంటూ వుంటాం కదా మన మనసు చేత, అలాగే ఈ దివ్య ప్రణాళిక ప్రకారం జరిగేదాన్ని ఆయన సంరక్షిస్తూ ఉంటాడు. ఆయనకి చేతకానిది ఏవైనా వుంటే ఆ పైనుంచి ఆయన దిగివస్తూ ఉంటాడు. అంటే సృష్టికి ఒక ప్రణాళిక ఏర్పరిస్తే ఆ ప్రణాళిక ఇంద్రుడు అవుతాడు. అందుకని సృష్టి అంతా ఇంద్రుడికి లోబడే పనిచేస్తుంది. ఇంద్రుడు పనిచేస్తుంటే భగవంతుడు కాళ్ళకీ చేతులకీ అడ్డుపడడు. ఇంద్రుణ్ణి చేయనిస్తూ ఉంటాడు. ఇంద్రుడు చేసే దానిలో ఏదైనా పొరపాటు వుంటే తను దిగి వస్తూ వుంటాడు. అందుకని ఇంద్రుడికి అతీతంగా ఉంటాడన్నమాట. అంటే manager కి పని అప్పజెప్పి owner, manager ని చెయ్యనిచ్చినట్టు. Manager పనిచేస్తూ వుంటే owner మాటిమాటికీ కాళ్ళూవేళ్ళూ అడ్డు పెడుతూవుంటే, manager పనిచేయలేడు. Owner ఒక managerని appoint చేసుకుని ఆ manager ద్వారా తనయొక్క వ్యాపారాన్ని నడిపిస్తూ, ఆ వ్యాపారం సరిగ్గా నడుస్తున్నదో లేదో పైనుంచి పర్యవేక్షిస్తూ ఉంటాడు తప్ప, పనిలోకి యజమాని దిగడు. దిగితే ఇంక manager ఎందుకు? కొంతమంది manager లను పెట్టుకుని వాళ్ళతో పాటూ వీళ్ళూ పనిచేస్తూ వుంటారు. ఆ పనిచేసే manager లని పని చెయ్యనీయకుండా వీళ్ళ యొక్క ఆదుర్దా అడ్డుపడుతూ వుంటుంది. They are not good owners. A good owner is one who is able to delegate with confidence and allow the managers to function. ఒకపని ఎవరికైనా అప్పజెప్పే ముందే ఎవరికి అప్పజెప్పుతున్నామో మనకి వాళ్ళమీద విశ్వాసం వుండి అప్పజెప్పాలి, లేకపోతే అప్పజెప్పకూడదు. అప్పజెప్పిన తరువాత మాటిమాటికీ వాణ్ని సతాయించకూడదు. ఎందుకంటే వాడు చేస్తాడనే విశ్వాసంతోనే నువ్వు అప్పజెప్పావు కాబట్టి, అప్పజెప్పిన తరువాత సతాయించడం అనేది అసమర్థులు చేసే

పని. నీకు విశ్వాసం లేకపోతే అసలు అప్పజెప్పనే వద్దు. అప్పజెప్పిన తరువాత అతను పని చేసి నీకు report చేసే అంతవరకూ చూడు. అలావుంటాడు భగవంతుడు. He is the best owner who can delegate the functions and allow the functionaries to function. ఇంద్రుడికి అప్పజెప్పాడు. ఇంద్రుడికి మళ్ళీ అష్టదిక్పాలకులు ఏర్పడతారు ఇంద్రుడితో కలిపి. వాళ్ళ పని ఇంద్రుడు చూసుకుంటాడు. మళ్ళీ అష్టదిక్పాలకులతో తను వాళ్ళతో direct గా మాట్లాడి, ఇంద్రుణ్ణి పక్కనపెట్టి వాళ్ళతో politics, ఇలా వుండవు. అంటే manager కింద ఒక deputy ని పెట్టుకుని, manager ఎలా చేస్తున్నాడో ఈ deputy ని మనకి report చెయ్యమనడం అన్నమాట. It is bad management. నీకు confidence లేకపోతే అలా చేస్తావు. ఇప్పుడు అలాగే కదా నడుస్తూ వుంటాయి అన్నీ. ఒకడికి ఒక పని అప్పజెప్పి వాడిమీద ఇంకొక నిఘా, సృష్టిలో అలా ఉండదు. సృష్టిలో భగవంతుడు అలా అప్పజెప్పేసి వాళ్ళు చేస్తూ వుంటే తను పర్యవేక్షిస్తూ వుంటాడు. మనలో కూడా నిజమైన అతీంద్రియత్వం అనే భగవంతుని యొక్క తత్వం పరిపూర్ణంగా పనిచేస్తున్నట్లయితే, ఒకరికి అప్పజెప్పి వాళ్ళు పని చేస్తూ వుంటే వాళ్ళని పర్యవేక్షిస్తూ వుండడం అనే ఒక స్వభావం, ఒక కళ్యాణగుణం ఏర్పడుతూ వుంటుంది. కొంతమంది అస్సలు అప్పజెప్పలేరు. అంటే భగవంతుని యొక్క అతీంద్ర అనే తత్వం వారి జీవలక్షణం లో పనిజేయడంలేదు అని అర్థం. కొంతమంది అప్పజెప్పి వాళ్ళని చెయ్యనీయకుండా సతాయిస్తూ వుంటారు. వాళ్ళు కూడా లాభం లేదు. అప్పజెప్పి వాళ్ళు చేస్తూ వుంటే, వాళ్లకి నేర్పాలి. అప్పుడు నువ్వు బయట వుండొచ్చు. నీకు ఎప్పుడు తెలిపి? అన్నీ నువ్వు చేసుకుంటూ వుంటే నీకు తెలిపి వుండదు కదా? నీకు ఎప్పుడు తెలిపి వస్తుంది? నువ్వు చేసేపని అందుకోవడానికి ఎవరైనా వచ్చినప్పుడు వారికి అప్పజెప్పి, వాళ్ళు చేస్తూ వుంటే వాళ్లకి నువ్వు వెనుక వుండి, వారికి విశ్వాసం కలిగించి, ఈయన వున్నాడు మన వెనుక అని వారికి అనిపించేలా వుండాలి. ఏదైనా అవసరమైతే ఆయన వున్నాడు అనిపించాలి. వాళ్లని చెయ్యనివ్వాలి తను వెనుక వుండాలి. కృష్ణుడు అర్జునుడికి అలా వెనుక కాపు కాసి వున్నాడు. అలా వెన్నుకాచి వుంటాడు భగవంతుడు. అర్జునుడు చేసినంతసేపూ చెయ్యనిస్తాడు, అర్జునుడు ఇబ్బందిలో పడితే తను చేస్తాడు. అలాగే మన మనసు కూడా మన నుంచి వ్యక్తమయ్యే కార్యక్రమాలు చేస్తూ వుంటే, దాన్ని పర్యవేక్షిస్తున్నట్టుగా మనం వుండాలి. మనం చేస్తున్న పనులని మనలోంచే మనం

పర్యవేక్షణ చేసే వాళ్ళుగా వుండాలి. అంటే మన మనస్సు అప్పుడు మన deputy అయ్యి పనిచేస్తూ వుంటుంది. అసలు మనం ఏం చేస్తున్నాము? మన మనసు ద్వారా వచ్చే ఆలోచనలు ఏమిటి? అవి ఏ విధంగా నిర్వర్తింపబడుతున్నాయి? దానికి ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయి? అందులో ఎంత పవిత్రత వున్నది, ఎంత అపవిత్రత వున్నది. ఏం చెయ్యాలంటే రోజూ మన manager తో First hour లో ఒక చిన్నసమావేశం/మీటింగ్ పెట్టుకోవచ్చు. ఆ సమావేశంలో మనమూ, మన manager. మామూలుగా మనమూ మన manager అంటే మన మనసు ఒకటైపోయి వుంటాం. దానివల్ల ఈ అతీంద్రత్వం లేక వాడు మనని మింగేసి కూర్చుంటాడు. మనం చెప్పేది మనసు వినడం అంటూ ఏమీ లేదు. మనసు చెప్పేది మనం వినడమే మామూలుగా జరుగుతూ వుంటుంది. అసలు మనసూ, మనం మాట్లాడుకునే పరిస్థితి ఏది? మనం మనసుకన్నా అతీతమై వున్నాం, అన్న భావన మనకి లేనప్పుడు, మనసూ మనం మాట్లాడుకునే పరిస్థితి లేదు. మహాత్ములు మనసుతో మాట్లాడుకుంటూ వుంటారు. తన మనసుతో పొద్దున్నే కూర్చుని, 'నిధి చాలా సుఖమా రాముని సన్నిధి చాల సుఖమా, నిజముగ తెలుపవె మనసా' అని అనగలిగాడు త్యాగయ్య. ఎందుకనీ? ఆయన వేరు, ఆయన బహిర్గతమైన కార్యక్రమములు చేసిన మనసు వేరు. ఆ మనసుతో ఆయన మాట్లాడారు. ఇవికావాలి, అవికావాలి అని ఎందుకు నన్ను బాధ పెడతావు? నిజంగా అవి సుఖాన్నిస్తాయా? అవి ఇవ్వవు కదా? ఎందుకు వాటిల్లో నన్ను తిప్పి బాధ పెడతావు చెప్పు? అని మనసుని అడుగుతున్నాడు ఆయన. మహాత్ములందరూ మనసుతో మాట్లాడిన వాళ్ళే. 'మనసా ఓ మనసా నీవెవరో నీకు తెలుసా?' అనే పాట కూడా వుంది. అసలు మనసు అడగాలి మనని, నీవెవరో నీకు తెలుసా? అని. సినిమా పాట కాబట్టి కొంత inversion లో వుంది. మనం అతీంద్రత్వం సాధించాలనుకుంటే రోజూ పొద్దున్నే మనం మనసుతో మాట్లాడాలి. మూడు విషయాలు మాట్లాడాలి ప్రతీరోజూ. ఒకటి in terms of your income earning activity, how is your mind oriented? And how is your mind utilising your energy? What is its attitude? How much it uses you for that purpose? ఆర్జన విషయంలో నువ్వు నీ మనసుకి ఎంత లోబడి వున్నావు? నువ్వు ఏమైనా ఒక ప్రణాళిక వేసి మనసుకి ఇస్తే అది execute చేస్తుంది. దానికి ఓ clarity రావాలి. అసలు మనకి ఏం కావాలి అనేది

పొద్దుపొద్దునే తెలుసుకోవాలి. ఒక సంవత్సరానికి లేక రెండేళ్ళకో లేక ఏడేళ్ళకో లేక పదేళ్లకో ప్రోగ్రాం ఒకటి తెమిలి పోవాలి. జీవితమంతా సంపాయించడంతోనే అయిపోయిందనుకోండి, ఏం చేస్తాం, అదేమీ నమిలి మింగేదికాదు. అదలా వుంటుంది, అది పెరిగినకొద్దీ, దాన్ని మనం కాపలా కాసుకోవాలి. అందుకని, do you have a limit or you don't have a limit about it? అసలు అది నీకు తెలుసా? Do you know about it? సగటు భారతీయుడికి దానితోనే జీవితం అంతా ఖర్చయిపోతుంది. తెమలదు. భారతీయులకి ధనేచ్ఛ అనేది చాలా విపరీతం. ఆ విషయంలో పాశ్చాత్యులు మనకన్నా కొంచెం బావున్నారు అనిపిస్తుంది. కాస్త ఏదైనా కలిగితే చాలు కదా, ఓ రెండుమూడు ఏళ్ళు దీనితో అసలు సృష్టి, సృష్టిలో వుండే జీవులు ఏవిధంగా వున్నారో చూసొద్దాం అనుకుంటారు వాళ్ళు. మనకి దాచునేదంతా బలంగా అనిపిస్తుంది. అదేమిటో మనకి సహజంగా మానసిక దౌర్బల్యం ఒకటి వుంది. ఎంత పోగేసినా ఆ దౌర్బల్యం తీరదు. బలం రాదు దానికి. ఆ దౌర్బల్యం దౌర్బల్యంగానే వుంటుంది. ఇదేనా ప్రోగ్రాం ఇంకేమన్నా ఉందా? అని రోజూ అడగాలి, అడిగితే you will get an answer. ఇంకేవన్నా ప్రోగ్రాం వుంటే దీన్ని కొంచెం ఒక పరిమితిలో ఉంచుకుని ఆ ప్రోగ్రాంలోకి enter అవాలి. రెండవది భార్యాపిల్లలు. అలాగే భార్యకి భర్త పిల్లలు, వీళ్ళకి ఒకరికి ఒకరు చేసుకునే కర్తవ్యాలు వున్నాయి తప్ప, అంతకు మించి ఏమీలేవు. వున్నాయి అనుకుంటే మళ్ళీ అదే పెద్ద ప్రోగ్రాం అయిపోతుంది జీవితంలో. అవి ఎప్పటికీ తెమలవు. ఈ రోజుల్లో ఎలా తయారయ్యారంటే మనుషులు, తమ మనవలకి కూడా వీడే plan చేసేస్తూ ఉంటాడు. మనవడు ఏం చదువుకోవాలి? వాడికి ఏ స్కూలు లో సీటు రావాలి? సీటు రావాలంటే ఎవణ్ని పట్టుకోవాలి? వీడికి ఎందుకు? కొడుకు చూసుకుంటాడు కదా! అలా వుండదు. కొడుక్కి ఏం తెలుసు? వాడికి ఏమీ తెలియదు. అన్నీ మనకే తెలుసునన్న భావంతో మనవలకి కూడా plan చేస్తాడు. పూర్వం ఋషులు ఎలా వుండేవాళ్ళో తెలుసా? నిజమైన మార్గం అది. ఎంత ధీరత్వంతో కూడిన మార్గమో! మొదటి ఏడు సంవత్సరములూ పిల్లలు వాళ్ల ఇష్టం వచ్చినట్లు వాళ్ళు పెరగొచ్చు. వాళ్ళు పెరుగుతున్న పరిసరాల్లో పిల్లలు వుంటారు కాబట్టి, మనం ఏర్పరిచిన పరిసరాల యొక్క ప్రభావం వాళ్ళమీద వుంటుంది, అంతకుమించి వుండదు. వాళ్లకి వారి శరీరం మీద ఆధిపత్యం, ఒక రకమైన స్వామిత్వం, సంపాదించుకోవడంతోటే సరిపోతుంది. కాబట్టి ఆ ఏడు సంవత్సరాలు the father is not so much

concerned about the child. That is Asian Aaryan way of life. తల్లి సంరక్షణ చేస్తూ వుంటుంది, తండ్రి చక్కని వాతావరణం కల్పించి వుంచుతాడు అంతే. ఆ వాతావరణంలో పెరుగుతూ వుంటారు. Whatever is picked up is picked up, is picked up, whatever is not picked up is not picked up. ఈ బాలారిష్టాలు తీరెంతవరకూ తండ్రి అసలు చూడడుట. ఎందుకంటే ఒక రకమైన నిర్లిప్తత, తన కొడుకు అన్న భావన వ్యామోహం కదా? వచ్చిన వాడు జీవుడు, తన ఇంటికి వచ్చాడు. వాడు అసలు నిలబడతాడో నిలబడడో వాడు తేల్చుకుంటాడుట మొదటి ఏడేళ్ళల్లో. వాడు ఉంటాడో వూడతాడో. తేల్చుకున్న తరువాత, ఏడవయేట ఉపనయనం చేసిన తరువాత తండ్రి బ్రహ్మోపదేశం చేస్తాడు కదా? ఆ రోజునుంచీ he takes up the responsibility. From the seventh year, the father takes up the responsibility. How long? Till the 21st year. He makes sure that the child does not spoil itself during the Teenage, because that is the most dangerous period in any man's life. ఏడు సంవత్సరాల నుంచీ ఇరవైఒక్క సంవత్సరాల వరకూ he takes complete charge of his life. తను ఇవ్వవలసిన సమస్తం అప్పుడు ఇస్తాడుట. పిల్లవాడు వాడికున్న సంస్కారం బట్టి ఎంత పుచ్చుకుంటే అంత పుచ్చుకుంటాడుట, పుచ్చుకోకపోతే వదిలేస్తాడు. ఇరవై ఒకటి వయసు వచ్చిన తరువాత వాడి విద్య పూర్తి అవ్వగానే వాడికి శుభ్రంగా పెళ్ళిచేసి go and live by yourself with that which I have given as education or as విద్య. అలా ఉందా మనకి? పుట్టక ముందు నుంచి planeలు వేసేస్తూ వుంటాం, వాడు పుట్టిన దగ్గర నుంచి వాణ్ని ముద్దులు పెట్టుకోలేక బాధ పడిపోతూవుంటాం. వాడేమో ముందు చంకనెక్కుతాడు, ఆ తరువాత నెత్తినెక్కుతాడు. ఆ తరువాత మన తల కొట్టుకుంటాము. 7 to 21 years- నువ్వు ఏమైనా ఇవ్వదలచుకుంటే వారికి అప్పుడు ఇవ్వు. వారు పుచ్చుకోదలచుకున్నారు పుచ్చుకున్నారు. పుచ్చుకోలేదు పుచ్చుకోలేదు. నీ పని అయిపొయింది. You are here as a trustee to the soul that has arrived into your family. You have nothing else to do for him. వాడు ఎక్కణ్ణుంచో వచ్చాడు, ఎక్కడికో పోతున్నాడు. ఇక్కడున్నాడు మనతో ఈ స్టేషన్లో, we have a duty towards him. ఇంతకుమించి పెట్టుకున్నారంటే ఇక లంపటమైపోతుంది. ఇరవై ఒక్క సంవత్సరాలలో నువ్వు తీర్చి

దిద్దలేకపోతే ఇక వదిలేయ్, at least వాణ్ణి వాడుతీర్చి దిద్దుకుంటారు, వాడికి ఎలా వీలుంటే అలా. Self dependent units గా తయారయ్యే సామర్థ్యం నువ్వు ఇవ్వాలి తప్ప, వాళ్ళ వెంటపడి దేకడం అనేది ఎప్పటికీ తెగదు. మనం పోతున్నా కూడా తెగదు. ఇది రెండవది. ఇక మూడవది మనతో నడిచే ఆవిడ. ఆవిడా నువ్వూ కలిసి నడుస్తారు కాబట్టి ఆమె యందు నీకూ, నీయందు ఆమెకూ కర్తవ్యం వున్నది. ఒకరితో ఒకరికి ఒక చక్కటి agreeability ఏర్పరుచుకుని బండికి రెండు ఎడ్ల లాగ చక్కగా నడిచే పద్ధతిలో ఆవిడని నువ్వు మలచుకోవడం, నువ్వు ఆవిడకి తగినట్లుగా మలచబడడం, ఈ రెండూ జరగాలి. నేను ఎలా పడితే అలా లాగుతా నువ్వు నన్ను follow అవ్వు అని ఎవరు అన్నా లాభంలేదు. భార్యా భర్తల్లో ఎవరు ఎవర్ని follow అవ్వాలి అంటే ఎవరో ఒకర్ని follow అయితే వాళ్ళు రెండవ వాళ్ళని follow అవ్వాలి. If you want to be a leader, you should know how to be a follower. If you know how to be a follower, you are already a leader. If you want your wife to follow you, you better follow your wife and if you want your husband to follow you, you better follow your husband. Following అంటే ఏమిటి అవుతుంది అంటే ఇక్కడ, accepting others viewpoint and accommodating them. అది జరిగినప్పుడు ఇద్దరి మధ్య understanding పెరిగి harmony పెరుగుతుంది. ఆతరువాత దేహ సంబంధమైన ఆత్మీయత కాకుండా ఆత్మ సంబంధమైన ఆత్మీయత పెరుగుతుంది. ఆత్మీయత అంటే ఆత్మ సంబంధమైనది. మమకారం బదులు ప్రేమ అప్పుడు పుడుతుంది. ప్రేమ అంతవరకూ పుట్టదు. Viewpoints ఉన్నంతవరకూ ప్రేమ పుట్టదు. ఇద్దరిదీ ఏకాభిప్రాయము వచ్చేస్తుంది. అంటేఆవిడ చెప్పినవి ఈయన ఒప్పుకుంటూ ఉంటాడు, ఈయన చెప్పినవి ఆవిడ ఒప్పుకుంటూ వుంటుంది. వయసు పెరిగినకొద్దీ ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి ఆ విధమైన అనురాగం ఏర్పడుతూ ఉంటుంది. ఎందుకంటే కలిసి లాగారు కాబట్టి మొత్తం బండిని. ఈ మూడిటికీ సంబంధించినవి, ప్రతీ పొద్దున్నా మాట్లాడుకోవాలి.It is very important in the life of the one who would like to be a disciple. What am I doing in terms of livelihood? Does it have any program? Or is it an unending program? What am I doing about the children who are entrusted to us? And how am I with my life partner? ఈ ప్రశ్నలు

రోజూ వేసుకుంటే నీకూ, నీ మనసుకీ ఒక understanding వస్తుంది. మనసుతో execute చేసుకుందాం అనుకున్నది దాని ప్రకారం నువ్వు execute చేస్తుండచ్చు, మనసు పనిచేస్తుంటే దాని వెనుక నువ్వు ఉండొచ్చు. మనం చేసే ప్రతీపనీ కూడా మనతో పాటూ ఇంకొకరికి నేర్పుతూ వుండాలి, ఏ పని అయినా సరే. ఇంట్లో సాంప్రదాయాలకి సంబంధించినవి అన్నీ నీ కొడుక్కి నేర్పుతూ వుంటే, ఆ తరువాత నువ్వు పక్కన వుంటే కొడుకు చేస్తూ ఉంటాడు. ఎన్నాళ్ళు మీరు చేస్తారండీ ఇంట్లో పనులు? అంటే కొడుకు చేతికి అందివచ్చే అంతవరకూ కదా? ఎన్నాళ్ళు వంటింట్లో వుంటారండీ? అంటే, మన సాంప్రదాయంలో ఒక భార్య ఏం చెప్తుంది అంటే కోడలు లేదా కూతురు చేతికి అందివచ్చే అంత వరకూ అని. Substitutes prepare చేసుకోకపోవడం చాలా అసమర్థత. మాస్టారు దీని గురించి చాలా చెప్పేవారు. నాకు ఎవరూ లేరు, నాకు ఎవరూ పనిచేయరు అని వెష్ట పరుస్తూ వుంటారే? ఎవరూ లేరు, ఎవరూ పనిచేయడంలేదు అంటే మనలో ఎదో లోపం వుంది అని గుర్తించాలి. అంటే మనం ఎవరికీ పని నేర్పడం లేదు అన్నమాట. ఇంకొకళ్ళకి పని నేర్పితే వాళ్ళు చేస్తూ వుంటే మనం కొంత తేలిక పడవచ్చు. ఇలా ఇంట్లో పనులు ఇంట్లో కొంతమందికి నేర్పి, ఆఫీసులో పనులు ఆఫీసులో కొంతమందికి నేర్పి, సరైన Substitute దొరికే అంతవరకూ మనం చేసుకుంటూ వుండాలి. శ్రద్ధాభక్తులు వున్నవాడు దొరికితే, వాడికి నేర్పి, వాడియందు మనం అనురాగం చూపిస్తే, మనకి చేదోడు వాదోడుగా ఉంటాడు. అలాగే సంఘంలో నువ్వు చేసే పనులు కూడా ఇంకొకళ్ళు చేసేటట్టుగా తయారు చేసుకుంటే, అప్పుడు నువ్వు చక్కగా వెనకాల వుండి అవి నడుస్తూ వుంటే చూస్తూ ఉండొచ్చు. ఇలా నడుపుతున్నాడు భగవంతుడు మొత్తం. ఈ మొత్తంలో భగవంతుడు వున్నాడు. ప్రతీదీ వాటి వాటి ధర్మాల ప్రకారం అవి పని చేస్తున్నాయి. ఉప్పుకి ఉప్పు ధర్మం. ఖనిజములకు ఖనిజముల ధర్మం, వాటి ప్రకారం అవి పనిచేస్తూ వుంటాయి. జలములు జలముల ధర్మాల ప్రకారం పనిచేస్తూ వుంటాయి. అగ్ని అగ్ని ధర్మం ప్రకారం పనిచేస్తూ వుంటుంది. ఈయన అక్కడ ఉంటాడు అంతే! వాయువు వాయువు ధర్మం ప్రకారం పనిచేస్తూ వుంటుంది, ఆకాశం అకాశ ధర్మం ప్రకారం పనిచేస్తూ వుంటుంది, చిత్తం దాని ధర్మం ప్రకారం అది పనిచేస్తూ వుంటుంది, బుద్ధి దాని ధర్మం ప్రకారం అది పనిచేస్తూ వుంటుంది, అహంకారం దాని ధర్మం ప్రకారం అది పనిచేస్తూ వుంటుంది. ఇలా అష్ట ప్రకృతులూ వాటి వాటి ధర్మాల ప్రకారం అవి వర్తిస్తూ వుంటాయి. ఈయన అక్కడ ఉంటాడు

అంతే! అలాగే మనం వుంటే, ఇంట్లో వాళ్ళు వాళ్ళు చెయ్యాల్సిన పని వాళ్ళు చేసుకుంటే, మనం ఆఫీసులో వుంటే, ఆఫీసులో వాళ్ళు వాళ్ళు చెయ్యాల్సిన పని వాళ్ళు చేసుకుంటే, అలాగే సంఘపరమైన కార్యక్రమాలని మనం వున్నామనే ధైర్యంతో పనిచేసుకుంటూ వున్నారనుకోండి, అదీ చాలా సుఖమైన పరిస్థితి. అది అతీంద్రత్వం అంటే. ఎన్నాళ్ళు పోయినా అంటే ఓ నలభై ఏళ్ళు పోయినా మన పని మనం చేసుకునేలా వదలలేం, ఎందుకంటే భయం. ఇంకొకడికి అప్పజెప్పితే మనకి ఏమౌతుందో అని. ఇటువంటి భయము వున్నవాడు ఇంద్రియాల్లో బద్ధుడై ఉంటాడు తప్ప అతీంద్రత్వం రాదు. అతీంద్రత్వం ఎవరికి వస్తుంది అంటే తను చేస్తున్నపని ఇంకొకళ్ళకి అప్పజెప్పి, వాళ్ళకి నేర్పి, వాళ్ళ చేత చేయించి, వాళ్ళు చేస్తూ వుంటే తను నెమ్మదిగా withdraw అయిపోయి వెనుక వుండగలిగేవాడికి. నువ్వు చేస్తున్నావు, వాడికి నేర్పుతున్నావు, వాడితోపాటూ నువ్వు చేస్తున్నావు, వాడు చేస్తుంటె కాళ్ళకీ చేతులకీ అడ్డుపడిపోతున్నావు అంటే నీకు విడిబడే ధైర్యంలేదు అని అర్థం. విడిబడడం ఎప్పుడు వస్తుంది అంటే ముందు మనకి విశ్వాసం కలగాలి. తరువాత ఎప్పుడూ మనం చేసే పని మనం చేయడం ఎందుకు ఇంకొకరికి నేర్పి మనం వెళ్ళొచ్చుకదా అనిపించాలి. అది Theory of Substitution అని భగవద్గీతలో చెప్పబడి వున్నది. నువ్వు చేస్తున్నపని ఇంకొకళ్ళకి నేర్పి ఆ తరువాత నువ్వు వెనుక సీట్లో కూర్చో. నువ్వు ముందు సీట్లో కూర్చుని కొన్నాళ్ళు driving చేసావు. వెనుక సీట్లో కూర్చుని ముందువాడు drive చేస్తూవుంటే వాడి కాళ్ళకీ వేళ్లకీ అడ్డుపడి మాటిమాటికీ జాగ్రత్త!, Brake వెయ్యి!, Gear మార్చు! ఇలా అరుస్తున్నారనుకోండి. వుంటారు అలా కొంతమంది, వెనుక కూర్చుని ముందు వాళ్ళని drive చేస్తూ వుంటారు. అంటే నువ్వు ఇంకా డ్రైవర్ గానే వున్నావు, ఊరికే వెనకాల కూర్చున్నావు అన్న పేరే తప్ప నీకు సుఖం లేదు. అంటే, traveller సుఖం లేదు. డ్రైవర్ యొక్క effort mentalగా ఇంతకన్నా మొదటవాడు drive చేస్తున్నప్పుడు ఇంకా harmonious గా ఉంటాడు. వెనుక కూర్చుని ఇంకా ఆవేశపడుతూ ఉంటాడు. ఇంద్రియాలలో విపరీతంగా బంధింపబడినవాళ్ళు అలా వుంటారు. ఇంకొకళ్ళకి పని అప్పజెప్పి వాళ్ళచేత చేయించలేనివాళ్ళు. వాళ్ళు అతీంద్రులవ్వడానికి వీలు లేదు. ఈ అతీంద్రత్వం అనే భగవద్ తత్వంలోకి మనం ప్రవేశించాలంటే delegate with confidence, train them and allow them to function and remain in the background then, you have gained

the quality of అతీంద్రత్వం. అది రావాలి. మనం మామూలుగా చేసే చిన్న చిన్న పనులే, అంటే కూరలు కొనడానికి వెళ్తున్నాము అనుకోండి. కొంతమంది మగవాళ్ళు వెళ్తూ వుంటారు కూరలు కొనడానికి, అదివాళ్ళ అబ్బాయికి నేర్పిన తరువాత వాడు ఆగొచ్చు. కదా! ఇలాగే ఇంట్లో పిల్లలు పెద్దవాళ్ళు అవుతూవుంటే వాళ్లకి పనులు చెప్పి మనం వెనక్కి తగ్గుతూ ఉండొచ్చు. ఆఫీసులో పనులు కూడా మనతోపాటూ కలకాలం పనిచేస్తున్న వాళ్ళల్లో కూడా ఎవరో ఒకడు పూర్ణంగా విశ్వాసం వున్నవాడు దొరుకుతాడు, దొరక్కపోడు. ఎవరూ లేరని మనం ఎందుకు అనుకుంటాం అంటే మనం ఎవరినీ రానీయం, ఎవరినీ చేరనీయం. చేరితేవాడు ఏదైనా చేసేస్తాడేమో అని భయం. అలా అప్పజెప్పి మనం జాగ్రత్తగా కాస్త attitude బట్టి you can retire. ఇట్ల ప్రతీ విషయంలోనూ తను వెనుక వుండి ముందుకు నడిపించడం, అదీ కృష్ణుడు చేసి చూపించాడు. 'నేనుంటానయ్యా, నేనుయుద్ధం చెయ్యనయ్యా. నువ్వు వున్నావు కదా నువ్వు చెయ్యి. నీకు అవసరం అయితే నేను వుంటాను. నీకు అవసరం మామూలుగా వుండదు ఎందుకంటే నీకు అన్నీ నేను నేర్పుకున్నాను కాబట్టి. నువ్వు చేస్తూ వుండు', అదీ అతీంద్రుడు. ఇంద్రుడు ఈ మొత్తం సృష్టికి రాజు. ఆయన పర్యవేక్షణలో మొత్తం అంతా జరిగిపోతూ వుంటుంది. అందుకనే వేదంలో ఇంద్రుడు కథానాయకుడు. మనం అనుకున్న విష్ణువు కన్నా ఎక్కువగా చూస్తారు. ఎందుకనీ? నడిపించేవాడు ఆయన. నిర్వాహణ అధికారి అన్నమాట. ఆ నిర్వాహణ అధికారి నిర్వహిస్తూ వుంటే ఈయన (విష్ణువు) ఆయన వెనకాల నిలబడి ఉంటాడు. అదీ అతీంద్రుడు. ఈ అతీంద్రత్వం అనేది జన్మలో జరగకపోతే మోక్షం అనేది కల్ల. మోక్షం అంటే అదేదో అయిపోతుంది, మనం ఆకాశంలో కూర్చుంటాం అనుకోకండి. ఏం చేస్తారు? ఆకాశంలో కూర్చుంటే కప్పు కాఫీ కూడా దొరకదు. ఎవడొచ్చి ఇస్తాడు మీ దగ్గరకి? ఏది లేకపోతే మనం బతకలేం అనుకుంటున్నామో, అవన్నీ లేకపోయినా బతకగలగడం మోక్షం. నీకు నువ్వే ఆధారం, ఇక మిగతావి ఏవీ ఆధారం కాదు. దాన్నే 'నిరాలంబ యోగం' అని చెప్తూ వుంటారు. You are support to yourself and nothing else is support to you and you are support to everything. తరువాత వస్తుంది 'ధృతాత్మా' అని. Understand that you are supporting everything and who is supporting you? 'The self'. You remain in that and nothing else that you acquire outside can be a support to you.

మనం పెట్టుకున్న సంఘాలు మనకి support అనుకుంటాం, కాదు. మనం పెంచుకున్న పిల్లలు మనకి support అనుకుంటాం, కాకపోవచ్చు. మనం పెంచుకున్న ఆస్తులు మనకి support అనుకుంటాం, కాదు. వాటికే మనం support చేస్తూవుండాలి. ఏ రోజు నువ్వు పొందిన ఆస్తిని నువ్వు చూడకపోతే ఆ రోజే అది ఇతరుల హస్తగతం అయిపోతుంది. ఎక్కడో పొలం కొని వచ్చాం, పదేళ్ళు అక్కడికి వెళ్ళలేదు అంటే ఎవడో ఈపాటికి అక్కడ పాకలు వేసేసుకుని ఇల్లు కట్టేసుకుని ఉంటాడు. అంతే కదా! పొలం అయినా స్థలం అయినా చూసుకుంటూ ఉండాలి కదా. అంటే ఎవరికి ఎవరు support? That which you think will support you, you are supporting it. That which you think you are holding is holding you. ఏది మనం పట్టుకుని వుందాం అని అనుకుంటున్నామో, అది మనని పట్టుకుని వుంది అని గుర్తు ఉంచుకోండి. ఏదైనా మనం పట్టుకున్నాం అనుకోండి, ఈ చెయ్యి ఎందుకైనా పనికొస్తుందా? నేను వాచీని పట్టుకున్నాను అని నేను అనుకున్నాను గానీ, వాచీ నా చెయ్యిని పట్టుకుంది at the same time. So, this hand is no more useful in so far as I am holding it (వాచీ), because it (వాచీ) is also holding my hand. అందుకని మనం ఏదైతే పట్టుకున్నామో, అది మనని పట్టుకుంది అని గుర్తున్న వాళ్లకి తిరుగులేదు. అలాగే ఆత్మని పట్టుకున్నామనుకో, అది మనని పట్టుకుంటుంది. చాలు. మిగతావి వున్నా లేకపోయినా నడిచిపోతుంది బండి. వాడు నిజమైన ధైర్యం కలిగివున్న వాడు అవుతాడు. అలాంటి స్థితి  మనకి ఏర్పడడానికి ఈ మూడు aspects రోజూ చూసుకోండి. భగవంతుని వైభవంతోనే వదిలేయడం లేదు నేను ఈ క్లాసుల్లో, భగవంతుని వైభవం ఎలా వుంది? అది మనలో ఎలా వుంది? మనం ఏ విధంగా తంటాలు పడుతున్నాం? ఈ తంటాల్లోంచి మనం బయటకి ఎలా రావాలి? దానికి సంబంధించిన కార్యక్రమం. ఇలా చెప్పుకుంటే మనకి ఈ నామాల యొక్క సార్ధకత. ఆయన మనలో వున్నాడు. మనకి ఆధారంగా వున్నాడు. అలా అని మన ఆధారంగా ఆయన లేడు. మనం కూడా మనం మన పిల్లలకి, మన ఆస్తులకి, మన ఆఫీసులకి మనమే ఆధారం. అంతమాత్రం చేత వాటిమీద మనం ఆధారపడడం మొదలుపెడితే ఆరోజు నుంచీ reverse అయిపోతుంది అంతా. దానికి చాలా ధీరత్వం కావాలి. నువ్వు ఉండబట్టి కదా నీ ఇల్లు, నీపిల్లలు, నీ ఆఫీసు, ఇవంతా. వాళ్లకు నువ్వు చేయవలసినది చేసిన తరువాత అంతకు మించి

expectations అన్నీ కూడా problems తీసుకొచ్చి అతీంద్రత్వం అనే స్థితికి చాలా దూరం తీసుకుని వెళ్తాయి. ఇంత సృష్టి చేసిన భగవంతుడికి ఎంత వ్యామోహం ఉండాలండీ? మనకేమో రెండు మూడు ఇళ్ళు ఉంటేనే వ్యామోహం వచ్చేస్తుందే? కాస్త నాలుగు-ఐదు చీరలు, కొంచెం నగలు ఉంటేనే మనకి వ్యామోహం వచ్చేస్తుంది. ఒకరిద్దరు పిల్లలు, ఇంతటితోనే మనం ఇదైపోతున్నామే? ఎన్ని సూర్యమండలాలు! ఎన్ని గోళాలు! ఎన్ని గోళాలమీద ఎన్ని జీవులుగా దిగివచ్చిన వాడికి ఎంత ఉండాలి? అట్లా ఉంటాడు. అవన్నీ తనలోనే వున్నాయి కదా! తనలోంచే బయటకి వచ్చినవి కదా? తన లోంచి వచ్చినవి ఎక్కడ పోతాయి? తన చుట్టూ తిరుగుతూ వుంటాయి. తిరగనీ, you give support to them, but don't depend on that which is a support to you . That which you are supporting if you start living by it, చాలామంది 'ఇక పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు ఇక వాళ్ళు సంపాదించిన దాని మీద బతకచ్చు అనుకుంటారు. అది చాలా తప్పు. వాడి సంపాదన మీద నువ్వు బతకడం ఏమిటి?

ఒక చెట్టు పండుని తీసుకొచ్చి ఆ చెట్టే తినేసినట్టు. ఇంకేమి వుంది? ఆవు బాగా గడ్డిమేసి వచ్చిన పాలన్నీ తానే తాగేస్తోంది అనుకోండి. అలా ఉందా? సృష్టిలో ఆ పద్ధతి లేదు. పిల్లకి పాలు ఇవ్వకుండా తల్లి తాగేస్తే? ఎవరికోసమో అని పోగేసి బ్యాంకులో పెడతాం, బ్యాంకులో అలా వుంచుతారేమిటి నోట్ల కట్ట? వాళ్ళు ఇంకొకరికి ఇచ్చేయడంలేదూ? మనకోసం అని ఇల్లు కట్టుకోవడంలో ఎంతమందికి పంచితే ఇల్లు వచ్చింది? మనకోసం అని చొక్కా కొనుక్కోవడంలో ఎంతమందికి payment చేస్తున్నాం చొక్కా priceలో? ఎక్కడ మనం పోగేస్తూ వుంటే అక్కడ మనకి distribution automatic గా వుంటుంది. నీకోసం నువ్వు చొక్కా కొనుక్కున్నావు అనుకోవచ్చు కానీ పత్తివాడికీ, దారం వాడికీ, చొక్కావాడికీ, షాపువాడికీ అందరికీ కలిపి ఒక్కసారి payment చేస్తున్నావు. నీకు ఒక్కడికే వచ్చింది చొక్కా, ఇంతమందికి నువ్వు payment చేసావు. ఇలా వుంటుంది సంగ్రహము-సర్గము. వచ్చిందల్లా కూడా distributionకే! Distribute చేయకుండా దాచాము అని నువ్వు అనుకున్నా, అది నీ భావనలో ఉన్నా కూడా అది దాచబడదు as it is గా. It is distributed. అందుకని మనం కూడా చాలా పుచ్చుకుంటూ వుంటాం, మళ్ళీ ఇస్తూ వుంటాం. ఎక్కణ్ణుంచో పట్టుకొస్తూ వుంటాం.

ఇంట్లోవాళ్ళు 'అనుకుని' వాళ్లకి distribute చేస్తాం కదా! ఈ'అనుకోవడం' ఒకటి పెట్టి మనచేత distribute చేయిస్తూ ఉంటాడు చెవులు పిండి. వూళ్ళోవాళ్ళ నుంచి పట్టుకొచ్చి ఇంట్లోవాళ్ళకి పంచుతారు కదా. పంచకపోతే మనం వెళ్ళిన తరువాత వాళ్ళే పంచుకుంటారు. Anyway నీతో తీసుకుని వెళ్ళేవి కాదుకదా. ఇదొక తత్వం భగవంతుడిది బాగా అవగాహన చేసుకోవాలి. సంగ్రహిస్తాడు, మళ్ళీ పంచుతూ ఉంటాడు. 'సంగ్రహ సర్గః' అంటే ప్రజా సర్గం అంటారు. సృష్టి చేస్తూ ఉంటాడు. వాటిల్ని maintain చేస్తూ ఉంటాడు, మళ్ళీ అవన్నీ తనలో కలుపుకుంటూ వుంటాడు, మళ్ళీ పంపిస్తూ ఉంటాడు, మళ్ళీ కలుపుకుంటూ వుంటాడు, మళ్ళీ పంపిస్తూ ఉంటాడు. ఎందుకండీ ఇదంతా? అంటే మనం అన్నం తిన్నట్టే, మనం తిన్నదంతా లోపలి వెళ్తుంది, అదే బయటకి వెళ్తూ వుంటుంది, మళ్ళీ అదే లోపలి వస్తూ వుంటుంది ఇంకొక రూపంలో. వదిలింది తింటున్నాం అని ఎన్నడైనా గుర్తించారా? భగవంతుడే ఆ పని చేస్తూ వుంటే మనకి ఏమిటి objection. తనలోంచి బయటకి వ్యక్తమైనది మళ్ళీ తనలోకి వెళ్ళిపోతూ వుంటుంది. అట్ల ఎన్ని రకాలుగా ఇన్ని తయారుచేస్తూ వుంటాడు విడి విడి విడి విడి గా. మనం గోధుమలతో రకరకాలుగా చేసుకుని మళ్ళీ మనమే తినేస్తాముకదా! ఈ విధంగా ముందు gathering, ఆ తరువాత distribution కదా మనం చేసేది? అందుకని సంగ్రహము సర్గము. భగవంతుడు కూడా లీనమైన సృష్టిని మళ్ళీ వ్యక్తం చేస్తూ వుంటాడు. మళ్ళీ వ్యక్తమైన సృష్టిని లీనం చేస్తూ వుంటాడు, ఇదొక ఆట. పిల్లవాడు బొమ్మలన్నీ ఆడుకోవడానికి అమర్చుకుని, ఆడుకుని మళ్ళీ కలిపేస్తాడు అన్నీ. మళ్ళీ ఆటకి బయటపడేస్తూ ఉంటాడు. ఎందుకయ్యా? అంటే వాడికి ఆనందంగా వుంటుంది. Game అని మర్చిపోవడం వలన మనకి దుఃఖం. Game అని గుర్తుంచుకోవడం వలన వాడికి ఆనందం. అలలు చూడండి, సముద్రంలోంచి వస్తూ వుంటాయి వెళ్తూ వుంటాయి. Meaningless గా అనిపిస్తుంది మనకి mind లో sickness వుంటే.When we are sick in mind, we don't like the game. When we are healthy in mind, the liking for games is very high because the whole life itself is a game and the whole creation itself is a game. అసలు ఎందుకు ఆడుకోవాలి వీళ్ళందరూ, ఎందుకు వాడు అలా హాయిగా వుండాలి అని ఏడుస్తూ వుంటాడు sadist. ఒకోసారి, కదా! నువ్వుకూడా ఆడుకోవయ్యా. నిన్ను ఎవరు ఆడుకోవద్దన్నారు? నీకు చేతకాదు.

చేతకాకపోతే నేర్చుకో. ఆడుకునేవాడు సుఖంగా వున్నప్పుడు నువ్వు కూడా ఆడుకోవడం నేర్చుకోవచ్చుకదా! ఇదంతా ఎందుకు అంటే, అది అలాగే ఉంటుంది. నువ్వు పుట్టకముందే ఈ నిర్ణయం అయిపోయింది కాబట్టి. You can participate in it and experience. ఈ game లు వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. సంగ్రహం అంతా కూడా negative pole. సర్గం అంతా కూడా positive pole. Distribution is by positive pole and Gathering is through negative pole. రెండూ వుంటాయి, ఎప్పుడూ జరుగుతూ వుంటాయి. ఒకపక్క నుంచి మనం అణువులన్నీ సంగ్రహిస్తూ వుంటాము శరీరంలోకి, కొన్ని అణువులు దేహాన్ని వదిలేసి వెళ్ళిపోతూ వుంటాయి. Every second and every minute there is formation of atoms in the body and there is dissolution of atoms. అలా జరుగుతూ వుంటుంది. భూమి కూడా అంతే. భూమిలో అంత సంగ్రహించబడుతూ ఉంటుంది. South Pole ఆధారంగా అంతా సంగ్రహిస్తూ/పోగేస్తూ వుంటుంది, North Pole ఆధారంగా అన్నీ distribute చేస్తూ వుంటుంది. ఇంటావిడ పోగేస్తూ వుంటుంది, ఇంటాయన పంచేస్తూ వుంటాడు. ఇద్దరూ పోగేస్తే సృష్టి అవ్వదు. ఎవరు పోగేస్తారో వాళ్ళు ఆడవాళ్ళు, ఎవరు పంచేస్తారో వాళ్ళు మగవాళ్లండీ సృష్టిలో. అంతేగానీ కేవలం దేహాల్ని బట్టి మగా-ఆడా నిర్ణయం చేయకండి. పంచేవాడు మగవాడు, పోగేసేది ఆడది. అదీ లెఖ్క. South Pole పోగేస్తూ వుంటుంది, North Pole పంచుతూ వుంటుంది. Male Energy is distributing energy. Female Energy is gathering energy. కొంతమంది ఆడవాళ్ళు పంచేస్తూ వుంటారు, మగవాళ్ళు 'నీకు అస్సలు లెఖ్ఖా, పక్కా తెలియదు. నీకు ఏమి తెలుసు నేను ఎంత కష్టపడి సంపాదిస్తున్నానో' అంటారు. కొంతమంది మగవాళ్ళు distribute చేస్తూ వుంటే ఆడవాళ్ళు ఆపుతూ వుంటారు. Balance చేస్తూ వుంటుంది. సృష్టిలో కూడా ఇద్దరూ పంచేసేవాళ్ళయితే సంసారం కొల్లేరు అయిపోతుందంట. ఇద్దరూ దాచేసేవాళ్ళయితే సంసారం ఎడారి అయిపోతుంది. ఇది కోల్లేరయితే అది ఎడారి అయిపోవాలి. ఎందుకంటే అందులో ఆనందం ఏమీ మిగలదు, ఎండిపోయి వుంటారు. పోగేసేవాళ్ళు నలుగురికి పెట్టేవాడు, వాడూ బాగా తినగలడు. గుర్తుపెట్టుకోండి, ఎవరైతే ఇతరులకి బాగా పెట్టగలరో, వాడే బాగా తినగలడు. ఇతరులకి పెట్టలేనివాళ్ళు తినలేడు. వాడికేమీ పడదండీ తింటూ వుంటే అంటే, వాడు ఎవరికీ

పెట్టలేదుట అని అర్థం. అందుకే తినాలి అంటే పెట్టిపుట్టాలి అంటారు. సామెతలు సరదాకి రాలేదు. ఇందులో చాలా అర్థం వుంది. ఎంతమందికి మనం పెట్టగలిగితే అంత మనం తినడానికి అర్హత ఉంటుంది. ఎంతమంది నుంచి మనం లాగేసి పోగేసుకుంటే అంత మనకి తినడానికి అర్హత లేదు. ఇవాళ నుంచీ ఇది మానేయి అంటాడు డాక్టరు. ఇంకొన్నాళ్ళు అయిన తరువాత ఇది మానేయి, అది మానేయి అని అన్నీ మానేయమంటాడు. ఇంక ఎందుకు ఇవన్నీ? ఎందుకంటే ఈ distribution దగ్గర problem. Distribution దగ్గర problem, positionలో interest వున్నవాళ్లకి constipation చేస్తుంది. నేను చెప్పలేదు, జ్వాలాకూల్ గారు చెప్పారు. ఎందుకంటే పట్టు కదా? అన్నీ పట్టుకుని కూర్చుంటావు. అది కూడా పట్టుకుని కూర్చుంటావు అని. రానివ్వవు బయటకి. మలమూత్ర విసర్జనలో కూడా పట్టు వుంటుంది. ఎందుకుంటుంది అంటేmind లో పట్టు అది. కొంతమందికి పేపర్ చదివుతూ వుంటే గానీ అది వెళ్ళదు. ఎందుకంటే mind divert చేస్తే తప్ప దాని మీద పట్టు పోదు. అంటే అదిగో కాకి! అని చేతుల్లోంచి లడ్డూ లాక్కున్నట్టు వుంటుంది తమాషాగా.There is what is called Gathering and Distribution, Gathering and Distribution are in equal proportions, you are poised. ఇందులో సమత్వం ఎక్కడ వుంటుంది అంటే, నువ్వు ఎంత పోగేసుకున్నావో అంత distribution channel కూడా వుండాలి. ఊరికే ట్యాంకులో నింపుకుంటూ వస్తే, ఏమౌతుంది? Overflow అయిపోతుంది, అంటే వృధా అయిపోతుంది తప్ప అందులో వుండదు. ట్యాంకు కట్టారు, నీళ్ళు వచ్చేస్తున్నాయి, ఎన్ని నీళ్ళు పడతాయి? ట్యాంకు కదా దానికో limit వుంది. అలాగే నీకు కూడా ఒక limit వుంది. ఆ వచ్చేది నలుగురికీ పంచుతున్నావనుకో సద్వినియోగం అవుతుంది. పంచడం లేదనుకో overflow అయిపోతుంది. You cannot stop that flow. Overflow అవడంవల్ల నిరుపయోగం అవుతుంది.నీకు balance తప్పుతుంది.అందుకనిమనకి వచ్చేది, మనకి వెళ్ళేది అదీ balance sheet అంటే. Spiritual Accountancyలో that which you receive, that which you give రెండూ balance అయితే అక్కడ poise వుంటుంది. సృష్టి అదే! సృష్టిలోస్థితి అది.There is continuous creation by the creative life బ్రహ్మ. There is continuous dissolution by the destructive life or the life that absorbs, శివుడు.When the two are in equal functioning,

when they  are equated, then మనకి ఆధారం దొరుకుతుంది. అందుకని మనకి వచ్చేవి, వెళ్ళేవి రెండూ balance maintain చెయ్యాలి. అది సృష్టిలో కనిపిస్తూ వుంటుంది. అలా చేస్తూ ఉంటాడు భగవంతుడు. అందుకనే ఈ రెండు పేర్లు భగవంతుడికి వచ్చాయి. On one side he releases, on the other side he absorbs. Release చేస్తున్నప్పుడుLet Go! అంటారుట. అందుకే కుడిచేత్తో సంపాదించి, ఎడమ చేత్తో ఇచ్చేస్తారుట. అందుకనే, మనం సినిమాల్లో విశ్వరూపం చూసినప్పుడు, ఒక పక్కజీవులు దిగివస్తూ వుంటారు, మరొక పక్క జీవులు ఎక్కి వెళ్లిపోతూ వుంటారు ఆయన నోట్లోకి. ఈ దిగి వచ్చేవాళ్ళు ఎక్కి వెళ్ళకపోతే ఏమౌతుంది? ఎక్కి వెళ్ళేవాళ్ళు దిగి రాకపోతే ఏమౌతుంది?ఆట అవదు కదా? Tennis ఆడుతున్నారు, బంతి అటూ ఇటూ వెళ్తేనే కదా ఆట అది. ఒకడు బంతి కొట్టంగానే  జేబులో పెట్టుకుని ఇంటికి వెళ్లిపోతే? ఈ double action ని  Law of attraction and repulsion అన్నారు, The Law of Love, The Law of Second Ray అన్నారు. The Law of విష్ణు. సృష్టి స్థితియందు వున్నాడు, అంటే సృష్టికి అధిపతి విష్ణుమూర్తి. సృష్టిలో ఉండాలంటే ఏం జరగాలి? సంగ్రహమూ-సర్గమూ సమానంగా జరుగుతూ వుండాలి, అందుకని సంగ్రహ-సర్గః రెండు నామాలు ఒకచోట పెట్టేసారు. ఈ రెండూ జరుగుతూ వుంటే ఆయన ఉంటాడు. షామియానా సరిగ్గా నిలబడాలంటే అటుపక్క ఒక కర్ర, ఇటుపక్క ఒక కర్ర సరిగ్గా వుండాలి. ఒక కర్రే వుంటే ఆ షామియానా క్రింద మనం కూర్చోవడానికి ఏమీ వుండదు.  రెండు కాళ్ళూ వుంటే మనము నిలబడినట్లన్నమాట. అలా రజస్సు, తమస్సు when they are in proper blend,  there is the satva. సత్వగుణం ఎక్కడి నుంచి వస్తుంది అంటే పదార్థానికీ పరమార్దానికీ మధ్య సరైన balance వచ్చినప్పుడు వుండేది సత్వం. అందుకని విష్ణుమూర్తి గురించి చెప్పేటప్పుడు స్థితి గురించి చెప్పకుండా సంగ్రహము- సర్గము ఈ రెండిటి గురించీ చెప్పారు. ఎంత బావుంది? సంగ్రహానికి వేరే గా కొన్ని అర్థాలున్నాయి. సంగ్రహం అంటే సరిగ్గా గ్రహించడం అనే ఒక అర్థం వుంది. మనకి మామూలుగా ఒకటి చెప్తే ఇంకొకటి అర్థం అవుతుంది.కదా! వాడు చెప్పినది ఒకటి, మనం విన్నది ఒకటి. ఏవిటండీ వినోచ్చారు? అంటే రుద్రాధ్యాయం గురించి వినోచ్చాం అన్నట్టుగా వుంటుంది, చెప్పినది విష్ణు సహస్ర నామము. సామెత వుంది కదా, రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుంది? అని అన్నట్టుగా.  We listen but we

don't. ఆ లోపం ఏదైతే వుందో అది కూడా ఇచ్చి పుచ్చుకోవడంలో సరైన balance లేని వాళ్లకి ఈ problems వుంటాయి. అందులో కొంతమందికి వినపడనే వినపడదు. కదా! సరిగా గ్రహించడం, అది కూడా భగవంతుని కళ్యాణ గుణమే! అంటే ఎదుటి వ్యక్తిని సరిగా అవగాహన చేసుకోవడం. సదవగాహన వస్తుంది. సదవగాహనగా భగవంతుడు తనలో వుండేవాడికి, చుట్టుపక్కల మనుష్యులతో ఇబ్బందులు ఏమీ వుండవు. వాళ్ళు ఇబ్బందులు పడుతున్నా, వాళ్ళ వల్ల వీడికి ఇబ్బంది వుండదు. ఎందుకని? సరైన అవగాహన వుండడం వల్ల. సరైన అవగాహన లేకపోవడంవల్ల ఎక్కువ తక్కువలు చేస్తూ వుంటాం. ఉన్నదానికన్నా ఎక్కువ వుంది అక్కడ, అనుకుని మనమేదో ఎక్కువ చేసాం అనుకోండి, తరువాత నిరాశ వచ్చి మొత్తంనెట్టి అవతల పారేస్తుంది. ఒక గురువు గారిని ఉధృతంగా దేవుడని నమ్మేసి, next year నుంచీ వాడు దొంగవెధవ అని చెప్పుకుంటే? అలాంటి కేసులు కనిపించవూ? దేవుడని నువ్వే అన్నావు, మళ్ళీ కాదనీ నువ్వే అన్నావు, ఆయన దేవుడనీ నిన్ను అనమనలేదు, ఆ తరువాత తిట్టమని అనలేదు. ఈ పొగడమనడం, ఆ తిట్టమనడం రెండూ మనలోని problems, ఎందుకంటే ఉన్నదానికన్నా ఎక్కువ చూసి, దానిమీద ఆశలు పెంచుకుని, నువ్వు పెంచుకున్న ఆశల ప్రకారం ఆయన లేడనుకుని, మళ్ళీఆ ఆశలన్నీ నిరాశలు చేసుకుని, ఆ ముందు పొగడ్తలు తరువాత తిట్లు అయిపోతాయి. మనకి చక్కని పద్యం ఇచ్చారుకద ,"కూరిమి గల దినములలో నేరములెన్నడును గలుగ నేరవు మఱి యా కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!" 'నారాయణా' అంటే అదిగో, తిట్టాడు అంటారు. వాణ్ణిచూసావా? వాడి నడకలోనే ఎంత పొగరు వుంది, అంటాడు ఇష్టం లేకపోతే. అదే వాడు ఇష్టమైతే చూసావా వాడిలో ఎంత ఠీవి వుందో? అంటాడు. రెండూ వీడే అంటాడు. వాడియందు ఠీవీ కనపడకపోవచ్చు, పొగరూ కనపడకపోవచ్చు. రెండూ అవతల వాడిలో వీడు చూసేవే. సంగ్రహం సరిగ్గా లేకపోతే అలా వుంటుంది. అఖ్ఖర్లేనిది ఏరుకుంటాడు, అక్కడ వున్నది ఏరుకోడు. కాబట్టి సన్నివేశాన్ని సరిగా గ్రహించటం, వ్యక్తుల విషయాలలో సరైన అవగాహన కలిగి వుండడం, తీసుకునే విషయాలలో పవిత్రత కలిగి వుండడం. ఇది ముఖ్యం. సరైనదే పుచ్చుకోవాలి. ఎదుటి వ్యక్తిలోని సరైన గుణాన్ని అవగాహన చేసుకుని, ఎదుటివారి సంపదలో సరి అయినదే మనం పుచ్చుకోవాలి. మహాత్ములు అట్లా చెప్తారు. వచ్చిందల్లా పుచ్చుకోరు. ఆవచ్చేదానిలో

వుండే పవిత్రతని బట్టి పుచుకుంటారు. అంటే ఎవరో donation ఇస్తేచాలు అన్నట్టు వుండరు, ఇచ్చిన donation లో purity బట్టి పుచ్చుకుంటారు. అసలు donation లేకపోతే ఏమిటండీ? ఏదో వచ్చింది కదా అని వుండదు. నువ్వుచేసేది పవిత్రమైన కార్యం అయినప్పుడు, దానికి ఇచ్చేవాడి ద్రవ్యం యొక్క పవిత చాలా important. లేకపోతే నీ కార్యముల యొక్క పవిత్రత తగ్గించబడుయుతుంది ఇచ్చేవాడి చిత్తం యొక్క పవిత్రత చాలా important. మహాత్ములు అందుకనే అందరి దగ్గరా తీసుకోరు, అన్ని రకాలుగా తీసుకోరు. ద్రవ్యమూ important, ఇచ్చేవాడి చిత్తశుద్ధి కూడ important . ఇవి రెండూ చూసుకుని పుచ్చుకుంటారు తప్ప, అసలంటూ ఇచ్చారు కదా! అంతే చాలు అన్నట్టుగా వుండదు. చాలా మందిని మోసం చేసి ఒక లక్షరూపాయల donation ఆధ్యాత్మిక సంస్థకి ఇచ్చిన వెంఠనే వాడి ఇంటికి వెళ్లి వాడి చుట్టూ తిరిగి donation collect చేసుకొచ్చాము అనుకోండి, purity అన్న concept అసలు లేనట్టే. వాడొచ్చి ఇస్తానంటే అందులో  పాత్రత ఎరిగి మనం పుచ్చుకోవాలి. అదీ సంగ్రహం. ఏదిపడితే అది పుచ్చుకోవడం. అసలు పుచ్చుకోవడం దగ్గర ఒక filter ఉండడం సంగ్రహం. ఇచ్చేచోట కూడా అలా ఒక filter వుంటుంది, అపాత్రదానం జరుగకుండా. అవసరం లేనివాడికీ, అశ్రద్ధ వున్నవాడికీ, దుర్వ్యసనాల పాలైనవాడికీ వీళ్ళకి సహాయం చేయడం వల్ల అవి పెంచుతావు. వ్యసనాలున్న వాడికి సహాయం చేయడంవల్ల ఉపయోగంలేదు. అశ్రద్ధ వున్నవాడికి సహాయం చేయడంవల్ల ఉపయోగంలేదు. పాత్రత ఎరిగి దానం చేయమన్నారు, పాత్రత ఎరిగి గ్రహించమన్నారు. In both ways పవిత్రత ఎప్పుడూ పెంచుకోవాలి. శుచి ఎటువంటి కార్యక్రమంలో కూడా తగ్గకూడదు. కార్యక్రమం చిన్నదే అవ్వచ్చు. నిర్మలంగా వుంటే బావుంటుంది. పవిత్రంగా వుంటే బావుంటుంది, శుచిగా వుంటే బావుంటుంది. అప్పుడు ఎంత చిన్నదైనా హాయిగా వుంటుంది. శుచి వున్నచోట హాయి వుంటుంది. శుచి లేని చోట హాయి వుండదు. ఏదో రజోగుణంతో కూడి, గొప్పలు గొప్పలుగా వుండి, గందరగోళంలా వుంటుంది. మనసుకి ప్రశాంతత వుండదు. అందుకని గ్రహించే చోట సంగ్రహము. ఒక అవగాహన ఏమిటీ? సరిగ్గా గ్రహించు. ఏదైనా భావంగానీ, ద్రవ్యంగానీ సరిగ్గా గ్రహించు. అలాగే ఇచ్చే చోట కూడా అది ఒక భావన. ఇంకొక భావన సంగ్రహమునకి, ఇతరులలో వున్న మంచిని గ్రహించు. సద్ గ్రాహం అంటారు.  ఇతరులలో మంచి రూపంలో ఉండేవాడు భగవంతుడు, ఇది final stage సంగ్రహానికి. ఎంత మనకి ఇష్టంలేని

వాడిలో కూడా ఏదో ఒక మంచి వుంటుంది. మనం చూడగానే చాలా వుంటుంది, అసలు కొంచెం కూడా చూడం. ఎందుకంటే మనం ఇష్టం- అయిష్టం basis మీదే కదా నిర్ణయాలు చేస్తాం. ఉన్నది ఉన్నట్టుగా కూడా చూడం. మనకి ఇష్టమైతే ఇంకా ఎక్కువ చూసేస్తాం, లేనిది కూడా చూసేస్తాం. మనకి ఇష్టం లేకపోతే అప్పుడూ లేనిది చూసేస్తాం. ఇష్టమైనప్పుడు లేని positives అన్నీ చూసేస్తాం, ఇష్టం లేనప్పుడు లేని negatives అన్నీ చూసేస్తాం. వాణ్ని చూసినప్పుడల్లా మనకి negative మాత్రమే కనిపిస్తుంది. సంగ్రహానికి ఇంకో భావన ఏమిటంటే వాడిలో ఉండే మంచిని చక్కగా గ్రహించడం. ఈ ముందు రెండు steps సరిగ్గా వుంటే తప్ప మూడోది రాదు. మంచిని గ్రహించి ఆ విషయంలో వాడిని గౌరవించాలి. ఒకొక్కళ్ళలో ఒకొక్క మంచి విషయం వుంటుంది, అంతవరకూ వాళ్ళని మనం గౌరవిస్తూ వుండాలి. ఒకరు చక్కగా వండి పెట్టగలరనుకోండి, వంట గురించి మనం వాళ్లకి advice ఇవ్వకూడదు, అక్కణ్నుంచి నేర్చుకోవాలి. ఎందుకనీ? వాళ్లకి తెలుసు కాబట్టి. అది వాళ్ళలో వున్న కళ్యాణగుణం. దీన్నేThe Function of Hierarchy అంటారు జ్వాలాకూల్ గారు. ఒకొక్కళ్ళు ఒకో విషయంలో ఇంకొకరి కన్నా అధికులు. అన్ని విషయాల్లోనూ అధికులుగా వుండడం అనేది ఒక్క భగవంతుడికే సాధ్యము. మిగాతావాటిల్లో కొన్నిట్లో కొంతమంది అధికులుగా వుంటారు. వ్యాపారస్తులకి ఒక బ్రాహ్మణుడు వ్యాపారం ఎలా చెయ్యాలో చెప్పాడనుకోండి, వాడూ పాడయిపోతాడు, వీడూ పాడయిపోతాడు. లేకపోతే వ్యాపారస్తుడి దగ్గర ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకోవడానికి వెళ్ళాం అనుకోండి. లేకపోతే వ్యాపారం చేసేవాళ్ళ దగ్గరకు వెళ్లి ఆధ్యాత్మిక విషయాల మీద discussion పెట్టుకున్నాం అనుకోండి, ఎక్కడ ఏమి చెయ్యాలో తెలియదన్నమాట. హోటల్ కి వెళ్లి, ఒక razor ఇస్తావా ,అన్నట్టుగా వుంటుంది. హోటల్ లో ఏం దొరుకుతుందో హోటల్ లో తీసుకోవాలి, కిరాణా షాపులో ఏం దొరుకుతుందో కిరాణా షాపులో తీసుకోవాలి, కదా! దేని దగ్గర ఏం దొరుకుతుందో తెలుసుకోవడం నిజమైన సంగ్రహం.ఎక్కడ ఏది మనకి భగవంతుని యొక్క అస్తిత్వంగా కనిపిస్తుందో అక్కడ దాన్ని గౌరవించాలి. ఇంటావిడకి మనం వంట గురించి చెప్పకూడదు, ఇంటావిడ మనకి డబ్బు ఎలా సంపాదించాలో చెప్పకూడదు. విన్నావా చెడిపోయావే, సందేహంలేదు. ఎవరికి ఎందులో బాగా అనుభవం ఉన్నదో అందులో వాళ్ళని చెయ్యనివ్వాలి. నాయుడు బాగా tape

చేస్తున్నాడనుకోండి. నాయుడు మీద కోపం వచ్చి నేనే చేస్తాను అన్నాననుకోండి అది జరగదు. ఊరికే మనకి వుండే కినుక చూపించి, సరిగా చేయక ఇంకొంచం దారి తప్పడం తప్ప. ఎవరు ఏ పని చెయ్యాలో వాళ్ళు ఆ పని చేస్తేనే చక్కగా నడుస్తుంది. అందులో వాళ్లకి వున్న ఆ ప్రావీణ్యతని మనం respect చెయ్యాలి. భగవంతుని respect చేయడం అంటే అలా వుంటుంది. అలాగే మూర్తిగారికి buildings ఎలా కట్టాలో, columns ఎలావేయ్యాలో మనం చెప్తే కుదరదు కదా! ఆయనచెప్తే మనం చెయ్యాలి. అక్కడ మళ్ళీ మనం ఆయనకి సలహాలు ఇచ్చి, ఆయన్ని చెయ్యనీయకుండా, సగం అయిన తరువాత బాగులేదని మొత్తం ఆయన మీదకి నెట్టేస్తే, ఆయన మీరు చెప్పినట్టు చేసానండీ, నన్ను చేయ్యనిచ్చారా మీరు? అంటాడు. ఎవరికి ఎందులో ప్రావీణ్యత వుందో ఆ ప్రావీణ్యతని భగవంతుని యొక్క అస్తిత్వంగా గుర్తించి, గౌరవించి అది వాళ్ళ దగ్గరనుంచి పొందాలి. పొందడం అంటే దొంగిలించడం కాదు, నేర్చుకోవాలి. అక్కడ వాళ్ళ దగ్గర శిష్యరికం చేసి నేర్చుకోవాలి. ఎందుకంటే అక్కడ వాళ్ళు గురువు. భగవద్గీత చెప్పేవాడు flat ఎలాకట్టలో కూడా చెప్తే కుదరదు కదా! రెండూ కుదరవు. అందుకనే ప్రభుత్వం వ్యాపారం చేస్తే మన దేశం ఈ నలభై ఏళ్ళలో ఎలా అయ్యిందో అలా అయిపోతుంది. ప్రభుత్వం అంటే ఎవరు? రాజు లేక రక్షకుడు లేక క్షాత్రధర్మం వున్నవాడు. క్షాత్రధర్మం అంటే మిగతావాళ్ళు వాళ్ళ వాళ్ళ పనులు సక్రమంగా చేస్తున్నారో లేదో పర్యవేక్షించి చూసి, చేయకపోతే లెంపలు వాయించాలి. రాజే వ్యాపారి అయిపోయాడు అనుకోండి, దేశాన్ని అమ్మేస్తాడు. ఎందుకంటే వాడి చేతుల్లోనే దేశం వుంటుంది కదా. క్షాత్రధర్మం వున్నవాడు వ్యాపారంలోకి వెళ్ళకూడదు. వ్యాపారధర్మం వున్నవాడు రాజు అయ్యాడనుకోండి. అప్పుడూ అంతే! అంటే by nature ఒక్కొకళ్ళల్లో ఒక్కో quality చాలా బావుంటుంది. నేను వ్యాపారానికి చాలా మంచి సలహాలు ఇవ్వగలను అనుకోండి. ఇది assumption. నా సలహాల వల్ల అందరూ లక్షలూ, కోట్లూ సంపాదించుకుంటున్నారు అనుకోండి, నాకు మాత్రం వాళ్ళు వేలే చూపిస్తున్నారు అనుకోండి. కొంతమంది వేలే ఇచ్చేస్తారు. మనం సలహా ఇస్తే వీడు కోటీశ్వరుడు అయ్యాడు కదా అని మనం చెయ్యడం మొదలు పెట్టాం అనుకోండి, క్షవరం అయిపోతుంది. ఎందుకంటే నువ్వు వాడికి సలహా ఇవ్వడమే తప్పా చేద్దామనుకోరాదు. చాణక్యుడంతటి వాడికి చంద్రగుప్తుడు కావలసి వచ్చాడు.యుద్ధం ఎలా చేయించాలో తెలుసుగానీ, తాను చేయలేడు కదా

యుద్ధం. అలా ప్రతీవాళ్ళలో కొన్ని కొన్ని వాళ్ళల్లో మనకన్నా ఎక్కువగా భాసించేవి వుంటాయి. అన్నీ కాదు కొన్ని. అలాగే మనలో కొన్ని ఎక్కువ భాసిస్తూ వుంటాయి వాళ్ళకన్నా. అందుకనే సలహాలను ఇచ్చుకొనుటకు, పుచ్చుకొనుటకును సంసిద్ధత అన్నారు. ఎక్కడ సలహా పుచ్చుకోవాలో కూడా తెలియాలి. కామేశ్వర రావు గారిని Petroleum శాస్త్రం గురించి సలహా అడిగామనుకోండి, ఆయన చెప్పరూ కనీ, చెప్పారనుకోండి, నేను విన్నాను అనుకోండి ఇంతే సంగతులు! ఎవరిని ఏమి అడగాలి, ఎవరు ఏమిటి నేర్పాలి అంటే ముందు అక్కడ ఏమిటి వుందో తెలియాలి. అక్కడ వుండే మంచిని, సమర్థతను గుర్తించాలి. ఇవి తెలియకపోతే అసలు ఇహానికీ పనికిరాము, పరానికీ పనికిరాము. మిగిలేది ఏమిటయ్యా? అంటే confusion. ఉభయభ్రష్టత్వం అని చెప్తున్నారు. ఈ సంగ్రహం అనే పదాన్ని బాగా అర్ధం చేసుకోండి. ఎవరు దేనిలో ప్రావీణ్యత సంపాదించారో వాళ్ళల్లో భగవంతుడు ఆ ప్రావీణ్యత రూపంలో ఉన్నాడని గుర్తించడం. అలా వుంటాడుట దేవుడు అందరిలో. ఒక్కొక్క దానిలో ఒక్కొక్కరు ప్రవీణులు. అక్కడ మనం అనువుగాని చోట అధికులమనరాదు. అన్నామంటే ఏమౌతుంది అంటే విన్నవాడూ, మనమూ ఇద్దరం పాడయిపోతాం. ఇదీ సంగ్రహానికి ఇంకొక అర్ధం.సంగ్రహానికి ఎన్ని అర్ధాలు వచ్చాయో చూడండి. Gathering ఒకటి, అవగాహన ఒకటి, ఇతరులలో వుండే 'తత్'ని గ్రహించడం అన్నమాట.ఈ మూడుగా మనం సంగ్రహాన్ని అర్ధం చేసుకోవచ్చు. ఆ తరువాత సర్గః Distribution according to an order, that is creation. అది చేతకాదు కొంతమందికి. పాలు కాచి చేజేతుల వొలకబోసుకుందురు అనే పాట వుంది కదా. అలా కొంతమంది ఈనే గాచి నక్కలపాలు చేస్తుంటారు. సర్గం అనేటటువంటిది భగవంతుడు చేసే ప్రజాసర్గంలో there is an order in Distribution. ఈ ప్రజా సర్గం అంటే ఈ సృష్టియొక్క పుట్టుక జరిగినప్పుడు ఈ ఏడు లోకాలూ ఒకదాని తరువాత ఒకటి ఏ విధంగా దిగిరావాలో, దానిలో ఒక పద్ధతి వున్నది. మనం చేసే distribution లో కూడా ఒక పద్ధతి వుండాలి. సంపాదిస్తున్నాం కదా అని అడ్డగోలుగా ఖర్చు పెడితే, ఎవరిద్వారా ఖర్చు అవుతుందో వాళ్ళు పాడయిపోతారు. అందుకనీ మనిషికి Distribution లో order లేకపోతే వాడి creation లో తేడా వస్తుంది. భగవంతుని Distribution అటువంటి పరిస్థితి ఉండదు. సత్యలోకం నుంచి తపోలోకం, అక్కణ్నుంచి జనోలోకం, మహర్లోకం, సువర్లోకం, భువర్లోకం,

భూలోకం ఇలా వున్నాయి కదా! ఒకలోకం నుంచి ఇంకో లోకంలోకి వచ్చేసరికీ దానియొక్క energy system చక్కగా ఒక పద్ధతి ప్రకారం మారుతూ వుంటుంది. 1/7th అయిపోతుంది. సూర్యుడి నుంచి మనదగ్గరకి వచ్చేసరికీ సూర్యుడి వెలుగులో 1/7 th వెలుగుంటుంది మన భూమ్మీద. సూర్యుడి వెలుగు భూమ్మీద పెట్టేస్తే మనం ఇలా ఉండడానికి వీల్లేదు. సూర్యుడు సవిత్రుడితో సంబంధం పెట్టుకున్నప్పుడు సవిత్రుడికన్నా1/7 th వెలుగుతో ఉంటాడు. సవిత్రుడు ఆయనకీ ఉన్న కేంద్రము సృష్టిలో ఆయన కన్న 1/7 th. అలా 1/7 th 1/7 th1/7 th 1/7 th అలా gradation ఏర్పడుతుంది. ఎందుకనీ? From spirit to Matter కాబట్టి. ఇలాఏర్పాటు చేయడంలో ఇది ఒక hierarchy, ఒక పరంపర. గురువు, పరమగురువు, పరమేష్టిగురువు...ఇలా వుంటారు కద. మన గురువుగారి మీద ఇష్టం వుంది కదా అని పరమేష్ఠి గురువుగారి ఫోటో పైన ఆయన ఫోటో పెట్టకూడదు. CVV గారిఫొటో పైన EK గారి ఫొటో పెట్టడం అనేది అపచారం. EK గారిఫొటో పైన మన ఫొటో పెట్టుకోవడం మరీ అపచారం. ఎవరి తరువాత ఎవరు? పెద్దవాళ్ళు వచ్చినప్పుడు మనం లేవకుండా వుండి, వాళ్ళు నిలుచునే వుండి, మనం మాట్లాడుతూ వుంటే అపచారం. మనకన్నా పెద్దవాళ్ళు వచ్చినప్పుడు మనం లేవాలి. మనకన్నా చిన్నవాళ్ళు వచ్చినప్పుడు వాడికి సీటు చూపించాలి. లేచి ఇవ్వఖ్కర్లేదు కానీ కూర్చోమని చెప్పాలి కనీసం. పెద్దలయందు చిన్నవాళ్ళుగా మనకి గౌరవం వుండాలి. చిన్నలయందు పెద్దవాళ్ళుగా మనకి ఆదరం వుండాలి. ఈ రెండూ లేనిచోట దెబ్బతింటుంది. పిల్లల మీద ఆదరణ లేకపోతే దెబ్బతింటుంది. పిల్లలకి పెద్దల మీద గౌరవం లేకపోతే దెబ్బతింటుంది. కాబట్టి సర్గం చేసినప్పుడు ఒకదాని కన్నాఒకటి, ఒకదాని కన్నాఒకటి, కొడుకు తండ్రిని గౌరవించాలి, తండ్రి తాతని గౌరవించాలి, తాత ముత్తాతని గౌరవించాలి. ఇందులో ఏ chain ఎక్కడ దెబ్బకొట్టినా అక్కడ మారిపోతుంది. నువ్వు నీ తండ్రిని ఎలా చూసావో, నీ కొడుకు నిన్ను అలా చూస్తాడు. నువ్వు పెద్దలని ఎలా గౌరవించావో అలా నువ్వు పెద్దయ్యాక ఇతరులు నిన్ను గౌరవిస్తారు. నువ్వు పెద్దల్ని ధిక్కరిస్తే నీ పిల్లలు నిన్ను ధిక్కరిస్తారు. మాస్టారు అంటూ వుండేవారు అప్పుడప్పుడు. ఎవరో వచ్చి వాళ్ళ అబ్బాయిల గురించి complaint చేస్తూ వుంటే, 'ఎక్కువ చెప్పకు! నీ గురించి నువ్వు చెప్పుకున్నట్టు వుంటుంది' అని చెప్పారు. నీ పెద్దవాళ్ళని నువ్వు కనిపెట్టుకుంటే, నువ్వు పెద్ద అయినప్పుడు నిన్ను నీ పిల్లలు కనిపెట్టుకుంటారు. నీ పెద్దల్ని నువ్వు అశ్రద్ధ చేస్తే నీ

పిల్లలు నిన్నుఅశ్రద్ధ చేస్తారు. అదీ తమాషా. అందుకని ఈ పరంపర ఏదైతే ఉన్నదో, తనపై లింకుని తను రక్షించుకోవాలి. ఎంత దుర్మార్గులని నీకు అనిపించినా తల్లిదండ్రుల గురించి అపచారంగా మాట్లాడకూడదు. మరి వాళ్లకి పుట్టినవాడివే కదా. నువ్వు ఎంత కాకపోతే అక్కడ పుట్టావు. ఇంతకు మించి రెండు ఆకులు వుండబట్టే అక్కడ దిగావు. From Higher plane to lower plane as there is involution of the spirit into matter, there is a gradual decrease of life and corresponding increase of matter. మొత్తం అంతా Spirit నుంచి Matter యొక్క flow కాబట్టి, మనం భూమివరకూ దిగి రావాలంటే సూర్యుడి దగ్గరనుంచి ఏడు రెట్లు తగ్గించాలి దీన్ని. ఏడవ వంతు. బుధగ్రహం వుందనుకోండి, మనకన్నా ఆరువంతులు ఎక్కువ ప్రకాశవంతంగా వుంటుంది. అందుకనే సూర్యుడికి అతి దగ్గరగా తిరిగే గ్రహం బుధగ్రహం. మనకన్నా రెండు రెట్లు ఎక్కువ కాంతివంతమైనది శుక్రగ్రహం. అంటే మనకి ఇక్కడ బాగా పదార్థం యొక్క సాంద్రత ఎక్కువ, Density ఎక్కువ. పోతున్న కొద్దీ పదార్థం యొక్క సాంద్రత తగ్గుతూ వుంటుంది, భగవంతుని యొక్క కాంతి ఎక్కువగా వుంటుంది. ప్రకృతి యొక్క స్థూలత్వం ఇక్కడ కనిపిస్తుంది. ప్రకృతి సూక్ష్మత్వం, పురుషుని యొక్క శక్తి, చైతన్యం అక్కడ బాగా ఎక్కువగా వుంటుంది. సూర్యుడికన్నా పైకి వెళ్తే ఇంకొక ఏడురెట్లు వుంటుంది. అంతకన్నా పైకి వెళ్తే ఇంకొక ఏడురెట్లు వుంటుంది. ఇలా మూడ ఏడులు, three times seven. మనలో కూడా మూలాధారంలో వుండే ప్రజ్ఞ చైతన్యానికీ, సహస్రారంలో వుండే ప్రజ్ఞ చైతన్యానికీ అంత తేడా వుంది. మూలాధారంలో కూడా సహస్రారం అంత వుంటే ఇంక మన శరీరం వుండదు. ఒకదానికొకటి ఒకదానికొకటి ఒకదానికొకటి ప్రజ్ఞ యొక్క ప్రభావం ఎక్కువగా వుంటుంది. పదార్థం యొక్క ప్రభావం తక్కువగా వుంటుంది. హృదయం వరకూ వెళ్తేనే మనకి పదార్థం మీద కొంత వ్యామోహం తగ్గి దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలుస్తూ వుంటుంది. ఇంక హృదయం పైకి వెళ్ళామంటే ఆకాశతత్వముతో ఉండే పదార్థం అక్కడ సూక్ష్మరూపంలో పనిచేయడం వుంటుంది. ఊరికే ప్రతీ బురదలోనూ కాలుపెట్టడం జరుగదు. ఇక ఆ పైన ఆజ్ఞ లోకి వెళ్తే స్వామిత్వం. You have become a Kumara. సృష్టి చక్రము అది! ఆరవ చక్రం కదా! ఆజ్ఞ. అలా పెరుగుతూ వుంటుంది. ప్రజాసర్గం చేసేటప్పుడు the play of the matter and spirit is so orderly and distribution is like that. అందుకనే

ఇవన్నీ ఏర్పడ్డాయి. సూర్యుడి నుంచి ఈ గోళాలన్నీ వచ్చేసాయి. ఇలా ఎంతో మంది సూర్యులు సవిత్ర కేంద్రం నుంచి వచ్చారు. సవిత్ర కేంద్రానికి ఇంకో కేంద్రం వున్నది. ఆ కేంద్రానికి కేంద్రంగ భగవంతుడు తాను వున్నాడు. ఇంత orderly గా తీసుకుని వస్తాడు తప్ప, ఎదో అడ్డగోలుగా పుట్టించేయడం కాదు. మనం చేసే పనుల్లో మనం కూడా వ్యక్తం అవుతూ వుంటాం కదా. ఆ విషయంలో ఆయనా మనం ఒకటే. ఆయనలో ఎన్ని potentials వున్నాయో మనలో కూడా అన్ని potentials వున్నాయి. మనలో potentials ఆయన potentials లా orderly గ విచ్చుకోవాలి అనుకుంటే you must see how it is in the nature. ప్రకృతిలో ఎలా జరుగుతుందో చూసి నువ్వు కూడా అలా చెయ్యాలి. మనం ఇవాళ మొదలు పెడితే రేపటికి అయిపోవాలి అనుకుంటాం. ప్రకృతిలో అలా వుండదు.There is a natural development or growth. ఇవాళ టెంక నాటి రేపు మామిడిచెట్టు రావాలంటే రాదు కదా.There must be a natural process of unfoldment of time. ఇందాకా సంగ్రహంలో ఎలా వుందో అలా ఇక్కడ సర్గంలో కూడా distribution. ఇందులో hierarchy మార్చుకుంటాము అంటే ఒప్పుకోరు. వాడికేం తెలుసు, నాకే అన్నీ తెలుసు అని ఇంకొకడు వచ్చి కూర్చుంటాను సీటులో అంటే ఒప్పుకోరు. నీ పని నీది, వాడిపని వాడిది. వాడిపని వాడినే చెయ్యనీ, నీపని నువ్వే చెయ్యి. ఇద్దరూ ఒకటే భగవంతుని దృష్టిలో, మన దృష్టిలో ఎక్కువ తక్కువలు వున్నాయి తప్ప. గాడిద-కుక్క కథ వినే వుంటారు. చాకలివాడి ఇంట్లో గాడిద వుంది, కుక్క వుంది. గాడిద పని గాడిదదే, కుక్క పని కుక్కదే. గాడిద కుక్కపని చేస్తే తేడా వస్తుంది. యజమాని దృష్టిలో ఇద్దరూ ఒకటే. యజమాని ఒకర్ని ఇల్లు వూడ్చమంటాడు, ఒకరిని వంట చేయమంటాడు. మరొకరిని వడ్డన చేయమంటాడు, మరొకరిని వచ్చిన వాళ్ళని receive చేసుకుని వాళ్లకి మంచి మంచి కబుర్లు చెప్పమంటాడు. వచ్చేవాళ్ళకి కబుర్లు interest కదా అందుకని ఈ కబుర్లు చెప్పేవాడు popular అయిపోతూ వుంటాడు. మిగతా వాళ్ళంతా చూసావా వీడికి ఎంత popularity వచ్చేస్తోందో? అనుకుంటారు. ఎవరి దృష్టిలో popularity? నీకు ఎవరి దృష్టిలో popularity కావాలి? భగవంతుని దృష్టిలో popularity కావాలంటే ఇచ్చిన పని ఇచ్చినట్టుగా చెయ్యడమే. నువ్వు ఎక్కడ వున్నా నీ popularity నువ్వు చేస్తున్న పని బట్టి వస్తూ వుంటుంది. ఇక మిగతా popularity అంటావా, ఈ రోజు popularity వస్తే రేపు పొద్దున్న అపనిందలూ

వస్తాయి. రెండూ వస్తాయి. దానికి ఎప్పుడూ తోడు వుంటుంది. వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళు, కవల పిల్లలు. ఎక్కడ పొగడ్త వుంటుందో అక్కడ వెంటనే నిందకి కూడా చోటు వుంటుంది. ఎక్కడ వైభవం వుంటుందో అక్కడ ఆపద వుంటుంది. ఇవన్నీ వున్నచోట తండ్రిగా నలుగురి కొడుకులలో ఒక కొడుకుని ఇల్లు చిమ్మమన్నాడు, ఇంకొకడికి వచ్చిన వాళ్ళని receive చేసుకుని ఆదరించమన్నాడు, ఇంకొకడిని వంట చేయమన్నాడు. ఇంకొకడిని వడ్డించమన్నాడు. ఈ వడ్డించే వాళ్ళూ, కబుర్లు చెప్పేవాళ్ళే నలుగురికీ కనిపిస్తారు తప్ప, ఆ లోపల పొగ దగ్గర కూర్చుని వంటలు చేసి, రాత్రింబవళ్ళు మేలుకుని వచ్చిన వాళ్లకి సేవచేస్తున్న వాడిని ఎవ్వడూ గమనించారు. వాడు సామాన్యంగా ఎవ్వరికీ కనపడడు. వాళ్ళు మూలాధారంలో వుంటారు. అలాగే అన్నీ చిమ్మీ, కడిగి ఇలాంటి scavenging works చేసేవారు కొంతమంది వుంటారు. వాళ్ళు కనబడరు. కానీ వాళ్ళు ఎవరికి కనపడతారు? ఒకళ్ళ దృష్టి నుంచి మాత్రం తప్పించుకోలేరు. అదే భగవంతుని దృష్టి! వాడి దృష్టిలో వుంటేచాలు. మిగతావన్నీ మనకి ఎందుకు? అప్పుడప్పుడు రాక్షసులు కొంతమందికి అటువంటి వ్యామోహం కలుగుతూ వుంటుంది, ఈ దేవతల మీద. 'వీడేమిటి కుర్చీలో కూర్చున్నాడు, జల్సా చేసుకుంటూ, నేనేమిటి ఎప్పుడూ ఈ పొయ్యల దగ్గర పడి ఏడవడం?' అటువంటి భావం కలిగినప్పుడల్లా వాడి ధర్మం నుంచి వాడు తప్పుకుని వీణ్ణి దెబ్బకొడితే మళ్ళీ వీడికి తొడపాయసం పెట్టి ఎక్కడ కూర్చోవాలో అక్కడ కూర్చోపెట్టడానికి ఆయన వస్తూ వుంటాడు. ఇది మనకి పురాణాల్లో ఇచ్చిన పరిచయం. నీకు అప్పచెప్పిన పని ఏమిటి అన్నది నీకుగా తెలుస్తుంది. మనందరికీ తెలుసు మనకి అప్పజెప్పిన పని. ఇల్లు-వాకిలి, చుట్టుపక్కల వుండేవాళ్ళు, స్నేహితులు, ఆ తరువాత వీళ్ళందరికీ మనం చేయగలిగినది చేస్తూ వుండడమే! ఇవన్నీ వదిలేసి ఎక్కడికో పోయి సేవ చేస్తాను అనంటే ఒప్పుకోరు, అది ధర్మం కాదు. సేవ అని ఇంట్లో వాళ్ళని ఎండబెట్టేవాళ్ళ ధర్మం ధర్మం కాదు.ఇంట్లో వాళ్ళకి చేయవలసినది చేయడం, వాళ్ళమీద వ్యామోహం లేకుండా వుండడం. వాళ్ళు ఎలాంటివాళ్ళు అయినప్పటికీ. వాళ్ళు అంతspiritual కాదండీ అంటే ఆ నిర్ణయం భగవంతుడు చెయ్యాలి ఎవడు spiritual, ఎవరు కాదో! వాడి గురించి మన duty ఒకటి వుంటుంది, అంతవరకూ చెయ్యి. ఆ తరువాత వాడు respond కాకపోతే అక్కడ వదిలేసేయి. వదిలేయడం అంటే ఆ aspect లో. వాడు కూడా విష్ణుసహస్రానికి రావాలి అని చూడకండి. వాడు కూడా మనతో prayer

చెయ్యాలని కోరుకోకండి. అట్ల కాకుండా attend to them and then. అంటే ఈ distribution when we are externalising, మనం ఎలా externalise అవుతాం? మన externalisation కూడా భగవంతుడి externalisation లాగానే వుంటుంది. నిద్ర నుంచి లేవగానే శివస్థితి లోంచి విష్ణు స్థితి లోకి వస్తాం. అక్కణ్నుంచి మనం ఇంద్రుడితో సంభాషణ చేసుకోవాలి పొద్దున్న. Consultation లేకపోతే వాడి ఇష్టం వచ్చినట్టు పనిచేస్తాడు. నువ్వు ఏమీవాడికి చెప్పలేదనుకో instruction, వాడికి తోచినది వాడు చేస్తూ ఉంటాడు. అక్కణ్నుంచి మనసులోకి వస్తాం కదా! మనసులోంచి ఇంద్రియాలలోకి వస్తాం కదా. ఇంద్రియాల లోంచి శరీరంలోకి వస్తాం కదా, అక్కణ్నుంచి బయట తిరుగుతూ వుంటాం కదా. ఇవన్నీ చైతన్యం పదార్థం లోకి దిగి వచ్చే కదలికలే! మనకి ప్రతీ పొద్దున్న జరిగేది సర్గం. ప్రతీ రాత్రీ జరిగేది సంగ్రహం. మళ్ళీ అవన్నీ కూడగట్టుకుంటాం. కాలూ చెయ్యి కూడగట్టుకుంటాం కదా నిద్రకి. నిద్రలో మళ్ళీ అన్నీ సంగ్రహింపబడతాయి. మెలకువ అయిన తరువాత మళ్ళీ అన్నీ సర్గం చెందుతూ వుంటాయి. అంతే! ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తుంది. అలా సర్గం చెందేటప్పుడు ఒక పద్ధతి వుంటే సంగ్రహంలో ఒక problem వుండదు. సంగ్రహం చక్కగా జరిగితే సర్గం బాగా జరుగుతుంది. అందుకనే రాత్రి పడుకోబోయే ముందు వీలున్నంత వరకు స్ఫూర్తితో భగవంతుడి ధ్యానంతో నిద్రలోకి వెళ్తే, First thing నీకు గుర్తు వచ్చేది పొద్దున్నే the last thought you had before you slept. కావాలంటే test చేసుకోండి. ఇవాళ రాత్రి పడుకోబోయే ముందు నీలో వుండే చివరి ఆలోచన ఏదైతే వుంటుందో, that will be the first thought as you wake up. అదీ continuity. అంతే శరీరం వదిలేసేటప్పుడు కూడా. అప్పుడు ఏమి తలుచుకున్నావో దాని ప్రకారం, అప్పుడు నీ mind లో ఏముందో దాని ప్రకారం. అందుకని భగవంతుణ్ణి తలుచుకున్నవాడు భగవంతుడితో దిగి వస్తాడు. దిగి రాకపోవచ్చుకూడా వాడితో వున్నాడు కాబట్టి. అందుకని ఈ విధంగా మనం ఏ భావనతో అయితే నిద్రలోకి వెళ్తున్నామో ఆ భావనతోనే నిద్ర లేస్తాము కాబట్టి, ప్రతీ రాత్రీ కూడా ఈ సాధన చేసుకునే వాడికి అంత్యకాలమునందు బాధ ఉండదని భాగవతంలో చెప్పారు. మనకి అంత్యకాలం అంటే చచ్చిపోవడం అని. శరీరం వదలడం అంత్యకాలంగా మనం భావన చేస్తూ వుంటాం. కానీ భగవద్గీతలోనూ, భాగవతంలోనూ చెప్పిన అంత్యకాలం వేరు. నీ ఇంద్రియాలు, నీ మనస్సు నీలో కరిగిపోయి నువ్వు

చైతన్యవంతునిగా వుండడం అంత్యకాలం. ఇంక బాధ ఏముంది? We are aware and other things are absorbed into it. నువ్వు awareness తో వున్నావు, చైతన్యవంతునిగా వున్నావు. నీలో నీ మనస్సు, మిగతావన్నీ కలిగిపోయి లోపలి వచ్చేసాయి. నువ్వే ఉంటావు. అటువంటివాడు శరీరం వదిలేస్తే, శరీరం వదిలేయడం వుంటుంది తప్ప చావడం వుండదని చెప్పారు. అలా కానివాడికి శరీరం చచ్చిపోతూ వుంటుంది మళ్ళీ వీటన్నిటితో పుట్టుకొస్తూ ఉంటాడు. శరీరం చచ్చిపోయి మనకి ఈ programme అంతా ఉండిపోతే, ఈ programme fulfil చేయడానికి మళ్ళీ రావాలి కదా! ఏ పనైనా సగం చేస్తూ వదిలేస్తే, మళ్ళీ మనమే అది పూర్తి చేయడానికి ఎలా వస్తామో, అలా మనసూ, ఇంద్రియాలూ, వాటికి సంబంధించిన కోరికలు, మనకి ఏవైనా ఉంటె ఇవన్నీ అలా సగం సగంలో వుండగా శరీరం పడిపోయిందనుకో. ఏం చేస్తావు? వెంటనే ఏదో కూడగట్టుకుని ఇంకొక vehicle వేసుకుని వచ్చేస్తావు. On the way vehicle breakdown అయితే ఏం చేస్తావు? ఇలా వేలు చూపించి lift అడుగుతూ ఉంటావు. ఎవడో పోతూ వుంటే అందులో ఎక్కించుకు పోతాడని. ఇంకొక vehicle కావాలికదా! ఎందుకని? you are half-way through. You must complete కదా. అందుకని మళ్ళీ vehicles పుట్టుకొస్తూ వుంటాయి. కావాలంటే శరీరం వుండగా ఇవన్నీ వున్నాయే, ఈ పుట్ట అది చచ్చిపోతూ వుంటే అప్పుడు వాడికి పుట్టవలసిన obligation లేదు. కావాలనుకుంటే పుట్టవచ్చు. మిగతావాళ్ళకి obligation, they are obliged to be born. వాళ్ళు సరదాగా పుడతారు, వీళ్ళు తప్పక పుడతారు. అంత తేడా వుంటుంది. అందుకని, ఈ సర్గం చేసే చోట చైతన్యాన్ని మనతో తీసుకుని వెళ్తూ, బహిర్గత జీవితంలోకి జీవిస్తూ మళ్ళీ జాగ్రత్తగా తిరిగి వచ్చేటప్పుడు ఆయనతో తిరిగి వచ్చేసి, ఆయన్ని వెంటబెట్టుకుని వెళ్లాలండీ ఎక్కడికి వెళ్ళినా. గుంజకి కట్టిన పశువులాగ తిరగాలి, at the end of it. ఎంతైనా తిరుగు, ఎంతైనా మేత మేసేయి, ఏ గడ్డి అయినా తినుగానీ గుంజకి మాత్రం link పెట్టుకో. Link పెట్టుకోవడం అంటే పశువు అలా అలా అలా ఎంత తిరిగినా నిద్ర వచ్చేసరికి చివరకి గుంజ దగ్గరకి వచ్చి పడుకుంటుంది. తాడు ఏదైతే కట్టి వుంచారో, అలా మనలో వుండే భగవంతుని యొక్క చైతన్యానికి, మన జీవలక్షణాన్ని ఆ విధంగా ఒక పలుపుతాడు వేసేసుకుని చేసుకుంటూ వుంటే పనులన్నీ కూడా కొంచెం అతి అనిపించినప్పుడల్లా పలుపు లాగుతూ వుంటుంది కదా! ఒక area పెడతారు

పశువుకి. ఆ area దాటితే ఇది లాగేస్తూ వుంటుంది కాబట్టి, ఓహో ఇంక మనం వెళ్ళకూడదు కదా అని ఒక filter పడుతూ వుంటుంది. అలా filters వేసుకుని తింటూ వుంటే మన area లోనే మనం తింటూ వుంటాం, తిరుగుతూ వుంటాం. Problem లేదు. అందుకని, ఇష్టి అనేది ఒకగుంజ పాతుతారు. ఆ గుంజ కి కట్టబడతాము. 'అలా మనల్ని కూడా మన వెన్నెముకలో వున్న బ్రహ్మారంధ్రంలో వున్న చైతన్యం ఏదైతే వుందో, దానియందు అనుసంధానం చెంది, దానియందు ఎరుక వుండి ఎంతైనా తిరుగు' అన్నారు. అప్పుడు ఎక్కువ తిరగవు. నియతమైన పద్ధతుల్లో తిరుగుతాం, నియమింపబడి తిరుగుతాం, యమ నియమములు కలిగి వుంటాము, ధృతి కలిగి వుంటాం.

## 168 ధృతాత్మా

'ధృతి' అనే పదానికి అర్థం ధరించినటువంటి అని. 'ధరతి అంటే ఈ మొత్తము కనబడేటటువంటి సృష్టి అంతటినీ ధరించినటువంటి భగవంతుని 'ధృతాత్ముడు'అంటారు. తన నుండి వ్యక్తమైన వానిని తానే ధరించి వున్నాడన్నమాట. మనం కూడా అలాగే ధరించి వున్నాం. ఆయనా అలాగే ధరించి వున్నాడు. ఎందుకంటే ఆయనే మన రూపంలో వున్నాడు కాబట్టి. ఈ ధరించి వుండడమనేది తన నుండి వ్యక్తమైన ప్రకృతిని ధరించి, ప్రకృతికి తనకి మధ్య కలిగిన ఆకర్షణల నుండి పుట్టిన అగ్ని లేక శక్తిని ధరించి, శక్తి-ప్రకృతి చేసేటటువంటి పరస్పర కార్యక్రమాలలో నుండి పుట్టినటువంటి ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు ఏర్పడి, అక్కడ నుండి ఒక ప్రణాళిక ఏర్పడి, కాలము ఏర్పడి, ఆ కాలము ప్రకారము గోళములు ఏర్పడి, ఆ గోళములందు జీవులు ఏర్పడి, ఇవన్నీ జరుగుతుంటే వీటన్నిటిలోనూ తను నిలిచి వుంటాడు. వాటన్నిటికీ ఆధారంగా తను వుండడంచేత సృష్టిలో సమస్తమూ వున్నాయి. తను లేకపోతే ఈ సమస్తము తనలోకి withdraw అయిపోతాయి. అందుకనీ తను లేని స్థితి వుండదు. తను ధరించినటువంటిది మళ్ళీ తనలోనికి absorb చేసుకునేటటువంటి ఒక పరిస్థితి. మనల్ని మనం అర్ధము చేసుకుంటే భగవత్ తత్వం అర్థం అవుతుంది. అది సత్యం కనుక! మనం కూడా చాలా ధరించి వుంటాం. అయితే అది భరించి వున్నట్లుగా వుంటుంది బరువుగా వుండడం వలన. మనలో వచ్చే సంకల్పాలు మనం ధరించి, మన కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటాం. దుస్తులు ధరించినట్లే! మనం మొదట సంకల్పాన్ని ధరిస్తాం. సంకల్పం రాగానే సంకల్పాన్ని ఏ విధంగా నిర్వర్తించుకోవాలో అనే జ్ఞానాన్ని ధరిస్తాం. సంకల్పాన్ని ధరించి, దాన్ని నిర్వర్తించుకోవలసిన జ్ఞానాన్ని ధరించిన తరువాత, దానిని నిర్వర్తించడానికి మనస్సును, ఇంద్రియములను, శరీరమును ధరిస్తాం. ఇవన్నీ ధరించి బయట కార్యక్రమములను నిర్వర్తిస్తుంటాం. నిర్వర్తించిన కార్యక్రమాలలో మరికొన్ని పొంది, మళ్ళీ వాటిని ధరిస్తూ వుంటాం. ఇల్లు, వాకిలి ఇవన్నీ వున్నాయి కదా! వాటిని కూడా ధరించి వుంటాం. మన ఆలోచనల దగ్గరనుండి మన ఆస్తుల వరకు మనం అన్నీ ధరించి వుంటాం. మనం లేమనుకోండి ఆలోచనే లేదు. ఆలోచన లేకపోతే ఇహ తర్వాత కార్యక్రమాలు లేవు. మనం వున్నాం కాబట్టి సంకల్పం. సంకల్పంలో మనం వున్నాం కాబట్టి, దాన్ని నిర్వర్తించుకోవాల్సిన తీరు

తెలుసుకోవడం అనే కార్యక్రమం. అంటే దాన్నెలా నిర్వర్తించుకోవాలి అనే జ్ఞానంలో మనం ఉంటాం. మనం ఉండకపోతే జరగదు. ఆ తర్వాత దాన్ని నిర్వర్తించడానికి మనస్సులోనికి దిగి వచ్చినప్పుడు మనస్సులో వుంటాం. మనం ఇంద్రియములలో, కాళ్ళు చేతులలో వుంటాం. మనం పని చేసినప్పుడు ఉంటాం. మనం లేకపోతే పని ఆగిపోతుంది. మనం చేయకుండా మన పనులు అవవు! మనం చేసే ఈ పనులలో మనం ప్రతిచోట వున్నాం. మన సంకల్పం నుండి శరీరం వరకూ సమస్తము నందు మనం వుండడం వలన అవి నడుస్తూ వుంటాయి. మనం లేకపోతే సంకల్పం లేదు. మనం లేకపోతే శరీరం పనిచేయదు, ఇంద్రియములు పని చేయవు, మనస్సు పనిచేయదు, బుద్ధిపనిచేయదు సంకల్పము లేదు. ఇవన్నీ లేవు కదా! మనం వుండబట్టే వున్నాయి కదా! వీటన్నిటినీ ఎవరు ధరించి వున్నారు? నేనుగా ప్రతి వాడు ధరించి వున్నాడు. ఎవరి సృష్టి వాడు ధరించేటట్టుగా ఉన్నాడు కదా! ఎవరి ఆస్తిపాస్తులు, ఎవరి ఆలోచనలు, ఎవరి స్థితిగతులు, ఎవరికి వారు ధరించి వుంటారు. ధరించగలిగి, 'ధృతి' కలిగి అనగా 'స్థిరత్వం' కలిగి వున్నట్లయితే, అతడ్ని మనం 'స్థితప్రజ్ఞుడు' అంటాం. దానికింకొక పేరు 'ధృతాత్మా'. ఆత్మయందు ధృతి కలిగిన వాడు. ఆత్మయందు సమస్తమును ధరించిన వాడు. ధరించడమంటే ఎంత తేలికగా ఉంటుందంటే ధరించటం, మనం చొక్కా లాగు వేసుకున్నంత తేలికగా ఉంటుంది. వేసుకున్న దానిలో మనకు బరువుంటుంది. భగవంతుడు గోళములు, మండలములు ధరించి కూడా, ధరించిన భావన లేక స్థిరముగా అన్నిట్లోనూ వున్నాడు. తన నుండి వ్యక్తమైన ప్రకృతిలోకి తను దిగి వచ్చినప్పుడు ఆ దిగి రావడాన్ని 'ఉచ్ఛరింపబడడం' అంటారు. తనలోంచి ప్రకృతి ఉచ్ఛరింపబడ్డది. ఉచ్ఛరింపబడ్డ ప్రకృతిలోనికి తను దిగి వస్తాడు. దిగిరావడంతో ప్రకృతి శక్తివంతంగా తయారవుతుంది. శక్తివంతమైన ప్రకృతి నుండి మిగతావన్నీ పుట్టుకొస్తుంటాయి. ఇక్కడ తను దిగి రావడాన్ని 'ప్రణవము' అంటారు. ఉచ్ఛరింపబడినది అని. తనకు తానై ఉచ్చరింపబడడం 'ప్రణవము'. తన నుండి ఉచ్ఛరింపబడడం వలన ప్రకృతి వివిధములుగా మార్పు చెందుతూ వుంటుంది , అంటే Catalytic action లాగా అన్నమాట. అంటే కాచిన పాలలో మజ్జిగ తోడు వేస్తే పెరుగవుతుంది. తోడు ఏమీ చేయదు. అది తోడు వుండడం వలన పాలు పెరుగు అవుతుంది. తోడు తోడుగానే వుంటుంది, పాలు పెరుగు అయిపోతుంది. చూడండీ catalytic action లో chemistry తెలిసినవారికి బాగా తెలుస్తాయి. అది అట్లాగే వుంటుంది. అది మార్పు

చెందదు. Chemical Processes లో కొన్ని కొన్ని ఇటువంటి catalytic actions చేసినప్పుడు అన్నీ మార్పులు చెందినా, ఆ పదార్థం అలాగే వుంటుంది. మనం recollect చేసుకుని మళ్ళీ వాడుకోవచ్చు. అది ఎప్పటికీ అయిపోదు మళ్ళీ వాడుకోవచ్చు. అలాగే సృష్టిలో భగవంతుడు అయిపోవడం అంటూ వుండదు. ఆయన ఆధారంగా ప్రకృతి మార్పులు చెందుతూ వుంటుంది. ఈ మార్పులు చెందుతుంటే, చెందుతున్న మార్పులన్నింటిలో తోడుగా నిలబడి తను వుంటాడు. అంటే మార్పు చెందే ప్రతి దానిలో, దిగివచ్చే ఆ తత్వాన్ని 'ప్రణవం' అంటారు. ఆ ప్రణవాన్ని, అదే ఉచ్ఛరింపబడేదని, అంటే it is uttered forth అంటారు. అక్కడ నుంచి అది ప్రాణకారకమై అందులో నుంచి ప్రాణం వస్తుంది. అంటే ప్రకృతితో భగవంతుడు అనుసంధానము చేసుకుంటాడు. ఆ అనుసంధానంలోనే శబ్దం పుట్టింది. దాన్నే 'ప్రణవం' అంటారు. ఆ శబ్దమే అగ్నికి కారణం, ఆ అగ్నియే ప్రకృతి యొక్క మార్పులకు కారణం. మార్పులన్నింటిలో తానే శబ్ద రూపుడై దిగి వస్తుంటాడు. కాబట్టి ఈ దిగివచ్చే వాణ్ని మనం శ్రద్ధగా పరికించినట్లయితే, అన్నింటిలోనూ దిగివచ్చి, అన్నిటిలోనూ తను వుంటూ, అన్నిటినీ తను ధరిస్తూ, అన్నిటికీ తను ఆధారమై వుంటాడు. మన విషయంలో కూడా అదే సత్యం. ఇవన్నీ కూడా ఆత్మతత్వానికి సంబంధించిన నామాలు. ఈ ఆత్మతత్వం మనలో పెంపొందించడం జరిగితే మనము దాదాపు భగవంతునికి దగ్గరగా చేరిన వాళ్లమవుతాం. మనలో కూడా 'నేను' అనే అంతర్యామి ఉచ్ఛరింపబడినపుడు సుషుమ్న లో ఒక ఝుంకార శబ్దంగా, ఓంకార శబ్దంగా మనం అనడంతో సంబంధంలేకుండా ప్రణవం ఏర్పడి వుంటుంది. రెండు చెవులు మూసుకొని వింటే 'గుయ్' మని వినబడే శబ్దాన్ని భ్రమరగీతం అంటారు. దాన్నే 'ఓంకారం' అంటారు. దాన్నే ప్రణవం అంటారు. అది వినిపిస్తుంది. లోపల జరుగుతున్న ఆ శబ్దం ఉచ్ఛరింపబడుతున్న భగవంతుని స్థితి అన్నమాట. అది ఉచ్ఛరింపబడగానే వెలుగులా తయారవుతుంది. ఆ వెలుగే మనకు సుషుమ్నలో చైతన్యంగా ఇమిడి వుంటుంది. ఈ ఇమిడి వున్న చైతన్యం యొక్క శబ్దము వినటం అనేది ఋషులు ఎప్పుడు చేస్తూ ఉంటారు. ఆయన్ని వినడం, ఆయన్ని చూడడం అంటే ఒకటే! ఆ ఝుంకారం వినడం, ఆ వెలుగు దర్శించడమే. తుమ్మెదలు చేసే శబ్దంలాగ లోపల నుండి 'గుయ్' మని శబ్దం వినిపిస్తుంది. ఈ శబ్దం వినడానికి ఓంకారాన్ని అనుసంధానం చేస్తాం. మనం చేసే ఓంకారానికి రెండు dimensions వున్నాయి.

భగవంతుడ్ని మనం పిలవడానికి ఓంకారం చేస్తాం. భగవంతుడు మనల్ని పిలవడానికి ఓంకారం. మనం భగవంతుడ్ని 'ఓం' అని పిలిస్తే, లోపల భగవంతుడు, ఓంకార స్వరూపుడైనటువంటి వాడు మనకి అట్నుంచి 'ఓ' అని పిలుస్తాడన్నమాట. చూడండి గజేంద్ర మోక్షంలో 'పిలచిన ఓ అనునట, సర్వమున్ కనునట' అని అంటాడు. 'పిలచిన ఓ అనునట' అంటే ఎట్లా పిలిస్తే 'ఓ' అంటాడుట? మనం 'ఓం' అని ఉచ్చరిస్తూ ఆ ఓంకారం మనలో ఎక్కడ ఉద్భవిస్తుందో దాన్ని కనుక శ్రద్ధతో గమనించినట్లయితే లోపల నుండి 'ఓం' అని మనం అనకుండా, మనం అన్న తర్వాత వినిపిస్తుంది. మనం అనక ముందు వున్నది, మనం అంటున్నప్పుడు వున్నది, మనం అన్న తర్వాత కూడా వున్నది. వీటిని అనుసంధానం చేసుకోవడం మనం పిలవడం. మనం ఎప్పుడైతే ఈ విధంగా ఓంకారం ఉచ్చరించామో, లోపల నుండి తాను ఉచ్చరింపబడతాడు. అందుకని ఓంకారము ఒక'పిలుపు', దానికి సమాధానం 'ఓంకారం' లోనే. మనం ఓంకారంతో పిలిస్తే ఆయన కూడా ఓంకారం తోనే పలుకుతాడు. ఎట్లా పలుకుతాడంటే, లోపల అహతము కానటువంటి శబ్దంగా ఇమిడి వున్న భగవంతుడు అటునుంచి వినిపిస్తాడు, అది 'ధృతి'. ధరించి వున్నటువంటిది. దేన్ని? సుషుమ్నలో వున్న చైతన్యము చుట్టూ ఏర్పడినదే ఈ సమస్తమైన మానవ శరీర నిర్మాణం. అది వుండడం వలన శరీరం వుంటుంది, అది లేకపోతే శరీరం పడిపోతుంది. ఎందుకని? అది సమస్తములోనికి దిగివచ్చినది కాబట్టి. మన సంకల్పంలోకి అదే దిగి వస్తుంది. అదే ఆజ్ఞగా మనలో దిగి వస్తుంది. 'ఇలా చెయ్యి' అని అనిపిస్తుంది కదా! అందుకని దాన్ని 'ఆజ్ఞాచక్రం' అన్నారు. అంటే ఆజ్ఞాచక్రంలో నుండి వ్యక్తమవుతోంది కాబట్టి ఆజ్ఞ. It gives instructions or directions. ఇచ్ఛ! 'ఇలా చెయ్యి' అనేదాన్ని వ్యక్తం చేయడానికి గుహలోంచి వ్యక్తం అయినట్లుగా అనాహతములో నుండి మనకి శబ్దం వ్యక్తమై అక్కడి నుంచి మనం ఆచరణలో పెట్టుకోడానికి మిగిలిన కేంద్రాలు వాడుకుంటాము. సుషుమ్న లోని చైతన్యము ఆరు చక్రాలలోనుండి వ్యక్తమవుతుంది. 'ఆజ్ఞ'ఆజ్ఞాచక్రం నుండి వ్యక్తమైతే భౌతిక కృషి 'మూలాధారం' నుండి వ్యక్తమవుతుంది. అలాగే స్వాధిష్ఠానము, మణిపూరకము ఇవన్నీ కూడా ఈ శరీరాన్ని నడిపించడానికి పనిచేస్తుంటాయి. కాబట్టి ఈ చైతన్యము మనలో, సుషుమ్నలో వున్న కారణంగా దాని చుట్టూ ఇవన్నీ ఏర్పడి వున్నాయి. ఎప్పుడైతే సమస్తానికి ఆధారమైన ఆత్మతత్వం నిష్క్రమిస్తుందో ఇవన్నీ వేటికవిగా విడిపోతాయి. అయితే ఒక్కొక్కదానిలో తను వుండడం వలన

కొంతసేపు వుంటాయి. వాటిలో వున్న ఆత్మతత్వంలో నుంచి కూడా తను నిష్క్రమించినట్లయితే అవికూడా విడిపోతాయి. అలా ఆ disintegration ఎంతవరకు జరుగుతుందంటే atoms వరకు జరుగుతుంది. ఆ atoms లో కూడా తను వుంటాడు. కాబట్టి ఎప్పుడు, ఎక్కడ, ఏది వున్నా తను వున్నాడు. ఈ ఉన్న స్థితి ఉందే దీన్నే 'సత్యం' అంటారు. అన్నిటి యందు, అన్ని అవస్థలయందు, చైతన్యం యొక్క సమస్త అవస్థలయందు తాను నిలిచి ఉన్న భగవంతుని 'సత్యము' అని పిలుస్తారు. ఆ సత్యమనే పదానికి మరాఠీలో పేరు 'సాయి'. సత్యం అంటే సాయి. అన్నింటిలోనూ ఎప్పుడూ వుండే భగవత్ తత్వాన్ని ధరించి వుంటాడు. ఈ చైతన్య స్థితి మన శరీరంలో కూడా వెన్నుముకలో బ్రహ్మరంధ్రములో వున్న సుషుమ్నలో ధరించి తానుండడం వలన దానిచుట్టూ ఇవన్నీ ఏర్పడతాయి. అది కలుషితమైతే వెళ్ళిపోతుంది. అందుకని మన వాళ్ళు అప్పుడప్పుడు 'lumbar puncture' అని అందులో నుంచి కొంచెం తీస్తుంటారు. అందులో blood stains కనిపిస్తే కష్టమండీ అని చెప్తారు. ఈ ధరించి వుండటం చూస్తే అన్నిచోట్లా భగవంతుడు ఎట్లా ధరించి వున్నాడో తెలుస్తుంది. చెట్టు వుందనుకోండి, భూమిగా ధరించి వుంటాడు. చెట్టుగా ధరించి వుంటాడు. చెట్టు కొమ్మగా పండును ధరించి ఉంటాడు. పండు లోపల టెంకగా ధరించి వుంటాడు. మళ్ళీ టెంకలో ధారణకు సంబంధించిన సమస్త కార్యక్రమంగా ఉంటాడు. ఎక్కడికక్కడ అంతా ధరించి వుంటాడు. ఈ కనిపించే నామరూపాత్మకమైన సృష్టిలో ప్రతిదాన్ని తను ధరించి వుంటాడు. మనము ఈ ధరించి వున్నటువంటివాణ్ని గుర్తించడం అనే సాధన చేసినట్లయితే ఈ 'ధృతాత్మా' అనే తత్వం అవగాహన అవుతుంది. మనలో కూడా మనం ఈ సమస్తమూ ఎట్లా ధరించి వున్నామో చూసినట్లయితే, మనలో స్పందనమును ధరించి వున్నాడు భగవంతుడు. స్పందనం కారణంగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు. స్పందనం కారణంగా ఈ సంకల్పాలు. తను వుండబట్టి ఈ సంకల్పాలు. తను వుండబట్టి ఈ స్పందనలు. తను వుండబట్టి ఈ ప్రాణ కారణాలు. తను వుండబట్టి శరీరంలో అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తుంటాయి. పనిచేస్తుంటాయి కాబట్టి తను అన్నిటికి నాయకుడై వుంటాడు. తను నిష్క్రమిస్తే ఇవన్నీ నిష్క్రమిస్తాయి. ఒకటి ప్రక్కన పెట్టిన సున్నాలలాగా వుంటాయి. ఒకటి తీసివేస్తే ఎన్ని సున్నాలున్నా value లేనట్లే.ఈ వుండుట అనే స్థితి యందు మనం పరిపూర్ణంగా వున్నప్పుడు, దాంట్లో నుంచి మనకి ఈ ధరించి వుండడం కనిపిస్తుంది. ఈ ధరించి వుండడం అణువు నుండి బ్రహ్మాండం

వరకు సమస్తమును తను ధరించి వున్నాడు కాబట్టి ఆ భావన చేసుకోవాలి. మనం కూడా మనస్సు, ఇంద్రియములు, శరీరమును ధరించి వున్నామని గుర్తు పెట్టుకోవాలి. మనము ఆత్మతత్వానికి సంబంధించిన జీవులం. పరమాత్మకు ఒక కిరణములము కాబట్టి జీవులుగా దిగి వచ్చాము. దిగి వచ్చాము కాబట్టి, కిరణాలు బట్టి మన చుట్టూ వెలుగు వుంటుంది. మనం నిష్క్రమిద్దామనుకున్నప్పుడే ఈ దేహం నుండి  నిష్క్రమించవచ్చు. ఎప్పుడైతే ఈ స్థితి యందు మనం వుంటామో, ఏ స్థితి? ఇది నేను ధరించి వున్నాను అని గుర్తు వున్నవాడికి తను ఎంత కాలం ఇది ధరించ దలిస్తే అంతకాలం ధరించగలడు. అటువంటి వాళ్ళు ' మరణం నా చేతిలో వున్నది' అని అంటారు. 'నేనెప్పుడూ దేహం వదలాలో అది నా చేతిలో వున్నది' అని అంటారు. ఎందుకు అట్లా అంటారంటే తను ఎంతసేపు ధరించగలడో తనకు తెలుసు గనక అట్లా అంటారు. 'I can hold it. I am the power supreme.' నేను దీన్ని ధరించి వుంటాను, అని జీవుడు నిర్ణయం చేసుకొన్నప్పుడు శరీరం వదిలి వెళ్ళే అవకాశం లేదని జ్వాలాకూల్ మహర్షి చాలాచోట్ల తను రచించిన గ్రంథాల్లో ఇచ్చారు. "Unless the soul decides, there can be no departure." మనం మనలోని ఆత్మతత్వాన్ని అవగాహన చేసుకున్నట్లయితే, మనము ఆత్మ తత్వానికి కొంచం అవస్థితి చెంది ఉంటాము. అంటే, దిగివచ్చి  ఉంటాము. ఎట్లా వుంటాం అంటే? మనోతత్వంలో ఎక్కువగా వుంటాం. మనోతత్వానికి, ఆత్మతత్వానికి వున్న బేధం ఏంటయ్యా అంటే, మనోతత్వంలో అంతా క్షీణించేదే. దానికి హాని వృద్ధులు వున్నాయి. ఆత్మతత్వానికి ఈ హానీ వృద్ధుని లేవు. మనం ఎప్పుడైతే ఈ మనో తత్వం నుండి ఆత్మతత్వం లోకి ఆత్మపరిశీ,లన ద్వారా ఉద్ధారణ చేసుకున్నామో అప్పట్నుంచి మనం అందులో ఎంత సేపు వుందామనుకున్నామో అంతసేపు వుండొచ్చు. మీ ఇంట్లో మీరు ఎంతసేపు వుందామనేది ఎవరు నిర్ణయం చేస్తారు? It is your house. You are staying in your house. How long you will stay in your house? It is up to you. అది మీ ఇష్టం కదా! అదే మనం ఇంకొళ్ళ ఇంట్లో వున్నామనుకోండి, అప్పుడు పరిస్థితి వేరు. మన ఇంట్లో మనం వుండే పరిస్థితి వేరు. తన ఇంట్లో తను వున్నాను, తను ఈ శరీరము అనే ఈ ఇంటిని ధరించి వున్నాను అనే భావన ఎవరుయందు పరిపూర్ణముగా అనుభూతమై వుంటుందో, వారు స్వచ్ఛందంగా ఎంత కాలం కావాలంటే  అంటే అంత కాలం వుండవచ్చు. అటువంటి స్థితి కలుగుతుంది. ఈ  'ధృతాత్మా' అనే తత్వంలో.

భగవంతుడు ఈ సృష్టిని అలాగే చేశాడు. తను వుండదలుచుకొని ఈ సృష్టిని చేశాడు. తను ఎంత కాలం వుండదలుచుకుంటే అంతకాలం వుంటాడు. తను దిగి వచ్చినప్పుడే దీనికి కొంత కాలం కేటాయించుకున్నాడు ఇంతకాలమని. దాని ప్రకారం కాలాన్ని తను oblige చేస్తున్నాడు తప్ప, కాలం కూడా తన నుండి దిగివచ్చినదే కాబట్టి ఆయన కాదంటే ఆగేదేమీ లేదు. 'కాలాతీతుడని' చెప్తుంటాం కదా! ఈ ఊళ్ళో ఎవరైనా ఒక అధికారి కొన్ని నియమాలు, నిబంధనలు పెట్టాడనుకోండి. వాటిని మన అందరి కోసం తను కూడా పాటిస్తాడే తప్ప, అవి ఆయనకు apply కావు. అవి తనని బంధించకపోయినా మన కోసం తను ఆచరిస్తుంటాడు. అంటే ఒక police officer traffic rules పాటించకపోతే ఏ constable arrest చేస్తాడు? ఈ ఊరిలో Commissioner of police ఉన్నాడు అనుకోండి. Red signal ఇచ్చినా కారువెళ్ళిపోయిందనుకోండి, constable ఏమీ చెయ్యలేడు కదా. కాకపోతే ఆయనే ఇలా చేస్తే ఎలా? అని అనుకుంటాడు. కాని ఆయన్ని ఏమీ చేయ్యలేడు. అలాగే ఈ స్థితిలో ఉన్నటువంటి వాడిని ఎవ్వరు ఏమీ చేయలేరు. అందుకే శ్రీకృష్ణుడు ఏమంటాడంటే నేనేం చేయనక్కరలేదు. నన్నెవ్వరూ ఏమీ అడగడానికి వీల్లేదు. అయినప్పటికీ మీరంతా నన్ను అనుసరిస్తారు కాబట్టి మీ కోసం ఎలా చేయాలో చేసి చూపిస్తాను అంటాడు. ఈ మూడు లోకాల్లో నేను చేయాల్సిందేమీ లేదు. నేను పుట్టనక్కర్లేదు. పుట్టినా వెళ్ళి పోనక్కర్లేదు. ఏమి చేయనక్కర లేదు. There are no rules that are applicable to Him. అక్కడ ఇక సిద్ధాంతాలు అవీ పని చేయవు. ఎందుకంటే వాటన్నిటికీ మూలం తను. తన నుండి వ్యక్తం అయిన దాన్ని తను ఎప్పుడైనా అధిగమించగలడు. దాని కన్నా పైన వున్నటువంటి వాడు అయినా కూడా, అణిగి వుండడం జీవులకు ధర్మ చూపించడానికి అణిగి ఉండటమే తప్ప మరొకటి ఏమి లేదు. అలాగే ఈ స్థితిలో వున్న మహాత్ములు కూడా శరీరంలో వున్నప్పుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు శరీరం వదిలి వేయవచ్చు. ఈ తత్వం బాగా అవగాహన చేసుకుంటే స్వచ్ఛంద మరణం కలిగి వుంటారు. దీనికి కావాలసినదొకటే! 'నేను నేనై వున్నాను' అని గుర్తు వుండడం! 'నేను నేనైన నేను' అన్నారు మాస్టారు 'మంద్రజాలంలో'. ఈ అనుభూతి కలిగిన ఒక సాధకురాలు 'ఇదివరకటి నేను నేను కాదు ఇప్పుడు నేనైన నేను' అంటుంది. 'నేను నేనైన నేను' అంటే మామూలుగా మారిపోయే నేనులు కాదు. అచ్చం అసలు నేనుగా మిగిలిపోతుందన్నమాట. అంటే ఆత్మతత్వం అనుభూతి

అయినట్లు లెక్క. అలా అనుభూతమైనప్పుడు ఈ మొత్తాన్నంతా ధరించి వున్నట్లుగా తెలుస్తుంది. దీన్నే మనం పతంజలి యోగ సూత్రాలు చెప్పుకున్నప్పుడు 'ధారణ' అనే స్థితి అని చెప్పుకుంటాం. ఈ ధారణ స్థితిలో వున్నవారు ఆత్మతత్వంలో తాము నిలబడి వున్నప్పటికీ శరీరంలో, ఈ విశ్వాత్మతత్వంతో ముడి పడి వుంటారు. ముడిపడి వుండి విశ్వాత్మ ప్రణాళిక అయిన విశ్వప్రణాళికకు లోబడి పని చేసుకుంటూ వుంటారు. ఆ విశ్వాత్మ ప్రణాళిక కాలము, దేశము ప్రకారము ఎప్పటికప్పుడు తెలుస్తుంటుంది. అంటే ఏ కాలంలో ఏ పని చేయాలి? ఏ ప్రదేశంలో ఏపని చేయాలి? ఇలా తనకి కాలము, దేశము నిర్దేశిస్తూ వుంటాయి తనకి. విశ్వాత్మ అన్న ఒక ప్రణాళిక ఈ విధమైనటువంటి ఆత్మ తత్వంలో వున్న జీవుడికి తన జీవనం యొక్క purpose/ఉద్దేశ్యం/ గమ్యము కాలము ద్వారా, దేశం ద్వారా తనకి నిర్దేశింపబడుతూ వుంటుంది. దాని ప్రకారం అణిగి వుండి పని చేస్తుంటారు. అణిగి వుండడమే తప్ప, అంత మాత్రాన తక్కువ వాడుగా వుండడం ఉండదు. అట్లాంటి తత్వం మనం మహాత్ములలో గమనిస్తూ వుంటాం. ఆ తత్వానికి మనం ఎదగాలంటే 'నేనెవరు' అనే ప్రశ్న బాగా వేసుకుంటుండాలి. 'నేను' అంటాం కదా! ఈ అన్నది ఎవరు? లేకపోతే మనలో ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేస్తున్నదెవరు? ఈ గుండె కొట్టుకునేట్లు చేస్తున్నదెవరు? మనలో ఆలోచనలు ఎక్కడ నుండి వ్యక్తమవుతున్నాయి? ఇవన్నీ కొంచెం తీరిగ్గా introspection చేసుకోవాలి. అంటే కొంచెం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ పరిశీలన ద్వారా, ఈ విచారణ ద్వారా, మనం ఎవరని తెలియడానికి దగ్గరగా వెళుతుంటాము. ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేసుకుంటూ మనం లోపలికి వెడితే, స్పందనం కారణంగా మన ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతున్నాయని తెలుస్తుంది. స్పందనం ఎవరు చేస్తున్నారు లోపల అంటే ఇటు ప్రక్కనుండి మనం పిలిస్తే, అటు పక్క నుండి 'నేను చేస్తున్నాను' అని వినిపిస్తుంది. ఎవరు నువ్వు? అంటే 'నేనే' అంటారు. నువ్వెవరు? అంటే 'నువ్వు కాదు నేను' అంటారు. ఎవరీ నేను? 'నేనైననేను'? నా నుండి నువ్వు వచ్చావు అంటారు. తలుపుకి ఇవతల పక్క బహిరంగంలో వుంటే నేనుని 'నరుడు' అంటారు. అదే తలుపుకి అవతల పక్క వుండే నేనుని 'నారాయణుడంటారు'. ఆ నారాయణుడుండడం వలన ఈ నరుడు శరీరమనే రథాన్ని ఆధారం చేసుకుని పనిచేస్తుంటాడు. అదే కృష్ణుడు, అర్జునుడు రథంలో వుండడం. కాబట్టి మనం తీరిక వేళల్లో 'నేను' ను గూర్చి విచారణ బాగా జరుపుకోవాలి. మన పేరు వుండదు, మన

స్థితిగతులు, మన రాష్ట్రం, మన కులం ఇవేమి వుండవు. ఇవన్నీ దాటి వుంటుందీ 'నేను'. మామూలుగా మనం బతికేప్పుడు మన పేరు, మన కులం, మన గోత్రం, మన చుట్టూ మనుషులు ఇవే మన identities గా ఎక్కువగా వుంటుంటాయి. ఇవన్నీ false identities. They keep on changing every 5 to 10 minutes. మనుషులు మారినప్పుడల్లా మారిపోతుంటాయి. ఊసరవెల్లి వలె రంగులు మారిపోతుంటాయి. ఇష్టమైన వాళ్ళు కనిపిస్తే ఒకలా వుంటుంది. లొక్కులు కనిపిస్తే ఒకలా వుంటుంది. మన వద్ద పనిచేసే వాళ్లు కనిపిస్తే ఒకలా వుంటుంది. మన చేత పని చేయించుకునే వాళ్ళు వుంటే ఒకలా, మనతో పని చేయించే వాళ్ళుంటే ఒకలా వుంటుంది. రకరకాలుగా మారిపోతుంటుంది ఈ నేను కదా! ఈ మారిపోయే నేనుకి, అసలు basis గా ఉన్న నేనుని పరిశీలించుకోవడానికి అప్పుడప్పుడు మనం లోపలికి వెళ్తుండాలి. అసలు మనం లోపలికి వెళ్ళడానికి కొంత time పెట్టుకోవాలి. పెట్టుకొని కళ్ళు మూసుకుని చూస్తే, ఆలోచనలు పుడితే, ఈ ఆలోచనలు ఎక్కడనుండి పుడుతున్నాయి అని గమనించాలి. లేకపోతే ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎక్కడ నుండి పుడుతున్నాయో చూడాలి. ఈ స్పందనం ఎవరు చేస్తున్నారు? ఈ గుండె ఎలా కొట్టుకుంటోంది? ఇలా మనం లోపలికి వెళ్లడానికి మొదలుపెడితే అక్కడ అసలు 'నేను' మనకు దొరుకుతాడు. ఆ అసలు 'నేను' లో మనం వున్నప్పుడు మన పేరు గుర్తుండదు. మన రూపం మనకి గుర్తు వుండదు. బహిర్గతమైన రూపాలు అసలు గుర్తుండవు. "నేను నేనైటువంటి వెలుగుగా తనకి తానుగా నిలబడి వుంటాడు". అదీ ఆత్మ దర్శనం. ఈ దర్శనం ఎవరికి వారు చేసుకోవాలి తప్ప ఎవరూ చేయించలేరు. దాని Process చెప్పగలరు తప్ప, Working out ఎవరికీ వాళ్ళే చేసుకోవాలి. మామిడిపండ్ల గురించి ఎంతసేపైనా చెప్పుకోవచ్చు కానీ తిన్న రుచి వేరు. తినకుండా తెలుసుకున్న జ్ఞానం వేరు. ఇట్లా తెలుసుకుంటూ వెళ్తుంటే ఈ 'ధృతాత్మా' అనేది మనం లోపల ఎంత స్థిరమైన వాళ్ళమో, మనం మనంగా ధరించి వుండడం వలన ఈ మన సృష్టి అంతా ఎట్లా ఏర్పడుతుందో తెలుస్తుంది. కేంద్రం నుండి పరిధికి, సముద్రంలోంచి అలలు వస్తున్నట్లుగా ఎన్నెన్నో కార్యక్రమాలు వస్తుంటాయి. ఎన్నెన్నో తలపులు వస్తుంటాయి. ఎన్నెన్నో మాటలు వస్తుంటాయి. మంచివీ వస్తాయి, చెడ్డవీ వస్తాయి. ఎన్నెన్నో వస్తాయి. ఈ వచ్చేవాటితో సంబంధం లేకుండా మనం మనంగా వున్నాం, అని లోపలికి ఒక్కసారి వెళ్ళవచ్చు. ఇదే మడి కట్టు కోవడం అంటే! ఇవన్నీ

విదిలించుకొని లోపల కూర్చోగలగాలి. అట్లా కూర్చుంటాడుట ఋషి. అట్లా కూర్చుంటాడుట యోగి, జ్ఞాని. కూర్చొని వీటిలోకి దిగి వస్తుంటాడు. దిగి రావడమే మాటిమాటికీ ఇంట్లోంచి బయటకు రావడంలా. ఎప్పుడు బయటకు వచ్చినా తను దిగివచ్చి అన్నిట్లోనూ తానున్నానని గుర్తు పెట్టుకుంటుంటాడు. అక్కడ వున్నప్పుడే వున్నట్లు కాదు. ఈ అవస్థితులు చెందుతున్నప్పుడు కూడా తను conscious గా వుంటాడు. 'ఎరుక' కలిగి వుంటాడు. ఆ ఎరుక కలిగి దిగివచ్చిన వాడికి ఏమి అంటవు. మామూలుగా మనం దిగి రాగానే ఎరుక ఎలుకెత్తుకెళ్ళిపోతుంది, మిగలదు. మిగలక పోవడం వలన బద్ద తీసేసిన కుక్క తోక లాగా మళ్ళీ బయటకు వచ్చేస్తాము. ఈ ఎరుకతో బయటకు వచ్చామనుకోండి, we function unaffected by the event for the day. ఆ రోజు చేసే కార్యక్రమాల్లో కాళ్ళకి చేతులకి పూసుకునేవి, తోసుకునేవి, అంటించుకునేవి ఏవీ వుండవు. ఎట్లా వెళ్ళామో అట్లా వచ్చేస్తాము. అంటే functioning with gloves అంటామే అలా. చేతికి తొడుగు వేసుకుని పని చేస్తే చేతులకు ఏమి అంటావు కదా! అట్లా function చేసుకొని, ఈ స్థితులన్నింటిలో నేనున్నాను, అని గుర్తు పెట్టుకొని పని చేసుకోవాలి. ఎదుటి వ్యక్తులు వచ్చినప్పుడు కూడా ఈ స్థితిలో వున్నారు అని గుర్తు పెట్టుకోవాలి. ఒక్కొక్కడి చైతన్యం ఒక్కొక్క స్థితిలో ఎక్కువగా కనిపిస్తూ వుంటుంది. కొంతమంది భౌతికమైన స్థితిలో ఎక్కువగా వుంటారు. కొంతమంది కామమయ మైన స్థితిలో ఎక్కువగా వుంటారు. అక్కడ కూడా మళ్ళీ ఆత్మతత్త్వమే! వాడు బాగా కోరికలతో గింజుకుంటున్నాడనుకోండి, కోరిక ప్రకృతి స్వరూపం కనుక ఆ కోరికలో ఇమిడి, అక్కడ వున్నవాడు, దాంట్లో దిగివచ్చి వున్నటువంటివాడు భగవంతుడే అని గుర్తు పెట్టుకోవాలి. కనుక ఎవడే స్థితిలో ఉన్నా, వాడిలో వున్న భగవంతుడిని చూస్తున్నవాడు ఈ నామాన్ని ఎక్కువ అవగాహన చేసుకోగలిగిన వాడు. ఇది ఒక సాధనగా చేసుకుంటే stability చాలా సులభంగా వస్తుంది. ధృతి బాగా ఏర్పడుతుంది. ఆ ధృతి బాగా ఏర్పడిన వాడికి ఇక చలనం వుండదు. రాయిలాగా అయిపోతాడు. "రాయి ఎక్కిన వాడిలాగా అయిపోతాను" అని ఉపనయనంలో ప్రమాణం చేస్తాడు పిల్లవాడు. 'అశ్మా రోహణం' అని రాయి ఎక్కించినప్పుడు. మనకి రాని భాషలు అన్నీ చేసుకొని, చేయించుకొని, చేసేవాడికి, చేయించేవాడికి కూడా ఏమీ తెలియకుండా వటువును రాయి మీద నిలబెట్టిస్తారు. వాడెందుకు నిలబడ్డాడో, దిగాడో వాడికి తెలియదు. I will be stable like this stone అని

అర్థం. 'రాయి ఎంత నిశ్చలంగా వుంటుందో అంత నిశ్చలంగా నేనువుండడానికి ఈ దీక్షను తీసుకుంటున్నాను' అని చెప్పిస్తారు ఉపనయనంలో. ఇవన్నీ తెలుగులో చేసుకుంటే మంచిది. ఈ దేవుడు ఆ దేవుడు, ఈ రంగు ఆ రంగు,ఈ మంత్రం ఆ మంత్రం ఇవేవీ వుండవు. కనుక 'form aspect' లేదు. రూపం లేదు. Colour aspect లేదు. రంగు లేదు, శబ్దం aspect లేదు. ఒకటే శబ్దం. ఝుమ్మనే శబ్దం. ఓంకారం. ఝుంకార నాదం అంటారు. భ్రమరగీత. ఉత్తరానికి వెళ్ళే కొద్దీ తుమ్మెదల యొక్క ఝుంకారం ఎక్కువగా వినిపిస్తుందని చెప్తారు భాగవతంలో. ప్రతి పుణ్యాత్ముడు ఉత్తరానికి వెళ్ళిపోతుంటాడు. ఉత్తరానికి వెళ్ళడం అంటే ఊర్ధ్వముఖంగా వెళ్ళడం. అంటే ఈ ఓంకారం తప్ప మరో శబ్దం వుండదు. ఇంక రూపాలు లేవు. రంగులు లేవు. శబ్దాలు లేవు. సరాసరి 'నేను' అనే స్థితి పుచ్చుకోవడమే. ఇది యోగాభ్యాసానికి సంబంధించినది. అక్కడ ఇంక ఈ రూపంతోనూ, ఆ రూపంతోనూ కొట్టుకోవడం వుండదు. పటాలు వుండవు. ఇది ఒక కార్యక్రమంగా daily జరిగిందనుకోండి then you see what is really existing as all. ఇంతమందిలో ఒకటిగా వున్నదేదో తెలుస్తుంది. అంతేకానీ మనం దేనిలోనైనా ఇరుక్కుంటే, stuckఅయితే ఈ ఆత్మతత్వంలోనికి ప్రవేశించడానికి అవకాశంలేదు. మనం కొంతమంది దేవతలని, కొంతమంది గురువులని ఆరాధిస్తున్నా, వాళ్ళు కూడా మనలను నడిపించేది ఈ తత్వం వైపు. వాళ్ళు కిటికీల్లాగా పని చేసి సూర్యుణ్ణి చూపిస్తారు. మనం తెలుసుకోవలసినది మన తత్వం. ఈ విధంగా ఈ స్థితి కలిగినప్పుడు, ఈ ఆత్మతత్వం బాగా అనుభూతి లోకి వస్తుంది. సంగ్రహము చేసేటప్పుడు, సర్గము చేసేటప్పుడు తాను ఎప్పుడూ వున్నాడని తెలుస్తుంది. అంతకు ముందు మూడు నామాలు అవి కదా మరి. "సంగ్రహః సర్గో ధృతాత్మా" కదా! కాబట్టి సంగ్రహము చేసేటప్పుడు, సర్గం చేసేటపుడు అంటే తనలో అన్నీ ఇముడ్చుకున్నప్పుడు, తనలోంచి అన్నీ వ్యక్తమైనప్పుడు, రెండు సమయాలలోనూ తాను వున్నాడు. తను శాశ్వతుడు. తన నుండి వ్యక్తమవుతుంటాయి కొన్ని. తనలోకి మళ్ళీ ఇమిడి పోతుంటాయి కొన్ని. అదే కదా మనకి విశ్వరూపదర్శనంలో చూపిస్తాడు. దక్షిణాయనంగా అన్నీ వ్యక్తమవుతుంటాయి. ఉత్తరాయణంగా అన్నీ ఆయనలోకి చేరిపోతుంటాయి. భూమి మీదకు దిగి వస్తూవుంటాయి, భూమిమీంచి పైకి వెళ్ళిపోతుంటాయి కదా జలాలు. ఇట్లా చక్రభ్రమణంగా జరుగుతుంటే, ఈ చక్రంలో తాను మాత్రం శాశ్వతుడుగా

వున్నాడన్న అవగాహన ఏర్పడుతుంది. తనకి పనులు జరుగుతున్నప్పుడు కొన్ని కష్టాలు, కొన్ని సుఖాలు, కొన్ని ఆనందకరమైన, కొన్ని దుఃఖపూరితమైన సన్నివేశాలు జరుగుతూ వుంటాయి జీవితంలో. వీటన్నిటిలో మనం వున్నాం కదా! మనం వుండడం ఒకటే సత్యం. మిగతావన్నీ అసత్యం. అందుకనే 'వున్నది సత్యం' అని చాలా చక్కగా చెప్పారు. వున్నది సత్యం అంటే ఏమిటి వున్నది? మనం కూడా వున్నాం కదా! అంటే వుండడం అనేది వుంది కదా! అదొక్కటే సత్యం. మిగతావన్నీ అబద్ధం. అబద్ధం అంటే ఏమిటి? వాటికి హానివృద్ధులు వున్నాయి. హెచ్చుతగ్గులు వున్నాయి. మార్పులున్నాయి. దీనికి మాత్రం మార్పు లేదు. రాయల్లే కలకాలం వుంటామని తెలుస్తుంది. తెలిసినప్పుడు హాని వృద్ధులు కర్మానుగుణంగా, కాలానుసారంగా వస్తూ పోతూ వుంటాయి. కాలానుసారంగా వస్తుంటే వాటిని ఎవరూ తప్పించుకోలేరు. కర్మానుసారంగా వచ్చేవి వుంటాయి. అవి మనం చేసినవి! ఈ రెండురకాలుగానూ వస్తుంటాయి. కర్మానుసారం వచ్చే వాటన్నిటినీ మనల్ని మనం ఉద్ధరించుకోవడం ద్వారా వాటి నుండి మనం బయటపడి దివ్యకర్మలో భాగంగా పని చేస్తూ వుండవచ్చు. అదీ బంధవిమోచనమంటే! మనకోసం మనం చేసే పనుల నుండీ/ కర్మల నుండీ, మనం తెచ్చుకునే బంధాల నుండీ, మనల్ని మనం విడుదల చేసుకున్న తర్వాత కూడా ఇంకా కర్మ వుంటుంది. కర్మ అంటే action అని. అక్కడ action లో limitation వుండదు,Pleasure వుంటుంది. ఆ జరిగే actions కూడా కాలాన్ని బట్టి వుంటాయి. చేసేద్దామన్నా జరగకపోవచ్చు. ముక్తులైన వారు కాలాన్ని ఎరిగి చేస్తుంటారు. కాలానికి లోబడి చేస్తుంటారు. ముక్తులు కానటువంటివారు కర్మల చేత, కాలం చేత బంధింపబడి చేసుకుంటుంటారు. వ్యక్తిగతమైన కర్మ నుండి విముక్తి చెందాలంటే 'అష్టాంగ యోగం' అవసరం చాలా వున్నది. అక్కడ 'నియమో యమః' అనే నామముల అవగాహన ఎక్కువ అవసరమవుతుంది.

## 169,170 నియమః, యమః

నియమములు-యమములు, యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి అని ఎనిమిది అంగములుగా పతంజలి మనకి ఇచ్చారు. యమ నియమములు 'ధృతాత్మా' స్థితికి మనల్ని తీసుకువెళ్ళడానికి కొంత అవకాశం ఏర్పరుస్తాయి. దానికి పది రకాల గుణములు చెప్పారు. ఏకత్వం గురించి చేసే సాధనలో మనకి అప్రయత్నంగా ఈ గుణములు ఏర్పడతాయి. అన్నిటా నిండియున్న భగవంతునియందు సర్వదా మనసు లగ్నం చేసిన వాళ్ళకి సాధనలో రావలసిన అభ్యాసం అంతా కూడా ఆటగా జరిగిపోతుంది. ప్రయత్నంగా జరగడం వేరు, సరదాగా జరగడం వేరు. అప్రయత్నంగా దాని గురించి పెద్దగా mental ideation లేకుండా జరిగిపోతుంది. భాగవత మార్గంలో భగవంతుని అనుభూతి యందు ఎక్కువగా వుండడం వల్ల మిగతావన్నీ నెమ్మదిగా రాలిపోయి శమమైన గుణములు ఏర్పడతాయి. ఇవి మనకి ఇదివరకు లేవు, ఇప్పుడు ఏర్పడ్డాయి అని మనకి తెలుస్తాయి. మనం ప్రయత్నంలో వుండేటటువంటి mental ideation దానిలో వుండదు. ఇంకా యమ నియమములు పది అంశాలు మీ ముందుంచుతాను. క్లుప్తంగా వుంచుతాను. రెండింటికీ కనీసం రెండు class లు అయినా కావాలి. అందుకని ఇప్పుడు క్లుప్తంగా చెప్తాను. పదిలో మనలోఎన్ని వున్నాయన్నది ఎవరికి వారు ప్రయత్నించి చూసుకోవచ్చు. చూసుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయండి. అది ఒక పద్ధతి. లేదా అంతటా నిండి వున్న భగవంతుడ్ని, 'I am that I am' అని పాశ్చాత్యులనే ఆ భగవంతుడు మనలో కూడా, మనలా, మనముగా, వున్నాడు కాబట్టి వాడి ధ్యానమందు బాగా నిలవడం వలన కూడా automatic గా ఇవి వచ్చేస్తాయి. ఎందుకంటే మిగతావన్నీ అలలు తప్ప ఇవి శాశ్వతమైనవి కావు. వీటిలో మనం బతకనక్కరలేదు అని తెలుస్తుంది. ఇదంతా నురగే తప్ప ఇందులో substance ఏమీ లేదని తెలుస్తుంది. Substance లేదని నిజంగా తెలిసినప్పుడు దాని వెంటబడడం వుండదు. అది మనవెంట వుంటే 'వుండనీ' అంటాడు. తన వెంట వాటిని వుండనిస్తాడు తప్ప, వాటి వెంట తన వుండడు. మామూలుగా మనది reverse case. వాటి వెంట మనం వుంటూంటాం. అవి మనల్ని ఏడిపిస్తుంటాయి. మనం 'వుండి' వుంటే, అవి మన వెంట వుంటాయి. ఎప్పుడూ అంతే. మనం కామించేది మనకి దూరం

అవుతుంటుంది. మనం దానియందు కామించడం కాకుండా, కర్తవ్యం చేస్తుంటే అవి మన వెంట బడతాయి. జీవితంలో అది చాలా సత్యం. చేయవలసినవి చేసి, వదిలేసిన వాడికి చుట్టూ చాలా చేరుతుంటాయి. పవిత్రత పెరిగే కొలదీ మనిషి చుట్టూ చాలా చేరుతుంటాయి. ఆకర్షణ పెరిగే కొలదీ మనిషి చుట్టూ చాలా చేరుతుంటాయి. ఆకర్షణ పెరగడానికి 'శుచి' అనేది కావాలి. అది కూడా ఈ యమ నియమాలలో వస్తాయి. ఈ పది పెంచుకున్నారనుకోండి, we gain the minimum standard to experience the stability. 35 మార్కులు వచ్చినట్లే. Stability కి 35 మార్కులు తెచ్చుకున్నట్లన్నమాట. కనుక పతంజలి చెప్పిన యమ-నియమాల యొక్క విషయాలు కొంచెం మీ దగ్గర వుంచుతాను.

1. హింసా బుద్ధి లేకుండుట: అహింస. బుద్ధుడు ఇదొక్కటే పెట్టుకున్నాడు. ఆ ఒక్కటి పట్టుకొని చాలా దూరం వెళ్ళవచ్చు. హింసా బుద్ధి అంటే physical, emotional and mental. దీని గురించి చాల చెప్పుకోవచ్చు. లోపల ఉద్దేశ్యంలో హింస లేకపోతే బయట ఎంతైనా మనం శిక్షించవచ్చు. డాక్టరు పొట్ట కోసాడనుకోండి వాడు హత్య చేసిన వాడు కాడు. దొంగ పొట్ట కొయ్యడానికి, డాక్టర్ పొట్టకొయ్యడానికి తేడా ఎక్కడ వుంది? ఒకడు పీక తీసేసాడు రోడ్డుమీద ఒకడికి. ఒకడికి ఉరిశిక్ష విధించడం వలన పీక తీయాల్సి వచ్చింది. ఇద్దరికీ ఎంత తేడా వున్నది! Motive లో హింస లేకపోతే చాలు. అదే శ్రీకృష్ణుడు చెప్తాడు. "వీళ్ళందరినీ చంపాలని కాదు యుద్ధం. ధర్మం నిర్వర్తించడం కోసం యుద్ధం. ధర్మ నిర్వహణలో భాగంగా వీళ్ళందరినీ తీసేస్తున్నాను తప్ప వీళ్ళందరినీ చంపాలని కసిపెట్టుకోకు" అని చెప్తాడు అర్జునుడికి. 'కసిగా యుద్ధం చేయక, ధర్మంగా యుద్ధం చెయ్యి. ధర్మంతో కూడి యుద్ధం చేయి. ధర్మమునందు నిలబడి యుద్ధం చేయి'అంటాడు. రాముడు అట్లాగే చేస్తాడు యుద్ధం. అర్జునుడికి కూడా అట్లాగే బోధిస్తాడు కృష్ణుడు. With vengeance చేయకు, అని.Vengeance లేకుండా, physical గా హింస జరిగినా అది హింస కాదు. ఈ dimensions తెలియాలంటే ఈ జాతికి, మనకి ఇలాంటివి ఇదివరకు చేశారన్నమాట ఋషులు. ఆ dimensions ఇవాళ తెలియకా రకరకాలుగా మాటలు ఆడుతున్నాము. నీలో హింసా బుద్ధి లేక నీవు ఇతరులకు శిక్షణ ఇచ్చావనుకో, ఎవరినైనా కోప్పడ్డవనుకో, నీ లోపల వాడిని హించాలన్న ఉద్దేశ్యం లేదు, బాగుపడతాడన్న

ఉద్దేశముతో కోప్పడ్డవనుకో. తల్లి ,తండ్రి చేస్తూ ఉంటారు. అప్పుడు ఏమి జరుగుతుంది? నీకేమీ effect వుండదు. అట్లాగే ఒక రాజు, ఒక అధికారి, శిక్షణ చేసేటప్పుడు vengeance లేకపోతే అది హింస కాదు. తక్షకుడి కథ అదే. పరీక్షిత్తుని కాటు వేయడం వరకు మన వంతు, తర్వాత చస్తాడా లేదా? మన వంతు కాదు. చచ్చాడు. మళ్ళీ ఇంకొకళ్ళు బతికించుకున్నారు. మనకి సంబంధం లేదు. అలా వుండాలి. అంతేకానీ మనం కాటు వేస్తే చావాల్సిందే అన్నట్లుగా వుండకూడదు. ఇతరులకి శిక్షణ ఇచ్చినప్పుడు మన లోపల హింస లేకుండా శిక్షణ ఇవ్వడం వుంటుంది. ప్రేమతో లెంపకాయలు కొట్టే వాళ్ళుంటారు. తిట్టే వాళ్ళుంటారు. 'సాయి లీలామృతం' చదివితే దాన్నిండా అవే వుంటాయి. ఎందుకో తెలీదు సాయి తిట్లు, చివాట్లు పెడుతుంటాడు. కొడుతుంటాడు కర్ర పెట్టి. ఏమిటి ఇదంతా! ఏమిటి? మామూలుగా physical level లో చూస్తే హింసే కదా! అహింస మన లోపలున్న సంకల్పంలో జరగాలి. అది తెలియక unfortunately we see all in physical level, not beyond అట్లా అయిపోయింది. మనలో జరుగుతున్నదని తెలిసి కూడా అంగీకరించం. మనలో ఆలోచించడం వచ్చాక కదా! మాటో, చేతో చేస్తున్నాం. కాబట్టి ఆలోచనకి మాటకి పైన ఇంకొకటి వున్నది అని తెలుస్తున్నది కదా! అక్కడ ఉద్దేశ్యం బాగున్నప్పుడు నువ్వు చేసేదేమైనా పర్వాలేదు. సత్సంకల్పంతో చేసేదేమన్నా కూడా దానియొక్క ఫలితములు ఎలా వున్నా సిద్ధి ఒకటే, అని చెప్పారు. ఫలితాలతో సంబంధం లేదు. అటువంటిది action లో లోపల హింస motive, బయట మాత్రం ప్రశాంతంగా కనిపించే వాళ్లంతా అహింసాపరులనుకోవడానికి వీలు లేదు. లోపల అహింస వున్నది. బయటకు అవసరమైతే హింసిస్తాం. ఆ dimension తెలిస్తే కాని ఈ మానవజాతికి కృష్ణుడు అర్థం కాడు. పరమహంస యోగానంద కి వాళ్ళ మాస్టారు భగవద్గీత గురించి పాఠం చెబుతుంటే ఓ దోమ మాటిమాటికి వచ్చి కుడుతూ ఏడిపిస్తుంటుంది. దాన్ని చంపితే ఒక బాధ. చంపకపోతే ఒక బాధ. క్షమాగుణం అభ్యాసం చేయాలి కదా! వింటున్నది భగవద్గీత కదా! అని wait చేసీ చేసీ చాలా మండిపోయాక ఇహ దాన్ని చంపేద్దామని చెయ్యెత్తి, మళ్ళీఆగిపోతాడు. అప్పుడు గురువుగారైన యుక్తేశ్వరగిరి "మానసికంగా చంపావు కదా! భౌతికంగా చంపినా పెద్ద తేడా ఏమీ లేదు, చంపేసుకో కావాలంటే అని చెప్తారు."మానసికంగా హింసాప్ర వృత్తి వున్నప్పుడు భౌతికంగా దాన్ని ఆపాలంటే tension. కనుక "mentally you have already killed it, Proceed further."అని

చెప్తాడాయన. అట్లా mental level లో హింస వుండి physical level లో arrest చేసుకున్న వారంతా కూడా హింసకు గురవుతుంటారు. అలా కాక తన ఆలోచనల యందు హింసాప్రవృత్తి లేక బయట ప్రవర్తన లోనూ హింసాప్రవృత్తి లేకపోతే వారందరూ అవగాహన అవుతారు. బుద్ధుని అహింసా ప్రవృత్తి అర్థం చేసుకోవడం చాలా శులభం. కృష్ణుడి అహింసా ప్రవృత్తిని అర్థం చేసుకోవడం చాలా కష్టం."One has to gain much more purity to understand the harmlessness of Krishna. The doctrine of harmlessness as proposed by Krishna." యుద్ధం అహింస అంటే ఎవరు నమ్ముతారండి! ఎంత చెప్పినా ఎవరూ వినరు. చాల్లెండి సార్ మీరుకబుర్లు చెబుతున్నారు, అంటారు. కృష్ణుడి యుద్ధం అహింసే. It's a process of treatment. అవతల వాళ్ళు బాధపడుతున్నారు. వాళ్ళని release చేయాలి. వాడికి ఆ సంగతి తెలుసు. దేనితో బాధపడుతున్నా రండి! ఈర్ష్య, అసూయ, మదం, మోహం, మాత్సర్యం, ద్వేషం మొదలైన వాటితో రకరకాలుగా బాధపడి ఎట్లాగో అట్లా మమ్మల్ని చంపేయండి అన్నట్లుగా దూకుతున్నారు. ఆయన చూసాడు. వీళ్ళని పాపం ఇందులోనుండి release చేసేద్దాం అనుకున్నాడు. శిశుపాలుడ్ని అలాగే release చేశాడు బాధలో నుండి. జ్వాలాకూల్ మహర్షి esoteric healing అనే పుస్తకంలో ఎవరైనా ఒక మనిషి భరించలేని బాధతో చచ్చిపోతుంటే, వాడు కోరితే, వాడిని దాని నుండి తప్పించడం కూడా healing అన్నారు. Whom are you healing? To give relief to the soul is healing. అమితమైనటువంటిది, భరించలేని బాధతో నన్ను చంపమని కోరితే 'లేదు లేదు' అని వదిలెయ్యకూడదు. కొంతమంది ఎంత బాధలో వున్నా బతుకుదామనుకుంటారు. అలాంటి వాడిని చంపకూడదు. గాంధీ మహాత్ముని జీవితంలో ఇటువంటి సన్నివేశం ఒకటి జరిగిందని మాస్టారు చెప్పారు. ఒక ఆవు ప్రసవ వేదనతో చాలా బాధ పడుతూ ప్రసవించలేక, చావలేక అట్లా గిలగిలా కొట్టుకుంటూ రెండు రోజులు అయిందట. గాంధీ గారు చూడలేక ఆవుని చంపించేశారు. I want to release her from the pain అన్నారట. చంపిన తర్వాత గోఖలే, తిలక్ వాళ్లంతా మనం చేసింది correct అవునా? కాదా? అంటే "మీ angle లో చూశారు, ఆవు angle లో చూడలేదు కదా" అన్నారట. భరించలేని స్థితి వస్తే ప్రకృతే పట్టుకెళ్ళి పోతుంది. If it is a human being and if it asks you to do it. It is one thing. But if it is not, how do you decide

whether it wanted to leave or live? ఆవు తనను ఈ స్థితి నుండి విముక్తి చేయమని అడిగిందా అని ఎవరు నిర్ణయం చేస్తారు? అని అడుగుతారు వాళ్ళు. అప్పుడు గాంధీ మహాత్ముడు బాధపడతారుట. నిజమే కదా! మనకు తెలియదు కదా అని. అందుకని అహింసా సిద్ధాంతం అనేది బాగా purity level వున్నవాడికే pain నుంచి relieve చేయడం అర్థం అవుతుంది. శ్రీకృష్ణుడు వాళ్ళంతా కోరుకుంటున్నారు కదా! వాళ్ళందరినీ release చేద్దాం అని release చేసినవాడు. అది 'పరమ అహింస' తత్వానికి పరాకాష్ఠ. దాన్ని 'పరమ అహింస' అనాలి అసలు. కనుక ఆ స్థితి నుండి అంటే 'from mental to physical' various levels లో అహింస వుంటుంది. ఇతరులను లోపల బాగా హింసిస్తూ బయట హింసించకుండా వదిలేశామనుకోండి! మనకి Internal stability రాదు కదా! ఎక్కడ నుండి వస్తుంది? ఏసుక్రీస్తు శిలువ వేయించుకున్నాడు. అది హింసా కాదా? చేసిన వాడికది హింస. ఆయన కోరుకున్నాడు కాబట్టి ఆయనకది అహింస. అంటే self paining. మనల్ని మనం దుఃఖపెట్టుకోవడం కూడా హింస కిందే వస్తుంది. మనల్ని మనం బాధ పెట్టుకోవడం, ఆకలి వేస్తున్నా అన్నం తినకుండా ఉపవాసం వుండడం ఇవన్నీ మనల్ని మనం హింస పెట్టుకునే కార్యక్రమాలు. If it is complete willingness of soul. అప్పుడు బాధ వుండదు. బాధ వున్నదంటే soul కి పూర్తి willingness లేదని అర్థం. ఎవరైనా పది రోజులు అన్నం మానేయమని చెబితే మానేశామనుకోండి, దేనికోసం? అని బాధపడుతున్నామనుకోండి హింస కలిగించినట్లే. అసలు దేనికోసం పది రోజులు అన్నం తినడం మానేశామన్న విషయం, తినాలన్న సంగతి మర్చిపోయామనుకోండి, అప్పుడది అహింస. క్రీస్తు తనను శిలువ వేసినప్పుడు బాధ బడలేదు. ఒక్కసారి 'ధృతాత్మా' అనే స్థితి నుండి అవస్థి చెందినప్పుడు మాత్రం బాధ పడతాడు. అప్పుడు 'నన్నెందుకు వదిలేసావని' ఆక్షణం లో భగవంతుడ్ని అడుగుతాడు. కాని ఠక్కున మళ్ళీ తన స్థితికి ఎదుగుతాడు. ఎందుకు వేయించుకున్నావు శిలువ? అని అడుగుతారు. "ఈ విధంగా నువ్వు ఈ శరీరాన్ని త్యాగం చేయడం వలన ఈ లోకంలో కొంచెం పరిశుద్ధి ఏర్పడుతుంది. దీని ద్వారా ఈ ప్రపంచానికి మంచి జరుగుతుంది. నీ ఇష్టమే సుమా!" అని చెప్తారు. ప్రతి వాళ్ళకి అలాగే చెప్తారు. మాస్టారు ఎంతోమందికి ఎన్నో పనులు చేసారు, 30 సంవత్సరాలు. చేసే ముందు చెప్తారు. 'ఇది చాలా కష్టమైన పని. చాలా కష్ట నష్టములకు గురి కావలసి వస్తుంది. బాధ

కలుగుతుంది అని అనిపిస్తే చెయ్యబోకు. నీకు పరిపూర్ణంగా ఇష్టమైనట్లయితే, తప్పకుండా మేము నీతో సహకరిస్తాము. నువ్వు చేస్తుండు. కానీ దాని నుండి వచ్చే బాధ నీదే! Pain is yours!'. Blavatsky కి కూడా అలాగే చెప్తారు. Where it is willingly taken, it is one thing, having taken if you start suffering. అక్కడ మళ్ళీ హింస. హింసా బుద్ధి లేకుండుట మన యందూ వర్తిస్తుంది. ఇతరుల యందూ వర్తిస్తుంది. అది ఒక item.

౨. సత్య ప్రవర్తనము: దీనికి అందరూ ప్రయత్నించాలి. ఇది లేకపోతే ధృతాత్మా అనే స్థితికి ఎదగడానికి అవకాశం వుండదు. అంటే మనం మన లోపల అనుకుంటున్న దానికి, చెప్పేదానికి మనకి తెలియకుండానే తేడా వచ్చేస్తుంది. మనం బాగా గమనించి చూస్తే మనం ఒకళ్ళ వద్ద విన్నది ఇంకొకళ్ళ వద్దకు వెళ్ళి చెప్పే లోపల మారిపోతుంది. Preciseగా, Accurate గా, నిశితంగా అలాగే చెప్పలేరు చాలామంది. ఎందుకంటే పూర్తిగా వినరు. వారి వద్ద నుండి వినే లోగా బోలెడు తెరలు పడిపోతాయి. ఇతరులు మాట్లాడే దానిలో మనకు కావలసిన దానినే వినే తత్వం ఒకటి వుంటుంది. వాడు చెప్పింది వినకుండా అందులో మనకి కావలసినది మాత్రమే వింటూ ఉంటారు కొంతమంది. అది మాత్రమే highlight చేసి మిగిలినవాటిని ప్రక్కన పెట్టేస్తే, you are only speaking partial truth which is misleading. ఇంకో భాగం వుంటుంది. ఆ భాగం చెప్పకుండా ఒకే భాగం చెప్పకుంటూ వెళ్ళిపోయామనుకోండి అది సత్య ప్రవర్తనము అవదు. సత్య ప్రవర్తనమంటే నీ లోపల నీకు భాసించినది, నీ మాటతో నువ్వు చక్కగా అందించగలిగి వుండాలి. నీ చేతతో నువ్వు చక్కగా అందించగలిగి వుండాలి. ఎవరూ commit అవమని అడగరు జీవితంలో. మనం గొప్పకి commit అవుతూంటాం. గొప్పకి commit అయినప్పుడు దెబ్బతింటాం. అందుకే మహర్షులు ఏం చెప్తారంటే 'ఎందుకురా ముందు మాట ఇస్తావు? చేసేసెయ్ మాట్లాడకుండా చెయ్యి. మాట్లాడావంటే నిలబెట్టుకొనే బాధ వుంటుంది.' ఆ బాధ లేకుండా ప్రవర్తించడం. సత్య ప్రవర్తన గురించి ఎక్కువ చెప్పనక్కరలేదు. మనకు బాగా తెలుసు. చాలా వరకు అది మనం అమలు పరచలేము. వీలున్నంతవరకు precision in thought, speech and act. ఇది బాగా తీసుకురావాలి. ఇది

తీసుకు వస్తే ధృతాత్మా అనే భగవత్ తత్త్వానికి అనుభూతి పొందడానికి బాగా అవకాశం వుంటుంది.

3. దొంగ బుద్ధి: ఎవరిదైనా కొట్టేసేయడం. వేరే చెప్పనక్కర్లేదు.

4. స్త్రీ పురుష కామము పై దృష్టి లేకుండుట : ధర్మ యుక్తమైనది వుండగా పరపురుషులు, పరస్త్రీల మీద కామం కలిగిన వాళ్ళకి నిద్ర కూడా పట్టదు. ఇంకొక స్త్రీ మీద మనసు కలిగిన వాడికి నిద్ర పట్టదు. అది ఒక భయంకరమైన పరిస్థితి. నిద్ర కూడా చెడగొట్టుకొనే స్థితిలో వీడికిక stability ఎక్కడ నుండి వస్తుంది? రాదు కదా!

5. అలాగే ఇంకొకరి సొమ్మును ఆశింపకుండుట: అది వాళ్ళు నాకు ఇస్తే బావుణ్ణు అనిపించింది అనుకోండి, ఇంకొకడి వద్ద ఉన్నది ఎలాగూ వాడుకోవడం లేదు కదా నాకు ఇవ్వండి అనడం, అట్లాంటిది మనకుంటే బావుణ్ణు అనుకోవడం అవన్నీ కూడా బాగా కలత పెడతాయి మనుషుల్ని. సందేహం లేదు. దుర్యోధనుడికి ధర్మరాజు యొక్క 'ఇంద్రప్రస్థము', దాని వైభవము దక్కేంతవరకూ నిద్ర పట్టదు. ఇతరుల సొమ్ము ఆశించడం వలన అది దక్కేటంతవరకు ఒక instability, ఒక tension, ఒక anxiety, ఒక ఆదుర్దా. అది మన దగ్గర చేరిన తరువాత ఇంకొక రకమైన ఆదుర్దా. కావాలంటే చూడండి మనది కానిది మన దగ్గర వుంటే మనకి భయంగా వుంటుంది. దొంగతనం చేసి ఎవరూ నిద్రపోలేరుట. విదుర నీతిలో చెప్తారు, మనకన్నా బలవంతులతో ఎప్పుడూ కోరి వైరం పెట్టుకోరాదని, పెట్టుకుంటే నిద్రపట్టదుట. దొంగకి నిద్రపట్టదుట. ఇంకో అమ్మాయి మీద అబ్బాయికి, ఇంకో అబ్బాయి మీద అమ్మాయికి బాగా మనసు లగ్నం అయిన వాళ్ళకి నిద్రపట్టదుట. ఇట్లా ఎవరెవరికి నిద్ర పట్టదో చెప్తాడు. ఇలా ఈ రకమైన ఆశ వున్నచోట కూడా నిద్ర పట్టదు. ఇంకొకళ్ళకి వున్నది మనకి కావాలని, ఇంకొకరి సొమ్ము ఆశించామనుకోండి, ఆశిస్తే కూడా నిద్ర పట్టదు. దొంగబుద్ధి గురించి మాస్టారు చాలాసార్లు చెప్తుండేవారు. ఒకరి idea తీసుకొని, మన ideaగా చెప్పుకోవడం కూడా దొంగతనమే అని చెప్పేవారు. మాస్టారు ఎన్నో చెప్పారు. అన్నీ మీరు వినలేదు కదా! అవన్నీ నేను మీకు చెప్పాననుకోండి! ఆయన చెప్పిన కథలు,

జోకులు మనం చెప్పుకుంటుంటే ఎవరైనా చాలా బాగా చెప్పారండి అంటే వెంటనే ఇది నేను చెప్పినది కాదండీ మాస్టారు చెప్పిందని చెప్పాలి. అలా చెప్పని వాడు దొంగ. ఎందుకంటే అలా చెప్పకపోతే విన్నవాడికి ఆ తర్వాత ఇది మాస్టారు చెప్పిందని తెలిసిపోతుందేమోనన్న భయం వుంటుంది. ఇవన్నీ లోపల stability ని కొడ్తుంటాయి. అది ఊరికే అల్లల్లాడిపోతోంది. గాలికి వూగకుండా వుండాలంటే ఇవి వుండకూడదు. వీటి గురించి actual గా ఒక్కొక్క item గురించి ఒక్కో రోజు పూర్తిగా చెప్పుకోవచ్చు. ఈ హింసాప్రవృత్తి లేకుండడం, సత్య ప్రవర్తనం alignment. సత్యప్రవర్తనకి alignment దే పని, మూడోది దొంగ బుద్ధి లేకుండడం, నాలుగోది Sexual Urge about others, ధర్మయుక్తమైన కామం ఒప్పుకుంటారు, అంతకు మించి వుండకూడదు. తరువాత ఇంకొకరి ఉన్నది మనకి ఉంటె బాగుండునని దాని కోసము plan వేయటం. ఇది firststep. దీనిని యమం అంటారు. ఈ దీక్ష గురించి పతంజలి మహర్షి ఏం చెప్పారంటే జాతినిబట్టి గానీ, కాలమునుబట్టి గానీ, నియములను బట్టిగానీ మారునది కాదు.ఈ placeలో ఇది ఫరవాలేదండీ, West కి వెళ్తే అంటే విదేశాలకి వెళ్తే ఇది ఫరవాలేదండీ, భారత దేశంలో మనం పవిత్రంగా ఉండాలికదా అది పుణ్యభూమి కాబట్టి. అమెరికా వంటి దేశాలకి వెళ్ళమంటే కొంచెం మనం relaxed గా ఉండొచ్చు అని అనుకోడానికి వీలుపడదుట. అన్నిపరిస్థితుల లోనూ అభ్యాసము చేయవలసినదే. Time and Place will not change these values. అవి శాశ్వత సత్యములు, శాశ్వత ధర్మములు.

## అలాగే నియమములు.

**6.**ఎప్పుడూ శుచిగా వుండుట. As far as possible in all planes అంటే physical, mental and emotional planes లోcleanliness కావాలి. Mental cleanliness, Emotional cleanliness, Physical cleanliness ఇవి మూడూ వుండాలి.

**7.** సంతోషముగా ఉండుట. మాస్టారు చాలాసార్లు చెప్తారు ఇది propose చేస్తూ వుండాలి తప్ప, దేనివలనా రాదు అని చెప్పారు. హాయిగా వుందాము

అనుకుని ఉండడమే తప్ప, దీని వల్ల ఆనందమూ, సంతోషమూ వచ్చినా రాదని ఎన్ని వందల సార్లు ఆయన చెప్పారో. అది నిజం. కాబట్టి, you shall have to propose cheerfulness. అంటే వెకిలిగా నవ్వుతూ ఉండవద్దు. సంతోషంగా ఉండమన్నారు కదా అని, నిష్కారణంగా పెద్ద పెద్ద నవ్వులు నవ్వేయడం, పళ్లన్నీ బయట చూపించడం అలా చేయకూడదు. ఇంకొకళ్ళకి exhibition కోసం కాదు కదా, మనకి లోపల ఆనందంగా వుంటే, బయట ముఖం వికసించి వుంటుంది. వికాసం లేదనుకోండి, గుర్తు తెచ్చుకుని వికాసం తెచ్చుకోవచ్చు. The moment we recollect, we get it. చిరుదరహాసం అంటారు దాన్ని. అంతే కానీ వెకిలినవ్వు కాదు. ఆ చిరుదరహాసం లేనివాడికి ఏమవుతుంది అంటే, tension వచ్చేస్తుంది. అది మింగేస్తుంటుంది. Tension అనే రాక్షసుడు ఒకడున్నాడు. వాడు ఎంతటి వాణ్ణయినా మింగేస్తాడు, ఒక్కసారి నవ్వితే వాడు పారిపోతాడు. You should be able to laugh away or smile away, అప్పుడు tension పోతుంది. చిరునవ్వు వుంటే tension రాదు, Tension వుంటే చిరునవ్వు రాదు. కాబట్టి, మనం గుర్తుపెట్టుకుని సంతోషంగా ఉండడానికి ప్రయత్నం చెయ్యాలి.

**8.** తపస్సు చేస్తూ వుండాలిట. నేను ఎవరనేదే తపస్సు. గుర్తు తెచ్చుకోవడమే, అదే తపస్సు. Fiery aspiration అంటారు దాన్ని. అది పట్టుకుని ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటూ వుంటే దానిచుట్టూ జరిగేవన్నీ మనకి అంత important అనిపించవు. ఏదైనా బైట బావుండక పోతే లోపల 'నేను' లోకి వెళ్లిపోవాలి, అప్పుడు బావుంటుంది.

**9.** స్వాధ్యాయము చేయుచుండుట. రోజూ ఒక సద్గ్రంథ పఠనం కనీసం 15 నిముషాల పాటు చేయాలి. భారతం, భాగవతం, రామాయణం, భగవద్గీత వంటి గ్రంథాలు రోజుకో పావుగంట చదివితే, ఒక పదేళ్ళు చదివిన తరువాత నీ దగ్గర బోలెడు సరుకు వుంటుంది. అది నీకు ఉపయోగపడేది, ఇంకొకళ్ళకి అంటే అడిగిన వాళ్లకి చెప్పడానికి. అడగని వాళ్లకి చెప్పకూడదు. just 15 minutes a day. జ్వాలాకూల్ గారు రోజుకి పది పేజీలు అనుకోవద్దు, పది నిముషాలు అనుకోమని చెప్పారు. ఎంత చదివాం? అన్నది వద్దు, ఏం చదివాం? అనేది పెట్టుకుందాం. 'స్వాధ్యాయ ప్రవచనాధ్యాన్న ప్రముదితవ్యం' అని చెప్పారు ఆర్యులు, నువ్వు

రోజూ చదువుకోవడం, రోజూ నువ్వు చదివిన దాంట్లో ఎవరికో ఒకరికి అడిగినవాడికి చెప్పుకో. అడగనివాడికి చెప్పకూడదు. కుటుంబంలో చెప్పుకోవచ్చు, వాళ్ళు అడగకపోయినా వింటారు. ఒక నాలుగైదు సార్లు వింటే అసలు విషయం మనకి సంబంధించినది కాదు, దానికి సహజమైన రుచి వున్నది. భారతం, భాగవతం, రామాయణం చదవడం రాక గానీ, చదవడం మొదలుపెడితే వదలలేము. అది సత్యం !!

## 171 వేద్యః

ఏది తెలుసుకుంటే ఇంక తెలుసుకోవాల్సినది ఏమీ మిగలదో ఆ భగవద్ తత్త్వానికి 'వేద్య' అని నామము ఇవ్వబడినది. వేద అంటే ఏది తెలుసుకుంటే ఇంక మిగతావి ఏవీ తెలుసుకోవలసిన అవసరం లేదో, అంటే The Ultimate అని. ఇంక తెలియడానికి ఏమీ లేదు అని తెలుస్తుంది. వేద్యమైనది అంటే అట్లా, ఈ మొత్తం సృష్టికంతా ఆధారభూతమైన తత్వం ఏదైతే తెలుసుకోదగినది ఉన్నదో అది. అది ఆధారంగా ఇవన్నీ ఏర్పడుతున్నాయి కాబట్టి, సమస్తమునకు ఆధారభూతమైన దాన్ని తెలుసుకోవటం అనేది వేద్య. అది తెలిసినట్లయితే సమస్తమూ తెలిసినట్లు అవుతుంది. ఈ తత్వం మనలో కూడా పనిచేస్తూ వుంటుంది. మనలో ఏదో తెలుసుకోవాలి అన్న తత్వం వున్నది కదా? సాధారణంగా చెప్పుకోవాలనుకుంటే అలా రోడ్డు మీద వెళ్తుంటే ఒక సినిమా బొమ్మ కనిపించింది. ఈ సినిమా ఏమిటో తెలుసుకుందాం అని వెళ్తాం కదా? ఇది అతి సాధారణమైన ఉదాహరణ.లేకపోతే అక్కడ ఎదో చక్కగా వెలుగుగా, రంగురంగుల బల్బులు పెట్టి తోరణాలు కట్టారే, అనుకోండి, అదేమిటో తెలుసుకుందాం అని అనిపిస్తుంది. ఏదైనా మనం బహిర్గతమైన ప్రపంచంలో జరుగుతున్న కార్యకలాపాల్లో తెలుసుకుందాం అనే ఒక భావన మనలో ఉద్భవిస్తుందే అదే వేద్యుడిగా భగవంతుడు మనలో ఉన్న స్థితి. తెలుసుకోవాలనే తపన లోపల సహజంగా మనిషిలో వున్నది. మనకి ఏది తెలుసుకోవాలని అనిపించినా అది భగవంతుని యొక్క ఒక తత్వం, ఒక కళ్యాణ గుణంగా తీసుకుని మొదలు పెడితే ఈ తెలుసుకోవడం పేకాట గురించి తెలుసుకోడం దగ్గర నుంచీ పరమాత్మని తెలుసుకోవడం వరకూ కూడా మనని నడిపించే ఈ తెలుసుకోవడం అనే ఒక గుణంగా మనలో పనిచేస్తుంది. ప్రతీదీ తెలుసుకోవాలనిపించదూ? ఈ తెలుసుకోవడం మొదలు పెడితే ఏమవుతుంది అంటే అలా తెలుసుకుంటూ తెలుసుకుంటూ మూలంలోకి వెళ్తాం. అలా ప్రతీ విషయంలోనూ మూలంలోకి వెళ్ళినప్పుడు అక్కడ మనకి కనపడే తత్వం ఏదైతే వుందో అదే భగవంతుడు. ఇక ఇంతకన్నా ఎందుకు తెలుసుకోవలసింది ఏమీ లేదు. నాయుడుగారూ! మీ చొక్కా బావుంది అన్నామనుకోండి, అంటే నాయుడుగారు కుట్టించుకున్న బొమ్మల చొక్కా ఎక్కడ నుంచి కొనుక్కున్నారు? తెలుసుకోవాలి కదా! ఫలానా షాపులో. అక్కడికి వెళ్తాం. షాపుకి వెళ్ళిన తరువాత ఆ రకమైన

డిజైన్లు, రంగులు ఉన్న గుడ్డ మీ షాపులో ఉందిట కదా అంటే, ఉందంటాడు. ఇయ్యమంటే వాడొక తాను తీస్తాడు. అంటే ఈ చొక్కా గుడ్డకి ఇది మూలమన్నమాట. ఆ తానుకి, దాని మీద ఉన్న డిజైన్లకి మూలమేవిటయ్యా అంటే, గుడ్డ ఆధారంగా వున్న డిజైన్లు. ఆ గుడ్డకి ఆధారం ఏవిటయ్యా అంటే నూలుపోగులు ఆధారం. నూలుపోగులకి ఆధారం ఏవిటి అంటే పత్తి ఆధారం. పత్తికి ఆధారం ఏవిటయ్యా అంటే పంట పండించిన వాడు ఆధారం. పంట పండించే వాడికి 'నీకు ఏవిటి ఆధారం? ఎట్లా పండించావు?' అంటే 'నేనే పండించాను' అంటాడు. నేనే పండించాను అన్నప్పుడు నేను ఎవరు? మనం ఆ ప్రశ్న వేస్తుంటే, 'నేనే' అంటాడు. నేనుగా ఇంత కార్యక్రమం వాడు నడిపిస్తూ వుంటే మనం అన్ని విషయాల్లో కూడా ఇట్లాగే, అణువు, పరమాణువుల్లోకి వెళ్ళిపోయినా ఇదే తత్వంలోకి వెళ్తూ వుంటాం. ఈ'నేను' తెలుసుకోవడం ఎట్లా జరుగుతుంది అంటే ఏమిటి తెలుసుకుంటున్నారు? ఎవరు తెలుసుకుంటున్నారు? ఈ మొత్తం అంతా ఇందాక చెప్పినట్లుగా ఉదాహరణలో తెలుసుకుంటున్న వాళ్ళు ఎవరు అంటే 'నేనే' అంటాం మళ్ళీ. పత్తి పండించిన వాణ్ణి ఎవరు పండించారు అంటే 'నేనే' అన్నట్లుగా, ఈ తెలుసుకుంటున్నవాడు ఒకడున్నాడు కదా, వాణ్ణి ఎవరు తెలుసుకుంటున్నారు? అని మనం ప్రశ్న వేసుకుంటే లోపల, నాలో తెలుసుకునేవాడుగా ఎవరు వున్నారు? అని ప్రశ్న మనం వేసుకున్నట్లయితే సమాధానం ఏం వస్తుంది? 'నేను' అని వస్తుంది. నేనే తెలుసుకుంటున్నాను. అంటే 'నేను' ఆధారంగా ఇవన్నీ తెలుసుకుంటున్నాము. కదా! ప్రతీ ఒక్కరం కూడా వారి వారి వ్యక్తిగతమైన 'నేను' ల ఆధారంగా తెలుసుకోవడం వుంటుంది కదా! అంటే 'నేను' ఆధారంగా ఇతరములైన విషయములు తెలుసుకుంటూంటాం మనం. కాబట్టి నిజంగా తెలుసుకునేవాడు ఎవడయ్యా? అంటే నేనే. అంటే నన్ను నేను తెలుసుకోవటం అనే ఒక స్థితికి నెమ్మదిగా వెళ్ళడంజరుగుతుంది. అసలు నాలో ఈ తెలుసుకుందాం అనేది ఎక్కడ నుంచి పుడుతోంది. అంటే నేనే తెలుసుకోవడంగా బయటకి వస్తున్నాను కాబట్టి నా నుంచి తెలుసుకోవాలనే ఒక ఉత్సాహం బయలుదేరి బహిర్గతంగా చాలా విషయాలు తెలుసుకుంటాం. ఇదంతా మనం ఉండబట్టి కదా! నేను గా ఉండబట్టి, నేను పైన ఏర్పడిన వివిధములైన విషయములు తెలుసుకోవడం వుంటుంది. నేను లేను, అనుకోండి. నేను లేకపోతే ఇవన్నీ తెలుసుకునేది ఏమీ లేదు కదా! కాబట్టి, ఏది ఆధారంగా ఈ తెలుసుకోవడం అనేది ఉన్నదో మనం గమనించినట్లయితే అది

'నేను' అని తేలుతుంది. ఈ నేనే అది తెలుసుకుందాం, ఇది తెలుసుకుందాం, ఇంకోటి తెలుసుకుందాం, మరోటి తెలుసుకుందాం ఇట్లా తెలుసుకోవడం కోసం విజ్ఞానమైన లోకాల్లో చాల తిరుగుతుంది ముందు. మనకి చిన్నప్పటినుంచీ కూడా నేర్పినది ఏంటంటే, బహిర్గతమైన ప్రపంచములోని విషయాలు చూట్టం, వినటం, రుచి చూడటం, స్పర్శించటం, ఆఘ్రాణించటం. ఇవి బాగా నేర్పారు మనకి. ఆర్యులు ఏం చేసేవాళ్ళంటే, ఏడేళ్ళవరకూ ఇవి నేర్పి, ఏడేళ్ళ తరువాత మళ్ళీ లోపలికి పంపిస్తుండేవారు మనిషిని. అంటే మనం జీవితంలో బహిర్గతం అవుతూ వుంటాం కాబట్టి, అంతర్గతం అవటం కూడా నేర్పితే అది సరైన విద్య అవుతుంది. కేవలం బహిర్గతం అయిన విషయాలు నేర్పటం విద్యగా తీసుకున్నట్లయితే విజ్ఞానం మిగుల్తుంది తప్ప జ్ఞానం మిగలదు. అంటే జ్ఞానం ఆధారంగా విజ్ఞానం ఉన్నట్లయితే దానికి సరైన పరమావధి దక్కుతుంది. అలా కానప్పుడు మనకి ఎంతసేపూ బయట విషయాలు తెలుసుకోవటంగా ఉంటూ వుంటాం, బయట విషయాలు ఎన్నో వుంటాయి. ఎన్ని ఉంటాయంటే? మన భూమ్మీద వున్నవే మనకి పూర్తిగా తెలుస్తాయి. మన చుట్టూ వుండే గ్రహగోళాదులలో ఏవున్నాయో తెలుసుకోవాలంటే ఇంకా కొన్ని దశాబ్దాలు పడుతుంది. అక్కడి నుంచి సూర్యుడు. ఇటువంటి సూర్య మండలాలెన్నో వున్నాయి. మనం ఆకాశంలో ఉన్న తారలన్నీ తెలుసుకోవటం మొదలుపెట్టాం అనుకోండి. ఎప్పటికైనా అయ్యే పనేనా ఇది? కానీ ఇవన్నీ తెలుసుకుందాం అనే ఉత్సుకత మనలో ఎక్కడ పుడుతోందో వాణ్ని తెలుసుకున్నాం అనుకోండి! అట్టా తెలుసుకున్నారు ఋషులు. తనను తాను తెలుసుకుంటే, తనలో ఇవన్నీ ఏ విధంగా వ్యక్తమవుతున్నాయో అట్లాగే ఒక పెద్ద 'నేను' లోంచి మొత్తం ఈ సృష్టి అంతా వ్యక్తమవుతున్నట్లుగా తనకు అవగాహన అవుతుంది. అందుకని వేద్యుడు అనే వాడు ఎవరయ్యా అంటే 'తెలుసుకోదగినది తెలుసుకున్నవాడు.' తెలుసుకోదగినది ఏదైతే వుందో దాన్ని 'వేద్యః' అంటారు. ఎన్ని తెలుసుకున్నా ఇంకా తెలుసుకొనేవి మిగుల్తాయి కాబట్టి, నిన్ను నువ్వు తెలుసుకుంటే సమస్తం అక్కడి నుంచి నీకు అవగాహన అయిపోతుంది. అలా పెద్దలు ఒక మార్గం కనిపెట్టారు. తనని తాను తెలుసుకున్న వాడు సృష్టిలో సమస్తాన్ని తెలుసుకోగలుగుతాడు. తనని తాను తెలుసుకోలేని వాడికి, తెలుసుకోవలసినవి సృష్టిలో అన్నీ కోకొల్లలుగా ఎప్పుడూ మిగిలిపోతుంటాయి. తనని తాను తెలుసుకున్న వాడు అన్నిటిల్లో ఉన్న 'తాను' లేక 'నేను' అనే తత్వంతో ఏకీభావం

చెంది ఉంటాడు. కాబట్టి అందులో ఉండే సమస్త గుణములన్నీ కూడా తనకి తెలిసిపోతాయి. అది మనకి శంకరాచార్యుల వారి జీవితంలో కనిపిస్తుంది. పరకాయ ప్రవేశం చేసి ఆయన కొన్ని కొన్ని విద్యలు నేర్చుకోవటం జరిగింది. దేని గురించి తెలుసుకోవాలన్నా తనకు తాను తెలిసిన వాడు, తనలో తానుగా ఉన్న స్థితిలో, అన్నిటిలోనూ తానుగా వుండే స్థితిలోకి వ్యాపనం చెంది, అందులో వున్న గుణములన్నీ కూడా ఆకళింపజేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అంటే ఇదేమిటంటే వ్యాపనము చెంది తెలుసుకోవడం తప్ప, మనం ఒక unit గా వుండిపోయి మిగతావన్నీ తెలుసుకోవడం కాదు. మనలోకి మనం ఎప్పుడైతే తిరోధానం చెంది, నేను అనే ప్రజ్ఞను దర్శనం చేసుకుంటే, ఆ నేను అనే ప్రజ్ఞ ఆధారంగానే మిగతా జీవకోటి అంతా కూడా వున్నది అని తెలుస్తుంది. శ్రీకృష్ణుడు తొమ్మిదవ అధ్యాయంలో 'ఈ నేనుగా మొత్తం నేనే వున్నాను, ఇన్ని జీవరాసులుగా నేనే  వున్నాను' అని ధ్యానం చేయమని చెప్తాడు. అది ఒక్కటే నిజమైన ధ్యానం. మిగతా ధ్యానాలన్నీ కూడా ఇంకొకటేదో వుందని చేసే ధ్యానం. శ్రీకృష్ణుడు 'ఈ సర్వజీవరాసులుగా నేను వున్నానని ధ్యానం చెయ్యండి' అని చెప్తాడు. అంటే శ్రీకృష్ణుడు ఉన్నాడని కాదు. 'నేను' గానే ఈ సర్వజీవరాసులన్నీ వున్నాయి. అందుకనే  ప్రతీవాళ్ళూ, నేను నేను నేను, అంటూ వుంటారు. ఆ ధ్యానం బాగా మనయందు బలం కలిగినట్లయితే, నేను సర్వజీవరాసులుగా వున్నాను అనే స్థితి నుంచీ, సర్వజీవరాసులూ నా యందు వున్నాయి అనే ఇంకొక స్థితి వస్తుంది. సర్వజీవరాసులూ నా యందు వున్నప్పుడు, వాటిని నాలో దర్శనం చేసుకోవడం అనేది సులభం అవుతుంది. ఎందుకంటే నేను ముందు పెద్ద నేనులో ఏకీభావం చెంది వున్నాను కాబట్టి, సర్వజీవరాసులూ నా యందు వున్నాయి కాబట్టి, ఆ సర్వజీవరాసుల యొక్క గుణగణములు, స్వభావములుఅన్నీ సహజంగా నా యందు వున్న విషయాలు నాకు తెలిసినట్లుగా తెలుస్తాయి. అది కృష్ణుని  యొక్క వ్యాపన స్థితి.తాను ధ్యానంలో కూర్చుంటే ఎక్కడో భీష్ముడు, అంపశయ్య మీద ఉన్నవాడు 'నాకు అనుమతి ఇవ్వు నేను దేహం చాలిస్తాను' అని చెప్పడం, తనలో తనకి దర్శనం ఇస్తుంది. ఈ దర్శనం కూడా బాహ్యం కాదు, అంతరంగంగా జరిగే దర్శనములే. ఎందుకంటే నా లోపల నేను దర్శనం చేసుకుంటున్నాను మొత్తం సృష్టి అంతా. కాబట్టి సృష్టి జీవులంతా లోపలే దర్శనమిస్తారు. అందుకని శ్రీ కృష్ణుడు 'అతి రహస్యము, అతి పవిత్రము అయిన ఒకే ఒక్క విషయం నీకు చెప్తున్నాను అర్జునా'

అని చెప్పి తొమ్మిదవ అధ్యాయంలో ‘నేను ఈ సర్వజీవరాసులలో వున్నాను, నా యందు ఈ సర్వజీవరాసులు వున్నాయి. నిజానికీ, నాకు ఈ జీవరాసులు లేవు’ అంటాడు మూడవ స్థితిలో. నేనే మొత్తంగా వున్నప్పుడు, ఇవన్ని వున్నాయి అనే గమనిక ఉండటానికి అవకాశం లేదు. అంటే మనలో మనకి ఊపిరితిత్తులూ, గుండెకాయ, కాలేయము, మూత్ర పిండమూ వున్నాయని ప్రతీ నిత్యమూ గుర్తుంటుందా మనకి? ఏమిటి గుర్తుంటుంది అంటే ‘నేను వున్నాను’ అంటాం. అంతే కదా! నాకు రెండు కళ్ళున్నాయనీ, ముక్కుందనీ, ముక్కుకి రెండు రంధ్రాలు వున్నాయి, పళ్ళు ఉన్నాయనీ, కొన్ని ఊడిపోయాయనీ, ఇట్లా ఎన్నో వున్నాయి కదా మనలో, వీటన్నిటినీ కలిపి మనం ఎమంటాం? ‘నేనున్నాను’ అంటాం అంతేగా! అంతేగానీ నేను వీటన్నిటితో వున్నానని వర్ణన అంతా చేస్తాడా? చెయ్యడు కదా! అలాగే ఈ సమస్త జీవరాసులు గా నేను వున్నాను అనే స్థితిలోకి ఎదిగినవాడికి, నేనేగా ఉన్నానూ సమస్త జీవరాసులుగా  అంటాడు. అది కృష్ణుడు చెప్పిన ఒక పెద్ద రహస్యం. ‘నా యందు మొత్తం దర్శనం చేసుకోవచ్చు’ అని. అంటే ప్రతీవాడూ తన యందు అట్లా దర్శనం చేసుకోవాలి తప్ప, కృష్ణుడి యందు దర్శనం చేద్దాం అని కాదు ఇక్కడ. ఈ నేనున్నాను అనే స్థితినే పెద్దలు ‘అహమస్మి’ అన్నారు. ఈ నేనున్నాను అనే స్థితినే పాశ్చ్యాత్తులు ‘Iam’ అన్నారు. ఈ నేనుగా ఉన్న వాణ్ని తెలుసుకుంటే అందులోంచి సమస్తమూ తెలియబడతాయి. ఆ విధంగా ఋషులూ, యోగులూ సమస్తమూ దర్శనం చేసారు. ఈ భూమికి సంబంధించిందే కాకుండా, ఈ సూర్య మండలమూ, ఈ సవిత్ర మండలమూ, ఈ భర్గో మండలమూ మొత్తం అంతరిక్షంలో ఉన్న అన్ని విషయాలూ దర్శనం చేయటానికి వాళ్లకి సామర్థ్యం ఎక్కడ నుంచి కలిగిందంటే, వారు పెద్ద నేను లో ఇమిడిపోయి ఆ నేను గా దర్శనం చేసారు. తమయందు ఇవన్నీ దర్శనం చేసారు. అట్లా దర్శనం చేస్తే ఉన్నది ‘నేను’ అని తెలుస్తుంది. ఇంకొకటి లేదు. రెండవది లేదు. There is no other. అదే అద్వైత సిద్ధాంతం అంటే. ఉన్నది నేను. నాలోనే వీళ్ళందరూ వున్నారు. నాలోనే సమస్తం వున్నది అని తెలియడం అన్నదే ultimate తెలియడం. అదీ భగవంతుడు. అది భగవంతుడి నామాలలో ఒకటి. తెలియవలసినదీ, తెలుసుకోవలసినదీ. ఈ తెలుసుకోవలసిన భగవంతుడు మనలో తెలియజెప్పేవాడుగా తానే బయలుదేరతాడు. అందుకనే మనకి అవి తెలుసుకుందాం, ఇవి తెలుసుకుందాం అనిపిస్తూ వుంటుంది. మనలో తెలుసుకుందాం అనే తత్వం ఎంత ఎక్కువగా వుంటే

అంత ఈ భగవత్త్వం బాగా పనిచేస్తున్నట్లు. భగవత్తత్వం అవతరణం చెందినట్లు. శాస్త్రములు గ్రంథములు పఠించడం, పెద్దల యొక్క సాంగత్యంలో మంచి విషయాలు తెలుసుకోవటం, ఇంకా తెలుసుకోవటం, ఇంకా తెలుసుకోవటం. ఈ తెలుసుకోవటం ఎక్కడ ఆగుతుంది అంటే, తనను తాను తెలుసుకున్న తరువాత ఆగుతుంది. అంతవరకూ ఆగదు. తనను తాను తెలుసుకున్నవాడు ఇంక తెలుసుకోవలసింది ఏమీ లేదు కాబట్టి ఇంక అక్కడి నుంచీ వాడికి ఇది ఆగుతుంది. అందుకనే తెలుసుకోదగినది అనేది భగవంతుడి నామాలలో ఒకటిగా ఇచ్చారు. అది మనలో మనల్ని తెలుసుకునేట్టుగా చేస్తుంది. ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుంటాం. దీంట్లో ఏం లేదనుకుంటూ వుంటాం, ఇంకో దాంట్లోకి వెళ్తూ వుంటాం. మొదట్లో చిన్నతనంలో ఒక రకంగా కొన్ని కొన్ని తెలుసుకుంటూ వుంటాం. కొన్ని కొన్ని ఎక్కువ మనకి ఉత్సాహంగా వుంటాయి. అందులో ఏం లేదని ఇంకో దాంట్లోకి వెళ్తాం, అందులో ఏం లేదని ఇంకో దాంట్లోకి వెళ్తాం. ఏదీ మనకి తెలుసుకున్న తరువాత ఇంక వాటి యందు ఆసక్తి వుండదు. ఈ ఆసక్తి లేనివన్నీ దాటి దాటి, నెమ్మదిగా ఇంకొంచెం పెద్దపెద్ద విషయాల లోకి వెళ్లి తనని తాను తెలుసుకొనే స్థితికి పరిణామ దశలో ప్రతీ మానవుడూ వచ్చి చేరుతాడు. ఈ లోపల దేవుడి విషయంలో కూడా, తెలుసుకోవడం అంటే బహిర్గతంగా తెలుసుకోవడం అనే స్థితిలో చాలాకాలం జరిగిపోతూ వుంటుంది. ఎందుకంటే మనం పెట్టుకున్నపేర్లు, మనం పెట్టుకున్న రూపాలు గానే కదా దేవుడున్నది. ఎన్ని పేర్లు పెట్టుకుంటే అన్ని పేర్లు వున్నాయి, ఎన్ని రూపాలుగా మనం చిత్రీకరించుకుంటే అన్ని రూపాలుగా వున్నాడు. ఒకే చిత్రాన్ని ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క విధంగా చూస్తూ వుంటారు. వాళ్లకి అదే సత్యం కదా! ఈ రూపాలన్నీ ఎక్కడి నుంచి పుట్టినాయి? ఎక్కడి నుంచి పుట్టినాయో అది నిజం అనుకుంటే దైవము లేక నేను అనే భగవద్ తత్వము. దాన్ని తెలుసుకున్న తరువాత వాటి ముందు ఇవన్నీ ఏవో తేలే విషయాలే తప్పా, అదే ప్రవాహము ఈ చైతన్యప్రవాహము మీద, ఇవన్నీ తేల్తున్నాయి అనిపిస్తుంది. అది తెలిసిన తరువాత ఇంక వీడికి తెలుసుకోవలసినవంటూ ఏమీ ఉండవు. అక్కడి నుంచి వాడు పుస్తకాలు చదివి తెలుసుకోవాల్సినవి, ఊళ్ళు వెళ్లి తెలుసుకోవాల్సినవి, మనుషుల్ని కలిసి తెలుసుకోవాల్సినవి, సభలకు వెళ్లి తెలుసుకోవాల్సినవి ఏం వుండవు. ఉండటమే వుంటుంది అంతే! నేను ఉన్నాను. నేను ఈ సర్వజీవరాసులుగా వున్నాను. నా యందు ఈ సర్వజీవరాసులు వున్నాయి

అని తెలుస్తుంది. ఇంకా ఎక్కడికి వెళ్ళాలి? అప్పుడేం చేస్తారు అంటే ఒక రమణ మహర్షి లాగ కూర్చుండిపోతారు. ఎందుకంటే, ఎక్కడ కూర్చున్నా మొత్తం అంతా వ్యాప్తి చెందిన స్థితి. ఒక C.V.V. గారి లాగ కూర్చుండిపోతారు. ఒక రామకృష్ణుని లాగ కూర్చుండిపోతారు. అరవిందుడి లాగ కూర్చుండిపోతారు. మూలమైన స్థితి తెలిసి తద్వారా వ్యాపనము చెందిన వాళ్ళు ఇంకా ఎక్కడికి తిరగాలిట? తిరగటానికి ఇంకా ఏం వుంది, మొత్తం అంతా నేనే అయిపోయినప్పుడు. దానికే ఓ కథ వుంది. ఒకాయన చాలా తొందరగా ప్రయాణమై వెళ్తున్నాడట. వెళ్తుంటే, ఊరు చివరకి వెళ్ళేసరికీ అక్కడ ఒక ముసలాయన కూర్చున్నాడట. ఏవిటి? ఇంత speed గా ఎక్కడికి వెళ్తున్నావ్? అని అడిగాట్ట. నా స్నేహితుడి పుట్టినరోజు, అందుకని అతని దగ్గరకి వెళ్లి అతన్ని అభినందిద్దామని వెళ్తున్నాను, అంటాడు. అంటే అప్పుడు ఋషి నవ్వుతాడు. నవ్వీ, నీ స్నేహితుడు పుట్టడం ఏమిటి? అంటాడు ముందు. పుట్టడం లేదు కదా! అంటాడు. ఆ తరువాత వెళ్ళడం ఏమిటి? అంటాడు. వెళ్ళడం ఎక్కడికి వెళ్తావ్? అంటాడు. ఇవన్నీ ఉపనిషత్తులు చెప్పిన విషయాలు. మామూలుగా చిన్న చిన్న పుస్తకాల్లో దొరుకుతాయి. ఆంగ్ల భాషలో బయటకి వచ్చేసినాయి. ఎందుకని అట్లా అంటాడు అంటే ఆ ఋషి ఎక్కడికీ వెళ్ళక్కర్లా. తన లోపల మొత్తాన్నీ దర్శనం చేయగలడు. తద్వారా మొత్తం సృష్టిలో జరుగుతున్న సమస్త సన్నివేశాలని తానుగా అనుభూతి చెందగలడు. ఆ స్థితిలో ఉన్న వాడికి అక్కడ నుంచి అన్నీ పుడుతూ వుంటాయి. ఆ స్థితి పుట్టుక చావు లేని స్థితి. కాబట్టి పుట్టుక అనేది దాటి ఉంటుంది. ఇటువంటి ప్రశ్నలు వేసి ఇతన్ని, మొత్తం అంతా మూడు, నాలుగు వాక్యాలతో చిన్న పుస్తకం 'there is no such thing as far away" అని ఓ చిన్న పుస్తకం. ఆ మొత్తం పుస్తకం ఖరీదు ఎక్కువ గానీ అందులో ఉండేవి 15 పేజీలే. ఒక్కొక్క పేజీలో ఒక్కో వాక్యం. Profound wisdom. అట్లా తెలుసుకుని వున్న వాళ్ళు ఇంక తెలుసుకోవాల్సింది ఏమీ లేని స్థితిలో వున్న చోట ఉండిపోతారు. అక్కడికే కావాల్సిన వాళ్ళు భగవత్ ప్రణాళికగా, ఎవరెవరు ఏవేవి తెలుసుకుందామనుకుంటున్నారో, అక్కడికి వచ్చి తెలుసుకోవడంగా వుంటుంది. కాబట్టి the ultimate of the things to be known అనేది'వేద్యో' అనే నామం ద్వారా మనకి తెలుస్తుంది.

## 172 వైద్యః.

వైద్యుడంటే మనం డాక్టర్ అనుకుంటాం. వైద్యుడు డాక్టరు కన్నా కూడా చాలా ఎక్కువైన వాడు. వేద్య అనేది 'వేద' అనే శబ్దం నుంచి పుట్టుకొచ్చింది. అట్లాగే వైద్య కూడా relating to Vedic term. 'తెలిసినవాడు' అని అర్థం. వైద్యుడంటే తెలిసినవాడు, పండితుడు, జ్ఞాని. ఏం తెలిసినవాడు? అది తెలిసిన వాడు. 'నేను' ఎరిగినవాడు అవటం వల్ల, తన 'నేను' లోంచి పుట్టుకొచ్చినవన్నీ తెలుస్తాయి కాబట్టి, ఈ నేను లోంచి ఈ శరీరం మొత్తం అంతా ఎట్లా పుట్టుకొచ్చిందో తెలిసిన వాడు వైద్యుడు! నేను అనే తత్వం నుంచి ఈ మానవ శరీరం ఏ విధంగా నిర్మాణం జరిగింది, అని తెలిసినవాడు వైద్యుడు. అది ఋషుల అవగాహన. మనం ఈ రోజు మందులిచ్చే వాడు వైద్యుడనుకుంటాం. మందులు ఇచ్చే వాళ్లకి లోపల ఏం జరుగుతుందో ఎక్కువ తెలియదు. ఎందుకంటే నేను నుంచి పుట్టుకొచ్చిన చైతన్యం ద్వారా ఆ చైతన్య ప్రవాహం లోంచి ఏర్పడిన కొన్ని సుడిగుండములు లేక కేంద్రములు లేక చక్రములు, వాటి ద్వారా కొన్ని గ్రంధులు, గ్రంధుల్లోంచి secretions, అక్కడి నుంచి formations ఇట్లా మనకి body అంతా ఏర్పడుతూ వుంటుంది. ఇందులో కొంత తెలిసి, కొంత తెలియని వాళ్ళు వైద్యులనటానికి వీల్లేదు. వైద్యుడు ఎవరయ్యా అంటే ఆది నుంచి మనం చూస్తున్న భౌతికమైన సృష్టి నిర్మాణం వరకూ తెలిసిన వాడు వైద్యుడు. మనం చెప్పుకున్న చొక్కా ఉదాహరణ తీసుకుంటే, నానుండి పుట్టుకొచ్చిన భావం లోంచి, పుట్టుకొచ్చిన పత్తిపంట లోంచి, పుట్టుకొచ్చిన నూలుదారం లోంచి, పుట్టుకొచ్చిన తానులోంచి, పుట్టుకొచ్చిన రంగురంగుల గుడ్డలోంచి పుట్టుకొచ్చిన రంగురంగుల చొక్కా, ఇది. కదా! మొత్తం అన్ని స్థితులు దానికి. మొదటి నుంచీ తెలిసినవాడికి అంటే తన నుంచి పుట్టుకొచ్చిన భావంలోంచి పుట్టుకొచ్చినవి కదా అన్నీ. ఇది తెలిసిన వాడికి ఏం తెలుస్తుంది అంటే ఎక్కడ తేడా వుందో తెలుస్తుంది. ఎక్కడ దీనికి rectification చెయ్యాలనేది తెలుస్తుంది. మొత్తం process తెలియని వాడికి తేడా ఎక్కడ వుందో తెలియటానికి అవకాశం లేదు. అంటే భౌతికమైన శరీరం గురించి తెలిసిన వాడికి, అంతకు లోపల ఉన్న కామమయ లోకముల్లో జరుగుతున్న ఆందోళన వలన భౌతికమైన శరీరానికి వచ్చే జబ్బుల గురించి తెలియటానికి అవకాశం తక్కువ. కామమయ లోకం దాటి ఆ పైన

అంటే కేవలం కోరికల ద్వారా జబ్బులు తెచ్చుకోవచ్చు. అంటే ఆ కోరికలని rectify చెయ్యగలిగే వైద్యం ఏమైనా వున్నదా? కోరికలు దాటి మనోభావములు వుంటాయి. అంటే ఉద్దేశ్యములు వుంటాయి. అంటే motives వుంటాయి. Motives బావుండకపోవడం చేత మీరు ఎంత వైద్యం చేసినా కొన్ని కొన్ని జబ్బులు తగ్గవు. మనిషి తను నడిచే జీవన విధానాన్ని మలుచుకోకపోతే, ప్రకృతితో అనుసంధానం చేసుకోకపోతే కొన్ని జబ్బులు తగ్గవు. కాబట్టీ, ఇక్కడ ఈ మనిషికి ఎక్కడ ఆరోగ్యం దెబ్బ తిన్నది అని తెలియాలంటే అది విజ్ఞానమయ కోశంలో ఉందా? అంటే intellectual plane. ఆనందమయ కోశంలో ఉందా? దుఃఖసాగరంలో ఉంటాడు. కొంతమందికి అసలు ఏడవటమే బావుంటుంది. అంటే he is instinctively unhappy. బాగా deep గా ఉందన్నమాట disease. ఈ సన్నివేశాల వలన బాధలోవుండటం. సన్నివేశాలు మళ్ళీ బావున్నప్పుడు ఆనందంగా వుండటం కాకుండా అసలు సహజంగానే నవ్వడు. ఎందుకు నవ్వాలండీ? నవ్వేమి సాధించాలి అన్నట్టుగా వుంటుంది. ఇటువంటి వారికి, వారి యొక్క సత్వము, రజస్సు, తమస్సు, వాటిల్లో వున్న blend బట్టి రకరకాలైన వ్యాధులు వస్తాయి. అక్కడి నుంచి మన ఉద్దేశ్యములు, ఉద్దేశ్యముల నుంచి భావములు, భావముల నుంచి స్వభావములు, అక్కడి నుంచి కోర్కెలు, ఇలా ఇన్ని చోట్ల ఇన్ని junction boxs వున్నాయి, ఇందులో ఎక్కడ తేడా వచ్చినా మన ఇంటికి supply సరిగ్గా రాదు. ఏది? ప్రాణ supply. కాబట్టి rectification నిజంగా తెలిసిన వాడికి ఎట్లా తెలిసినట్లు లెఖ్ఖ? ఆది నుంచీ అంతం వరకూ జరుగుతున్న మొత్తం నిర్మాణం తెలిసినవాణ్ణి, మానవదేహ నిర్మాణానికి సంబంధించిన సమస్త విజ్ఞానము తెలిసిన వాణ్ని 'వైద్యుడు' అంటారు. అందుకే పూర్వకాలంలో వైద్యుడికీ యోగికీ ఎక్కడా తేడా ఉండేదికాదు . వైద్యుడైన వాడు యోగి అయ్యి ఉంటాడు, యోగి అయిన వాడు వైద్యుడై ఉంటాడు. అంటే తెలిసినవాడై ఉంటాడు. తెలిసిన వాడు అంటే తన గురించి తాను తెలిసినవాడు. ప్రతీ ఋషి ఒక వైద్యుడు. తన గురించి తాను తెలిసినవాడు నారాయణుడితో సమానుడు. కాబట్టి 'వైద్యోనారాయణో హరిః' అంటూ ఉంటాం. నిజమైన వైద్యుడు ఎవడయ్యా అంటే ఆ స్థితి తెలిసిన వాడు వైద్యుడు. కాబట్టి ఈ మొత్తం సృష్టికి వైద్యం 'నేను' నుంచి జరుగుతుంది. నేనే ఇన్నిటిగా తారుమారు అయి వస్తుంది కాబట్టి దాని యొక్క స్రవంతికి ఎక్కడ అడ్డంకి వచ్చిందో అక్కడల్లా కూడా consequences, complications వస్తూ వుంటాయి.

తద్వారా మనకి రోగములు వస్తుంటాయి. ఇది చూస్తాడు నిజమైన వైద్యుడు. చూసి జీవులు వారి వారి కర్మను ప్రకారం తెచ్చుకున్న జబ్బులు, కాలము రూపములో ఎట్లా వేధిస్తాయో కూడా చూస్తారు. కొన్ని కొన్ని జబ్బులు ఎన్ని మందులు వేసినా కొన్నాళ్ళపాటు వుంటాయి. ఎందుకంటే అది కాలానికి సంబంధించినది. ఆ కాలంలో దాన్ని అట్లా అనుభవించాల్సి వస్తుంది. కాలమెరిగి, దేశమెరిగి, కర్మమెరిగి, మానవదేహ నిర్మాణమెరిగి మందిచ్చే వాడు వైద్యుడు. ఆ మందు కేవలం మాత్రలవ్వచ్చు. స్వభావంలో మార్పు తీసుకురావటానికి చెప్పే చక్కటి మాట సలహా కూడా మందే! మనసులో ఉండే ఆందోళన తొలగిపోయే పద్ధతిలో అతనికి చక్కటి ప్రశాంతమైన మనసు ఏర్పడటానికి ఒక మార్గాన్ని చూపిస్తే అది కూడా మందే! మానవ జీవితం యొక్క ఉద్దేశ్యం సరిగ్గా అవగాహన చేయించి, తద్వారా సరైన మార్గంలో ఒక మనిషిని పెట్టి, వాడి ఉద్దేశ్యములు పవిత్రీకరించినట్లయితే, అది కూడా మందే! కాబట్టి మందులు కేవలం మాత్రల రూపంలో మాత్రమే అని అవగాహన చేసుకోవటం మనకి ఉండే చిన్నబుద్ధికి తార్కాణం. వైద్యమునకు, వేదమునకు అటువంటి అనుసంధానం వుంది. వైద్యమునకు యోగమునకు అటువంటి అనుసంధానం వుంది. అందుకని 'Prana Treat, Yoga Teach' అని CVV గారు చెప్పారు. అలాగే ప్రతీ initiate కూడా తాను ఎంత జ్ఞానియో అంత వైద్యుడు కూడా. ఎంత తెలిసినవాడో అంత వైద్యం తెలిసిన వాడు. అంటే ప్రాణశక్తి యొక్క ప్రవాహం గురించి తెలిసి ఉంటాడు. దానికి ఎక్కడ అడ్డుకట్టలు కడుతున్నారో, ఎక్కడ తెలియక అవివేకంగా దానితో చెలగాటం ఆడుతున్నారో తెలుసుకుని, అక్కడ దాన్ని rectify చేసే వాడు వైద్యుడు. అది భగవంతుని యొక్క తత్వంలో ఒకటి. కాబట్టి నిజమైన వైద్యుడు నారాయణుడి తో సమానం. నిజమైన వైద్యుడు నారాయణుడే.

# 173 సదాయోగీ

ఎప్పుడూ యోగము నందే ఉంటాడుట. భగవంతుడు తనయందు సమస్తము ధరించి ఉండటం అనేది యోగం. యోగస్థితిలో ధారణ అంటాం. ధ్యాన సమాధి. ధరించి ఉంటాడు కాబట్టి ఇవన్నీ కూడా ఇట్లా నిలబడి ఉన్నాయి. ఒకదానితో ఒకటి మనకి తెలిసి సంబంధం లేకుండా ఈ గ్రహగోళాదులు అన్నీ కూడా వాటి వాటి పరిధిల్లో అవి తిరుగుతున్నాయి. ఒకదానికీ ఒకదానికి తాళ్ళేసి కట్టిందీ లేదు, వాటన్నిటిని నిలబెట్టిందీ లేదు. అవి కేవలం యోగబలం వల్ల నిలబడి వున్నాయి. మనలో కూడా నేను అనే ప్రజ్ఞ ఆధారంగా లోపలనున్న సమస్తమైన అంగములూ కూడా ఒకదానితో ఒకటి సహకరించి, మనం ఉండటానికి వీలు కల్పిస్తుంది. కాలేయం మాట ఊపిరితిత్తులు వినక, ఊపిరితిత్తుల మాట గుండె వినక, గుండె మాట ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినక, ఇట్లా ఉంటే? కానీ అట్లా లేవుగా? మనకి తెలియకపోయినా మనలో చక్కగా ఒకదానితో ఒకటి అనుసంధానం చేసుకొని నడుస్తున్నాయిగా! మరీ అక్కర్లేకపోయినా బాగా కుక్కేసి అన్నం పెడితే లోపల్నుంచి అవన్నీ కూడగట్టుకుని ఇంకనుంచి నువ్వేమీ తినటానికి వీల్లేదనీ, నీకు వున్న రుచిని, ఆకలిని తీసేస్తాయి. ఎందుకంటే లోపల వీటన్నిటి మధ్యా సహజమైన యోగ స్థితి వున్నది కాబట్టి. మన లోపల ఈ యోగము సహజముగా వున్నది. అలాగే సృష్టి లోపల ఈ యోగము సహజముగా వున్నది. మనమంతా కూడా assembled parts. ఈ మొత్తం unit అంతా కూడా ఒక assembled. ఇవన్నీ కలిపితే, ఇందులో మనం ఉండడం బట్టి, అవి కలిసి ఉన్నాయి. మనం లేవనుకోండి. అవన్నీ విడిపోతాయి. ఇప్పుడు చూడండి. ఒకళ్ళది తీసేసి ఇంకోళ్ళకి పెడుతున్నారు కదా! ఓ పాడయిపోయిన కారులో మంచి carborator వుంటే తీసి ఇంకో కారులో వాడుకున్నట్టుగా మనం వాడుతున్నాం కదా గుండెకాయలు, మూత్రపిండాలు, కన్నులు-అలా. అంటే ఏమిటి? ఇవన్నీ వాటి వాటి అస్తిత్వం వాటికి వుండగా, అన్నీ కలిసి మనలో వున్నాయి. అవి కలిసి ఉండటానికి కారణం మనం. అట్లాగే భూమి, మిగతా గ్రహగోళాదులు వాటికి వేరుగా ఉన్నప్పటికీ, సూర్యమండలంగా కలిసి వున్నాయి. ఏ బలం చేత ఇవి కలిసి వున్నాయి? యోగబలం చేత కలిసి వున్నాయి. ఎప్పుడూ యోగమునందే ఉండే తత్వం. నదీ ప్రవాహం ఉందనుకోండి దానిమీద పడవల్లో వెళ్ళే వాళ్ళుంటారు, ఈతలుకొట్టే

వాళ్ళుంటారు, కలప చేరేసే వాళ్ళుంటారు, ఇవన్నీ, అంటే, ఈ కలప వెళ్ళడం గానీ, స్టీమర్లు వెళ్ళడం గానీ, ఈత కొట్టడం గానీ, వీటన్నిటికీ ఆధారం ఏమిటి? నీళ్ళు కాదు. ప్రవాహం! ప్రవాహం లేకపోతే ఇవేవీ కదలవు. ప్రవాహం ఎట్లా అయితే వీటన్నిటినీ చేరుస్తుందో, అట్లాగే అంతర్ప్రవాహంగా మనలో, మన చుట్టూ ఉన్న చైతన్యం ఏదయితే వుందో, అది ఆధారంగా ఇవన్నీ నిలబడి వుండటం అనేది జరుగుతుంది. అదీ 'సదా యోగీ' అనే భగవంతుడి యొక్క ఒక తత్వం. ఆయన ఆ యోగమునందు వుండడం వల్ల ఇవన్నీ నిలిచివున్నాయి. ఎప్పుడయితే ఆ యోగ స్థితి జారితే ఇవన్నీ పడిపోతాయి. పడిపోయినా ఆయన ఉంటాడు. అది మనకి శ్రీ కృష్ణుడు రెండవ అధ్యాయంలో భగవద్గీతలో చెప్తాడు. 'ఇవన్నీ లేకపోయినా నేను వుంటాను. శరీరం లేకపోతే నేను లేననుకోబోక, ఎందుకంటే శరీరం అనేది 'ultimate precipitate of I am'. మనం మాట్లాడక ముందు మాటలేదు అన్నట్టుగా వుంటుంది. మనం మాట్లాడక ముందు మాట భావం రూపంలో వుంది. భావం రూపంలో లేనప్పుడు మనం వున్నాం. మనం వుండి, మన నుండి భావం వచ్చి, భావం నుంచి భాష వచ్చి, భాష నుంచి మాట వస్తోంది. కేవలం మాటలేదన్నంత మాత్రాన భావం లేదు అనుకోవచ్చా? మాట్లాడకపోయినంత మాత్రాన మన నుంచి భావాలు ఉద్భవించట్లేదా? దాన్ని phenomenal world అన్నారు. సువర్లోకం అన్నారు. Material World, Phenomenal World, Nouminal World. ఇలాగ నేను అనే స్థితి నుంచి వచ్చిన భావము నుంచి మిగతా మాటలు, చేతలు వస్తాయి. అట్లాగే ఈ నేను అనే యోగస్థితి ఆధారంగా చేసుకుని మిగతావన్నీ వుంటాయి. కాబట్టి ఈ మొత్తానికి ఏది ఆధారం? మనిషికి ఆధారం వెన్నెముకలో ఉన్న చైతన్యం. మన బ్రహ్మరధంలో అనాహతమైన కుండలినీ చైతన్యం ఒకటి ఝుంకారం చేస్తూ ఉంటుందని పెద్దలు చెప్పారు. అది మనంగా వుండడం. అది ఉండడం వల్ల మిగతావన్నీ ఉంటాయి. అది వినబడడం మానేస్తే, మిగతావన్నీ పడిపోతాయి. అంటే అది 'central column' అంటారు. ఆ central column లో నేనుగా దేవుడు ఉంటాడు. అది వుండటం వలన మిగతావన్నీ ఏర్పడుతున్నాయి. అది తీసేసాం అనుకోండి మొత్తం పడిపోతుంది. అందుకే మనకూ్కడా హిరణ్యకశిపుడి కథలో స్తంభం పగలకొట్టి చూసుకోమని చెప్పడంగా జరిగింది. 'Central column of the house' పగలకొట్టు కనపడతాడు అని. పగల కొడితే ఏముంది ఈయన వస్తాడు. అట్లా మనకి సదా యోగమునందు

ఎవరైతే ఉంటారో, భగవంతుని యొక్క వ్యక్త రూపములు. అలా కాకుండా ఈ సృష్టి మొత్తంలో కూడా యోగత్వం మనకు గోచరిస్తు వుంటుంది. ఏది ఆధారంగా ఈ భూమి తిరుగుతోంది? ఇరుసు ఆధారంగా తిరుగుతోంది. ఇంకొంచెం బాగా అలోచించి చూస్తే, సూర్యుడి ఆధారంగా తిరుగుతోంది. సూర్యుడికి ఏది ఆధారం? దానికి మనవాళ్ళు 'సవితృడు' అన్నారు. సవితృడికి ఏది ఆధారం? అన్నిటికీ ఆధారం నేనే అని చెప్తాడు చివరకి. కాబట్టి ఎటుపోయినా మనకి నేను అనే అవగాహన అయితే వేద్యము, వైద్యము, యోగము. తనను తాను తెలుసుకోవడమే యోగస్థితి. ఎక్కడ మొదలవుతుందంటే ముందు, బహిర్గతమైన వ్యాపారముల్లో బాగా అలవాటు పడిపోయిన జీవి, నెమ్మదిగా చిత్త వృత్తులను నిరోధించి అంతర్ముఖుడవుతాడు. 'యోగః చిత్త వృత్తి నిరోధకః' అని మొదలు పెడతారు కదా. అంతర్ముఖుడయిన వాడికి ఏం తెలుస్తుంది అంటే, మనలో ఇంద్రియముల యొక్క ప్రేరణ వలన మనం బయట, వాటికోసం వీటి కోసం తాపత్రయ పడుతున్నాం అని తెలుస్తుంది. ఇంద్రియముల ప్రేరణ ఎవరు చేస్తున్నారు అంటే అంతకు ముందు అంతకన్నా లోపల స్వభావం రూపంలో నేనే ప్రేరణ చేస్తున్నాను, నా ప్రకృతి నుంచి ప్రేరణ జరుగుతోంది అని తెలుస్తుంది. ఈ స్వభావం ఎందుకిట్లా వుంది అని తెలిస్తే, మనలో కావలసినవీ, అక్కర్లేనివీ వాటికి సంబంధించిన అనుభవం బట్టి ఈ ప్రేరణ జరుగుతోందని తెలుస్తుంది. వీటన్నిటికీ భావములు ఎందులోంచి వస్తున్నాయి అంటే మనలోంచి పుడుతున్నాయి అని తెలుస్తుంది. ఈ భావములలో మార్పు ఏమైనా వస్తుందా? తెలుసుకోవచ్చా అంటే 'నేను' ఆధారంగా తెలుసుకోవచ్చు. కాబట్టి మనకి ఎంతసేపూ విద్య పేరున బహిర్గతమైన విషయాలు నేర్పుతున్నారు తప్ప, విద్య పేరున బహిర్గతమైన విషయాలతో పాటూ అంతర్గతమైన విషయాలు కూడా తెలిపినట్లయితే, మనిషి ఎక్కువ అవగాహన కలిగి పరిపూర్ణంగా జీవించటానికి అవకాశం వుంటుంది. ఇంకో పద్ధతిలో అవకాశం లేదు. అంటే తాను ఎవరో తను తెలుసుకునే విద్యను కూడా ఈ విద్యతో పాటూ ఏడవ సంవత్సరం నుండీ నేర్పటం అనేది ఇదివరకు గురుకులాల్లో జరిగిన కార్యక్రమం. ఒక తెలిసిన ఆయన ఇంట్లో పిల్లలకి ఈ విధంగా తెలియజెప్పేవాడు. బహిర్గతమైన వృత్తి వ్యాపారములు, సమర్థత నేర్పడం కాకుండా అంతర్ముఖముగా తనను తాను తెలుసుకునే పద్ధతి, దానికి సంబంధించిన విద్య కూడా అందించడం అనేది వుండేది. ఉన్నట్లయితే పరిపూర్ణం అవుతుంది. అలా కాకపోతే ఈ బహిర్గతమైన వ్యాపారం లో బాగా

వెళ్ళిపోయి, వెళ్ళిపోయి మళ్ళీ లోపలి రావటం చేతకాని పరిస్థితి ఏర్పరుచుకుంటాం. వాటిల్లో చిక్కులు వేసుకుంటాం బయటపడలేక. మాటిమాటికీ చిక్కులు వేసుకునే స్థితి నుండి ఒక్కసారి మళ్ళీ వెనకకు మరలి తన చిక్కులు తను విడదీసుకునే సమర్ధతను మనిషి ఎప్పుడు పొందుతాడంటే, మనం ఎందుకు ఈ విధమైన బాధల్లో వున్నాం అని మనం అవలోకనం చేసుకుంటే, మన ఆలోచన యొక్క తీరులో వుంటుంది అని తెలుస్తుంది. A pattern of Thinking and pattern of Action, pattern of Speech. Thoughts, Speech and Actionలో మనకి patterns వద్దనుకున్నా వచ్చేస్తాయి. ఎందుకిట్లా వస్తున్నాయి? ఈ వచ్చేవన్నీ నన్నే హింసిస్తున్నాయి కదా? అనే ఒక విచికిత్స చేసుకోవడం మొదలుపెడితే, ఇవిలా రాడానికి వీలులేదు, నాలోంచి వచ్చిన వాటి వల్లే నేను ఇట్లా complicate అవుతున్నానని తెలుస్తుంది. మనలోంచి వచ్చే ఆందోళన, మనలోంచి వచ్చే భయం, మనలోంచి వచ్చే రాగము, మనలోంచి వచ్చే ద్వేషము, మనలోంచి వచ్చేటి అసూయ, మన్ని ఎన్నో రకరకములైన పిచ్చి సమస్యల్లోకి లాక్కు వెళ్ళిపోతాయి. ఎక్కణ్ణుంచి వచ్చినాయి? వాళ్ళ మీదా వీళ్ళ మీదా మనం కారణాలుపెట్టి చూస్తాం కానీ, లోపల నుంచి వచ్చినవే ఇవన్నీ. లోపలి నుంచి బయటకు వచ్చి మన్ని అక్కడ బయటవాటితో ముడేస్తాయి. ఇది మనకి తెలియాలంటే ఏం చెయ్యాలి? మనకి యోగవిద్య అనేది చాలా అవసరం. యోగవిద్య అంటే సహజముగా నేను యోగస్థితిలో ఉన్న వాణ్ణి, దాని యొక్క స్మృతి లేక అవస్థితి చెందుతున్నాను అన్నమాట. ఈ అవస్థితి చెందిన తరువాత చిక్కులు ఏర్పరుచుకుని అసలు స్థితిని మర్చిపోతున్నామన్నమాట. ఆ విధంగా యోగం నష్టం జరుగుతోందని చెప్పాడు శ్రీకృష్ణుడు. 'నేను సూర్యుడికి చెప్తే, సూర్యుడు తన కొడుకైన మనువుకి చెప్తే, మనువు ఇక్ష్వాకుడికి చెప్తే, అక్కడి నుండి మిగతా వాళ్లకి అట్లా అట్లా వెళ్లి, మొత్తానికి నాశనం అయిపోయింది, నష్టం అయిపోయింది' అంటాడు. అది మనలో జరిగే కథే! మనలో వెలుగు సూర్యుడు. మనకి వెలుగు ఎప్పుడు వస్తుంది అంటే, తెలివొచ్చినప్పుడు. ఎప్పుడు తెలివొస్తుంది? నిద్ర లేవంగానే తెలివొస్తుందంటాం కదా! తెలివే వెలుగు. అదే గాయత్రి. కాబట్టి వెలుగుగా మన నుంచి వ్యక్తమయిన స్థితి సూర్యుడిగా నేనే. నేనే సూర్యుడుగా వ్యక్తమయ్యాను. వెలుగు రాంగానే ఏమవుతుంది అంటే ముందు బుద్ధి వస్తుంది. 'ఏంచెయ్యాలి?' అన్నది వస్తుంది. అది సూర్యుని యొక్క వెలుగు యొక్క వ్యాపనం. నేను నుండి

సూర్య స్థితి అక్కడ నుంచి సూర్యుని యొక్క వెలుగు. వెలుగులో మనకి తెలుసు. పొద్దున్నే లేవంగానే ఇవాళ ఏంచెయ్యాలి అనేది తెలుస్తుంది. తమాషాగా ఈ బుద్ధి, ఇది సూర్యుని బుద్ధి లేక వెలుగు యొక్క బుద్ధి, అక్కడి నుంచి నెమ్మదిగా ఏమవుతుంది అంటే శరీరం యొక్క బుద్ధి గా మారుతుంది. అది మనస్సు. శరీరం యొక్క బుద్ధి మనకి చంద్రుడు. సూర్యుని యొక్క బుద్ధి బుధ గ్రహం. 'మనం ఏంచెయ్యాలి?' అనేది నెమ్మదిగా 'మనకి ఏంకావాలి?' గా మారిపోతుంది తమాషాగా. 'మనం ఏంచెయ్యాలి?', 'మనకి ఏంకావాలి?' రెండిటికీ సహస్రం తేడా వుంది. మనం చేయవలసినదే మనకి కావలసినది అయితే చాలా సుఖ పడతాం. మనం చేయవలసినది  నెమ్మదిగా మనకి కావలసినదిగా degenerate అయిపోతుంది. మనకి ఏంకావాలి? అని నిద్ర లేస్తాం.  అంటే చూడండి ఎట్లా నష్టం చెందేసాం. నేను స్థితి నుంచి వెలుగుగా ఫెళ్ళున సూర్యోదయం లాగా మేల్కాంచిన వాళ్ళం, ఈ రోజు నేను చేయవలసినది ఏమిటీ? అనే స్థితి నుంచి ఈ రోజు నాకు కావలసినది ఏమిటీ? అనే స్థితి లోకి జారిపోయాము. జారిపోతే ఏమిటంటే కావలసినవి అన్నీ కూడా శరీరానికి కావలసినవేగానీ, నేను కి కావలసినవి కాదు. శరీరానికి కావలసినవాటి కోసం రకరకాలుగా రకరకాలుగా, మనం scheme లు వేసుకుంటూ మనమే చిక్కులు వేసుకుంటాం. ఇరుక్కు పోతాం. బాగా విపరీతంగా ఇరుక్కుపోయి అందులో విరక్తి పుట్టాలి మనకి. అప్పుడు మళ్ళీ అసలు ఇన్ని చిక్కులు ఎందుకు పడ్డాయి మనకి అని చూసుకుంటాం. అంత వరకూ చూడం. ఎందుకంటే కావలసినవి అన్నీ చాలా రుచిగా కనిపిస్తాయి. యోగస్థితిలో వున్న వాడికి ఆ బాధ వుండదు. అందుకే ఈ రోజున ఈ భూమ్మీద మానవుడికి ఎన్ని వున్నా సుఖం లేకపోవడానికి కారణం ఏమిటంటే బయటికి వెళ్ళిపోవడం తెలుసు తప్ప, బయట విషయాలలో ఆనందం పొందడానికి చేసే ప్రయత్నంలో సతమతమై చచ్చిపోతున్నాడు తప్ప, విషయములు, వస్తువులు ఆనందం ఇవ్వవు. నేను నేనుగా ఉన్న వెలుగుగా దర్శనం చేసుకుంటే మిగతావి అక్కర్లేని స్థితిలో, ఎప్పుడూ ఆనందంగా, చక్కగా, ఎల్లకాలం యోగస్థితి లో నిలబడి అనుభూతి చెందగలం అనే మాట చెప్తే, ఏదో పుక్కిటి పురాణం అనుకొనే దుస్థితి లో ఉంది ఈరోజు మానవ జన్మ. But there are people who don't need anything. అట్లా వుండిపోతారు. ఎక్కడో హిమాలయాల్లో ఋషులు, వారందరినీ తీసేయండి. రమణ మహర్షికి ఏం కావాలిట? కూర్చున్నాడాయన, కావాల్సినవన్నీ నడిపిస్తూ.

మహాత్ములు మన చుట్టూ ప్రవర్తించిన వారిని తీసుకున్నట్టయితే, వారికి అంటూ ఏమీ అక్కర్లేకుండా, సమస్తమూ వారి నుండి ఇతరులకు అందే స్థితిలో వారెందుకు నిలబడ్డారంటే వారు నేను అనే తత్వమునందు సదా నిలబడి వుండటం వలన. ఎందుకంటే, నేను నుంచి అన్నీ వ్యక్తమవుతున్నాయి కాబట్టి. మన నుంచి వ్యక్తమైన వాటికి మనం పాకులాడ్డం, వెతుకులాడ్డం ఏమిటి? మన నుండి పుట్టుకొచ్చిన పిల్లల మీద మనం ఆధారపడినట్టుగా వుంటుంది. మనం ఎవరికి ఆధారమో, వారి మీద మనం ఆధారపడితే ఎట్లా? ఇప్పుడు మనకి పిల్లవాడు పుట్టాడు. వాడికి ఏడేళ్ళు. వాడి మీద మనం ఆధరపడ్డాం అనుకోండి. సిగరెట్టు తెచ్చిపెట్టు, వక్కపొడి తెచ్చిపెట్టు, అది తెచ్చిపెట్టు. వాడికి మనం ఆధారం అని వాడు అనుకుంటూ వుంటే, వాడి మీద మనం ఆధారపడుతూ వుంటాం. అట్లా మన నుంచి పుట్టుకొచ్చిన భావముల నుండి పుట్టుకొచ్చిన వాటన్నిటి మీదా మనం ఆధారపడితే? మనలోంచి పుట్టుకొచ్చినవే కదా ఈ ఆస్తులన్నీ? మనలోంచి పుట్టుకొచ్చినదే కదా ఆర్జన కూడా? అవి మనకి అనుపానాల కింద తీసుకోవాలి తప్ప, వాటిమీద ఆధారపడడం వుండకూడదు. ఆధారం ఎక్కడయ్యా? అంటే నేనే ఆధారం సమస్తానికి. 'నేను' ఆధారంగా జీవించిన వాడికి, జీవనంలో ఒక విధమైన ధీమంతం వుంటుంది. నేను కాక మిగతావాటిని ఏదైనా ఆధారంగా పెట్టుకున్న వారందరూ కూడా ఎక్కడో ఒక చోట పడిపోతారు. అందుకే అడుగుతాడు ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు 'ఏమిటిరా నీ బలం?' అని. 'ఈ మొత్తానికి ఏది బలమో అదే నా బలం' అంటాడు. పాండవులకు ఏమిటి బలం? 'బలమెవ్వడు ప్రహ్లాదునికి బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్' చిన్నప్పుడే చెప్పారు కదా ఈ పద్యం. ఈ బలం నేను, నా లోపల ఓంకార స్వరూపుడిది. అంటే వినిపించని ఓంకారమది. చాలాసార్లు చెప్తుంటా కళ్ళుమూసుకుని రెండు చెవులూ, చేతులతో మూసుకుంటే లోపల్నుంచి గుయ్ మని శబ్దం వస్తుంది. అదే అనాహతమైన శబ్దం, మనలో ఉన్నది. అది మన అసలు స్థితి. అక్కడి నుంచీ మిగతావన్నీ వ్యక్తమవుతూ వుంటాయి. దానియందు జీవించేవాడు ఆ శబ్దం మొత్తం ఈ సృష్టి అంతా ఆవహించిన శబ్దంలోకి లయమై ఉంటాడు. అట్లా యోగం చెంది ఉంటాడు. అంటే జరుగుతున్న ఓంకారముతో లయము చెంది ఉంటాడు. జరుగుతున్న ఓంకారముతో లయము చెంది ఉండడం అంటే, ప్రవాహముతో లయము చెంది ఉంటాడు. కాబట్టి ప్రవాహము మీద నడుస్తున్నవాడికి కూడా ప్రవాహము యొక్క అదుపులో ఎట్లా వున్నాయో, ఈ

జరుగుతున్న విషయాలన్నీ కూడా ఆ విధంగా తన యొక్క అదుపు ఆజ్ఞల్లో వుంటాయి. ఇది 'సదాయోగీ' అనే స్థితి. అది భగవంతుని యొక్క తత్వం. అది మనయందు కూడా సహజమైన స్థితి. కాపోతే మనం ఇప్పుడు నేర్చుకున్న విద్యల ద్వారా దాని కోల్పోయాం. మనకి జ్ఞానము, విజ్ఞానము అనేవి రెండు వున్నాయి. అంతర్గతంగా వెళ్లి నేను అనే స్థితిని అవగాహన చేసుకుని, అక్కణ్నుంచి ఏమిటి ఉద్భవిస్తున్నాయో తెలుసుకోవడం అంతా జ్ఞానం. బహిర్గతంగా ప్రపంచంలో మనం చూస్తున్న విషయముల వల్ల తెలుసుకునేదంతా కూడా విజ్ఞానం. రెండూ తెలుసుకోవలసినవే. రెండో దాంట్లోంచి మొదటి దాంట్లోకో, మొదటి దాంట్లోంచి రెండో దాంట్లోకో ఏదైనా పరిపూర్ణంగా తెలుసుకున్నవాడు యోగి అవుతాడు. యోగి అయిన వాడికి వేద్యం అయిన విషయం పూర్తిగా తెలుస్తుంది. వైద్యం అనే విషయం పూర్తిగా తెలుస్తుంది. అప్పుడు మాధవ స్థితి తెలుస్తుంది.

## 174 వీరః

అంటే వీరులని హరిస్తాడట. అదేవిటండీ? హ అంటే హరించడం అని అర్థం. 'వీరః' అంటే వీరులందర్నీ హరిస్తాడు. వీరత్వం అంటే మన సాధనలో దున్నేద్దాం, పొడిచేద్దాం, సాధించేద్దాం అవన్నీ ఉంటాయే, అవన్నీ చచ్చిపోతాయి. అంటే sense of attainment is replaced by sense of being. విశ్వామిత్రుడు, వశిష్టుడు లాగ. విశ్వామిత్రుడు ఏదో సాధించేద్దాం అని రజస్సులో జీవిస్తూ ఉంటాడు. వశిష్టుడుకి సాధించాల్సింది ఏమీ లేదు, ఉండటమే వుంది అని తెలుస్తుంది. రజస్సు సత్వాన్ని ఎదుర్కోడం. అంటే మనం దేహపోషణకి అన్న విషయం మర్చిపోయి రుచి కోసం తినటం అవుతుంది. భారతీయులు కేవలం దేహపోషణే కాకుండా దేహపోషణకు తీసుకునే ఆహారాన్ని ఎన్ని రకములైన రుచులలో చేసుకోవచ్చో కూడా తెలిసిన దిట్టలు. అందుకని ఈ దేశంలో భోజనాలు, అదీ తెలుగువాళ్ళ భోజనాలు తింటే వాళ్లకి ఇన్ని రుచులున్నాయా? అని ఆశ్చర్య పోతారు పాశ్చాత్యులు. అన్ని రకములైన రుచులు. ఎందుకంటే రుచి is topping over that which is essential to give you the splendour, to give you an extra feeling. అట్లా తయారుచేసుకుని మనం చేసుకున్నప్పుడు దేని పక్క మనం మొగ్గుతాం అని చూస్తే, అసలు విషయం మనం మర్చిపోతే మనకి తేడా వస్తుంది. ఆట ఆట కోసం అని మర్చిపోతే ఆటలో తేడా వస్తుంది. జీవితం ఒక ఆట, అని పాడుతూ వుంటారు కదా! జీవితం ఆట అయినప్పుడు దాంట్లో పోట్లాట ఎందుకు వస్తోంది? ఎందుకు వస్తుంది అంటే ఆట అని మర్చిపోయి వుంటారు. ఆటలో ఒకోసారి points పోతూ వుంటాయి. ఎంత మొనగాడు ఆడినా ఒకటి రెండు points పోకుండా ఆడలేడు కదా! పోయినాయి అని బిగుసుకుంటే, ఇంకా పోతూ వుంటాయి. ఆటలో పోయినాయే అని బాధ పడితే ఇంకో నాలుగు points పోతాయి ఈలోపల. ఎందుకంటే పోయినాయే అనేవాటి మీద నిలబడి వుండటం వల్ల ప్రస్తుతంలో చేయవలసినది మర్చిపోతావు కాబట్టి. Points వస్తున్న కొద్దీ గర్వం వస్తుంది. ఇట్లా కాకుండా రెండు పద్ధతుల్లో కూడా ఆట యొక్క ఆనందాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంది. ఆట ఆటగా ఆడుకున్నవాడికి అనుభూతి. విద్య marks కోసం కాకుండా విజ్ఞానం కోసం, అని అనుకున్నవాడికి అది సరిపోతుంది. భోజనము పోషణ కోసం అని గుర్తుపెట్టుకుని, రుచిగా

చేసుకున్నవాడికి ఫలస్తుతి బావుంటుంది. అట్లాగే గెలిచేద్దాం అనుకున్న వాళ్ళందరికీ కూడా గెలిచినది ఏదీ మిగలదురా, అని తెలిసేసరికి వాడు పోతాడు. ఆక్రమించుకుంటూ ఈ భూమ్మీద ఎంతో మంది ఎన్నో రకాలుగా తాపత్రయ పడ్డారు. దేన్ని ఆక్రమించుకుందామనుకున్నారో అది వాణ్ని ఆక్రమించేస్తుంది, కదా! మనకి చెప్తారు నెపోలియన్ వెళ్ళేప్పుడు రెండు చేతులూ ఖాళీగా వుంటాయి అటో పక్క, ఇటో పక్క. అంటే 'ఏం పట్టుకుని వెళ్ళలేక పోతున్నాను సుమా' అని message ఇచ్చి వెళ్ళిపోయాడు. France దేశం నుంచి మొత్తం అంతా యూరప్, మధ్య ఆసియా ఇవన్నీ కూడా ఆక్రమించిన వాడు. ఓ పక్క ఆక్రమిస్తూంటే రెండోపక్క మళ్ళీ మామూలు అయిపోతుంది. 'ఆక్రమణ అనే తత్వంలో పసలేదు' అని తెలిసిన భూమి మన ఒక్క భూమే! మనం ఉన్నత స్థితిలో వున్నప్పుడు కూడా ఎవర్నీ ఆక్రమించ లేదు. ఆక్రమణలో, పొందడంలో, possessive గా ఉండడంలో ఆనందం లేదు, అని తెలియడం అనే స్థితి, వివేకం గనుక వచ్చినట్టయితే ఊరికే ఈ విధంగా ఊళ్ళో పొలాలు ఆక్రమించేయడం. ఊళ్ళో ఆస్తులు ఆక్రమించేయడం. ఒక ఇల్లు, మూడిళ్ళు, ఆరిళ్ళు, పదిళ్ళు, పదిహేనిళ్ళయినాయి అనుకోండి, ఏమవుతుంది? నువ్వు ఏది ఆక్రమిస్తున్నావో అది నిన్ను ఆక్రమిస్తుంది. అంటే ఏమౌతుంది? ఈ పదిహేను ఇళ్ళు నువ్వు manage చేసుకోవాలి కదా! ఆ పదిహేను ఎకరాల పొలాలు నువ్వు manage చేసుకోవాలి. పదిహేను నించి నూటయాభై చేస్తావు. రెండొందల యాభై చేస్తావు, మూడు వందల యాభై చేస్తావు. అప్పుడు ఏమైంది? అది నిన్ను ఆక్రమించి నిన్ను, దాని మీద నీకు వున్న భావంతో నిన్ను కట్టేస్తుంది. కాబట్టి సుఖపడే వాడు ఏం చేస్తాడంటే, దేన్నీ ఆక్రమించడు, దేన్నీ సొంతం చేసుకోడు, ఉంటాడు. ఈ విధంగా లోపల ఉన్న రాజసం ఏదైతే వుంటుందో లేక రజస్సు, అది పొందుదాం, ఇది పొందుదాం, అది మనది చేసుకుందాం, ఇది మనది చేసుకుందాం అనుకునేవాడు ఏదీ తనది చేసుకోలేడు. ధర్మయుక్తంగా తన దగ్గర ఉంచబడినది తప్ప. ఆ తత్వం మనలో ఎంత పెంపొందితే అంత ఈ వీరుడు చచ్చిపోతాడు మనలో. ఈ వీరుడుచచ్చిపోయి, వీరుణ్ణి చంపగలిగిన శక్తిసంపన్న మైన స్థితి యందు మనం నిలబడతాం. వీడు సుఖంగా ఉంటాడు. చూడండి నిజమైన యోగులు, ఎక్కువ అవీ ఇవీ, ఇవీ అవీ పోగేసుకుని బాధపడకుండా less luggage more comfort, అనే పద్ధతిలో జీవిస్తూ వుంటారు. కారణం ఏమిటంటే, వారిలో ఈ రకమైన రజోగుణ ప్రవృత్తి neutralise అయిపోతుంది. neutralise

అయిపోయి, అవసరానికి రజస్సు, తమస్సు వాడటం తప్ప, తను సత్వము నందు నిలబడి ఉంటాడు కాబట్టి, వీరుని హరించి ఉన్న స్థితిలో ఉంటాడు. అప్పుడు వారిని వీరులు కూడా జయించలేరు. ఎందుకంటే తనయందు వీరులను జయించి వున్నాడు కాబట్టి బయట వీరులెవ్వరూ ఇంక జయించడానికి అవకాశం లేదు. ఆ విధంగానే వశిష్టుణ్ణి జయించ లేకపోతాడు విశ్వామిత్రుడు. ఆ విధంగానే కృష్ణుణ్ణి జయించలేకపోతారు. ఎవరూ కూడా జయించలేక పోతారు. కాలయవనుడు యుద్ధం చేసి అక్కడ జయించాలని వస్తాడు. అక్కడ కృష్ణుడికి జయించాలన్న కాంక్ష వుండదు కాబట్టి జయించలేరు. గెలుద్దాం అని ఆడిన వాళ్లూ, ఓడిపోదాం అనే ఒక scope తయారు చేసుకున్న వాళ్ళవుతారు. ఆడదాం అనుకునేవాడికి ఆడకపోడానికి scope ఏమీ వుండదు. గెలవడం కోసం ఆడితే, ఓడిపోవడం అనేది కూడా ఒక possibility వుంది. ఆటకోసం ఆడితే, ఆడడం వుంటుంది ఎప్పుడూను. కదా! ఎవరు గెలిచినట్టు? కాబట్టి, ఈ 'వీరః' అనే పదం మన జీవితంలో చాలా అవసరం. మనకి anything excessive, causes problems. Excessive body is a problem. అవసరమైనదాని కన్నా దేహం ఎక్కువ వున్నా బాధే! అవసరమైనదాని కన్నా సంసారం ఎక్కువ ఉన్నా బాధే! అవసరమైనదాని కన్నా ఆర్జన ఎక్కువ వున్నా బాధే! ఏది అవసరాన్ని మించి వుంటుందో అదంతా బాధే! అవసరాన్ని సాధించుకోవడానికి ఉపయోగించుకోవలసిన రజో గుణాన్ని, అవసరానికి మించి వాడుతున్నాం అనుకోండి, అక్కడి నుండి మనకి వచ్చేవన్నీ కూడా సమస్యలే. కాబట్టి భగవత్తత్వం ఎవరికి అవగాహన కాదంటే పొందుదాం, ఇంకా పొందుదాం, ఇంకా ఆశిద్దాం, ఇంకా ఆక్రమిద్దాం, అందరినీ మన కబ్జాలో ఉంచుకుందాం అనుకునే వాళ్లకి. జయించడం అనే భావన ఉన్నవాళ్ళకి భగవంతుని తత్వం అవగాహన అయ్యే అవకాశం లేదు. ఉండడం అనే దాని యందు అనురక్తి కలిగిన వాళ్లకి భగవంతుని యొక్క తత్వం అవగాహన అవటానికి అవకాశం వుంది. అందుకని the sense of achievement shall have to be replaced by the sense of being అన్నారు. తాను ఎన్ని జయించినా తనని జయించట్లేదు కదా! ఇదే కదా తండ్రికి ప్రహ్లాదుడు చెప్తాడు. 'ఎన్ని జయించావు? మొత్తం పద్నాలుగు భువనాలనీ జయించావు. ఏం లాభం ? నిన్ను నువ్వు, నీ లోపల ఉన్నవాళ్ళని నువ్వు జయించలేకపోయావు కదా! లోపల ఉన్నవాళ్ళని జయించి, నిన్ను నువ్వు ఎవరో తెలుసుకుంటే మొత్తం జయించినట్లే!' అంటాడు.అంతా

మనలోనే ఉన్నప్పుడు దాన్ని ప్రత్యేకంగా తనది చేసుకోవలసిన అవసరం ఏముంది? వేద్యుడై వున్నప్పుడు అంతా తనలోనే ఉన్నాడని తెలిసిన వాడికి, నిత్య అవసరములు అప్రయత్నంగా జరిగిపోతు వుంటాయి. వాటికి కూడా పాకులాడని  స్థితికి వస్తాడు వాడు. అదే మనకి  పోతన కథలో చెప్తారు. ఒక ఎద్దు వదిలేసి, తరువాత రెండో ఎద్దు వదిలేసినా నాగలి దున్నుతుందిట. అంటే ప్రయత్నం లేకయే జీవితం నడిచే పద్ధతిలోకి వెళ్ళే సులువులు వున్నాయి. ఎప్పుడయ్యా? అంటే sense of achievement మీద belief పోయి, sense of being మీద belief పెరిగినప్పుడు. ఇది 'వీరః' అనే పదానికి అర్ధం.

# 175 మాధవః

అంటే సృష్టి వైభవమును ధరించిన వాడు. సృష్టి యొక్క వైభవము తన ఆధారముగా ఏర్పడుతూంటుంది. ఆ వైభవమును 'అమ్మవారు" అంటాము. అమ్మవారుగా దర్శనం చేస్తాము. ఆ వైభవానికి ఆధారభూతుణ్ణి లేదా ఆధారమైన వాడిని'మాధవుడు' అనే భగవతత్వముగా చెప్పుకుంటాం. మనకి కనిపించే సృష్టిలో లేదా భౌతిక స్థితులలో కన్నా అంతర్లోకములలో సృష్టి వైభవము ఎక్కువగా వుంటుంది. అంతర్లోకములలో వైభవము ఎక్కడ ఎక్కువ ఆవిర్భావము చెందుతుందో, అక్కడ బహిర్లోకము లేక భౌతిక సృష్టిలో కూడా ఒక రకమైన కళ కనిపించి, మనకు అనుభూతి నిస్తుంది. మామూలుగా భౌతిక స్థితిలో కంటికి కనిపించేది, చెవికి వినిపించేది వీటికి సంబంధించిన వాటిల్లో అనుభూతికే ఎక్కువ అలవాటు పడి వున్నాము. కానీ మనిషి కొంత అంతర్ముఖుడైతే, ఈ భౌతిక స్థితికి ఆధారంగా మూడు స్థితులున్నట్లు తెలుస్తుంది. వీటినే పెద్దలు పర, పశ్యంతి మధ్యమ అనే స్థితులుగా చెప్తారు. ఎంత సేపటికీ మాట్లాడుతున్నదే వినబడడం కన్నా, మాట్లాడడానికి ముందున్న భావనలో మనమున్నాం కాబట్టి, భావానికి ముందు సంకల్పం వుంది కాబట్టి, సంకల్పానికి ముందు మనమున్నాం కాబట్టి కనిపించే సృష్టిలో కూడా ఈ కనబడుతున్నదాని వెనకాల మూడు స్థితులలో ఈ సృష్టి వున్నదని గమనించిన వారికి భగవత్తత్వాన్ని అవగాహన చేసుకోడానికి మొట్ట మొదటి తాళంచెవి దొరికినట్లు. ఇదికాక మనం కేవలం భౌతికమైన దాన్నే గుర్తిస్తే మొత్తంలో 25 శాతం మాత్రమే గమనించినట్లు. ఈ కనబడుతున్నదంతా కూడా ఆయనలో ఒక పాదంఅని చెప్పారు. మూడు పాదాలలో ఇంతకన్నా ఎక్కువ వైభవం కనిపిస్తుంది. ఈ కనిపించే సృష్టి వెనకాల రంగులతో కూడిన సృష్టి ఒకటి వున్నది. హిరణ్యవర్ణాం అనే రంగులో ముందు సృష్టి ఏర్పడి, అప్పుడు మనం అనుకున్న భౌతిక సృష్టి ఏర్పడింది. ఈ హిరణ్య మైన వర్ణం వెనక రజతము లేక తెల్లటి వెలుగుతో కూడిన లోకము, ఆ వెలుగుకు వెనకాల చీకటిగా కనిపించే భగవంతుని యొక్క ఆధారమున్నది. ఈ మూడు లోకములు వెలుగు లోకములు, బంగారు లోకములు, కనిపిస్తున్న లోకములు ఇవి

మూడు స్థితులుగా త్రిగుణాత్మకముగా దిగివస్తుంటాయి. ఈ దిగివచ్చే వాటికి తాను ఆధారభూతుడిగా వుంటే, ఆయన్ని ఆధారం చేసికొని శబ్దములు, రంగులు, ఆకారములు వెలువడుతున్నాయి. ముందు శబ్దము, తర్వాత వర్ణము, తర్వాత ఆకారము. ఈ మూడూ భగవంతుని శోభగా వర్ణన చేస్తారు. ఆ శోభను ధరించి వున్నాడు కాబట్టి 'మాధవు'డని భగవంతునికొక నామము ఇవ్వబడివున్నది. మనం దర్శనం చేసేటప్పుడు కేవలం భౌతికమైన దృష్టితోనే కాకుండా, ఈ భౌతికానికి ఆధారమైన లేక తెర వెనుకనున్న వాటిని కూడా గమనించాలి.ఒక సినిమాగానీ, నాటకంగానీ చూచినప్పుడు కేవలం పాత్రధారులను మాత్రమే చూడ్డం ఓ పద్ధతి. ఈ పాత్రధారుల పాత్ర పోషణకు కారకులైన వారు తెర వెనుక వుంటారు. తెర వెనుక వారిని గుర్తించడం కష్టం. తెర ముందున్న వారిని గుర్తించడం సులభం. తెర వెనుక వారు లేకపోతే తెరమీది వారు లేరు. నాటకరంగంలో రంగం వెనకాల ఎంతో కృషి జరిగితే, అది రంగం మీద నాటకంగా భాసించి ఆనందాన్ని కలిగిస్తూంటుంది. అలాగే సినిమాలూనూ! వాటి వెనుక చాలా కృషి ఉంటుంది. అది లేకపోతే తెర మీద ఆ బొమ్మ లేదు. అలాగే ఈ సృష్టి కూడా! మనం చూస్తున్న దానికన్నా వెనకాల కథ చాలా వున్నది. వెనకాల కథలో చాలా ఎక్కువ మాధుర్యము కళ, కాంతి, అనుభూతి, ఆనందం, వున్నవి. ఇక్కడికన్నా ఆనందం, కళ, కాంతి, అనుభూతి, మాధుర్యము అంతకన్నా ముందు లోకంలో రెండు రెట్లు ఎక్కువుంటుంది. అంతకన్నా రెండు రెట్లు ఎక్కువుంటుంది దాని కాధారంగా వున్న ఇంకా ముందున్న లోకంలో.అంతకన్నా రెట్టింపు ఉంటుంది దానికి ఆధారంగా ఉన్న ముందున్న లోకములో. ఎలా వుంటుందంటే భూమి కాంతి కన్నా శుక్రగ్రహంలో కాంతి రెండు రెట్లెక్కువ. శుక్రగ్రహ కాంతి కన్నా బుధగ్రహంలో కాంతి ఆరు రెట్లెక్కువమన భూమికన్నా. సూర్యగ్రహంలోనికి వెళ్తే మన భూమికన్నా ఏడు రెట్లుకాంతి ఎక్కువ. ఇట్లా మనం కూడా భౌతికమైన దానిని భూమిగా లెక్క వేసుకుంటే, మనం కోరుకునే సౌభాగ్యము, సంపద దానికి సంబంధించిన కాంతి, ఆనందము శుక్రగ్రహంలోలాగ రెండు రెట్లెక్కువగా వుంటుంది. అంతకు మించి జ్ఞాన విజ్ఞానమయ స్థితిని రుచిచూస్తే మామూలుగా మనకు చాలా

సుఖాలనిస్తాయి అనుకొన్న వాటికన్నా ఆరురెట్లు ఎక్కువ ఆనందాన్నిస్తుంది. అంతకన్నా ఆత్మతత్వమైన సూర్యతత్వాన్ని మనలో ఆకళింపు చేసుకొన్నట్లయితే, ఈ కోరుకొన్న సౌఖ్యము, సంపద, ఆనందము కన్నా ఏడు రెట్లు ఎక్కువ ఆనందం పాకులాట లేకుండా దొరుకుతుంది. ఈ జ్ఞానానికి, ఆత్మతత్వానికి బహిర్గతంగా పాకులాటలేమీ వుండవు. దానికి కావలసిన సామగ్రి, infrastructure ప్రతి మనిషిలోనూ వున్నది కనుక దాన్ని సరాసరి సాధించుకోవచ్చు. ఇలా కేవలం రంగం మీద కాకుండా రంగం వెనకాల వున్న వాటిలోకి మనం వెళ్తే, మనకి సృష్టి రహస్యములు ఎక్కువ విశదమవుతాయి. ఎక్కువ ఆనందం, అనుభూతి కలుగుతూంటుంది. అలా మొత్తం ఈ సృష్టి అంతా అరలు అరలుగా అమరిక చేయబడటం కేవలం వైభవం కొరకే. మనం ఏ అలంకారం చేసుకున్నా వైభవం కొరకే. ఏ పని చేసినా ఆనందం కోసం చేసుకుంటాం. వైభవం ఎక్కడ ఎక్కువగా ఉంటే ఆనందం అక్కణ్ణుండి వస్తుంది. కనుక అమ్మవారి తత్వం శబ్దము, రంగు, రుచి, రూపము వీటికి చిహ్నామై వుంటుంది. శబ్దము ఒక భావానికి చిహ్నాము. వర్ణము ఒక తరంగానికి చిహ్నాము. రూపము ఈ మొత్తమంతటికి చిహ్నాము. ఇట్లా చిహ్నాముగా వుండే దానిని 'లక్ష్మీదేవి' అని అన్నారు. లక్ష్మి అంటే 'చిహ్నాము' అని అర్ధము. దేనికి చిహ్నాము అంటే అమ్మవారు అసలు మూలతత్వానికి ప్రతినిధిగా ఉంటుంది. ఆ విధంగా నిలబడిన అమ్మవారికి ఆధారం అయ్యవారు. అందుకే భగవంతుడు హృదయము నందు అమ్మవారిని ధరించి వున్నాడని చెప్తారు. అందుకే శ్రీధవుడిలాగ మాధవుడు! రెంటికీ అర్ధం ఒకటే. వైభవమును ధరించి వున్నవాడు. సృష్టి వైభవమునకు ఆధారముగా వున్నవాడు. ఇది ఒక అవగాహన. మనలో కూడా ఇది పెరగాలంటే రంగుల ఆరాధన జరగాలి. శబ్దముల ఆరాధన జరగాలి. రంగుల ఆరాధన ధ్యానానికి, శబ్దముల ఆరాధన మననానికి సంబంధించినది. ఒకటి మంత్రం, ఇంకొకటి ధ్యానం. ఈ మంత్రం జరుగుతూంటే మనకి లోపల కొన్ని రంగులు కనిపిస్తాయి. దుర్గ అమ్మవారు అంటే కొన్ని రంగులు అక్కడ కనిపిస్తాయి. సరస్వతి అమ్మవారు అంటే కొన్ని రంగులు, లక్ష్మి అమ్మవారు అంటే కొన్ని రంగులు కనిపిస్తాయి. ఈ

రంగులు ఇట్లా ఎందుకు వున్నాయి? అనే భావన మనకెప్పుడన్నా కలిగిందా? గమనించి చూస్తే, భౌతికమైన రంగుగా ఆకుపచ్చ, దానికి వెనకాల హిరణ్మయమైన రంగుగా పసుపురంగు కనిపిస్తుంది. అందుకే పసుపుతో పూజ చేయడం. దానికన్నా వెనకాల తెల్లటిరంగు లేదా నీలంగా వుంటుంది. ఈ మొత్తమంతా తయారు చేయడానికి కావలసిన సంకల్పశక్తిగా దిగివచ్చే రంగుని ఎరుపురంగుగా చెప్తారు. అందుకని మనకి పవిత్రమైన రంగులు కొన్ని వున్నాయి. భౌతికమైన రంగులు కొన్ని వున్నాయి. భౌతికం కన్నా ఇంకా సూక్ష్మమైన లోకాల్లో వుండే స్థితిని అవగాహన చేసుకోవాలంటే మనం రంగులతో ఎక్కువ పరిచయం ఏర్పడాలి. అందుకు మనము పసుపు, కుంకుమలతో పూజ. భగవంతు నీలమేఘశ్యాముడిగా భావన చేసికోవడము, సరస్వతీదేవిని తెల్లని రంగుగా భావనచేసికోవడము, అమ్మవారిని పసుపు రంగులో భావన చేసికోవడమూను. ఇవన్నీ ఆరంగుయందు మన మనసు లగ్నమై, ధ్యానస్థితి కలుగుతుందని ఇచ్చారు. కాబట్టి వర్ణముల యొక్క ఆరాధన, శబ్దముల యొక్క ఆరాధన, మొత్తం పూజంతా చూస్తే ఈ రెండే వుంటాయి. అన్నిటినీ మించి దీపం వుంటుంది. లేకపోతే హోమం చేసుకోవడం వుంటుంది. అందులో మనం ఆరాధించేది సరాసరి బంగారు వర్ణమే. ఇలా వర్ణముల యొక్క ఆరాధన, మంత్రముల యొక్క ఆరాధన ఈ రెండూ ఎప్పుడూ జరుగుతూంటే మనకి అంతర్లోకముల యొక్క సౌందర్యం మనయందు, మనచుట్టూ కూడా భాసిస్తూంటుంది. ఆ విధంగా దర్శనం చేసుకొనే వారున్నారు. దర్శనం చేసిన వారున్నారు. చేస్తున్నవారూ వున్నారు. వారికి ఈ కనబడుతున్న భౌతిక సృష్టికి వెనకాలవుండే phenomenal world లో వుండేవన్నీ స్థూలమైన వాటికి అతీతమై, సూక్ష్మమైన సృష్టికి సంబంధించినవి గోచరిస్తూంటాయి. వాటికి సంబంధించినవి వినిపిస్తూంటాయి. అందుకే ఈ 'మాధవ' అనే నామానికి ఇంకో అర్థం ఏం చెప్తారంటే 'మా' అంటే మననము ద్వారా, 'ధ అంటే ధ్యానం ద్వారా, 'వ' అంటే యోగము ద్వారా అవగాహన అయ్యే భగవంతుడు అని అర్థము. అంటే దాని గురించి వివరించుకోవడం కాకుండా తెలుసుకోవడం జరుగుతుంది. 'మాధవ' అనే నామంలో మననము, ధ్యానము, యోగము

ద్వారా తెలిసికోవడం జరుగుతుంది. రాజమండ్రిలో ఎవరో మాస్టరుగారి గురించి చెప్పమన్నారు. 'మాస్టరుగారి గురించి చెప్పడంకాదూ, చెప్పుకుంటే అయిపోతుంది. ఆయన గురించి తెలుసుకోడం మొదలుపెడితే మనలో కూడా తెలివి పెరుగుతుంది' అని చెప్పాను. అలా మనం ఇక్కడ నామంగా భగవంతుని తెలుసుకోవడము తెలుస్తుంది. వర్ణముల తీరుతెన్నులు తెలుస్తాయి. ఏ వర్ణం ఏ విధమైన భావము, స్వభావము, ఏ గుణము  కలిగివున్నదీ, ఏ మంత్రము ఎటువంటి శక్తిని ఆవిర్భవింప చేస్తుంది, అనేది లోపలినుండి తెలియడం మొదలు పెడ్తుంది. కొన్ని కొన్ని మంత్రాల యందు  కారణం లేకుండానే మనం చాలా ఆసక్తి కలిగివుంటాం. వాటికి, మనకి వున్న అనుసంధానం అటువంటిది. ఈ కనబడే రూపాత్మకమైన జగత్తుకి the color is basis and for the color the sound is basis and for the sound the unuttered sound is basis. అనాహతమైన ఓంకారం నుండి శబ్దము పుట్టి, శబ్దము నుండి వర్ణములు పుట్టి, వర్ణముల నుండి రూపాత్మకమైన జగత్తు పుట్టింది. ఈ సృష్టి గురించి స్థూలంగా చెప్పాలంటే ఇట్లా చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని ధరించివున్నాడు కాబట్టి 'మాధవుడు'. ఆ మాధవ తత్వం మనలో అనుభూతి చెందితే హృదయము నందు ఈ శబ్దములు, ఈ రంగులు అనుభూతి చెందుతాము. విశుద్ధి యందు ఈ శబ్దములు, ఈ రంగులు అనుభూతి చెందుతాము. ఆజ్ఞ యందూ ఈ శబ్దములు, రంగులు అనుభూతి చెందేందుకు చాలా అవకాశమున్నది. మొత్తం వెన్నెముక లోని బ్రహ్మరంధ్రము నందు సమస్త శబ్దములు, వర్ణములు అనుభూతి పొందినవాళ్ళు మనకి పుస్తకంలో ఒక్కొక్క కేంద్రంలో ఈ రంగులు, ఈ అక్షరాలు వున్నాయని ఇస్తారు. అంటే అవి చెక్కి వున్నట్లు కాదు. ఆ అక్షరములకు సంబంధించిన Vibrations అంటే తరంగములు అక్కడ వుంటాయి. ఆ వర్ణానికి సంబంధించిన గుణం అక్కడ వుంటుంది. ఆ విధంగా షట్చక్రముల వర్ణములు దర్శించి ఇచ్చారు. వర్ణములంటే సంస్కృతంలో అక్షరములు, రంగులు అనికూడా వున్నది. కాబట్టి ఈ వర్ణములన్నీ దర్శించి ఇచ్చి, ఒకరు చేసిన దర్శనమే మరొకరూ చేసి దాన్ని Verify చేసి, నిర్ధారణ చేసి మనకి అందించారు. ఇవన్నీ వాళ్ళకెలా

అందాయి? అది ఎలా నిజమండీ? అని ఎవరన్నా అడిగితే, మనం కూడా లోపలకి వెళ్తే అది నిజమని తెలుస్తుంది. లోపలకి వెళ్ళి చూసి వచ్చినవాళ్ళు ఫలాన ఇంట్లో లోపల ఇలా వుంది అని చెప్తారు. లోపలకి వెళ్ళి చూడనివాళ్ళు అవతలివాడు చెప్పింది విని, తనుకూడా ప్రయత్నం చేయాలి లోపలకి వెళ్ళడానికి. అప్పుడు వాళ్ళకీ తెలుస్తుంది. ఆ లోపలకి వెళ్ళే ప్రయత్నం ఎప్పుడు మొదలౌతుందో అప్పుడు రంగులు, శబ్దముల యొక్క అవగాహన పెరుగుతుంది. ఈ రెంటి అవగాహన పెరిగితే, ఒక్కొక్కటి తెర తీసినట్లు రంగుల్లో కూడా ఉద్ధారణ జరుగుతుంది. మరీ బొత్తిగా మట్టి రంగు నుండి కొంచెం ఆకుపచ్చ లోనికి వచ్చి, ఆకుపచ్చ నుండి లేతాకుపచ్చ, లేతాకుపచ్చ నుండి పసుపుపచ్చ, పసుపు నుండి ఇంకొంచెం వృద్ధి చెంది సింధూర వర్ణానికి, అక్కడనుండి వృద్ధిచెంది ఇంకో వర్ణానికి, అక్కడనుండి నీలవర్ణానికి ఇలా రంగుల యొక్క పరిణామం మనలో జరుగుతూంటుంది. ఈ పరిణామం మొత్తానికి మనలో కావలసినది సంకల్పబలం. ఇవన్నీ ఈ  శ్లోకం లో వచ్చేస్తాయి. అన్నీ ఒకదానికొకటి అనుసంధానం చెంది వున్నాయి కాబట్టి "మహాబల" అనేది, "మహోత్సాహుడు" అనేది ఈనామాల్లో వస్తాయి. మనం పూజ చేసామనుకోండి. ఈ రోజు పువ్వుల రంగులు ఎలా వున్నాయి, అని గమనించాలి. ఈ రోజు భగవంతుడు ఎటువంటి పువ్వులు తెప్పించుకున్నాడు? మనం తెచ్చామను కోడం కాదు. ఒక్కోరోజు పూజ చేసుకుంటూంటే ఎర్రపూలు ఎక్కువుంటాయి. ఒక్కోరోజు నీలంపూలు ఎక్కువుంటాయి. ఒక్కోరోజు పచ్చటిపూలు, ఒక్కోరోజు తెల్లటిపూలు వుండవచ్చు కదా, పూజంటూ చేస్తే! ఈ పూలలో వీటి యొక్క  భావన వున్నది. వాటి యొక్క గుణమున్నది. ఒక్కొక్క దాని ద్వారా మనకు భగవంతుడు ఈ అమ్మవారి రూపంలో ఏం నిర్దేశిస్తున్నాడు అని తెలుస్తుంది. ఏదో పూజ చేస్తాం. అందరూ బావుందన్నారు. అలసిపోయాం. ఇదికాదు పూజ! పూజలో వర్ణముల యొక్క తీరుతెన్నులు అవగాహన కావాలి. శబ్దముల యొక్క తీరుతెన్నులు అవగాహన కావాలి. అలా రంగులు ఒక తెర. ఆ తెర అవగాహన అయితే, ఆ తెర తీస్తే శబ్దముల యొక్క తెర వుంటుంది. ఆ తెర కూడా అవగాహన అయితే ఆయన

కనిపిస్తాడుట ఆయన నేనుగా దర్శనమిస్తానన్నాడు. ఆయన ఆధారంగా శబ్దములు, రంగులు, రూపములు ఆ తర్వాత వాటికి నామములు పెట్టేసి మనం శబ్దము, రంగు, రూపముతో చేయబడ్డ సృష్టికి నామం పెట్టేసి, దాన్ని మనం అక్కడ స్థిరపరచుకుంటాం. నామం మొదటి తెర, వర్ణము రెండవ తెర, శబ్దము మూడవ తెర, నాల్గవ తెరలో ఆయన్ని చూడవచ్చు. ఈ మూడు తెరలూ తీస్తే, నాలుగులో ఆయన కనిపిస్తాడు. ఇదే 'పర అనుకోవచ్చు. వైఖరి, మధ్యమ, పశ్యంతి, పర ఇట్నుంచి వస్తుంది. ఇలా చేసుకొంటే మాధవుడి పూజ జరుగుతుంది. మాధవుడిని ఆరాధన చేయడం అంటే రూపము, రంగు, రుచి, వాసన లేనటువంటివాడు. రంగు, రుచి, వాసన రూపంలో అమ్మవారిగా దిగివస్తే, మన దగ్గరకు వచ్చిన అమ్మవార్ని మనం పూజ చేసుకోవడం ద్వారా ఆవిడ మనని ఒక్కొక్క మెట్టు ఎక్కించుకొంటూ పైకి తీసుకువెళ్తే అయ్యవార్ని meet అవుతాము. సముద్రతరంగం మన వద్దకు అలలాగ వచ్చేస్తే, ఆ వచ్చినట్టి అలని పట్టుకొని ఆ అలతో లోపలకి వెళ్ళాలి. అలేం చేస్తుంది? ఎదురొస్తే తీసి అవతల పారేస్తుంది. దాన్తోనే వెళ్తే లోపలకి తీసుకువెళ్తుంది. అలా ఈ పూజ అనే కార్యక్రమంలో చక్కగా మెట్టు మీంచి మెట్టు, మెట్టు మీంచి మెట్టు ఎక్కి వెళ్ళి, సగం స్తోత్రాలు అయ్యి సగం దూరం వెళ్ళేప్పటికి మనం అక్కడకి వెళ్ళిపోవాలి. దానికి మనం ఎంత వైభవంగా పూజ చేసుకొంటే అంతగా అమ్మవారు దారిఇస్తుంది. ఎంత ఉత్సాహ రహితంగా చేస్తే అంత మూసుకుపోతుంది. ఎప్పుడు పూజ అయిపోతుందా అన్నట్లుంటుంది మనకి, ఇంకా ఎంత సేపు చెయ్యాలి పూజ అన్నట్లుంటుంది. అలాకాకుండా మనలో మాధవుణ్ణి దర్శించేందుకు పద్ధతులున్నాయి. దానికి మనం కనీసం మూడు తలుపులు తెరుచుకొని వెళ్ళాలి. తెరుచుకొని వెళ్తే గర్భగుడిలో ఆయన వుంటాడు. ఈ మూడు తలుపులు తెరవాలంటే మనం జీవించే పద్దతులలో రంగుల అవగాహన ఏర్పరచుకోవాలి. ఇవాళ ఆకాశం ఏ రంగులో వున్నది? సముద్రం ఏ రంగులో వున్నది? మనచుట్టూ వున్న మనుషులు ఏ రంగులతో వచ్చారు? ఇవన్నీ observe చేస్తూంటే, ఒక్కో రంగుకి ఒక్కో తత్వమున్నది. ఆ తత్వంలో అమ్మవారు మన దగ్గరకు చేరుతున్నారని తెలుసుకోవాలి. ఆ తత్వాన్ని మనకివ్వడానికి అమ్మవారు ఉద్యమించినట్లుగా

తెలుసుకోవాలి. ఇలాగే శబ్దములు. ముందు రంగులు తెలిస్తే గానీ శబ్దములు తెలియవు. అందుకు వర్ణాత్మకమైన సృష్టిని రంగురంగులుగా, శోభాయమానంగా వున్న సృష్టిని చూడాలి. అందుకే ప్రతిరోజూ సూర్యోదయం చూడాలి. సూర్యాస్తమయం చూడాలి. ప్రత్యేకించి. రంగుల యొక్క ధ్యానంలో ఇలా వుంటుంది. ధ్యానానికి రంగులు, మననానికి మంత్రాలు. ఇది 'మాధవ'. ఆ విధంగా మాధవుని దర్శనం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్పుడు భగవంతుడు పొరలు పొరల్లో స్థూలం నుండి సూక్ష్మానికి ఏ విధంగా వున్నాడు? సూక్ష్మం నుండి స్థూలానికి సృష్టి ఏ విధంగా చేస్తున్నాడు అనే విషయాలు మన లోపల, మనచుట్టూ అవగాహన అవుతాయి. ఒక మనిషి మాట్లాడుతూంటే ఎందుకు మాట్లాడుతున్నాడో తెల్సిపోతుంది. ఏం మాట్లాడుతున్నాడో తెలుసుకోవడం ఒకటి. ఎందుకు మాట్లాడుతున్నాడో తెలుసుకోవడం ఒకటి. మాట మాట్లాడకముందే భావనలో వుండగానే తెలుసుకోవడం ఒకటి జరుగుతాయి. ఇవన్నీ ఎందుకు ఏర్పడతాయంటే అతీంద్రియ స్థితి. కేవలం ఇంద్రియముల ద్వారా బహిర్గతమైన విషయాలు గ్రహించే వీలుంటుంది. వ్యక్తమైన తర్వాత చూసేవి ఇంద్రియాలు. అక్కడ దధ్యోజనం వుంది. మనం ఇక్కడ వున్నాం. మనకి దాని రుచి తెలియదు కదా! అది మనకి నాలుక మీద పడ్డప్పుడే రుచి తెలిసేది. కన్ను కనిపించేది చూస్తుంది తప్ప, కనిపించని చీకట్లో కన్ను ఏం చూస్తుంది? చప్పుడైతే వినిపించే చెవులు తప్ప, చప్పుడులేకుండా వినిపించే చెవులు కాదుగా! ఈ విధంగా లోపలకి వెళ్ళిన కొద్దీ ఇంద్రియాలతో సంబంధం లేకుండా కనిపిస్తాయి రంగులు, వినిపిస్తాయి శబ్దాలు. వాటికి ఆధారభూతుడైన భగవంతుడు కనిపిస్తాడు. ఇదీ క్లుప్తంగా 'మాధవు'డనే పదానికి అర్థం.

## 176 మధుః

మధుః అంటే రుచి అని అర్థం. మనందరికీ రుచులు, అభిరుచులు వున్నాయి కదా! ఒకసారి పొందిన రుచిని, మరల జ్ఞప్తి యందుంచుకొని అదే రుచి కోసం పాకులాడతాం. ఈ రుచులు ఇంద్రియములతో పొందుతాం. మంచి పాట వింటే మళ్ళీ ఆ పాట వినాలనిపిస్తుంది. మంచి మాట వింటే మళ్ళీ ఆ మాట వినాలనిపిస్తుంది. మనల్ని కష్ట పెట్టే మాట ఎవరైనా అంటే మళ్ళీ వినాలనిపించదు. మంచి మాటలు, పాటలు, శబ్దములు వినడానికి ప్రయత్నం జరుగుతుంది. అందులో రుచి వున్నది. అలాగే మిగతా ఇంద్రియములు కూడా. ఏదైనా మంచిది చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. తిరుపతి వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది కదా! అది రుచి. అలాగే తిండి విషయంలో! రుచి బావుంటే అదే మళ్ళీ వండుకుతిని, మళ్ళీ వండుకుతిని కావాలనుకుంటాం. అలాగే స్వర్శ రుచి విషయంలో! ఏదైనా మెత్తని స్పర్శ కలిగితే మళ్ళీ మళ్ళీ స్పర్శించాలని తహతహలాడుతుంటాం. అలాగే వాసన! ఈ రుచులన్నీ ఆ క్షణానికి ఆనందం ఇచ్చినట్లుగా భ్రమకొల్పి, మరుక్షణానికి మనల్ని మళ్ళీ యధాస్థితిలో వుంచేస్తాయి. ఆనందాన్నిస్తున్నట్లు భ్రమ కొల్పడమే కానీ ఆనందాన్ని శాశ్వతంగా ఇవ్వని రుచులు కోకొల్లలుగా వున్నాయి. వాటి వెంటే మనం ఎక్కువగా తిరుగుతూంటాం. ఐదు ఇంద్రియముల ద్వారా, అదికాక స్త్రీ, పురుష కామవాంఛ. స్పర్శలో అదీ included అనుకోండి. వీటికోసం అంటే ఈ ఐదు ఇంద్రియములతో సుఖం కోసం పడే తాపత్రయం వున్నదే, అది అప్పటికప్పుడు దొరికినట్లే దొరికి, అయిపోయిన క్షణం నుండి మామూలుగానే వుంటాం. ఒకదానినుండి పరిపూర్ణ మైన తృప్తి ఎంతకాలం నిలిచివుంటుంది? మధ్యాహ్నం ఎంతో రుచికరమైన మంచి భోజనం చేసాం. కానీ మళ్ళీ సాయంత్రానికి అసంతృప్తే మళ్ళీఎప్పుడాని.అలాగే ఎన్నిసార్లు ఒక పాట విన్నా ఆనంద విన్నంతసేపేగా! మంచి మాటలు కూడా విన్నంతసేపే కదా! మంచి దృశ్యముఇలు చూసినంతసేపే కదా ఆనందం. ఆ తర్వాత మామూలేగా! ఎప్పుడూ వీటికోసం వెతుక్కోడమేగా!అంటే వీటన్నిటికోసం

ఇవి ఆనందం ఇస్తాయని భ్రమలో వుండి, వాటి memory మనలో శవాల్లా మిగిలి వుంటాయని మాస్టారు Mandra Scripture' లో, It is only the corpse of the happiness but not the happiness' అని చాలా చక్కగా వివరించారు. అంటే నిన్న తిన్న దోసె రుచి ఇవాళ లోపల మనకొక శవమై వుంటుంది. దోసె లేదు. దానికి సంబంధించిన భావం మిగిలివుంటుంది. తిన్నంత సేపూ దాని గురించి పడ్డ తాపత్రయానికైన సమయము, దాన్ని అనుభవించే సమయము చూసుకుంటే దోసె తయారు చేయడానికి ఎంత time పడుతుంది? తినడానికి ఎంత time పడుతుంది? తిన్న తర్వాత మన కెంత సేపు ఆ తృప్తి మిగిలింది? ఇది చూసుకుంటే రుచులు పొందడానికి తాపత్రయ పడ్డంతసేపు వుండదు కదా తృప్తి? అసలు తృప్తి రావాలి కదా! అది పొందాక మళ్ళీ రుచి మారి ఇంకోదాని కోసం పాకులాటగా ఎందుకు జరుగుతుంది? అది ఇంద్రియముల రుచి. అది Secondary! Inferior variety of taste. అది మనకి ఆ క్షణానికి మధురంగా వున్నట్లుగా తోచి, మరుక్షణం నుండి మళ్ళీ నిస్పృహలోనే వుంటుంది. స్త్రీ పురుష కామవాంఛ నుండి భోజనం వరకు ఇంద్రియముల ద్వారా ఆనందం పొందుదామని పడే తాపత్రయం, తపన ఎప్పుడూ మనల్ని తలకిందులు చేస్తుంది తప్ప, It never gives us continuous state of happiness. శాశ్వతమైన ఆనందమును, రుచిని, తృప్తిని మనకివ్వవు. వాటి యొక్క జ్ఞాపకాలే మిగిల్చి, ఆ జ్ఞాపకాల యందే మనల్ని జీవించేటట్లు చేస్తాయి. అంటే మనం భూతం లో జీవిస్తూంటాం. అయిపోయిన దాంట్లో జీవిస్తూంటాం. మా తాతలు నేతులు తాగారు. అయితే ఏమిటి? అందుకని ప్రస్తుతంలో జీవించడానికి నిజమైన రుచి ఎక్కడ కలుగుతుందంటే, భగవత్తత్వము నందు అవగాహన ఏర్పడినవాడికి అతీంద్రియమైన రుచి కలుగుతుంది. ఆ రుచి మరిగినవాడికి ఇవాళ ఉప్పెక్కువైందా, తక్కువైందా చేసుకున్న పదార్థములో, ఇవాళ శనివారం మంచి రుచికరమైన Tiffin చేసుకొని తినాలి. ఇట్లాంటివేవీ వుండవు. అంటే ఇంద్రియములతో సంబంధించిన రుచికన్నా, అతీతమైన రుచి యందు మనసు లగ్నమై వున్నది. ఆ రుచి యందు లగ్నమై వున్నవాడు ఇహ ఇంద్రియములు చూపించే రుచులకు పరుగెత్తడు. బయట దేనికీ

పరుగెత్తడు. ఎందుకంటే అసలు రుచి వాడికి దొరికింది కాబట్టి. ఈ రుచి మరిగినవాడికి అసలుఇంద్రియముల ద్వారా కలిగే రుచులలో రుచి వుండదు. తనచుట్టూ చాలా వుంటాయి. తన అవసరాల వరకూ వినియోగించుకుంటాడు. కానీ రుచి మాత్రం అక్కడే వుంటుంది. అదే ప్రహ్లాద చరిత్రలో చదివే పద్యం చాలా ముఖ్యమైనది. 'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు——' ఇట్లా వుంది కదా! నిజంగా భగవంతుని యందు రుచి కలిగినవాడికి మిగిలిన వాటియందు రుచి వుండదు. అది నిస్సందేహం! మనకు భాగవతుల జీవితాల్లో కూడా ఇదే కనిపిస్తుంది. వారికి ఏదీ రుచిగా ఉండదు, ఇది తప్పా! అన్నీ Secondary. కేవలం భగవంతుని యందు మాత్రమే రుచి కలిగివుంటారు. They don't exist for the secondary things. అన్నం తినలేదా అంటే, అహా అలాగా పెట్టు, అంటాడు. తినేటప్పుడు పరిపూర్ణంగా అనుభూతి చెందుతాడు తప్ప, రుచులలో ఇరుక్కోడు. రుచి లేకుండా చేసుకోమనలేదు కానీ, రుచుల్లో ఇరుక్కోకూడదు. చూసిన దృశ్యం. మళ్ళీ అదే దృశ్యం కోసం వెతుక్కోడం వుండదు. ఎందుకంటే లోపల. ఎప్పటికప్పుడు చక్కటి దృశ్యం అనుభూతి ఇస్తూనే వుంటుంది. మంచి మాటలు, పాటల కోసం వెతుక్కోడు. ఎందుకంటే లోపల అనాహతమైన శబ్దం అనుస్యూతముగా వినిపిస్తూనే వుంటుంది. వెలుగుతో కూడిన రూపము యొక్క ఆకర్షణ పరిపూర్ణంగా ఆయన యందు నిలబడి, అన్నిట్లోనూ వెలుగు దర్శనం చేస్తూంటాడు కాబట్టి, రూపముల ఆసక్తి అంటే ఇంద్రియపరంగా అందరికీ సహజంగా వుండే రూపముల ఆసక్తి వుండదు. నిజంగా ఈ ఆసక్తులు వికృతమైనవి. అతనికి వుండే ఆసక్తి ప్రకృతి సిద్ధమైనది. అటువంటి శాశ్వతమైన రుచిని కల్పిస్తాడు భగవంతుడు. ఆ రుచిలో పడ్డవాడికి మిగతావి వున్నా, లేకపోయినా ఒకటే. వద్దనడు. లేకపోతే వెంటపడడు. ఎంత చక్కటి విషయం! అది నిజమైన 'మధు. ఆ మధుని త్రాగినటువంటివారు, ఆ భగవంతుని తత్వాన్ని రుచి చూసినవారు, ఇంకో చోటుకి పొమ్మంటే పోరు. ఇంకో పన్లోకి పొమ్మంటే పోరు. కలుషితమైన వాతావరణం లోనికి సహజంగా వెళ్ళరు. హంస ఏ విధంగా నిర్మలమైన మానస సరోవరాన్ని వదిలి కుళ్ళు నీళ్ళలోనో, మామూలు

నీళ్ళలోనో ఈత కొట్టదు.అలా మహాత్ములు తిరిగే ప్రదేశాలు పవిత్రమైనవి. మహర్షులు ఎందుకండీ హిమాలయాల్లో వుండడం? మన వద్దకు వచ్చి వుండవచ్చు కదా! అక్కడ వుంటేనే వారు మన యోగక్షేమాలు చూడగలరు. ఇక్కడకి వస్తే వారూ, మనలాగే అయిపోతారు. ఎందుకంటే ఇక్కడి వాతావరణం, గాలి, నీరు, చుట్టూవుండే భావముల సముదాయం పరిస్థితి అలాంటిది. ఇక్కడ మనం ఎటువంటి రొచ్చులో బ్రతుకుతున్నామో మనకెప్పుడు తెలుస్తుందంటే భౌతికానికి అతీతమైన సృష్టి అవగాహన కాస్త మనకేర్పడినపుడు తెలుస్తుంది. మానవుల కలుషిత భావముల రొచ్చు చాలా ఎక్కువ. అందుకే నిర్జనమైన పర్వత ప్రదేశాలకి వెళ్తే మనకి అప్రయత్నంగా ప్రశాంతత వుంటుంది. ఎందుకీ పర్వతాల్లో ఇంత హాయిగా వుంది అనుకుంటాం. ఎందుకంటే మనం అక్కడుండం. మనం ఎక్కడుంటే అక్కడ సంకల్పబలం చేత దాన్నంతా కలుషితం చేసుకుంటాం. ఎందుకంటే లోపల్నుండి వచ్చే సంకల్పముల యొక్క పవిత్రతను బట్టి వుంటుంది అక్కడుండే వాతావరణం. కలుషితమైన వాతావరణం నగరంలో ఎక్కువుండడానికి కార్లు, బస్సులు ఎక్కువ తిరుగుతాయని కాదు. రజస్సు ఎక్కువగా వుంటుంది పెద్ద నగరాల్లో. పెద్ద నగరాలు అయ్యేకొలదీ రజస్సు కాలుష్యం ఎక్కువ. మనం కూడా అక్కడకి వెళ్తే ఆ రజోగుణంలో ఇరుక్కుపోయి, మామూలుగా మనకి అక్కరలేనివి చాలా అవసరమని అనిపించేస్తాయి. మళ్ళీ మన ఊరువచ్చి స్నానం చేసాక అలా ఎందుకనిపించాయో అనిపిస్తుంది. కొన్ని కొన్ని ప్రదేశాలకు వెళ్తే, కొన్ని భావాలు వస్తాయి. అవి సహజంగా మనలో విత్తనాల్లా వుంటాయి కానీ విజృంభించి వుండవు. ఆ ప్రదేశాల్లో అవి మొలకలెత్తి చిగురించడం మొదలెడ్తాయి. మళ్ళీ మనం మన ప్రదేశాలకి వచ్చేసి, రెండు పూట్లా ప్రేయరు చేసికొంటే, మూడు రోజుల్లో అన్నీ వెళ్ళిపోతాయి. ఎందుకంటే బయట వాతావరణం అది! ఎప్పుడైతే ఆ రుచిలో జీవించడం మొదలు పెట్టాడో, లోపల వున్న వాణ్ణి దర్శనం చేసికొంటే బయట కూడా భౌతికము, బాహ్యము అయిన సృష్టికి అంతర్లోకములలో వున్నట్టి భగవత్తత్వము అమ్మవారి రూపంలో మనకి అనుభవంలోకి వచ్చి, మనకి శాశ్వతమైన రుచి ఏర్పడుతుంది. ఏర్పడి, ఎప్పుడూ ఆ రుచిలో జీవించడం

జరుగుతూంటుంది. ఈ దృష్టితో మనం ప్రహ్లాదుని చరిత్ర చదివితే, ఆయనకి అసలు రుచి ఏర్పడడం వలన మిగతా రుచులయందు ఆసక్తి ఉండదు అని తెలుస్తుంది. ఈ రుచి పోగొట్టుకోవాలీ, ఉత్తిగా ఉప్పు లేకుండా తినాలీ ఇలాంటివి పెట్టుకున్నవాళ్లకి 'అసలు రుచి' ఏర్పడదు. ఇంతకన్నా ఉత్కృష్టమైన, శ్రేష్ఠమైన, శాశ్వతమైన రుచులలోకి మనల్ని మనం ఉద్ధరించుకోవడం వలన ఈ రుచులు పడిపోతాయి తప్ప, అవి పడిపోవాలనుకుంటే పడిపోవు. దేనిగురించి ధ్యానం చేస్తుంటే అవి ఎక్కువగా నిలచివుంటాయి, కనుక పోవాలనుకున్నవే ఎక్కువ మిగిలివుంటాయి. భగవంతుడు రుచిగా ఏర్పడాలి. దానినే పరీక్షిత్తు చక్కగా మాటిమాటికీ రుచి పొంది, ఇహ చాల్లే ఆపమని ఎలా అనను? అంటాడు. ఈ తనువున్నంత కాలం ఇలా వింటూనే వుంటాను. ఇది ఆపమని ఎట్లా అంటాను? నిజమైన రుచి తెలిసినవాడు అలా అడగ్గలడా, అంటాడు. పైగా శుకుని నోట్లోంచి వస్తున్నది అమృతం. చెప్పేవాడు శుకుడు, వినేవాడు పరీక్షిత్తు కనక అది అలా సప్తాహంగా సాగిపోయింది. ఎవరికీ భౌతిక సౌఖ్యముల యావ లేక అలా వుండిపోయారు ఏడు రోజులూ. ఎందుకంటే దానియందు అటువంటి రుచి కలిగివున్నారు కాబట్టి! ఆ దృష్టితో మనం భాగవతుల చరిత్ర చదవాలి. మొత్తం జీవితమంతా దానికోసం మలుస్తారు. ఇంట్లో ఏమున్నా ప్రతీదీ భగవంతుని కైంకర్యంగా చేసుకొని జీవిస్తారు. అట్లా జీవిస్తూంటే రుచి పెరుగుతూంటుంది. అట్లా ఆ రుచిలో పడ్డ తర్వాత వెనక్కి తిరిగిచూస్తే, చాలా రుచులు జారిపోయినట్లు కనిపించి మనకే ఆశ్చర్యం వేస్తుంది. అలా ముందుకు వెళ్ళి, ఆ రుచిలో శాశ్వతంగా స్థిరపడ్డప్పుడు, శాశ్వతమైన ఆనందంగా భగవంతుడు మనలో ఏ విధంగా జీవిస్తున్నాడో తెలుస్తుంది. ఆ తత్వం మనలో వున్నది. అది సృష్టిలో వున్నది. దానికి మెట్లు, ఆరోహణ క్రమము 'మాధవ' స్థితిలో నుండి ఈ'మధు' స్థితి మనకు లభ్యమౌతుంది.

## 177 అతీంద్రియః

ఈ రుచిలో, మధు స్థితిలో చేరినవాడు 'అతీంద్రియు'డౌతాడు. 'అతీంద్రియు'డంటే ఇంద్రియములకు అవతల వుండేవాడు, ఇంద్రియములకు లోబడక వుండేవాడు అని అర్థం. వాడిది అతీంద్రియ స్థితి. వాడు చూసేదానికీ, మనం చూసేదానికీ చాలా తేడా వుంటుంది. భగవంతుడు కనబడ్డం అనేది ఎవరికి జరుగుతుందంటే ఈ చూపుకాక ఇంకో చూపు ఏర్పడ్డవాడికి. అందుకే అర్జునుడికి, ధృతరాష్ట్రుడికి దివ్యచక్షువు ఇచ్చి చూపిస్తాడు. ఎందుకంటే లోపల వున్నవి పనిచేయడం లేదు కాబట్టి! ఆయన ఇవ్వకుండానే సాధన ద్వారా పొందినవారూ వున్నారు.వీళ్ళిద్దరూ వీళ్ళద్దరూ మాత్రం ఇస్తేగానీ చూడలేకపోయారు. అంటే ఈ చూపుకాక వేరే చూపు వున్నది. ఈ వింటున్న శబ్దములు కాక అసలు శబ్దమున్నది. ఆ శబ్దంలో నుండి ఈ శబ్దాలు పుట్టుకొస్తున్నాయి. దాన్ని వింటూంటాడు 'అతీంద్రియుడు.' దాన్ని వినడమంటే భగవంతుణ్ణి వినడమే! దాన్ని చూడ్డం అంటే భగవంతుణ్ణి చూడ్డమే! మన స్పర్శకి, ఆ స్పర్శకి చాలా తేడా ఉన్నది. భగవంతుని స్పర్శ కలిగి ఉన్నాడండీ ఆయన, అంటాము. భగవంతుని స్పర్శ పొందిన వాడికే తెలుస్తుంది తప్పా మరొకరికి చెప్పడానికి లేదు. భగవంతుని అతీంద్రియ దృష్టి, అతీంద్రియ శ్రవణము, అతీంద్రియ స్పర్శ కలిగి భగవంతుని అనుభూతి ఎప్పుడూ పొందుతుంటాడు. ఎందుకంటే ఎప్పుడూ ఆ రుచిలో ఉంటాడు కాబట్టి. అతీంద్రియులకి దక్కే వాడు భగవంతుడు. భగవంతుడు అతీంద్రియుడు అంటే ఇంద్రియములకు లోబడిన వారికి అవగాహన కానివాడు. అందుకే ఇంద్రియముల వ్యాపారము చిత్తవృత్తి అన్నారు. ఆ చిత్త వృత్తిని suspend చేసేదే యోగమన్నారు. 'యోగః చిత్తవృత్తి నిరోధకః' అనేది మొదటి సూత్రం కదా! అంటే కనపడినదల్లా కావాలనుకునే వాళ్లకీ, బాగున్నదల్లా పొందాలనుకునే వాళ్ళకీ, రుచి చూసినదల్లా మళ్ళీ దొరికితే బావుణ్ణు అనుకునే వాళ్లకీ ఇంద్రియముల పట్టు చాలా ఎక్కువగా వుంటుంది. ఈ పట్టు నుంచి విడిపోవాలి అని అనుకుంటే విడిపోలేము కాబట్టి భగవంతుడి యందు రుచి కలిగితే విడిపోతాము. ఆ రుచి పెరిగినవాళ్ళు అతీంద్రియస్థితి

పొందుతారు. అతీంద్రియస్థితి పొందినవాళ్లకి అతీంద్రియుడైన భగవంతుని యొక్క దర్శనము, స్పర్శ, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం, వినపడడం అన్నీ వుంటాయి. మనం మామూలుగా వినేదానికీ, మహర్షులు వినేదానికి తేడా వుంటుంది. వాళ్ళు అలా వింటారు.'బయలాలకించే'అంటాడు గజేంద్ర మోక్షంలో. మనకి వినపడనవి వారికి వినిపించే స్థితి ఒకటి ఏర్పడుతుంది.

## 178,179,180-మహామాయః, మహోత్సాహః, మహాబలః

మనకి కనపడనవి వారికి కనిపించే స్థితి ఒకటి ఏర్పడుతుంది. మనకి స్పర్శకి అందనివి అంటే ఒక తరంగంలా ఒక గాలి వస్తే ఒక మహాత్ముడు స్పర్శించి వెళ్ళినట్టుగా భావన పొందేవాళ్ళు వున్నారు. మనం ఎదో గాలి వచ్చింది, వెళ్ళింది అనుకుంటాం. అలాగే ఒకోసారి వెలుగు ఉన్నట్టుండి ఎక్కువై తక్కువవుతున్నప్పుడు, వెలుగు యొక్క ఎక్కువ తక్కువలలో భగవంతుని యొక్క అవతరణము, అదృశ్యము చూసే వాళ్ళున్నారు. అంటే వాళ్ళ చూపుకి మన చూపుకీ ఈ విధమైన తేడా ఎందుకు ఏర్పడినది అంటే రుచివల్ల ఏర్పడింది. దానియందు రుచి ఏర్పడడంవలన ఈ ఇంద్రియములకు అతీతమైన స్థితి ఏర్పడి ఆ అతీంద్రియ స్థితియందు అతీంద్రియుడైన భగవంతుణ్ణి చూడడం ఉంటుంది. అంతవరకూ మనం పొందే భగవంతుడు పొందినట్టుగా భ్రమగొల్పుతాడు తప్ప దొరకడు. అందుకని 'మహామాయ' అన్నారు ఆయన్ని. 'అతీంద్రియో మహామాయో'! ఇంద్రియాల బయట జరిగేదాన్ని చూసుకోవడం అంటే బహిర్గతమైనవి చూసుకోవడం. 'అసలు' కి నకిలీలు అన్నమాట. ఇంద్రియముల ద్వారా మనం చూడడం మొదలుపెట్టినప్పుడు ఇంద్రియములే మనకి, బహిర్లోకానికి సంధానకర్తలు లేక వంతెనలు. వాటిల్లోంచి చూసినప్పుడు ఎలా చూస్తామంటే 'నా భార్య' అని చూస్తాం. మాస్టారు ఈ example చాలా పుస్తకాలలో ఇచ్చారు. ఆయన గ్రంధాలు చదివితే తెలుస్తుంది. ఆ మొత్తం శరీరంలో 'మీ భార్య' అని ఎక్కడ వుంది? అని అడుగుతారాయన. నువ్వు అనుకోవడం తప్ప నీ భార్య ఎక్కడ వుంది అక్కడ? అక్కడ ఒక స్త్రీ వుంది. ఒక స్త్రీ తో నీకు వున్న పరస్పర సంబంధము భార్య భర్త. అంతేగానీ ఆమె నీ భార్యే అని ముద్ర వేసుకోకు, ఒక స్త్రీ మూర్తి నీ భార్యగా నీతో వుంది. ఆమె స్త్రీ అనేది కూడా ఒక తెర. స్త్రీ పురుష లింగ భేదము ఏదైతే వుందో అది కేవలం భౌతికమైన రూపమునకు సంబంధించినది తప్ప, దానికి అతీతమైన భావాలకు సంబంధించినది కాదు. అన్నం తిందాము అనుకున్నారనుకోండి, ఆ భావం

స్త్రీ దా, పురుషుడి దా? Beach కి వెళదాం అనుకున్నారనుకోండి లేదా పూజ చేసుకుందాం అనుకున్నారనుకోండి, ఆ భావం స్త్రీయా? పురుషుడా? స్త్రీగా చూడడం కూడా ఒక తేడా. అసలు అంతకన్నా భార్యగా చూడడం మరీ ఇంకా పెద్ద తేడా. 'నా భార్య నా భార్య' అంటూ స్త్రీగా చూడడం కన్నా ఒక భగవంతుని రూపంగా చూడడం, అన్నీ కూడా భగవంతుని యొక్క వ్యక్తరూపములు ఇవి, అని గుర్తుంచుకోవడం అనేది గవంతుని యొక్క సత్యదర్శనానికి దారి తీస్తాయి. కానీ మనం అలా చూడం, మనకి వుండే సంబంధాల రూపంలోనే ఎక్కువ చూస్తూ వుంటాము, అదీ మాయ! తెలిసి కూడా బోల్తా పడుతూ ఉంటాము, అదీ మాయ! మనకి తెలిసినవాళ్లందరూ ఒక ఉపమానం ఇస్తూ వుంటారు. పత్తిలోంచి నూలు వస్తే, నూలుపోగు లోంచి గుడ్డ వస్తే, గుడ్డమీద రంగు వేస్తే, ఆ రంగుమీద designs వేస్తే, ఈ designs లో పత్తి చూసేవాడు ఎవడు? చక్కటి రంగురంగుల పూలుపూల designs ఉన్న చీరలు వున్నాయనుకోండి, చొక్కాలు కూడా అలాగే వస్తున్నాయి ఈ మధ్యన. మామూలుగా ఆడవాళ్ళు చీరలుగా కట్టుకునే వస్త్రాలని ఈ రోజుల్లో మగవాళ్ళు చొక్కాలుగా కుట్టించుకుని వేసుకుంటున్నారు. ఏదైనప్పటికీ ఆ వస్త్రం మీద రంగులూ, వాటిమీద రూపములూ చూసేసరికీ అందులోపల వున్న పత్తి ఎవడికి గుర్తు వచ్చేది? రాదుకదా? పత్తి అని గుర్తుంటే పని జరగదు కూడా ఒక విధంగా. పత్తి అనీ, పత్తి ఈ విధంగా ఉందనీ రెండూ గుర్తుండాలి. ఈ భగవంతుని యొక్క మాయ ఎలా వుంటుంది అంటే ప్రతీదీవిధంగా భ్రమ పెడుతూ వుంటుంది. అందుకని 'మహామాయ' అన్నారు. మనం పొద్దున్నే లేవగానే 'ఈరోజున జరిగే కార్యక్రమాలకి ఎప్పుడూ ప్రతీదానిలోనూ నిన్నే గుర్తుపెట్టుకుంటాను' అని సంకల్పం చేసుకుని కార్యక్రమంలోకి దిగామనుకోండి, అసలు tooth brush మీద paste పెట్టేటప్పటికే పోతుంది, కదా? ఎంతో దూరం అఖ్కర్లేదు. నీకు తెలిసిన మనిషి కనపడేసరికీ పోతూ వుంటుంది. రెండూ చూడగలవా? చూడలేవు. ఎప్పుడు చూడగలవు అంటే వాడు (ఆ భగవంతుడు) గుర్తుంటే చూడొచ్చు. పొద్దున్నే లేవగానే అసలు నిజంగా ప్రార్థన ఏమిటి చేసుకోవాలి అంటే 'ఈ రోజు ఆడిస్తావే ఆట ఈ కాలం రూపంలో, ఈ ఆటలో నువ్వు నాకు

గుర్తుంటావో, గుర్తుండవో నీకే ఎరుక, నాకు ఎరుకలేదు. ఆట సవ్యంగా ఆడి, కాళ్ళూ చేతులూ విరుచుకోకుండా, మొహం పగలకుండా మళ్ళీ సాయంత్రం నీ సాన్నిధ్యం చేరుకుంటే చాలు' అని చెప్పుకుంటే చాలు. అంతకన్నా పెద్దగా చెప్పుకుంటే మనని మనం కొంచెం డాంబికంగా అంచనా వేసుకున్నట్టు వుంటుంది. దిగిన తరువాత ఆటంతా అమ్మవారిదే మనది ఏమీ లేదు, ఆడించేస్తుంది మాయలో. అందుకనీ "వెంట వుండు స్వామీ! నాకు నీయందు ఎరుక వున్నా, ఎరుక లేకపోయినా వెంట వుండి, రక్షించుకుని సాయంత్రం మళ్ళీ ఇదే మంచం మీదకి చేర్చు" అని చెప్పాలి మంచం దిగే ముందు. దిగిన తరువాత ఇంక మన వశమేమీ వుండదు, అదీ మహామాయ! "ఎంతవరకూ నువ్వు గుర్తుంటావో అదికూడా నీ అనుగ్రహమే! నేనేదో గుర్తుపెట్టుకుందాము అని చేసే ప్రయత్నం సఫలీకృతం కాదు. అది కూడా నీ ఆధీనంలోనే వున్నది కాబట్టి నువ్వు ఎంతసేపు గుర్తుంటావో, నువ్వు నాకు గుర్తున్నా, గుర్తులేకపోయినా నన్నిలా నడిపించు. నీ మాయలో నేను సాయంత్రం వరకూ జీవిస్తాను, కాబట్టి నన్ను నీ వాణ్ణిగా, నీ మాయలో నాకు మోకాళ్ళు పగలకుండా, ఎదురుదెబ్బలు తగలకుండా, ఎవరికీ నావల్ల దెబ్బలు తగలకుండా ఈ పూటకి ఆట గట్టెక్కించు" అనే స్థితినుంచి, "ఈ పూట ఆట చక్కగా వైభవోపేతంగా జరిగి నాకు ఆ ఆటకి సంబంధించిన అనుభూతి దక్కించు" అని కోరుకునేవరకూ వెళ్ళొచ్చు. ముందు మనకి ఆట పోట్లాటగా వుంటుంది కాబట్టి లేచిన దగ్గర నుంచీ అన్నీ సమస్యలుగా ఉంటుంది జీవితం. ఆయన వెనకాలే వుండి మనల్ని చూసుకుంటూ, నెమ్మదిగా మనం ఆటలో ముందుకి వెళ్తూ వుంటే ఉత్సాహం వస్తుంది. తరువాతి పదం అదే. 'మహామాయో మహోత్సాహో! మాయలో కొట్టుకుపోయేవాడికి ఆట చాలా భయంకరంగా వుంటుంది. ఇది భగవంతుని మాయ అని గుర్తువుంచుకుని ఆడుకునేవాడు ఉత్సాహంగా ఆడుకుంటాడు. వాడికీ ఉత్సాహం! అసలు లేవడంలోనే ఉత్సాహం వచ్చిందంటే చాలా అనుగ్రహం పొందినవాడు అని లెఖ్ఖ! పొద్దున్నే మనం నిద్రలేవగానే చెయ్యవలసిన పనులన్నీ గుర్తు వస్తాయి కదా! మగవాళ్ళకైతే మళ్ళీ అదే office, ఆడవాళ్ళకైతే అదే వంట, అదే పిల్లలని బడికి పంపడం, బట్టలు ఉతికించుకోవడం, పనిమనిషి...అన్నీ

వరుసగా అవే! ఏవైనా ఉత్సాహంగా వుంటామా? ఉన్నాడుట అంటే చాలా అనుగ్రహపాత్రుడు. లేదుట అంటే వాడికి బొత్తిగా ఆట knowhow తెలియక మాయలో పూర్తిగా ఇరుక్కుపోయిన వాళ్ళు. మాయలో బాగాపడి సతమతమౌతున్న వాళ్ళు ఈ శ్లోకంలోని 'అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః' అనే రెండవ పాదాన్ని బాగా ధ్యానం చేసుకోవాలి. ఎందుకంటే, అంతా మాయే అయినప్పటికీ మనకి నిజంగా వుంటుంది. మనం కష్టంలో వున్నప్పుడు ఎవరన్నా వచ్చి 'ఏమీలేదయ్యా ఇదంతా మాయ' అంటే మనకి గట్టిగా లెంపకాయ కొడదామన్నంత కోపం వస్తుంది. చెప్పిన వాడు కూడా అంతటి కష్టంలో వుండి, దాన్ని మాయగా భావించిన వాడయితే కొంచం వినబుద్ధి వేస్తుంది. అంతా మాయే కదా! ఎప్పుడు మాయ అంటే, మూలపదార్ధంతో compare చేసి చూసినప్పుడు మాయ కనిపిస్తుంటుంది. మూలపదార్ధం గుర్తుండాలి. ఆట ఆడడానికి ముందు మనమంతా ఒకటైనప్పటికీ ఆట ఆడడానికి మొదలైనప్పుడు కొన్ని నియమాల్లోకి మనం నియమింపబడతాం. మనకి ఆటలో కొంతమంది వ్యతిరేకులుగా కనిపిస్తారు, నిజంగా కాదు. కానీ ఆటలో వాడు వ్యతిరేకి, అని అనుకునే మనం ఆడుతూ వుంటాం. కాబట్టి ప్రతీ పొద్దున్నా మనం లేచి ఆటలోకి దిగడం లాగానే మనం జీవితంలోకి దిగడం వుంటుంది. దిగినప్పుడు వాటికి కొన్ని నియమములు-నిబంధనలతో అక్కడ పనిచేయడం వుంటుంది. అంతా ఒకటే అంటే కుదరదు అక్కడ, మెట్టవేదాంతం అయిపోతుంది. అంతా ఒకటే ఎప్పుడూ? ఆటకి తెరవెనుక. ఆటవరకూ అంతా ఒకటే అని వుండదు. తల్లితల్లే, భార్య భార్యే, కూతురు కూతురే, చెల్లెలు చెల్లెలే, ఇంకొకళ్ళు ఇంకొకళ్ళే. అలా వుంటుంది ఆట. అలా కాకుండా అంతా ఒకటే అని అన్నీ కలిపేసుకుంటే పెద్ద ఎద్దుల్లాగా తయారైపోతుంది. ఎవరు ఎవరితోనైనా ఉండొచ్చు అండీ, ఇదంతా మాయే అనడానికి వీలులేదు. ఆటలో దిగకపోతే నువ్వన్నది correct. ఆటలో దిగిన తరువాత ఆటకి కొన్ని నియమాలున్నాయి. ఆ ఆట నియమాలనే సృష్టిధర్మాలు అన్నారు. Football ground లోకి దిగక ముందు ఎర్రచొక్కా వేసుకున్నవాడు, తెల్లచొక్కా వేసుకున్నవాడు భుజాలు రాసుకుని కలిసి తిరగొచ్చు, కలిసి భోజనం చెయ్యొచ్చు. Groundలోకి దిగిన

తరువాత తెల్లచొక్కావాళ్ళు ఒక team, ఎర్రచొక్కావాళ్ళు ఒక team. కదా? వాడితో పాటూ వాడు ఎటు తంతే, వీడు ఆ వైపే తన్నడానికి వీలులేదు, తంతే ఆట అవ్వదు కదా. అందుకని దిగినప్పుడు మాయ, దానికి సంబంధించిన ధర్మాలు అన్నీ వుంటాయి. బాగా ఆడుకునేవాడికి మాత్రమే ఇది కేవలం మన ఆనందం కోసం ఆడుకుంటున్నాము, అని తెలుస్తుంది. మిగతావాళ్ళకి ఎందుకీ ఆట, దరిద్రపు ఆట అనిపిస్తూ వుంటుంది. ఎందుకని అంటే చేతకాక అనిపిస్తూ వుంటుంది. చేతనైన వాడికి ఆటలో సుళువులు తెలుసు, ఉత్సాహంగా ఉంటాడు. చేతకానివాడు నిరుత్సాహంగా ఉంటాడు. అక్కడ కారణం ఏమిటంటే ఈ మాయలో పడతాడు దిగంగానే. మొట్టమొదట మంచంమీద నుంచి తీసివేసే అడుగే జారుడుబండగా వుంటుంది. లేచీ లేవగానే మనం పెట్టుకున్న చోట toothpaste లేదనుకోండి, ఎందుకు వుండదంటే ఇంట్లో పిల్లలు ఇంకొకచోట పెట్టేసారు కాబట్టి. వెంఠనే సర్రున కోపం వచ్చేస్తుంది మనకి. జర్రున జారిపోతాం. అలాగే ప్రతీవిషయంలో కూడా జారుడుగా వుంటుంది, అదీ మాయంటే! నిన్ను నువ్వు గుర్తుపెట్టుకుని ఇతరుల రూపంలో కూడా వాడే అని గుర్తుపెట్టుకుంటే ఈ ఆడడం అనేది చివరిమెట్టు. అందుకని ఏమి ప్రార్ధన చేస్తారంటే "నాకు నువ్వు గుర్తున్నావో లేదో నాకు సంబంధించినది కాదు, నన్ను నువ్వు గుర్తుపెట్టుకో. నీ మాయలో నాకు అప్పజెప్పిన పనులు అంటూ కొన్ని నీ మాయలో పడి చేస్తూ వుంటా కదా. మన పనులని చేసుకుంటూ వుంటాం కదా, అది మాయే కదా! నీ మాయలో నేను ఉన్నంతసేపూ నువ్వు నా వెనుకనే వుండు", అని ప్రార్ధన చేసుకోవడం ఎక్కువ త్రికరణశుద్ధితో చేసే ప్రార్ధనగా వుంటుంది. ఆ తరువాత నెమ్మదిగా దానిలో అంటే మాయలో కూడా గుర్తుపెట్టుకోగలిగే స్థితి నెమ్మదిగా చేరుకోవడం వుంటుంది. కృష్ణుడి దగ్గరకి నారదుడు వచ్చి నీ మొత్తం ఉన్న సరుకులో ఎవరయ్యా మంచి భక్తుడు అని అడిగితే శ్రీకృష్ణుడు ఒకొక్క సారి ఒకొక్కరిని చూపిస్తూ ఉంటాడు. నారదుడికి ఆ సమయంలో ఏది చెప్తే, ఆయనకి జ్ఞానోదయం అవుతుందో అది చెప్పాలి కదా! ఎప్పుడూ కొంటెగా ఉంటాడు కదా, అప్పుడు కూడా కొంటెగా ఓ పొలం దున్నుకునే రైతుని చూపిస్తాడు. వాడు నా మిక్కిలి ప్రియమైన భక్తుడు అంటాడు. చూడమంటే

అక్కడి నుంచే ఆ రైతుని చూడగలిగే స్థితి వున్నవాడేగా నారదుడు. అయితే నేను ఒకసారి చూస్తాను అతని daily life ఎలా వుంటుందో, అంటాడు నారదుడు. వెళ్లి చూడమంటాడు కృష్ణుడు. ఆ రైతు తెల్లవారుఝామున లేచి భగవంతునికి ఒకసారి ఇందాక చెప్పిన పద్ధతిలో ప్రార్ధన సుకుంటాడు. ఆ పద్ధతిలో ప్రార్ధన చేసుకుంటాడు.తరువాత రోజంతా కూడా ఉక్కిరిబిక్కిరిగా పని వుంటుంది అతనికన్నీ బాధ్యతలే! కొంతమంది జీవితం అలా వుంటుంది. బాధ్యతలు ఎక్కువగా వుంటాయి. ఎందుకు వున్నాయని ప్రశ్నించి ఉపయోగం లేదు మొయ్యడం ఒకటే మార్గం దానికి. వేరే solution లేదు. అలా మోస్తూ ఉంటాడు. బహుకుటుంబి, మరి వాళ్ళందరినీ పోషించాలి. పొద్దున్నే ఆవుల దగ్గరకి వెళ్ళడం, పాలుపిండడం, ఇంట్లోవాళ్లకి పాలు ఇవ్వడం, ఊళ్లోవాళ్ళకి అందరికీ పాలు సరఫరా చేసుకోవడం, ఆవులకి ఇంత మేత వేయడం, ఆ తరువాత పొలానికి పోవడం, ఎడ్లు పెట్టుకుని దున్నించుకోవడం, పంట పెరుగుతూ వుంటే వాటికి కలుపులు తీయించుకోవడం, అవన్నీ చూసుకోవడం, అక్కడికే భోజనం వస్తే భోజనం చేసేయడం, మళ్ళీ సాయంత్రం పనులన్నీ చూసుకోవడం, ఇంటికి రావడం, ఇంటికొచ్చి భోజనం చేసి మళ్ళీ ఒక్కసారి భగవంతుణ్ణి తలుచుకోవడం, నిద్రపోవడం. ఇదీ ఆయన చేస్తున్న పని. మూడు రోజులు చూస్తాడు నారదుడు. ఆయనేం భక్తుడు? అంటాడు. ఏమి ఎందుకు కాదు? అని అడుగుతాడు కృష్ణుడు. పొద్దున్న ఒక్కసారి తలుచుకుంటున్నాడు, రాత్రి ఒక్కసారి తలుచుకుంటున్నాడు, నీ భక్తుడు అంటావేమిటి? మరి రోజంతా పనిలో వున్నప్పుడు తలుచుకోవడంలేదు కదా నిన్ను, పనిలో ఉంటున్నాడు కదా! అని నారదుడు. అంటే అప్పుడు కృష్ణుడు చెప్తాడు నారదుడికి 'నీలా పనులు లేని వాడు రోజంతా తలుచుకుంటూ ఉంటాడు. నీకు ఏ పనీ లేదుకదా? వాడూ పని లేనప్పుడు తలుచుకుంటున్నాడు. నీకూ పని లేనప్పుడు తలుచుకుంటున్నావు. వాడికీ నీకూ ఏమిటి తేడా?' అని అడుగుతాడు. 'కాకపోతే వాడికి పనిలేని time రోజుకి పది నిముషాలు. నీకు పనిలేని time రోజంతా వుంది, కాబట్టి నువ్వు రోజంతా తలుచుకుంటున్నావు,అతను పొద్దున్నొక ఐదు నిముషాలు, సాయంత్రం ఒక ఐదు నిముషాలు తలుచుకుంటున్నాడు. నీతో

equivalent, నిస్సందేహంగా నీతో  సమానుడు వాడు. వాడికీ పనిలేకపోతే నీలాగా తలుచుకుంటాడు. నీకూ పనివుంటే వాడిలాగా తలుచుకుంటావు' అని చెప్తాడు. 'నేను ఒప్పుకోను ఇది అన్యాయం' అంటాడు నారదుడు. 'అయితే ఓ పని చెయ్యి' అంటాడు కృష్ణుడు. 'ఆ పల్లెకి వెళ్లి కడవనిండా అంచులవరకూ పాలు పోయించి, అదినెత్తిన పెట్టుకుని ఇక్కడికితీసుకుని రా, ఒకబొట్టు కూడా క్రింద పడకుండా గంటసేపూ నడిచి ఇక్కడికి రా. అలా తీసుకువస్తే అప్పుడు చెప్తాను. ఆ బొట్టు క్రింద పడకుండా వుంటేనే నువ్వు నా భక్తుడి క్రింద లెఖ్క' అంటాడు. 'బొట్టు క్రింద పడకుండా పాలు తీసుకుని రావడం అంత పెద్ద విద్యా?' అంటాడు నారదుడు. 'అదంతా నాకు తెలియదు, చెప్పింది చెయ్యి' అంటాడు కృష్ణుడు. నారదుడు పల్లెటూరికి వెళ్తాడు, ఒక కడవ పాలు నెత్తి మీద పెట్టుకుని నడిచి వస్తూ ఉంటాడు. ఎంతసేపూ ఒక్క బొట్టు క్రింద పడకుండా జాగ్రత్తగా నడుస్తూ వుంటాడు. పొలాల్లోంచి, కాలిబాటన ఒక్క బొట్టు తొణక్కుండా నడిచి రావడం ఎప్పుడూ అలవాటు లేని పని కదా! మొత్తానికి కష్టపడి గంటసేపు నడిచి వచ్చి పాలక్కడ పెట్టి, 'ఒక్క బొట్టుకూడా క్రిందపడలేదు, ఇప్పుడు నా సంగతి ఏమిటి?' అంటాడు. 'ఆ గంటలో నన్ను ఎంతసేపు తలుచుకున్నావు?' అని అడుగుతాడు కృష్ణుడు. 'బొట్టు పాలు క్రింద పడకుండా ఇక్కడికి తీసుకుని వచ్చే నీ ప్రయత్నం వుందే, ఆ ప్రయత్నంలో నేను నీకు ఎంతసేపు గుర్తున్నాను?' అని అడుగుతాడు. 'నీకు బొట్టు క్రింద పడకూడదు అనేదే ఎక్కువ తప్ప నేను నీకు గుర్తున్నానా' అని అడుగుతాడు. అప్పుడు నారదుడికి అర్థం అవుతుంది. భగవంతుడి మాయ ఎటువంటిది అంటే అది ఆయన దాటిద్దామనుకుంటే మనం దాటాలి తప్ప, మనం దాటేద్దాం అనుకుంటే దాటగలిగేది కాదది. మనం ఇక్కడ గెంతి అవతలకి వెళ్లిపోదాము అంటే కుదరదు, మనం ఆయన్ని స్మరించుకుంటే దాటగలం, స్మరించుకోవడం కూడా మన చేతులలో లేదు. తీరిక వేళల్లో కూడా స్మరించుకోలేకపోవడం అనేది దుస్థితి. తీరిక వేళల్లో స్మరించుకుంటూ పనిలో స్మరించడం సులభమా? కాదు. పనిలో కూడా స్ఫురణలోకి వచ్చాడా, ఆయన అనుగ్రహం అది. అది ఆయన కురిపిస్తాడు, ఎలా అంటే మనని బట్టే వుంటుంది. అనుగ్రహం, పురుషప్రయత్నం

రూపాయి బిళ్ళకి బొమ్మ బొరుసు వంటివి. ఏదిముఖ్యం అంటే రెండూ ముఖ్యమే. ఈ మాయ మనం సాధన చేసి దాటేద్దాం అనుకుంటే అవ్వదు, ఆయన అనుగ్రహానికి పాత్రుడవ్వాలి. ఆయన అనుగ్రహానికి పాత్రుడవ్వాలంటే, పొద్దున్నే జీవితంలోకి దిగినప్పుడు ప్రార్థన చేయడమే! "నాయనా ఈ ఆట నీది, నాకు నువ్వు ఇంతవరకూ నేర్పిన ప్రకారం ఆడుతూవుంటాను. నా యోగక్షేమాలు నువ్వు చూసుకో. గుర్తున్నావా ధన్యోస్మి, గుర్తులేవా నువ్వు చూసుకో, కాదు పడమంటావా? పడతాను. అంతా నీ చేతుల్లోనేవుంది ఈ ఆట." 'కర్తవ్యందైవమాహ్నికం'అనే పద్ధతిలో మొదలుపెడితే, వాడిదే ఇదంతా, మనం ఇందులో ఉన్నాము అనే భావన నెమ్మదిగా పెరుగుతూ వుంటుంది. మన జగద్గురుపీఠంలో నల్లబోర్డు మీద మాస్టారుగారు ఇచ్చిన మంచి వాక్యాలు రాస్తూవుంటారు, 'తులసి పవిత్రమైనది కాబట్టి దేవుడికి సమర్పించడం మంచిది అనేవాడు మూర్ఖుడుట, భగవంతుడికి సమర్పించబడినది కాబట్టి తులసి పవిత్రమైనది అనేది అసలు సత్యం'. ఏదైతే భగవంతుడికి సమర్పణగా జరుగుతుంటుందో అదంతా పవిత్రమే. మనని సమర్పణ చేసుకుని, పొద్దున్నే నడుస్తున్నాం అనుకోండి. పోద్దుపోద్దున్నే లేవగానే' నేను నీ దాసుణ్ణి, ఈరోజు ఈ దాసుడి కార్యక్రమం నువ్వే కడతేర్చు' అని చెప్పుకోవడం, ఎక్కడికక్కడ వాడికి సమర్పించుకుంటూ, నేను చేస్తున్నాను అన్న భావన లేకుండా జీవించాలి. ఎంతసేపు మనలో వినయం పెరుగుతూ వుంటే, అంతసేపు ఆయన మనలో దిగడానికి ప్రయత్నం జరుగుతూ వుంటుంది, అక్కణ్నుంచి అనుగ్రహం పారుతుంది. అప్పుడు కూడా నిజమైన భక్తుడు మాయని దాటాను అని అనుకోడు. భగవంతుడు దాటిస్తున్నాడు, ఆయన అనుగ్రహం చేత ఇది జరుగుతోంది తప్ప మన ప్రయోజకత్వం లేదని చాలా సులభంగా తెలుస్తుంది. అందుచేత మనం దాటలేనిది అని చెప్పడానికి 'దుర్గా' అని ఇచ్చారు. మనం దాటుదామనుకుంటే దాటలేము, ఆయన్ని స్మరిస్తే దాటగలం, ఆయన్ని స్మరించడం కూడా ఆయన అనుగ్రహం వల్ల జరిగేది. అన్ని అవస్థల లోనూ స్మరించడం అనేది జరగదు. ఎప్పుడు జరుగుతుంది అంటే మనం ఈ విధంగా పొద్దున్నే చేసుకునే సమర్పణలో వుంటుంది. సాయంత్రం కృతజ్ఞత చెప్పుకోవడం. Vote of thanks, ఈరోజు

గట్టేక్కించావు అని. ఇలా జరుగుతూ వుంటాయి నిజమైన భక్తుల జీవితాలు, from day today, from minute tominute, from hour to hour, ఆ విధంగా workout చేసుకునేవాడికి మాయకి సంబంధించినవి అన్నీకూడా విపులంగా కనిపిస్తాయి. ఎవరైనా మనని తిడుతున్నా, ఎవరైనా మనని పొగుడుతున్నా, పొగుడుతుంటే ఉబ్బిపోతూవుంటాం, ఎందుకంటే పొగుడుతున్నది మన కళ్యాణగుణాలని అని మనకి గుర్తుండదు. అవి భగవంతుడివి. మనని పొగుడుతున్నప్పుడు భగవంతుణ్ణి పొగుడుతున్నారని గుర్తుపెట్టుకోవాలి. మనని తిడుతున్నాడనుకోండి, అప్పుడు కూడా మనం మౌనంగా వుండి, వాడిలో వుండే సంస్కారం బట్టి అలా అంటున్నాడు గానీ వాడిలో తిట్టడానికి వెనుక శక్తిగా వుండే ప్రవర్తకుడున్నాడే వాణ్ని చూడడం పెట్టుకోవాలి. మనని పొగుడుతున్నప్పుడు భగవంతుడు మనని జార్చేయడానికి పొగుడుతున్నాడేమో అని చూసుకునేవాళ్ళు ఉంటారు. మనని తిట్టినప్పుడు కూడా ఇవన్నీ ప్రవర్తనలో వుండే రకాలే కదా! ప్రవర్తకుణ్ని చూస్తూ వుండి, ప్రవర్తనను పట్టించుకోనట్టి స్థితిలోకి ఎదగడం జరిగితే కొంచెం దారి ఇస్తుంది, అక్కణ్నుంచి ఉత్సాహం వస్తుంది. ఇలా ప్రతీరోజూ చేసే కార్యక్రమాల్లో భగవంతుణ్ణి దర్శనం చేయడం అనేది ఒక్క రవ్వ పట్టు దొరికితే, మనకి లేచినప్పుడు చాలా ఉత్సాహంగా వుంటుంది. అటువంటివాడికి లేవడం అంటే భగవంతుడితో ఆడుకోవడం కోసం లేవడం. భగవంతుడితో మాట్లాడుకోవడం కోసం, భగవంతుణ్ణి వినడం కోసం, భగవంతుణ్ణి చూడడం కోసం, భగవంతుణ్ణి స్పర్శించడం కోసం నిద్రలేస్తాడు వాడు. వాడి ఉత్సాహం వేరు, సగటు జీవి ఉత్సాహం వేరు. వాడికీ ఉత్సాహం వుంటుంది. ఏవిటి వాడి ఉత్సాహం? దశమ స్కంధంలో గోపికల ఉత్సాహం చూడాలి. ఇంకా తెల్లరలేదేమిటి అని మూడింటికే లేచి కూర్చుంటారుట ప్రజలందరూ. మనం ఐదున్నరకి లేవండిరా అంటే, అప్పుడే తెల్లారిపోయింది, ఈ CVVగారు ఆరుగంటలకి పెట్టారు, ఏడుగంటలకి పెడితే బావుండేది అనిపిస్తుంది. నందవ్రజంలో పిల్లలందరూ రెండున్నర-మూడుకే లేచిపోయేవారట. ఏవిటిరా! పడుకోండి అంటే, ఎవిటమ్మా ఇంకా రాడేవిటి ఈ సూర్యుడు అని అడుగుతారు వాళ్ళు. ఎందుకురా సూర్యుడు రావడం? అంటే, తెల్లారితే కృష్ణుడితో ఆడుకోవచ్చు కదా

అంటారు. మరీ బొత్తిగా చీకటి ఇంతసేపు ఉండడం వాళ్లకి ఇష్టంలేక ఏం చేసారంటే, రాత్రిపూట ఇంట్లో వాళ్లకి చెప్పకుండా పారిపోయి, ఆ యమునా నదీతీరంలో ఆయనతో ఆడుకుంటూ వుండేవాళ్ళు. అది పరాకాష్ట! అంటే నిద్రలో తనువులు ఇక్కడ వుంచి జీవులు వెళ్లి కృష్ణుడితో ఆడుకుంటాయి, పగలు తనువులతో సహా ఆడుకుంటారన్నమాట. వాళ్లకి అందుకనే అంత ఉత్సాహం. ఎంత ఉత్సాహం అంటే అక్కడ ఎదో రాక్షసుడున్నా వాళ్లకి ఏమీ పట్టదు, అక్కడ ఓ పాము వుందిట, మింగేస్తుందిట అన్నా ఏమీ పట్టదు. ఎందుకంటే, జీవితంలో భయంకరమూ, భయమూ కలిగించే సన్నివేశములు వాళ్లకి లేవు. ఎందుకంటే కృష్ణుడున్నాడని వాడికి ఉత్సాహం. ఇంకేంకావాలి? మిగతా వాళ్ళు ఎంతమంది వుంటే ఏమిటి ఉపయోగం? కృష్ణుడుంటే మిగతావాళ్ళు ఉండకపోతే మనకి ఏమిటి? వాళ్ళు ఎటువంటి వాళ్ళయితే మనకి ఏమిటి? అదీ వాళ్ళ స్థితి, అనన్య స్థితి. అది ఉత్సాహానికి సంబంధించినది. మాయ దాటినవాడికి ఉత్సాహం వుంటుంది తప్ప, మాయలో వున్నవాడికి ఆ ఉత్సాహం వుండదు. మన ఉత్సాహం ఎటువంటిదంటే ఇంద్రియములకు సంబంధించినది. ఇవాళ లేవగానే ఏమిటి తిందాం? ఎక్కడికి వెళ్దాం? ఇటువంటి ఉత్సాహాలు ఉంటాయి. ఇక్కడ ఉత్సాహం లేచిన దగ్గర నుంచీ భగవంతుడి దర్శనం కోసం తహతహ అన్నమాట. ఎప్పుడెప్పుడు time అవుతుందా prayer చేసుకుందాం అనుకునేవాళ్ళం వున్నామా? కొంతమంది వున్నారు అలా ఉత్సాహంగా చేసుకునేవాళ్ళు. ఎందుకయ్యా చేసుకున్నావు అంటే వాళ్లకి ఆ ప్రశ్న చాలా నిరర్ధకంగా అనిపిస్తుంది. ఎందుకంటే వాడిలో వుండే ఉత్సాహం అటువంటిది. ఇలా మనలో ఉత్సాహరూపంలో ఉండేవాడు వాడే! భగవంతుడు! అది 'మహోత్సాహః'. గురుపూజలలో వుండే ఉత్సాహం ఎక్కడ నుంచి వస్తుంది అంటే అందరికీ మాస్టరుగారే అప్పుడు. ప్రతీవాడిలోంచి మాస్టరుగారు పని చేస్తున్నారు అని మనం అంటాం. మాస్టరుగారు పనిచేయడం అంటే ఇక్కడ ఏమిటి? ఉత్సాహ రూపంలో మాస్టారు తత్త్వం అనండి, భగవద్ తత్త్వం అనండి, ఆ తత్త్వం మనలో ఉత్సాహరూపంలో పనిచేస్తూ వుంటుంది. మనం ఉత్సాహంగా వున్నప్పుడు, ఎదుటిమనిషి ఉత్సాహంగా వున్నప్పుడు, ఆ

ఉత్సాహంలో భగవంతుణ్ణి చూడాలి మనం. వాడెందుకు నిష్కారణంగా ఉత్సాహంగా ఉన్నాడని మనం బాధ పడకూడదు. కొంతమంది ఉత్సాహంగా వుంటారు, ఎందుకు వీడు అనవసరంగా ఉత్సాహంగా ఉంటాడు అనిపిస్తే ఎలా? అంటే మనం మరీ బొత్తిగా negative అయిపోతే, మనకి అటువంటి ఆలోచనలు వస్తాయి. ఉత్సాహంగా వుండేవాళ్లని కాస్త తెచ్చి కూర్చోపెట్టుకుని వాళ్ళతో నాలుగు కబుర్లు చెప్పుకుంటే మనలోకూడా కాస్త ఉత్సాహం వస్తుంది. ఆ ఉత్సాహవంతుడు జీవితంలో వుండే సమస్యలు ఎప్పుడూ ఉంటాయని వాళ్లకి అవగాహన అయిపోయి, భగవంతుడి ప్రణాళికలో భాగంగా ఇవన్నీ మనకి వుంటాయి అని నిర్ధారణ చేసుకుని అన్నిటినీ అంగీకరించి ఉత్సాహంగా ఉండాలి అని నిర్ణయం చేసుకుంటారు, దానికి ఖర్చు అఖ్కర్లేదు కదా! ఉత్సాహంగా ఉండడానికి ఏం ఖర్చు కావాలి? అలా ఉత్సాహరూపంలో మనలోని భగవంతుడు కనిపిస్తూ ఉంటాడు. కొంతమంది ఎప్పుడూ నవ్వుతూ వుంటారు. మనం ఏం మాట్లాడినా నవ్వుతూ వుంటారు, అంటే వెకిలిగా నవ్వడం కాదు, చిరునవ్వు. శ్రీకృష్ణుడిది అటువంటి చిరునవ్వు. కృష్ణుణ్ణి చూస్తే మనకి ఉత్సాహం వస్తుంది. కాస్తో కూస్తో మనలో బీజం రూపంలో ఉంటుంది కాబట్టి అది, భగవంతుడిలో ఉన్నవన్నీ మనలో ఉన్నాయి, కాకపోతే మనం పిడకలో వాటన్నిటినీ పెట్టివుంచాం. ఆయన్ని తలచుకుంటూ వుంటే ఈ పిడకలో పెట్టినవన్నీ కూడా మెల్లగా మొలవటం మొదలుపెడతాయి, మహావృక్షాలయిపోతాయి. కాబట్టి మహోత్సాహం మనలో ఏర్పడే అంతవరకూ కూడా మహోత్సాహుడుగా మనలో విత్తనం రూపంలో ఉండేవాడిని అలా దర్శనం చేసుకోవాలి. ఆయన ఉత్సాహం చూడండి ఎలా వుందో. మన తరపున చెప్పుకున్నాం ఆయన ఉత్సాహం గురించి, ఆయన ఉత్సాహం చూస్తే, ఏమిటీ ఉత్సాహం? మరీ కట్టలు తెంచుకుని వుంది అనిపిస్తుంది. మన అవగాహనకు దాటి వుంటుంది ఆయన ఉత్సాహం. భూగోళం సృష్టించాడు, భూగోళంమీద ఇన్ని సృష్టించాడు, దోమల దగ్గర్నుంచీ మనుష్యుల వరకూ సృష్టించాడు కదా! ఎంత ఉత్సాహం! మనకి ఇవన్నీ ఎందుకు అనిపిస్తుంది. ఏం వుంటే ఏం? సరదాగా వుంది కదా. ఒక భూగోళంతో ఆపాడా? ఇంకా కొన్ని గోళాలు

పెట్టాడు. గోళాలతో ఆపాడా? వీటన్నిటికీ సూర్యుణ్ణి కేంద్రంగా పెట్టాడు. ఒక సూర్యుడు కొన్ని భూగోళాలతో ఆపాడా? అటువంటివి ఇంకా ఎన్నో పెట్టాడు. ఎందుకయ్యా ఇవన్నీ? తీరికవుంది అనా? అంటే ఉత్సాహం. మనం పూజ చేసుకుంటున్నాం అనుకోండి, ఎదో ఒకటి చేసి ఆపేయొచ్చుకదా అంటాడు ఒకడు. వాడి ఉత్సాహం అంతే. ఏవిటయ్యా చేసుకుని ఆపెస్తావు? అంటే ఈ పూటకి గాయత్రి చేసుకుని ఆపేస్తాను అంటాడు. ఆరోజు ఉత్సాహం అంతే వుంది. బాగా గాయత్రి నిజంగా జరిగితే ఇంకోరోజు ఇంకొకటి చేద్దాం అనిపిస్తుంది. అది ఉత్సాహం. మాస్టరుగారి ఉత్సాహం చూస్తే మనకి ఆశ్చర్యం వేస్తుంది. ఎన్ని వచ్చేసాయి ఒక్క CVV మంత్రం లోంచి. గాయత్రి వచ్చింది, ఆ తరువాత పురుషసూక్తం వచ్చింది, ఆ తరువాత శ్రీసూక్తం వచ్చింది, ఆ తరువాత ఆదిత్య హృదయం వచ్చింది, ఆ తరువాత లక్ష్మిఅష్టోత్తరం, కృష్ణా అష్టోత్తరం, నారాయణ కవచం. ఇవిలా వుండగా ఇంకా ఉత్సాహవంతుల కోసం అన్నట్లుగా విష్ణు సహస్ర నామాలు, లలితా సహస్ర నామాలు, రుద్రాభిషేకాలు వచ్చేసాయి. మరీ ఉత్సాహం వుండేవాళ్ళకి మంత్రపుష్పం కూడా వచ్చేసింది. రఘురాం కుమార్ ఉత్సాహం చూడండి పూజ చేస్తున్నప్పుడు. మనకి భయం వేస్తుంది రఘురాంకుమార్ మైకు దగ్గర కూర్చుంటే. ఎందుకంటే, ఇన్నీ చదివి మంత్రపుష్పం కూడా పూర్తిగా చదవగలడు అతను, యోపాం పుష్పం వేదం కూడా వదలకుండా. చిన్న మంత్రపుష్పం కూడా కాదు, పెద్ద మంత్రపుష్పం చదివి, ఆ తరువాత English invocation చదివి, తెలుగు invocation చదివి, అదయిపోయిన తరువాత సువర్ణ సోపానాలు చదివి, అదయిన తరువాత మైత్రేయ స్తోత్రం చదివి, ఎప్పటికప్పుడు మనకి అయిపోతుంది అనిపిస్తుంది గానీ అవ్వదు. అన్నీ అయిపోయాయి హమ్మయ్య! అనుకుంటే అప్పుడు మంగళాష్టకం చదువుతాడు మాస్టారు, మన చేత కూడా చదివిస్తాడు. అంటే ఏవిటి ఇదీ? నిజంగా చేసుకునేవాడికి భగవద్ పరమైన విషయాలలో విస్తృతి వస్తుంది. ఇది పోయిన వాడికి ఒకటీ ఒకటీ కత్తెర్లు వేస్తూ, ఒక్క CVV అంటేచాలు అనిపిస్తుంది. అదికూడా పడుకుని అంటే చాలదా? అనిపిస్తుంది, ఆ తరువాత మనసులో ఉంటే చాలదా, అనాలా? అనిపిస్తుంది. ఆ తరువాత నిద్రపోవటం అవుతుంది. కదా? కాబట్టి మనలో

ఉత్సాహం అనే రూపంలో ఉన్న భగవంతుణ్ణి ఆ విధంగా పొందాలి. ఆయన ఉత్సాహం చూసి మనకి నిరుత్సాహం వచ్చే అంత ఉత్సాహం భగవంతుడిది. రఘురాం కుమార్ పూజే మనకి నిరుత్సాహంగా వున్నప్పుడు భగవంతుడి ఉత్సాహం చూస్తే మనకి ఆశ్చర్యం వేస్తుంది. ఎన్ని చేస్తాడండీ? ఎన్నివేల సూర్యమండలాలు, ఎన్ని నక్షత్రమండలాలు, వీటిలో మళ్ళీ complications, వీటిని మళ్ళీ సరిచేయడానికి ప్రజాపతులంటాడు, మనువులంటాడు, ఆదిత్యుడు అంటాడు, రుద్రుడు అంటాడు, అంతా ఒక పద్ధతిలో పోకుండా ఒకళ్ళకి ఒకళ్ళని against గా పెట్టి ఉంచాడు. కొంతమంది దైత్యులు, కొంతమంది ఆదిత్యులు, కొంతమంది అటు పీకుతూ వుంటారు, కొంతమంది ఇటు పీకుతూ వుంటారు, అప్పుడే బావుంటుంది అంటాడు. ఒక పక్కే అందరూ పీకితే ఏం ఉపయోగం? ఇద్దరూ తలొక పక్కా పీకితే చూడడానికి బావుంటుంది. Foot ball ఆటలో ఎంతసేపూ ఒక్కడే goals కొట్టేస్తూ వుంటే ఆట ఏం బావుంటుంది? అలా కొట్టేస్తూంటే, ఎవ్వరూ చూడరు వెళ్ళిపోతారు. బంతి ఇటు goal కొట్టేస్తూ వుండడం, మళ్ళీ center నుంచి మళ్ళీఇటు కొట్టేస్తూ వుండడం, అలా వుంటే ఎవ్వరూ చూడరు వెళ్ళిపోతారు. అటూ వెళ్ళాలి, ఇటూ వెళ్ళాలి బంతి. కదా! అలా ఎంత ఉత్సాహంగా ఆపకుండా ఆడుతున్నాడో ఆట చూడండి. ఎందుకయ్యా ఆపకుండా ఆడుతున్నావు? అంటే, బావుందికదా అంటాడు. ఆ ఉత్సాహానికి పరిమితి లేదు. మన ఉత్సాహానికి పరిమితి వుంది. మాస్టరుగారి ఉత్సాహం చూస్తే మొదట్లో నాకు కోపం వచ్చేది. ఏమిటీ ఈయన ఉత్సాహం? అని. ఆయనేదో ఒక మంత్రం నేర్చుకోమంటే ఎందుకీయన ఇన్ని పెట్టాడు అని. కానీ రానురాను మనలో ఉత్సాహం పెరిగేసరికీ, అప్పుడు అర్థమౌతుంది మాస్టరుగారి ఉత్సాహం. లేకపోతే ఎందుకు తోచక ఇవన్నీ చేసాడు మనల్ని చంపుకు తినడానికి అన్నట్లుగా వుంటుంది. ఇప్పుడు మనం చేసేవి కూడా కొంతమందికి అలా వుంటాయి. మనం తోచక ఇవన్నీ చేస్తూ వుంటాం కదా, కొత్త కొత్తగా వచ్చేవాళ్ళు కొంచెం బద్ధకంగా వుండి, వాళ్లకి ఏమౌతుంది అంటే ఆ తమస్సు అడ్డుపడుతుంది. ఉత్సాహం తగ్గుతూ వుంటుంది, ఎందుకు ఇన్ని చెయ్యాలి నేను, అని వస్తూ వుంటుంది. ఎందుకు ఇన్ని చెయ్యాలి? అనే ప్రశ్న ఇదివరకూ పుట్టింది నాకు, ఇప్పుడు అర్థం

అయ్యింది మాస్టారుని చూసాక, ఆయన ఎంత ఉత్సాహంగా వుండేవారో! ఆ ఉత్సాహం పూర్తిగా వస్తే ఎంత బావుంటుందో. అంటే ఎంత భగవంతుడు దిగివస్తే అంత ఉత్సాహంగా వుంటుంది. ఆ ఉత్సాహమే బలం, అది"మహాబలః". ఇంకో బలం ఉండక్ఖర్లేదు, కండబలంఉండక్ఖర్లేదు, ఎంతైనా వాడు తీగలాగ ఉన్నా సాగిచేస్తూనే ఉంటాడు. ఉత్సాహం లేనివాడికి ఎంత పెద్ద కండలు వున్నా ఏమిటి ఉపయోగం? కండలు పోషించుకోవడానికి తినడమే కార్యక్రమంగా వుంటుంది తప్ప, మాయను దాటినవాడికి ఉత్సాహం వుంటుంది, ఉత్సాహం ఉన్నవాడికి బలం వుంటుందండీ. ఉత్సాహం పెంచడానికే కూర్చుంటాడు అర్జునుడు శ్రీకృష్ణుడి దగ్గర. భగవంతుడి సాన్నిధ్యంలో మనకి దొరికేది ఉత్సాహమే, నిరుత్సాహం కాదు. ఆ ఉత్సాహంలోంచి కొండంత బలం. చూడండి ఎటువంటి సన్నివేశాలలో కృష్ణుడు కేవలం తాను వచ్చి ఎంతమందిని ఉత్సాహపరిచి వెళ్తూ వుండేవాడో. ఎటువంటి సన్నివేశాలలో మన జీవితాలలో మాస్టరుగారు గభాలున వచ్చి మనల్ని ఉత్సాహపరిచి వెళ్ళారో. మహాత్ముల జీవితాలన్నీ కూడా ఇతరులను ఉత్సాహపరిచుట కొరకే. ఎందుకంటే, వాడు నిరుత్సాహపడిపోతూ ఉంటాడు ఆడలేక. ఈయన వచ్చి కొంచెం clear చేసి, 'ఒరేయ్ ఇదంతా ఏమీ లేదురా, మనం అనుకుంటాం అంతే' అని చెప్తారు. మాస్టరుగారు ఎంత మాయ తొలగి వుండేవారంటే వాళ్ళ అబ్బాయిల విషయంలో నేను ఏదైనా ఇలా చేసుకుంటే అతనికి బావుంటుంది మాస్టారూ! అంటే, 'నా కొడుకు అని నువ్వు చెప్తున్నావు కానీ వాడొక జీవుడు, వాడికి ఒక programme వుంది, ఆ programme నడుస్తూ వుంటుందని మనకి గుర్తుండాలి సుమా' అనేవారు. మన కర్తవ్యం వుంది నేను కాదనను, కానీ మనంత జీవుడు వాడూనూ. బుడుగు అంటూ ఉంటాడు 'నా అంతటివాణ్ణి నేనే' అని. సత్యం ఇది. ప్రతీవాడూ వాడంతటి వాడు వాడే, వాడి program తో వాడొచ్చాడు. నీ కొడుకైనంత మాత్రాన నీకు వాడిమీద అధికారం లేదు, వాడితో స్నేహమైన సంబంధం వున్నది as equals. అందరూ చైతన్య స్వరూపులని గుర్తున్నప్పుడు అందరూ equals అవుతారు. కాబట్టి సమదృష్టి వున్నవాళ్ళు వారితో ఆ విధంగా ప్రవర్తిస్తారు. నా కొడుకు కాబట్టి నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను, నా భార్య కాబట్టి నా

ఇష్టం వచ్చినట్టు తిడతాను, తన్నుకుంటాను నువ్వెవరు?అన్నట్టుగా వుండదు. అన్నీ భగవంతుడివే, అన్నీ భగవంతుడికి సంబంధించినవే మనం కూడా ఆయనకి సంబంధించినవాళ్ళం కాబట్టి 'we are all equals' అన్నట్టుగా వుంటుంది. జీవుడిగా program వాడు నిర్వర్తించుకుంటాడు అని చెప్పారు. దానికి కావలసిన అనుపానం మనం ఇస్తూ వుండాలి అని చెప్పారు. మాయలో పడకుండా ఎప్పటికప్పుడు ఉత్సాహంగా ప్రవర్తించారు. ఏమిటిరా ఆయన బలం? అంటే ఉత్సాహమే! హిరణ్యకశిపుడు అడుగుతాడు ప్రహ్లాదుడ్ని, ఏమిటిరా నీ బలం అని అడుగుతాడు. ఏమిటి వాడి బలం? ఇందాక చెప్పినవి అన్నీ వున్నాయి వాడిలో. మాధవుణ్ని చూసాడు, మథుర తిరిగాడు అతీంద్రియుడు, మాయలేదు, అంతా ఉత్సాహమే, అంతా బలమే. కొండమీంచి విసిరేసినా చావడు. బలమే! ఏనుగులు తొక్కేసినా మరణించడు, నిప్పులో తోసేసినా మరణించడు, మరి అది పరాకాష్ట ఉత్సాహానికి. అందుకని భాగవతుల గురించి చెప్పినప్పుడు మొట్టమొదట ప్రహ్లాదుడి గురించి చెబుతాము. అంత ఉత్సాహం వున్నవాణ్ని ఎవ్వరూ ఏమీ చేయలేరండీ. వాడి బలమే వాడి ఉత్సాహం, వాడి ఉత్సాహానికి వాడి మాయ తొలగడం కారణం. అతీంద్రియత్వం వలన ఆ మాయ తొలగడం వుంటుంది. రుచి కలిగి ఉంటాడు. ఆ రుచి మరిగినవాడు ఇంకా వేరే ఏ చోటికీ పోడు.

'అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత మత్త చిత్తము' ట. అంబుజోదరుడి యొక్క పద్మములులా వుండే పాదములు. 'అంబుజోదర దివ్య పాద అరవింద', వాటిని ఎప్పుడూ చింతిస్తూ ఉంటాడుట. అంటే విచారించడం కాదు. సంస్కృతంలో విచారించడం అన్నా, చింతించడం అన్నా దాన్ని గురించి భావన చేసుకోవడం అని అర్థం. మన తెలుగులో భావం మారింది. విష్ణు సహస్రనామం చదువుతున్నప్పుడు రుచిగా వుంటుందా? లేకపోతే ఎప్పుడు అయిపోతుందా అని వుంటుందా? మన బట్టే అది. అయ్యో అయిపోయిందా! అని అనుకునేవాళ్లు కూడా వుంటారు. మనకి వాళ్ళు patients అనిపిస్తుంది. అయ్యో! పూజ అయిపోయిందా! అనుకునే జనాలు వుంటారు. అయ్యో విష్ణు సహస్రం !అయిపోయిందా!

అనుకునేవాళ్లు వుంటారు. ఎందుకంటే ఆ దివ్యపాదములయందు సమర్పించబడినట్టి చిత్తము కలిగినవాళ్ళు అక్కణ్నుంచి అమృతాన్ని గ్రోలుతూ ఉంటారుట. ఎంతబాగా రాసాడండీ పోతన.'అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన' దాన్ని తాగాడుట. తాగేసరికీ మత్తెక్కిపోయిందిట చిత్తం, 'మత్తచిత్తం'. తూలుతున్నాడుట వాడు ఆ కైపులో. ఆ కైపులో తూలుతున్నవాణ్ని అది నేర్చుకో ఇది నేర్చుకో అంటే? Shares value ఇలా పెరిగుతున్నాయి తెలుసా మీకు? అని అడిగామనుకోండి. లేదా మీ ఇంటిచుట్టుపక్కల land value బాగా పెరిగిందిట కదా! అన్నామంటే పట్టవు అవి ఏవీ వాడికి. అసలు నీకు ఇల్లు లేదు కదా? అంటే మనం గుర్తుచేస్తే వాడికి ఇల్లు లేదని తెలుస్తూ వుంటుంది. మనం గుర్తుచేసి వెళ్ళిపోయినా తరువాత వాడు మర్చిపోతాడు ఎందుకంటే వాడు మళ్ళీ విష్ణువులోకి వెళ్లిపోతాడుట. మనం గుర్తుచేసేవి వాడికి గుర్తుండవు, వాడికి గుర్తున్నవి మనకి గుర్తుండవు. అప్పటికి మత్తెక్కిపోతాడు వాడు. 'మత్తెక్కిపోయిన వాణ్ని ఇంకా ఎందుకయ్యా అవి నేర్చుకో ఇవి నేర్చుకో అంటావు నువ్వు?' అలా ఉంటాడుట. అటువంటి స్థితి నెమ్మదిగా ఒకటి మొదలుపెట్టి regular గా చేస్తే, అందులోంచి ఇంకొకటి వస్తుందండీ. ఇంకొకటి చేద్దాం అనిపిస్తుంది. అందులోంచి ఇంకొకటి చేద్దాం అనిపిస్తుంది, అందులోంచి ఇంకొకటి చేద్దాం అనిపిస్తుంది. ఇలా మొత్తం జీవితం అంతా'అది' అయిపోతుంది. అసలు మొదలుపెట్టకుండా ఆలోచిస్తే ఏదీ కాదు. మొదలుపెట్టి చేస్తూవుంటే ఒకదానిలోంచి ఒకటి, ఒకదానిలోంచి ఒకటి మన జీవితాలే వాటికి తార్కాణాలు అయిపోతాయి.రాజమండ్రీ నుంచి వచ్చిన కామేశ్వరరావుగారు, కామేశ్వరి గార్ని అడగండి. అసలు మొదట్లో ఎలా వుంది? ఎంత పెరిగింది? ఇప్పుడు ఎలా వుంది? అదీ సద్గురువు ఇచ్చే స్పర్శ! అంటే ఏమిటంటే మాస్టరుగారు మనలో పనిచేస్తున్నారా? మాస్టరుగారి అనుగ్రహం మనకి ఉందా, లేదా? తెలుసుకోవడానికి ఒకటే litmus test, మనం చేస్తున్న కార్యక్రమాలు ఇనుమడిస్తున్నాయా లేక అనుమడిస్తున్నాయా? అని. మూసేశాం అండీ అన్నట్టు కొన్నుంటాయి ఎక్కువ చేస్తున్నవి కొన్నుంటాయి. ఎందుకు ఎక్కువ చేస్తున్నావు? అంటే ఉత్సాహంవల్ల. ఎక్కువ చేస్తున్నా ఏడుస్తూ

వుండకూడదు. ఉత్సాహంతో చెయ్యాలి. ఇంకో కారణం చేత ఎక్కువ చేస్తూ వుంటే ఏడుపు వస్తుంది నీకు, tension వస్తుంది. ఇవన్నీ ఎప్పుడు అవుతాయి అన్నట్టుగా వుంటుంది. పెట్టుకున్నవి కదా! కారణం ఇక్కడ కేవలం నీకు భగవంతుడి మీద రుచి అయితే అన్నీ బావుంటాయి. కాబట్టి ఈ నామాలన్నీ కూడా భగవంతుడు మన అతీంద్రియత్వం, మహామాయ, మహాఉత్సాహుడు, మహాబలుడు. వాడిబలం ఎంతని చెప్పగలం. ఎంతో బలవంతుడు వాడు. ఎందుకంటే భగవంతుడి బలం అంతా వాడిబలంగా పనిచేస్తూ వుంటుంది. భగవంతుడి ఉత్సాహమంతా వాడి ఉత్సాహంగా పనిచేస్తుంది. ఆ తత్త్వాలన్నీ వృక్షాలయ్యి బయటకి వ్యక్తమై చక్కటి అనుభూతిని ఇస్తూ వుంటాయి. ఇది మనకి 18వ శ్లోకం.

## 181,182,183,184- మహాబుద్ధిః, మహావీర్యః, మహాశక్తిః, మహాద్యుతిః

బుద్ధి అంటే మన అచ్చతెలుగులో చెప్పకోవాలంటే 'తెలివి' అన్నమాట. 'మహాతెలివి' అని ఒకటి ఉంది. మహాబుద్ధి అంటారు. దాన్నే గాయత్రి. అక్కడి నుంచే సంకల్పాలు అందరికీ వస్తుంటాయి. సృష్టికి సంకల్పం ఎక్కడనుంచి పుట్టిందో దాన్ని గాయత్రి అన్నారు. మనలో కూడా మన పనులు చేయడానికి సంకల్పాలు ఎక్కడనుంచి పుడుతున్నాయో... మన ఆధారంగా మనలోనుంచి సంకల్పాలు వస్తాయి. సంకల్పాలు ఎక్కడనుంచి జనించి కార్యరూపం దాలుస్తున్నాయో, ఆ పుట్టుక స్థానాన్ని తెలివి అంటారు. తెలివి ఉంటేనే ఆలోచన వస్తుంది. నిద్రపోతున్నప్పుడు ఆలోచనలు రావు, కదా! ముందు తెలివి రావాలి పొద్దున్నే మనకి. తెలివి రావడం అంటే చైతన్యవంతులము అవ్వడం. చైతన్యవంతులం అవ్వగానే అందులోంచి ఒక వ్యాపకం చెందేటువంటి ప్రజ్ఞగా , ప్రవాహంగా, ఈ తెలివి, తెలివి వ్యాపనము, దాంట్లోంచి సంకల్పాలు, సంకల్పాల్లోంచి కార్యక్రమాలు ఇలా బయటకి వస్తూ వుంటాయి. సృష్టికి ఒక బుద్ధి వున్నది. మనకి మన బుద్ధి వున్నట్టు. మన బుద్ధి ప్రకారం మన కార్యక్రమాలు మనం నిర్వర్తించుకుంటూ వుంటాం. సృష్టి బుద్ధి ప్రకారం సృష్టి కార్యక్రమాలు నిర్వర్తింపబడుతూ వున్నాయి. మనలో మన బుద్ధి ఎలా పనిచేస్తుందో, సృష్టిలో అలా పనిచేసేటువంటి బుద్ధినే భగవంతుని తత్వంగా విష్ణుతత్వంగా పెద్దలు చెప్పి వున్నారు. దాన్నే మహాబుద్ధి అంటారు. ఈ మహాబుద్ధి కారణంగా గోళాలు ఏర్పడడం, గోళాల యొక్క సముదాయాలు మండలములుగా ఏర్పడడం, వాటి మీద జీవులు ఏర్పడడం. అట్లా మనకి ఒక దాన్ని మించి ఒకదానిలోంచి ఒకటి అట్లా ఏర్పడి, అంటే మనకి ఇంగ్లీషులో చెప్పకోవాలంటే దీన్ని 'will' అంటారు. మనలో కూడా ఆ బుద్ధి వికాసం చెందాలంటే గాయత్రి మంత్రం చేసుకోమని చెబుతారు. 'ధియో యోనః ప్రచోదయాత్' అని మనకి, మన యొక్క బుద్ధులను ప్రచోదనము ఒనర్చేటువంటి సృష్టి లోని తత్వాన్ని మహాబుద్ధి అంటారు. దాన్ని మనం అమ్మవారిగా దర్శనం చెయ్యొచ్చు అయ్యవారిగా దర్శనం చెయ్యొచ్చు. వెలుగుని అమ్మవారంటారా? అయ్యవారంటారా? నిద్రలేవడం అనేటువంటిది... పొద్దున్నే మనకి తెలివిరావడం అనేదానికి మనం ఏమనుకుంటే అది. తెలివి రావడానికి ముందున్నటువంటి స్థితికి

ఈ స్థితి అమ్మవారు. తెలివి రావడానికి ముందున్నటువంటి స్థితికీ, ఈ స్థితి తరువాత స్థితులన్నిటికీ అమ్మవారే అయ్యవారు. సృష్టిలో ఎప్పుడూ కూడా అందుకునేది అమ్మవారు. అందించేది అయ్యవారు. అందించేవాడు అందరికన్నా పైన అవ్యక్తుడిగా ఉంటాడు. 'నిర్గుణ పరబ్రహ్మ' అంటూ వుంటారు. అంటే 'నిర్గుణం' అనేటువంటిది సరైన పదం కాదు అని మాస్టరు గారు చెప్పారు. 'గుణాతీతం' అనాలి తప్ప నిర్గుణం అనకూడదని. గుణాతీతుడయినటువంటి భగవంతుడు గుణములలో ప్రవేశించేప్పటికీ వెలుగుగా తయారు అవుతుంది. ఆ వెలుగు ఆధారంగా మిగతావన్నీ కార్యక్రమాలు నడుస్తూ వుంటాయి. మనకి కూడా, నిద్ర లేవగానే వచ్చేటువంటి వెలుగు ఆధారంగా మన కార్యక్రమాలు నడుస్తూ వుంటాయి. అలాగే ఈ సృష్టికి ఒక వెలుగు Let there be Light అని అన్నారు అంటారు కదా! ఆ స్థితిని మన వేదములలో 'అదితి' అన్నారు. వాళ్ళు Let there be Light అన్న దాన్ని మనవాళ్ళు వేదంలో అంతకుముందు ఇంతకన్నా బాగా చెప్పారు 'అదితి' అని చెప్పారు. ఆ అదితిని వర్ణించలేము అని చెప్పారు. ఎందుకంటే అది వచ్చిన తరువాత నువ్వు వచ్చావు కాబట్టి. నిద్ర లేచిన తరువాత మనం ఉన్నామని మనకి తెలుస్తుంది కదా. నిద్ర లేపినవాళ్ళు ఎవరు? నిద్ర లేపక ముందు ఎక్కడున్నాం? లేచిన తరువాత ఏమి జరుగుతుంది అంటే మనకి ఆలోచనలు వస్తాయి కదా! అట్లాగే సృష్టికి ఆలోచన. సృష్టి ఆలోచన కారణంగా ఈ వెలుగులోంచి ఒక ప్రవాహం బయలుదేరింది. మనలోంచి ఒక ప్రవాహం బయలుదేరింది. మన ప్రవాహం మన ఆలోచనల పరంపరగా బయలుదేరి వెళ్తూ వుంటుంది. ఆ ప్రవాహం సృష్టి నిర్మాణం, దాని యొక్క స్థితి, లయము దీనికి సంబంధించినటువంటి ప్రవాహంగా అంటే పుట్టడం, పెరగడం, లయంచెందడం. ఒక నది గనుక పుట్టి పెద్ద ప్రవాహమై సముద్రంలో కలిసినట్లు. సముద్రం భగవత్తత్వం అనుకుంటే, అందులోంచి ఆకాశంలోనికి వెళ్ళడం అనేటువంటిది సంకల్పం. ఆకాశంలోకి వెళ్లినటువంటి జలం మళ్ళీ ఎక్కడో ఒక చోట భూమ్మీద పడి, అక్కడి నుంచి నదిగా ప్రవహించి మళ్ళీ సముద్రంలో కలవడం అనే దాన్ని ఒక 'అయనం' అంటారు. అంటే ఒక cycle. ఒక వృత్తం. ఆ పద్ధతుల్లో సంకల్పాలు మనలోంచి వ్యక్తమవుతున్నాయి. మనలోంచి ఎట్లా వ్యక్తమవుతున్నాయో మనకి తెలిస్తే, సృష్టిలో ఎట్లా వ్యక్తమవుతున్నాయో మనకి తెలుస్తుంది. మనలో వ్యక్తమయ్యేదానికి మనకి ఆధారం బుద్ధి అయితే, మొత్తం సృష్టికి ఆధారం మహాబుద్ధి. ఆ మహాబుద్ధిని విష్ణువుగా దర్శనం చేస్తారు. అంటే

విష్ణుపరంగా చెప్పుకున్నప్పుడు విష్ణువుగా దర్శనంచేస్తారు. శివపరంగా తెలుసుకున్నప్పుడు చైతన్యమూర్తి అయిన ఆదిశక్తిగా దర్శనంచేస్తూ ఉంటారు. అది ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకమైనటువంటి పేర్లు పెట్టుకున్నారు తప్ప తత్వం మనకి అవగాహన అవటం ముఖ్యం పేర్ల కన్నా. తత్వం తెలిస్తే పేర్లది ఏముంది? ఏ పేర్లయినా మాయే. ఒకళ్ళు light అంటే ఇంకొకళ్ళు వెలుగు అంటారు. ఇప్పుడు ఈ light, ఈ వెలుగు ఏదైతే ఉన్నదో అది స్త్రీ, అందుకనే వెలుగు అమ్మవారిగా మనకిచ్చారు. ఆయన అయ్యవారు, ఆయన కనపడడు. ఆ కనపడని ఆయన ఈ కనపడే దానిలోంచి వ్యక్తమవుతుంటాడన్నమాట. అంటే వెలిగింపబడినటువంటి సినిమా తెరలా వుంటుంది. అక్కడి నుంచి మహాబుద్ధిర్మహావీర్యో. అక్కడి నుంచి 'వీర్యము' అంటే 'బలము' అని ఒక అర్ధం. మనకి ఏమైనా మనకి తెలివి వచ్చిన తరువాత అందులోంచి ఒక ఆలోచన వస్తుంది. దానికి బలం వుండాలి. సంకల్పానికి బలం లేకపోతే అక్కడికక్కడ చచ్చిపోతుంది. కదా! మనం ఏదైనా ఒకటి చేద్దాం అనుకుంటే పొద్దున్నే ఇంటావిడ కొట్టేసింది అనుకోండి అట్లా కాదు ఇట్లా అని. అలా కాదు ఇలా అనగానే చచ్చిపోతుంది కదా! మళ్ళీ ఇంకొకటి వస్తుంది. వూరుకుంటుంది ఏవిటి? తెలివి అంటూ ఉద్భవించిన తరువాత నేను అనేటువంటి స్థితి నుంచి తెలివిగా మారుతుంది. ఉద్భవిస్తుంది. ఆ ఉద్భవం అయిన దగ్గర్నుంచీ ప్రణాళికలు వస్తూ వుంటాయి. ఒక ప్రణాళిక పోతే ఇంకోటి వస్తూవుంటుంది. ఏ ప్రణాళిక నిలబడుతుంది అంటే మనం బలం ఇచ్చినటువంటి ప్రణాళిక. మనం బలం ఇవ్వని ప్రణాళిక నిలబడదు. సృష్టి విషయంలో అదే సత్యం, మనలో కూడా అదే సత్యం. మనం ఏదైనా ఒకటి సంకల్పించినప్పుడు, ఆ సంకల్పించినటువంటి విషయానికి మనమే బలం. మన యందు మొదలుపెట్టినప్పుడు ఎంత ధృతి ఉన్నదో, ఎంత ఉత్సాహం ఉన్నదో, ఎంత బలం ఉన్నదో, ఎంత freshness ఉన్నదో, అదే ఎప్పుడూ ఉన్నట్లయితే ఆ సంకల్పాన్ని మనం అవతరింప చేయవచ్చు. ఒక సంకల్పాన్ని అవతరింప చేయగలిగేటువంటి వాడు సిద్ధుడు. సంకల్పాలు ఊరికే పుట్టి అవి అవతరణ చెందకుండా చచ్చిపోయేవి చాలా ఎక్కువగా వుంటాయి. వేలకువేలుగా పుడుతూ వుంటాయి మనకి. పుట్టిన వాటిల్లో కొన్ని నెరవేరుతుంటాయి, కొన్ని నేరవేరవు. నేరవేరినవి కూడా అలా అలా వుంటాయి ఎదో జబ్బులతో వున్నా పిల్లల్లాగ. మనలోంచి పుట్టుకు వచ్చినవి సవ్యంగా ఉన్నాయా? అంటే మనలోంచి పుట్టుకు వచ్చిన పిల్లల దగ్గర్నుంచీ

మనలోంచి పుట్టుకు వచ్చిన సంకల్పముల వరకూ అన్నిటి యొక్క బలం ఎలా వున్నది? వాటి యొక్క వీర్యము ఎలా వున్నది? వీర్యము బట్టి శక్తి, అందుకని వచ్చే నామం మహాశక్తి అని వస్తుంది. మహాబుద్ధి, మహావీర్యము, మహాశక్తి, మహాద్యుతి ఈ నాలుగు ఒక set. ఆ నాలుగూ ఎలా ఒక సెట్టో అవి మన విషయంలో ఎలా వున్నాయి, సృష్టి విషయంలో ఎలా వున్నాయి, మనం సృష్టి తో అనుసంధానం చెందడానికి వీటిని ఏ విధంగా వినియోగించుకోవాలి? ఇదీ ఇవాళ మనం చెప్పుకోవసిన విషయం. ఈ మహాబుద్ధి నుంచి వచ్చినటువంటి సంకల్పానికి బలం వుంటుంది కాబట్టి, ఆ బలం ఆధారంగానే ఇన్ని లక్షల సంవత్సరాల నుంచీ కూడా ఈ భూగోళాలు నడుస్తున్నాయి. ఈ సూర్యమండలం నడుస్తూ వున్నది. ఈ నడుస్తున్న వాటిల్లో పుడుతున్నటువంటి జీవులందరూ కూడా ఒక పద్ధతి ప్రకారం పెరగడం, పరిణామం చెందడం, ఊర్ధ్వగతి చెందడం, మళ్ళీ కొత్తవాళ్ళు పుట్టుకురావడం, ఇవన్నీ ఎక్కడినుంచి జరుగుతున్నాయి అంటే ఒకే ఒక సంకల్పం నుంచి వస్తున్నాయి. అలాగే  మనలోకూడా ఒక సంకల్పం ఆధారంగా ఒక వ్యాపారం ముప్పై-నలభై  సంవత్సరాలు, వంద సంవత్సరాలు జరుగుతూ వుంటుంది. మనలోంచి వచ్చినటువంటి  సంకల్పమే కదా, ఏదైనా భుక్తి  కోసం ఏదైనా వ్యాపారాన్ని పెట్టుకున్నాం అనుకోండి. దాన్ని నిర్వర్తించడానికి బలం ఎవరు? మనమే! మనం దానికిచ్చే బలం బట్టి అది నిలబడుతుంది. దాని బలం బట్టి మనం నిలబడదాం అని అనుకునేటువంటి వాడు తెలివిలేని వాడు. మన బలం బట్టి అది నిలబడుతుంది అని తెలిసినటువంటి వాడు తెలివి వున్న వాడు. మనలోంచి పుట్టుకొచ్చిన దానికి మనం ఆధారం తప్ప, మనలోంచి పుట్టుకొచ్చిన దానిమీద ఆధారపడ్డ వాడు, అజ్ఞానంలో పడ్డవాడు అవుతాడు. మన బట్టి మన ఇల్లు తప్ప మన ఇల్లు బట్టి మనం కాదు. మన బట్టి మన పొలం తప్ప మన పొలం బట్టి మనం కాదు. మనలో ఉండే ఈ మహాబుద్ధి అనే ఆ వెలుగుకు వున్నటువంటి ప్రకాశాన్ని బట్టి మనకి వుండే వ్యాపారాలు, సంపదలు, వీటన్నిటికీ దాని వెలుగు వెళ్తూ వుంటుంది. కళగా వుండేవాడి ఇల్లు కూడా కళగానే వుంటుంది. వాడు కళగా వుండి ఇల్లు కళగా ఉండకుండా వుండదు. కళగా లేనివాడికి ఇల్లు కూడా కళగా వుండదు. అంటే ఎవడి చేతుల్లో అయితే  ఏది వున్నా అది వాడి చేతుల్లో వాడి యొక్క ప్రకాశము దానికి అంది అది భాసిస్తూ వుంటుంది. ఇప్పుడు సూర్య మండలములో ఉన్నటువంటి గ్రహములు అన్నీ కూడా సూర్యుడి ఆధారంగా భాసిస్తూ వుంటాయి.

అన్నిటికీ వెలుగు వుంది. మీరు రాత్రి పూట చూస్తే ప్రతీ గ్రహం మీకు వెలుగు చూపిస్తూ వుంటుంది. ఈ వెలుగు ఎక్కడ నుంచి వచ్చింది వీటన్నిటికి? వాటి సొంతమైనటువంటి వెలుగు కాదు కదా! సూర్యుడి దగ్గరనుంచి వస్తున్నటువంటి వెలుగు. సూర్యుడిలోంచి పుట్టుకొచ్చిన వాటన్నిటికీ కూడా సూర్యుడే వెలుగు అందిస్తున్నాడు. నీలోంచి పుట్టుకొచ్చిన వాటన్నిటికీ కూడా నీవే వెలుగు అందించగలిగినట్లయితే, సూర్యుడు ఏ విధంగా ఈ సూర్యమండలాన్ని నడుపుతున్నాడో, ఈ మండలములో వుండేటి గ్రహగోళాదులను, గ్రహగోళాదులలో ఉన్నటువంటి జీవులను, అన్నిటినీ తానే వెలుగిస్తున్నాడు. మనలో ఉండేటువంటి వెలుగు సూర్యుడిలో ఉన్నటువంటి వెలుగే. సూర్యుడిలో వెలుగు లేకపోతే మనలో వెలుగు ఉండడానికి అవకాశం లేదు. కదా? ఆ పద్ధతిలో ఈ మహాబుద్ధి అనేటువంటిది మహావీర్యము అనేటువంటి స్థితి నుంచి ఒక ప్రవాహముగా తయారవుతుంది. సూర్యుడు ఒకడైనప్పటికీ, తన కిరణముల ద్వారా తానే ప్రవహిస్తూ ఉంటాడు. నది పుట్టినప్పుడు నీరు చిన్న ధారగా వుంటుంది. పుట్టిన తరువాత నీరు అలా ప్రవహించుకుంటూ సంకల్పబలం చేత అది పెద్దదవుతుంది. ఎవరిదీ ఆ సంకల్పం? ఒక దివ్యమైనటువంటి ఒక ఋషి చేసిన సంకల్పం మూలంగా చాలా నదులు ఈ భూమ్మీద పుట్టుకొచ్చాయి. అంటే ఇక్కడ జీవులు చాలా మంది వున్నారు, వీటికి 'జీవము' కావాలి అంటే నీళ్ళు కావాలి, అని నిర్ణయం చేసి ఒక ఋషి తపస్సు చేసి ఒక నదిని పట్టుకొస్తే, పట్టుకొచ్చినప్పుడు మనకి పెద్ద పెద్ద వంతెనలు కట్టుకునే నదిగా ఏం వుండదు అది. చాలా చిన్న కుళాయిలోంచి వచ్చే నీళ్ళు లాగ పడుతూ వుంటుంది. అది నెమ్మది నెమ్మది నెమ్మదిగా వెళ్తూవుంటే, కేవలం సంకల్పబలం చేత మిగతా చోట పడేటువంటి నీళ్ళు కూడా అక్కడ వచ్చి చేరుతూ వుంటాయి. ఒక మహాత్ముడు సంకల్పించినటువంటి కార్యక్రమములు కూడా అలాగే మొదలౌతాయి. మహాత్ముడు సంకల్పించాగానే చుట్టూ ఒక వెయ్యిమంది జనం వచ్చేసి ఆయన పనులన్నీ చేసిపెట్టరు కదా! ముందు తనలోంచి వ్యక్తమౌతుందీ, తనలోంచి వ్యక్తమైనదానికి తను బలం ఇస్తూ ఉంటాడు. తానే దానికి బలం ఇవ్వకపోతే అది అక్కడ చచ్చిపోతుంది. అందుకని మనం ఏదైనా మొదలుపెట్టి ఇంకొకడు చేస్తాడనుకుంటే అది అవ్వదు. మామూలుగా మన ఆంధ్రులు ప్రత్యేకించి ఆరంభమునందు ఎక్కువ శూరత్వం కలిగిన వాళ్ళని, చాలా ఆరంభసూరులని. తను మొదలుపెట్టినదాన్ని సిద్ధి పొందేంతవరకూ కూడా నీ

యొక్క బలాన్ని దానికందివ్వాలి. నీ యొక్క బలం అంటే ఏమిటి? నీలో నేనుగా ఉండేటటువంటి వాడికి సహజముగా ఒక వెలుగు వున్నది. ప్రతీ ఒక్కరిలోనూ నేనుగా భగవంతుడు వున్నాడు. ఆయన నుంచే మనం పొద్దున్న మేల్కొంచడం అనేటువంటిది జరుగుతుంది. మేల్కొంచడం కారణంగా మనలోంచి సంకల్పములు వస్తూ వుంటాయి. వచ్చే సంకల్పాలకి ఎవరు బలం? అంటే నీవే బలం! ఎందుకని అంటే సృష్టిలోంచి వస్తున్నటువంటి సంకల్పానికి ఈ మహాబుద్ధి ఏవిధంగా బలమో, నీలోంచి వచ్చే సంకల్పాలకి నీవే బలం. 'నేను ఎంత బలమిస్తున్నా అది జరగట్లేదండీ' అనొచ్చు, కదా! నీలోంచి వచ్చేటువంటి సంకల్పములు విశ్వము నందు వచ్చే సంకల్పాలతో అనుసంధానం చెందితే సులభంగా జరుగుతాయి. అసహజమైనవి అయితే అంత సులభంగా జరగవు. జరిగినా ఎక్కువ కాలం నిలవవు. సృష్టికి దానియొక్క కాలపరిమితి చూసుకుంటే, ఆ కాలపరిమితిలో మనం చేసేటువంటి పని యొక్క కాలపరిమితి చూసుకుంటే చాలా తక్కువగా వుంటుంది. కానీ మహాత్ములు చేస్తున్నటువంటి కార్యక్రమాల యొక్క పరిమితి మీరు చూస్తే వారిని మించి వుంటాయి. మన ప్రణాళికలు మనతో సరి. కానీ మహాత్ముల యొక్క ప్రణాళికలు? వారి తదనంతరం ఎక్కువ విశ్వవ్యాప్తి చెందుతూ వుంటాయి. 'నా ప్రణాళిక దివ్య ప్రణాళికగ విశ్వమందు వ్యాపించి నిలువుగాక శాశ్వత నిలయమగుచు.' కదా! ఎప్పుడో రాముడు నడిచినటువంటి దారి ఇన్ని లక్షల వత్సరాలు మనకి నిలిచి వుంది. కారణం ఏమిటి? ఆయనలోంచి వ్యక్తమైనటువంటి సంకల్పములు అన్నీ కూడా సృష్టితో అనుసంధానం చెందినటువంటివీ, ప్రకృతి సహజమైనటువంటివీ, అసహజము కానటువంటివి. ప్రకృతి సహజము అంటే ప్రకృతి నుంచి సహజముగా వ్యక్తమైనటువంటి ధర్మాలు అంటారు. అవి ఎనిమిది ధర్మాలు. అష్ట ప్రకృతుల నుంచీ ఎనిమిది రకములైనటువంటి ధర్మములు వ్యక్తమౌతూవుంటాయి. ఆ ధర్మములు యథాతథంగా ఎవరైతే ఆచరిస్తారో వారి యొక్క జీవితమూ సృష్టి వున్నంతకాలం ఉండిపోతుంది. వారు చేసినటువంటి కార్యక్రమములూ సృష్టి వున్నంతకాలం మిగతా వారికి ఉపయోగపడుతూ వుంటాయి. ఒక అవతార పురుషుడి యొక్క వ్యక్తిగతమైన ప్రణాళిక అయినా అది విశ్వప్రణాళికతో అనుసంధానం అయి వుండబట్టి, ఆ ప్రణాళిక ఆయన తదనంతరం కూడా జరిగి వెళ్ళిపోతూ వుంటుంది. మన ప్రణాళికలు మనం చూస్తూ ఉండగానే, మన కళ్ళ ముందే చచ్చిపోతూవుంటాయి. అంటే తండ్రి బ్రతికి ఉండగానే కొడుకు

వెళ్లిపోయినట్లు. ఎన్నో పుట్టి చచ్చిపోతూవుంటాయి. తన ముందు చచ్చిపోతూవుంటే ధృతతరాష్ట్రుడి లాగ వుంటాం మనం. తను వెళ్ళిపోయి తన తరువాత వాళ్ళు చేసుకొచ్చినటువంటి స్థితి పాండురాజుది. పాండురాజు కీర్తి ధర్మరాజు పెంచాడు రాజసూయం చేసి. ? ధృతరాష్ట్రుడు? తను వుండి పిల్లలు పోయారు. తను వుండి పిల్లలు చచ్చినవాడు ఒకడు, తను పోయి తన యశస్సు శరీరంగా తన పిల్లల్లో జీవిస్తూ, వారి ద్వారా వ్యాప్తి చెందినటువంటి వాడు ఇంకొకడు. అన్నదమ్ములు ఇద్దరిలో ఈ తేడా చూడండి ఎలా వుంటుందో. శిష్యుడి ద్వారా గురువు వ్యాప్తి చెందుతూ ఉంటాడు. గురువుగా ఒక దేహంలోంచే పని చేయగలడు. శిష్యుడిగా బోలెడు దేహాలలోంచి పని చేయగలడు. తండ్రిగా ఒక దేహంలోంచే పని చేయగలడు, కొడుకుగా నాలుగు దేహాలలోంచి పని చేయగలడు. అంటే వ్యాప్తం చెందడానికి ఇదొక పద్ధతి అన్నమాట. సృష్టిలో ఉండే ఈ మహాబుద్ధి, మహావీర్యము, దానికి ఉండే మహాశక్తి, దానికి ఉండే మహాద్యుతి. 'ద్యుతి' అంటే 'కాంతి'. అంతా కాంతివంతంగానే వుంటుంది. మనం ఆకాశంలోకి ఎగిరి చూస్తే మన భూమి కూడా కాంతివంతంగా వుంటుంది. ఈ భూమి యొక్క కాంతి సూర్యుడి కాంతిలో ఏడవ వంతు కాంతి. అంటే ఈ భూమి కాంతి కన్నా ఏడు రెట్లు కాంతిగా సూర్యుడు ఉంటాడు. అయినప్పటికీ భూమికి కూడా కాంతి వుంటుంది. భూమి జీవులలో కాంతి వున్నది. మిగతా గోళములకు కాంతి వున్నది. మన భూమికన్నా రెండు రెట్లు ఎక్కువ కాంతి వుంటుంది శుక్ర గ్రహం. మన భూమికన్నా ఆరు రెట్లు ఎక్కువ కాంతివంతంగా వుంటుంది బుధగ్రహం. అంటే ఒక రెట్టే తక్కువ సూర్యుడితో, అందుకనే సూర్యుడికి చాలా దగ్గరగా ఉండగలిగినటువంటి స్థితిలో వున్నది. ఎక్కువ కాంతివంతం ఎట్లా అవుతుందయ్యా అంటే, పదార్థం తక్కువ అయ్యి లేక పదార్థము సూక్ష్మము అయినకొద్దీ కాంతి ఎక్కువ అవుతూ వుంటుంది. పదార్థము స్థూలము అయిన కొద్దీ కాంతి తక్కువగా వుంటుంది. అంటే భూమి మీద వుండే పదార్థానికీ, బుధగ్రహంలో వుండే పదార్థానికీ మనం పోల్చి చూసినట్లయితే మన కన్నా ఆరు రెట్లు సూక్ష్మంగా వుంటుంది అక్కడ పదార్థం. ఉండబట్టి ఎక్కువ కాంతివంతంగా వుంటుంది. కాబట్టి ఈ నాలుగు స్థితులు ఏవైతే వున్నాయో, బుద్ధి, తెలివి, తెలివి యొక్క ప్రవాహము, దాన్నే వీర్యం అన్నారు. నువ్వు పెట్టుకున్నటువంటి సంకల్పం అది అవతరణం చెందాలంటే నువ్వు వీరుడవై వుండాలి. అంటే బలవంతుడవై వుండాలి. వీర్యము కలిగి వుండాలి. కలిగి

వుంటే నీ సంతానంగా అది పెరుగుతుంది. నీ వీర్యము యొక్క బలము బట్టి నీ సంతానము యొక్క బలము వుంటుంది. అలాగే నీ సంకల్పం అనేటువంటి నీ పుత్రునికి నీవు ఇచ్చే బలము నీ వీరత్వమే, లేక continuous supply of prana or energy. ఎంత దానికి  energy ఇస్తావో అంతసేపు అది బతికే వుంటుంది. అందుకనే energy follows thought అని చెప్పి జ్వాలాకూల్ మహర్షి దానికో మంత్రం ఇచ్చారు. ఏ ఆలోచన అయినా దానికి నువ్వు ఇచ్చేటువంటి బలాన్ని బట్టి అది నిలబడి వుంటుంది లేకపోతే చచ్చిపోతుంది. మనం ఇప్పుడు భగవంతుడి యొక్క బుద్ధి, ఆయన యొక్క వీర్యము, ఆ వీర్యము యొక్క ప్రవాహమూ, దానిలోంచి వచ్చేటువంటి శక్తి, దానిలో ఉండేటువంటి కాంతి ఇది ఒకటి. మహర్షులలో వున్నది ప్రతిబింబించేది ఆ భగవంతుని యొక్క బుద్ధే. మనలో ప్రతిబింబించేది కూడా ఆ భగవంతుని యొక్క బుద్ధే! ప్రత్యేకంగా మనకి వేరే బుద్ధి లేదు. కాకపోతే అది పెట్టుకుని వేర్పాటుబుద్ధి కలగటం వలన మన బుద్ధి చిన్నది అయిపోతుంది. ఇదంతా ఆయనది అని గుర్తున్నటువంటివాడి యొక్క బుద్ధి ఒక రకంగా పనిచేస్తుంది. ఇది మనది కాబట్టి మనం separate గా ఇందులో అనుకుని చేసేవాళ్లకి automatic గా వక్రీకరణం చెందుతుంది. వక్రీకరణం చెందడంవల్ల దానికి వుండేటటువంటి ప్రవాహం power పోతుంది. నదీప్రవాహానికి ఉండేటువంటి శక్తీ, నదీప్రవాహానికి ఉండేటువంటి జీవము, నదీప్రవాహానికి ఉండేటువంటి ప్రాణము మన చెంబులోకి రాగానే పోతుంది. మీరు ఓ బిందెడు నీళ్ళు గోదావరి లోంచి తెచ్చుకున్నారు అనుకోండి, ఏవైంది అక్కడ? మీదంటూ వేరు చేసుకున్నారు కాబట్టి ఆ ప్రవాహం నుంచి, మీ దానిలో ప్రవాహం దానిలో ప్రవాహం తగ్గిపోతుంది. తర్వాత అసలు ఉండదు.  ప్రవాహం తగ్గగానే శక్తి తగ్గుతుంది, శక్తి తగ్గగానే కాంతి తగ్గుతుంది. అందుకే నీళ్ళు ఎక్కువ store చేస్తే వాసనొచ్చేస్తాయి. మనం అక్కణ్నుంచి తెచ్చి municipal tanks లో నింపి, అక్కడ కొన్నాళ్ళు వుంచి అక్కణ్నుంచి మన tanks లో నింపి, మన tank లోనుండి మనదగ్గరకి వచ్చేసరికి మనం చచ్చిన నీళ్ళు తాగుతూ ఉంటాము. ఇదివరకువాళ్ళు ప్రవాహంలోంచి నీళ్ళు అలా direct గా సేవించారు. పాలు లాంటివి ఆవో, గేదో దాని దగ్గర్నుంచి సరాసరి తీసుకుని తాగినటువంటి పాలకీ, అవి బాగా మనం మూతలు పెట్టి, అక్కణ్నుంచి dairyకి పంపించి, అక్కడ మళ్ళీ ఎదో చేసి, అక్కణ్నుంచి మళ్ళీ booth లకి పంపించి, ఆ boothలోంచి మళ్ళీ మన ఇంట్లో

refridgerator లోకి వచ్చి, అందులోంచి మన నోట్లోకి వచ్చేసరికీ మనం తాగే పాలు ఎలా ఉంటాయండీ? అంటే ఎక్కడైతే ప్రవాహానికి సామీప్యంలో ఉంటామో అక్కడ దానికి శక్తి ఎక్కువ వుంటుంది, కాంతి ఎక్కువ వుంటుంది. విడిపడనటువంటి స్థితిలో వాటిని ఎక్కువ కాలం మనం ఉంచుకుంటూ వుంటే మనకి మిగిలేది అందులోంచి మృత్యువే తప్ప చైతన్యం కాదు. ఇది మనం అవగాహన చేసుకున్నట్లయితే మనకి వున్న బుద్ధి కూడా భగవంతుడు మనకి ఇచ్చినటువంటి బుద్ధి. పొద్దున్నే మనం నిద్ర లేవగానే, మనం లేచాము అనేది తప్పు కదా! మనం లేద్దాం అనుకుంటే లేచింది కాదు కదా! మనం లేచిన తరువాత తెలుస్తుంది లేచామని, లేవక ముందు ఎవరు నిద్ర లేపారు? తనంతట తానే నిద్ర లేస్తుందిట అమ్మవారు. నిద్ర కల్పించేది, నిద్రనుంచి లేపేది అమ్మవారే అని చెప్తారు. అమ్మవారు అని ఎందుకన్నారంటే అంతకు ముందున్న స్థితి నుంచి బయటకి వచ్చింది కాబట్టి అమ్మవారు. ఆ బయటకు వచ్చినటువంటి స్థితిలో, ఈ చైతన్యవంతులైనటువంటి స్థితిలో, ఆ చైతన్యమునకు సంబంధించినటువంటి ప్రణాళిక ఒకటి భూమ్మీద జరుగుతున్నది కదా! ఆ చైతన్యము యొక్క స్రవంతినే లేదా ప్రవాహమునే 'కుండలినీ' అని కూడా అన్నారు. అక్కడెక్కడో భర్గోదేవ మండలంలో మొదలయ్యి అంటే cosmic centre నుంచి, అక్కణ్నుంచి నెమ్మది నెమ్మదిగా కొన్ని కేంద్రాలు ఏర్పరిచి సవిత్ళ మండలం కింద యారు చేసి, అందులోంచి మళ్ళీ సూర్య మండలాలని తయారు చేసి, వీటి మీద భూమి, జీవుల్ని తీసుకొచ్చి, ఆ జీవులలో కూడా తానే వుండి, మనలో కూడా కుండలినీ చైతన్యంగా వుంటుంది. భూమిలో కుండలినీ చైతన్యంగా వుంటుంది. సూర్య మండలం మొత్తంగా కుండలినీ చైతన్యంగా వుంటుంది. సూర్య మండలానికి సవిత్ళ మండలంతో అనుసంధానం చేసే ఒక తీగ వలే, అంటే ఒక linking principle అన్నమాట. చైతన్యం అంటే. ఇదంతా ప్రవాహం. ప్రవాహంలో ఇవన్నీ ఏర్పడుతూ వుంటాయి. ఈ ఏర్పడిన ప్రవాహాన్ని, దాంతో అనుసంధానంగా మనం నడవాలి. అదీ కాలం చూపిస్తూ వుంటుంది. పొద్దున్నే లేవగానే, మనని పనిలో పెట్టేసేది కాలమే కదా! రాత్రిపూట నిద్రలోకి పట్టుకు పోయేదీ కాలమే. పొద్దున్నే లేపేటప్పుడు, లేవగానే ఎదో ఒకటి వచ్చినప్పుడు తలుచుకోవలసినది ఏమిటంటే కర్తవ్యం దైవమాహ్నికం. మనం చేసేటువంటి పనులన్నీ కూడా దైవము చేత నిర్దేశింపబడి, కర్తవ్యం మేర మనం పని చేసుకుంటూ వెళ్ళాం అనుకోండి, మన కర్తవ్యం ఏమిటో

మనకి గోచరించాలి అంటే ముందు మన బుద్ధితో మనం సంప్రదించాలి. లేవగానే బుద్ధి నుంచి మనం స్వభావంలోకి పడిపోతాం. స్వభావంలోకి పడిపోతే ఇక మనకి బుద్ధితో అనుసంధానం తగ్గుతుంది. స్వభావం మీద పడగానే మనకి మనం వేరుగా కనిపిస్తూ వుంటాం. బుద్ధిలో ఉన్నంతసేపూ గోదావరిలో ఉన్నటువంటి చెంబులాగ వుంటాం. గోదావరిలో ఉన్నటువంటి చెంబు వేరు, దాన్నుంచి బయటకి తీసిన చెంబులో వున్నటువంటి నీళ్ళు వేరు. కాబట్టి ఎప్పుడు మనం నిద్ర లేవగానే మహాచైతన్యంలో భాగంగా ఆ చైతన్యంలోంచి మేల్కొన్నాం, ఆ చైతన్యంలో వున్నాం అని భావన చెయ్యాలి. ఆ మహాచైతన్యం అనచ్చు దాన్ని మహాబుద్ధి అనచ్చు లేకపోతే భగవంతుడు అనచ్చు, అమ్మవారు అనచ్చు, పేర్లు ఏవైనా పెట్టుకోండి దానిలో ఉన్నంతసేపూ, అందులో మనం ఇమిడి ఉన్నంత సేపూ, దానికి ఉన్నటువంటి బలం మనకి వుంటుంది. దానికి ఉన్నటువంటి బలము ఆ ప్రవాహము మనకి వుంటుంది. ఆ ప్రవాహము యొక్క శక్తి మనకి వుంటుంది. దాని యొక్క ప్రకాశమూ మనకి వుంటుంది. అందుకని 'I am not alone' అని చెప్పుకోమంటారు జ్వాలాకూల్ మహర్షి. 'నేను ఒక్కడిగాలేను, ఒక్కటిగా వున్నాను'. 'I am not lonely but I am alone' అన్నారు మాస్టరుగారు. I am alone but not lonely అన్నారు Mandra Scripture book లో. అంటే నేను ఒకటిగా వున్నాను గానీ ఒంటరివాడిగా లేను. దేనితో ఒకటిగా వున్నావు? అంటే ఈ మొత్తం అంతా నడిపిస్తున్నదానితో ఒక్కటిగా వున్నాను. దానితో కలిసి వున్నాను అన్న భావన. దాన్నే మనకి గాయత్రి మంత్రంగా ఇచ్చారు. పొద్దున్నే లేచి కాస్త కాలకృత్యాలు తీర్చుకోగానే అప్పటికే మనకి వేర్పాటు అయిపోతుంది. ఎందుకంటే మనకి అభ్యాసవశం చేత వేరుగా అనిపిస్తూ వుంటాం మనకి మనం. అందుకని గాయత్రి మంత్రం ఏం చెప్తుంది అంటే ఈ మూడులోకాలకి ఆధారమైనటువంటి వెలుగు ఏదైతే వుందో, ఆ వెలుగు నన్ను ఆవరించడానికి ఆ వెలుగు కేంద్రానికి నేను ధ్యానం చేస్తున్నాను. ఓం భూర్భువస్వః తత్సవితుర్వరేణ్యం ...ఆ సవితృ అనేటువంటి వెలుగు ఏదయితే వుందో, తత్ అంటే that సవితుర్వరేణ్యం అంటే నన్ను ఆవరించమని, నన్ను ఆలింగనం చేసుకోమని, నన్ను పూర్తిగా దానితో నింపమని, అటునుంచి. నేను వెళ్లి ఆలింగనం చేసుకుంటానని కాదు. అది నన్ను ఆవరించాలి. అది నన్ను ఆవహించాలి, అది నన్ను ఆలింగనం చేసుకోవాలి. చేసుకోవడం కోసం ఏంచేస్తున్నానంటే దానికి కేంద్రమైన తత్వం ఏదైతే వుందో దానియందు నేను

ధ్యానం చేస్తున్నాను. 'భర్గో దేవస్య'. భర్గోదేవులు, భర్గులు అంటే కాంతి పుంజములు, మీకు మహాభారతం చదువుకుంటే మొదట్లో వస్తారు భృగువులని. బోలెడు మంది భృగువులు పుట్టుకొచ్చారు అంటారు. భృగువులు అంటే వెలుగు ముద్దలు. మనకి సూర్యుడు ఒక వెలుగు ముద్ద. అందులోంచి మిగతా వెలుగు ముద్దలుగా గ్రహగోళాదులు వచ్చాయి. దానిమీద చిన్న చిన్న ముద్దలం మనం అన్నమాట. సూర్యుడిలాంటి వెలుగుముద్దలన్నిటికీ కేంద్రంగా సవితృమండలం వుంటే, అలాంటి సవితృ మండలాలకి కేంద్రంగా ఒకటి వున్నది. ఒక అవ్యక్తమైనటువంటి స్థితి. ఈ భర్గులందరికి కూడా దేవుడనేటువంటి వాడొకడున్నాడు, వాడు భర్గోదేవుడంటే. 'అస్య ధీమహి' అంటే అస్య అంటే ఇక్కడ భర్గులకి, అస్య భర్గదేవః అంటే భర్గులయొక్క దేవునికి నేను ప్రార్థనచేస్తున్నాను. అంటే ఈ సూర్యుడిగా కనిపిస్తున్న వెలుగుముద్దలు ఏవైతే వున్నాయో వాటన్నిటికీ దేవుడైనవాడికి నేను ప్రార్థనచేస్తున్నాను. 'నేను' కూడా కాదు 'మేము'. 'ధీమహి' అంటే we meditate. అందుకనే కలిసి చేసుకోవాలి తప్ప ప్రార్థన, ఎవడికి వాడు చేసుకోవడమన్నది మొదటి నుంచీ లేదు. అదేంటంటే మన life patterns అలా తయారు చేసుకున్నాం. ఎప్పుడూ వ్యక్తిగతంగా ఎవ్వడూ చెయ్యలేదు, పూర్వకాలంలో వాళ్ళు సమిష్టిగా చేసేవాళ్ళు. ప్రార్థనకి ఓ ప్రదేశం వుండేది. అందరూ అక్కడ కలిసి ప్రార్థన చేసుకుని సమిష్టిగా ఆ వెలుగుని తమయందు ఆవాహనం చేసుకుని ఆ తరువాత కార్యక్రమాలు చేసుకుంటూ వుండేవారు. అదికూడా ఏమిటి, సమిష్టి సంపదకోసం, సమిష్టి యోగం కోసం, సమిష్టి క్షేమం కోసం, సమిష్టి సుఖం కోసం, సమిష్టి శాంతి కోసం. తన శాంతి కోసం, తన సుఖం కోసం, తన యోగం కోసం, తన క్షేమం కోసం చేసుకోవడం అనే అవగాహన అసలు లేదు. కలిసి చేసుకోవడం, కలిసి అనుభూతి చెందటం. ఆ పద్ధతుల్లో మనం లేచినప్పుడు చేసేటువంటి ప్రార్థన ఎవిటయ్యా అంటే, మేము ధ్యానం చేస్తున్నాం, ఎవరినయ్యా అంటే ఈ వెలుగు పుంజములన్నిటికీ మూలమైనటువంటి దేవుణ్ణి. ఎందుకు? తత్సవితుర్వరేణ్యం, ఆ దేవుడి యొక్క వెలుగునే 'సవితృ' అంటారు. మనం పొద్దున్నే లేవగానే చైతన్యవంతులం అవుతున్నాం కదా. నేనున్నాను, నేను చైతన్యవంతుడిని అవుతున్నాను. భగవంతుడున్నాడు, భగవంతుడి యొక్క చైతన్యమే మహాబుద్ధి. మనయొక్క బుద్ధే పొద్దున్నే మనం లేవగానే మనకి గోచరిస్తుంది. అప్పుడేం చెయ్యాలి? ఈ బుద్ధి లేచిన తరువాత సంకల్పములు బుద్ధిలోంచి ఎలాగో వస్తాయి.

లేచిన దగ్గరనుంచీ ఇక మనకి అదే పని కదా? ఈ వచ్చేటువంటి సంకల్పములు, అక్కణ్ణుంచి వచ్చే సంకల్పముల వలే మనలోంచి ఉద్భవించాలన్నమాట. అంటే మన బుద్ధి అనేటువంటిది ఒక చిన్న branch office అండీ. అక్కడ Head office వుంది. ఆ head office కి zonal offices వున్నాయి. Zonal offices కి Regional offices వున్నాయి. Regional offices కి branches వున్నాయి. ఇప్పుడీ branch పని చెయ్యాలంటే independent గా పని చెయ్యదు కదా! ఇది Regional office కి, Regional office Zonal office కి, Zonal office Head office కి ఎలా link up అయ్యి వుందో, అలాగే మన బుద్ధి మన భూమి బుద్ధి కి linkup అయ్యి, మన భూమి బుద్ధి సూర్యుడిబుద్ధి కి linkup అయ్యి, సూర్యుడిబుద్ధి దానికి కేంద్రమైన సవిత్ర మండలానికి linkup అయ్యివుంటుంది. ప్రణాళిక అలా నడుస్తూ వుంటే ఈ మొత్తంలో కత్తెర వేసేవాళ్ళం మనం. మిగతా మూడూ బానే వున్నాయి. మనబుద్ధిని సూర్యుని బుద్ధితో ఎప్పుడైతే మీరు అనుసంధానం చేయగలుగుతారో అప్పుడు మీ కుండలిని ప్రచోదనం అవుతుంది. ఈ భూమికి సంబంధించినటువంటి ప్రకృతి ధర్మాలతో మనం అనుసంధానించడానికి prepared గా వుంటే అప్పుడు ఈ మన కుండలినీ ప్రచోదనం వుంటుంది. లేకపోతే ప్రచోదనం జరగడం వల్ల ఎక్కువ హాని జరుగుతుంది తప్ప మేలు జరుగదు. Earth కుండలినీ annaaru. చేస్తే ఏమౌతుంది అంటే earth కుండలినీ is already linked to the systemic కుండలినీ అంటే సూర్యమండలం యొక్క కుండలినీ చైతన్యం తో అది ఎప్పుడూ అనుసంధానం చెందే వున్నది. సూర్యుడి చుట్టూ తిరుగుతూనే ఉంటుందిగా భూమి! independent గా తిరగడం లేదుగా, మనలాగ. Independent గా వుందాం అనే బుద్ధి ఒక్క మానవులకి తప్ప ఇంకెవరికీ లేదు ఈ సృష్టిలో. కాబట్టి ఎప్పుడైతే ఈ భూమి చైతన్యంతో link up అయ్యామో, మిగతావన్నీ కూడా మనకి link up అయిపోతాయి. అలా link up అవడానికి గాయత్రి మంత్రం ఇచ్చారు మనకి. ఆ గాయత్రి మంత్రంలో మా బుద్ధులను ప్రచోదనం చేయుగాక! ఎవరు ప్రచోదనం చెయ్యాలి? ఆ వెలుగు ఆవరణవల్ల ఆ వెలుగుకి కారణం అయినటువంటి వాడు మనలోంచి తన ప్రణాళిక నిర్వర్తించుకుంటాడు అన్నమాట. ఆయన ప్రణాళిక ప్రకారమే మనం ఇవాళ భూమి మీద ఉన్నాం. మనం కోరి నిద్ర లేవలేదు, మనం కోరి మానవదేహాలు అడగలేదు. మనం కోరి భూమ్మీద పుట్టలేదు కదా! మనం decide చేసుకున్నామా భూమి మీద

పుడదామని? మనం decide చేసుకున్నామా మానవులుగా పుడదామని? మనం decide చేసామా నిద్ర లేద్దామని? లేచిన దగ్గర్నుంచీ ఏవిటో సొంత decision గా feel అవుతామంతే. Feel అవ్వడం వల్ల ఏమవుతుంది అంటే ఇందాక నేను చెప్పినటువంటి ఉదాహరణ చాలా appropriate ఉదాహరణ. నదీప్రవాహంలోంచి బయటకి తీసినటువంటి నీరువలే అయిపోతావు. తీస్తే ఏమవుతుంది? దానికి ప్రవాహమూ పోయింది. దానికి శక్తీ పోయింది. దానికి ప్రాణమూ పోయింది. నాలుగూ పోతాయి. దానితో ఆ ప్రవాహంతో link up అయ్యి వుంటే నాలుగూ వుంటాయి. అలా జీవించినటువంటి జీవితాలు మనకి ఆధారభూతమైనటువంటి జీవితాలు. వారు ప్రకృతి ధర్మాల్ని అనుసరిస్తూ ప్రకృతితో వాళ్ళని అనుసంధానం చేసుకుని సంయమము చెందినటువంటి స్థితిలో ప్రకృతికి ఇవ్వబడినటువంటి ప్రణాళికని ఇప్పుడున్నటువంటి కాలరూపంలో దాన్ని అనుసరిస్తూ ఉంటారు. అంటే కాలం ఏది నిర్దేశిస్తుందో దాని ప్రకారం వీళ్ళు జీవిస్తూ వుంటారు, జీవించి ఆ ప్రణాళికనే వ్యక్తం చేయడంలో వీరికి ఆనందం కలుగుతుంది. ప్రత్యేకించి వేరే ఆనందంగా ఏమీ వుండదు. ఆ ప్రణాళికతో అనుసంధానం చెందడం వలన అందులో సహజమైనటువంటి ఆనందం వున్నది. నదీ ప్రవాహం చూస్తూవుంటే ఆనందం కలుగుతుంది. సముద్రం అలలు అలలుగా భూమిని తాకుతూ మళ్ళీ లోపలికి వెళ్ళిపోతూ చేసేటువంటి హోరు, చూపించేటువంటి రంగులు రూపములు, ఇవన్నీ ఆనందాన్నిస్తూవుంటాయి. సూర్యోదయ సూర్యాస్తమయాలు ఆనందాన్ని కలిగిస్తూ వుంటాయి. ప్రకృతిలో ఉండేటువంటి, జరిగేటువంటి ఏ కార్యమైనా కూడా సహజంగా వుంటుంది కాబట్టి అది సహజంగానే ఆనందం ఇస్తుంది. పువ్వు విచ్చుకుంటే చూస్తే మనకి ఆనందం కలుగుతుంది. చక్కగా పూర్తిగా పండినటువంటి పండు చూస్తే ఆనందం కలుగుతుంది. చెట్టునిండా పువ్వులుంటే ఆనందం కలుగుతుంది. విరగబూసినటువంటి పువ్వులున్నా లేకపోతే బాగా పళ్ళ యొక్క భారముతో వంగిపోయినటువంటి కొమ్మలతో ఉన్న చెట్టుని చూసామనుకోండి, ఆనందం కలుగుతుంది. ఎందుకు కలుగుతుంది అంటే అది దాని యొక్క పరిపూర్ణ స్థితి. సహజముగా ఉన్నటువంటి పరిపూర్ణమైనటువంటి స్థితి. మనము కూడా ఆ ప్రకృతితో అనుసంధానం చేసేటువంటి కార్యక్రమాలలో ఈ విధంగా link up అయినట్లయితే మనకి మిగిలేది ఆనందం. ఎందుకంటే, అది ప్రకృతిచే నిర్దేశింపబడినది. events తో సంబంధం లేనటువంటి ఒక ఆనందమైనటువంటి

స్థితిలో మనం జీవించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది చూసుకుని దీని ఆధారంగా ఒక రాముడి చరిత్రో, హనుమంతుడి చరిత్రో, భరతుడి చరిత్రో, సీతాదేవి చరిత్రో చదువుకొండి రామాయణం చదువుకున్నప్పుడు, in contrast రావణాసురుడిది చదువుకోండి. ఎక్కడ రావణాసురుడు ఉన్నశాంతి పోయి అశాంతిలో నిలబడ్డాడు? రాముడు ఏవిధంగా ఎప్పుడూ శాంతిలో వున్నాడు? హనుమంతుడు ఏవిధంగా ఎప్పుడు శాంతిలో వున్నాడు? సుగ్రీవుడు ఏవిధంగా అశాంతి-శాంతి లోకి కిందకి ఎందుకు దిగవలసి వచ్చింది? వాలి ఎందుకు అలా దిగవలసి వచ్చింది? ఎక్కడైతే సహజమైనటువంటి ధర్మముల అనుసరణ లేదో అక్కడ automatic గా అశాంతి అనేది చోటు చేసుకుంటుంది. రామాయణం చదువుకున్నప్పుడు కొంతమంది characters ఎప్పుడూ శాంతిగా వున్నట్టు వుంటుంది. కొన్ని కొన్ని పాత్రలు ఎప్పుడూ అశాంతిగానే కనిపిస్తాయి. కొన్ని కొన్ని పాత్రలు ఎప్పుడూ అశాంతిగాను, అప్పుడప్పుడు శాంతిగాను కనిపిస్తాయి, మనబోటిగాళ్ళలాగ. కొన్ని కొన్ని పాత్రలు ఎప్పుడూ శాంతిగాను అప్పుడప్పుడు అశాంతిగాను కనిపిస్తాయి. వీరందరూ మనకి గోచరిస్తారు. రాముడంతటివాడు అప్పుడప్పుడు అశాంతిగా ఉన్నట్లుగా కనిపిస్తాడు. రాముడు మనకి మానవుడిగా మార్గదర్శకత్వం చూపించాలి కాబట్టి మానవుడిగా సన్నివేశములకు అతీతముగా జీవించడం అనేటువంటిది వుండదు, అని చెప్పటానికి రాముని చరిత్ర మనకి చక్కటి నిదర్శనం. సన్నివేశం వచ్చినప్పుడు, దుఃఖమైనటువంటి సన్నివేశం వచ్చినప్పుడు దుఃఖం అనుభవించడం అనేటువంటిది మానవసహజం. కానీ ఎంత తొందరగా ఆ దుఖంలోంచి బయటకి వచ్చి కర్తవ్యంలోకి దిగుతావు అనేది రాముడు చూపిస్తాడు. వాడు దుఃఖంలో అన్నీ వదిలేసి ఇక అక్కడే కూర్చున్నట్టుగా వుండదు సమాధి కట్టేసుకోవడంగా వుండదు, గొయ్యి తీసుకుని అందులో పాతేసుకోవడం. అంటే మానవుడుగా మనకి  దుఃఖములు వస్తున్నప్పుడు అవి మనకి తాత్కాలికంగా అశాంతి కలిగిస్తాయి. ఎంత తాత్కాలికం అనేది నీ లోపల ఉండేటువంటి శాంతి యొక్క బలం బట్టి వుంటుంది. శాంతి యొక్క బలం లోపల ఎలా వుంటుంది అంటే నువ్వు అనుసరిస్తున్నటువంటి జీవన విధానంలో సహజత్వం ఎంత వున్నది? దాన్ని బట్టి శాంతి! అసహజత్వం వుంటే శాంతి తగ్గుతుంది. ఒక చెయ్యకూడని పని చేస్తే, ఎవ్వరికీ తెలియకుండా ఒక చెయ్యకూడని పని నేను చేస్తే నాకు అశాంతి, చేస్తే బయటికి నేను మీ అందరితోనూ నవ్వుతూ మాట్లాడుతున్నా, ఎవరికైనా ఎప్పుడైనా

తెలిస్తే నా సంగతి ఏమైపోతుంది అనిపిస్తుంది. బయటవాళ్లెవ్వరూ అశాంతిని ఇవ్వక్కర్లేదు. చేసే పని బాగుండకపోతే, చేసినపని మంచిది కాదని మనకి తెలిసీ ఎదో లాభం కోసం మనం చేసామనుకోండి అది మనని లోపలినుండి భయపెడుతూ వుంటుంది. అందుకని మేడం బ్లావెట్స్కీ ఏం చెప్పారంటే clandestine deals వద్దని. అంటే.. తెలిస్తే ఛీ! అనే పని, తెలియకపోతే చేస్తావా? చేస్తే ఛీ! అంటారండీ. అందుకని తెలియకుండా చెయ్యొచ్చా మనం? చేస్తే ఏమౌతుంది? తెలుస్తుందేమో అన్న భయం. మామూలుగా రోడ్డు మీద వెళ్ళేవాడికి పోలీసు అంటే భయం వుండదు, దొంగకి భయం వుంటుంది కదా! మామూలుగా income tax officer అంటే ఎవ్వరికీ భయం వుండదు, ఎవరికి భయం వుంటుంది అంటే black money holder కి భయం వుంటుంది. automatic గా it comes కదా! సైకిల్ మీద ఇద్దరే ఎక్కాలి అంటే ముగ్గురు ఎక్కేవాడికి ఎక్కువ పోలీసు గుర్తొస్తూ ఉంటాడు. కదా! అంటే అలాగే సృష్టిలో కొన్ని ధర్మములు వున్నాయి. ఆ ధర్మములు అనుసరించనప్పుడు నీకు ఉన్నటువంటి శాంతి అప్రయత్నముగా వెళ్ళిపోతుంది. సృష్టి ధర్మాన్ని మనం అనుసంధానం చేస్తూ మనం జీవిస్తున్నట్లయితే సుఖదుఃఖాలతో సంబంధంలేని శాంతి ఎప్పుడూ వుంటుంది వాడి దగ్గర. అంటే తాత్కాలికంగా కాసేపు అలా అలా అనుకున్నా మళ్ళీ శాంతిలో settle అయిపోతాడు, స్థిరపడిపోతాడు. ఎందుకు settle అయిపోతాడంటే లోపల తనకి తను చేసింది ఏమీ తప్పు లేనప్పుడు అశాంతి రాదు. లోపల తను చేసిన దానిలో తప్పు వుంటే అశాంతి. అది ఎందుకు వస్తుంది అంటే మనం సత్య స్వరూపులం. ఆ సత్యం మాటిమాటికీ అలా గుర్తు చేస్తూ 'అలా చేసావు కదా? అలా చేసావు కదా? అలా చేసావు కదా?' అనిపిస్తుంది. ఎవర్నో మోసం చేసామనుకొండి, వారు కనపడినప్పుడల్లా ఇది గుర్తొస్తుంది. వాణ్ని అప్పుడు ఇలా చేసాం కదా అని. కదా? అంటే శాంతి ఇంకొకడి వల్ల రావడం, ఇంకొకడి వల్ల పోవడం వుండదు. మనబట్టి ఉంటుంది. సుఖదుఃఖాలకి బహిర్గతంగా చాలా కారణాలు ఉండొచ్చుతప్ప శాంతి వరకూ కారణం ఇదే. నువ్వు చేసేదాని బట్టి, నువ్వు చేస్తున్న దానిలో ఉన్న సహజత్వాన్ని బట్టి. కాబట్టి ఈ శాంతి మనకి ఎప్పుడు దక్కుతుంది అంటే ఈ ప్రవాహంలో భాగంగా మనం ఎప్పుడూ ఉన్నట్లయితే అసహజమైనటువంటి సంకల్పములు ఉద్భవించవు. తన క్షేమమూ ఇతరుల క్షేమముతో కూడినటువంటి సంకల్పములే వుంటాయి, ఇతరుల క్షేమంతో సంబంధం లేకుండా తన క్షేమమే

కోరేటటువంటి సంకల్పములు రావు, నిజంగా రోజూ గాయత్రి జరుగుతూవుంటే. మనకి చాలా ఉపకారం జరుగుతుంది. ఏం చేస్తుందంటే పిచ్చి పిచ్చి పిచ్చివన్నీ కాల్చేస్తుంది. కాల్చేసి నీకూ నీ చుట్టూ ఉండేవారికీ, ప్రకృతి ఆమోదించేటువంటి పద్ధతుల్లో వుండే సంకల్పములు మాత్రమే నీ నుంచి వ్యక్తమౌతుంటాయి. వ్యక్తమౌతూ వుంటే జరిగేది ఏమిటి దానివల్ల, దానికి వీర్యం ఏర్పడుతుంది. వీర్యముతో కూడినటువంటి సంకల్పంగా వుంటుంది అది. ఎవరిదీ ఆ వీర్యం? నీది కాదు. సూక్ష్మం నుంచి వస్తుంది అది దాని power. అయిపోయాక ఆ వీర్యం, ఆ ప్రవాహం వస్తుంది, దానికి అడ్డంకులు వుండవు. ప్రవాహంలో ఏదైనా వస్తే కొట్టుకు పోవలసిందే. కదా! మనం ఇవాళ మొదలుపెడితే రేపు ఆపేస్తాం ఏదో ఒక అడ్డంకి వచ్చేసి. అప్పుడు మళ్ళీ ఇక్కడ దీన్ని వదిలేసి ఎక్కడికో పోతాం, ఎవరినైనా consult చేద్దాం, గ్రహాలూ ఎలా వున్నాయో? అవి ఎలా వున్నాయో? ఇవి ఎలా వున్నాయో? వాడంటాడు అసలు ఇప్పుడు కాదు. అంటే మనం మూసేస్తాం. నిజమైనటువంటి సంకల్పానికి అది ప్రవాహంవలే వెళ్తుంది కాబట్టి దేన్నయినా కోసుకుంటూ వెళ్ళిపోతుంది, ఆగదు. ఆగినట్టు కనిపించినా ఆగదు, చావదు. మనం చూస్తూ ఉండగానే మన ముందే చచ్చిపోదు. దానికి శక్తీ తోడు అవుతుంది. దానికి కాంతి ప్రకాశమూ కలుగుతుంది. ఈ నాలుగు నామాలు బాగా ఉచ్చారణ చేసుకోవాలి. "మహాబుద్ధిర్మహావీర్యోమాహాశక్తిర్మహాద్యుతిః" పదహారు అక్షరాలివి. ఈ పదహారు అక్షరాల నామం బాగా స్మరణ చేశాం అనుకోండి, మీకు ఈ link up వస్తుంది. అంటే రకరకాలుగా మన ఋషులు దర్శించి ఇచ్చారు. అందులో ఇదొకటి. This is another గాయత్రి అన్నమాట. మహాబుద్ధిర్మహావీర్యోమాహాశక్తిర్మహాద్యుతిః చేసి ఈ అనుసంధానం మనం చేసుకున్నట్లయితే తెంపు లేకుండా, సృష్టిలో దేనికీ తెంపు లేదు. Cyclical. Its not only cyclical but it is spirallic. అంటే అది గుండ్రంగా తిరుగుతున్నా అక్కడే తిరగదు గానుగెద్దు లాగ, రెండో తిరుగుడు వచ్చేసరికి కొంచెం పైకి వెళ్తుంది. ఇంకో తిరుగుడు వచ్చేసరికీ ఇంకొంచెం పైకి వెళ్తుంది, ఇంకో తిరుగుడు వచ్చేసరికీ ఇంకొంచెం పైకి వెళ్తుంది, అలా వెళ్తుంది. కుండలినీ చైతన్యం పాముచుట్టలా వుంటుంది అంటారు కదా! పాము చుట్ట అంటే ఏమిటి? ఒక చుట్ట మీద ఇంకో చుట్ట వుంటుంది తప్ప, చుట్టలో చుట్ట వుండదు కదా, వుండి అలా ఊర్ధ్వగతికి తీసుకువెళ్తుందన్నమాట. అలా మనం ఆ పద్ధతిలో ప్రయాణం చేస్తున్నప్పుడు బాగా

ఊర్ధ్వగతి చెంది ఋషి మార్గం,లలో మనం కూడా నిలిచి, అంటే దాన్ని మనం ఇవాళ దివ్య ప్రణాళిక లేక Divine Plan అంటారు. అది ఈ భూమి మీద నడుస్తుంది. అందులో భాగమే మనం కూడా జీవించి ఆనందాన్ని పొందుతాం. అది ఈ నాలుగు నామాల యొక్క విశిష్టమైనటువంటి అవగాహన. ఇందులో మనం తెలుసుకోవలసినది మొత్తం వెలుగు ఒకటి వున్నది. దాన్నే 'అదితి' అంటారు. అందులోంచి పుట్టుకొచ్చినవాళ్ళే ఆదిత్యులు అందరూ కూడా. సూర్యులు అందరూ కూడా అదితి నుంచి పుట్టుకొచ్చారు అంటారు. ఒకొక్కళ్ళు ఒక్కో భాషలో చెప్పారు. వాళ్లలోంచి దిగి వచ్చిన వాళ్ళు వాళ్ళ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నువ్వు కూడా అందులోంచే దిగి వచ్చావు. నువ్వు కూడా వాళ్ళలాగా చెయ్యాలంటే వాళ్ళు ఏ కార్యక్రమాన్ని నిర్వర్తించడానికి పూనుకున్నారో, దానిలో భాగంగా నువ్వుకూడా జీవించడమే. వాళ్ళు ఎలా జీవిస్తున్నారో తెలిసి మనం జీవించాలి. అలా మనకి చూపించడానికి దిగి వస్తూ వుంటారు. అలా దిగి వచ్చేవాళ్ళ మార్గం ప్రకారం మనం కూడా వర్తిస్తున్నట్లయితే మన నుంచి ఈ మూడు గుణాలూ కూడా చక్కగా వ్యక్తమౌతాయి. ఏవి? వీర్యము, శక్తి, ప్రకాశము. అవి సహజంగా తెలివికి వున్నటువంటివి. ఎప్పుడైతే ఈ తెలివి సొంతతెలివిగా మారుతుందో ఈ మూడూ తగ్గుతాయి. అంటే వాటికి వేగం తగ్గుతుంది. ఏదైనా చెప్తే అరగంటకి గానీ తట్టదు, చెప్పినప్పుడు అర్థం కాదు, ఆ! అంటూ ఉంటాడు మధ్యమధ్యలో, సగం వినడు. వేగంగా అర్థం చేసుకునేవాడికి, అవతల వాడిక మొదలుపెట్టగానే వీడికి అవగాహన అయిపోతుంది. వేగం వుంటుంది. దాన్ని అవగాహన చేసుకునే శక్తి వుంటుంది. దాన్ని అవతరింపచేసేటువంటి ప్రజ్ఞ వుంటుంది. మొత్తం ప్రకాశవంతంగా ఉంటాడు. కాబట్టి ఇది వెలుగుకు సంబంధించినటువంటి ధ్యానం భగవత్తత్వానికి. ఈ నాలుగూ దర్శించి మనకి నాలుగు నామాలుగా ఇచ్చారు. ఈ నాలుగు నామాలూ, అన్నీ సాధనకు సంబంధించినటువంటివే, అన్నీ సృష్టిలో వున్నాయి, అన్నీ మనలో వున్నాయి. మనలో వున్నవి సృష్టిలో ఉన్నవాటితో link up చెయ్యాలి. అదీ సాధన. అలాగే మనం చెప్పుకుంటున్నాం. ఇదికూడా ఆ విధంగానే చెప్పుకోవడం జరిగింది.

# 185,186,187,188- అనిర్దేశ్యవపుః, శ్రీమాన్, అమేయాత్మా, మహాద్రిధృక్

( ఈ నామాలకు వివరములు సేకరించె ప్రయత్నం జరుగుతున్నది )

## 189 మహేష్వాసః

అంటే భగవంతుని యొక్క విల్లు. ధనుస్సు. భగవంతుడైన మహావిష్ణువు ధనుస్సును 'శారంగము' అని పిలుస్తారు. సృష్టిలో ఈ శారంగము అనే విల్లు చాలా అద్భుతమైనటువంటి రూపంలో, అందమైన రూపంలో, అత్యాశ్చర్యకరమైన రూపంలో విలసిల్లి వుంటుంది అని పెద్దలు చెప్తారు. తన విల్లుగా తానే భగవంతుడు సృష్టిలో వుంటాడు. ఈ భగవంతుడి యొక్క విల్లు అంటే సంధింపబడ్డ శక్తిగా మనం భావన చేసికోవాలి. ఒక విల్లును మనం ఎక్కుపెట్టి వున్నప్పుడు, లేదా వింటిత్రాడు వింటికి ఎక్కించి వున్నప్పుడు, ఆ త్రాడుకుండే పట్టు/tension ఆధారంగా దాన్నుండి మనకి బాణములు వెలువడుతూంటాయి. మొత్తం విల్లు యొక్క కార్యక్రమం ఈ త్రాటి పటుత్వం బట్టి వుంటుంది. అలాగే సృష్టిలో భగవంతుడు శక్తి స్వరూపుడై వున్న కారణంగా, ఈ భగవంతుని శక్తి ఆధారంగా ఈ సృష్టి అంతా పటుత్వం చెంది ఉంటుంది. మనలో ఈ వింటి త్రాడు సహస్రారం నుండి మూలాధారం వరకూ వెన్నెముకలో వున్న సుషుమ్నలో వుంటుంది. అది ఉన్నంత సేపు ఇది ఈ ఆధారంగామన చైతన్యము యొక్క స్రవంతి, శరీరములోని సమస్త భాగములు ఒకదానితో ఒకటి కూడి వుండి, సహకరించి వుండి, అనుసంధానం చెంది వుండి మనం ఉన్నట్లుగా గోచరిస్తుంది. ఎప్పుడైతే ఈ వింటిత్రాడు తీసేస్తామో అప్పుడు వేటికవి విడివడిపోతాయి. ఈ కలిసి వున్న మానవరూపం ఇంక ఆ విధంగా వుండదు. దేనికదిగా విడివడిపోయి మనలో వున్న నీరు, అగ్ని, మట్టి, వాయువు, ఆకాశతత్వము అనే పంచభూతాలు, చుట్టూవున్న పంచభూతాలలో కలిసిపోతాయి. ఇది లీనం కాకుండా వుండడానికి, ఈ లోపల అనుసంధానం చేయబడిన పటుత్వము కలిగిన ప్రజ్ఞను విల్లుగా పెద్దలు చెప్తారు. అలాగే సృష్టిలో భూమిని తీసుకుంటే, భూమి ఇరుసుగా అది పనిచేస్తూంటుంది. అలాగే సూర్యమండలానికి ఒక ఇరుసు వున్నది. అలాగే సృష్టి మొత్తానికి ఒక ఇరుసు వున్నది. భగవంతుని ఈ విల్లుని, శక్తిని 'ఓంకారం' గా చెప్తారు. పెద్దలు దీని ఆధారంగానే సృష్టి అంతా జరిగిందని చెప్తారు. ఓంకారం సంస్కృతంలో రాసిన అక్షరము 'ఓం' తీసుకుంటే, ఒక కనుబొమ్మ మరొక కనుబొమ్మ రెండూ కలిస్తే మధ్యలో నుండి వ్యక్తమైన రేఖగా ఓంకారం కనిపిస్తుంది. మూడు రేఖలు కలిసి వున్నట్టిదే ఓంకారం. ఈ మూడు రేఖలనే నిజంగా భగవంతుని యొక్క ధనుస్సుగా చెప్తారు. ఈ మూడు రేఖలే

భగవంతుని మూడు శక్తులుగా చెప్తారు. ఒకే భగవంతుడు త్రిగుణాత్మకమైన శక్తిగా దిగిరావడం జరుగుతుందని చెప్తారు. దాన్నే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తిగా చెప్తారు. ఈ మూడింటిమీద ఒక చంద్రవంక, దానిపైన ఒక చుక్క. ఇది మొత్తం ఓంకార స్వరూపంగా చెప్పుకుంటాం. ఆ చుక్క చైతన్యమునకు, లేక మనం ఉన్నామనే భావనకు, అలాగే సృష్టిలో భగవత్తత్వము ఆత్మస్వరూపంగా వ్యక్తమవడానికి సంకేతం. ఈ సృష్టి ఏర్పడడానికి, అవ్యక్తుడైన భగవంతుడు వ్యక్తమవడాన్ని ఒక చుక్కగా చెప్తారు. దాన్నే బిందువుగా చెప్తారు. అంతకుముందు ఏమీలేని స్థితిలో ఒక బిందు వేర్పడినప్పుడు దాన్నే 'కేంద్రము' అంటారు. అట్లాగే సృష్టికి కేంద్రమున్నది. అలాగే మనకీ కేంద్రమున్నది. కేంద్రము లేనివాడు ఒక కేంద్రంగా ఏర్పడి అక్కడినుండి పనులు చేయడం మొదలు పెడ్తాడు. మనం కూడా ఏదన్నా కార్యక్రమం చేసుకుందామనుకుంటే ముందు ఒక కేంద్రం ఏర్పరచుకొని అక్కడనుండి కార్యక్రమాలు చేసుకుంటాం. ఆ కేంద్రానికి మనం బద్ధులమై పనులు చేసుకుంటూంటాం. ఒక్కొక్క కార్యక్రమానికి ఒక్కో కేంద్రం. అందుకని దాన్ననుసరించే మనకి మామూలుగా వ్యవహారికంగా ఏమైనా పని చేయదల్చుకుంటే, దాని కేంద్రం ఏదో ముందు చెప్పమంటారు. Registered Office అని. అది కేంద్రంగా మిగిలిన కార్యక్రమాలు జరిగినట్లు. ఆత్మతత్వం అవ్యక్తమైనటువంటిది వ్యక్తమైనప్పుడు బిందువుగా వ్యక్తమౌతుంది. వ్యక్తమైన బిందువులోంచి సంకల్పం వస్తుంది. తననుంచి వ్యక్తమైన సంకల్పాన్ని 'చంద్రవంక' గా చెప్తారు. ఒకటి సూర్యాత్మకమైన ప్రజ్ఞ, ఇంకొకటి చంద్రాత్మకమైన ప్రజ్ఞ అని చెప్తారు. సూర్య చంద్రాత్మకమైన ప్రజ్ఞలు అంటే ప్రకృతి పురుషుల యొక్క విలాసంగా ఓంకారంలోని ఈ మూడు రేఖలు వ్యక్తమౌతాయి. ఇది సంస్కృత భాషలో మనకిచ్చిన ఓంకారం యొక్క స్వరూపం. పెద్దలు దాని అవగాహన ఈ విధంగా తెలిపియున్నారు. దానిలోని చుక్క వ్యక్తమైన భగవత్ చైతన్యము. అవ్యక్తమైన స్థితిలో నుండి వ్యక్తమైన స్థితి. మనం కూడా అలాగే అవ్యక్తమైన స్థితిలోంచి వ్యక్తమవుతూంటాం ప్రతి ఉదయం. వ్యక్తమైన తర్వాత పరిసరముల యందు మనమే ప్రతిబింబిస్తాం. నిద్రలో ఎక్కడ వున్నామో మనకి తెలియదు కదా! నిద్రకవతల మనం ఉన్నామని తెలుసు కానీ ఎలా వున్నామో తెలీదు కదా! నిద్రలోంచి మేల్కొంచినపుడు 'నేనున్నాను' అని తెలియడమే ఈ బిందువు వ్యక్తమవడం. అంతకుముందు నేనున్నాను అనేది వున్నప్పటికీ ఉన్నట్లు తెలియని స్థితి. అంటే

ఎరుకలేని స్థితి అది. ఎరుక కలుగుటమే బిందువు ఏర్పడడం. బిందువు ఏర్పడ్డాక నేనున్నాను అనగానే, అక్కడితో ప్రతిబింబిస్తాం. అంతటితో ఆగం. ఏమని ప్రతిబింబిస్తామంటే ఇవాళ ఇక్కడ నిద్రలేస్తే, విశాఖలో ఇంట్లో వున్నాం అనుకుంటాం. ఇంకోరోజు ఇంకోచోట నిద్రలేస్తే అక్కడ వున్నాం అనుకుంటాం. ఎక్కడ వున్నాను? Where am I? కదా! రోజూ ఒకేచోట నిద్రలేచే వాడికి ఫరవాలేదు కానీ ఒక్కొక్క రోజు ఒక్కొక్క చోట నిద్ర లేచేవాడు లేవగానే ఈరోజు ఎక్కడ నిద్రలేచామో కాస్త ఆలోచిస్తే గానీ తెలియదు. ఒక్కోరోజు ఒక్కో ఊళ్ళో నిద్ర లేచినవాడికి ఓహో ఈరోజు ఈ ఊళ్ళో వున్నాం అన్నట్లుగా ప్రతిబింబిస్తాం మనకున్నట్టి పరిసరాల్లో. అలా భగవంతుడి యొక్క మరియొక ప్రతిరూపమే అమ్మవారు. తను, తననుండి ప్రతిబింబించి నందువలన, అలా ప్రతిబింబించే తత్వం కలదాన్ని చంద్రతత్వం అన్నారు. చంద్రుడు ప్రతిబింబించి, సూర్యుని యొక్క కాంతి భూమిమీద పడేలా చేస్తాడు. అట్లాగే ఆత్మతత్వం ప్రతిబింబించడం అమ్మవారి ద్వారా జరుగుతుంది. అందుకని అక్కడుండే చంద్రవంక అమ్మవారు. మనలో మనం ఎక్కడున్నామో తెలివి ఏర్పడేసరికి మనలోనుండి సంకల్పాలు వస్తుంటాయి. అలావచ్చే సంకల్పాలని 'ఇచ్ఛాశక్తి' అంటారు. వచ్చిన సంకల్పాలని ఏ విధంగా నిర్వర్తించుకోవాలి అనేదాన్ని 'జ్ఞానశక్తి' అంటారు. సంకల్పం సరిగ్గా రాకపోతే ఇహ అక్కడనుండి కార్యక్రమం ఏమీ వుండదు. భగవంతుని యొక్క సంకల్పంలో సరిగ్గా లేకపోవడం వుండదు కాబట్టి దానిలోంచి ఎలా చెయ్యాలి అనే జ్ఞానం పుట్టి, అక్కడనుండి దాన్నట్లా చెయ్యడం అనే 'క్రియాశక్తి' పుడుతుంది. ఈ 5 తత్వాలూ మనలో కూడా వున్నాయి. నేనుగా మేల్కొంచడం, ప్రతిబింబించడము లేక వ్యాపనం చెందడం, చెందిన తర్వాత అందులోంచి రోజూ సంకల్పాలు రావడం. ఏ రోజు పనులు చేయడానికి ఆ రోజు సంకల్పాలు వస్తుంటాయి. సంకల్పాల్లో వుండే పవిత్రతను బట్టి జ్ఞానం భాసిస్తుంది. సంకల్పంలో పవిత్రత లేకపోతే జ్ఞానం వుండదు. అంటే When the will is not pure there can be no more knowhow which can be properly realised. ఎప్పుడైతే సంకల్పంలో పవిత్రత లేదో అప్పుడు జ్ఞానం పరిపూర్ణముగా దొరకదు. జ్ఞానం అంటే Knowhow. How to do? ఎలా చెయ్యాలి అని తెలియడమే! ఏం చెయ్యాలో సంకల్పంగా వస్తుంది. ఎలా చెయ్యాలో జ్ఞానంగా వస్తుంది. సంకల్పంలో పవిత్రత వున్నప్పుడు ఎలా చెయ్యాలో ఆ సంకల్పంలో నుండే అవగాహన వస్తుంది.

పవిత్రమైన సంకల్పం జరిగినపుడు దానికి ప్రకృతి యొక్క సంపద అంతా తోడై వచ్చి, కార్యక్రమం చక్కగా నడుస్తుంది. సంకల్పం స్వార్ధపూరితమైనప్పుడు నీ దగ్గర వున్న సంపద మాత్రమే నీవు వినియోగం చేస్తావు. నలుగురికి పనికివచ్చే పనిని సంకల్పం చేసామనుకోండి, నలుగురికి అన్నచోట ప్రకృతి యొక్క సహకారం వుంటుంది. నాకోసం అని చేసుకున్నామంటే, నీ సహకారమే నీకు వుంటుంది. అందుకే తల పెట్టే పని అందరికీ పనికివచ్చే పద్ధతిలో వుంటే ప్రకృతిలో వుండే సహకారం చుట్టుపక్కల నుండి మనకు పూర్తిగా ఏర్పడుతుందని చెప్పారు పెద్దలు. లేకపోతే resources మనం ఏర్పరచుకోవాలి. మహాత్ముల జీవితాలకీ, మామూలు మనుషుల జీవితాలకీ అదే తేడా.  మహాత్ముల జీవి మొదట చిన్ననది మున్సిపాలిటి పైపు ధారకన్నా చిన్నధారలా మొదలవుతుంది. కానీ నడిచి వెళ్తూంటే దారిలో ఎన్నో చిన్న స్రవంతులు చేరి, ఒక మహానది అయిపోయి సముద్రంలో సంగమిస్తుంది. కాబట్టి సంకల్పంలో పవిత్రత వున్నప్పుడు ప్రకృతి నుండి వనరులు తోడై మన కార్యానికి సిద్ధి కలిగిస్తుంది. సంకల్పము, దాన్ని నిర్వర్తించే జ్ఞానము, దాన్ని నిర్వర్తించే శక్తి ఈ మూడు శక్తులూ ఓంకారంలోని మూడు రేఖలుగా చెప్తారు. ఈ మూడు రేఖలూ మనలో కూడా రెండు కనుబొమలు, మధ్యనున్న vertical గా వున్న  చైతన్యముగా చెప్తారు. అది మనలో వున్నది. అదే సృష్టిలో వున్నది. సృష్టిలో వున్నదే మనలో వున్నది. సృష్టిలో లేనిది మనలో వుండడానికి వీలు లేదు. మనలో ఇది అనుభూతి చెందితే, సృష్టిలో దీన్ని అనుభూతి చెందడానికి వీలుపడుతుంది. ఇందులో క్రియకి సంబంధించినది బహిర్గతమైన ప్రపంచానికి సంబంధించినది. ఎలా చేయాలి అనేది అంతర్గతమైన ప్రపంచానికి సంబంధించినది. సంకల్పం ఈ రెంటికీ అధిష్టానంగా వుంటుంది కాబట్టి భగవంతుడు ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపుడుగా చెప్తారు. ఈ మూడూ ఎవరియందు బాగా పనిచేస్తున్నాయో, వారియందు మూడు కన్నులు చక్కగా పనిచేస్తున్నాయని చెప్తారు. ఎడమకన్ను క్రియాశక్తికి, కుడికన్ను జ్ఞానశక్తికి, మూడవకన్ను సంకల్పశక్తికి సంకేతాలుగా చెప్తారు. ఈ మూడూ ఎక్కడ పనిచేస్తుంటే.. అక్కడ ప్రజ్ఞకు తిరుగుండదు. సిద్ధి పొందడానికి ఏ మాత్రమూ అవరోధాలుండవు. సంకల్పములు పవిత్రీకరణ చేసికొనడం వలన ఏర్పడిన జ్ఞానం ద్వారా క్రియలను నిర్వర్తించడం పెద్దలిచ్చిన ఒక మార్గం. సృష్టిలో ఆ విధంగా జరిగింది. భగవంతుడు  అవ్యక్తమైన స్థితి నుండి వ్యక్తమైన స్థితి లోనికి వచ్చినప్పుడు తననుండి సంకల్పం వచ్చి,

సంకల్పం నుండి జ్ఞానం పుట్టి, ఆ జ్ఞానం నుండి క్రియ పుట్టి, త్రిగుణాత్మకమైన సృష్టి జరుగుతుంది. ఇదే ముగ్గురమ్మలుగా చెప్తారు. ఇదే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తులుగా చెప్తారు. శివుణ్ణి సంకల్పశక్తి గానూ, విష్ణువుని జ్ఞానశక్తి గానూ, బ్రహ్మని క్రియాశక్తి గానూ చెప్తారు. సంకల్పం శివుడు, దాన్నెలా నిర్వర్తించాలో విష్ణువు, దాన్ని నిర్వర్తించేవాడు బ్రహ్మ. అదే పద్ధతిలో అయ్యవారి నుండి వ్యక్తమైన అమ్మవారి ద్వారా సృష్టి ఏర్పడుతుందని కూడా చెప్తారు. ఏం చెప్పినప్పటికీ మూడు శక్తులున్నాయి. మూడు శక్తుల కలయిక ఒకటే. అది భగవత్తత్వం. అవి మూడుగా కనిపిస్తాయి గానీ ఒకటే. మననుండే కదా ఇవన్నీ వ్యక్తమైనవి. మనం ఒకళ్ళు గానే వున్నాము కదా! మననుండి సంకల్పం వ్యక్తమై, దాన్నుండి జ్ఞానం వ్యక్తమై, దాన్నుండి క్రియ వ్యక్తమౌతుంది కదా! మనం ఉండబట్టి ఈ మూడూ వ్యక్తమౌతున్నాయి. మనం ఈ మూడు నుండే పనిచేస్తూంటాం. మన సంకల్పం మనం లేకుండా లేదు. మన సంకల్పం రూపంలో మనమే వుంటాం. మన జ్ఞానం రూపంలో మనమే వుంటాం. మన క్రియ రూపంలో మనమే వుంటాం. ఇట్లా వ్యాప్తి చెందుతూంటాం. అదైపోయాక మళ్ళీ సంకల్పం వస్తుంది. మళ్ళీ ఎలా చేయాలని వుంటుంది. మళ్ళీ అందులో నుండి చేయడం వుంటుంది. అదైపోయాక మళ్ళీ సంకల్పం వస్తుంది. ఇలా సృష్టి కూడా ఏర్పడడం, వృద్ధి పొందడం, అయిపోవడం ఇలా జరుగుతూంటుంది. ఈ మొత్తం అంతా ఎక్కడ  జరుగుతుందంటే, బిందువు ఏర్పడిన తర్వాత, నేనున్నాననే వ్యక్తస్థితి ఏర్పడినపుడు జరుగుతుంది. సృష్టిలో భగవంతుని ఉన్నవాడుగా చెప్తారు. అటువంటి భగవంతుడు సంధానకర్తయై వుంటాడు. సంధించి వుంటుంది భగవంతుని శక్తి. ఈ మూడు శక్తులూ కలిపిన శక్తిని 'ఆదిశక్తి' అంటారు. ఈ ఆదిశక్తి ఆధారంగా ఈ శక్తులు ఏర్పడతాయి. ఈ మూడు శక్తులు ఎవరివద్ద వుంటాయో వారు పరిపూర్ణమైన సిద్ధులై వుంటారు. ఈ మూడింటినీ మూడు అగ్నులుగా పిలుస్తారు. 1. విద్యుదాగ్ని (Electrical fire) 2. సూర్యాగ్ని (Solar fire) 3. పదార్థము లోని అగ్ని (Fire vibration) మనం చూసే మంట, వేడిమి, జ్వాల, వెలుగు. ఇదే సంకేతంగా మనకు రామాయణంలో ఒక కథ కనిపిస్తుంది. సీతాదేవి  వివాహ సమయంలో ఈ ధనుస్సుని తన అధీనంలో వుంచుకోగల ప్రజ్ఞ కలిగిన మహత్తరమైన శక్తి. అందుకే సీతాదేవి శివుని యొక్క ధనుస్సును బంతికోసం ఆకతాయితనంగా handle చేసినట్లుగా కనిపిస్తుంది. ఆమె హస్తముల యందు ఆ పరిపూర్ణమైన ప్రజ్ఞ కలిగివున్నది. విల్లుని ఉపయోగించగల్గిన,

సంధింపగల శక్తి కలిగిన పవిత్రమూర్తి సీతాదేవి. అంతేగానీ కండలుండి ఎక్కుపెట్టడం కాదు. Physical strength కి సంబంధించినది కాదు. బరువులెత్తే వాళ్ళంతా ఎత్తగలిగే విల్లు కాదు. సీతాదేవి ఆ ధనుస్సు handle చేయగలిగిందంటే, త్రిమూర్త్యాత్మకమైన శక్తి ఆమె యందు పరిపూర్ణముగా అవతరణం చెందియున్నదని జనకుడు గ్రహిస్తాడు. ఎందుకంటే జనకుడు పరిపూర్ణమైన యోగి. సహజసమాధి యందు వున్నవాడు, భగవద్గీతలో జగద్గురువైన శ్రీకృష్ణుని చేత నిర్వచింపబడినట్టి వాడు. "నేను చెప్తున్నది నేను చెప్తున్నాననుకోక. జనకుడు కూడా ఇలాగే ప్రవర్తించాడు" అని శ్రీకృష్ణుని చేతే నిర్వచింపబడ్డాడంటే జనకుడెంతటి వాడో అవగాహన చేసికోవాలి. మహర్షులంతా మిథిల వెళ్తూంటారు. శ్రీకృష్ణుడు మిథిల వెళ్ళాడు. శ్రీరాముడు మిథిల వెళ్ళాడు. మిథిల వెళ్ళడమంటే అదొక పెద్ద కార్యక్రమం. 'మిథి' అంటే చిలకబడినటువంటిది. 'మిథిల' అంటే చిలకబడిన దాంట్లో నుండి పుట్టినటువంటిది అని అర్థం. ఏమిటి చిలకబడ్డది అంటే చల్ల చిలికితే వెన్న పడ్డదంటాము కదా! అట్లాగే జీవనసారాన్ని పరిపూర్ణంగా చిలకడం వలన ఏర్పడిన జ్ఞానం కలిగిన రాజ్యాన్ని 'మిథిల' అంటారు. సౌకర్యములు, అసౌకర్యములు, లాభము, నష్టము, జయము, అపజయము దాటి శాశ్వతమైన ఆనందములో ఎప్పుడూ జీవించగలిగిన వారిని మిథిలానగర వాసులు అంటారు. వారి రాజ్యాన్ని విదేహ రాజ్యం అన్నారు. ఎందుకు విదేహం అన్నారు ? వారికి ఈ విధమైన మథనం జరగడం వలన విశిష్టమైన దేహములు ఏర్పడినవి. సాగర మథనం లాంటిది. సాగరమథనంలో మనకి కనిపించేదేమిటి? రాక్షసులు ఎడమకు లాగుతూంటారు. దేవతలు కుడికి లాగుతూంటారు. ఎడమకి లాగడమంటే రాత్రికి సంబంధించిన సృష్టికార్యం చేయడం. కుడికి లాగడమంటే పగలుకు లేదా వెలుగుకు సంబంధించిన సృష్టికార్యం చేయడం. ఇద్దరూ అవసరమే సృష్టిలో. రాత్రి లేనిదే పగలు లేదు. కృష్ణపక్షం లేనిదే శుక్లపక్షం లేదు. అమావాస్య లేని పౌర్ణమి లేదు. కనక రెండూ కావాలి సృష్టిలో. హానివృద్ధు లుంటూంటాయి. ఈ alternating currents ని work out చేసుకుంటూండాలి. మనం ఒక giant wheel ఎక్కామనుకోండి పరిధిలో వున్నది పైనుండి క్రిందకు వస్తుంటుంది. క్రింద నున్నది పైకి వెళ్తూంటుంది. క్రిందకి వస్తూంటాం, పైకి వెళ్తూంటాం. మళ్ళీ క్రిందకి వస్తూంటాం, పైకి వెళ్తూంటాం. ఈ పైకి వెళ్ళడం, క్రిందకి రావడం అనేది జీవితంలో సామాన్య విషయం. ఎవరూ దీనికి exception కాదు. కానీ చక్రభ్రమణంలో

కేంద్రంలో వున్నారనుకోండి. కేంద్రంలో వున్న వాడికి పైకి వెళ్ళడం, క్రిందకి వెళ్ళడం వుండదు. హెచ్చుతగ్గులు, హానివృద్ధులు కేవలం పరిధిలోని వారికి మాత్రమే వుంటాయి. జీవితపు లోతులలో కాక పై పొరలలో మాత్రమే జీవించేవారికి ఓ రోజు బావుంటుంది, ఓ రోజు బావుండదు. కొన్నాళ్ళు బావుంటుంది, కొన్నాళ్ళు బావుండదు. బావుండడం, బావుండక పోవడంగా జీవితం నడుస్తూంటుంది. ఈ రెంటి మధ్య నలిగిపోతుంటారు. కేంద్రంలో వున్న వాడికి ఆ బాధ ఉండదు. తిరుగుతున్న దాన్ని గురించి చూసి ఆనందిస్తూంటాడు. చక్రం చాలా బాగా తిరుగుతోందని గమనిస్తూంటాడు. తన కేంద్రంలో వుండి చక్రం తిరగడాన్ని గమనిస్తూంటాడు. తిరుగుతున్న చక్రానికి అతీతంగా వుండి, తిరుగుతున్న చక్రం యొక్క వైభవాన్ని గమనిస్తూంటాడు. ఈ మొత్తం నుండి absorb అయినటువంటి వాడు లేక తిరోధానమైనటువంటి వాడు లేక వైరాగ్యం పొందినటువంటి వాడు అలా గమనిస్తూంటాడు. మిథిలానగర వాసులంతా అటువంటి వాళ్ళట. అందరికీ శరీరం చల్లగా మజ్జిగలా వుంటే, మిథిలానగర వాసులకు శరీరంలోనే వున్న వెన్న తీయబడి శరీరంపై తేలేపద్ధతిలో అంటే మరియొక దేహంగా విశిష్టమైన దేహాలు పొందినవారు. కనక వీరిని 'విదేహు' లన్నారు. అందుకని విదేహ రాజ్యానికి సంబంధించిన దానికి ముఖ్యపట్టణం మిథిలానగరం. విశిష్టమైన దేహములు కలిగిన వాళ్ళందరూ ఎక్కడుంటారో దాన్ని 'మిథిల' అంటారు. దాన్ని విదేహరాజ్యం అంటారు. దాని ముఖ్యపట్టణం మిథిల. అంటే మథించడం చేత ఏర్పడినటువంటి చైతన్యస్థితి. అటువంటి మిథిలానగరానికి నాయకుడు జనకుడు. అంటే అటువంటి తత్వం పరిపూర్ణంగా వున్న వాళ్ళకి ఆయన అధినేత. శ్రీకృష్ణుడు జనకుడి గురించి చెప్పాడంటే వెనకాల ఇంత కథ వున్నది. విదేహ సామ్రాజ్యం అంటే విశిష్టమైన దేహం కలవారని గుర్తు పెట్టుకోవాలి. ఎందుకు ఏర్పడినాయంటే, మథనం చేత. జీవితంలో తమ్ము తాము మథించుకోవడం చేత, కుడి ఎడమలను దాటి కేంద్రం చేరుకున్నారు. అంటే కుడికన్నుకు, ఎడమకన్నుకు కేంద్రమైన మూడోకన్నుకు చేరుకున్నారన్నమాట. లేకపోతే ఇడ, పింగళ అనే ఎడమ, కుడిగా వున్న స్థితిలో నుండి కేంద్రమైన సుషుమ్న స్థితికి చేరుకున్నారు. అలా చేరుకున్నపుడు ప్రత్యేకమైన దేహం ఏర్పడుతుంది. దాన్ని శాశ్వతమైన దేహంగా చెప్తారు. చిరంజీవులు అని చెప్పబడేవారంతా ఆ దేహాల్లో జీవిస్తూంటారు. అటువంటి జనకుని గూర్చి శ్రీకృష్ణుడు చెప్పడం జరిగింది. ఇదంతా మనం మిథిలానగరం లోని సీతాదేవిని గూర్చి

చెప్పడానికి చెప్పుకున్నాం. అటువంటి మిథిలానగరం లోని జనకునికి మట్టిలో దొరికింది సీత. మిథిలానగరపు మట్టిలో పుట్టినా, పుట్టుకతోనే మథనం పూర్తై పుట్టిన ప్రజ్ఞ! ఎక్కడో పుట్టడం కాదు మిథిలలో పుట్టడం అంటే. మిథిలలో జనకుడు నాగలితో దున్నుతూంటే అందులోంచి వ్యక్తమైనదని కదా చెప్తారు. మనం చూసే స్థూలమైన పదార్థమైన మట్టి లోంచి సూక్ష్మమైన పదార్థం అంటే వెలుగులోంచి పుట్టినటువంటిది. వెలుగే దేహంగా కలిగినటువంటిదైన సీతాదేవికి ధనుస్సును ఎడంచేత్తో ఎత్తడం గానీ, తొయ్యడం గానీ, కదిలించడం గానీ పెద్ద విశేషం కాదు. ఎందుకంటే లోపల మూడు శక్తులూ కేంద్రీకృతమై, సమమైన పద్ధతిలో వ్యక్తమవగలిగిన మహత్తరమైన చైతన్యస్థితిలో వున్నటువంటిది సీతాదేవి. అటువంటి సీతను పెళ్ళి చేసుకోవాలంటే అంత శక్తి కలిగిన పురుషుడే అర్హుడని జనకుడు ఆలోచించాడు. చైతన్యవంతులైన స్త్రీలని, చైతన్యహీనుడైన పురుషుడు వివాహం చేసుకుంటే, అది స్త్రీకి చాలా దుఃఖదాయకం. ఎక్కువ చైతన్యమున్న వారు తక్కువ చైతన్యమున్న వాళ్ళని భర్తలుగా చేసుకోవడానికి వీలులేదు. తనకన్నా ఎక్కువ చైతన్యమున్న వ్యక్తిని వివాహం చేసుకోవడంలోనే స్త్రీకి సుఖము, ఆనందము వుంటుంది. ఈ సుఖము, సౌఖ్యము, ఆనందము భర్తయొక్క ప్రవర్తనము నుండి అందుతుంది, తప్ప భర్తకున్న భోగభాగ్యాల నుండి కాదు. ఋషులకు భోగభాగ్యాలతో సంబంధం లేని ఆనందమైన స్థితి వుంటుంది. అది తాము భార్యలకు ఎప్పుడూ అందిస్తూంటారు కాబట్టి ఋషిపత్నులు కోరికలకు అతీతంగా శాశ్వతమైన ఆనందంలో నిలిచి వుంటారు. అందుకని చైతన్యవంతమైన స్త్రీకి అంతకు మించిన చైతన్యము కలిగిన పురుషుని వెదకి ఇవ్వడం తండ్రి యొక్క బాధ్యత. మనం కూడా ఆడపిల్లకు పెళ్ళి చేసేటప్పుడు చూడవలసినది కుమార్తె కన్నా సంస్కారవంతుడైన లేదా కుమార్తెతో సమానమైన సంస్కారము కలిగిన కుర్రవాడిని చూడాలి. ఒక్కొక్కళ్ళ సంస్కారం ఒక్కోలా వుండి బొత్తిగా కలవని సంస్కారం వుంటే, ఎన్నున్నా ఆనందం వుండదు. అందుకని స్త్రీకి తనకన్నా సంస్కారవంతుడైన పురుషుణ్ణి చూడాలి. కనుకనే మనకు వర్ణాశ్రమ ధర్మాలలో బ్రాహ్మణ స్త్రీ, బ్రాహ్మణునే వివాహం చేసుకోవాలి. క్షత్రియ స్త్రీ, క్షత్రియుణ్ణిగానీ బ్రాహ్మణుణ్ణి గానీ వివాహం చేసుకొనవచ్చు. వైశ్య స్త్రీ వైశ్యుని గాని, క్షత్రియుని గానీ, బ్రాహ్మణుని గానీ వివాహము చేసుకొనవచ్చును. కానీ బ్రాహ్మణ స్త్రీ క్షత్రియుణ్ణి గానీ, వైశ్యుణ్ణి గానీ చేసుకుంటే దుఃఖపడుతుంది అని ధర్మాలలో చెప్పబడినది. బ్రాహ్మణత్వం అంటే

ఎల్లప్పుడూ బ్రహ్మత్వము నందు జీవించేవారని పెద్దలు చెప్పినది. క్షత్రియులంటే క్షాత్రధర్మం కలిగినవారు. ఇతరుల యోగక్షేమం కోసం ప్రాణం సహితం త్యాగం చేయగల్గినవారు. వైశ్యుడు అంటే ప్రకృతి యొక్క సంపదను అందరికీ ఏ విధంగా సద్వినియోగం చేయాలో తెలిసినటువంటి వాడు. కనుక ఇందులో తనకన్నా ఎక్కువ చైతన్యవంతమైన పురుషుణ్ణి స్త్రీ పొందవచ్చు గానీ, ఎక్కువ చైతన్యవంతమైన స్త్రీని పురుషుడు పొందితే అక్కడ సృష్టికి విరుద్ధంగా పనిచేస్తుంది. జనకుడికి ఈ విషయం తెలుసును కాబట్టి ఇదే విల్లును ఎక్కుపెట్టిన వాడికి ఆమెనిచ్చి వివాహం చేస్తానని చెప్తాడు. శివుని యొక్క విల్లుని ధరించగల శక్తి సామర్ధ్యములు కలిగిన చైతన్యమూర్తి సీత గనుక, ఆమెకు సరైన భర్తగా దానిని ధరించేవాడిని ఎన్నుకోవాలనే సంకల్పంతో ఆ విధమైన పరీక్ష పెట్టడం జరుగుతుంది. తమయందు పరిపూర్ణమైన చైతన్య స్ఫూర్తి కలిగినవారు, మరియొకరి/ఎదుటి వ్యక్తియందు చైతన్యస్ఫూర్తిని పరిపూర్ణంగా అవగాహన చేసికొనగలరు. కనుక ఎవరైనా వచ్చి ఆ విల్లు ఎత్తే ప్రయత్నం చేసినపుడు సీతాదేవి చూసి, తనకు తగిన సంస్కారం లేకపోతే ఆమె భ్రుకుటి ముడివేసుకొని వుండేది. ఆమె అలా ఎంతసేపు చూస్తే, అంతసేపూ ఆ విల్లు ఎవరూ ఎత్తలేరు. ఆమె ఎవరొచ్చినా అలాగే చూసేది. అసలు వ్యక్తి అంటే భగవంతుడే అవతారం దాల్చి వచ్చిన రాముడు(మహా విష్ణువుకాబట్టి) విల్లెక్కు పెట్టడానికి వచ్చినపుడు ముందు సీతాదేవి వైపు చూస్తాడు. సంస్కారవంతులు అట్లా వుంటారు. విల్లే కదా అని చెక్కతో చేసింది కాబట్టి, మన దగ్గర బలం వున్నది కాబట్టి మనం ఎత్తేద్దామనుకున్నవాళ్ళు చాలా మూర్ఖమైన స్థితిలో వున్నవాళ్ళు. సీత అనుమతి కోరుతున్నట్లుగా రాముడు సీతను చూసాడు. అంతకుముందే ఈయన ఊళ్ళోకి వస్తున్నప్పుడే చూస్తుంది సీత. చూసినప్పుడే గుర్తిస్తుంది. రాముణ్ణి వివాహం చేసుకుందామని నిర్ణయించుకుంటుంది. విశ్వామిత్రుడు విల్లు ఎక్కు పెట్టడానికి ప్రయత్నించమంటే వెళ్ళి, రాముడు ముందు సీత కనులలోకి చూస్తాడు. సీత కూడా రాముని కనులలోకి చూస్తుంది. సీత యొక్క భ్రుకుటి విడివడుతుంది. విల్లు ఎక్కుపెట్టి సంధిద్దామనుకునేసరికి బెరడు కన్నా తేలిక అయి విరిగిపోతుంది. అదీ అక్కడి రహస్యం. సంపూర్ణంగా సీత తనను తాను రామునికి సమర్పించుకుంటుంది. అందువల్ల అక్కడ అప్పుడు ఆ విల్లు భేదింపబడడం జరుగుతుంది. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే, మనలో వున్న మూడు శక్తులూ కూడా ఈ మూడు కేంద్రములుగా అంటే ఆజ్ఞ, కుడి, ఎడమ

కన్నులుగా ప్రసారమౌతూంటుంది. ఎక్కు పెట్టడం అంటే ఇక్కడనుండి ఈ బాణం పైకివెళ్తే, ఇహ పైన వున్న పరమాత్మని సహస్రారంలో సమీపించి, ఆయన యందు మనం లయమవడమే జరుగుతుంది. ఈ విల్లు కధ ఇంత వున్నది. ఈ విల్లు కారణంగానే మొత్తం అంతా పట్టి వుంచబడుతుంది. అదే ''మహేష్వాసో'' అంటే.

## ౧౯౦ మహీభర్తా

మహి అంటే భూమికి భర్త. మన శరీరం మనకి భూమి. మన భూమి మన శరీరం. ఈ భూగోళం మీద వున్న పదార్ధము భూమి. ఈ భూగోళానికి కూడా దాని చైతన్యము ఇరుసు లోపల వున్నది. మనలో సుషుమ్నలో వున్నట్లుగా. అలా భూమికి వున్న ఇరుసులో చైతన్యము ఆధారంగా ఈ చుట్టూ మట్టి  అల్లుకొని వున్నది. ఆ చైతన్యము కనక విడిపోతే ఇవన్నీ వేటికవి విడిపోతాయి. చైతన్యము మాయమైతే దేనికది విడిపోతుంది. మనలో కూడా చైతన్యము సుషుమ్నలో వున్నట్టిది, వెన్నెముకలో నున్న చైతన్యము ఏ రోజు ఇక్కడ నుండి అదృశ్యమౌతుందో, ఆ రోజు దేహంలో వుండేవన్నీ ఒకదానితో ఒకటి సహకరించడం గానీ, కలిసి పనిచేయడం గానీ, ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది వుండడం గానీ వుండదు. వేటికవి పడిపోతాయి. వాటన్నిటికీ మళ్ళీ జీవితాలున్నాయి. మనం వెళ్ళిపోయినంత మాత్రాన అన్నీ చచ్చిపోవు వెంఠనే. నెమ్మది నెమ్మదిగా వాటి span ప్రకారం చచ్చిపోతాయి. Liver, it takes its own time. గుండె it takes its own time, కన్ను  it takes its own time. నెమ్మదిగా పంచభూతాలు విడివడిపోతాయి. అందుకే ఎవరైనా వెళ్ళిపోయిన వారి యొక్క దేహంలోని భాగాలు తీసి ఇంకొళ్ళకి వాడవచ్చు. ఎందుకంటే వాటిలో ఇంకా ప్రాణం వుంటుంది. అందులోంచి కూడా విడివడిపోయే లోగా అది కూడా రూపమే కాబట్టి వాటిని మనం వాడవచ్చు. మనం వెళ్ళిపోయిన తర్వాత ఇవన్నీ విడివడిపోతాయి. ఎలాగైతే నాయకుడు గానీ, రాజుగానీ లేకపోతే ప్రజలు విడిపోతారో, కుటుంబ పెద్ద లేనప్పుడు కుటుంబం ఏ విధంగా విడిపోతుందో అలాగే సృష్టికి యజమాని లేనప్పుడు,  సృష్టిలోనివి కూడా నెమ్మదిగా అదృశ్యమైపోతాయి. మన విషయంలో కూడా అంతే. అన్ని రూపాల విషయంలోనూ అంతే. ఆ చైతన్యం ఎంత సేపు లోపల వుంటే అంత సేపు అన్నీ పట్టివుంటాయి. ఆయన కేంద్రముగా ఇవన్నీ ఆయన చుట్టూ వుంటాయి. ఇన్నిరకములైన అణువులు కలిసి మనకి పదార్థంగా,  భూమిగా ఏర్పడియున్నది.  దానికి బలమేమిటి అంటే లోపల 'నేనున్నాను' అనే చైతన్యము. మనం అంతా నేనున్నాను అని ఎలా అనుకుంటామో, భూమి చైతన్యము కూడా నేనున్నాను అని అలాగే అనుకుంటుంది. ఈ 'నేను' గా తనే ఏర్పడి, ఒక్కొక్క నేనుగా ఈ గోళాలన్నీ ఏర్పరచి, ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి వుంటాడు.

చూడండి భూమిమీద ఇన్ని రకాలైన పదార్ధములు, ఖనిజములు, వృక్షములు, జంతువులు, మనుషులు. మనం అంతా అంటిపెట్టుకొని వున్నాము కదా! ఏమిటి బలం? పడిపోకుండా వున్నాం కదా! నిజానికి ఆస్ట్రేలియాలో వుండేవాడు క్రిందకి పడిపోవాలి. భూమధ్యరేఖకి క్రింద వుండేవారంతా ఆ గోళానికి రెండవ భాగంలో, క్రింద భాగంలో వున్నారు కదా! ఎలా అంటిపెట్టుకొని వున్నారు? పడిపోవాలి కదా! దాన్ని దాన్ని 'భూమ్యాకర్షణ శక్తి' అని చెప్తారు. అదేకాక సూర్యుని ఆకర్షణశక్తి కూడా వుండడం వలన భూమికి అంటుకుపోయి వున్నాం. మన తల సూర్యుడి యొక్క ప్రజ్ఞతోను, మన మూలాధారం భూమి యొక్క ప్రజ్ఞతోనూ అనుసంధానం చెందియుండడం వలన సూర్యుడికి, భూమికి మధ్య నిలబడివున్నాం. పూర్తిగా ఉత్త భూమికే అంకితమై వుంటే పడుకొని వుండేవాళ్ళం. ఈ ఆకర్షణశక్తినే 'ప్రేమ' అంటారు. భగవంతుని ప్రేమ యొక్క బలం ఆధారంగా ఇవన్నీ కలిసి వున్నాయంటారు. ఈ భగవంతుని యొక్క ఆకర్షణశక్తి అటు సూర్యునిలోనూ వున్నది. సూర్యుని నుండి ఏర్పడిన గోళములలోనూ వున్నది. సూర్యుని నుండి ఏర్పడిన జీవులందరిలోనూ వున్నది. మనలో కూడా అది ప్రేమతత్వంగా వుండబట్టి, ఇవన్నీ కలిసివున్నాయి. మనలో ప్రేమ బాగా వుంటే, మనచుట్టూ ఎక్కువమంది వుంటారు కదా! ఏ కారణం లేకుండా ఒక వ్యక్తి చుట్టూ ఎక్కువమంది చేరుతూంటారు. ఎంచేత? ఆయన చూపే ప్రేమ అనే ఆకర్షణ. ప్రేమ అనండీ, ఆకర్షణ అనండీ రెండూ ఒకటే. ఒక అయస్కాంతం చుట్టూ బాగా గుండుసూదులు పడేసామనుకోండి. అట్టా అంటిపెట్టుకొని వుంటాయి. ఎంత సేపు అంటిపెట్టుకొని వుంటాయంటే, అయస్కాంతం వున్నంతసేపూ అంటి పెట్టుకొని వుంటాయి. అంటే అయస్కాంతత్వము వున్నంతసేపూ అన్నీ కలిసివున్నాయి కదా! ఆ తత్వం అదృశ్యమైనప్పుడు వేటికవే పడిపోతాయి. అలా మొత్తం సృష్టిలో చీమనుండి మనిషి వరకు, మనిషి నుండి భూగోళం వరకు, భూగోళం నుండి సూర్యమండలం వరకు అలా కలిసివున్నాయి. సౌరకుటుంబంలో సూర్యుడి ఆధారంగా, కేంద్రంగా ఈ గోళాలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది, వాటివాటి పరిధులలో తిరుగుతూ వున్నాయి. మనకు హృదయం కేంద్రమైనట్లే, సౌరకుటుంబానికి కేంద్రంగా సూర్యుడుండగా చోటులో గోళాలన్నీ అలా suspend అయినట్లున్నాయి. కానీ వాటన్నిటినీ భరించే తత్వాన్ని "మహీభర్తా" అన్నారు. సూర్యుడు కూడ తనకన్నా పెద్ద సూర్యుడి చుట్టూ ఆ విధంగా ఆకర్షింపబడి తిరుగుతూంటాడు. ఎలా

వుంటుందంటే మనకన్నా పెద్దవాళ్ళ వైపు మనం ఆకర్షింపబడి వాళ్ళచుట్టూ తిరుగుతూంటాం. వాళ్ళేం చేస్తారూ, వాళ్ళకన్నా పెద్దవాళ్ళ చుట్టూ తిరుగుతూంటారు. Councillors M.L.A.ల చుట్టూ తిరుగుతూంటే, M.L.A.లు Ministers చుట్టూ తిరుగుతూంటే, Ministers Chief Ministers చుట్టూ, Chief Ministers Prime Minister చుట్టూ తిరుగుతూంటే, Prime minister అక్కడికీ ఇక్కడికీ ఎక్కడ పని ఉంటే అక్కడకి తిరుగుతూంటాడు. అట్లా power basis అది. ఎక్కడ ఎక్కువ power అనగా శక్తి వుంటుందో, అక్కడికే అందరూ ఎక్కువగా ఆకర్షితు లవుతూంటారు. అలాగే ప్రేమ మనకన్నా మన భూమికి, మన భూమికన్నా శుక్రుడికి, శుక్రుడికన్నా బుధుడికి, బుధుడికన్నా సూర్యుడికి ఎక్కువ. బుధగ్రహానికి ఇది ఎక్కువగా వుండడం వలన సూర్యుడికి దగ్గరగా వుంటుంది. సూర్యుడికన్నా పైన వున్న సవితృ కేంద్రమునకు చుట్టూ సూర్యుడు తిరుగుతూంటాడు. కనుక ఒకరితో ఒకరు, ఒకరితో ఒకరు ఇలా అనుసంధానం చేసికొంటే ముత్తాత, తాత, కొడుకు, మునిమనుమడు ఇలా నలుగురుంటారు కదా! వీళ్ళందరూ కలిసి తిరుగుతున్నారన్న మాట! వీటన్నిటిలోనూ భగవంతుని యొక్క అయస్కాంతశక్తి, వింటికి సంధించిన అల్లెత్రాడులాగ పట్టివుంచి పనిచేస్తూంటుంది. ఆ శక్తి కారణంగా ఇవన్నీ అలా ముద్ద కట్టుకొని వుంటాయి. బయట్నుండి తీసుకొచ్చి అతికించినవి కావివి. లోపలనుండి వ్యక్తమైనటువంటివి. తమనుండి బయటకు వ్యక్తమైనవి తప్ప గోళాలు, ఒక్కొక్క గోళాల్లోనూ నాలుగు అణువులు కలిపి పెట్టినవి కావు. అంటే నాలుగు ఆకులు మనం ఆకులు కత్తిరించి ఫ్లవర్ వాజ్ లో పెట్టినదానికీ, సహజంగా నాలుగు ఆకులు కలిసివున్న దానికీ తేడా ఏమిటంటే, వుంటుంది. వాజ్ లో దానికి పట్టివుంచడం వుంటుంది. రెండవ దానికి సహజత్వం వుంటుంది, చాలా కాలం ఉంటుంది. అందుకని మనచుట్టూ వున్నవారు, వారియందు మనకుండే ప్రేమను బట్టి మన మాట వింటారు తప్ప, మనం వారియందు చూపించే అధికారం బట్టి వినరు. ఈ రోజుల్లో అందరికీ పెద్ద బాధ ఏమిటంటే, వాళ్ళ పిల్లలు వాళ్ళ మాట వినరు. వాళ్ళ తల్లితండ్రుల మాట వాళ్ళు వినరు. సోదరులు ఒకరి మాట ఇంకొకరు వినరు. ఎందుకు వినరయ్యా అంటే ప్రేమ తగ్గడం వలన. ఇన్నింటిలోనూ వుండేది ఒకే రకమైన తత్వం తనే అని తెలిసినప్పుడు ప్రేమ సహజంగా వ్యక్తమౌతుంది. ప్రేమించుట వేరు, ప్రేమ వ్యక్తం కావడం వేరు. ప్రేమించేవాడు తనకుండే భావాన్ని బట్టి ప్రేమిస్తాడు. ఇవాళ ప్రేమించిన యువతిని 4 సంవత్సరాల తర్వాత

తిడ్తూంటాడు. పెళ్ళి చేసుకున్నప్పుడు చాలా ప్రేమిస్తాడు. 4 సంవత్సరాల తర్వాత తిట్టుకుంటూంటారు, కొట్టుకుంటూంటారు. ఎందుకిది? అక్కడ ప్రేమ వ్యక్తిగతమే తప్ప, సహజంగా వ్యక్తమైన ప్రేమ కాదు. అందుకే ప్రేమించు, ప్రేమించు అనే సిద్ధాంతాలన్నీ కూడా పూర్తిగా అవగాహన లేని సిద్ధాంతాలు. ప్రేమించడం సహజంగా ఎక్కడ ఏర్పడుతుందంటే నేను, ఇంకొకడు ఒకటే అని తెలిసినప్పుడే ఏర్పడుతుంది. తను, తన కొడుకు ఒకరే అనుకుంటాడు. కనుక ప్రేమిస్తాడు. నిజానికి సత్యం అది. తన మాట వినకపోయేసరికి కొడుకూ, తనూ ఒకటి కాదనుకుంటాడు. ఒకటి అనుకోవడం, ఒకటి కాదనుకోవడం భావములను బట్టి వుంటుంది. భావము యొక్క ఏకత్వమును బట్టి ఒకటి అనుకోవడం, భావముల యొక్క వివిధత్వమును బట్టి ఒకటి కాదనుకోవడం అవివేకము. భావము యొక్క అతీతమైన చైతన్యస్థితిలో మనమందరమూ ఒకటే. భావములు కారణముగా స్వభావములు వేరుగా వుంటాయి. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క రకమైన భావముల యొక్క కూడిక, సముదాయము వుంటుంది. దాన్నిబట్టి వారి యొక్క ప్రవర్తనముంటుంది. ఎవరి భావమును బట్టి వారు ప్రవర్తిస్తారు. భావమునకు అతీతమైన చైతన్యము అందరిలోనూ ఒకటే అని తెలిసినపుడు, భావాతీతుడైనవాడు ప్రతివాడు లోనూ వున్నాడు కాబట్టి, ఆ భావాతీతుణ్ణి మనం ప్రేమిస్తూంటే, భావములతో సంబంధంలేని విధంగా ప్రేమించవచ్చు. మన మాట వినేవాణ్ణి ప్రేమించి, మాట వినినివాణ్ణి ప్రేమించకపోవడం సామాన్యం. మాట వినినివాడు, మాట వినేవాడు రూపంలో వున్న చైతన్యమున్నదే, దానిని ప్రేమించడం అసామాన్యం. అలా ప్రేమించేవారి చుట్టూ చేరుతూంటారు. అప్పుడు వారి మాట వినని వారుండరు. ఎందుకంటే వారిలో ప్రేమ సహజంగా వ్యక్తమౌతుంది. తననే చూస్తాడు. అందరిలోనూ. చైతన్యమూర్తిగా, చైతన్య స్వరూపముగా, చైతన్యముగా తననే ఇతరుల యందు దర్శిస్తూంటాడు కాబట్టి ఇతరులు కన్పించరు. ఇహ అక్కణ్ణుండి వాడి భావములుంటాయే అవీ, తానూ ఒకటి కాదు. కాబట్టి భావములకు కేంద్రము, ఆధారము అయిన చైతన్యముతో అనుసంధానము చెంది వుండేవాడి నుండి ప్రేమ సహజంగా వ్యక్తమవుతుంది. మంచి చెడుల వల్ల వ్యక్తం చేయడం వుండదు. అయస్కాంతం ఇది చెడ్డ పిన్నీసు, ఇది మంచి పిన్నీసు అనుకోదు. రెంటిలోనూ అయస్కాంతం చేత ఆకర్షింపబడే తత్వం వున్నది. అయస్కాంతీకరింపబడే తత్వం ఈ అయస్కాంతము లోనూ, ఈ గుండుసూది

లోనూ కూడా వున్నది. కాబట్టి ఏదైనా సరే ఇనుమైతే చాలు ఆకర్షిస్తుంది. అలాగే ఏదైనా సరే చైతన్యవంతమైనది అయితే చాలు ఆకర్షిస్తారు మహాత్ములు ఆ విధంగా. పెద్ద పెద్ద క్రూరమృగాలని ఆకర్షించి, వాటికి శాంతినిచ్చే సందర్భాలు కనిపిస్తాయి. పులిని శాంతపరచిన వారున్నారు. ఏనుగును శాంతపరచిన వారున్నారు. అలా వారు ప్రేమను సహజంగా వ్యక్తపరుస్తారు. ప్రేమించడం వుండదు. కనుక భగవంతుని యొక్క ప్రేమ సృష్టిలోని ఇన్ని గోళాలని సహజంగా పట్టి వుంచింది. పట్టుకొని కూర్చోవాలంటే ఎంతకాలం కూర్చుంటారు? అందుకే తుమ్మితే ఊడేముక్కు ఎంతకాలం వుంటుందని సామెత చెప్తారు. దగ్గు వస్తూంటుంది, జలుబు వస్తూంటుంది. అప్పుడప్పుడు తుమ్మక తప్పదు. తుమ్మొస్తే ఎలాగండి ముక్కు ఊడిపోతుందంటే కష్టం. మనచుట్టూ వుండేవారు ఎప్పుడు మనని వదిలేసి వెళ్ళిపోతారో అని వాళ్ళు కలిసి వుండగానే వీళ్ళు వదిలేసి వెళ్ళిపోవడం నీకు వారియందు వుండే ప్రేమ ఆధారంగా తప్ప, ఇంకోటి కాదు. ఆ ప్రేమకి కేంద్రమైన దానితో మనం కలిసి వున్నట్లైతే ఎంతదూరం పోయినా తెంపుకుపోరు. అది సృష్టిలో భగవంతుడు చూపించే ప్రక్రియ. సూర్యుడికి, భూమికి ఎంత దూరమున్నది? సూర్యుడి చుట్టూనే తిరుగుతోంది కదా! అంటే దూరంగా వుండే కొడుకు మనల్ని మర్చిపోతాడేమోనని అనుకోడానికి అవకాశం లేదు కదా! సూర్యుణ్ణి, భూమినీ చూస్తున్నప్పుడు. దగ్గరలో కూర్చోపెట్టుకుంటే మన మాట వింటాడు. దూరాన్నుంటే వినడు అని ఉండదింక. ఎందుకంటే దూరాలూ, దగ్గరలూ ఉండవింక. ఈ "మహీభర్తా" అనే నామంలో అంత మహోన్నతమైన, బాగా వ్యాప్తి చెందిన అవగాహన వున్నది. ఈ మొత్తం సృష్టిలో చిన్నదాని దగ్గరనుండి పెద్దదాని వరకు పట్టి వుంచినదే "మహీభర్తా". కనుక "మహేష్వాసో" మహేష్వాసమైన శక్తి కారణంగా, "మహీభర్తా" వీటన్నిటినీ ధరించి యున్నాడు. ధరించి యుండడం వేరు, పట్టుకొని యుండడం వేరు. ధరించి యున్నప్పుడు ధరించి యున్నామన్న భావన వుండదు. మామూలుగా బజారులో తిరుగుతున్నప్పుడు చొక్కాలాగు వేసుకున్నామని గుర్తుంటుందా? ఉండదు కదా! ఇంట్లో వున్నప్పుడు చొక్కాలాగు వేసుకోలేదనుకోండి. బాత్రూమ్ లో వున్నామనుకోండి. అసలేం వేసుకోం కదా! కానీ గుర్తుపెట్టుకోండి. బొత్తిగా మొత్తం తీసేసి స్నానం చేయవద్దని ఏదో ఒక గుడ్డ కట్టుకోమని చెప్తారు మన సాంప్రదాయంలో. అది మన భారతీయ సంస్కారానికి సంబంధించినది. దానివల్ల ఆరోగ్యమైనవి చాలా ఏర్పడుతాయి. అది ప్రక్కన వుంచి,

నగ్నంగా వున్నాం అనే స్థితి నుండి మనం బట్టలు వేసుకున్నప్పుడు, నడిచి వెళ్తున్నప్పుడు మనమూ, మన బట్టలూ నడిచివెళ్తున్నాం అనుకోం కదా! ఎందుకనుకోమూ? మనం ధరించి వున్నాం కాబట్టి. మనలో భాగమై వుంటుంది. ఇంటికి కూరలు తెచ్చుకున్నాం. తెచ్చినప్పుడు కూరల సంచీ మోస్తున్నట్లుంటుంది. ఆ కూరలు వండి తినేసాం. తిని నడుస్తున్నా మనుకోండి. మనమూ, మన కూరలూ నడుస్తున్నాం అనుకుంటామా? అంతకుముందు కూరలు మోస్తున్నాం. ఇంటికి వచ్చాక వండుకు తిన్నాం. ఓ బస్తా బియ్యం మోయాలంటే చాలా కష్టం. ఓ నెల్రోజుల్లో తినేస్తాం. కానీ తిని నడుస్తున్నప్పుడు మనమే వుంటాం అనుకుంటాం తప్ప ఇవాళ మధ్యాహ్నం తిన్న అన్నం, సాంబారు, కూర, పచ్చడి, మజ్జిగ, మంచినీళ్ళు ఇవన్నీ కలిపి నడుస్తున్నాం అనుకోం కదా! తిన్నాక అవి మనలో భాగమై పోయినాయి. అట్లాగే మన ఒంటిమీద వేసుకున్న బట్టల గురించి ఎవరైనా గుర్తుచేస్తే గుర్తొస్తుంది తప్ప మాటిమాటికీ బట్టలు వేసుకున్నాం అని ఎలా గుర్తుంటుంది? వేసుకోకపోతే గుర్తుంటుంది, అలవాటు బట్టి కదా! ధరించి వున్నాననే భావన లేకుండా మహిని ధరించి వున్నాడు, ''మహీభర్తా''. ధరించి ఉండడము అంటే ''మహీభర్తా'' అన్నమాట. అయస్కాంతమైనా అంతే. ఈ గుండుసూదిని ఎన్నాళ్ళు మోయాలి అన్నట్లుండదు. ఆ విధంగా సంసారమును ధరించినవాడు భర్త, మహీభర్త. సంసారాన్ని పోషించడానికే కదా మనం పనికి వెళ్ళాలి. లేకపోతే వెళ్ళనక్కరలేదు కదా అంటే వాడు భర్త కింద లెక్క కాదు. ఇంకో పేరు పెట్టాల్సిందే వాడికి. భర్త అనే పేరు పెట్టడానికి వీల్లేదు. సంసారమును ధరించి వుండాలి. అలాగే భార్య కూడా సంసారమును ధరించి వుంటుంది. ఇవన్నీ ఆనందముగా చేసుకుంటూండాలి తప్ప ఇట్లా చేస్తున్నాను అని మాటిమాటికీ చెప్తున్నాడు అనుకోండి, అంటే చేస్తున్నాను అనే feelings లో వున్నాడన్నమాట. ఆ భావంలో వున్నాడు కాబట్టి ఆ ఆనందం వాడికి దక్కదు. ఇప్పుడు మా అబ్బాయి నా కారేసుకొని వెళ్ళిపోతాడనుకోండి. నేను కారు కొనుక్కుంటే. వీడేసుకొని వెళ్ళిపోతున్నాడు అని బాధపడితే, ఇంక అనవసరం భర్తగా ఉండడం. ఏడ్చేవాడు భర్త కాడు. భావనల యొక్క పొరలయందు జీవించేవాడు భర్త అవడు. ఎవరు భర్త అవుతాడంటే, ఇవన్నీ ధరిస్తూ ధరిస్తున్నాననే గుర్తు లేనటువంటివాడు భర్త అవుతాడు. అంటే ఆనందమయమైన స్థితిలో వుండేవాడు భర్త, ధర్త అవుతాడు. అదీ ధారణ. ఇక్కడ ఈ మొత్తం సృష్టిని ఆ విధంగా ధరించియున్నాడు భగవంతుడు.

మన సృష్టి వరకు మనం ఏమాత్రం వుండగలమో చూడండి. మన సృష్టి ముందు మన శరీరం. మన శరీరం కూడా ముందు మన భావనలను బట్టి ఏర్పడుతుంది. కొంతమందికి ఆరోగ్యమైన శరీరం, కొంతమందికి అనారోగ్యమైన శరీరం ఎందుకొచ్చినదంటే ఆరోగ్యకరమైన భావములు, అనారోగ్యకరమైన భావములు వుండడం వలన. జీవితంలో సన్నివేశాలు బరువుగా వున్నాయంటే భావం బరువుగా వున్నట్లు. కనుక మన జీవితంలో మన యొక్క ధారణ, మన కుటుంబం యొక్క ధారణ కాక స్నేహితులు, బంధువులు, ఇంట్లోవాళ్ళు, బయటవాళ్ళు అందర్నీ ధరిస్తున్నారనుకోండి. మహాత్ములు చేసేది అదేకదా! తనొక్కడే ఎంతోమందికి భర్తగా వుంటాడు. అంటే ఏమిటంటే అతనిలో వున్న ఆకర్షణశక్తి ఈ మూడు శక్తులుగా పనిచేస్తుంది. అంటే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తిగా పనిచేస్తుంది. కనుక "మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః". వాడు శ్రీనివాసుడు.

## 191 శ్రీనివాసః

నామాలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానం కలిగివుంటాయి. ముందు శ్లోకంలో "శ్రీమాన్" అని చెప్పాం. అంటే శ్రీకి ఆధారభూతుడు అని చెప్పాం. ఇక్కడ శ్రీనివాసుడు. శ్రీనివాసుడు అంటే రెండు అర్థాలు సంస్కృతంలో. సంస్కృతము చాలా ఉత్తమమైన భాష. ఒకే పదంతో అనేక రకాల భావములను అందిస్తుంది. ఒక మాట మాట్లాడితే వెయ్యి మాటలు మాట్లాడినంత ధ్వని వినపడ్తే, చక్కగా మాట్లాడినట్లు లెక్క. వెయ్యి మాటలు మాట్లాడితే, ఒక్క మాట మీకు అందిందనుకోండి. చెత్తగా మాట్లాడినట్లు లెక్క. మహాత్ములు ఒక్క మాట మాట్లాడి, జన్మ తరించేట్లుగా చేస్తారు. చేతగాని వాళ్ళు వెయ్యి మాటలు మాట్లాడి ఏమీ అర్థం కాకుండా చేస్తారు. "శ్రీనివాసః" అంటే శ్రీ యందు నివసించేవాడు. శ్రీకి నివాసమైనవాడు. తాను సృష్టి యందు నివసించి వున్నాడు. ఉండబట్టే కదా జరుగుతున్నాయి. ఇవన్నీ ధరించి వున్నాడు కాబట్టి, దానియందు తనున్నాడు కాబట్టి ఇది ధరిత్రి అయినది. చొక్కా ధరించి వున్నామంటే, చొక్కాలో మనమున్నామనే కదా! దేన్ని ధరించి వున్నాడో, దానియందు తను ఉన్నాడు. శ్రీ యందు నివసిస్తున్నట్టి వాడు శ్రీనివాసుడు. ఇది ఒక అర్థం. శ్రీకి నివాసమైనటువంటి వాడు శ్రీనివాసుడు. ఇది రెండవ అర్థం. శ్రీకి నివాసమైనవాడు వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసుడు అని మనం అనుకుంటూంటాం. వేంకటేశ్వరస్వామి హృదయంలో శ్రీ వున్నది. శ్రీనివాసుని వక్ష స్థలంలో వున్నది కదా! అంతేకాదు స్త్రీ యందు కూడా తను వున్నాడు. ఆ స్థితి కాళి, భవతారిణి మొదలగునవి. ఆయన ఆధారంగా తను నిలబడి వుంటుంది. తను నిలబడి వుంటే ఆయన యందు ఆమె వుంటుంది. రెండూ వున్నాయి. మనం ఉండబట్టి శరీరమున్నది. ఈ శరీరముండడానికి, ఈ నివాసం కల్పించడానికి ఆధారంగా మనం వుంటాం. కాళి ఎక్కువ పదార్థంగానూ, శివుడు పడుకున్నట్లుగానూ వుంటుంది. అది ఒక సాధన. అంటే పదార్థంలో వుండే శివుణ్ణి చూడమని. కాళీ విన్యాసాలు అంటే, భయంకరమైనటువంటి విన్యాసాలలో కూడా శివుణ్ణి చూడమని. అంటే ముందు అంతా పదార్థాన్ని చూస్తాడు సాధకుడు. కాళీ గుడికి వెళ్తే మనకి శివుడు కన్పించడు. అంతా కాళీయే కనిపిస్తుంది. ఎందుకంటే శివుడు నిద్రించి వున్నాడు. ప్రకృతి తత్వంలో, సృష్టి తత్వంలో చైతన్యం నిద్రించి వున్న స్థితి. ఇది ఒకటి. ఒకటో తరగతి. రెండవ తరగతిలో ప్రకృతి, పురుషుణ్ణి తన చంకలో

వేసుకుంటుంది. యశోదాకృష్ణ symbol. లేకపోతే Child Jesus and Mary అంటారు వాళ్ళు. ఇక్కడదే అదీను. ఇక్కడ మనం చెప్పేదే అక్కడదిగా చెప్తున్నారు. మనకి వున్న సంకేతమది. అంటే చైతన్యవంతుడవుతూంటే ప్రకృతి దగ్గరకు, ఒళ్ళోకి తీసుకుంటుంది. తన యొక్క ఆశీర్వచనము, అనుగ్రహము ఇస్తుంది. తన సమస్తమూ వాడికిస్తుంది. తల్లేం చేస్తుంది? సమస్తమూ పిల్లవాడికిస్తుంది, కొంచెం కూడా తనకు చూసుకోకుండా. వీడు గుండెల మీద తంతూంటాడు. శిశువు తల్లి రొమ్ము మీద తన్నినా, 'నాతండ్రే! ఎంత బాగా తన్నావో' అంటుంది. ఎక్కణ్ణుంచి వస్తుంది ఆమె వద్ద అంత సహజమైన ప్రేమ? అది ఆధారంగా వీడు పెరుగుతూంటాడు. పెరిగి పెద్దయ్యాక స్త్రీ, భార్య అవుతుంది. అంటే You have grown in your conscious. నీ చైతన్యము లోనికి నువ్వెంత పెరిగావంటే, ఆమెతో సరిసమానమైన పురుషుడిగా నువ్వెదిగావు. ఇది మూడవ స్థితి. అంతకు ముందు తల్లిగా నిన్నాదరించింది. ఇపుడు భార్యగా నిన్నాదరించడమే కాకుండా, ఇంకా 5 dimensions చూపిస్తుంది. మొత్తం 6 రకములైన ధర్మములు భార్య, భర్తయందు చూపిస్తుంది. "కార్యేషు దాసి, కరణేషు మంత్రి". సలహా లిస్తూంటుంది. నువ్వు చెప్పిన మాట వింటూంటుంది. అమ్మంటే అమ్మ చెప్పినమాట నువ్వు వినాలి. అమ్మలా భోజనం పెడ్తుంది. అన్నీ చేస్తుంది. అంటే తల్లి నుండి, చైతన్యస్థితి లోనికి పెరిగేసరికి అంతకు ముందు పోషణ, రక్షణ కల్పించే ప్రకృతి, నీకు సహాయకారిణిగా, సహధర్మచారిణిగా నడిచే స్థితి లోకి చైతన్యం ఎదుగుతుంది. ఇదే అర్ధనారీశ్వర తత్వం. అంటే మనలో వున్న చైతన్యమునకు, మన స్వభావమునకు రెంటికీ ఒక రకమైన friendship ఏర్పడుతుంది. మన స్వభావము మన మాట వినదుకదా! అందుకే ఇంత బాధపడ్తూంటాం. ఇంట్లో గయ్యాళి భార్యలాగ ప్రతివాడికీ వాడి స్వభావమే ఏడిపిస్తూంటుంది. ఎవడినీ ఎవరూ ఏడిపించనక్కర లేదు. ఎవరు ఏడుస్తున్నా, వాడి స్వభావం కారణంగానే ఏడుస్తున్నాడు. అంతేకానీ బయట జరిగే సన్నివేశాలు, మిగతావాళ్ళు ఏడ్పించటం వలన ఏడ్వడాలు వుండవు. కృష్ణుణ్ణి అందరూ ఏడ్పిద్దామనుకున్నారు. ఎవ్వరూ ఏడ్పించలేకపోయారు. ఏడ్పిస్తే ఏడ్చేవాడు చైతన్యస్ఫూర్తి కలిగినవాడు కాడు. నువ్వేడిపించినా, ఏడవకుండా వుండి, నిన్ను ఏడిపిస్తాడు. నువ్వేడవడం లేదని వాడు ఏడుస్తూండేలా చేసేవాడు గట్టివాడు. అట్లా చైతన్యం పెరిగితే, పూర్తి చైతన్యం కలిగితే, ప్రకృతి సహకరించడం మొదలు పెడ్తుంది. వాళ్ళు మహాత్ములు. పంచభూతాత్మకమైన ప్రకృతి అంతా నువ్వు చెప్పినట్లు

వింటుంది. ఏం పడితే అది నువ్వు చెప్పవు కాబట్టి, ఏం చెప్పాలో నీకు తెలిసివుంటుంది కాబట్టి, సృష్టి ధర్మాలు తెలిసివుంటాయి కాబట్టి నువ్వు చెప్పినట్లు వింటుంది. నువ్వు ఆ విధంగా పెరగగలవు. అంతకంటే ఇంకా పెరిగితే నీయందు తను చిన్నగా వుంటుంది. మొత్తం పురుషుడు, హృదయంలో స్త్రీ, అంటే నువ్వు పరిపూర్ణమైన చైతన్య స్వరూపము. నీ నుండి ప్రకృతి, నువ్వు చెప్పినట్లు వ్యక్త మవుతూంటుంది. అంతకు ముందు కాళిగా వున్నప్పుడు నువ్వు నిద్రపోతున్నావు ఆవిడ ఆడుతూంటుంది. మన స్వభావము, ఈర్ష్య, అసూయ, రాగము, ద్వేషము, మదము, మాత్సర్యము ఇష్టమొచ్చినట్లు ఆడవూ? ఇష్టాయిష్టాలు, దుఃఖాలు రోజూ పీడించవా? రోజూ ప్రొద్దుట నుండి సాయంత్రం వరకూ, మనం దానితోనే చీకేసిన మామిడిపండల్లే అయిపోతాము. ఎందుకని? ఇవన్నీ పీడిస్తాయి కాబట్టి. అంటే ఏమిటి? ప్రకృతి విన్యాసము పరిపూర్ణముగా నీమీద జరుగుతూండగా, నువ్వు నిద్రపోతున్నావు చైతన్య స్వరూపుడివి. అందుకని పెద్దవాళ్ళు ఏం చేస్తారంటే, నీకు నిన్నెవరో గుర్తుచేయాలని, 'చైతన్య స్వరూపులరా' అని గుర్తుచేస్తూంటారు. 'జ్యోతి స్వరూపులారా! ఆత్మ స్వరూపులారా!' అని చెప్పడం అంటే, ఒరేయ్ నువ్విదిరా అని చెప్పడం. అంతేగానీ ఓ మంత్రిగారో, ఓ ఆఫీసరుగారో, ఓ వ్యాపారస్తుడుగారో అని పిలవరు. అందరి లోపలా ఉండేవాడు ఒకడే. వాణ్ణి గుర్తుచేస్తారు. వాడు మనలో పెరిగేకొలదీ కాళీస్థితి, కాళీస్థితి నుండి యశోదకృష్ణ స్థితి, అక్కడనుండి అర్ధనారీశ్వర స్థితి, అర్ధనారీశ్వర స్థితి నుండి వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసుడి స్థితి. మొదట్లో స్త్రీలో భగవంతుడు నివసిస్తున్నాడు. అదొక శ్రీనివాసుడు. మనం శ్రీనివాసుడని పేరు పెట్టుకుంటే అలాగే వుంటుంది. ఆయనలో ప్రకృతి నివసిస్తూంటుంది. అదొక శ్రీనివాసుడు. చిన్నవాసు, పెద్దవాసు లాగ. ఆ శ్రీనివాసు డేమిటయ్యా అంటే ఆయన యందు శ్రీ నివసిస్తున్నది. ఆయన భగవంతుడు. ఆయనే శ్రీ యందు నివసించేవాడు కూడా. అందుకే అతిసామాన్యులలో కూడా భగవంతుణ్ణి చూసేవాళ్ళు పెరుగుతారు. అంతేగానీ స్థితిగతుల్ని బట్టి చూసుకొనేవారు పెరిగే అవకాశం వుండదు. శ్రీనివాసః నామానికిది అవగాహన. శ్రీ అంటే లక్ష్మి, శ్రీ అంటే సరస్వతి. లక్ష్మీ అంటే వెలుగు, సరస్వతి అంటే శబ్దము. Sound and Light. ఇద్దరికీ కూడా తాను ఆధారభూతుడు అని చెప్పడానికి శ్రీమాన్. వీళ్ళిద్దరూ ఆయన మీద ఆధారపడి వుంటారు. ఆయన లేకపోతే వీళ్ళిద్దరూ లేరు. శ్రీమాన్, శ్రీనివాసః ఎవరు తనమీద ఆధారపడి వున్నారో, వాళ్ళలో కూడా తను వుండి వాళ్ళకి స్ఫూర్తి

కలిగిస్తూంటాడు. చూడండి ఒక మహాత్ముడు తన్ను నమ్ముకున్న వారందరి యందు హృదయములో వుంటాడు. ఉండి వారికి దారి చూపిస్తూంటాడు ఈ శ్రీనివాసుడు. నమ్ముకున్న వాళ్ళు ఆయన హృదయంలో వుంటారు. ఆయన వేంకటేశ్వరస్వామన్నమాట. ఆయన హృదయంలో వీళ్ళున్నప్పుడు ఆయన వేంకటేశ్వరస్వామి. ఆయన వీళ్ళ హృదయాల్లో వున్నప్పుడు శ్రీనివాసుడు. రెండు రకాలైన శ్రీనివాసులు మీకు గుర్తుండాలి. మీ హృదయంలో మీ గురువున్నాడనుకోండి. గురువు మీ హృదయంలో శ్రీనివాసుడుగా వున్నట్లు. మీరు మీ స్వభావంలో వున్నారనుకోండి. స్వభావంలో నేను అనే తత్వం పనిచేయడం మొదలుపెడ్తే శ్రీనివాసులైపోతారు. మన స్వభావం మన స్త్రీ. మన స్వభావంగా మనం వుంటే, మనం శ్రీనివాసులం. మన హృదయంలో గురువుంటాడు. అందరి హృదయాల్లోనూ గురువుండి రక్షిస్తూంటాడు. అది శ్రీనివాస తత్వం. గురువు యొక్క శ్రీనివాస తత్వం. అట్లాగే శిష్యులందర్నీ తన హృదయంలో వుంచుకుంటాడు. శిష్యులందరూ తన హృదయంలో వుంటే, తను వారందరిలో వుంటాడు. అదీ గురువుకీ, శిష్యునికీ వుండే సంబంధం. భగవంతుడికీ, భక్తుడికీ వున్న సంబంధం కూడా అదే! భగవంతుని హృదయంలో భక్తుడుంటే, భక్తుని హృదయంలో భగవంతుడుంటాడు. ఈ శ్రీనివాసుడు అనేది రెండు రకాలుగానూ వుంటుంది. అంటే సమస్త సృష్టి ఆయన హృదయంలో వుంటుంది. అక్కణ్ణుండి వ్యక్తమౌతూంటుంది. సమస్త సృష్టి యందు మళ్ళీ తానే నిండి వుంటాడు. ఈయన లేకపోతే మళ్ళీ అవేం వుండవు. ఇదీ శ్రీనివాసుడు. ప్రతి చెట్టులోనూ, పుట్టలోనూ ఆ చైతన్యము నిండి వున్నది కదా! శ్రీ యందు నివసిస్తున్నట్టి వాడే రంగు, శబ్దము ఆధారంగా ఏర్పడిన సృష్టి యందు నివసిస్తున్నట్టి వాడు భగవంతుడు. కనుక శ్రీనివాసుణ్ణి చూద్దామనుకుంటే అక్కడికే వెళ్ళి చూద్దామనుకోకూడదు. అక్కడికి వెళ్ళి చూడ్డమే కాక, ఇన్నింటిలోనూ నివసిస్తున్నట్టి వాడిని చూస్తూండాలి. అప్పుడు మీకు వాడు దొరుకుతాడు. నిజంగా సత్సాధన చేసేవారికి మార్గం అది. వీటన్నిటిలోను వున్న వాణ్ణి చూస్తూవుంటే, మామూలుగా వున్న సాధకులు 'సత్' అయిపోతారు.

## 192 సతాంగతిః

సతాంగతి: అంటే ఈ సాధకులకు మార్గమై నిలుస్తాడు. వీటిలో వున్నాను కదా చూడవేరా అని చూస్తూంటాయి మొక్కలు, ఆవులు, కుక్కలు. మనింట్లో పెంచుకున్న మొక్కలు, పెంపుడు జంతువులు మనం ఏదన్నా ఊరు వెళ్ళి వచ్చేసరికి చూస్తూంటాయి. వీటన్నిటిలో నుండీ చూస్తున్నాడు. మనం చూడక ఇంటావిడను చూడ్డానికి లోపలకి వెళ్ళిపోతాం. ఇంటావిడతో పోట్లాడినప్పుడు కదా బయటకొచ్చి తిరుగుతాం మనం. అట్లా వుండదు. నిజంగా చూసేవాడు వాకిట్లోకి వచ్చిన దగ్గర్నుండీ ప్రతి చెట్టూ, మొక్కాఅన్నీ చూస్తాడు. అవి కూడా ఆ ఇంటి యజమానిని చూస్తూంటాయి. ఇంట్లోకి వస్తూంటే ఇంటి యజమాని వచ్చాడని చూస్తూంటాయి. వాటిని నువ్వు చూస్తే సంతోషిస్తాయి, వికసిస్తాయి, పువ్వులిస్తాయి, పళ్ళనిస్తాయి. మనం చూళ్ళేదనుకోండి. ముడుచుకుంటాయి. మొక్కలతో ప్రేమతో మాట్లాడి నీళ్ళు పోస్తే, ఎక్కువ పువ్వులిస్తాయి. అది సత్యం. కావాలంటే మీరు experiment చేసి చూడవచ్చు. అట్లాగే చెట్లున్నాయి కాబట్టి వాటితో మనం అప్పుడప్పుడు సంభాషణలు చేస్తూండవచ్చు. ఇంట్లో కుక్కని మనం పలకరించకపోతే, కుక్క మనల్ని పలకరించడం మానేస్తుంది. రాగానే రెండు కాళ్ళూ వేసి మీద పడ్తుంది కదా! ఎందుకు పడ్తుంది? ప్రేమ చూపిస్తుంది. దానికి మనం కూడా ప్రేమ చూపిస్తే బావుంటుంది. According to us అది respond అవుతుంది. కాబట్టి భగవంతుడు కూడ సృష్టిలోని సమస్త రూపాల యందూ వున్నాడు కాబట్టి, నువ్వు చూడ్డం మొదలు పెడ్తే నీకు మార్గం దొరుకుతుంది. ఎవరు మనకు ధ్యేయమో, వారే మనకు మార్గంగా ఏర్పడతారు. అందుకే సత్యం తెలిసిన, పరమ భాగవతోత్తముడైన క్రీస్తు ఏమన్నాడంటే, "నేనే మార్గమును. నేనే ధ్యేయమును" అని. క్రీస్తు మార్గం అని కాదు అక్కడ. మనం కూడా "నేనే మార్గమును" అని తెలియాలి. ఈ "నేనే" అన్నిట్లోనూ రంగుగాను, రూపంగాను, శబ్దంగాను కనిపిస్తుంది. ఈ మూడే మనకు కనిపించేది. శబ్దం వినిపిస్తుంది. రంగు కనిపిస్తుంది. రూపం కనిపిస్తుంది. వాటికి పెట్టే పేర్లలో ఇరుక్కోకుండా, ఆ రూపం, రూపంలో వుండే చైతన్యంగా భగవంతుణ్ణి చూడ్డం మొదలుపెడితే, 'నేనే వీటన్నిటిగా వున్నాను' అనే భావం స్థిరపడ్తుంది. అదే మార్గం. ఈ వున్న వాటిలో వున్న చైతన్యాన్ని చూడ్డం మొదలుపెడ్తే, సత్యము ననుసరించి వెళ్ళిన వారున్నారే, ఆ మార్గము మనకు

భగవంతుడిగా ఏర్పడుతుంది. అంటే భగవంతుడే మార్గంగా ఏర్పడి, భగవంతుని ధ్యేయం మనకి దర్శనంగా ఏర్పడుతుంది. మార్గములోనే, మొదటి మెట్టులోనే మనకు భగవద్దర్శనం. దాన్నే 'విష్ణోపాసనము' అన్నారు. చూస్తున్నట్టి రూపాలన్నిటిలోనూ భగవంతుణ్ణి చూడమని. దాన్ని చూస్తూంటే అది మనకు మార్గమిస్తుంది. అసలు చూడనే చూడం కదా మనం!మన ఇంటికి వస్తూంటే Mineral, Plant, Animal, Human అని 4 Kingdoms వుంటాయి. దేవా Kingdom కూడా వున్నది. కానీ కనబడదు మనకి. ఇవే చూడనివాళ్ళం అవేం చూస్తాం? సరాసరి దేవుణ్ణి చూద్దామని అనుకుంటాం మనం. ఈ కనబడుతున్న దానిలో చూడకపోతే, కనబడని దానిలో ఎలా చూద్దామనుకుంటున్నావ్? కనబడుతున్న దానిలో అవ్యక్తుడు, వ్యక్తమైన రూపాల్లో కనిపిస్తూంటే, దాన్ని చూస్తూండడం ఒక్కటే మార్గం. "విశ్వం విష్ణుః" అన్నారు కదా! "విశ్వంబు విష్ణుండు" అన్నారు కదా! అన్నప్పుడు ఈ విశ్వరూపములో వున్నదాన్ని చూడ్డం మొదలు పెట్టడమే. That is the only way. ఇవన్నీ "నేను" గా వున్నా కాబట్టి, నన్ను అన్నిట్లోనూ చూడ్డమే మార్గము అని చెప్పడమే "నేనే మార్గము" అంటే. I am the way. దీంలోంచి మనం వాణ్ణి చూడ్డం మొదలు పెడ్తే నెమ్మదిగా వీటన్నిటిలో వాడున్నాడు అని తెలుస్తుంది. అప్పుడు శ్రీనివాసులము. సతాంగతులమైతే, అంటే సత్యాన్వేషణ చేస్తూ, సత్యం అంతే ఉన్నది. సత్యం. ఉన్నది అంటే వీటన్నిటి రూపంలోనూ వున్నట్టిది. దాన్ని చూస్తూంటే, ఆ మార్గంలో నడవడం మొదలవుతుంది. ఆ మార్గంలో నడవడం మొదలుపెడితే, 'ఉన్న వాటిలో ఉన్నవాడు' ఎవరో తెలుస్తుంది. అప్పుడు శ్రీనివాసుడు తెలుస్తుంది. శ్రీనివాసుడు తెలియగానే ఇతడుండబట్టే ఇవన్నీ వున్నాయి. లేకపోతే ఇవేం వుండవు అని తెలుస్తుంది. నీలో కూడా "నేను" గా వున్నాయి. కాబట్టి ఇదంతావుంది. నేను లేకపోతే ఈ శరీరం లేదు. అట్లాగే నేనుగా వుండే ఈ తత్వం లేకపోతే, ఈ కనబడేవేమీ లేవు. కాబట్టి ప్రతిదాన్లో నుండీ చూస్తూంటే, ఈ మార్గం కారణంగా శ్రీనివాసుని దర్శనం కల్గుతుంది. శ్రీనివాసుని దర్శనం జరిగేసరికి అక్కణ్ణుండి "మహీభర్తా" తెలుస్తాడు. అంటే ఈ ధరించేవన్నీ కూడా నేను అనే చైతన్యానికి ఆధారంగా వున్నాయి కాబట్టి, వీటిలో మనం వుండనక్కరలేదు. వాటిలో మనం వున్నట్లైతే, ఇవన్నీ మనచుట్టూ ఎప్పుడూ వుంటాయి అని తెలుస్తుంది. ఈ "మహీభర్తా" అనే స్థితికి వస్తే, అక్కడనుండి ముందుకు వెళ్ళి "మహేష్వాసో" అంటే భగవంతుడు శక్తిస్వరూపంగా

ఏ విధంగా వ్యక్తమై తన యొక్క ఓంకార రూపాన్ని ఆధారంగా అంటే త్రిశక్త్యాత్మకమైనట్టి ఓంకార రూపంగా, ఒకే ఆదిశక్తిగా వున్న భగవంతుడు ఏ విధంగా వ్యక్తమైనాడు? వ్యక్తమైన దానిలోనుండి మూడు శక్తులూ ఎలా వ్యక్తమై వున్నాయి? అందులో నుండి సంకల్పాలుగా పుట్టి, ఈ సృష్టి అంతా అది ఆధారంగా ఎలా ఏర్పడి వున్నది? ఇవన్నీ తెలిసి, మనమే 'ఓంకారం' అని తెలుస్తుంది. ముందు మనమే ఈ రూపం అని తెలుస్తుంది. మన రూపం తెలుసుకుంటాం. ఆ తర్వాత బయట రూపాల్లో వున్న చైతన్యాన్ని తెలుసుకోవడం ద్వారా మన రూపంలో వుండే చైతన్యాన్ని తెలుసుకోవచ్చు మనం. భగవంతుడు ఎలా వున్నాడంటే, ''ఓ మహర్షీ! నీలో నీలా వున్నాడు'' అని చెప్తాడు. భగవంతుడు నీలా వున్నాడు కాబట్టి, నీకు నీ గురించి వేరే understanding వుంది కాబట్టి నువ్వు దేవుణ్ణి చూడలేకపోతున్నావు అని చెప్తాడు. ఈ లోపల నీలా వున్న వాణ్ణి, నువ్వు వేరేవాడిలా వున్నాడని అనుకోబట్టి నీకు కనబడడు. చూడాలంటే ఏం చెయ్యాలంటే, కనబడ్తున్న దాన్లోనుండి చూడ్డం మొదలు పెడితే, మిగతా రూపాల్లో ఏ విధంగా వున్నాడో తెలిస్తే, నీలో ఏ విధంగా వున్నాడో నీకు తెలుస్తుంది. తెలిసాక అక్కడనుండి ఈ ఉన్నవాడు మూడు రకాలుగా ఈ మొత్తాన్ని, ఈ పదార్థాన్ని ఎలా ధరించి వున్నాడో తెలుస్తుంది. ఈ ధరించి వున్న వాడికి ఈ మూడు శక్తులూ ఏ విధంగా ఉద్భవిస్తున్నాయో లోపల తెలుస్తుంది, బయట తెలుస్తుంది. ఈ మూడూ ఓంకారమనే ఒకే ఒక శబ్దస్వరూపంగా, నిశ్శబ్దం నుండి ఏ విధంగా వ్యక్తమవుతున్నదీ తెలుస్తుంది. ఇలా ''సతాంగతిః'' నుండి ''మహేష్వాసో వరకూ సోపానా లున్నాయి. ''మహేష్వాసో'' నుండి ''సతాంగతి:'' వరకు అవరోహణ వున్నది. ''సతాంగతిః'' నుండి ''మహేష్వాసో'' వరకు ఆరోహణ వున్నది. ఈ విధంగా ఈ నామాలు ఇవ్వబడి యున్నాయి.

# 193 అనిరుద్ధః

అనిరుద్ధుడు అనే వ్యూహము భగవంతుని నాలుగు వ్యూహములలో ఒకటి. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నలుగురూ నాలుగు వ్యూహములుగా, నాలుగు రూపములుగా, భగవంతుని చతుర్భుజములుగా, చతుర్బాహువులుగా, చతుర్వ్యూహములుగా, చతుర్వర్గములుగా ఇలా నాలుగుగా ఉంటుంది. అందులో 'అనిరుద్ధ' అనే నామానికి అవగాహన చేసికోవడానికి ప్రయత్నిద్దాం. వాసుదేవుడన్నప్పుడు, సంకర్షణు డన్నప్పుడు, ప్రద్యుమ్నుడన్నప్పుడు కూడా అనిరుద్ధుణ్ణి చెప్పుకోవాలి. ఏ ఒక్కటి చెప్పుకున్నా మిగిలిన మూడూ కూడా చెప్పుకోవాలి. కనుక సమస్త విశ్వమందు వ్యాపనము చెంది యున్నటువంటి చైతన్యమును వాసుదేవతత్వంగా చెప్తారు. సమస్తమైన సృష్టికి ఆధారభూతమై వున్నటువంటివాడు, సృష్టిలో వున్నటువంటి భగవంతుడు అన్ని నామాలలోనూ, అన్ని రూపాలలోనూ ఒకే ఒక చైతన్యంతో వశించి యున్నటువంటి భగవత్తత్వంగా వాసుదేవుణ్ణి చెప్తారు. ఇన్నింటిలోనూ ఒకే తత్వం నిండి వున్నా కూడా, అంటే ఒకే తత్వంలో ఇవన్నీ వున్నా కూడ ప్రతి ఒక్కరూ తమకు తాము వేరుగా వున్నామనే భావన సహజంగా కలిగి కదా మనం ఇతరులతో ఇలా ప్రవర్తిస్తున్నాము! అందుకని ఒకే తత్వం ఒక్కొక్కరుగా వున్నట్లుగా భావన జరుగుతుందే, ఆ స్ఫూర్తిని 'సంకర్షణ వ్యూహము' అంటారు. 'జీవ అహంకారం' అంటారు. వాసుదేవ తత్వం దేవుని అస్థిత్వస్థితిని తెలియజేస్తుంది. అదే దేవుడిలో జీవిస్తూ, ప్రతి ఒక్కరూ వేరుగా వున్నామని భావిస్తూ జీవిస్తున్నాము. సముద్రంలో అలలు వేరుగా కనిపించినట్లుగా! మన ఇంటిలో రిఫ్రిజిరేటర్ లో మంచు పెట్టుకొనే ఒక గిన్నె వుంటుంది. ఒకే మంచు అయినా కూడా మనం దాంట్లో పెట్టే జాలీ కారణంగా వేరు వేరు ముక్కలుగా ఏర్పడినట్లుగా వుంటుంది. నీరు ఒకటే అయినప్పటికీ అనేకమైన మంచుగడ్డలుగా గోచరిస్తుంది. అన్ని మంచుగడ్డలలో వున్నట్టిది ఒకే ఒకటి. కానీ వేర్వేరుగా గోచరిస్తుంది. అదేవిధంగా ఒకే విద్యుత్తు ఎన్నో రకములైన దీపములుగా గోచరిస్తుంది. ఒకే అగ్ని ఎన్నో రకములుగా గోచరిస్తుంది. ఇట్లా సృష్టిలో వున్నది ఒకటైనప్పటికీ రకరకములుగా గోచరించి, వేరైన అస్తిత్వము కలిగినట్లుగా భావన కలిగించే చైతన్యస్ఫూర్తి ఏదైతే వుందో, దానిని 'సంకర్షణ వ్యూహము' అంటారు. మనం మొత్తం విశ్వ చైతన్యములో వున్నప్పటికీ మనకి మనంగా వున్నాం అని

మనకి కూడా ఒక స్ఫూర్తి వున్నది. ఆ స్ఫూర్తిని 'సంకర్షణుడు' అంటారు. ఆ స్ఫూర్తి ప్రతినిత్యమూ విశ్వచైతన్యములో కలిసిపోతూ, మళ్ళీ విశ్వచైతన్యము నుండి విడివడి ఇతరులకు వస్తూంటుంది. అదీ నిద్దట్లో మనకి జరిగే పని. విశ్వ చైతన్యముతో అనుసంధానము చెంది వుండి, విశ్వ చైతన్యము నుండి వేరుపడినట్లుగా బయటకి వచ్చి, మళ్ళీ విశ్వ చైతన్యములో కలిసిపోతుంది. ఇట్లా వేరుపడ్డట్లుగా వున్నప్పుడు వేర్వేరుగా వున్నట్లు భావన కలుగుతుంది. కలిసి వున్నప్పుడు ఒకే తత్త్వమని తెలిసిన భావన వుంటుంది. సముద్రం నుండి ఒక అల వేరుగా బయటకి వచ్చినట్లుగా అనిపించి, మళ్ళీ సముద్రంలో లీనమైపోతుంది. అదే పద్ధతిలో మనమంతా వ్యక్తమై, మళ్ళీ లీనమైపోతూంటాం. వ్యక్తమై, లీనమవడం అనేది ప్రతిరోజూ కూడా జరుగుతూంటుంది. ప్రతిసారి ఒక అల సముద్రం నుండి వ్యక్తమైనట్లే, ప్రతిరోజూ ఉదయం ఆ విశ్వ చైతన్యము నుండి ఒక అలగా మనం మేల్కాంచుతాం. మనదైన శైలిలో సాయంత్రం వరకు పనిచేస్తాం. ఉవ్వెత్తున లేచి భూమి మీదకి వెళ్ళే అల మళ్ళీ సముద్రంలోకి ఏ విధంగా కొనిరాబడుతుందో, అదేవిధంగా మళ్ళీ మనం సాయంత్రం నిద్దరలో ఈ విశ్వ చైతన్యంలో భాగంగా చేరిపోతాం. అందుకనే తల్లి ఒడిలో నిద్రిస్తున్నటువంటి పిల్లవాడిలా, మనం భగవంతుని యొక్క అస్తిత్వము నందు లీనమైన జీవుడిగా నిద్రలో వుంటాం. వ్యక్తమైనప్పుడు వ్యక్తిగా ప్రవర్తిస్తాం. ఒక్కొక్క యూనిట్ గా ప్రవర్తిస్తాం. తెలిసినవారు ఒకే తత్త్వము యొక్క మెలుకువగా నేను బయటకు వచ్చాను అని తెలిసి ప్రవర్తిస్తారు. తెలియనివారు తాను వేరుగా, ఇతరులు వేరుగా వున్నట్లుగా భావన చేసికొంటూ అందులో జీవిస్తూంటారు. భావనని బట్టి చైతన్యము యొక్క వ్యాఖ్య వుంటుంది. భావన లేనప్పుడు వ్యక్తులుగా మిగులుతాం. భావన వున్నప్పుడు విశ్వ చైతన్యంతో ముడిపడి వున్న వ్యక్తిగా మెలగుతూంటాం. అల ఎంత వేరుగా గోచరించినా అదీ సముద్రంలోని భాగమే. ఎంత వేరుగా దీపములు కనిపించినా అవీ విద్యుత్తులోని భాగమే! విద్యుత్తులో వ్యక్తమయ్యే వెలుగు ఏ విధంగా రకరకములుగా గోచరిస్తుందో, అలలో వ్యక్తమయ్యే సముద్రం ఏ విధంగా వుంటుందో, మనలో కూడా వ్యక్తమవుతున్నది ఆ విశ్వ చైతన్యమే అనే భావన ఎవరికైతే వుంటుందో వారు సంకర్షణ వ్యూహాన్ని అర్థం చేసుకున్న వాళ్ళవుతారు. సంకర్షణ వ్యూహం అర్థం చేసికోడం అంటే ప్రొద్దుట నిద్ర లేచాక, మనకి మనం ఎవరో తెలిసియుండాలి. 'నేనెవరు' అని ప్రశ్న వేసుకోవాలి. అది సనత్కుమారుడు పృథు చక్రవర్తికి చెప్పిన మొట్టమొదటి పాఠం. 'నేనెవరిని' అని

ప్రశ్న వేసుకుంటే, 'నేను విశ్వ చైతన్యము అనే సముద్రంలో నుండి మేల్కాంచిన ఒక అల' అని గుర్తిస్తాం. నా పేరు ఏమిటంటే, 'నేను' అని గుర్తు పెట్టుకోండి. వేరే గుర్తొస్తే, మనకి ఆ చైతన్యంతో వున్న అనుసంధానం పోయిందన్నమాట! సూత్రం పోయినట్లు. వేరే గుర్తున్న వాళ్ళకి సాయంత్రం వరకూ జీవితం తెగిన గాలిపటం లాగ వుంటుంది. 'నేను' అని గుర్తున్న వాళ్ళకి తెగని గాలిపటం లాగ వుంటుంది. తెగిన గాలిపటానికి గాలివాటు ప్రకారం జీవితం నడుస్తుంది. మొత్తం జీవితం అంతా గాలి ఎటు వీస్తే అటు ఒక మార్గము లేక, ఒక దర్శకత్వము లేక వెళ్తూంటుంది. ప్రొద్దున్నే లేచాక 'నేను' అనే చైతన్యముగా వున్నట్టి 'నేను' అనే పెద్ద చైతన్యమునే అంతర్యామి అనీ, విశ్వ చైతన్యమనీ, వాసుదేవుడనీ అంటారు. మనం ఆ వాసుదేవుని నుండి ప్రతి ఉదయం సంకర్షణుడిగా మేల్కాంచుతాం. అంటే దిగివచ్చిన వాడిని 'సంకర్షణుడు' అంటారు. ఏం దిగివచ్చిందీ అంటే విశ్వ చైతన్యము, వ్యక్తిగత చైతన్యముగా దిగివచ్చింది. అవ్యక్తంగా వున్న విద్యుత్తు వ్యక్తమై, ఒక దీపం లోంచి వెలుగుతున్నట్లుగా కనిపిస్తుంది కదా! ఇక్కడ మూడు, నాలుగు ఎలక్ట్రిక్ బల్బులున్నాయి. అన్నిట్లో నుండి ఒకే విద్యుత్తు ప్రసారమవుతున్నా కూడా మనవరకూ ఏం తెలుస్తుందంటే, ఇది ట్యూబ్ లైట్, అది మామూలు లైట్ ఇట్లా అనుకుంటాం. వేర్వేరుగా భావన చేస్తాం. కానీ ఈ భిన్నంగా కనిపించేవాటిలో ఏకత్వం చూసినవాడు, నిజమైన చూపు కలిగినవాడు. వాడికి తనయందు గానీ, తన పరిస్థితుల యందు గానీ సంఘర్షణ వుండదు. గుర్తు పోయినపుడు సంఘర్షణ వుంటుంది. గుర్తు పోయినపుడు తాను వేరుగా, ఇతరులు వేరుగా భావన చేసికొంటూంటాడు. ఎప్పుడైతే వాసుదేవ తత్త్వంలో జీవిస్తూ వేరనుకున్నామో, వేరనుకోవడమే గానీ వేరుగా లేం. మాస్టరుగారు చెప్పినట్లు గోదావరిలో ముంచిన చెంబులన్నింటిలో గోదావరి నీరే వున్నది. చెంబు అనుకోవచ్చు తను వేరుగా వున్నానని. కాని మొత్తం చెంబు గోదావరిలోనే వున్నది కదా! కుండ లోని గాలి తాను వేరుగా వున్నానని అనుకుంటుంది కానీ బయట వుండే గాలే కుండలోనూ వుంటుంది. అలాగే విద్యుత్తు కనబడే దీపాల్లో వున్నది గానీ ఇరుక్కొని లేదు. దీపాలలో విద్యుత్తు విద్యుత్తుగానే వున్నది. దీపంలోకి అది రావచ్చు, వెళ్ళిపోవచ్చు. ఉన్న దీపానికీ దానికీ ఏమీ సంబంధం లేదు. వచ్చి వెళ్ళిపోతూంటుంది. పోతే ట్యూబ్ పోవాలి తప్ప, విద్యుత్తు పోదు. పోతే వైర్ పోవాలి తప్ప, విద్యుత్తు పోదు. ఇక్కడ మనింట్లో పోవచ్చు. అక్కడ పోల్ మీద పోవచ్చు. Transformer మీద

పోవచ్చు. ఎలక్ట్రిక్ స్టేషన్లో పోవచ్చు. అలా ఎక్కడన్నా పోవచ్చు గానీ విద్యుత్తు అసలెప్పుడూ వుంటుంది. దిగిరావడం పరికరముల మీద వుంటుంది. ఎప్పుడూ వుండే దానిలో మనం ఉంటూ, వేరుగా వున్నామనుకోవడం కన్నా అజ్ఞానం వేరేలేదని చెప్తారు. అదీ అవిద్యంటే. మనం వేరుగా వున్నామనుకోవడమే అవిద్యంటే. ఈ మొత్తంలో మనమున్నాం. మనలో కూడా వాడే మనలా వున్నాడు అని చెప్తారు. అందుకే శ్రీకృష్ణుడు ౧౦వ అధ్యాయంలో "ఈ సర్వ జీవరాశులుగా నేనున్నాను" అని ధ్యానం చేసికోమంటాడు. ఏవో రకరకాల ప్రార్ధనలు చేస్తూంటాం. భగవంతుడు చెప్పిన ప్రార్ధన చేయాలి. భగవంతుడు చెప్పిన మంత్రం చేయాలి. ఎందుకంటే తానే స్వయంగా దిగివచ్చి చేసుకోండిరా అంటే, మనం ఏవో స్వంత పద్దులు పెడ్తూంటాం. "ఈ సర్వ జీవరాశులుగా నేనే వున్నాను" అని చేసుకోవాలి. ఇక్కడ నేను అనే తత్వము నీలో ఏదైతే వున్నదో, అదే అందరిలోనూ వున్నది. అదే విశ్వవ్యాప్తిగా వున్నట్టి చైతన్యము. ఆ చైతన్యము మనలో మనగా వుంటుంది. మనలో వుంటుంది. మనలాగ వుంటుంది. అందుకని దానిగురించి లోపల వెతు క్కొంటే మనకు కనిపించదు. ఎందుకంటే మనమే కాబట్టి. మన గురించి మనమే వెతుక్కుంటే మనకి ఏం కనిపిస్తుంది? మనమే అన్న అవగాహన ఏర్పడుతుంది తప్ప, మన గురించి మనం చూసుకోడానికి వీలుపడదు. భగవంతుణ్ణి వెతుక్కోడం అంటే తన గురించి తను వెతుక్కున్నట్లుగా వుంటుంది. అందుకని వెతుకులాట అంతా అయిన తర్వాత భగవద్దర్శనం అంతర్ముఖంగా జరుగుతుంది. అల, తాను సముద్రం కన్నా వేరు కాదు కాబట్టి తానే సముద్రము యొక్క వ్యక్తరూపమని తెలియడం నిజముగా తెలియడం. సముద్రము యొక్క వ్యక్తరూపము తానే, వాసుదేవుని యొక్క రూపము తానే అని మేల్కాంచుతాడు. ఆ విధంగా సంకర్షణలో మేల్కాంచితే, మననుండి విద్యుత్తు దిగివస్తే, అది ప్రకాశవంతమైనట్లు మొత్తం చైతన్యమంతా ఈ చోటులో విద్యుత్తు వలె వుంటే, అది ఒకచోట localise అయ్యింది. స్థానికంగా ఒకచోట దిగివస్తుంది. అందుకే దాన్ని Localised Consciousness' అంటారు సంకర్షణ వ్యూహాన్ని. సంకర్షణ వ్యూహంగా దిగివచ్చి అక్కడ వున్నట్టుగా వుంటుంది. ఉన్నట్టుగా వుంటే ఏం జరుగుతుందంటే వెలుగు వస్తుంది. విద్యుత్తు మన బల్బు అనే పరికరంలోకి దిగివచ్చినపుడు సరాసరి వెలుగు ప్రసారం జరుగుతుంది. అలాగా నేనెవరో గుర్తున్నవాడికి అంటే వాసుదేవుడు సంకర్షణుడు అయిన సందర్భంలో, ప్రద్యుమ్న వ్యూహం వ్యక్తమవుతుంది. దాన్ని

'వెలుగు వ్యూహం' అంటారు. తేజోమయమైన వ్యూహం. బుద్ధి లేకుండా జీవించే వాళ్ళంతా కూడా--నీకు బుద్ధి లేదా అంటారు కదా! బుద్ధి ఎప్పుడుంటుందంటే, ఇది గుర్తుండేటప్పుడు. " పురుషోత్తముని మీది బుద్ధి, బుద్ధి" అంటాడు ప్రహ్లాదుడు, తండ్రి బుద్ధి అంటే ఏమిటని అడిగినప్పుడు, నీకు చాలా బుద్ధి వుందనుకుంటున్నావేమో, పురుషోత్తముడి మీద వుండే బుద్ధి, బుద్ధి అని చెప్తాడు. కాబట్టి పురుషోత్తముని మీద ఆ ఎరుక కలిగివున్నప్పుడు, అలలో సముద్రం వున్నప్పుడు సముద్రం రుచి అలలో కనిపిస్తుంది కదా! అల సముద్రంలోనే వున్నది. అలలో సముద్రం వున్నది కాబట్టి మనం అల నీరు తాగితే, సముద్రం నీరు తాగిన రుచి వస్తుంది. అట్లాగ అవ్యక్తమైన విద్యుత్తు వ్యక్తం అనగానే, అందులో నుండి వెలుగు వస్తుంది. ఈ వెలుగుని 'బుద్ధి' అన్నారు. ఈ బుద్ధిని 'ప్రద్యుమ్నుడు' అన్నారు. ఆ బుద్ధి ఆధారంగా పనిచేసే మనసున్నదనుకోండి. బుద్ధి ఆధారం కాకుండా పనిచేసే మనసున్నట్లయితే, వాసుదేవ వ్యూహంతో తెగతెంపులు చేసికొని, ఎవరికి వారుగా వున్నాననుకొని జీవించేవాళ్ళు లేరా? అలా జీవించినపుడు బుద్ధి అనే వెలుగుండదు. బుద్ధి అనే వెలుగులో పనిచేసే మనసున్నదనుకోండి. దాన్ని 'అనిరుద్ధుడు' అంటారు. నేనే అనే భగవత్తత్వం మొదటి వ్యూహం అయితే, అది నేనుగా, ఒక్కొక్కరుగా ఏర్పడడం సంకర్షణ వ్యూహం అయితే, ఏర్పడిన సంకర్షణ వ్యూహానికి ఆ పెద్ద నేనుతో వుండే సంబంధం కారణంగా వీడిలో నుండి వెలుగు వ్యక్తమౌతూంటే, ఆ వెలుగు బుద్ధిగా పనిచేస్తూంటే, దాన్నే 'గాయత్రి' అంటాం. ఆ వెలుగు మనకి మనసు మీద ప్రసరిస్తూంటే, మనసు ఆ వెలుగుని ఇంద్రియముల లోనికి ప్రసరింపచేస్తే, మన కనులలో నుండి, చెవులలోంచి, ముక్కులోంచి, నోట్లోంచి, చేతల లోనుండి వెలుగే ప్రసారమౌతుంది. అనిరుద్ధుడు చిత్తములకు అధిపతి. ఇంద్రియములకు అధిపతి. అనిరుద్ధుడు అని చెప్పడం అంటే చిత్తము, ఇంద్రియములకు అధిపతి అయిన భగవత్తత్వం గురించి చెప్తున్నారు. ఇక్కణ్ణుండి చెప్పుకోడానికి వీలులేదు గనక దాని మూలస్థానం నుండి చెప్పుకోవలసి వచ్చింది. ఎక్కణ్ణుండి దిగివచ్చామంటే, విశ్వ చైతన్యము నుండి దిగివచ్చి, వ్యక్తి చైతన్యంగా వున్నప్పటికీ విశ్వ చైతన్యములో భాగంగా వున్నామని గుర్తుండడం వలన, మనలో ప్రచోదనమైన బుద్ధి ఏదైతే వున్నదో, ఆ బుద్ధి యొక్క వెలుగు మనసులోకి ప్రసారమైతే చిత్తము లోనికి, చిత్తము నుండి ఇంద్రియములకు అందితే, చూచినపుడు దేవుణ్ణి చూడ్డం అవుతుంది. వింటున్నప్పుడు దేవుణ్ణి వినడం అవుతుంది.

మాట్లాడుతున్నప్పుడు దేవుణ్ణి మాట్లాడ్డం వుంటుంది. చేతలు చేస్తున్నప్పుడు దేవుని పనులుగా చేస్తూండడం వుంటుంది. "దేవదేవుని చింతించు", "కమలాక్షు నర్చించు కరములు కరములు" చేసేపని ఎవరికి చేసిపెట్టినా, భగవంతుడికి చేస్తున్నాననే భావం వుండాలని తెలియ జెప్తున్నాయి ఆ పద్యాలు. "కమలాక్షు నర్చించు కరములు కరములు" అంటే రోజంతా పూజలు చేసుకుంటూ కూర్చోడం కాదు. ఎవరికి పనిచేసి పెట్టినా, భగవంతుడికి చేసిపెడ్తున్నాననే భావనలో వుంటే, ఈ నాలుగు వ్యూహములు నీయందు, నీ నుండి ప్రసారమై, Transaction of Light complete అవుతుంది. అలా కాకపోతే అవరోధము లేర్పడతాయి. "అనిరుద్ధుడు" పదానికి అర్థం అవరోధములు లేనివాడు అని అంటే అనిరుద్ధుణ్ణి ఎవ్వరూ ఆపలేరు. అని అర్థం. ఎందుకంటే అతడికి అవరోధాలు లేవు. ఎందుకు అవరోధాలు లేవూ అంటే అతడి వెనకాల వున్న వాళ్ళంతా అతడిద్వారా వ్యక్తమౌతూంటారు. అందుకని అనిరుద్ధుడెక్కడో స్థిరంగా పనిచేస్తూంటే, ఎవరో ఎత్తుకుపోయారు ఆయన్ని. వీళ్ళంతా నా వెనకాల వున్నారు కదాని హాయిగా అక్కడే వుంటాడు. బాణాసురుడి కథ. ఉషాపరిణయం చదువుకుంటే తెలుస్తుంది. అందులో అనిరుద్ధుడు నిశ్చింత, నిరామయంగా వుంటాడు ఎవరో ఎత్తుకుపోతే. అర్ధరాత్రి పడుకున్న వాణ్ణి పడుకున్నట్లుగా ఎత్తుకుపోతారు. ఎత్తుకుపోతే, ఇంకోచోట నిద్రలేస్తాడు. నిద్రలేచి, ఇక్కడ పెట్టారు కదా సరే ఇక్కడే వుందాం అనుకున్నాడు. ఎందుకంటే ఇతడి వెనకాల వాళ్ళంతా నడిచివస్తారు. శ్రీకృష్ణుడు పిల్లవాడు కనిపించడం లేదని వెతుక్కుంటూ వస్తాడు. శ్రీకృష్ణుడంటే విశ్వవ్యాప్తమైన చైతన్యము. ఆ చైతన్యము వెతుక్కుంటూ వస్తుంది. ఎప్పుడూ వెంట వుంటుంది. ఎక్కడికి వెళ్తే అక్కడకి వస్తుంది. ఎప్పుడుంటుందీ? ఇంద్రియముల ద్వారా మనము చేసే పనులన్నీ కూడా భగవత్ సమర్పితములై చేస్తూంటే. అదీ ప్రహ్లాదుని బలం. ప్రహ్లాదుడు చూస్తూంటే, విష్ణువునే చూస్తూంటాడు. "పానీయంబుల్ త్రాగుచున్ కుడుచుచున్" అని వున్నది కదా! ఎవరికైనా పనులు చేస్తున్నప్పుడు వాడికి చేసిపెడ్తున్నాం. వాడి పనులుగా చేస్తున్నాం అనే భావన ఎవర్నైనా చూస్తున్నపుడు వాని రూపం చూస్తున్నాం, ఎవర్నైనా వింటున్నప్పుడు వాడిని వింటున్నాం. అలాగ "కమలాక్షు నర్చించు కరములు కరములు", "శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ" అంటే మాటల్లో వాడు వ్యక్తం అవ్వాలి. చేతల్లో వాడు వ్యక్తం అవ్వాలి. చూపుల్లో వాడు వ్యక్తం అవ్వాలి. అట్లా వ్యక్తం అవుతారు మహాత్ములు. వారంతా "అనిరుద్ధులు". అనిరుద్ధమైన తత్వం అంటే,

హృదయ కేంద్రం వద్ద నివసించేవాడు అనిరుద్ధుడు. ఇహ అక్కణ్ణుండి దిగివచ్చేది ఇంద్రియములే! హృదయ కమలం వేరు. అది నారాయణ స్థానం. శ్రావణమాసం హృదయ కేంద్రానికి ప్రతీక. ఇక్కడ చైతన్యము సింహాసనము మీద కూర్చొని వుంటుంది. భాద్రపదం వచ్చేసరికి సింహాసనం దిగి కిందకి వెళ్తుంది. అంతకన్నా final కి వచ్చేసరికి బొడ్డుదిగి మరీ కిందకి వెళ్తుంది. ఆ తర్వాత కార్తీకమాసం వచ్చేసరికి అట్టడుగుకి వెళ్ళిపోతుంది చైతన్యము. ఇప్పుడు మనం చెప్పుకున్న అనిరుద్ధ చైతన్యము హృదయము వరకు దిగివచ్చిన చైతన్యము. అక్కడ నుండి అవరోధములు లేక బాహ్య ప్రపంచము లోనికి ప్రసరిస్తూంటాడు. అతడూ అనిరుద్ధుడు. There is no obstruction to Him. అతనికి అడ్డు లేవు. ఎందుకు అడ్డు లేవూ అంటే వెనక వున్న త్రిభుజం గుర్తుంటుంది. వాళ్ళ నాన్న ప్రద్యుమ్నుడు. పెద్ద తాతయ్య బలరాముడు సంకర్షణుడు. తాతయ్య వాసుదేవుడు. కాబట్టి ఆ పేర్లు వీళ్ళకి పెట్టారు తప్ప, వీళ్ళ పేర్లు పెట్టకముందు నుండి ఆ వ్యూహా లున్నాయి. కృష్ణుడు పిల్లవాడికి 'ప్రద్యుమ్నుడు' అని పేరు పెట్టుకున్నాడు. అంతకుముందు నుండీ ప్రద్యుమ్న వ్యూహం వున్నది. శ్రీకృష్ణమూర్తి భూమికి దిగి రాకముందు నుండీ గూడా వాసుదేవ తత్వం వున్నది. ఆ పేర్లు మనం ఇవాళ పెట్టుకుంటే ఇప్పటివి అనుకోకూడదు. అనిరుద్ధ వ్యూహము, దానిపైన ప్రద్యుమ్న వ్యూహము, ఆ పైన సంకర్షణ వ్యూహము, ఆ పైన వాసుదేవ వ్యూహము నాలుగు వ్యూహములు. ఈ నాలుగు వ్యూహములు కపిల, దేవహూతి సంవాదంలో చాలా వివరంగా ఇచ్చి యున్నారు. చదువుకునేవాళ్ళు భాగవతంలో చదువుకోండి. లేదంటే 'Sankhya' అనే ఇంగ్లీషు పుస్తకంలో వున్నది చదువుకోండి. ఈ నాలుగు వ్యూహములు సరాసరి వ్యక్తమౌతూంటే, పదార్థము అనేది కనిపించదు. పదార్థ రూపంలో వున్న చైతన్యమే దర్శనం ఇస్తుంది. అంటే ఇది గ్లాసు అనిపిస్తుంది. వెండి గ్లాసు అనిపిస్తుంది. కొంచెం జాగ్రత్తగా వుండాలి, వెండిది అనిపిస్తుంది. అలాగుండదు. వెండి గ్లాసు రూపంలో వున్న చైతన్యము గుర్తొస్తుంది. సరాసరి రూపానికి ఆధారంగా వుండేవాళ్ళు గుర్తొచ్చేస్తారు అన్నింట్లో కూడా. అదీ లోదృష్టి అంటే. ఈ లోదృష్టి ఎవరికైతే ఏర్పడుతుందో, వాళ్ళు అంతర్ముఖులౌతూంటారు. అంతర్ముఖులవడం అంటే ఈ బహిర్ముఖంలో కనిపించే లోపలి విషయాలు తెలుస్తూంటాయి. ప్రతివాళ్ళ మొహం అందంగానే వుంటుంది చూడ్డానికి. లోపల ఎన్ని వున్నాయో? ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క programmed face వుంటుంది. ఎవరి యొక్క programme ప్రకారం వాళ్ళ

యొక్క face indicate చేస్తూంటుంది. అందుకని ముఖం చక్కటి సమాచారం అందిస్తూంటుంది. ఒక్కసారి ముఖం చూడగానే totality of our thought pattern మహాత్ములకి అవగాహన అవుతుంది. ఎక్కడ బాధపడ్తున్నాం, దేన్నిబట్టి బాధపడ్తున్నాం  తెలుస్తుంది. వ్యక్తం అవుతూంటుంది. ఈ విధంగా అన్నిట్లోంచి వ్యక్తం అవుతున్న దాంట్లో లోపల వున్న తత్వాన్ని చూడడమే! అదీ ప్రహ్లాద చరిత్ర. అదీ అంబరీషుడి చరిత్ర.  అట్లా చూస్తూ వుంటే అవరోధము లుండవు. మనకి అవరోధములున్నాయి అంటే మనం Non- God గా చూస్తున్నామన్న మాట సన్నివేశాన్ని. మనకివ్వబడ్డ సన్నివేశం భగవంతుడు. మనం చూస్తున్న రూపం భగవంతుడిది. అన్ని నామములు భగవంతుడివి. ఇట్లా చూసే వాళ్ళుంటారు. అట్లా కాకుండా చూస్తే అన్నీ అడ్డుగానే కనిపిస్తాయి. శరీరం ముందు అడ్డుగా కనిపిస్తుంది. మన శరీరమే మనకి అడ్డుగా కనిపిస్తుంది. అంటే మన శరీరము అనే సప్తధాతువులతో చేయబడ్డ దానిలోకి అనిరుద్ధ వ్యూహము యొక్క కిరణములు ప్రసరింప చేయకుండా మనమే చేసికొంటున్నాం. మనలో పరిపూర్ణముగా ప్రసరింప చేసి, మననుండి వ్యక్తం అవుతూండేది అనిరుద్ధుడు. కనక అనిరుద్ధ వ్యూహం పరిపూర్ణమైతే యోగం సాధించినట్లే. "యోగః చిత్తవృత్తి నిరోధకః " చిత్తము యొక్క వృత్తులు అనిరుద్ధుణ్ణి చూస్తుంటే వుండవు. మనసుకు రకరకములుగా విస్తరించడం అనేది వుండదు. ఎందుకంటే మనసు మీద బుద్ధి అనే వెలుగు పరిపూర్ణంగా పడి వుంటుంది. అంటే full moon గా వుంటాడు. తేజస్సు వుండదు. మనకి కళాకళలు కదా! పాడ్యమి నుండి పౌర్ణమి వరకు. అప్పుడప్పుడు పౌర్ణమిగా వుంటుంది. అప్పుడప్పుడు అమావాస్యగా వుంటుంది. ఈ మధ్య తిధులన్నీ మన మొహంలో కనిపిస్తూంటాయి. ఎందుకు కనిపిస్తుంటాయి అంటే ప్రద్యుమ్నుడనే వెలుగు యొక్క స్మరణ లేకపోవడం వలన. ప్రద్యుమ్నుణ్ణి స్మరించనక్కరలేదు. ప్రద్యుమ్నుణ్ణి, సంకర్షణుణ్ణి స్మరించనక్కరలేదు. సరాసరి వాసుదేవుడు గుర్తువుంటే వీళ్ళిద్దరూ automatic గా వుంటారు శంఖు చక్రాల లాగ. వేంకటేశ్వర స్వామి అంటే నామాల కటూ ఇటూ శంఖుచక్రాలు కనిపిస్తాయి కదా! ఉత్త నామాలు కనిపించవు. అట్లాగే ఇదీనూ. అటువంటి అనిరుద్ధ వ్యూహము మనయందు స్థిరము చేసుకోవాలి. హృదయము నందు దర్శనము చేసుకోవాలి. అనిరుద్ధుడు హృదయము నందుంటాడు. మన హృదయము ఆధారంగానే మొత్తము ఈ సప్తధాతువులతో చేయబడ్డ శరీరము, ప్రాణమయ కోశము, కామమయమైన లోకములు, భౌతిక

లోకములు ఇవన్నీ అది ఆధారంగా పనిచేస్తున్నాయి. సింహాసనం మీద కూర్చొని రాజ్యం ఏలతాడే తప్ప రాజు, రాజ్యమేలడం అంటే ప్రతి ఇంటికీ, వీధికీ వెళ్ళిరావడం కాదుకదా!Managing Director officeɜ ఆఫీస్ లో తన కుర్చీలో కూర్చొని మొత్తం factory అంతా control చేస్తూంటాడు. మొత్తం control చేస్తున్నాడంటే ప్రతిచోటా వీడు తిరుగుతున్నాడనా? కానీ వీడి ప్రభావం అంతటా వుంటుంది. అయ్యగారు ఆఫీసులో వున్నారా అని అడుగుతారు వచ్చినవాళ్ళు. ఉంటే ఒక పద్ధతిలో వుంటుంది. లేకపోతే ఇంకో పద్ధతిగా వుంటుంది కదా office! Manager కూర్చుంటే ఒక పద్ధతిగా వుంటుంది. Manager కూర్చోకపోతే ఒక పద్ధతిగా వుంటుంది. అలాగే అనిరుద్ధుడు హృదయమునందు స్థిరముగా వున్న చోట చుట్టూ వుండేవి చక్కగా ప్రవరిస్తాయి. కారణం వెలుగు కిరణములు వాని నుండి వ్యక్తమై, అంతటా వ్యాపనం చెంది వుంటుంది. అలా కానిచోట మరో విధంగా వుంటుంది. భగవంతుడు అనిరుద్ధుడు. అంటే  ఆయన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు. ఆయన యొక్క వెలుగు ప్రసారానికి అవరోధములు లేవు. భగవంతుని యందే కాక భగవద్భక్తుల యందు కూడా మనం ఇది చూడవచ్చు. భగవద్భక్తుల యందే, అడ్డూ ఆపూ లేకుండా పనిచేసిన మహాత్ములని మనం చూస్తూంటాం ఈ భూమి మీద. అంటే సిద్ధ సంకల్పు లన్నమాట. వారేం చేద్దామని మొదలు పెట్టినా అది పరిపూర్ణమయ్యేంత వరకూ ఆగదు. మనం మొదలు పెడితే మర్నాడే ఆగిపోతుంది. మధ్యలో ఆగిందిట అంటే అనిరుద్ధ వ్యూహము పరిపూర్ణంగా లేదుట. దింపుకొన్న ఆ భగవత్తత్వము అవతరణం చెందడం పరిపూర్ణం కాలేదుట అని అర్థం. అది పరిపూర్తయితే మననుండి వచ్చిన సంకల్పము పరిపూర్ణమవుతుంది. శ్రీకృష్ణుడు దిగివచ్చాడు. దిగివచ్చిన కార్యక్రమం పరిపూర్ణమైంది.  శ్రీరాముడు దిగి వచ్చాడు. దిగివచ్చిన కార్యక్రమం పరిపూర్ణమైంది. మధ్యలో ఆగిపోయిందన్నట్లుగా వుండదు. మధ్యలో ఆగిపోయిందిట అంటే అనిరుద్ధుని ప్రసారం పూర్తిగా వ్యక్తం కాకపోవడం. 'సిద్ధ సంకల్పులు' అంటారు మహాత్ములని. భగవంతుడు దిగివస్తే ఇహ ప్రశ్నే లేదు. మన దేశంలో చాలామంది మహాత్ములున్నారు. వారంతా చేపట్టిన కార్యక్రమములు చేపట్టిన పద్ధతులలో, సకాలంలో  చెప్పింది చెప్పినట్లుగా  అయిపోతూవుంటుంది. అలా ఎందుకు పూర్ణంగా అవుతుందంటే అన్నిట్లో ఉండే ఒకే ఒక తత్వాన్ని వాళ్ళెప్పుడూ  దర్శిస్తూంటారు. కాబట్టి circuit complete అయి వుంటుంది. మనం చేసే పనులలో ఈ స్ఫూర్తి ఎంత ఎక్కువగా వుంటే  అంత వరకు పదార్థం

అడ్డుపడదు. ఇక్కడ పదార్థం అంటే మనసుకు సంబంధించింది కూడా పదార్థమే. మనసులోని మన భావాలే అడ్డుపడవు. మన ఇంద్రియ సముదాయం నుండి పుట్టే కోరికలు, మనం సంకల్పించినట్టి సత్సంకల్పానికి అడ్డుపడవు. మన శరీరం దానికి సహకరించి, కార్యక్రమాలు నడుస్తూంటాయి తప్ప, ఆగిపోయినాయి అని వుండదు. మొదలుపెట్టాము, ఆపేశాం అన్నట్లుండదు. అవరోధం లేకుండా చేసేట్టి భగవత్తత్వము పేరు "అనిరుద్ధ వ్యూహము". కాబట్టి అనిరుద్ధుడు మనలో, మన చిత్తమందు పనిచేస్తాడు. చిత్తమందు ఎట్లా పనిచేస్తాడూ అంటే నేను అనే వ్యక్తి, నేను అనే అంతర్యామి యొక్క ఒక తరంగముగా గుర్తున్నంతసేపూ పనిచేస్తాడు. అది గుర్తు పెట్టుకోవాలి. అది గుర్తు పెట్టుకోకపోతే, దేవతలకు కూడా అవరోధాలు వస్తాయి. కేనోపనిషత్తులో అదే వున్నది. దేవతలంతటి వాళ్ళు ఈ సమస్త సృష్టిని నిర్వహిస్తూంటే, వారికే అనిపించింది మనం చాలా బాగా చేస్తూన్నాం అని. అనిపించిడం వలన వారికి భంగపాటు కలిగింది.

## 194 సురానందః

సూర్యుడి నుండి వ్యక్తం అవడం వలన సురలకి జయం కలుగుతూంటుంది. భూమిసురులు వున్నారు, అంటే వారే బ్రాహ్మణులు అంటే బ్రహ్మాత్వమును పొందినవారు. బ్రహ్మాతత్వము నందు నిలిచినవారు. మనం బ్రహ్మాతత్వములో నిలిచి వుంటే మనలో ఆయన నిలిచి ఉంటాడు. కనుక అవరోధాలుండవు. భూమి సురులున్నారు. భూమి చుట్టూ దేవతలున్నారు. వీరందరికి కూడా ఆనందాన్ని కలిగిస్తుంటాడు భగవంతుడు. వీరు ఆయన యందుండుట వలన. అంటే దైవతత్వమున ఎవరుంటే వారంతా సురులే. విశ్వచైతన్యము అస్తిత్వము యొక్క ఎరుక కలిగి వుండడం వలన ఎప్పుడూ ఆనందం కలుగుతుంది. ఇదికాక ఇంకేమన్నా గుర్తున్నాయనుకోండి ఆనందం ఉండదు. తదితర విషయములందున్నప్పుడు అవరోధాలు వస్తుంటాయి. దాని యందున్నప్పుడు అవరోధాలు పోతుంటాయి. దేవతలకు తాము వెలుగు స్వరూపములు, తమనుండి భగవంతుని యొక్క అవ్యక్త తత్త్వము వ్యక్తమై కనిపిస్తూంటుంది. దేవతలలో వుండే వెలుగు 'దివి.' దివి అంటే వెలుగు. దేవతలు దివ్య లోకములకు సంబంధించినట్టి జీవులు. మనం మనోలోకములకు సంబంధించినట్టి జీవులం. మనకన్నా ఓ మెట్టు పైనున్న బుద్ధిలోకముల లోని జీవులలో మనకన్నా ఎక్కువ వెలుగు ఉంటుంది. మనోలోకములలో వుండే జీవులకి వెలుగు తక్కువ వుంటుంది. అక్కడ నుండి కామలోకములలో వుండే జీవులకు ఇంకొంచెం తక్కువ వెలుగుంటుంది. ఇంకా మన శరీరమే మనం అని బొత్తిగా అనుకొనే జీవులకి వెలుగు గుడ్డి దీపాలల్లె వుంటుంది. అంటే దైవత్వము పదార్థం లోనికి అవతరణము చెందినపుడు నెమ్మది నెమ్మదిగా పదార్థానికి బలం ఎక్కువ అవుతూంటుంది. పరమార్థానికి బలం తక్కువగా వుంటుంది. ఇక్కడ సురానందుడు తనయందు జీవించినంతసేపూ సురలకు పరమానందం కలిగిస్తాడు. ఏ రోజున సురలకు ఈ జరుగుతున్న విజయాలన్నీ తమ కారణంగా జరుగుతున్నాయని అనుకుంటారో, ఆ రోజు మరల అపజయం కలుగుతుంది. ఇంద్రుడు ప్రతిసారీ సింహాసనం కోల్పోవడం అలా అనుకోవడం వల్లనే జరిగింది. ఇంద్రుడు సింహాసనం కోల్పోయి, రాక్షసులు దాన్ని ఆక్రమించారంటే ఏమిటి? మన కథే! మనం

విశ్వవ్యాప్తమైన చైతన్యాన్ని మర్చిపోయినప్పుడు, చేసేదంతా మనమే చేస్తున్నామని అహంకరిస్తాము. మంచి జరిగినపుడల్లా మనవల్లే జరిగిందని, చెడు జరిగితే ఇంకొకళ్ళ వల్ల జరిగిందనీ కదా అనుకుంటాం. ఏమండీ అలా చేసారు function అలా జరుగుతోందేమిటీ అంటే, సరిగ్గా జరగకపోతే ఇంకొకళ్ళ మీద తోసేస్తాం. బాగా జరిగినప్పుడు మనకి అహంకారం వస్తుంది. అప్పుడు ఈ నేనుగా వాడే అని మర్చిపోతారు. మర్చిపోగానే వెంటనే మనకి అవరోధాలు వచ్చేస్తాయి. అవరోధాలు కల్పించడమే అటుపక్క నుండే వాళ్ళ పని. వాళ్ళు వీళ్ళు ఇద్దరూ దితికి, అదితికి, పుట్టినవాళ్ళే! కశ్యపుడి పిల్లలే! కశ్యపుడంటే అట్లా ఉండి, మొత్తం సృష్టిని చూస్తుండే భగవత్తత్వాన్ని 'కశ్యప' అంటారు. కశ్యపుడంటే చూసేవాడు. పస్యకుడంటే ఇటు నుండి అటు చూసేవాడిని, క్రింద నుండి పైకి చూసేవాడని. పై నుండి క్రిందకి చూసేవాడిని 'All seen eye' కశ్యపుడంటారు. ఆయన్నుండి పగటి ప్రజ్ఞలుగా దేవతలొస్తే, రాత్రి ప్రజ్ఞలుగా దితి సంతానమైన దైత్యులు వస్తారు. వాళ్ళ పని పదార్థాన్ని చక్కగా తయారుచేయడం, దేవతల పని వెలుగుని ప్రసారం చేయడం. ఎప్పుడైతే దేవతలు వెలుగుని ప్రసారం చేయడం మానేస్తారో, అప్పుడు పదార్థం ఇరికించేస్తుంది. మనమంతా పదార్థంలో ఇరుక్కోలేదూ? ఎందుకు ఇరుక్కున్నామంటే, మనకి మూలమైనదాన్ని మర్చిపోయినప్పుడు ఇరుక్కోవడం జరిగింది. మనకి మూలమైనది గుర్తున్నప్పుడు ఇరుక్కోవడం జరగదు. అందుకే దేవతలు కూడా తమ మూలస్థానాన్ని మరచిపోయినప్పుడు ఇంద్రుడు ఇంద్రత్వాన్ని కోల్పోతుంటాడు. కోల్పోయి బాధలు పడుతుంటాడు. బాధలు పడ్డాక మళ్ళీ rectifications జరుగుతాయి. Rectification, పరితాపం పడడం వల్లనే పరివర్తన వస్తుంది. మనకి సమస్యలు వున్నాయనుకోండి జీవితంలో, ఈ సమస్యకి నేనే కారణం, నేనే బాగుచేసుకోవాలి, దీన్ని అనుకున్న వాడికి దేవతల సహాయం, భగవంతుడి సహాయం కలిగి తీరుతుంది. ఈ సమస్యలకి ఇంకొకళ్ళు కారణం అనుకున్నవాళ్ళకి ఎప్పుడూ పరిష్కారం రాదు. పరివర్తన ఎప్పుడు కలుగుతుందంటే, భగవంతుని యందు మనం నిలిస్తే, మనకి బుద్ధి ఏర్పడుతుంది. మనమే కారణం వీటన్నిటికీ అనిపిస్తుంది, మనం తెచ్చుకొన్నవేగా అనిపిస్తుంది. ఇంకొకళ్ళు కారణంగా అనిపిస్తే ఇంకా మనలో చీకటి బాగా వున్నట్లు. మనమే దీనికి కారణం అనుకున్నప్పుడు వెలుగు వస్తుంది. మనమే

దీనికి  కారణం అని ఎప్పుడు తెలుస్తుందంటే  భగవంతుని యొక్క  స్మరణ జరిగినప్పుడు  తెలుస్తుంది.  ఎందుకంటే భగవంతుని స్మరణ  జరగగానే విశ్వచైతన్యము నుండి ఒక తరంగం వచ్చి,  మనలో ప్రద్యుమ్న వ్యూహంగా వ్యక్తమై వెలుగు ఏర్పడుతుంది.  ఏర్పడ్డ వెలుగులో  clarity వస్తుంది. Cause and effect కదూ! ఎందుకిలా జరుగుతుందో కారణం కనిపెట్టుకోడం, basis తెలియడం జరుగుతుంది. Basis  తెలిసి, మళ్ళా బుద్ధివంతులమై  చేసిన తప్పులు దిద్దుకోవచ్చు.  అట్లా వీలుపడుతుంది.  అందుకని 'సురానందుడు'  అనే భగవంతుని  నామం మనయందు పనిచేస్తుంది.  సురల యందు కూడా అదే వ్యక్తమవుతూంటుంది.  జయము అంటే సృష్టి  మొత్తం జయం,  సృష్టి కార్యం జయం,  జయమనే పదం 'యజము'  అనే పదాన్ని తలక్రిందులుగా చెప్పుకొనే శబ్దం.  యజము అంటే  త్యాగం చేయడం.  భగవంతుడు తనను తాను  త్యాగం చేసుకుంటూ, ఇవన్నీ సృష్టి  చేసాడు.  అదీ  పురుషమేధము అంటే.  ఒకే పురుషుడు ఇన్ని రకాలుగా తయారైనాడు.  ఇన్ని రకాలుగా తనను తాను  త్యాగం చేసికొన్నాడు. అందుకే యజం జరుగుతుంది.  మనం కూడా భగవంతుని లాగే మనల్ని మనం పంచిపెట్టుకున్నాం  అనుకోండి, ఇతరుల యొక్క వినియోగార్థం. మనకు యజము జరగడం వలన జయం కలుగుతుంది.  కాబట్టి ఈ జయం మనకు ఎప్పుడు కలుగుతుందో అప్పుడు మనకు  ఆనందం కలుగుతుంది.  ఆ  జయము దేవతలకు ఎప్పుడూ వుంటుంది.  అప్పుడప్పుడు వుండదు.  ఆ జయము మానవులకు అప్పుడప్పుడు వుంటుంది. ఎప్పుడూ వుండదు.  దేవతలకీ మనకీ reverse అన్నమాట.  వాళ్ళకెప్పుడూ వుండి,  అప్పుడప్పుడు వుండకపోవడం వలన దెబ్బలు తగిలినా,  మళ్ళీ అందరూ ఒకసారి సర్దుకుంటారు.  మనకి ఎప్పుడూ వుండదు కాబట్టి దెబ్బలు తగిలినప్పుడు  కారణాలు వెతుకుతాం తప్ప, కారణం మనమే అని గుర్తించం.  కారణాలు మనమే అని గుర్తించాలంటే వెలుగు కావాలి. దానికి దైవారాధన కావాలి.  కష్ట సమయంలో దైవారాధన ఎక్కువ కావాలి. సుఖంగా వున్న సమయంలో కూడా వుంటే పడిపోకుండా వుంటాం.  కష్టంగా వున్న సమయంలో తప్పక కావలసి వుంటుంది.  అందుకని భగవంతుడు మనల్ని, మనం మర్చిపోయామని అటు పంపిస్తాడు. కష్టాలలో ఏదో ఒక గుడి ఆంజనేయుడి గుడో, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడో లేదా ఏదో ఒక గురువో ఇలా పట్టుకోడం మొదలుపెడతాం.  ఎందుకంటే వెలుగు ఇంకా ఎక్కువగా ప్రసరించి, బుద్ధి బాగా

పనిచేస్తుంది కాబట్టి. ఎప్పుడూ ఆనందంగా ఉండాలన్నా సరే స్థిరత్వము నందు ఆనందమున్నది. స్థిరత్వము అంటే వెలుగు కేంద్రములు, వెలుగు కిరణములు, వెలుగుకి సంబంధించిన లోకములలో మనం జీవించడం. మనం వెలుగు లోకములలో జీవిస్తే మనం దేవతలం. మనం మన మనస్సులో, చిత్తములో జీవించినప్పుడు మానవులం. కోరికల్లో పూర్తిగా దిగిపోయి జీవించినప్పుడు పశువులం అవుతాం. మరీ బొత్తిగా పదార్థంలో జీవిస్తే రాళ్ళయిపోతాం. నిజానికి రాయికి వుండడం మాత్రం వుంటుంది. ఇంకేమీ వుండదు. మొక్కకి ఉండడమే కాకుండా స్పర్శ/ sensation వుంటుంది. జంతువుకి ఉండడంతో స్పర్శ, కోరిక కూడా వుంటుంది. తిందామనే కోరిక వుంటుంది కదా! లేచిన దగ్గరనుండీ అదే పని. చెట్టుకి అది లేదు. చెట్టుకి sensation తప్ప తిందామన్న కోరిక లేదు. కోరికల లోకం పశువులకే వుంటుంది.మనం కోరికల లోకంలో ఉన్నామనుకోండి. Sensation లోనే ఉన్నామనుకోండి. ఎక్కడున్నట్లు? బొత్తిగా sensation కూడా లేదనుకోండి. మొద్దల్లె, రాయల్లే వున్నాడనుకొంటాం. కనుక చైతన్యము యొక్క అవస్థితులు దైవత్వము నుండి మానవత్వం, మానవత్వం నుండి జంతుత్వం, జంతుత్వం నుండి వృక్షత్వం, వృక్షత్వంనుండి జడత్వం ఇలా ఏర్పడుతుంది. మానవుడు తన యొక్క మస్తిష్కంలో జీవిస్తున్నాడనుకోండి. అంటే ప్రతి వాడికి ఒక logic వుంటుంది. అది వాడి తెలివనుకుంటాడు. కానీ logic వేరు, తెలివి వేరు. Logic ఎప్పుడూ తాడుకి కట్టినట్లుగా ఒకే పరిధిలో తిరుగుతూంటుంది. తెలివనేదీ దానికి పైన వుండే వెలుగు. అందుకే భగవంతుని స్మరణ చేసుకొనేవాళ్ళకి ఈ వెలుగు వచ్చి, తన logic లో వుండే లోటుపాట్లు తెలుస్తాయి. ఎట్లా చెయ్యాలీ , ఏం చెయ్యాలీ అని తెలియకుండా చేసేవాడు logic లో బతుకుతూంటాడు. కావలసినది law తప్ప, logic కాదు అనేవారు మాస్టరు. Law అంటే ధర్మం. ఆచరించవలసినది ధర్మం తప్ప, జీవించవలసినది logic లో కాదు. ఎలా చేయాలో విచికిత్స చేసి చూసేవాడు ఎప్పుడూ ఏమీ చెయ్యడు. చేస్తున్నవాడికి చేస్తున్న దాంట్లోంచి, చేస్తూండగానే ఎట్లా చేయాలో గోచరిస్తుంది. అందుకనే ముందు కర్మయోగం ఇచ్చి, తర్వాత జ్ఞానయోగం ఇస్తాడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో. ముందు భగవద్గీత వింటే పనులు చెయ్యరు ఎవరూను, ఎప్పుడూనూ. అందుకే ముందు పని ఎట్లా చెయ్యాలో చెప్పి, తర్వాత భగవద్గీత చెప్పాలి. ఎందుకనంటే మనకొచ్చే ఆలోచనలని సమపాళ్ళలో వుంచేది ఆచరణ. Thinking is balanced

by action అన్నారు. Action తక్కువైతే, thinking ఎక్కువవుతుంది. Lopsided thinking వచ్చేస్తుంది. ఆలోచనలలో జీవించేవాళ్ళలో ఎక్కువమందికి ఆచరణ తగ్గిపోతూంటుంది. బొత్తిగా ఒక్కళ్ళూ ఊరికే కూర్చొని అలా ఆలోచనలు చేస్తూంటారు. అలా మస్తిష్కంలోంచి ఆలోచలనలు వస్తూంటాయి. వాటికి ఎడతెరిపి వుండదు. చేసే పని కూడా మానిపించేస్తుంది అది. పొయ్యి మీద పెట్టినవి మాడిపోవడమో, పొంగిపోవడమో, అనుకున్న పని సక్రమంగా, సకాలం లో చెయ్యలేకపోవడమో ఇలా మస్తిష్కంలో జీవిస్తే, more thinking than action. మస్తిష్కానికి పైన వున్న వెలుగులో వున్నప్పుడు ఆనందం వుంటుంది. ఉట్టి logic లో జీవించేవాడికి ఆనందం వుండదు. తెలివితేటలతో జీవించేవాడికి ఆనందం తక్కువ వుంటుంది. ఎందుకంటే తెలివితేటల పైన అనుభూతి అని వుంటుంది. అనుభూతిలో ఉండేవాడు ఇచ్చిన మామిడిపండు తిన్నవాడు. తెలివితేటలతో వుండేవాడు మామిడిపండు సైజేమిటి, రంగేమిటి, ఎన్ని రకాల మామిడి పళ్లుంటాయి, ఎక్కడెక్కడ పండుతాయి, ఒక మామిడి పండులో ఎంత రసం వుంటుంది, ఆ రసంలో ఇది కలుపుకుంటే ఎలా వుంటుంది, ఇది కలపకుంటే ఎలా వుంటుంది ఇవన్నీ తెలుసుంటాయి తప్ప, మామిడిపండు తినడు. అట్లా వుంటారు తెలివితేటలున్నట్టివారు. అనుభూతి వున్నట్టివాడు తిని హాయిగా కూర్చుంటాడు. ఎందుకూ? వాడు ఆ రుచిలో ఉంటాడు. మామిడిపండు తిన్న రుచిలో వీడుంటాడు. మామిడిపండు గురించిన రుచిలో వాడుంటాడు. ఇన్ని చెప్పాక కూడా మామిడిపండు తిన్నారా అంటే, ఇది తినాలా లేదా అని చదువుతున్నాను దీని గురించి అంటాడు. సరే అయితే వస్తాను, అంటాడు. ఒక కథ వుంది. ఒకాయన 30 సంవత్సరాల పాటు దానం చెయ్యడం గురించి ఉపన్యాసాలిస్తాడు. చెప్తూ చెప్తూ ఊళ్ళో గొప్ప పేరు సంపాయించుకున్నాడు. ఒక రోజు సాయంత్రం వాడింటికి ముగ్గురొచ్చారు. వచ్చి, మాకు ఆకలేస్తోంది, మాకు అన్నం పెట్టండి అని అడుగుతాడు ఒకడు. నాకు బట్టల్లేవు, కొంచెం బట్టలివ్వమని ఒకడు అడుగుతాడు. మూడవవాడు నాకు ఉండడానికి స్థలం లేదు, మీ ఇంట్లో వుండనీ అని అడుగుతాడు. ఆ మూడూ వీడు నిరాకరించాడు. నా ఇంట్లో నువ్వుండడానికి వీల్లేదు. నీకివ్వడానికి నా వద్ద బట్టల్లేవు. నేను నీకు భోజనం పెట్టను. 'మరెందుకయ్యా ఈ ఉపన్యాసాలు దానం చెయ్యమని ? ఉపన్యాసాలు ఇచ్చావు కదా! నీకు అసలు దానం చేసే బుద్ధే లేదు' అని అడిగారు. ఇట్లా ఉత్తి

తెలివి వుండడంవలన ఏమీ ఉపయోగం వుండదు. ఉత్తి తెలివి వున్న వాళ్ళు ఆనందం పొందలేరు. It is not their loss. వాళ్ళకి జీవితంలో వుండే అనుభూతి వాళ్ళ వంతు కాదు. వాళ్ళ ఆస్తి కాదు. వాళ్ళ సొత్తు కాదు. ఎవరికయ్యా వుంటుందంటే ఏదో తెలిసిన కాస్తా ఆచరిస్తూ, ఆనందంగా వుండే వాడికి ఎక్కువ ఆలోచనా అనుభూతి వుంటుంది. ఆలోచన దేనికంటే పనికోసం తప్ప, పనికి పనికిరాని ఆలోచన ఎందుకూ? భగవంతుడు మనకి ఆలోచన ఎందుకిచ్చాడంటే, ఏదన్నా పని చేసుకోవడానికి. పని చెయ్యని ఆలోచన వృథా కదా! మన శరీరం అవసరం లేకపోతే అలా కూర్చోపెడుతున్నాం. ఇంద్రియములు అవసరం లేకపోతే వాటినట్లా కూర్చోపెడుతున్నాం. పని లేకపోతే ఆలోచనలు కూడా అక్కరలేదు. కూర్చోపెట్టవచ్చు. అట్లా కూర్చోపెట్టగలిగన వాడికి వెలుగు అంటే ఏమిటో తెలుస్తుంది. ఎప్పుడూ ఆలోచనల్లో వుండే వాడికి ప్రశాంతత అంటే ఏమిటో తెలీదు. ప్రశాంతత అంటే ఏమిటో తెలియని వాడికి వెలుగంటే ఏమిటో తెలీదు. వెలుగంటే ఏమిటో తెలియకపోతే ఆనందం అంటే ఏమిటో తెలియదు. ఆనందం గురించే వుంటుంది. వాడి ఆనందం ఎట్లా వుంటుందంటే ఆ పూటకు ఏదో ఇంద్రియ తృప్తి కలిగిన కాస్త సేపు ఆనందంగా వున్నట్లు అనిపించి మాయం అయిపోతూ వుంటుంది. మనకి ఇంద్రియతృప్తి జరిగి, దానిలో మోక్షం జరుగుతోంది ప్రతి నిత్యం. మోక్షమే అది. చూసినంతసేపూ బావుంటుంది. చూసిన తర్వాత? మళ్ళీ చూస్తేనే బావుండేటట్టుగా వుంటుందది. ఎంతసేపు అట్లా చూస్తూంటావు? టి.వి చూస్తుంటే బావుంటుంది. సినిమా చూస్తే బావుంటుంది. ఎంతసేపు చూస్తావు? శాశ్వతమా ఏమన్నా? తింటే బావుంటుంది. ఎంతసేపు తింటావు? రోగం వచ్చేవరకు తింటావు. రోగం వచ్చాక తినకూడనివన్నీ list ఇస్తారు. తినకూడదని ఏడవడం వుంటుంది. ఎల్లకాలమూ తినలేవు, చూడలేవు, వినలేవు, మాట్లాడలేవు. స్పర్శ ద్వారా ఆనందం పొందలేవు. ముట్టుకుంటే ఆనందంగా వుంటుంది. లింగ భేదం చేత స్త్రీకి పురుషుడు, పురుషుడికి స్త్రీని ముట్టుకుంటే ఆనందంగా వుంటుంది. అయితే ఎంతసేపు ముట్టుకుంటావ్? ఇవన్నీ ప్రశ్నలు వేసారు. ఎంత సేపయ్యా ? ఆ కాస్తా అయ్యాక, కొంతసేపయ్యాక దాని మీద విముఖత కలుగుతుంది. తినగానే విముఖత వస్తుంది కదా! Every attraction is for the repulsion. కాబట్టి ఇవన్నీ ఆనందం కల్పించినట్టుగా కనిపిస్తాయే తప్ప, నిజంగా ఆనందం కల్పించవు. నిజంగా ఆనందం ఇచ్చేదానిలో

నువ్వు గనక ఇమిడి యున్నట్లైతే, ఈ చిల్లర రకం ఆనందంలో జీవించడం వుండదు. అందుకే ఆనందం పేరున మనకిచ్చేది వాటి యొక్క శవములను మాత్రమే అని చెప్తాడు శ్రీకృష్ణుడు. ఇంద్రియములు ఆనందం ఇస్తాయని నువ్వు వెంటపడ్తావే, వాటి యొక్క స్మృతులు అనే శవములు నీ మనుస్సులో వుండిపోయి, వాటి వెంట పరుగెట్టేటట్లు చేస్తూంటాయి. అందులో ఏం దొరకదు సుమా! అది పొట్టు తప్ప, అందులో గింజ లేదు అని చెప్తాడు కృష్ణుడు. గింజెక్కడ వుంటుందంటే, ఈ ఇంద్రియముల లోనికి వాణ్ణి గనక దింపితే, అక్కడ వుంటుంది. దింపితే వాణ్ణి గూర్చిన అనుభూతి ఎక్కువగా వుంటుంది. ముష్టివాడికింత పారేసామనుకోండి రోజూ వస్తాడు, దరిద్రం, సరిగ్గా ఆఫీసు కెళ్ళేముందు అపశకునంలాగా అని తప్పదనుకుంటూ ఓ రూపాయి బిళ్ళ వేసినదానికీ, ఆ వచ్చినవాడు భగవంతుడి రూపంలో ఒకడనుకున్నప్పుడు మనకు ఆనందం కలుగుతుంది. ఇచ్చే రూపాయిలో భక్తి, శ్రద్ధ, ఆనందం వుంటాయి. చేసేపని తప్పనప్పుడు, ఏడుస్తూ చెయ్యడం ఎందుకూ? అందుకని అది కూడా భగవద్గీతలో చెప్తాడు శ్రీకృష్ణుడు. 'నువ్విచ్చేదంతా కూడా నాకే ఇస్తున్నావని గుర్తు పెట్టుకొని ఇమ్మని' చెప్తాడు. అందుకని నాకే ఇస్తున్నానని అనుకున్నప్పుడు నీలో శ్రద్ధ వుంటుంది. ఎవరికో ఇస్తున్నానని అనుకున్నప్పుడు శ్రద్ధ వుండదు. శ్రద్ధ లేకుండా ఇస్తే అనుభూతి నీది కాదు. నాకిచ్చావన్న శ్రద్ధతో ఇస్తే, అనుభూతి నీది. పదిమందీ చూస్తున్నారో లేదో అని చూసి, 10 రూపాయల నోటు తీసి రోడ్డు మీద వాళ్ళూ వీళ్ళూ చూసేట్లుగా చూసి దానం ఇచ్చి, చూస్తే మంచిదనీ చూసాక వాడు గుర్తు పెట్టుకున్నాడో లేదోనని ఇట్లా వెళ్ళిపోతుంది. ఎదురుగా వున్నవాడు భగవత్స్వరూపుడు. మనం ఇచ్చాం అనుకుంటే, మనకు లోపలనుండి ఆనందం కలుగుతుంది. ఏదన్నా సరే చుట్టూ వ్యాపించిన తత్వంతో మనం పరస్పరత్వం ప్రవర్తిస్తున్నాం అని గుర్తున్నవాడికి ఆనందం శాశ్వతంగా వుంటుంది. వాడు మంచినీళ్ళు తాగినా వుంటుంది. నడివీధిలో వున్నా వుంటుంది. వింటున్నా వుంటుంది. మాట్లాడినా వుంటుంది. చూస్తున్నా వుంటుంది. అన్ని ఇంద్రియముల ద్వారా భగవంతుని ఆస్వాదిస్తూంటాడు. అదీ రస స్వరూపాన్ని ఆస్వాదించడమంటే. భగవంతుడు రస స్వరూపుడు ఆస్వాదించండి అంటే, అదేమన్నా బత్తాయిపండు రసం, మామిడిపండు రసమా? అదొక్కటే కాదు. అందులో కూడా వున్నాడు. అదిగాక జీవితంలో సన్నివేశాలలో బయటకొచ్చామంటే, 5 senses లోంచి బయటకొచ్చామన్న మాట.

బయటకొచ్చేప్పుడు 5 తలకాయలతో బయటకి వస్తాం. 5 నోళ్ళతో లోపలికి తీసుకుంటూ వుంటాం. ఈ 5 ఇంద్రియములు నోళ్ళలాంటివి. ప్రతి దాన్లోండి లోపలికి తీసుకుంటూంటాం. కంట్లోంచి తీసుకుంటాం. ముక్కులోంచి తీసుకుంటాం. చెవిలోంచి తీసుకుంటాం. నాలుక నుండి తీసుకుంటాం, ముట్టుకోడం ద్వారా తీసుకుంటాం. అన్నీ లోపలికి పుచ్చుకునేవే! ఆహారములు 5 రకములుగా రోజూ పుచ్చుకుంటాం. ఈ 5 రకాలుగా పుచ్చుకునేవి భగవంతుడే అని గుర్తుపెట్టుకునేవాడికి వున్న ఆనందం చాలా ఎక్కువ. అందుకే 'అనిరుద్ధ' నామం తర్వాత 'సురానంద' నామం ఇచ్చారు. అనిరుద్ధ వ్యూహంలో జీవించేవాళ్ళకు, సురులు పొందే ఆనందం ఏమిటో తెలుస్తుంది. అంటే వెలుగు లోకంలో వుండడం చేత శాశ్వతముగా ఆనందంగా వుండే అవకాశం వుంటుంది.

# 195 గోవిందః

గోవింద నామం బాగా అలవాటు, తెలుసు మనకు. గోవిందో అంటే గోవులకు యజమాని అని అర్థం. ఎవరికైనా ఇచ్చేటప్పుడు 'గోవిందా' అంటాం కదా! ఎందుకు 'గోవిందా' అని ఇమ్మంటారంటే, నీ దగ్గరున్నదంతా వాడిదే. వాడిది వాడికి ఇస్తున్నాం. పుచ్చుకునేవాడూ వాడే, ఇచ్చేవాడూ వాడే. ఇవ్వటం వాడే అని తెలియడానికి గోవిందా అని చెప్పమన్నారు. మనం ఎవరికైనా ఏదైనా ఇచ్చినప్పుడు బయటకైనా, లోపలికైనా స్మరణ కావాలి. గోవిందా అంటూ, నాయనా నీది నీకే, నీవే తీసుకుంటున్నావు అనుకుంటూ ఇస్తే, ఇది ఒక ఆటలాగ మనకి ఆనందం కలిగేటట్లుగా వుంటుంది. ఒకడివే మూడు roles వేస్తున్నట్లుంటుంది. ఇస్తున్నవాడు, పుచ్చుకున్నవాడు, ఇవ్వడం. Triple action అన్నమాట. ఒకడే మూడు rolesలో workout అవుతూంటే, ఈ మన దగ్గరది ఎవరో మనకిచ్చినది ఎవరికో మళ్ళీ వెళ్లి పోతూంటుంది. ఆ ఎవడో కూడా వాడే! ఎవడైతే మనకిచ్చాడో వాడూ గోవిందుడే! పుచ్చుకున్న మనం గోవిందుడే! మననించి పుచ్చుకున్నవాడూ గోవిందుడే! అంతా ఒకే తత్వంలో recycling జరుగుతున్నట్లుగా జరుగుతుంది. 'గో' అనే పదానికి అర్థం 8. 8వ లోకాన్ని 'గోలోకం' అంటారు. ఏడు లోకముల అవతల పరమాత్మ ఎవరైతే వున్నాడో ఆ తత్వాన్ని 'గోతత్వము' అంటారు. గో పదాన్ని మనం జ్యోతిషపరంగా తీసుకుంటే, 'గ' అనే శబ్దానికి బృహస్పతి అధిపతి. 'ఓ' అనే శబ్దానికి అధిపతి సూర్యుడు. సూర్యుడు ఆత్మ తత్వానికి సంకేతం. బృహస్పతి దాని వ్యాపనానికి సంకేతం. Expansion of consciousness అంటారు బృహస్పతి యొక్క తత్వాన్ని. చైతన్యము యొక్క వ్యాప్తి జరుగుతూంటుంది. దాన్ని "గం" అనే శబ్దంగా చెప్తారు. అందుకని వినాయకుడు అట్లా వుంటాడు. వ్యాపించి వుంటాడు. ఆయన్ని తల్చుకున్నవాళ్ళ చైతన్యాన్ని కూడా వ్యాపింప చేస్తాడు. "గం గణపతయే నమః " అని చేసుకున్నాం అనుకోండి, చైతన్యం బాగా వ్యాప్తి చెందుతుంది. బుద్ధి బాగా పనిచేస్తూంటుంది. కనకనే అవరోధాలుండవు. మనం చేసే ప్రతి పనీ బాగా అయిపోవాలని కాదు. అయ్యే పని మనకి నచ్చేట్లుగా తయారు చేసుకుంటాడు. మనం అనుకున్న పన్లన్నీ అయిపోతే ఒక్కోసారి మనం పాడైపోతాం. పాడై పోవడమే కాక ఒక్కోసారి చచ్చిపోతామేమో కూడా. అందుకని మనకు ఏవైతే

క్షేమమో అవే జరుగుతూంటాయి. అవని వాటి గురించి మనం ఏడుస్తూంటాం కదా! అవనివి జరక్కుండా చేస్తాడు. అయ్యేవే చక్కగా చేస్తూంటాడు. ఏవి చేస్తే మనకి క్షేమమొ అవే చేస్తుంటాడు. దాని ద్వారా చైతన్యము వ్యాప్తి చేస్తూంటాడు. ఎవరైతే 'గం అనే శబ్దం ఉచ్చరిస్తారో వారికి చైతన్యవ్యాప్తి వుంటుంది. 'గం' అనే శబ్దం ఉచ్చరిస్తే, చాలా సత్కార్యములు మననుండి వ్యక్తమై పోతూంటాయి. పెరిగిపోతూంటాయి. మనకి చైతన్యస్థితి త్వరగా అందుతుంది. దానికి 'ఓ అని చేర్చామనుకోండి. గా ప్లస్ ఓ "గో". గో అంటే ఆత్మతత్వం ఆధారంగా వ్యాప్తి అయినట్టిది. గోపాలుడు, గోవిందుడు. గోవిందుడు అంటే ఆవులకి యజమాని. ఆవులంటే గోవులు. గోవులు అంటే కిరణములని కూడా అర్ధమున్నది. సంస్కృతంలో "గో" అంటే కిరణం అని అర్థం. కిరణములకు అధిపతి ఎవరు? కిరణములకు యజమాని ఎవరు? వాణ్ణి గుర్తు తెచ్చుకోవడం గోవింద శబ్దం. ఈ కిరణములకు సూర్యుడు వాహిక. సూర్యుడికి వెనకాల వున్న అతీతమైన శక్తిని గోవిందుడు అంటారు. గో 8 వ లోకమునకు సంబంధించినవాడు. అందుచేతనే శ్రీకృష్ణుడు 8 వ గర్భాన అవతరించాడు. అష్టమ గర్భమని చెప్పడంలో అర్థం ఏమంటే ఏడు లోకములకు ఆవలనున్న తత్త్వము ఏదైతే వున్నదో, ఎవరినుండి ఈ ఏడు లోకములూ కిరణముల రూపంలో దిగివస్తున్నాయో, ఆ లోకానికి సంబంధించిన వారందరినీ గోలోకమునకు సంబంధించిన వారంటారు. ఆ గోలోకమునకు సంబంధించిన ప్రజ్ఞ మనకున్న ఆవులో కనిపిస్తుంది. కాబట్టి దాన్ని గోవు అంటారు. ఆవులో వున్నంత సాధుత్వం ఏ జంతువులోనూ గోచరించదు. అంత సాధుత్వం వున్నది ఆవులో. అంత సత్వ గుణమున్నది ఆవులో. కలికాలంలో ఆవు అంతకంతకీ మరీ సినిమా వాల్ పోస్టరులు తింటున్నట్లుంటుంది. అయినా ఆవు సత్వ గుణ ప్రధానంగా వుంటుంది. గోవుని రోజూ చూడమని ఎందుకు చెప్పారంటే, చూస్తే మనలో సత్వగుణం అవతరణం చెందుతుంది. ఎందుకంటే మనం ఎప్పడూ రజస్సులోనో, తమస్సులోనో వుంటాము. ఏదైనా ఎందుకు చెయ్యాలీ అని నిద్ర పోయేవాళ్ళు తమస్సు. పని చేసుకుంటూ అదే పనిలో తిరిగే వాళ్ళు రజస్సులో వుంటారు. ఇద్దరూ గనక రోజూ ఆవు ముఖం చూస్తే, వాళ్ళకి కాస్త విశ్రాంతి వస్తుంది. ప్రశాంతత వస్తుంది. అంత తిరగక్కరలేదు అనిపిస్తుంది రజస్సు వాళ్ళకి. అంత కూర్చోనక్కరలేదు అనిపిస్తుంది తమస్సులో వున్న వాళ్ళకి. Balance

అయిపోతుంది. ఒక ఆవు ముఖం గానీ, ఒక మహాత్ముని ముఖం గానీ, ఒక దేవతాముఖం గానీ రోజూ చూసినట్లయితే, జరిగేదేమయ్యా అంటే సత్వగుణం మనలో వ్యక్తమౌతుంది. అందుకని ఆవును రోజూ చూడమన్నారు. ఆవుకి ఏదన్నా చేయమన్నారు. ఈ భూమి మీదున్న గోవు ఆ తత్వాన్ని కలిగి వున్నది. అందుకని ధర్మం తెలిసిన వారు, జ్ఞానం తెలిసినవారు గోవును వధించ వద్దన్నారు తప్ప, ప్రత్యేకించి గోవంటే bias కాదు. మన ఋషులు ప్రతి రూపానికి వెనకాల వున్న గుణములను శులభంగా చూసారు. తత్వాన్ని చూసారు. ఆ తత్వం ప్రకారం దేన్నీ మనం ఆశ్రయిస్తే, మనయందు అది ఏర్పడుతుందో అది దర్శించి, మనకో జీవనవిధానం ఇచ్చారు. అందులో భాగంగా గోసేవ ఇచ్చారు. గోసేవ చేసుకుంటే మనలో సాధుత్వం బాగా పెరుగుతుంది. ఇటువంటి గోవులను అందరకీ ఇచ్చేవాడు గోవిందుడు. అంటే కిరణముల రూపంగా ఇవన్నీ ఏర్పరచినపుడు ఈ మొత్తానికంతటికీ యజమానిగా వున్నవాడు అయన. గోవులకు యజమాని, అంటే కిరణములకు యజమాని. కిరణముల కారణంగానే కదా ఇన్నీ ఏర్పడినవి. సూర్యుడి నుండి వచ్చే కిరణముల రూపంగా ఈ భూమి మీద ఇన్ని జీవరాసులు ఏర్పడినాయి. సూర్యుడి కిరణములే లేకపోతే ఏమీ లేదు. కాబట్టి ఈ భూమి మీద వుండే సమస్త జీవులు సూర్య కిరణముల ఆధారంగా జీవిస్తున్నారు. సూర్యుని కిరణములు ఎక్కడ నుండి వస్తున్నాయి? సూర్యుడి ద్వారా వస్తున్నాయి. సూర్యుడికి ఎక్కడ నుండి వస్తున్నాయంటే సవితృ మండలం నుండి వస్తున్నాయి. ఆయనకి ఎక్కడనుండి వస్తున్నాయంటే ఆయనకంటే పైనున్న అగస్త్యస్థితి నుండి దిగివస్తున్నాయి. ఆ దిగివస్తున్న తత్వానికి అధిపతి ఎవరో అంటే ఆయన్ని " గోవిందుడు"అన్నారు. అదే " The Owner of the cow". దిగి వచ్చిన తర్వాత కూడా భూమి మీదకి, పరిపూర్ణమైన అవతారం కాబట్టి గొర్రెలను కాక గోవులను పాలించాడు. గొర్రెలో కూడా" గో " శబ్దం వుంది. కానీ దాన్ని తెలుగు భాషలో గొర్రె అంటారు తప్ప సంస్కృత భాషలో అనం. సంస్కృతం లో దాని పదం వేరు. సంస్కృతం దైవ భాష. బాగా సంస్కృతం తెలిస్తే నిరుక్తమైనట్టి, ఒక తాళం చెవి దొరుకుతుంది. అది తెలిస్తే కానీ ఇవన్నీ తెలియవు. జ్యోతిషం అనే మరో తాళం చెవి వున్నది. అది కూడా తెలిస్తే తప్ప జ్ఞానం మనకి అవగాహన కాదు. కనుక 'గో' శబ్దానికి జ్యోతిష్యాన్ని, నిరుక్తాన్ని ఆధారంగా చేసుకుంటే 'గో' గురించి చాల విజ్ఞానం వస్తుంది. 'గోవిందాయ గోపీజన వల్లభాయ' అని నామం

చేసుకున్నామనుకోండి, ఆ గో శబ్దంలో అంత వున్నది. అలాగే గురు శబ్దం లోని గు లో కూడా వున్నది. గోవిందుడు అంటే ఈ సమస్త సృష్టికి, దానిలోని సమస్త జీవులకు పుట్టుక స్థానము అని అవగాహన చేసుకోవాలి. అందరికీ యజమాని. అందరికీ తండ్రి, జగత్పిత. జగత్పితగా ఇన్ని రూపాలలో వున్నటువంటి వాడు "గోవిందుడు". అనిరుద్ధుడు అనే తత్వం పరిపూర్ణమై, సురానందం పొందుతూంటే, ఈ మొత్తం అంతా వాడిదే అని తెలుస్తుంది. అది శ్యమంతకమణి కథ. అదే మనకి పారిజాతాపహరణంలో కనిపిస్తుంది. వీటన్నిటిలో కన్పించేది ఇదే. ఇంతకు ముందు నరకుడి బాధ నుండి రక్షించి, ఇంద్రుడికి రాజ్యాన్ని సంపాదించి ఇస్తాడు కృష్ణుడు. ఆ తర్వాత వెళ్లి కొన్నాళ్ళకి పారిజాత వృక్షం తెచ్చుకుంటే, ఇంద్రుడికి కోపం వచ్చి, యుద్ధం చేయబోతాడు. యుద్ధం చేయబోతే 'అదేమిటి మొత్తం అంతా ఆయనదే కదా! అయన వస్తువు నీ దగ్గర పెట్టాడు. ఆయనొచ్చి తీసుకువెళ్తే నీకేమిటి అభ్యంతరం', అని దండిస్తుంది తల్లి ఇంద్రుణ్ణి. పారిజాతాపహరణం చదువుకుంటే, అంతకుముందు ఘట్టంలో నరకాసుర వధ గురించి వుంటుంది. తద్వారా దేవతలనందర్నీ వాళ్ళవాళ్ళ యధాస్థాన్నాల్లో కూర్చోపెట్టేసి, ఇంక మళ్ళీ మీరు చూసుకుంటూండండి అని చెప్తాడు. ఆయనదే అంతానూ. తను సంపాయించి ఇచ్చిందే. వాళ్ళచేతిలో పెట్టాడు. వచ్చి ఓ గుప్పెడు తీసుకున్నాడు తను సంపాయించి ఇచ్చిన దాంట్లోంచే. తీసుకుంటే వీడికి objection వచ్చింది. అప్పటికే తనదనుకుంటాడు వారం రోజులు తిరక్కుండానే. ఎవర్నైనా మనింట్లో వుండమని అడిగితే, వాళ్ళు మనం వచ్చినప్పుడు ఎందుకొచ్చారండీ అని అడిగినట్లుగా వుంటుంది. Commonsense తో చూస్తే, మనవి అనుకుంటాం. కాని అన్నీ వాడివే. ఈ శరీరం వాడిది. ఈ ఇంద్రియాలు వాడివి. ఈ మనస్సు వాడిది. ఇవన్నీ ఆ తత్వాన్నించి దిగివచ్చాయి కనక వాడివని గుర్తుండాలి. అలాంటివాడు ధర్మకర్తగా జీవిస్తాడు. దేవాలయాలకు ధర్మకర్తలంటారు. Trustees అంటారు. ఎందుకంటే ఆస్తి అంతా దేవుడిదని. మనం owners కాదు. We can never be owners for anything. నా భార్య అంటే వీల్లేదు. అంటే దెబ్బ తింటావు. నా పిల్లలు అనడానికి వీల్లేదు. పిల్లలు అనచ్చు, భార్య అనచ్చు. 'నా" తీసేయ్యాలి. వాడు అందరినీ నీకు అప్పచెప్పాడు చాకిరీ చెయ్యమని. నీ స్వంతం అయితే నువ్వు ఉపయోగించుకోవచ్చు, కానీ, వాడికి చాకిరీ చెయ్యడం ఏమిటండీ? చచ్చే చాకిరీ చేస్తాం. పేరుకి "నా" తప్ప, మనం చేసేది అంతా

చాకిరీయే. నా ఇల్లు అనుకున్నా, దీనికి చచ్చే చాకిరీ చేస్తాం. పేరుకి "నా" తప్ప, అంతా చాకిరీయే. ఆ ఇల్లు అనాలి నా వాళ్ళని, నా మనుషులని. మనం అనుకుంటే ఎలా? ఎందుకంటే ఇల్లుకి మనం చాకిరీ చేస్తున్నామా? ఇల్లు మనకి చాకిరీ చేస్తున్నదా? నా కొడుకంటాడు ఓ పాతికేళ్ళు చాకిరీ చేస్తాడు. ఆ తర్వాత వాడు పాట పాడుతాడు "టాటా" అని. నీకేం తెలియదు. నాకు ఎక్కువ తెలుసంటాడు. చాల సంతోషం నాయనా! నువ్వు నీలాగే బతుకు. నీకూ తెలుస్తుందనుకోవాలి. ఇప్పుడు మనకి తెలిసింది వాడికి పాతికేళ్ళ తర్వాత తెలుస్తుందని ఊరుకోవాలి అంతే! నా పిల్లలు, నా భార్య, నా ఆస్తి ఇవన్నీ కూడా inversions. They are all given to us to be taken care of by us as far as we can. భగవంతుడి చేత అప్ప చెప్పబడిన వాళ్ళు కాబట్టి వారి యందు నిరాదరణ ఉండకూడదు. వారిని సొంతం చేసుకోవాలనుకోకూడదు . ఏ సొంతం చేసుకోవాలన్నా బాధే. రామాయణంలో కథే అది. అప్పటివరకూ బాగానే వున్నారు. ఏదో ఒక్క పూట ఒక పురుగు పుట్టింది. బంగారు రంగులో వున్నది కదా జింక. అది మనకు వుంటే బావుణ్ణనిపించింది. మనకుంటే ఏమిటి? దేవుడిది. తిరుగుతుంది హాయిగా. దాన్ని తెచ్చి ఇంట్లో పెట్టుకోవాలని అనుకుంది. ఏదన్నా బావుంటే, మనింట్లో పెట్టుకోవాలంటేనే వస్తాయి problems. మన ఇంట్లో వుండాలనుకోవడం వలన కదా అంతయ్యింది. ఏం తెచ్చావని అత్తగారు అడుగుతుందిట ఇంటికి వెళ్ళాక సీతని. ఏదో అడవిలో నానాగడ్డీ కరచిన వాళ్ళని అత్తగారు ఏం తెచ్చావని అడుగుతారండీ? అమెరికా వెళ్ళలేదు కదా! రాముడు, సీత, లక్ష్మణుడు. పోనీ అమెరికా వెళ్తే, ఏమయ్యా నాకేం తెచ్చావు? అని అడగవచ్చు. వాళ్ళు వెళ్ళింది అడవికి. అడవికి వెళ్ళినా సీతాదేవి భావన ఏమిటి? ఎవరికన్నా ఏమన్నా అడవి నుంచి తెచ్చిద్దామనే. అత్తగారు అడగవచ్చు కదా అనుకొని ఆ బంగారులేడిని తెచ్చిమ్మంది. అంతే ఎప్పుడైనా owenership లోనే problems వస్తాయి. మన దగ్గర దేని గురించైనా owenership concept వుంటే, అది భగవంతుడిది మనం వాడుకుంటున్నాం అని గుర్తుపెట్టుకోవాలి. It belongs to God. They are given responsibility to interact with it. అంతే! అంతకుమించి ఏమున్నా దెబ్బ తింటాం. ఇది భగవంతుడిది కదా మనకేమీ సంబంధం లేదు అనుకున్నా దెబ్బ తింటావు. భగవంతుడు నీకు అప్ప చెప్పాడు. దాన్ని నువ్వు సరిగ్గా చూడాలి. వెధవ్వేషాలు వేయకూడదు. వైరాగ్యం

పేరున పెళ్ళాం, పిల్లల్ని వదిలేసే వాళ్ళు లాభం లేదు. మమకారం పేర్న వాళ్ళని పూర్కే వాటేసుకునేవాళ్ళు లాభం లేదు. ఇద్దరూ లాభం లేదు. వీళ్ళందరినీ భగవంతుడు మనకప్పగించాడు. వీళ్ళకి మనం Let us do what is to be done to them and allow them to express according to their life pattern. వాడేదో మన వద్ద ఇంత బాకీ వుంది కాబట్టి తీసుకుపోడానికి వస్తుంటాడు. 'చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్తులు'. వాడెవడో తెలిసి రాసాడు. ఇదివరకు బాకీ, అప్పుడు తీర్చలేదు. ఇప్పుడు కొడుకై పుడుతాడు. కమ్మగా ఇస్తాం. వాడు అడక్కకుండా ఇస్తాం. నాన్నా అది కావాలా, ఇది కావాలా అంటూ. వాడికేమో ice cream తిందామనిపించదు. మనకేమో పెట్టించాలనిపిస్తుంది. ఎందుకంటే మనం వాడికి బాకీ వున్నాం కదా! బాకీ గనుకనే వాడు అడక్కుండానే బట్టలు కొని, బూట్లు కొని ఇవన్నీ చేస్తే బాకీ తీరాక వాడు, వస్తాను నాన్నా, నాకూ మరి బాకీలు వున్నాయి కదా! అవి తీర్చుకోవడానికి పోతాను అంటాడు. వాడూ కొంతమందికి బాకీ పెట్టి వస్తాడు. అంతా debtors మే! నీ బాకీ నువ్వు తీర్చావు. నేను వెళ్ళిపోతున్నాను. నేను బాకీ తీర్చవలసిన వాళ్ళు వస్తారు. అంటే పెళ్ళాం రూపంలో వస్తుంది. వాళ్ళకి తీర్చాలి అంటాడు. వీళ్ళంతా మనం బాగా సమర్థతతో బాకీ తీర్చగలిగిన స్థితిలో వున్నప్పుడు వస్తారండి. పిల్లల్ని ఎప్పుడు కంటామండీ ? బాకీలు తీర్చగలిగినప్పుడు. అంటే బాగా పోషించగలిగినప్పుడు. అప్పుడు దిగివస్తాడు. పోషించగలడిపుడు, మనం land అవ్వచ్చు అని వస్తాడు. Straight గా airport లో land అయినట్లుగా ఇంట్లో land అవుతాడు. ఇహ మనం ఓ పాతికేళ్ళ వరకూ చేస్తూంటాం. చేసాక ఏమంటారంటే నా కార్యక్రమం కూడా బాకీ తీర్చవలసినది వున్నది కదా ! అది తీర్చడానికి పోతున్నాను అంటాడు. ఎవరికెవరు, అందరం భగవంతుని వాళ్ళమే. మనకప్పచెప్పిన వారిని జాగ్రత్తగా చూసుకోవడం అనే మనవంతు కర్తవ్యం మనం పరిపూర్ణంగా చేయడం తప్ప, అంతకుమించి ఏమీ లేదు. ఉందనుకుంటే దుఃఖం వుంటుంది. కనుక గోవిందుడి వాళ్ళం మనమంతా. ఎవరయ్యా మనకి owner అంటే, ఒకడే ఒకడు, గోవిందుడు. మనకి తండ్రి, యజమాని ఒకరే. వాడికి సంబంధించిన వాళ్ళం. ఒకళ్ళకి ఒకళ్ళం నాటకంలో భాగంగా వీడు మనవాడు అనే భావన వుంటుంది. వుండడం వలన చాకిరీ వుంటుంది. మహాత్ములు 'అందరూ మనవాళ్ళు' అనుకుంటారు.

## 196 గోవిదాంపతిః

మనం మనవాళ్ళని ఎంతగా మనవాళ్ళమనుకుంటామో, అలా మహాత్ములు అందరినీ మనవాళ్ళనే అనుకుంటారు. వాళ్ళూ "గోవిదాంపతి:" అనే పదానికి అర్థం. గో విదులు అంటే గో అనే తత్వమును తెలిసినట్టివారు. అది గోవిదులకి మాత్రం తెలుస్తుంది. ఏడు లోకములను ఆవరించి, అంతకు మించి వున్న ప్రజ్ఞ ఏదయితే వున్నదో, దాన్ని "గోవిందుడు" అంటాం కదా! ఆ "గో" అనే తత్త్వము తెలిసినవాడిని "గోవిదుడు" అంటాం. గోవిందుడు వేరు, గోవిదుడు వేరు. గోవిందుడు అంటే భగవంతుడు. గోవిదుడు అంటే ఆ భగవత్తత్వము తెలిసినటువంటి వాడు. వాళ్ళకి ఎవరు పతి అయ్యా అంటే only one Master. They don't bow down to any other thing. అదే కదా పోతన చెప్తాడు "కర్ణాట కిరాట కీచకుల నమ్మ త్రిసుద్ధిగా నమ్ము భారతీ" అని. ఇంకో మాస్టర్ లేడు. ఆధ్యాత్మిక సాధనలో ముందుకు వెళ్తూవుంటే, there will be no other Master than the Master. అంటే మహాత్ములైన వారెవ్వరూ అట్లా ఎవరికిందో పనిచేస్తున్నట్లుగా వుండరు. ఇంకో employer వుండరు. There is only one employer. అందుకని స్వయం ప్రపత్తి మీద వుంటారు. వాళ్ళకి ఒకడే మాస్టర్. "సబ్ కా మాలిక్ ఏక్". అందరికీ మాలిక్ ఒకడే తెలిసినవాళ్ళకి. మహాత్ములందరూ గోవిదులు. ఈ గోవిదులందరికీ పతి అయినట్టివాడు'గోవిదాం పతిః'. "అనిరుద్ధ సురానందో గోవిందో గోవిదాం పతిః", ఈ నాలుగు నామాలు. ఇంతవరకూ కొంత అవగాహన, తెలుసుకోవలసినది ఇందులో మనకు ఇవ్వబడిన సూచనలు, అవి పట్టుకు జీవిస్తూండడమే! ఎన్నాళ్ళంటే, అవన్నీ మనకి బాగా స్థిరపడే వరకూ!

## 197 మరీచిః

భగవంతుని యొక్క కాంతి లేక వెలుగులో వున్న ఆకర్షణను 'మరీచి' అంటారు. బ్రహ్మ నుండి దిగివచ్చిన ఋషులలో మొదటి వాడు అని చెప్తారు. తర్వాత అంగీరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు ఇలా దిగి వచ్చారు. ఇందులో మొట్టమొదటి మహర్షి మరీచి. మరీచి బ్రహ్మ నుండి వ్యక్తమైన మొదటి వెలుగు. ప్రజాపతులలో, ఋషులలో కూడా మనకి కనిపిస్తాడు. మరీచి అనే పదానికి నిరుక్తం ప్రకారం చక్కటి ఆకర్షణీయమైన కాంతి కలిగినవాడని అర్థం. భగవంతుని యొక్క కాంతి ఆకర్షణీయంగా వుంటుంది. అందుకే వెలుగులో మనకి ఆకర్షణ ఎక్కువగా, సహజంగానే గోచరిస్తుంది. ఈ వెలుగులో వుండే ఆకర్షణని 'మరీచి' అని పిలుస్తారు. ఎన్ని దీపాలు పెట్టుకుంటే అంత మన మనస్సుకి ఆహ్లాదకరంగా వుంటుంది. ఎంత వెలుగు దర్శనమైతే అంత మన మనస్సుఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ ఆహ్లాదాన్ని కలిగించే భగవంతుని తత్వం మొట్టమొదట బ్రహ్మ నుండి వ్యక్తమైనదన్నమాట. అందుకని బ్రహ్మనుండి వ్యక్తమైనవాడూ భగవంతుడే. ఈ సృష్టిలో తన నుండి ఒకరిని వ్యక్తం చేసి, వారి నుండి మళ్ళీ తానే వ్యక్తమై, మళ్ళీ వాడుగా తయారై, మళ్ళీ వాడి నుండి తనే వ్యక్తమౌతుంటాడు. అంటే భగవంతుడు నుండి బ్రహ్మ వ్యక్తమైతే, మళ్ళీ బ్రహ్మ నుండి భగవంతుడే వ్యక్తమౌతుంటాడు. ప్రజాపతులుగా, మనువులుగా వ్యక్తమౌతాడు. ప్రజాపతులకు, మనువులకు పుట్టే సంతతిగా వ్యక్తమౌతాడు. అన్నిట్లో నుండి ఇలా వ్యాపనం చెందే తత్వం ఏదైతే వున్నదో అది భగవంతుడే కాబట్టి మొత్తం అంతా భగవంతుడే! ఒక ముడిపదార్థం లేదా మూలపదార్థం నుండి ఎన్ని వస్తువులైనా తయారు చేయవచ్చు. తయారుచేసిన వస్తువులలో ఆ మూల పదార్థమే కదా వున్నది. అదే పద్ధతిలో భగవంతుని యొక్క రూపము, భగవంతుని నుండి వ్యక్తమయ్యే త్రిగుణాత్మకశక్తి, భగవంతుని నుండి వ్యక్తమైన ప్రకృతి. ఈ త్రిగుణాత్మకమైన శక్తి నుండి ప్రకృతి ద్వారా మొట్టమొదటిసారిగా వ్యక్తమైనట్టి బ్రహ్మ, బ్రహ్మ నుండి వ్యక్తమైనట్టి ప్రజాపతులు, మనువులు, వారి నుండి వ్యక్తమైన దేవతలు, వారి నుండి వ్యక్తమైనట్టి వెలుగులు, చీకట్లూ అన్నీ ఆయనతోనే నిండి వుంటాయి. ఆ భావం మనకివ్వడానికి ఇక్కడ 'మరీచి' అనే పదం ఇచ్చారు. 'మరీచి' అంటే భగవంతుని యొక్క ఒక అవతరణం. ఈ మరీచికి కశ్యపుడనే మహర్షి జన్మించడం, ఆ కశ్యపునికి దేవతలు, దానవులు

జన్మించడం పురాణగాథ. అంటే కశ్యపునికి తండ్రి మరీచి. ఇలా చూసుకుంటే సృష్టిలో నామాలన్నీ ఆయనే! అత్రి, అంగీరస మొదలైన ఇతర మహర్షుల నామాలు అన్నీ కూడా ఆయనే. అయితే ప్రత్యేకంగా ఈనామమే ఎందుకిచ్చారు? సహస్రనామాలలో మిగిలిన మహర్షుల నామాలేమీ లేవు కదా! 'మరీచి' అనే నామము ఒక ఋషిగా, ఒక మహర్షిగా, ఒక ప్రజాపతిగా, సృష్టిలో సేవ చేసే ఒక సేవకుడిగా, ఒక పేరున్న వ్యక్తిగా మాత్రమే కాక అసలు మరీచి అనే తత్త్వం గురించి మనం ఎక్కువ అవగాహన చేసుకోవాలి. అందుకనే మనం భాగవతం గానీ భారతం గానీ చదువుకుంటున్నప్పుడు ఎవరైనా ఒక మహాత్ముడు బాగా చాలా కాంతివంతమైన స్థితికి చేరుకుంటే "ఇంద్రసభలో మరీచి లాగా వెలుగుతున్నాడీతడు" అని చెప్తారు. మాంధాత గురించీ ఇట్లాగే చెప్తుంటారు. ఇంద్రసభలో 'మరీచి' వుంటాడంటే ఏమిటి? వెలుగన్నమాట. ఆకర్షణ అన్నమాట. ఎక్కడ ఆకర్షణ వున్నదో, అక్కడ 'మరీచి' గా భగవంతుని తత్త్వం వున్నట్లు. మనకి కొన్ని కొన్ని ప్రదేశాలలో ఆకర్షణ ఎక్కువ వుంటుంది. కొన్ని కొన్ని ప్రదేశాలలో ఆకర్షణ తక్కువగా వుంటుంది. ఈ ఆకర్షణ వెలుగు యొక్క ఒక గుణం. వెలుగుకు సప్త కిరణములున్నాయి. ఒక సూర్యునిలో ఏడు కిరణములున్నాయి. అందుకే 7 అశ్వములు అని చెప్తారు. ఒక్కొక్క కిరణానికి ఒక్కొక్క స్వభావమున్నది. అందులో 'మరీచి' అనే కిరణం యొక్క స్వభావము ఆకర్షణీయముగా వుండుట, ఆకర్షించుట. భగవంతుడు ఆవిధంగా సృష్టిలో ఒకదానికొకటి ఆకర్షింపబడి వుండేటట్లు ఒక తత్త్వాన్ని ఇందులో సృష్టి చేశాడు. కామం వేరు, ఆకర్షణ వేరు. కామంలో ఆకర్షణ ఒక భాగం. స్త్రీ, పురుష ఆకర్షణ ఇంకో భాగం. స్త్రీ, పురుష ఆకర్షణకి అతీతంగా వుండే ఆకర్షణ 'మరీచి' అవుతుంది. ఈ రెండు కలిపి కామం అని చెప్పే దానికి ఈశ్వరుడు 'కామేశ్వరుడు' అని చెప్తాం. అందుకని కాముడు కూడా విష్ణుమూర్తి యొక్క కొడుకుగా మనకు పురాణాలలో చెప్తారు. ఏదైతే మనల్ని ఆకర్షిస్తున్నదో, ఆ ఆకర్షణలోని ఆకర్షణీయతను భగవంతుడిగా దర్శనం చేయాలి. ఒక మనిషిని చూస్తే ఆకర్షింపబడతాము. ఒక వస్తువుని చూస్తే ఆకర్షింపబడతాము. ఒక ప్రదేశం చూస్తే ఆకర్షింపబడతాము. ఒక జంతువుని చూస్తే ఆకర్షింపబడతాము. ఆ ఆకర్షణ లోనుండి మనకు ఒక విధమైన వికాసం వస్తుంది. తెల్లకలువ, తెల్లటి గుర్రం, తెల్లటిఏనుగు, తెల్లటి పావురం, తెల్లటి కుక్క ఇలాంటివి చూస్తే ఎవరికైనా ఆకర్షణ కలుగుతుంది. ఈ ఆకర్షణను 'మరీచి' గా దర్శనం చేయాలి. శ్రావణ శుక్రవారం

పూట అమ్మవారిని అలంకరిస్తాం. అందులో ఒక ఆకర్షణ, ఇది భగవంతుని వెలుగు.ఈ వెలుగునే మరీచి అంటాం. మరీచి అనే ఆకర్షణ కలిగినవాడు మారీచుడు. మారీచి, సుబాహులలో మారీచుడు చాలా గొప్పవాడు. అతి పుణ్యవంతుడు. మారీచుడు పూర్వజన్మలో వైకుంఠంలో నివసిస్తున్న ఒక పెద్ద వెలుగు జయ విజయుల్లాగానే. వైకుంఠం అంటేనే పూర్తిగా ఆకర్షణే! విష్ణుతత్త్వమే జగన్మోహనంగా వుంటుంది కదా! ఆ జగన్మోహనంగా వుండే విష్ణు లోకములో జీవించే ఒక జీవుడు మారీచుడు. ఆయన కొంచెం ఆకతాయితనంగా వుంటే పెద్దలు కొంచెం శిక్షణ ఇవ్వాలని ఒక శాపం ఇవ్వడం, దాని కారణంగా తాటకకి పుట్టవలసి రావడం జరుగుతుంది. ఈ తాటక కథ ఏమంటే, ఇంద్రుడికి వృత్రాసురుణ్ణి చంపడం వలన కొంత బ్రహ్మహత్యాపాతకం అంటుకుంటుంది. దాన్నుండి  ఆయన్ని రక్షించే ప్రయత్నంలో ఆయన మీద నుండి ఒక జలధార కురిపిస్తారు. అదే మనకు షష్టపూర్తి సందర్భంలో జల్లెడ పెట్టి నీళ్ళు పోయడం. అంటే పవిత్రీకరణ చేయడానికి చేసే కార్యక్రమమిది. అట్లా ఆకాశం మీదనుండి ఒక జలధార ఏర్పాటుచేసి, ఆ నీరుని ఇంద్రుని మీదకు పంపిస్తూంటే, ఇంద్రుని మీద వుండే మలినాలు ఒకటి నోటి నుండి ఉమ్మిగాను, ఇంకొకటి క్రింద నుండి మలంగానూ వచ్చేస్తుంది. ఆ రెంటిలో నుండి రెండు పుణ్య భూములు పుట్టినాయి. ఆ మలంలో నుండి  తాటక పుట్టుకొస్తుంది. ఆ తాటకని సుందోపసుందుల్లో ఒకడు సుందుడు అనేవాడు పెళ్ళి చేసుకుంటాడు. వారిద్దరికీ పుట్టిన వాడు ఈ మారీచుడు. స్వతహాగా భాగవతోత్తముడు. భాగవతం చూస్తే విష్ణుమూర్తి అనుచరులకు క్రిందా, పైనా అని వుండదు. స్వర్గం, నరకం అని తేడా వుండదు. వారా స్థితి దాటి వుంటారు. వృత్రాసురుడి కథ తీసుకుంటే, శాపం పెడితే, అది భగవంతుని యొక్క అనుగ్రహంగా భావించే స్థితిలో వుంటాడు. అదీ భాగవతోత్తములు. అయ్యో! నాకు  శాపం పెట్టాడే అని బాధపడరు. జయవిజయుల కథ కూడా అలాగే వుంటుంది. సనక సనందనాదులు శాపం పెడితే, శాపం పెట్టారన్న బాధ వుండదు. ఎక్కడున్నా విష్ణువులోనే వుంటారు. వాళ్ళు బాధ అనే స్థితికి అతీతంగా వుంటారు. అలాగే ఈ మారీచుడు కూడా ఆ 'మరీచి' అనే వెలుగును కలిగి వున్నాడు. కాబట్టి శాపం పెడితే, ఏదో మన మంచికే అని దిగి వచ్చేస్తాడు. ఈ శాపానికి విరుగుడు ఏమిటి అంటే, శాపం పెట్టిన వాణ్ణి నేనే దిగి వస్తాను. మళ్ళీ రాముడిగా దిగివచ్చి నిన్ను మళ్ళీ నీ స్వస్థానానికి చేరుస్తానని చెప్తాడు. అది మారీచుని కథ. ఆ మారీచుడు చాలా ఆకర్షణ కలిగినవాడు.

ఎందుకంటే ఈ 'మరీచి' తత్వానికి సంబంధించిన వాడు కనుక. మారీచుడు విశ్వామిత్రుని బాగా disturb చేయడం, తద్వారా రాముని విశ్వామిత్రుడు ఆహ్వానం చేయడం, అక్కడ రాముడి యొక్క బాణముల చురుకు తెలిసి ఈ పనులు మనం చేయకూడదని దక్షిణాన వున్న అరణ్యాలకు నిష్క్రమించి, అక్కడ తపస్సు చేసుకుంటూంటాడు. రావణుడికి మారీచునితో మామగా సంబంధం వున్నది. సీతాదేవి అత్యంత పవిత్రమైన చైతన్యమూర్తి కదా! అందువల్ల అంత సులభం కాదు సీతాదేవిని ఎత్తుకుపోవడం. రావణుడికి సీతను ఎత్తుకు రావడానికి మనసులో మారీచుడు మెదులుతాడు. ఎందుకంటే 'మరీచ' తత్వం అంటే ఏదైనా ఆకర్షించే తత్త్వం సహజంగా వున్నవాడు మారీచుడు. కనుక ఈయన్ని రావణుడు ఉపయోగించుకుందామని వెళ్ళి శాసిస్తాడు. వద్దు అని చెప్తాడు మారీచుడు. మారీచుడు రావణాసురుడికి చెప్పిన సందేశం, ఉపదేశం రామాయణంలో తప్పక మనం చదువుకోవలసినవి. రావణుడికి రకరకాలుగా చెప్తాడు. "ఇది మంచి విషయం కాదు. రాముడి బాణాల రుచి నేను చూశాను. ఆ బాణానికి తిరుగు లేదు. కనుక నువ్వు చేసే పని నిన్ను నువ్వు నాశనం చేసుకునేటటువంటిది" అని చెప్తాడు. అంటే వినడు. ఎందుకంటే ఆయన కూడా ఇలా వచ్చిన వాడే కదా! జయ విజయుల్లో ఒకడు కదా! కనుక తన కార్యక్రమం పూర్తి చేసుకోవాలంటే సీతాదేవిని తెచ్చుకోవాలి. ఆ dimension అప్పుడు లేకపోయినా ఆ విధంగా కర్మ తోసుకు వస్తుంది. మారీచుడు సరే తప్పదని ఒప్పుకొని, మాయలేడి రూపాన్ని ధరిస్తాడు. మాయలేడి వర్ణన రామాయణంలో చాలా ముఖ్యం. మాయలేడి, బంగారులేడి అది చూసి సీతాదేవి మోహపడ్డది అని చెప్తారు కదా! మరి సీతాదేవే మోహపడ్డదంటే అది ఎట్లా వుండి వుండాలండీ? దేనికీ మోహపడని తత్వం కలిగిన విదేహ రాజపుత్రిక కదా! కేవలం వెలుగు తత్వంలో నివసించే ఆమె, దేనికి ఆకర్షింపబడుతుంది? పంచభూతాలచే తయారుచేయబడ్డ ప్రపంచం లో దేనికీ ఆమె ఆకర్షింపబడే అవకాశం లేదు. అందుకనే రావణాసురుడు ఈ ప్రయోగం చేయవలసి వస్తుంది. మనకి చూపించినవి చూపిస్తే, సీతాదేవి divert అవడానికి అవకాశం లేదు. ఆమెకు కావాలనే కోరిక పుట్టాలంటే ఎంతటి విషయం అయివుంటే, ఆమె కావాలని మోజు పడుతుంది? అంతటి ఆకర్షణీయంగా ఈయన రూపం దాలుస్తాడు. ఆ మరీచి తత్వం పరిపూర్ణంగా వున్నవాడు కనుక తద్వారా సీతాదేవినే ఆకర్షింపగలిగిన వెలుగు. ఆ లేడి ఎలా వుందిట? ఒళ్ళంతా బంగారు రంగులో

వున్నది. కొమ్ములు నీలమణులతో చేయబడ్డవిగా వున్నాయి. కళ్ళు నీలమణుల్లా మెరుస్తున్నాయి. పెదిమలు ముత్యం రంగులోనే వున్నాయి. ఎర్రటి సింధూర రంగు అంటే అప్పుడే తెలతెలవారుతుంటె వచ్చే సింధూర రంగు మొఖం కలిగినది. చెవులు ఆకుపచ్చగా వున్నాయట. తోకలో ఇంద్రధనస్సులో వుండే సమస్తమైన రంగులు కనిపిస్తున్నాయిట. అది అక్కడ తిరుగుతూంటే, చుట్టుప్రక్కల అంతా కాంతి ప్రకాశిస్తూంటుంది. అది సంపూర్ణమైన వెలుగు రూపం. ఒక వెలుగే రూపం కట్టుకొచ్చిందట. మామూలుగా పదార్థం మీద నీలం పడ్డప్పుడు దాని కాంతి బాగా తగ్గిపోతుంది. అదే నీలం మణుల్లో వుంటే చాలా కాంతివంతంగా వుంటుంది. ఈ రంగులన్నీ కూడా తమ తమ ప్రభావాన్ని ప్రసారం చేస్తున్నాయి. అటువంటి లేడిని చూసి సీతాదేవి ఎవరూ చూడని ఈ వింత జంతువుని అత్తగారికి కానుకగా ఇవ్వాలని అనుకుంటుంది. అంత కాంతి కలది ఆ మాయలేడి. అదీ 'మరీచి' అనే భగవంతుని ఆకర్షణ అలా ఉంటుంది. ఎందుచేతనంటే ఇక్కడ మారీచుడు కూడా సహజంగా వైకుంఠవాసే కనుక! అతనిలో వున్నదీ ఆ భగవంతుని ఆకర్షణే! అసలు వైకుంఠవాసులంతా అలాగే వుంటారు. విష్ణుమూర్తికి, జయవిజయులకీ చూసిన మనలాంటి వాళ్లకి తేడా తెలియదు. లోపలి విగ్రహాలకి, బయట విగ్రహాలకి ఒకేలాంటి చతుర్బాహువులుంటాయి. శంఖు చక్రాలు, గద అన్నీ వుంటాయి. తేడా తెలియదు. వైకుంఠంలో వున్నవాడు, వాడుండే ఇల్లు రెంటికీ తేడా వుండదుట. తనకు, తను వుండే ప్రదేశానికి చైతన్య స్థితి యందు భేదం వుండదు. అక్కడుండే వాసులందరియందు ప్రసరించేది ఒకే తత్వం. అదే విష్ణుతత్వం. భగవత్తత్వంతో పరిపూర్ణంగా నిండియున్న వాళ్ళు అక్కడ వుంటారు. కాబట్టి సీతాదేవి దేనివల్ల ఆకర్షింపబడ్డది? కేవలము భగవంతుని తత్వం వలన ఆకర్షింపబడ్డది. లేకపోతే సీతాదేవి అలాంటిలాంటి ఆకర్షణలకు లొంగేది కాదు. అంతటి ఆకర్షణ గలదది. మళ్ళీ జగన్మోహనాకారం అలాంటిది. శివుడికే భ్రాంతి కలిగించే ఆకర్షణ అది. జగన్మోహినిని చూచి, శివుడు భ్రాంతి పొంది వెంటబడతాడు. అంటే సృష్టిలో భగవంతుని ఆకర్షణ ఈ విధంగా వుంటుంది. ఆ భగవంతుని ఈ ఆకర్షణని 'మరీచి' అని పిలుస్తారు. ఈ ఆకర్షణ బ్రహ్మలోంచి ముందు దిగివస్తుంది. మిగిలినవన్నీ తర్వాత దిగివస్తాయి. అందుకని ఎంత దూరం పోయినా ఆకర్షణీయంగా దీన్ని తయారు చేసుకోవడం, సృష్టిలో ఒకదానికొకటి ఆకర్షింపబడి వుండడం, సూర్యుడి చుట్టూ గ్రహాలు అన్నీ ఆకర్షింపబడి వుండడం, భూమి మీద

జీవులు భూమికి ఆకర్షింపబడి వుండడం ఇవన్నీ 'మరీచి' అన్నమాట. ఒకరి యందు ఒకరికి వుండే ఆకర్షణ. దానికి కారణం వుండదు. ఈయనకి ఆయనకి వున్నది, ఆవిడకి ఆయనకి సంబంధం ఏమిటి అనేది కాదు ఆకర్షణ. కారణము లేని ఆకర్షణ. కారణము లేకుండా ఒకరియందు ఒకరికి వుండే ఆకర్షణ. అంతేకానీ ఒకరు యందు ఒకరికి వుండే అవసరాల బట్టి కాదు ఈ ఆకర్షణ. అవసరాలకి అతీతంగా వుండే ఆకర్షణ. మహాత్ముల వద్దకి వెళ్తూంటారు. ఎందుకు వెళ్తున్నారో వెళ్ళేవాడికీ తెలీదు. అది ఆకర్షణ. ఎందుకు వచ్చాడో వారికి తెలుస్తుంది, ఎందుకు వెళ్తున్నాడో వెళ్ళేవాడికి తెలీకపోయినా. ఎందుకంటే 'మరీచి' అనే భగవత్తత్వం ఆకర్షణ కారణంగా వాళ్ళు వస్తూంటారు. అందుకని వచ్చిన వాళ్ళకి ఇంకొంచెం కాంతినందించి పంపేస్తూంటారు తెలిసిన వాళ్ళు.

## 198 దమనః

దమనః అంటే అన్నిటినీ దమించేవాడు. దేనిని దమించాలి? మనస్సు లేక స్వభావము, ఇంద్రియముల యొక్క ప్రవృత్తి ఇవి మనం దమించవలసినవి. "యోగః చిత్తవృత్తి నిరోధః" అనే పద్ధతిలో మనస్సును, ఇంద్రియములను అధిష్టించి వుంటుంది భగవత్తత్వం. అంటే భగవత్తత్వం ఎవరియందుంటే, ఎవరు వెలుగుయందు ఎక్కువ జీవిస్తూంటే వారు మనస్సును, ఇంద్రియములను అధిష్టించి యుంటారు. మనస్సును, ఇంద్రియాలను మనం తొక్కేద్దాం అనుకుంటే తొక్కెయ్యలేం. అవి కూడా భగవంతునిలో నుండి వ్యక్తమైనవే కాబట్టి, మనము ఎక్కువ భగవత్తత్వము నందు జీవించడం మొదలు పెడితే, భగవత్తత్వానికి సంబంధించిన అవగాహన మనలో బాగా పెరుగుతూంటే అప్పుడు మనస్సు, ఇంద్రియాలు ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది సహకరించడం మొదలుపెడతాయి. ఎప్పుడూ కూడా మనం ఏది మనకి result గా కోరుకుంటామో, అదే process అనుకుంటాం. మనస్సును, ఇంద్రియాలను జయించడానికి practice చేయకూడదు. మనస్సు, ఇంద్రియాలు జయించబడడం అనేది result. మనము result కోసం ఇంకోటి చేస్తే result వస్తుంది, కానీ result చేయలేము కదా! అంటే కాఫీ కావాలనేది, దాన్ని తయారు చేయడం process. అలా ఏది కావాలంటే దానికి చేయవలసినది ఇంకోటి వుంటుంది. Result కావాలంటే దానికి వేరే process చేయాల్సి వుంటుంది. కావాల్సిన దానికి చేయవలసినది ఏమిటో తెలియడం వివేకం. నేను మనస్సు, ఇంద్రియాలు జయించాలి అనుకొంటూ అంటూంటారు. జయించేయాలి అంటే జయించలేరు ఎవ్వరూ. ఎట్లా జయిస్తారు మరి? వెలుగును ఎక్కువ ఆవాహన చేసుకుంటే, వెలుగును ఎక్కువ ఆలింగనం చేసుకుంటే, అదే గాయత్రి. వెలుగుకు సంబంధించిన కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటూ వుంటే మనకి తెలియకుండానే మన మనస్సు, మన ఇంద్రియాలు దమించబడ్తాయి. అంతేగాని ప్రత్యేకించి మనస్సు, ఇంద్రియాలు దమించడానికి ఒక programme పెట్టుకున్నానంటే అవదు. అదే శుకుడు పరీక్షిత్తుకు చెప్తాడు. సద్గుణములను practice చేద్దామనుకుంటున్నానూ క్షమ, శాంతి, ప్రేమ ఇలాంటివి. ఎలా practice చేయాలి? అంటాడు పరీక్షిత్తు. అలా practice చేస్తే రావు అని చెప్తాడు శుకుడు. చాలామంది Virtues

practice చేయాలంటూంటారు. కానీ Virtues మనకి వచ్చేవి. సద్గుణాలు మనకి వచ్చేవి. వాటి గురించిన practice వేరే వుంది. మనకి fan కావాలంటే fan వంక చూస్తే తిరగదు. మనం result ని procedure గా అర్థం చేసుకొంటుంటాం కదా! Procedure వేరు, దానివల్ల వచ్చే result వేరు. ఏది result, ఏది Procedure తెలుసుకోవాలి. 'శుకుడు నీకో రహస్యం చెప్తున్నాను విను' అంటాడు. మొన్న ఒక ఆయన 'సువర్ణ సోపానములు' ఎలా లభ్యమవుతాయని ప్రశ్న అడిగాడు. అందులో 14 వున్నాయి. ఒక్కొక్కటీ చేయాలంటే ఒక్కో జన్మ పడుతుంది. అందులో కూడా వస్తుందో రాదో తెలీదు అని చెప్పాడు. ఎందుకు రావు? ఎందుకు వస్తుంది? వస్తే అన్నీ కలిపి ఒకేసారి వస్తాయి. దీనికి శుకుడు చెప్పిన రహస్యం భాగవతంలో వున్నది. వాక్కు, మనస్సు, కర్మల చేత ఈ మూడుని అనుసంధానం చేసుకోవడానికి జీవితంలో ఎప్పుడూ ప్రయత్నం చెయ్యి. దాన్ని 'త్రికరణ శుద్ధి' అంటారు. ఇది గనక మనం ప్రయత్నం చేస్తూ వుంటే ఇందులో వున్న అనుసంధానం వలన మిగతా గుణాలు వచ్చి నీలో చేరతాయి తప్ప, నువ్వు ప్రత్యేకించి దేన్నీ, ఏ గుణాన్నీ నీ దగ్గర వుంచుకోలేవు అని చెప్తాడు. గుణాన్ని మన దగ్గర వుంచుకోవడం అనేది కుదిరే పని కాదు. గుణం మన దగ్గర వుండే పద్ధతి వున్నది. అదేమిటయ్యా అంటే త్రికరణశుద్ధి. మన ఆలోచనల్లో వుండే నిర్మలత్వం, మన వాచకంలో వుండే నిర్మలత్వం, మన చేతల్లో వుండే నిర్మలత్వం. ఈ మూడు లేని వాళ్ళకి కళ్యాణగుణాలు వుండడానికి వీల్లేదు. ఈ మూడు కలిసి వున్న వాళ్ళకి కళ్యాణ గుణాలు కావాలని practice అక్కర్లేదు. అది శుకుడు పరీక్షిత్తుకి ఒక రహస్యం చెప్తున్నానని చెప్పాడట. అట్లా మహర్షులు చెప్పే రహస్యాలు పుచ్చుకొని జీవితంలో మనకి దమ్ముంటే practice చేయాలి. అందరూ చేయలేరు. పిరికివాళ్ళు, మోసగాళ్ళు అసలు చేయలేరు. ప్రపంచంలో చేసే వ్యవహారాల్లో మోసం వుందనుకోండి, వాడు శాంతిగా వుండగలడా? శాంతి గా వుండడానికి నేను practice చేస్తానంటే చేయగలడా? ప్రేమగా వుండగలడా? లేడు. క్షమ కలిగి వుండగలడా? లేడు. ఎందుకంటే లోపల అశాంతి అనేది చక్కగా తిష్ట వేసుకుని వుంటుంది. ఎప్పుడైతే ఈ మూడింటి యందు తేడా వుంటుందో, వాడికి ప్రశాంతత వుండదు. ప్రశాంతత లేని వాడి వద్ద ఏ గుణాలు వుండవు. ప్రశాంతత కావాలంటే ఒకే ఒక మార్గమున్నది. ఎవరైతే ఆ మార్గంలో వుంటారో, వారి వద్ద ఈ కళ్యాణ గుణాలన్నీ భాసిస్తూంటాయి. అబద్ధాలు చెప్తున్నారనుకోండి, manage చేసుకోవాలి

కదా! ఒకళ్ళకి చెప్పింది ఇంకొకళ్ళకి తెలియకుండా manage చేసుకోవాలి. చిన్న twist ఇచ్చామనుకోండి, misinterpretation చేశామనుకోండి, అది manage చేసుకుంటూండాలి. అప్పుడు శాంతి ఎక్కడ వస్తుంది? కళ్యాణ గుణాలు ఎక్కడ నుండి వస్తాయి? గుణాలు మనకు రావాలంటే త్రికరణశుద్ధి ఏర్పడాలి. త్రికరణశుద్ధి రావాలంటే యోగా practice చేసుకుంటూ, నిశ్శబ్దంగా మనం మన daily life లో ఈరోజు మనకి వచ్చిన ఆలోచనల్లో ఎంత నిర్మలత్వం వున్నది? ఈ నిర్మలంగా వుండే ఆలోచనలను కూడా చెప్పినప్పుడు ఎంత నిర్మలంగా చెప్పగలం? ఆలోచనలు మంచివే అయినా అవతలవాణ్ణి బట్టి మన నిర్మలత్వం అప్పుడప్పుడు disturb అయిపోతూ వుంటుంది. ఎదుటి వ్యక్తిని బట్టి వాక్కులో నిర్మలత్వం నిలబడేదీ, లేనిదీ తెలుస్తుంది. మనం ఎంతో fresh గా బయటకి వచ్చేసరికి మనకి ఎదురుగా మనకి అస్సలు నచ్చని వాడు కనిపించాడనుకోండి, అప్పుడు నిర్మలత్వం మాటల్లోనూ, చేతల్లోనూ కూడా పోతుంది. అందుకని భాగవతంలో ఏం చేయ్యాలీ అంటే, వెలుగు దర్శనం చేస్తూండు అన్ని రూపాల్లోనూ. వెలుగు దర్శనం చేస్తూంటే నిర్మలత్వం నిలబడుతుంది. నిర్మలత్వం నిలబడితే ఆలోచనలోనూ, మాటలోనూ, చేతలోనూ నిర్మలత్వం వస్తుంది. ఈ మూడింటిలోనూ నిర్మలత్వం రావడమే 'యోగము' అని శుకయోగి పరీక్షిత్తుకు చెప్తాడు. ఈ మూడింటిని చేయాలంటే సిద్ధాసనం వేసుకొని కూర్చుంటే రాదు సరికదా కాళ్ళు కూడా పనిచేయవు. ఎందుకంటే శరీరంలో ఏ భాగమైతే మనం సరిగా వాడమో ఆ భాగం మనకి పనిచేయడం మానేస్తుంది. కూర్చుని కూర్చుని వుండే వాళ్ళకి తర్వాత కాళ్ళు పనిచేయవు. శరీరంలో దేన్ని వాడకపోతే అది పనిచేయదు. కనక ఈ పద్ధతులు కాకుండా వెలుగు దర్శనం ద్వారా త్రికరణ శుద్ధి చేసుకుంటూ వుంటే గుణములు మనయందు నిల్చొని వుంటాయి. ప్రహ్లాదుడు ఏ గుణాలు practice చేశాడని భాగవతం లో చెప్పారండీ? ఒకటే గుణం. ఒకణ్ణే చూస్తాను. ఇంత మంది వున్నారు. కానీ నేనొక్కణ్ణే చూస్తాను అన్నాడు అంతే. సద్గుణాలణ్ణీ చుట్టూ చేరిపోయాయి. అదీ భాగవతుల కథల్లో కనిపించేది. మనం సాధనలో ఏదైతే కావాలనుకుంటామో అప్రయత్నంగా సిద్ధిస్తాయి భాగవతోత్తములలో. అది భాగవతంలో వుండే సులువు. ఇవన్నీ ఎప్పుడొచ్చినాయండీ అంటే, వచ్చిన వారికి తెలియవు ఇవన్నీ ఎప్పుడొచ్చి చేరాయో. వాళ్ళు గుర్తించినప్పుడు వీడికి తెలుస్తుంది, ఓహో ఇది ఒకటి మనకుంది కాబోలు అని. ఎందుకంటే వీడికై ప్రత్యేకించి గుర్తింపు వుండదు. ఎందుకంటే వీడికెంతసేపూ

అందులో వుండడమే. భగవంతుడి యందుండడమే. వుంటే continuous magnetization జరుగుతూంటుంది. అది  కారణంగానే వాడు యోగం చేసినవాడవుతాడు. వేదం చదివిన వాడవుతూంటాడు. అలా అన్నీ వచ్చి చేరి, అన్ని చేసిన వాడవుతూంటాడు. వాడియందు జ్ఞానం భాసిస్తూంటుంది. యోగం కనిపిస్తూంటుంది. కర్మల యందు కౌశలం కనిపిస్తూంటుంది. అన్ని యోగములు, భగవంతుడు చెప్పినవన్నీ వాడియందు కనిపిస్తూంటాయి. "Orient yourself as far as possible to the one light which is present." అదీ కారణం. భగవంతుడు అనే తత్వానికి ఒక రూపం అని పెట్టుకున్నాం కదా! అబ్బే! ఆ రూపం ఏం లాభం లేదండీ అని ఎవరన్నా అన్నా వినబోకండి. నీకు నచ్చిన రూపంలో నుండి  నువ్వు భగవంతునణ్ణి పొందు. ఆ రూపం యొక్క ధ్యానము నందు నిలబడడం వలన మనకి ఏం జరగాలంటే, మనం ఏది చూసినా ఆ వెలుగే గుర్తుకు రావాలి. అందరిలోనూ వున్నది మనం చూచిన వెలిగే అని గుర్తుకు వచ్చినప్పుడు, మనలో నుంచి వచ్చే ఆలోచనలు, మాటలు, చేతలు పవిత్రతకు below గా కాక above గా వుంటాయి. Beakeven line కి above గా వుంటాయి తప్ప below గా వుండవు. బొడ్డు కింద వుండడు. బొడ్డు పైన వుంటాడు. అట్లా వున్న వాళ్ళని మనకిస్తారు. వాళ్ళూ 'దమనులు' అంటే. అంటే వాళ్ళ యొక్క మనస్సు, ఇంద్రియములు, శరీరము, వారి ఆధీనంలో వుంటాయి. భగవత్ తత్వం లో అన్నీ దమింపబడి వుంటాయి. భగవంతుని సాన్నిధ్యంలో అంటే, భాగవతుల యొక్క రూపంలో మనకి దొరికే సాన్నిధ్యమే భగవత్ సాన్నిధ్యము. అందుకనే పెద్ద పెద్ద ఏనుగులు, పులులు, క్రూరులు అయిన మనుషులు ఒక  మహాత్ముని సాన్నిధ్యంలో వాళ్ళ యొక్క మనస్సు, ఇంద్రియాలకి వుండే ప్రకోపాలు కూడా తగ్గివుంటారు. అంగుళీమాలుడు పెద్ద గజదొంగ. వాడి area లో ఎవరొచ్చినా ముందు చంపేస్తాడు. ఎవరూ రాకూడదు. వస్తేనే వాడికి అవమానం. చంపేసి వాళ్ళ వద్ద వున్నవి దోచుకుంటూ వుంటాడు. బుద్ధుడు శిష్యులతో అక్కడకు వస్తాడు. వస్తూంటే, కాషాయం కట్టుకున్నవాడివద్దేముంటుంది? చంపి ప్రయోజనం లేదని, నువ్వు ఇటు రాబోక. నా పరిధి లోకి వస్తే చంపేస్తానంటాడు అంగుళీమాలుడు ఒక పెద్ద బండరాయి పై నిల్చుని. అయినా ఈయనలో మార్పు లేదు, నడిచి వస్తూంటాడు. వీడికి బాగా కోపం వచ్చి, ఆవేశంతో ఒళ్ళంతా కంపించి పోతూంటుంది వినకుండా దగ్గరకు వస్తున్నాడని. వీడు అంటున్న మాటలకి ఆయనలో ఏ మార్పూ రాలేదు.

మనమైనా అంతే కదా! మన మాట వినకపోయినా, అవతల వాడు ఒకటన్నా కనీసం ఒక జన్మంతా పీక్కుంటాం. ఎవరైనా ఏమైనా అంటే మర్చిపోవడం సాధ్యం కాదు.. Forgetting is not possible. Forgiving is possible. చచ్చినా మర్చిపోలేం. అలా అన్నాడు చూశావా! గుర్తున్నదా! అని లోపలినుండి పొడుస్తూంటుంది ఏదో మనం మర్చిపోయినట్లు. కాకపోతే మనం చేయగలిగిందేమిటంటే, అంటే అన్నాడులే అని క్షమించవచ్చు. అంటే క్షమించగలం గానీ మర్చిపోలేము. We cannot forget but we can forgive. ఇక్కడ ఈయన నడిచి వస్తూంటే తిడుతూంటాడు అంగుళీమాలుడు. అలాంటప్పుడు ఈయనకి ఎంత కదలాలి? ఆయనకేం కదలదు. ఆ పరిధి (వాడనుకొంటున్న పరిధి) దాటక ముందు బుద్ధుడు, ఆ పరిధి దాటి లోపలికి వచ్చిన బుద్ధుడికి ఒకే vibration ఒకే తరంగం. ప్రశాంతమైన తరంగం. ఆ తరంగంతో అలా దగ్గరకు వచ్చేస్తూంటాడు. అంగుళీమాలుడి మనస్సు, ఇంద్రియాలు, శరీరము వరుసగా ప్రకోపించడం మొదలు పెడతాయి. మొత్తం వొళ్ళంతా పూనకం వచ్చినట్లుగా అయ్యి మూర్ఛ స్థితికి వస్తాడు. దగ్గరికి వచ్చాక కత్తెత్తి, 'చంపుతానన్నా వచ్చేస్తావేమిటి?' అంటే, బుద్ధుడు కళ్ళల్లోకి చూస్తాడు. కళ్ళల్లోకి చూసేసరికి అంగుళీమాలుడికి పాపం, ఇంత జంతువులాంటివాడు అలా శాంతంగా అయిపోతాడు. ఎలా జంతువు? వాడిలోనూ జీవుడున్నాడు. జీవుడి మీద మూడు వున్నాయి. జీవుణ్ణి అధిష్టించి శరీరం, శరీరాన్ని అధిష్టించి ఇంద్రియాలు, ఇంద్రియాలను అధిష్టించి మనస్సు, స్వభావం వున్నాయి. అంటే స్వభావానికి, ఇంద్రియాలకి, శరీరానికి దాసుడైన జీవుడు. మనకి తెలిసిన normal human being. వాటన్నిటిని అధిష్టించినవాడు బుద్దుడు. అలాంటి వాడు దగ్గరకు వస్తే, ఇంతటి ఇనుప ముక్క magnetise అయింది. ఇనుప ముక్క నా aura లోకి నువ్వు రాక. చచ్చిపోతావ్ అని చెప్తుంది magnet కి. అయితే magnet నవ్వుకుని 'నేనెలా చచ్చిపోతానో చూస్తాను' అని దగ్గరకు వస్తే, ఇనుపముక్క మరిలేదట. అది కూడా magnetise అయిపోతుందిట. అలా వుంటుంది మహాత్ముని సాన్నిధ్యంలో. మహాత్ముని సాన్నిధ్యంలో ప్రకోపాలుండరాదు. వున్నాయిట అంటే వాడు మహాత్ముడా? కాదు అని అర్థం. అతడి చుట్టూ చాలా గొడవగా వుంటే అతడు మహాత్ముడు కాడానికి అవకాశం లేదు. ఎందుకంటే ఆశ్రమ వాతావరణాలు అలా వుంటాయి. అతడు, అతడి చుట్టూ ఉండే వాతావరణం ప్రశాంతంగా ఉంటాయి. పులి, లేడి ఒకదానితో నొకటి

అనురాగంగా వుంటాయి. ఆకలిగా వుంటే పులికి, ఆశ్రమ వాతావరణంలో వుండే లేడి, నేను నీకు ఆహారమవుతాను, నీ ఆకలి తీర్చుకో అని చెప్పేటట్లుగా వుంటుంది. వాటి status అది. మామూలుగా మనని ఓ మనిషి తిందామనుకుంటే ఒప్పుకుంటామా? ఎప్పుడు ఒప్పుకుంటాడంటే గురువుల వద్ద శిష్యులు అట్లా చేతులు, కాళ్ళు, శరీరము, మనస్సు అన్నీ అప్పజెప్పేస్తూంటారు. పర్వాలేదు అని చాకిరీ చేస్తూంటాడు. ఇంట్లో గానీ, ఆఫీస్ లో గానీ పని చేయని వాడు ఒక మహాత్ముడి వద్ద ఎలా పని చేస్తున్నాడు? సంఘంలో ఏ పనీ చేయనివాడు ఒక మహాత్ముడి వద్ద ఎలా పనిచేస్తున్నాడు? అక్కడ జంతు ప్రవృత్తి. ఇక్కడ voluntary గా చేస్తాడు. ఇక్కడ ఈయన సాన్నిధ్యంలో తన యొక్క దమనశక్తి ఇతరులయందు కూడా పనిచేస్తూంటుంది. అందుకని అందరినీ తిట్టేవాడు, కరిచేవాడు, ఆయన సమక్షంలో ఏం చేయడు. బావుంటాడు ఆ aura లో వున్నంతసేపూ. కాబట్టి భగవంతుని యొక్క 'దమన' అను తత్త్వము మనకి అక్కడక్కడా కనిపిస్తుంది. అన్ని జంతువులూ మనుషుల రూపాల్లోనే వున్నాయి. ఎలుక, పిల్లి, కుక్క, నక్క, తోడేలు, పాము, తేలు అన్నీ వున్నాయి. ఇవన్నీ భగవత్ తత్త్వము వున్నచోట పడి వుంటాయి. పడి వుండి వాడిలోని జీవచైతన్యము ఎక్కువ ఆవరించి, మిగతా స్వభావము దానికి అణిగి వుంటుంది. ఈ అణిగి వుండడం భగవంతుని దమనశక్తి వల్ల జరుగుతుంది. అందుకని భగవంతుడికి 'దమనుడు' అని ఒక నామం ఇచ్చారు. 'దమయంతి' అన్నారు. ఈమె నలుడి కన్నా చాలా ఎక్కువ stable. దమించిన స్థితి మొదటినుండీ వున్నది. అందుకే వదిలేసి వెళ్లిపోయినా, ఏం చేసినా wait చేస్తూ వుంటుంది దమయంతి మళ్ళీ నలుడు వచ్చేవరకు. ఈమె మనస్సు, ఇంద్రియాలు, శరీరమును అధిష్ఠించి వున్న తత్త్వం కలిగినది. మనం వాటిని దమించడం అంటే, వాటిని తొక్కేద్దాం అనుకుంటే అవి మనల్ని తొక్కేస్తాయి. తొక్కే పద్ధతి కాకుండా, ఎక్కువ వెలుగుకు సంబంధించిన కార్యక్రమములు చేసుకోవాలి. ఋషులిచ్చిన మార్గంలో భాగవతం దశమస్కంధములో చెప్పినట్లుగా ఊహించి కొలవమన్నారు. ఎంత మనం చేసుకుంటూంటే మనలోని జంతువు అంత సరిగా tame అవుతుంది. అదీ 'దమనుడి' నామానికి అర్థం.

## ౧౯౯ హంసః

'హ' అనే శబ్దము శక్తికి సంబంధించినట్టిది. 'స' అనే శబ్దము పురుషుడికి సంబంధించినది. రెండూ కలిపి 'హంస' శబ్దంగా ఇచ్చారు. అదే 'సోహం'. 'హంస' తిరగేస్తే 'సోహం'. అదే మరగేస్తే 'హంస'. తిరగేసి మరగేస్తే 'సింహం' అవుతుంది. హంస, సోహం, సింహం, హసాం ఇవన్నీ కూడా. అన్ని విద్యలకు మూలమంత్రంగా ఇచ్చారు 'హసాం'. ఈ సోహంలో 'ఓం' వున్నదని చెప్తారు. 'స' అనే శబ్దం భగవత్ తత్వానికి సంబంధించినది కాబట్టి 'సహస్రశీర్షాః' అని పురుష సూక్తం, హిరణ్యవర్ణాం హరిణీం అని 'హ' శబ్దంతో శ్రీసూక్తం 'స' 'హ' శబ్దాలతో ఇచ్చారు. 'సహ' అంటే అతడు అని. సోహం అంటే 'I am that' అని. అహమస్మి, సోహమస్మి. అతడే నేనుగా వున్నాను అని తెలియడం 'సోహమస్మి'. నేను అతడిగా వున్నాను అని కాక, అతడే నేనుగా వున్నాను అని. 'అహమస్మి' నేనున్నాను. 'సోహమస్మి' అతడే నేనుగా వున్నాను అని. 'బ్రహ్మహమస్మి' బ్రహ్మగా కూడా అతడే వున్నాడు. ఇంకెవ్వరూ లేరు. కనుక వున్నదొకడే అని తెలుసుకోవడం. 'సోహం' అనే శబ్దం ద్వారా అంతరంగంలోనికి తిరోధానం చెందిన వారంతా కూడా హంసలవలె జీవిస్తూంటారు. అంటే హృదయములలో జీవించే వారిని హంసలంటారు. ఆ హృదయానికి చేరుకునే మార్గం, హైవే N.H 5 లాగా, ఇది S.H. లా సోహం మంత్రం ద్వారా మనం లోపలికి వెళ్ళవచ్చు. ఉఛ్వాస 'సో' అనే శబ్దం. నిశ్వాస 'హ' అనే శబ్దముగా చెప్తారు. 'సో' అనే శబ్దంతో గాలి పీల్చడం, 'హ' అనే శబ్దంతో గాలి వదలడం చేస్తూ, ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసలను మనం బాగా గమనిస్తున్నట్లయితే, అవి పట్టుకొని మనం బావిలోపలికి వెళ్ళడానికి వీలుంటుంది. బావిలోకి తాడు వేసినట్లుగా అదీ ' 'Dip Deep' అంటే. అవి పట్టుకుని లోపలికి వెళ్తే, ఇదే 'సోహం' అనే శబ్దం హృదయ స్పందన గా వినిపిస్తుంది. హృదయ స్పందన లబ్ డబ్ అని వినిపించేది సోహం, సోహం గా వినిపిస్తుంది. Pulsation లో రెండు aspects వుంటాయి. 1. Unfolding 2. Refolding. విచ్చుకోవడం, ముడుచుకోవడం. విచ్చుకోవడం ముడుచుకోవడంగా జరుగుతూంటుంది ఈ స్పందనం. విచ్చుకోవడం 'హ' శబ్దంతోనూ, ముడుచుకోవడం 'స' శబ్దంతోనూ జరుగుతూంటుంది. ఈ రెండూ అలా వింటూంటే, ఈ రెండు హల్లులు పడిపోయి 'ఓం' మిగులుతూందంటారు. సోహంలో, 'స' లో 'ఓ', 'హం'లో 'సున్న' వున్నది.

అందుకని 'ఓం' మిగిలి 'సహ' లు పడిపోయి 'ఓం' వినిపిస్తుంది. ఆ 'ఓం' ని వింటుంటే, ఇహ మన లోపల వున్న నిర్మలమైన జీవనస్రవంతిలో (దాన్నే 'మానస సరోవరం' అంటారు) జీవిస్తూండవచ్చు. అంటే బయట వుండే గోలలతో తిరక్కుండా తన యందు తాను జీవించే స్థితిలో వుంటాడు. అంటే కాలము, దేశము అతని యందు ప్రభావము చూపించవు. ఎవరియందైతే దేశము, కాలము ప్రభావము చూపించవో, అతను హంస తత్వము కలిగినవాడు. ఏ ప్రదేశంలోనైనా, ఏ కాలమందైనా తాను అంతర్ముఖుడై అంతరంగంలో జీవుడిగా దేవుడనే మహా సరస్సులో జీవిస్తూంటాడు. బయటకి వచ్చినా కూడా పాలు, నీళ్ళు వేరు చేసే విధంగా హంస ఎలా జీవిస్తుందో, ఇతడు కూడా తన ధర్మం మేరకు తన కర్తవ్యం నిర్వర్తించి లోపలకు వెళ్ళిపోతూంటాడు. ఇహ బయటకు వచ్చి అక్కరలేనివీ, అనవసరమైనవీ అని చేయడం వుండదు. నిజంగా హంసతత్వం వున్నవాడికి తను చేయవలసినదేదో తనకి తెలిసి వుంటుంది. తను చేయవలసినది మాత్రమే చేస్తూంటాడు. అంతకుమించి పూసుకోడు. హంస ఎలాగైతే పాలు, నీళ్ళు వేరుచేసుకుని పాలు పుచ్చుకుంటుందో, అలాగే ఈ పరమహంస కూడా శరీరం వున్నందుకు బయట బహిర్గతం కావాలి కనుక, బహిర్గతం అయినప్పుడు బయట కూడా వెలుగుకు సంబంధించిన కార్యక్రమములే నిర్వర్తించుతూ, మళ్ళీ లోపలికి వెళ్ళిపోతూంటాడు. లోపల కూర్చుంటే మళ్ళీ మరొక పని చేయమని వస్తుంది. ఇలా దివ్య ప్రణాళిక అతడి నుండి వ్యక్తమై, ఇలాచెయ్యి అంటాడు. అది చేశాక మళ్ళీ లోపలికి వెళ్తాడు తప్ప, బయటకి పరుగులు పెట్టడు. బయటకి పరుచుకుపోవడం వుండదు. ఏదో ఒక చంద్రగ్రహణం నాడు ఇలా లోపలకు వెళ్ళినటువంటాయనకి 'భాగవతం రాయి' అనిపించింది. 'నేనెక్కడ రాస్తానూ' అంటే, 'నేను రాస్తాను కదా! నువ్వు కూర్చో' అంటాడు. అందుకే ఆయన "పలికించెడి వాడు రామభద్రుండట నే పలికిన భవహరమగునట, తెలిసి పలుకుట చిత్రము--". ఇవన్నీ వున్నాయి కదా! అయిపోయింది. భాగవతం రాసేసి అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడాయన. మనం రాసిన భాగవతం మనమే print చేసుకోకపోతే రేపు ప్రొద్దున ప్రజలు ఏం చేసి పెడతారనే భావదారిద్ర్యం లేదు. ఎందుకని? భగవంతుడు తనకి ఏం చెప్పాడు? తెలుగులో భాగవతం రాయి అనిచెప్పాడు తప్పా print చేయమని చెప్పలేదు. ptint చేస్తే పద్ధతి లేదు అక్కడ. అదేంటి? అక్కడ పట్టేశావు అంటే, 'వాడు రాయమన్నాడు రాశాను. మిగిలింది వాడు చూసుకుంటాడు' పదండని ఆ ఇంట్లోనే వదిలేసి పెళ్ళాం,

పిల్లల్ని తీసుకొని వెళ్ళిపోయాడు. అట్లా వుంటారు భాగవతోత్తములు. వెనక్కి తిరిగి చూసేవాడు భాగవతోత్తముడు కాడు. అంటే తన ఉపన్యాసం ఎట్లా వుందని పదిమందిని అడిగి, ఆ కాగితాలు తానే అచ్చేయించి, తనే పంచిపెట్టుకుంటూ వాళ్ళ దగ్గర మళ్ళీ దీని గురించే చెప్పుకుంటూ, ఇట్లా బ్రతకడు. బహిర్గతంగా బ్రతకడు. అంతర్గతంలో బ్రతుకుతూ వుంటాడు. దానిమీదే శ్రద్ధ. అదే శ్రద్ధ! హంసవలె జీవిస్తూ వుంటాడు అంటే అర్థమది. ఈ 'సో' అనే శబ్దాన్ని పట్టుకొని లోపలికి వెళ్ళి కూర్చుంటాడు. లోపలినుంచి భగవత్ ప్రణాళికలో భాగంగా ఆదేశాలు అందుతూ వుంటాయి. ఎందుకందుతాయి అంటే ఇతడు దానికి link up అయివుంటాడు కాబట్టి. ఎట్లాగైతే ఈ విద్యుత్ పరికరాల్లో వున్న విద్యుత్తు విశ్వవ్యాప్తమైన విద్యుత్తుతో ఎలా అనుసంధానం చెందివుందో, ఇతడు కూడా అట్లా link up అయి వుంటాడు. ఊళ్ళో వుండే స్టేషన్లో వుండే విద్యుత్తే కదా ఇక్కడికి వ్యాప్తమై వచ్చింది. తాను వ్యాప్తి చెంది ఈ వాహికలో వున్నాను అని తెలిసిన వాడిగా వుంటాడు తప్ప, ఇందులో ఇరుక్కొన్నవాడుగా వుండడు. విద్యుత్తు వాహికలో ఇరుక్కొని లేదు కదా! అట్లాగే జీవుడు శరీరంలో ఇరుక్కొని వుండడు. ఇరుక్కోకుండా అక్కడ వుంటూ వుంటాడు ఎప్పుడూ. అంటే ఆ పుట్టుక స్థానంలో వుంటాడు. అక్కడ తండ్రి అనే భగవత్ తత్త్వములో జీవిస్తూంటాడు. అక్కడ నుంచి ఒక impulse వస్తుంది. చెయ్యరా ప్రపంచానికని కాలం రూపంలో నిర్దేశిస్తూ వుంటాడు భగవంతుడు. ఆ చెప్పింది చేసేసి మళ్ళీ వెనక్కి వచ్చేస్తాడు. మళ్ళీ ఇంకోటి చెప్తాడు. మళ్ళీ అది చేస్తూ వుంటాడు. మళ్ళీ వచ్చేస్తూ వుంటాడు. శరీరం వున్నంతకాలం చేస్తాడు. ఎంతకాలం శరీరం వుండాలనేది వాడు నిర్ణయించుకోడు. అది వాడికి వదిలేస్తాడు. ఆ శరీరం ఇన్నాళ్ళు వుంచుకుందాం అనే కార్యక్రమం వుండదు. అది ఉండడం, ఊడడం కూడా వాడి కార్యక్రమంలో భాగంగా పెట్టేసుకొని పని చేస్తూ వుంటాడు. అట్లా వుంటాడు హంస. కాబట్టి అటువంటి హంసతత్త్వంలో వుండే వాళ్ళని పరమహంసలని చెప్తూ వుంటారు. ఈ హంసతత్త్వం మనకి చాలా ప్రధానమైనది. లోపలికి వెళ్ళి అంతర్ముఖులవుతాము అని అనుకునేటటువంటి వారందరూ కూడా తప్పక సాధన చేయవలసిన మార్గం ఈ హంస మార్గం. దీనిని 'సోహం' అనే శబ్దంతో నిర్వర్తించుకోవచ్చు. మనకి మామూలుగా రాత్రిపూట ఎట్లాగూ నిద్రలోనే వుంటాం కాబట్టి లేచిన తర్వాత బయటకి వచ్చే ముందు దీన్ని చేసుకోమంటారు. ఇదే ప్రాణాయామంగా చెప్తారు. గాలి పీలుస్తూ 'సో' అనే భావన, గాలి వదులుతూ 'హం'

అనే భావన చేసుకుంటూ నెమ్మది నెమ్మదిగా లోపలికి పీల్చి, నెమ్మదిగా బయటకు వదులుతూ ఆ తర్వాత ఆ శబ్దం సంగతి అలా వుంచి, ఈ లోపలికి వెళ్ళడం బయటకు రావడంగా జరుగుతూ వుంటుంది. ఈ లోపలికి వెళ్ళడం బయటకు రావడం, అసలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎవరు చేస్తున్నారు అనే point వస్తుంది. అది భాసించినప్పుడు లోపల స్పందనం ఆధారంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. స్పందనం యందు ఆసక్తి చెందుతాం. స్పందనం యందు ఆసక్తి చెందితే దానియందు బాగా మనకి అనురక్తి పెరిగిన కొలదీ ఇందాక చెప్పిన ఒక మహాత్ముని aura లోకి, ప్రభావంలోకి, పరిధిలోకి వెళ్ళిన వాడికి జరిగినట్లే, హృదయం అనే కేంద్రంలోకి మనసు తనుగా తాను 'సోహం' అనే పద్ధతిని పట్టుకొని లోపలికి వెళ్ళగానే మనసు తన పుట్టుక స్థానంతో లయమైపోతుంది. అయిపోయి మొట్టమొదటిసారిగా మనం అంటే మనం ఎట్లా వున్నామో మనకు తెలుస్తుంది. అంతవరకూ తెలీదు. అంతవరకు మనం వుండడం అంటే మనం భావాల్లో వుండడంగా వుంటుంది. భావాల్లో వుండడం గానే రోజంతా గడిచిపోతుంది. మరి నిద్రలో ఎట్లా వున్నామో తెలియదు. అప్పుడు భావాలుండవు. మనకి మనం ఎట్లా వున్నామో మనకు తెలియదు. నిద్ర లేనప్పుడేమొ భావాల్లో ఉంటాం. అందుకని ఎప్పుడైనా మనం అంటూ ఎట్లా వున్నామో మనకి తెలియాలంటే, అదే తనను తాను తెలుసుకోవాలంటే తను ఎక్కడ వున్నాడో, తను ఎవరుగా వున్నాడో, తను ఎవరు? ఇవన్నీ తెలియాలంటే చుట్టూ ఆవరించియున్న భావాలన్నీ కూడా జారిపోవాలి. ఎప్పుడూ ఏదో ఒక భావం ఆధారంగా జీవిస్తూ వుంటాం మనం. ప్రొద్దున లేచిన దగ్గర్నుంచి ఒకటి పట్టుకు తిరుగుతూ వుంటాం. అది పారేయగానే ఇంకోటి పట్టుకుంటాం. దాన్ని పారేయం ముందు. అది పారేసి, ఇంకోటి పట్టుకున్నా అదృష్టవంతులమే. ఇంకొకటి పట్టుకొని ఇది పారేస్తాం. చేతిలో చాలా వుంటాయి కదా పనులు. ఎప్పుడూ ఏదో ఒకటి చేతుల్లో వుంటూనే వుంటుంది. ఆ చేతికి ఇంక relief లేదు. చేతినిండా పనులండీ నాకు అంటుంటాడు కదా! చేతినిండా పనులంటే ఏమిటి? He is completely held by his thoughts and he never feels how he is without the thought. తనంటే ఎలా ఉన్నాడో ఈ ఆలోచన లేకపోతే తనేమిటి అనేది తెలీదు వాడికి. ఎందుకంటే ఏదో ఒక ఆలోచన ఉపాధిగా జీవిస్తూ వుంటాడు. ఆ ఆలోచన ఉపాధిగా జీవిస్తున్నప్పుడు ఆ ఆలోచనలే తానుగా జీవిస్తాడు. ఆ ఉపాధి అయిపోతూంటాడు. అదీ ఊసరవెల్లి అంటే. పెళ్ళాం కనపడగానే మొగుడైపోతాడు

వాడు. పిల్లలు కనబడగానే తండ్రి అయిపోతాడు. Boss కనపడగానే subordinate, subordinate కనబడగానే boss అయిపోతాడు. Friend కనబడగానే friend అయిపోతూ వుంటాడు. ఇష్టం లేనివాడు కనబడగానే ఇంకోటి అయిపోతూంటాడు. ఇట్లా అయిపోతూ వుంటాడు కదా! లేచిన దగ్గర నుంచి ఏదో ఒక రంగులో వుంటాడే తప్ప రంగులేని స్థితి లేదు. రంగు ఎక్కడ నుంచి వచ్చింది? సూర్యుని యొక్క వెలుగు వక్రీకరణం చెందినందువలన కదా రంగు వచ్చింది. ఇట్లా మనం we know our distarted existence, we don't know our own existence. అది ఎప్పుడు తెలుస్తుందంటే thought అనే prism లో ఇరుక్కోకుండా వుంటే తెలుస్తుంది. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలో మనం వుండి, అది మనల్ని నడిపిస్తూ వుంటుంది. మంచి ఆలోచనల విషయంలో కూడా ఇది సత్యం. మంచి ఆలోచనలు చేసేవారు కూడా తమ్ము తాము తెలుసుకునే స్థితిలో లేరు. వాడు అప్పుడు చేసే మంచి పనులు కూడా వాడికొచ్చే ఆలోచనలోంచి పుట్టేవే. మంచి చేద్దాం అని చాలా రకాలుగా రాగద్వేషాలలో కొట్టుకుపోతూ వుండేవాళ్లు బోలెడు మంది వుంటారు. ఇంకొకళ్ళు మంచి చేస్తూ వుంటే మనకంత బాగా నచ్చదు. మనకన్నా మంచి పనులు చేస్తూ వుంటే అందులో ఏమన్నా తప్పులెన్నాలనిపిస్తుంది కదా! మనం మంచి చేస్తుంటే, ఇంకొకళ్ళు కూడా మంచి చేస్తుంటే మనకు అంతగా నచ్చదు. ఎందుకంటే మన ఫోటో ప్రక్కన ఇంకొకరి ఫోటో కొంచము ఇదిగా అనిపిస్తుంది. మన ఫోటో ఒక్కటే వుండాలనిపిస్తుంది. అట్లాగే మనం మంచి పనులు చేస్తున్నాం అనుకోండి, చేసే వాటిలో అవి మనకుండే ఆలోచనలకు సంబంధించినవే తప్ప, భగవంతుడు నిర్ణయించిన మంచి చేయలేము. ఎవరికి ఏ మంచి జరగాలో పై కక్ష్యలోంచి ఎక్కువ బాగా తెలుస్తుంది క్రింద కక్ష్యలో కంటే. ముందు మనకు తోచిన మంచి చేసుకుంటూ వెళ్ళడమనే పద్ధతి ఒకటి వున్నది. కానీ తన్ను తాను తెలుసుకోవడం అనే స్థితి వచ్చిన వాడి ద్వారా, ఎదుటివాడికి ఏం జరగాలో ఆ తత్వం నుంచి దిగివచ్చి జరిగిపోతుంది. వాడికి చేయడం అంటూ వుండదు. ఎందుకంటే వీడు అటు orient అయివుంటాడు. సాధకుడు భగవత్తత్వం వైపు orient అయి వుంటాడు కాబట్టి అక్కడ నుంచి తనకు వచ్చే స్ఫూర్తి, స్ఫురణ ఏదయితే  అది ఎదుటివానికి చెప్తాడే తప్ప, ఎదుటి మనిషి కోరిక వల్ల మంచి చేయడు. తనకు వినిపించినది చేస్తాడు. ఎందుకంటే అతను నిశ్శబ్దాన్ని వింటాడు. ఎదుటివాడు చెప్పింది వినడం ఒకటి. లోపల నుంచి వినడం ఒకటి. మనకి

ఎదుటివాడు చెప్పింది వినడానికి చెవులు చాలు. లోపల నుంచి చెప్పింది వినడానికి చెవులక్కరలేదు. లోపల్నుంచి విని చేసేవాడుగా తయారవడానికి వీలు పడుతుంది. ఇతరుల మంచి సంగతలా వుంచి తనకు తానెవరో తెలిసి వుంటాడు. ఒకేలాంటి సమస్యను ఇద్దరు తీసుకొని వచ్చినా వాళ్ళకి ఇచ్చే పరిష్కారాలు వేరుగా వుంటాయి. సమస్య ఒకటిగా ఉంటుది. ఎందుకంటే అట్నుంచి విని చెప్తాడు కాబట్టి. ఇట్నుంచి విని చెప్పడు. ఇట్నుంచి విన్నది అటు పట్టుకుపోయి అక్కడ పెడతాడన్నమాట. మనం చూడండి మనకేదన్నా ఇస్తే తీసుకెళ్లి మాస్టర్ గారి పాదాల దగ్గర పెడతాం. అట్లా నువ్వు నమ్ముకున్నటువంటి గురువో, దైవమో వాళ్ళ పాదాల దగ్గర పడేయాలి. ముందు పడేస్తే అట్నుంచి మనకు వినిపించాలి. వినిపించకపోవచ్చు. ఊరుకోవాలి. ఊరుకుంటే చాలా ఉపకారం చేసిన వాళ్ళమవుతాం. ఊరుకోవడం కన్నా ఉత్తమం లేదంటారే! అంటే మనం అవతలి వాడికి నిజంగా మంచి జరగాలనుకుంటే అట్లా వుంటుంది. ఈసాధన ద్వారా అంతర్ముఖుడైన వాడు మాత్రమే అట్నుంచి పట్టుకొచ్చి ఇటందిస్తూ వుంటాడు ప్రతిదిన్నూ. అది ఈ హంస శబ్దం వున్నవాడు చేయగలడు. ఎందుకంటే ప్రతి జీవుడిలోనూ ఈ హంసస్వరూపుడిగా భగవంతుడే వున్నాడు. లోపలికి వెళ్తే మనం, మన హంసతో మాట్లాడుకోవచ్చు. హంస రాయబారం అలా వచ్చిందే. బయట ఒక హంస ఇట్నుంచటు తిరగక్కర్లేదు ఇద్దరు హంసల మధ్య. హంసతో మాట్లాడుకోవడం తెలిసిన వాళ్ళకి తన లోపలికి తను వెళ్ళిపోతే, తను హంసస్వరూపుడైపోతే అవతల వాడు కూడా హంసస్వరూపుడై వుంటాడు కాబట్టి ఈ హంసకి ఆ హంసకి మధ్య communication conduct అయిపోతుంది. అందుకని మహాత్ములు మాటిమాటికీ కలుసుకొని ఏం చేయాలని నిర్ణయించుకోరు. భూమి మీద వారి వారి కేంద్రాలలో వారుంటూ, ఒకరితో ఒకరు ఇలా communicate చేసుకుని పని చేసుకుంటారు. బయటి ఖర్చులు అవి వుండవు వాళ్లకి. Time waste వుండదు. కళ్ళు మూసుకుని కూర్చుంటే అందరూ అక్కడ ఆ సరోవరంలో చేరతారు. హంసలన్నీ ఆ సరోవరంలో చేరినట్లుగా. దానికి ఇంకా distance అనేటటువంటి point వుండదు. అక్కడ వింటారు, దాని ప్రకారం నిర్వర్తిస్తూంటారు. దివ్య ప్రణాళిక నిర్వర్తించాలంటే రోజూ మీరు చెప్పాలి సార్ అనేటట్లుగా వుండరు ఈ హంసలు. ఈ హంసలందరికీ రాజహంసగా భగవత్ తత్వం వుంటుంది. "యోగుల హృదయముల యందు నివసించే రాజహంస" అని చెప్తారు భగవంతుణ్ణి. ఆ హంసతత్వంలో మనం జీవించడం చేస్తే మనకి, మనలో

మనం హంసస్వరూపులం అని తెలుస్తుంది. ఇది మొదటిది. ఈ హంసస్వరూపం మనది కాదు. వాడే హంసగా మనలో వుండడం వల్ల ఇవన్నీ జరుగుతున్నాయి అని తెలుస్తుంది. అది రెండవది. ఈ హంస ఇట్లా బోలెడు హంసల్ని గుడ్లుగా పెట్టుకుంటూ పోతోంది, అని తెలుస్తుంది. "గుడ్డులు పెట్టుచు తేలిన దిదివో ఉబ్బు నీటిపై నొక హంసా." అని పాట పాడతారు అన్నమాచార్యులువారు. ఇట్లా దిబ్బలు పెడుతూందిట ప్రతిచోట. దిబ్బలు దిబ్బలుగా పెట్టుకుంటూ పోతూంది ఈ హంస. అన్నమాచార్యుల వారు రాసిన హంస పాట. అందులో ఎంత తత్వం ఇచ్చారో హంస గురించి. ఆ హంసకి భౌతికమైన రూపమే మనం చూసే హంసలు. అంతర్గతంగా మనకుండే జీవస్వరూపమేదైతే వుందో దానికి ప్రతీకగా మనకి హంస సృష్టిలో వుంది. అంటే ఆ హంసకెంత పవిత్రత వుందో మనకీ అంత పవిత్రత వున్నది జీవుడిగా. దేహాన్నుంచి వెలువడిన జీవుడిగా మనకి ఆ పవిత్రత వున్నది. ఆ హంస ఎక్కడబడితే అక్కడ తిరగదు కాబట్టి ఈ హంసతత్వం చెందినవారు ఎక్కడబడితే అక్కడ తిరగరు. ఆ హంస చేసే movements అన్నీ కూడా కాలాన్ని, దేశాన్ని అనుసరించి వుంటాయి. ఈ హంస కూడా కాలాన్ని, దేశాన్ని అనుసరించి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూంటాడు. ఎప్పుడూ కాంతివంతంగా వుంటుంది ఆ హంస. ఈ హంస కూడా అట్లా ఎప్పుడూ కాంతివంతంగా వుంటాడు. చాలా నిర్మలంగా, నిశ్శబ్దంగా వుంటుంది ఆ హంస. ఈ హంస కూడా చాలా నిర్మలంగా నిశ్శబ్దంగా వుంటుంది. అందుకని పెద్దలు సరస్సులో తేలియాడుతున్న హంసను కూడా ధ్యానానికి ఒక సంకేతంగా ఇచ్చారు. సరస్సు అంటే సృష్టి అనేటటువంటి ఈ చోటు, సృష్టి జరుగుతున్నటువంటి చోటు. ఆ చోట్లో తేలుతూన్నటువంటిది హంస. మునిగి వున్నటువంటివి మన బోటి జీవులు. హంసతత్వంలోకి ఆ విధంగా మనని మనం ఉద్ధరించుకున్నట్లయితే బాగుంటుంది. మనలో మనం హంస స్వరూపులుగానే వుంటాం. కాకపోతే ఎక్కువ మనసులో జీవించడం వలన మన హంస స్వరూపం మనకి అవగాహన కాదు. మన స్వస్వరూపం గురించి తెలిసినప్పుడు మనమంతా కూడా హంసలమే అని తెలుస్తుంది. హంసల వలె హాయిగా స్వచ్ఛంగా జీవించే తత్వం సహజంగా మనలో వుంది. అది కాదనుకొని మనకున్న మనసు పరిధిలో జీవించడం వలన, వేరే విలువలు మన ఏర్పాటు చేసుకోవడం వలన ఈ నిర్మలమైన, ప్రశాంతమైన జీవితాన్ని కోల్పోయిన వాళ్ళ మయ్యాం. మళ్ళీ ఆ నిర్మలము, ప్రశాంతము, ఆనందమయము, తేజోమయము అయిన జీవితం

పొందాలనుకున్నట్లయితే హంస శబ్దాన్ని ఎక్కువగా సాధన చేయాల్సి వుంటుంది. హంస శబ్ద సాధనే సోహంగా మనకి పెద్దలు ఇచ్చి వున్నారు. అంటే మనం చేసే ఉచ్ఛ్వాసం ద్వారా 'సో' అనే శబ్దాన్ని, నిశ్వాసం ద్వారా 'హం' అనే శబ్దాన్ని మనం వినటం దైనందిన జీవితంలో ఒక కార్యక్రమం కావాలి. అదొక్కటే మనకు మార్గం, మనసు నుండి విడిపడి మన స్వస్థానానికి చేరుకోవడానికి. సింహరాశి హంస శబ్దానికి సంబంధించినటువంటిది. సింహ, హంస, హసొం సోహం ఇవన్నీ ఒకే తత్వాన్ని తెలియజేసే వివిధ మైనటువంటి పదములు. కాబట్టి 'సోహం' అనే శబ్దాన్ని మనకి తీరిక సమయాలు వున్నప్పుడు ఉచ్చారణ చేసుకోవాలి. తీరిక సమయాల్లో మనసు, మనకు అవసరంలేని విషయాల మీద ఎక్కువ స్పందిస్తూ వుంటుంది. పని వున్నప్పుడు పనికి సంబంధించే వుంటాం. పని లేనప్పుడే మనకు, మన మనసుతో ఎక్కువ ఇబ్బంది. పని లేని మనసు మనల్ని పాడు చేస్తుంది. పాడు చేయడం అంటే ఏం లేదు. పాడు ఆలోచనలు తీసుకొస్తూ వుంటుంది. వాళ్ళ మీద, వీళ్ళమీద, జీవితంలో జరిగిన దుర్ఘటనల మీద, దుఃఖములమీద, ఇటువంటి ఆలోచనలే మన అస్తిత్వానికి అంటే మన శరీరంలో మనం ఉండటానికి దెబ్బతీసేటటువంటి ఆలోచనలన్నీ కూడా తీరిక సమయాల్లో వస్తాయి. పని వున్నప్పుడు రావు. పనిచేస్తున్నప్పుడు రావు. పనిచేస్తున్నప్పుడు ఒకే ఆలోచనలో వుంటాం మనం. పని లేకపోవడమే మనకి ఎక్కువ. అందుకే బాగా పని వుండేవాడు ఎక్కువ ఆరోగ్యంగా వుంటాడు. పని తక్కువ వుండేవాడు తక్కువ ఆరోగ్యంతో వుంటాడు. ఆరోగ్యం బాగులేదుట అంటే దానికి కొంత కారణం కూడా వున్నది మనకి. ఎక్కువ తీరిక వున్న వారికి ఎక్కువ అనారోగ్యం రావడానికి అవకాశం వుంది. అంటే మనసులోనే మొదలవుతాయి అనారోగ్యాలన్నీను. మనసులో వచ్చేటటువంటి ఆలోచనలను బట్టి, అవి మనకి మణిపూరకంలో చేసే గోలబట్టి అక్కడి నుంచి స్వాదిష్టానం, అక్కడి నుంచి మూలాధారం చేరుకొని disturbences మనకి మొత్తం దేహమంతా ఏర్పడి, దాన్నుంచి మనకి ఆరోగ్యాలు కూడా పాడవటం జరుగుతూ వుంటుంది. అందుకని మనకు ఋషులు ఇచ్చిన మార్గంలో, పని వున్నప్పుడు పని చేసుకో. పని లేనప్పుడు 'సోహం' అనేటటువంటి మంత్రాన్ని ధారణ చేయమన్నారు. ప్రొద్దున లేచినప్పుడు చేసుకోమన్నారు. రాత్రి పడుకోబోయే ముందు చేసుకోమని చెప్పారు. మధ్యలో పనికి, పనికి మధ్య విశ్రాంతి దొరికితే చేసుకోమని చెప్పారు. ఎందుకు చేసుకోమని చెప్పారంటే పని లేనప్పుడు దానిలో వుండు. పని వున్నప్పుడు బయటకు

రా. పని ఉన్నప్పుడు చక్కగా వుంటుంది మనకి. పని లేనప్పుడే ఇబ్బంది కాబట్టి పని లేనప్పుడు ఈ పనిలో వుంటే ఎంతో బావుంటుంది. తద్వారా మనల్ని మనం ఉద్ధారణ చేసుకోవడానికి అంటే పునర్నిర్మాణం చేసుకోవడానికి వీలవుతుంది. ఈ హంస శబ్దంలో ప్రవేశించి మనం ఏ విధంగా హంసస్వరూపులమో, జ్యోతి స్వరూపులమో సహజంగా ఆనందంగా స్వరూపులమో, మనకు తెలియడానికి పెద్ద అవకాశం. మనస్సు ఎటువంటిది అంటే మనకు ఉపనిషత్తులలో చెప్పారు. ఒకాయన తపస్సు చేసి 'నేనేపని కావాలంటే ఆ పని చేసి పెట్టడానికి ఒక సేవకుణ్ణి ఇమ్మని' అడిగితే 'అటువంటి సేవకుని ఇస్తాను కానీ నీకు వాడితో పని చేయించుకోవడానికి కావలసిన సత్తా వున్నదా' అని అడుగుతాడు బ్రహ్మదేవుడు. 'అదేంటి చాలా పనులున్నాయి నాకు. చేయించుకోలేకపోతానా? ఎంత చేసినా తెమలనంత పని వుంది నా దగ్గర. అటువంటిది నీవు కనుక నాకు సేవకునణ్ణి ఇస్తే చేయించుకోవలసిన పనులు చాలా వున్నాయి. జన్మల తరబడి వుండే పనులున్నాయి. కాబట్టి నీవిస్తే నేను చూసుకుంటాను. వాడి చేత పని చేయించుకోలేకపోవడం అంటూ ఏం లేదు' అని చెప్పడం జరుగుతుంది. అప్పుడు బ్రహ్మ అంటాడు,' ఇవ్వడానికి నాకు అభ్యంతరం లేదు. తర్వాత అతన్ని నీవు సరిగా ఉపయోగించుకోలేకపోతే, అతను నిన్ను ఉపయోగించుకోవడం మొదలుపెడతాడు. ఆ సేవకుడికి అహర్నిశలు పని చెప్పి ఉపయోగించుకోలేకపోతే అతడు నిన్ను తినడం మొదలు పెడతాడు. నిన్ను భక్షిస్తాడు నీవతనికి పని చెప్పకపోతే. ఈ condition మీద నీకు అటువంటి సేవకుణ్ణి ఇస్తున్నాను' అంటే మహదానందంగా పుచ్చుకుంటాడు. పుచ్చుకున్న తర్వాత కనబడతాడు నరుడా ఏమి నీ కోరిక? అన్నట్లుగా! అంటే 'ముందు ఈ ప్రదేశంలో తపస్సు చేత నేను బాగా చిక్కిపోయాను. మంచి ప్రాణవంతంగానూ, తేజవంతంగానూ, ఆరోగ్యవంతంగానూ, కళకళలాడేటట్లు నా ఒళ్ళు తయారు చేయి' అంటే తథాస్తు అంటాడు. అంటే అయిపోతుంది. 'తర్వాత ఏం చేయమంటారు' అంటాడు. అంటే 'ఇంటికి పోదాం పద' అంటాడు. అంటే కనురెప్పపాట్లో ఇంటి దగ్గర వుంటాడు. మనసుకి అంటే మనోమయ లోకంలో అట్లా వుంటుంది. ఇంట్లో వుంటాడు. 'ఇప్పుడేమి చేయమంటావు' అని అడుగుతాడు. అంటే 'ఇల్లేం బాగాలేదు కొంచెం మంచి భవనం కట్టిపెట్టు' అంటాడు. తథాస్తు అంటాడు. అయిపోతుంది. 'ఇంకా ఏంటి' అని అడుగుతాడు. మా ఆవిడ ఆరోగ్యం, తథాస్తు. పిల్లలు, తథాస్తు. వాళ్ళకు

ఉద్యోగాలు, తధాస్తు. వాళ్ళకు పెళ్ళిళ్ళు, తధాస్తు. అన్నీ మొత్తం మన జీవితంలో మనం అనుకున్నవన్నీ కనుక అయిపోతే పది నిమిషాలకన్నా ఏమీ పని వుండదు. ఇహ ఆ తర్వాత ఏం చేయాలో తెలియదు. పది నిమిషాలు కనుక మనం అనుకున్నవి list వేయండి మీరు అనుకొని సరదాగా. నేను ప్రయత్నం చేసి చూశాను. మూడు నాలుగు నిమిషాల తర్వాత ఇంకేమీ లేదు. ఇవన్నీ అవవు కాబట్టి మనం బ్రతికి వున్నాం కానీ అయిపోతే ఏం చేయాలో తెలియదు. అట్లా వుంటుంది. ఆ విధంగా చేసేసరికి 'ఇప్పుడేంటి చెప్పు' అన్నాడు. ఇంకేంటి? ఆలోచిస్తున్నాడు. 'ఆలోచిస్తే లాభం లేదు. చెప్పలేకపోతే నిన్ను తింటా అంటాడు. వుండవయ్యా అంటే, వుండడానికి మనకి condition లేదు. నీవు చెప్తే పని చేస్తా. నీవు పని చెప్పకపోతే నీ పని నేను చూసుకుంటాను'. అంటే ఇంకా ఆలోచించి అవీ ఇవీ ఇంకా ఏవేవో చెప్తాడు. అన్నీ అయిపోతూ వుంటాయి. అయిపోతూ వుంటే, ఇంకా ఏమిటంటంటాడు. కాస్త ఆగరా అంటే, ఆగను నేను నిన్ను తింటానంటాడు. అయ్యబాబోయ్ వీడు నన్ను తింటే నేనెక్కడ బతుకుతాను అని పరిగెత్తుతాడు అరణ్యంలోకి. అరణ్యానికి పరిగెట్టి పరిగెట్టి ఆయాస పడుతూంటాడు. ఆయాసపడుతూంటే అక్కడ ఒక మహర్షి వుంటాడు. ఈ సాధకుణ్ణి చూసి ఏంటి అట్లా పరిగెడుతున్నావు అంటే వాడికి మాటలు చెప్పడానికి టైం లేదు. అంటే వాడు వెనకాల వస్తున్నాడన్నమాట. మనం అరణ్యాలకు పోయినా మనతో వస్తాడు కదా. మనం తీర్థానికి వెళ్ళినా, ఏ పుణ్యక్షేత్రానికి వెళ్ళినా మనతోటే వచ్చి అక్కడ కూడా మనల్ని పాడు చేస్తూ వుంటుంది అది. కదా! మనం ఎక్కడికెళ్ళినా సరుకు మనదే కాబట్టి అక్కడ విప్పుకుంటుంటాం. ఏం వుంది? అది పుణ్యక్షేత్రం కాబట్టి కాసేపు ఆగమంటే ఆగుతుందా మనసు? ఆగదు కదా! బావుండదు ఇక్కడ వద్దు అంటే ఆగదు. పైగా ఎక్కువగా పని చేస్తుంది. చెప్పడానికి కూడా వాడికి ఆగడానికి భయం. అంటే అప్పుడు చూస్తాడు ఆ మహర్షి. చూసి 'వాడి గురించేనా నీకు భయం' అంటాడు. అంటే, 'అవును వాడు నన్ను తినేస్తాడంటాడు'.' అటువంటి వాడు నా దగ్గరా వున్నాడు. నేను వాడ్ని జాగ్రత్తగా ఒక నియమంలో పెట్టుకున్నాను. నీవాడ్ని కూడా నియమంలో పెడతాను. నీకెందుకు నీవు ఆగు' అంటాడు. ఆగు అంటే ఆగుతాడు. ఆగిన తర్వాత వాడొస్తాడు. వాడొచ్చి, వీడు నాకు పని చెప్పకపోతే వీడ్ని తినేయాలి. అది నాకు బ్రహ్మ ఇచ్చిన వరం. నాకు ఆకలిగా వుంది. వీడ్ని తింటానంటాడు. అంటే, అప్పుడు ఆ మహర్షి ఏం చేస్తాడంటే పనే కదా నీకు

కావాలి, ఆయన పని చెప్తాడు. ఆ పని చేస్తూండు అంటాడు. అంటే చెప్పమను అంటాడు. అంటే అప్పుడు ఈ మహర్షి సాధకుడికి చెప్తాడు. 'అక్కడ ఎదురుగా వున్న కొబ్బరి చెట్టును ఎక్కుతూ దిగుతూ వుండమని, మళ్లీ పని చెప్పేంతవరకు కొబ్బరిచెట్టు ఎక్కడం, దిగడం. అంతే పని నీకు నేను మళ్ళీ పని చెప్పేంతవరకు అని చెప్పమంటాడు'. చెప్తాడు. చెప్తే వాడు ఎక్కుతూ, దిగుతూ వుంటాడు. వీడ్ని పట్టించుకోడు. మళ్ళీ పనుంటే వస్తాడు. పని లేకపోతే ఎక్కడం, దిగడం, ఎక్కడం, దిగడంలో వుంటాడు. అప్పుడు ఆ మహర్షికి శిష్యుడౌతాడు. అయి గురువుగారూ! మీరే నాకు దారి చూపించారు. ఇది బాగుంది అంటాడు. అంతే ఇలాగే చేయాలి. ఇంకో కొబ్బరిచెట్టు చూడు. ఇంకొకడు ఎక్కి దిగుతున్నాడు. వాడు నావాడు. వీడు నీవాడు. ఏం లేదు నీకు పని వున్నప్పుడు వాడ్ని పిలిచి పని చెప్పు. పని లేకపోతే కొబ్బరిచెట్టు ఎక్కడం, దిగడం. తాటి చెట్టు ఎక్కడం, దిగడం అదే పని వాడికి. అట్లా పెట్టుకో హాయిగా వుంటావు అంటాడు. అంటే బావుంది అని గురువు గారికి నమస్కారం చేసుకొని ఇంటికెళ్ళిపోతాడు. ఇది ఒక కథ. ఇందులో చాలా సంకేతం వుంది. అంటే మనం కూడా ఏం చేయాలంటే, పని వున్నప్పుడు మనస్సుని పనిలో వుంచి, పని లేనప్పుడు ఈ 'సోహం' అనే మంత్రం మీద వుంచినట్లయితే, మన మనస్సు మనల్ని ఇబ్బంది పెట్టని ఒక సులువైన మార్గం ఇది. పైగా ఈ 'సోహం' అనే మంత్రంలో జీవిస్తున్న మనసుకి పదునెక్కువగా వుంటుంది. ఎందుకంటే మాటిమాటికీ పుట్టుక స్థానానికి వెళ్ళి వస్తూ వుంటుంది. పుట్టింటి నుంచి వచ్చిందనుకోండి ఇంటావిడ, చాలా ప్రశాంతంగా వుంటుంది కదా! మనకు మన ఇంటావిడ మన మనస్సే. కాబట్టి ఆవిడ మాటిమాటికీ పుట్టింటికి వెళ్ళి వస్తుంటే మనం చాలా హాయిగా వుంటాం. ఎందుకంటే పుట్టింటికి వెళ్ళి వచ్చినప్పుడల్లా ప్రసన్నంగా వుంటుంది కాబట్టి. ఆ పద్ధతిలో ఈ 'సోహం' అనే మంత్రాన్ని మనం ఉదయం కార్యక్రమాల్లోకి దిగకముందు, సాయంత్రం కార్యక్రమాల్లోంచి వచ్చేసి విశ్రాంతి తీసుకునే సమయాల్లో, నిద్రపోయే సమయంలో, ముఖ్యంగా నిద్రలోకి అట్లా వెళ్ళిపోకుండా సోహం అనే మంత్రాన్ని చేసుకుంటూ నిద్రలోకి వెళ్ళాలి. అలా చేసుకుంటూ నిద్రలోకి వెళ్ళినట్లయితే పుట్టుక స్థానంలోకి దాన్ని పంపించిన వాళ్ళమవుతాం. ఏమండీ మీ ఆవిడేమైంది? అంటే పుట్టింటికి వెళ్ళిందంటే, అందుకనే ఇంత తీరిగ్గా వున్నారన్నట్లు వుంటుందన్నమాట. చాలా ప్రశాంతంగా వుంటుంది. ఇంటాయన ఊరెళితే ఇంటావిడకెట్లా వుంటుందో? క్యాంపుకు వెళ్ళారండి పనేం

లేదు ఇప్పుడు. ఇంట్లో వుంటేనే పని. అట్లాగే ఇది కూడా. మనకి విధంగా జరగడం వల్ల ప్రశాంతత అనేది సహజంగా మనకి వస్తుంది. ఇంతే కాదు రోజూ మనం చేసే పనుల్లో కూడా, పనికి పనికి మధ్య తీరిక వచ్చినప్పుడు మనకు మామూలుగా గుర్తొచ్చే వారెవరంటే మనకు ఇష్టం లేని వాళ్ళు. మనల్ని ఇదివరలో ఏదన్నా అన్న వాళ్ళు. ఎవరో ఏదో ఒక మాట అని పోతారు. అది పట్టుకొని పీక్కుంటూ కూర్చుంటాం నెలల తరబడి. ఇంట్లోనో, ఆఫీసులోనో బయటో. ఎందుకీ గోల? పనుంటే పని చూసుకోవచ్చు. పని లేకపోతే ఇందులో వుండవచ్చు. ఇట్లా వున్నట్లయితే ఐదు సంవత్సరాల్లో నేను bond paper మీద రాసిస్తాను మనిషికి ప్రశాంతత వస్తుందని. చేసి చూడండి. పని లేకపోతే 'సోహం'. పనుంటే పని. అప్పుడు మనకేం జరుగుతుందంటే మనసు పదునుగా వుంటుంది. ప్రశాంతత అనేది ఎక్కువగా వుంటుంది. మనల్ని మనస్సు ఇబ్బంది పెట్టదు. మనకి అవసరమైనప్పుడు పని చేసి పెడుతూ వుంటుంది. అది పెద్దలిచ్చిన మార్గం. ఈ 'సో' అనే భావంతో లోనికి వెళ్తూ, 'హం' అనే భావంతో పైకి వస్తూ వుండాలి. నాసాగ్రమును గరుత్మంతుని ముక్కు అంటారు. తర్వాత మనకి నామం అదే. సుపర్ణుడు వస్తాడు. ది 'హంస' శబ్దం మనకి నాసాగ్రం నుంచి బయలుదేరి వెళ్ళి ఆజ్ఞ మీదుగా లోపలికి వెళుతూ, విశుద్ధి నుంచి అనాహతం వరకు వెళ్ళి అక్కడ స్పందనం వరకు వెళ్ళి, మళ్ళీ స్పందనం నుండి బయటకి వస్తూ వుంటుంది మనం చేయకుండా. మనం చేయకుండా అదే జరుగుతుంది కాబట్టి మనం చేయకుండా జరిగేది చూసినప్పుడైనా మనం నమ్మాలి ఇంకోటి వుంది పనిచేసేది మనం కాదని. కదా! అంతా మనమే చేసేసి ముద్ద చేస్తున్నామని కదా మన భావన. అంటే మనతో సంబంధం లేకుండా ఏదో ఒకటి పనిచేయడం అనేది జరుగుతుండడం వలన అది ఆధారంగా మనం పని చేస్తున్నాం. మనలో ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు లేకపోతే మనకి బిజీగా చేసే పనులేమీ లేవు. ప్రవాహమే లేకపోతే నది మీద ప్రయాణమే లేదు కదా! అలాగే ఇక్కడ ప్రాణం అనే ప్రవాహం ఒకటి లోపల జరుగుతూ వుంటే అది ఆధారంగా మనసుతో ఏదో బయట మంచివి చెడువి అన్ని రకాల పనులు చేసుకుంటున్నాం. ఈ పైన చేసుకునే పనులన్నీ కూడా superficial. ఈ అంతర్వాహినిగా వుండే చైతన్యం ఆధారంగా మనసు పని చేస్తోంది తప్ప, ప్రవాహమే లేకపోతే ప్రయాణమే ఎట్లా లేదో, ఈ స్పందనము ఈ ఉచ్వాస నిస్వాసాలు, ప్రాణ స్పందన లేకపోతే ఇక కార్యక్రమాలే లేవు. కాబట్టి మనం చేసే కార్యక్రమాలకి అంతర్గతంగా పనిచేసే కార్యక్రమం ఒకటి

వున్నది. అది మనం చేయట్లేదు. మనలో జరుగుతోంది. మనం చేయకుండా జరుగుతోంది. ఇంక అంతకన్నా ఏం కావాలి? ఇంకొక శక్తి ఏదో పనిచేయడం వల్ల మనం వున్నాం అని తెలియడానికి. మన వరకు మొత్తం ప్రపంచం గురించి తర్వాత అర్థం చేసుకుందాం. మనలో ఉచ్ఛ్వాస విశ్వాసాలు ఎవరు చేస్తున్నారు? మనలో ప్రాణస్పందన ఎవరి వల్ల జరుగుతోంది? ఈ స్పందన ఎక్కడ నుంచి జరుగుతోంది? ఎవరు చేస్తున్నారు? అని తెలుసుకోవడానికి మనం ఈ 'సోహం' చేసుకుంటూ వుంటే మొదటి ఉపయోగమేమిటయ్యా అంటే మనసు నియమింపబడుతుంది. నియమింపబడ్డ మనసు మనకు ఆసన సిద్ధినిస్తుంది. అంటే ప్రశాంతతనిస్తుంది. అందుకనే 'సోహం' అనేది మనం చేసుకుంటూ వుంటే మనిషికి ఆసన సిద్ధినిస్తుంది అంటారు. ఆసనసిద్ధి అంటే ప్రశాంతము, స్థిరము, సుఖము అయిన స్థితిలో ఎప్పుడూ జీవించడం. మనకి అదే కరువు కదా ఈరోజుల్లో. స్థిరం లేదు. సుఖం లేదు. రెండూ లేవు కాబట్టి ప్రశాంతత లేదు. స్థిర సుఖమాసనం అన్నారు పతంజలి మూడవ అంగం కింద. అష్టాంగాల్లో మూడవది స్థిర సుఖమాసనం. అది లభ్యమైతే ప్రాణాయామం. కాబట్టి ఇప్పుడు మనం చేసే 'సోహం' మంత్రం ప్రాణాయామం కాదు. ఇది స్థిరత్వం కోసం జరిగేటటువంటిది. ఇది బాగా జరిగిన కొద్దీ మనకి ప్రాణము యమింపబడుతుంది. అంటే నియమింపబడుతుంది. అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాల అవసరం లేకయే మనము వున్నాము అనే స్థితి మనకు తెలుస్తుంది.అది ప్రాణాయామం. ప్రాణములు యమింపబడటం అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, స్పందనములు లేకయే మనం వున్నామని తెలియడం. ఏం చేస్తున్నావు అంటే ప్రాణాయామం అంటాడు. ఎగశ్వాస దిగశ్వాస చేస్తూ. ప్రతి విషయాన్నీ వంకరగా చెప్పుకోవడం కలియుగ ధర్మం. ఏదైనా వంకర చేసేస్తాం. పరిపూర్ణంగా వంకర చేసేసి ఏం చేస్తున్నావంటే యోగా అంటాడు. ఏం లేదు ఆసనాలు వేస్తూ వుంటాడు. యోగా అంటే ఆసనాలు కావు. యోగంలో pre K.G. అంటే LKG కన్నా ముందుది ఆసనాలు. ఎందుకంటే అష్టాంగాలలో కూడా మీకు కనిపించదు ఆసనం. ఈ ఆసనం physical fitness, mental fitness కి వేసుకునేవి. యోగా అంటాడు దాన్ని. అట్లాగే ప్రాణాయామం అంటాడు. ప్రాణాయామం అంటే జరిగేదే కానీ చేసేది కాదని పతంజలి మహర్షి బాగా విపులంగా చెప్పాడు. ఎప్పుడు జరుగుతుందంటే మనసు స్థిరపడి, సుఖపడి, ప్రశాంతత యందున్నప్పుడు ఈ ఉఛ్వాస నిశ్వాసలకి ఒక తాళము, ఒక లయ

వస్తుంది. ముందు తాళాత్మకంగా స్థిరపడి, తర్వాత లయాత్మకం చెందుతుంది. దేంట్లో లయం చెందుతుంది అంటే దాని పుట్టుకలో లయం చెందుతుంది. అందుకే మనం పీల్చినంత పీల్చరు ప్రశాంతమైన స్వభావం కలిగిన వారు. ఎక్కువ పీల్చే వాడెవడయ్యా అంటే రోషం, ఆవేశం, ఆదుర్దా, ఆత్రం వున్నవాడు. మనకి అవి వచ్చినప్పుడు బాగా ఎగశ్వాస దిగశ్వాసగా వుంటుంది. మనకి భయం వచ్చిందనుకోండి తొందరగా పీల్చుకుంటూ వుంటాం. కొట్టుకుంటూ వుంటుంది త్వరగా. కొట్టుకోవడం, పీల్చడం ఎక్కువవుతూ ఉంటుంది. ప్రశాంతత పెరిగిన కొద్దీ తక్కువ అవుతూ వుంటుంది. అందుకని వీటిని 'హంసలు' అన్నారు. ఒక్కొక్కరికి ఇన్ని హంసలిచ్చి పంపిస్తారని చెప్తారు పెద్దలు. ఈ హంసలు తొందరగా ఖర్చు పెట్టుకున్న వాడు తొందరగా చచ్చిపోతాడు. ఈ హంసలు జాగ్రత్తగా వాడుకున్నవాడు అవి వున్నంతకాలం బ్రతుకుతాడని చెప్తారు. గడియారానికి కీ ఇచ్చినట్లు. అది unwind అయిపోగానే ఆగిపోతుంది గడియారం. అట్లాగే మనం ఈ హంసల్ని speed గా వాడేసాం అనుకోండి, ఏదీ, మనకు కోపం వచ్చినప్పుడల్లా ఒక వెయ్యి వెళ్ళిపోతాయి. మనకి ఆవేశం వచ్చినప్పుడల్లా వెయ్యి వెళ్ళిపోతాయి. భయం వచ్చినప్పుడు వెయ్యి వెళ్ళిపోతాయి ఇట్లా వేలకు వేలు ఖర్చు పెట్టేస్తూ వుంటాం. డబ్బు ఖర్చు పెట్టడానికి భయం కానీ వీటికేమి? ఇది చాలా శులభమనుకుంటాం. ఇది చాలా కష్టం. ఏమిటయ్యా అంటే ఆయుర్దాయం అనే ఒక తత్వం నుంచి హంసల్ని ఒక్కొక్కటి ఒక్కొక్కటి తీసి అవతల పారేస్తూ వుంటాం. పారేస్తే వీడు చస్తాడు తొందరగా. అందుకని అది జరగకుండా వుండాలంటే ముందు దాని యందు నియమింపబడిన మనసు కలిగిన వాడు ఏం చేస్తాడయ్యా అంటే పని వున్నప్పుడు పనిచేసి, పని లేనప్పుడు ఈ ఆవేశములలో జీవించడు, కాబట్టే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ఈ ఆరు ఆవేశాలంటారు. ఈ ఆరింట్లో అది పడదు కాబట్టి, హంసలు తక్కువ ఖర్చవుతాయి కాబట్టి హంస దీర్ఘంగా తయారవుతుంది. అంటే మామూలుగా మనం పది ఎగశ్వాసలు, దిగశ్వాసలు చేసే లోపల యోగి ఒక శ్వాస తీస్తే గొప్ప. మరీ వాళ్ళు పని లేనప్పుడు, ప్రశాంతంగా వున్నప్పుడు అసలు శ్వాసలే వుండవు. అంటే అసలు bank account వాడడన్నమాట. ఎప్పుడూ balance అట్లాగే వుంటుంది. ఎందుకని అంటే నిలబడిపోతుంది. ఎక్కడ నిలబడిపోతుంది అంటే స్పందనంలో నిలబడిపోతుంది. స్పందనలో నిలబడిపోయి అక్కడ నుంచి సూక్ష్మ స్పందనంలోకి

వెళ్ళిపోతుంది. పట్టుకుంటే పల్స్ కూడా కనిపించదు. అదే మనకు మహాత్ములు చూపిస్తూ వుంటారు. చచ్చాడనుకుంటారు చావడు. అది చావడం కాదు. మనసు శ్వాసలో నియమింపబడి, శ్వాస స్పందనంలో నియమింపబడి, స్పందనం సూక్ష్మ స్పందనంలో నియమింపబడటం వలన ఆయన ఈ బహిర్గతమైన ప్రపంచం నుంచి పూర్తిగా ప్రత్యాహారం చెంది వుంటాడు. Absorption అంటారు. అంటే ప్రపంచం నుంచి తిరోగమనం చెంది వుంటాడు. తనయందు తాను వుంటాడు. అంతవరకు తీసుకువెళ్తుంది ఈ 'సోహం' అనే శబ్దం. ఏదో ఒక్కటి చాలు. మనవాళ్ళు వేలకు వేలు అట్లా విసిరి పారేశారు ముత్యాల్లాంటివి, వజ్రాల్లాంటివి, మణుల్లాంటివి. ఏ ఒక్కటైనా పట్టుకుంటాడేమోనని. ఇదొక్కటి చాలు, చేసుకుంటే జన్మ తరిస్తుంది. మనకుండే జీవితమనే సంసారంలో తరింపు మార్గానికి ఇది చాలా సులభమైన మార్గము. తేలికైన మార్గము. కలియుగంలోని మానవులు కూడా చేయగలిగిన మార్గము. మతముతో సంబంధము లేని మార్గము. ఇక్కడ భగవంతునికొక పేరు, రూపము పెట్టి, ప్రపంచంలో గోల చేయనక్కర లేదు కదా! మన ఋషులు చెప్పినవన్నీ అలా చెప్పినవే. అందులోంచి చాలా పుట్టుకు వచ్చాయి. వాళ్ళు ఏమి చెప్పారయ్య అంటే 'నీలో జరుగుతోంది కదా! అది నీవు చేయట్లేదు కదా! అదే దేవునికి ముఖ ద్వారం' అన్నారు. నీవు చేయకుండా నీలో జరుగుతోందంటే ఎవరో చేస్తున్నారు కదా! వాడెవరో తెలుసుకో! వాడిని తెలుసుకోవాలంటే దీన్ని పట్టుకో ఈ జరుగుతున్న ఉఛ్వాస  నిశ్వాసాలను. నీకే వినిపిస్తుంది పీలుస్తున్నప్పుడు 'సో' అనే శబ్దం. వదిలేటప్పుడు 'హం' అనే శబ్దం. తరువాత హల్లులు పడిపోయి సోహం లోని 'ఓం' అనే శబ్దం వినిపిస్తుంది. ఆ 'ఓం' అనే శబ్దం ఎప్పుడు వినిపిస్తుందంటే మనము ఉఛ్వాస నిశ్వాసలు దాటి స్పందన కేంద్రం దగ్గర మనసు బాగా అతుక్కుని, ఆకర్షణ చెంది వున్నప్పుడు ఈ సోహం తగ్గిపోతుంది. ఎందుకంటే ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలు వుండవు. స్పందనమే వుంటుంది. అప్పుడు 'ఓం' వినిపిస్తుంది. మొట్టమొదటగా జీవితంలో ఓంకారం చేయకుండా వినిపించడం జరుగుతుంది. మామూలుగా ఓంకారం చేస్తూంటాం కదా! అందుకని చేయడం తెలుసు వంట చేసినట్లు. ఈ ఓంకారం జరుగుతున్నట్లు  తెలుస్తుంది. మనం చేయకుండా జరుగుతున్నట్లు తెలుస్తుంది. మనం ఏమీ చేయకపోయినా చాలా జరుగుతున్నట్లు తెలుస్తుంది. అందులో వీటన్నిటికీ ఆధారం ఓంకారమని తెలుస్తుంది. సింహాసనం మీద కూర్చున్న వాడవుతాడు. తెలిసి హృదయంలో స్థిరపడతాడు. అందుకని

సింహరాశికి చాలా ఎక్కువ ప్రాముఖ్యం వున్నది జ్యోతిషశాస్త్రంలో. ఎందుకంటే సింహం వలె జీవించడం అప్పటి నుంచి మొదలవుతుంది. అంతకు ముందు వరకు ఏదో అదోరకం జీవితం. జంతువులకు రాజు సింహం కదా! ఎందుకనంటే దానికి శౌర్యము, గాంభీర్యము, ఉదార బుద్ధి, రక్షణ బుద్ధి, చాలా ఎక్కువ. సింహతత్వం వుండే వాళ్ళకి ఇతరులను రక్షించడం, కాపాడటం, ఇతరుల యోగక్షేమాలు చూడడం చాలా ఎక్కువగా వుంటుంది. వీరు గంభీరంగా వుంటారు. ప్రశాంతంగా వుంటారు. అట్లా కంగారుగా తిరగరు. సింహం anxiety neurosis వున్నట్లుగా తిరగదు. సింహం చూపులో, నడకలో ఒక రాజసము వుంటుంది. ఎందుకంటే దాని తత్వం అటువంటిది. అందుకనే సింహం ఇచ్చారు మనకి ధ్యానానికి. సింహాసన్నా ధ్యానం చేస్తే ఆ ఠీవీ, ఆ నెమ్మదితనం, ఆ దర్జా, ఆ ప్రశాంతత,ఆ ఇతరులను రక్షించే గుణం వస్తుంది అని. అందుకనే ఎక్కువమంది మహాత్ములు సింహరాశిలో పుడుతూ వుంటారు. మనం ఆరాధన చేసే వారంతా సింహరాశిలో పుట్టినవారే. శ్రీకృష్ణుడు దగ్గర నుంచీ  అందరూ సింహరాశే. అందుకనే సింహరాశి హృదయానికి సంబంధించినది. సింహరాశిలో, శ్రావణమాసంలో శుక్రుడు అధిపతి. శుక్రవారానికి శుక్రుడు అధిపతి. సింహరాశిలో వస్తుంది గనక శ్రావణ శుక్రవారం ప్రత్యేకమైనటువంటిది. అందుకని శుక్రవారానికి ఎక్కువ ప్రాధాన్యం. శ్రావణ శుక్రవారం ప్రత్యేకమైనది. ఎందుకంటే సింహరాశి హృదయానికి సంబంధించినది. అందులో శుక్రవారం అంటే భగవదనుభూతికి, భగవదనుభూతిని ప్రేమగా అనుభూతి చెందడానికి ఎక్కువ అవకాశం వున్నది. అమ్మవారి తత్వంగా. అందుకని మనకు ఈ పూజలు అవీ ఇచ్చారు. మన పండగలన్నింటికీ కూడా జ్యోతిష శాస్త్ర ప్రకారం చక్కటి ఒక శిక్షణ వున్నది. జనజీవనంలో మామూలుగా అందరూ చేసుకునే పద్ధతుల్లో ఆ తరంగాల్ని దింపి వుంచారు ఋషులు. అట్లాగే మార్గశీర్ష మాసంలో గురువారాలు, ధనుర్మాసంలో గురువారాలు ముఖ్యం. అలాగే మాఘమాసంలో ఆదివారాలు, కార్తీక మాసంలో సోమవారాలు ముఖ్యం. ఊరికే మనకవన్నీ తెలుసు వాడుక వలన, సాంప్రదాయం వలన. కానీ వాటిలో నిబిడీకృతమైన విజ్ఞానం ఎంతో  వుంది. భగవత్తత్వాన్ని అనుభూతి చెందాలి. సత్యాన్వేషణ చేసి సత్యాన్ని తెలుసుకోవాలి అని సాధన చేసే వాళ్ళందరికీ కూడా ఇందులో వుండే లోతులన్నీ తెలుస్తాయి. ఇక్కడ మనకి సింహరాశిలో ఏం జరుగుతుంది అంటే మనం ఈ ఉదరవితానానికి పైనే జీవిస్తాం తప్ప ఈ

ఉదరవితానానికి క్రింద జీవించడం అనేది వుండదు. అంటే సింహాసనం మీద కూర్చుని వుంటాం. సింహాసనం క్రింద కూర్చోవడం వుండదు కదా! సింహాసనం క్రింద కూర్చునే వాడు, రాజు కాదు కదా! ఏ ఎలుకో అయి వుండాలి. ఎలుకలు, చీమలు, దోమలు, పురుగులు అట్లా వుంటుంది సింహాసనం మీద కూర్చొని బ్రతుకులు. అందుకనే ప్రతి వాళ్ళు ప్రక్కన రెండేసి సింహాల్ని పెట్టుకుంటారు కుర్చీకి చేతులానించుకునేచోట. ఎందుకంటే గుర్తు చేయడమన్నమాట. అందులో కూర్చోవాలంటే నీకా అర్హత వుండాలని. షిర్డిసాయికి అక్కడ రెండు ప్రక్కలా రెండు సింహాలుంటాయి. అర్థం ఏమిటిరా అంటే ఆయన మహారాజని చెప్పటం. మహారాజులే సింహాసనం మీద కూర్చుంటారు. ఆయన రాజు కాదు కదా! అంటే ప్రతీ వాళ్ళు వాళ్ళ జీవితానికి వాళ్ళే రాజులు. ఎప్పుడు వాళ్ళు రాజులవుతారంటే, ఈ విధమైన మనసు మీద స్వామిత్వం సంపాదించుకొని, బహిర్గత జీవితం మీద స్వామిత్వం సంపాదించుకున్న వాళ్ళంతా The kings of their own Kingdom. నా రాజ్యానికి నేను రాజును, అనే ధీమాతో జీవిస్తారు. ఎందుకనంటే తను చేసే పనుల్లో వుండే ఉద్దేశ్యములు, తను చేసే కార్యక్రమములు పవిత్రములైనవి కనుక తన మనస్సు, శరీరము, ఇంద్రియములు తన ఆధీనంలో వుంటాయి. ఈ మణిపూరకము, స్వాధిష్టానము, మూలాధారము అనే కేంద్రాలలో మనస్సు, ఇంద్రియములు, శరీరముతో సంబంధించిన తత్వములు వుంటాయి. దానికి పైన మనం వున్నాంట అంటే హృదయం దగ్గర వున్నాం అని. ఇహ పైన అదే కదా వున్నది అనాహతం. కాబట్టి అక్కడ కూర్చుని నా రాజ్యాన్ని నేను పరిపాలించుకుంటున్నాను అనే తత్వాన్ని సింహరాశి మనకు మాటిమాటికీ గుర్తు చేస్తూ వుంటుంది. ప్రతి సంవత్సరము కనీసం శ్రావణమాసంలోనన్నా మనం సోహం చేయాలి. నరసింహుడై వుంటాం మనం. ప్రత్యేకించి శ్రావణమాసంలో నరసింహమూర్తి యొక్క ఆరాధనలు బాగా జరుగుతాయి. ఎందుకంటే నరుడే సింహం రూపము దాల్చిన ఒక తత్వం. అది చాలా పెద్ద symbol meditation కి. అది చేసుకునే వాళ్ళకి అన్నింటిని అధిగమించి బంధముల నుండి విడిపడి జీవించే ఒక మార్గం అందులో నిర్దేశింపబడి వుంది. That is a big subject by itself. అందులోకి మనం వెళ్ళవద్దు. ప్రస్తుతానికి ఏంటంటే మనం తెలుసుకోవలసింది ప్రతి ఒక్కరూ కూడా ఈ హంస శబ్దాన్ని సాధన చేయడం వల్ల తద్వారా మనకి మనము సింహములై మన రాజ్యాన్ని మనం పరిపాలించుకునే స్ఫూర్తిని మనలో నుంచి

మనకి హంసస్వరూపుడుగా భగవంతుడు మనకి అందిస్తాడు. ఆ హంసయే మనలో జరిగే స్పందన. ఆ హంసే ఈ హంస. ఆ లోపల జరిగే ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించేవాడు నేనే అని మనకు తెలుస్తుంది. "నేను నేనైన నేనును" అనేదేంటో అప్పుడు తెలుస్తుంది. అంతవరకు భగవంతుణ్ణి మనకన్నా ఇతరంగా చూస్తాం. అప్పుడు మనంగా తెలుస్తుంది. భగవంతుడు నాలో నాలాగా, భగవంతుడు నాలో నేనుగా వున్నట్లు తెలుస్తుంది. నీలో నీవుగా వున్నాడేమో భగవంతుడు, అంటాడు నారదుడు. అర్థం కాలేదు హిరణ్యకశిపుడికి. అట్లా మనం మనసులో ఎక్కువగా వుండడం వలన మనం అసలు స్వరూపం తెలీని స్థితికి దిగాం. మళ్ళీ ఈ 'సోహం' అనే మంత్రం ద్వారా నిత్యజీవితంలో దాన్ని ఎలా సాధన చేసుకోవాలో మనకు అది ముఖ్యం. భగవంతుణ్ణి స్తుతి చేయడం, పొగడ్త చేయడం, ఆ తత్వాన్ని అవగాహన చేసుకోవడం ఒకటి. ఈ సహస్రనామాల్లో వుండే సమస్త తత్వాలు మనలో వున్నాయని తెలుసుకొని, అవి మనలో ఏ విధంగా వున్నాయో తెలుసుకొని వాటిని ఏ విధంగా మనం అనుభూతి చెందాలో తెలుసుకోవడం ద్వారా భగవత్తత్వానికి చేరువవటం అనేది నిజమైన సాధన. సాధనపరంగా చెప్పుకుంటున్నాం కాబట్టి ఈ శబ్దాన్ని ఈ విధంగా అవగాహన చేసుకుని దాన్ని practice చేయండి. చేస్తే ఎంత రక్షణ వుంటుందంటే సింహరాశి కథగా ఒకటి చెప్తారు. పరిరక్షణ, యోగక్షేమము అనేవి. ఆ పరిరక్షణ, యోగక్షేమంలో అతి ముఖ్యమైన కథ మనకు చెప్పేది భారతంలో మహాప్రస్థానం. ధర్మరాజుతో బయలుదేరిన పాండవులు, ద్రౌపది అంతా వారి వారి యొక్క పరిమితత్వం వలన పూర్తిగా ప్రయాణం చేయలేక పోతారు ధర్మరాజుతో. ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్కళ్ళూ జారిపోతారు. మనందరికీ తెలుసు వీరందరితో పాటు ఒక కుక్క కూడా బయలుదేరుతుంది. ద్రౌపది పడిపోతుంది. నకులుడు, సహదేవుడు, అర్జునుడు, భీముడు పడిపోతారు. కానీ కుక్క మాత్రం మిగులుతుంది. అంటే కుక్కకి ఇది apply కాదా? లేకపోతే ఏంటి మామూలుగా? కానీ అది మాత్రం మిగులుతుంది. మిగిలితే ధర్మరాజు ఒక్కడు మిగిలాడని ఆయన జీవించిన విధానాన్ని చూసి సంతోషించి దేవతలు రథం పంపిస్తారు పైనుంచి. రథం వస్తే, 'ధర్మరాజును ఎక్కమని అడుగుతారు. మీకోసం రథం వచ్చింది. ఇంద్రుడు పంపించాడు. ఇట్లా ఎవరికీ పంపించడు మాటిమాటికీ. ఇంతకుముందెప్పుడూ జరగలేదు. ఎప్పుడో రాముడికి యుద్ధం కోసం రథం పంపించాడు. మళ్ళీ మీకోసం రథం పంపించాడు' అని చాలా పొగుడుతాడు. వచ్చినాయన మాతలి. అన్నీ

వింటాడు. మరి ఎక్కండి ఇక ఆలోచన ఎందుకంటే, కుక్కని ఎక్కిస్తాడాయన. కుక్కని ఎక్కమంటాడు. దానికి సౌంజే చేస్తాడు నీవు ఎక్కమని. అంటే ఆయన 'కుక్కల కోసం కాదు సార్ ఈ రథం. పైగా మా లోకాల్లో కుక్కలు లేవు. మీకోసం రథం పంపించారు. నాకు కుక్కల్ని తీసుకువెళ్ళే అనుమతి లేదు. అంటే ఇంతవరకు జంతువులెక్క లేదు ఈ రథాన్ని. విశేషించి దైవచింతనయందు పరిపూర్ణంగా జీవించిన మహాత్ముల కోసం ఇంద్రుడు సంతోషించి పంపిస్తుండే సన్నివేశం ఇది. మీరు ఆ జంతువు నెక్కించడానికి వీలు లేదు' అంటాడు. అంటే 'ఇప్పుడు ఈ జంతువు నాతో ఇంత దూరం వచ్చింది. నాలాంటిది కాదని నేను అనుకోవడానికి వీలులేదు. ఈ జంతువునెక్కించుకోవడానికి మీకు అభ్యంతరం వున్నట్లయితే నేను కూడా ఎక్కను' అంటాడు. 'దాంతో బాటే నేను. అది ఇక్కడే వుంటే దానితో పాటు నేను కూడా ఇక్కడే వుంటా. అంతేకానీ నేను వచ్చేసి దీన్ని ఇక్కడ వదలను' అంటాడు. ధర్మరాజు యొక్క సింహతత్వం ఇది. అంటే పరిరక్షణ, యోగక్షేమం. అప్పుడు ఆ కుక్క ధర్మదేవతగా సాక్షాత్కరించి, 'ఈ రూపంలో వస్తే నన్ను నీవు equanimity సమభావముతో చూడగలవా లేదా అనేది చూశాను. చాలా సంతోషం. అన్ని విషయాల్లోనూ నీవు ఇట్లాగే వున్నావు మొదటినుంచీ. ఇప్పుడు కూడా అలాగే వున్నావు. ఎట్టి పరిస్థితిలో కూడా నీవు భ్రమకు లోను కాలేదు కాబట్టి నీకు ఆశీర్వాదములు' అని చెప్పి వెళ్ళిపోతుంది. ఈ కథ చెప్పుకోవాలి మనమెప్పుడూ శ్రావణమాసంలో. శ్రావణమాసం కథగా దీన్ని మనం ఎక్కువగా ప్రచారం చేస్తున్నాం. అట్లాగే కొన్ని కథలు వున్నాయి మహాభారతంలో శ్రావణమాసానికి సంబంధించినవి. ఒక కథ ఇది. ఎలా నిలబడుతుందంటే ధర్మరాజు అరణ్యంలో వున్నా, సింహాసనం మీద వున్నా ఎప్పుడూ రాజే. మహాత్ములు సింహాసనం మీద కూర్చోనక్కరలేదు. సహజంగా వాళ్ళు రాజులు. అందుకని వాళ్ళని యోగిరాజ్, మహారాజ్ ఇట్లా అంటూ వుంటారు. ఎందుకని? తను వున్నటువంటి పరిసరమలన్నింటికీ తను, తన శరీరానికి మొత్తానికంతా కూడా ఆధిపత్యం వహించి వుంటాడు. అందరికీ రక్షణ కల్పిస్తూ వుంటాడు. తండ్రివలె అందరినీ చూసుకునేవాడు రాజు కదా! రాజుకు లక్ష మంది కొడుకులు అని చెప్తూ వుండేవారు పురాణాల్లో. అంటే ఏమిటంటే రాజుకి రాజ్యంలో వుండే ప్రజలంతా కూడా కొడుకులే. ఆ భావనతో తండ్రిగా పాలించే వాడే కానీ ప్రజల్ని, తన కొడుకుల్ని వేరుగా చూసుకునేవాడు రాజు కాడు. గురువు అంతే. శిష్యుడు

పుత్రునితో సమానం. అప్పుడప్పుడు శిష్యవాత్సల్యమే ఎక్కువగా వుంటుంది పుత్రవాత్సల్యం కన్నా. అది సమభావం. అటువంటి భావం వరకు మనం ఎదగడానికి వీలు పడుతుంది ఈ 'హంస' శబ్దం. కాబట్టి దీన్ని మన జీవితంలో ఎక్కువ తీసుకురావాలి. నేనొక్కటే చెప్తూంటా ఎప్పుడూ మనవాళ్ళకి. మనకి ఏ పని లేనప్పుడు, మనం ఏ ప్రార్థనలు చెయ్యనప్పుడు, ప్రేయర్ చేసే సమయం కాదది. పూజ చేసే సమయం కాదు. ఆఫీస్ పనేమీ లేదు. ఇంట్లో కూడా పనేమీ లేదు. కూర్చున్నావు. అప్పుడు నీ మనసులో వచ్చే భావనలేమిటో అదే నీవు! That is your original. అపుడు నీకున్నటువంటి state of purity అపుడు నీకు వుండే భావన. ఊరికే కూర్చుంటే మనకొచ్చే ఆలోచనలేమిటో that decides the status of the purity you hold. కాబట్టి ఆ సమయం దీనికి వినియోగించామనుకోండి మనము భగవంతుని తత్త్వంలో ఇమిడి వుంటామన్నమాట. ఇతరములైన విషయాల్లో ఇరుక్కొని వుండడం కన్నా ఈ తత్త్వంలో ఇమిడి వుంటాం. ప్రశాంతంగా వుంటాం. కాబట్టి దీన్ని తప్పక సాధన చేసుకోండి.

## ౨౦౦ సుపర్ణః

సుపర్ణుడెవరయ్యా అంటే వెలుగు, చీకట్లు రెండు రెక్కలుగా పనిచేసేవాడు. రెండింటినీ తాను తన యోగమునందు నిలబడి పని చేయిస్తూ వుంటాడు. అటూ ఇటూ వెలుగు, చీకట్లు, తర్వాత పౌర్ణమి, అమావాస్యలు, ఉత్తరాయణ, దక్షిణాయనాలు, హెచ్చుతగ్గులు ఇట్లా అన్నీ alternating currents వుంటాయి. సరిసంఖ్య, బేసిసంఖ్య. సుపర్ణుని పేర్న ఒక పెద్ద సూక్తం రాశారు ఋగ్వేదంలో. అందులో 52 సూక్తాలు వుంటాయి. దానికి చక్కటి వివరణ మాస్టర్ E.K గారు ఇచ్చారు. మీ అవకాశం మేరకు చదువుకోండి. ఒక రెక్క మీద అన్నీ బేసిసంఖ్యలు, ఒక రెక్క మీద అన్నీ సరిసంఖ్యలు వున్నాయని చెప్తారు. అంటే male, female principles. స్త్రీ, పురుష తత్వములు. Positive, negative. polarities, analogies. Current లేకపోతే light లేదు. అట్లాగే స్త్రీ, పురుష కార్యక్రమం లేకపోతే సృష్టి లేదు. ప్రకృతి, పురుషుడు కలిసి సృష్టిని తయారు చేస్తున్నారు. కాబట్టి ఈ మొత్తంమంతటినీ రెండు రెక్కలుగా చెప్పారు. ఒకటి పురుషుడి కుడిరెక్క, రెండవది స్త్రీ ఎడమరెక్క. మనలో కూడా ఇడ, పింగళ అనేటువంటి energies, ఎడమ energies అన్ని ఇడ. కుడి energies పింగళ. ఈ రెండింటినీ అనుసంధానం చేసేది సుషుమ్న. అట్లాగే రెండు రెక్కలకి అనుసంధానం చేసేది మధ్యలో వుండేటటువంటి పక్షి. ఈ మొత్తం అంతా కూడా గరుడుడు. గరుడుడు ఎప్పుడూ ఎగురుతూ వుంటాడు. ఎందుకంటే చోట్లో వున్నాయి ఈ గోళాలన్నీ కూడా. నేలమీద లేవుగా. అంటే భూమి మీద వున్నాం మనం. భూమి దేని మీద వుంది? మనం నిలబడితే దేనిమీద అన్నా నిలబడ్డట్లు లెక్క. మనం నిలబడ్డట్టు భూమి దేని మీద నిలబడి వుంది? రెక్కల ఆధారంగా నిలబడి వుంది. భూమికి అదృశ్యమైన రెక్కలున్నాయి. అవే సుపర్ణములు లేక భగవంతుని యొక్క బలము అంటారు. ఏంటీ రెక్కలంటే? ఇందాక చెప్పిన కుడి, ఎడమ అనే తత్వములు వుండటం వల్ల అవి equilibrate అయి వుంటాయి . ఆకాశంలో విమానం ఎట్లా వుంది? రెండు రెక్కల్లో ఒక రెక్క విరగ్గొట్టామనుకోండి, ఎగురుతుందా? పక్షికి ఒక రెక్క విరగ్గొట్టామనుకోండి, ఎగురుతుందా? అట్లాగే ఈ గోళములు, ఈ మండలములు అన్నీ కూడా చోట్లలో అట్లా suspended animation లా ఎట్లా వున్నాయి అంటే ఈ కుడి, ఎడమ అని రెండు రెక్కలుగా వున్న ప్రజ్ఞలుగా వున్నాయి.

అక్కడ రెక్కలుండక్కర్లేదు. మనకి రెక్కలనంగానే పక్షి రెక్క, విమానం రెక్క ఈ భావన వచ్చేస్తుంది. ఇవేమిటంటే చైతన్యములు, అంటే ప్రజ్ఞలు. ఆ ప్రజ్ఞలు కుడి, ఎడమ ప్రజ్ఞలు. Positive, negative కలిపి అక్కడ manifest చేసినాయి. ఇది జరుగుతోంది. అందుకని గోళములు, గోళములుగా ఇవన్నీ చోటులో ఇట్లా వుండడానికి రెండు రెక్కలుగా, కుడి ఎడమగా, ప్రకృతి పురుషుల యొక్క ప్రజ్ఞలు పనిచేస్తుంటే ఆ రెండింటినీ భగవంతుని యొక్క రెండు రెక్కలుగా చెప్తారు. అంటే రెండింటికీ అతీతమైనటువంటిది. ప్రకృతి, పురుషుడిగా దిగిరాకముందు వున్న భగవంతుడు ప్రకృతి-పురుషుడు గా అయ్యాడు. అర్ధనారీశ్వర తత్వాన్ని పొందాడు అని చెప్తారు. అంటే రెండుగా అవకముందు అవ్యక్తమైన స్థితి. దానికి రూపం లేదు, నామం లేదు. దాని గురించి చెప్పడానికి వీలులేదు. చోటులో వున్న విద్యుత్తులా వుంటుంది. దిగివస్తే చెప్పవచ్చు, ఇట్లా వుంటుంది అట్లా వుంటుంది అని. దిగిరాకపోతే చెప్పటానికేం లేదు. కాబట్టి దిగిరానివాడు దిగి వచ్చినప్పుడు సుపర్ణుడవుతాడు. He has become three. One has become three. తను మధ్యలో వుంటాడు. తనకటూ ఇటూ వుంటాయి. మొత్తం అంతా నడుపుతూ వుంటాడు. అందుకని మొత్తం సృష్టి అంతా కూడా Triangular activity అని చెప్తారు. త్రిగుణాత్మకమైన సృష్టి. ఇవన్నీ కూడా సుపర్ణుడే. అంటే అక్కడ నుంచి మొదలుపెట్టి చెప్తారు. ఏమిటి? ఒకటి మూడవటమే. అందులో మధ్యలో వుండేవాడు గరుత్మంతుడు. అటొకరెక్క ఎడమ ప్రజ్ఞలో, ఇటొకరెక్క కుడి ప్రజ్ఞలో, ఒకటి ధరించిన ప్రజ్ఞలో, ఇంకొకటి ఆదిత్యుల యొక్క ప్రజ్ఞలో ఇట్లా చెప్తూంటారు. ఇది చాలా పెద్ద సంకేతం. వేదంలో ఇవ్వబడినది. దానికి సంబంధించిన కథ మాత్రం మనకి ఈ గరుత్మంతుని కథ. భారతంలో చక్కగా ఇచ్చారు. ఆ కథ వరకు ముందు చదువుకోండి. తర్వాత మనం వేదంలో చెప్పబడ్డ గరుత్మంతుని దగ్గరకు వెళ్ళవచ్చు. ఇది కాక గరుడపురాణం ఒకటి వుంది. గరుడపురాణంలో గరుడుడి గురించి ఏమీ చెప్పరు. గరుడుడికి విష్ణుమూర్తి భగవత్తత్వం గురించి చెప్పడం గరుడపురాణం. అందులో ఎక్కువ భాగం మనం ఇట్నుంచి వెళ్ళిపోయిన తర్వాత ఏం జరుగుతుందో వుంటుంది. వున్నప్పుడు ఏం చేసుకోవాలో వుంటుంది. అది మామూలుగా ఎవరైనా వెళ్ళిపోయినప్పుడు చదువుతూ వుంటారు. గరుడ పురాణం కొని ఎవరికీ present చేయకండి. ఆ గరుడ పురాణంలోనే చెప్పి వుంచారు వాళ్ళు. ఈ పురాణం నీవు ఇవ్వాలనుకుంటే ఒక బంగారపు హంస బొమ్మ కూడా

దానితోపాటు ఇవ్వమని చెప్తారు. ఎందుకని అంటే ఈ గరుడ పురాణం హంస తత్వాన్ని అనుభూతి చెందడానికి ఇవ్వబడింది. ఉత్త గరుడ పురాణం ఇస్తే దానికి సంబంధించిన కార్యక్రమాలుంటాయి. అందుకని గరుడ పురాణం మనం ఎవరికీ present చేయకూడదు. చేస్తే ఆ బొమ్మతో పాటు చేయమని ఆ పురాణంలోనే చెప్పి వున్నారు. అక్కడ నుంచి మనం లోపలికి వెళ్ళాం కదా! మనలో వున్న గరుత్మంతుని ముక్కు చివర నుంచి తల దగ్గర నుంచి లోపల ఊపిరితిత్తుల వరకు వెళ్ళే ఇదంతా ఆయన శరీరమైతే, ఊపిరితిత్తులు ఆయన రెక్కలు. గరుత్మంతుని యొక్క భావన చేసుకుంటే మనకి పాముల బెడద వుండదంటారు. రెండు రకాల పాములున్నాయి. తర్వాత ఇంకో పాము వస్తుంది మనకి. పాములంటే మనలో వున్న విషపూరితమైన ఆలోచనలు. మన జీవితం వెళ్తూ వుంటే, వాడి మీద కక్ష, వీడి మీద ద్వేషం, ఇంకొకడి మీద అసూయ, ఇంకొకడి మీద క్రోధం ఇట్లా వుంటూ వుంటాయి కదా! ఈ పాములన్నీ మనని కాటేస్తూ వుంటాయి. మనం ఎక్కువగా గరుత్మంతుని స్మరణలో వుంటే పాములు చేరవుట. అందుకని ఇద్దర్ని తలుచుకోమని చెప్తాడు భారతంలో. గరుడుడిని, అస్తీకుడు అనే ఋషిని. ఈ కథ మీరు భారతంలో చదువుకోవాలి. అలాగే అనంతుడి కథ, వాసుకి కథ కూడా చదువుకోవాలి. కేవలం ఇవి చదువుకోవడం వల్ల మనలో కొన్ని ప్రజ్ఞలు మేలుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ అస్తీకుని కథ అటువంటిది. జనమేజయుని యొక్క సర్పయాగాన్ని ఆపిన ఒక బాల ఋషి అస్తీకుడు. అందుకని అస్తీకుని తలచుకున్నా పాముల బెడద వుండదుట. గరుత్మంతుని తలచుకున్నా పాముల బెడద వుండదు. ఎందుకంటే గరుత్మంతుని తలుచుకోవడం స్పందన కార్యక్రమాన్ని నిర్వర్తించే తత్వంగా తెలుసుకోవడం. దాన్ని మనకు 'సుపర్ణుడు' అనే నామంగా ఇక్కడ ఇచ్చారు. నామం "గరుడాయ నమః" అని ఇవ్వలేదు. "సుపర్ణాయ నమః" అని ఇచ్చారు. సుపర్ణుడు అనే నామం ఎలా వచ్చింది అని తెలుసుకుంటే భగవత్తత్వంలో గరుడుడి చరిత్ర అంతా మనం తెలుసుకోవాల్సి వుంటుంది. గరుత్మంతుని పుట్టుక, ఆయన దాస్యం, తల్లి దాస్య విముక్తికి ఆయన చేసిన ప్రయత్నము, ఆ ప్రయత్నంలో భాగంగా ఆయన ఆకాశంలోకి ఎగిరి వెళ్తూ, తండ్రి అయిన కశ్యపుని యొక్క ఆశీర్వచనం పొందడం, ఆ తర్వాత కొంతమంది తపస్సు చేసుకునే వాలఖిల్యులు వాళ్ళ యొక్క ఆశీర్వచనం పొందడం. చాలా పెద్ద శరీరంతో పుడతాడు గరుత్మంతుడు. వాళ్ళ అన్నయ్య అరుణుడు. మనమెరిగిన సూర్యుని రథాన్ని లాగేవాడు. అనూరుడు తొడలు

లేనివాడు. కశ్యపుడు తన భార్య వినతకి రెండు గుడ్లు ప్రసాదిస్తాడు. ప్రసాదిస్తే ఆ గుడ్లు ఎంతసేపటికి విచ్చుకొని రాకపోతే ఆమె సహనం లేక ఒక గ్రుడ్డుని పగలగొట్టి చూస్తే సగం నిర్మాణమైన తేజోరాశి అయిన ఒక మహాత్ముడు గోచరిస్తాడు. సగం వరకే దేహం వుంటుంది. కాళ్ళు లేకుండా వుంటాడు. 'తొందర పడ్డావు. కాబట్టి నావల్ల నీకు ఉపయోగం లేదు. నేను నీకు ఉపయోగపడను. నా కార్యక్రమం మీద నేను వెళ్తున్నాను' అని ఆయన వెళ్ళి సూర్యుడికి రథచోదకుడిగా అవుతాడు. ఆయననే మనం ప్రతి ప్రొద్దున చూస్తాం. ముందు ఆయన రంగు మనకి సాక్షాత్కరిస్తుంది. ఆ తరువాత సూర్యుని రంగు సాక్షాత్కరిస్తుంది. అందుకని ముందు అరుణరంగు, అరుణమైనటువంటి కిరణములు మనం చూస్తాం. ఆ తర్వాత సూర్యుడు మనకి కనిపిస్తాడు. He is the messenger of the lord who is following him. బిళ్ళ జవానులాగా అన్నమాట. ఆయన వస్తే వెనకాల అధికారి వచ్చినట్లుగా, ఈ సూర్య మండలానికి అధికారి వస్తున్నాడు అని సంకేతపరంగా చెప్తున్నట్లుగా ఆ వర్ణం ముందు వచ్చి తర్వాత ఆయన దిగి వస్తాడు. ఆయన ఒక మాట చెప్తాడు తల్లితో. 'నా విషయంలో నీవెలాగూ తొందర పడ్డావు. ఈ రెండో గ్రుడ్డు విషయంలో తొందరపడక. అది ఎప్పుడు విచ్చుకుంటుందో అప్పుడే విచ్చుకుంటుంది. అంతవరకు ఈ దాస్యం తప్పదు నీకు. ఈ దాస్యం చేసుకుంటూ వుండు. తొందరపడి మాత్రం ఆ గ్రుడ్డుని పగలగొట్టకు.' అంటే అలాగే చేస్తే వెయ్యి దివ్య సంవత్సరాలకి (అంటే మనకి లెక్క లేదు) అది పగులుతుంది. అందులోంచి చాలా పెద్ద దేహం కలిగిన ఒక పక్షి వస్తుంది. అమితమైన బలం కలిగి వుంటుంది. ఇంట్లో పనిమనిషి వుంటే, పనిమనిషి కొడుకు కూడా మనకి పని చేయాలి కదా! అట్లా ఇతడికి కూడా పని చెప్తూ ఉంటారు వాళ్ళు. ఎవరూ? ఈ పాములు, పాముల తల్లి కద్రువ. అట్లా ఆకాశంలోకి తీసుకువెళ్ళి అట్లా కాసేపు తిప్పి తీసుకురా మా పిల్లల్ని అని చెప్తూండేది కద్రువ. ఒకసారి తీసుకెళ్ళి సూర్యుని చూపించు అంటారు. అంటే పట్టుకుపోతాడు. సూర్యుని దగ్గరకు వెళ్ళేటప్పటికి మాడిపోతారు వాళ్ళు. మాడిపోతే అమ్మో మరీ వేడిగా వుంది దించెయి, అంటారు. మళ్ళీ కిందకు తీసుకువచ్చేస్తాడు. ఏమిటి ఈ గోల రోజూ వీళ్ళతో అనుకుంటాడు. ఎందుకు నాకీ పరిస్థితి పడింది? నా తల్లి దాస్యం చేయడం వల్ల కదా నాకీ పరిస్థితి. ఈమెను ఈ దాస్యం నుంచి విముక్తి చేయాలంటే నేనేమి చేయాలి? నేనేమి చేస్తే మీరు నన్ను, నా తల్లిని దాస్యం నుండి విడుదల చేస్తారని అడిగితే, వాళ్ళు 'స్వర్గం నుంచి అమృతం

తెచ్చి మాకిస్తే అప్పుడు వదిలేస్తాం' అంటారు. అంటే అలాగే తెస్తానని బయలుదేరుతాడు. వెళ్ళి తల్లి ఆశీర్వచనం తీసుకుంటాడు. బయలుదేరుతుంటే తల్లికి ఎప్పుడూ తనయుల యొక్క ఆకలి దప్పుల మీద ఎక్కువ భావన వుంటుంది. అందుకని 'నాయనా వెళుతున్నావు. చాలా పెద్ద ప్రయాణం. నీకు కావలసిన ఆహారం మళ్ళీ దొరుకుతుందో, దొరకదో దారిలో పెద్ద అడవులుంటాయి. అక్కడ వేటగాళ్ళుంటారు. వాళ్ళందరినీ నీవు భోజనం చేసేసెయ్. కొంత పక్షి లోకానికి ఉపకారం చేసిన వాడవవుతావు. (వాళ్ళే కదా పక్షుల్ని కొడుతూ వుంటారు). తినేసి వెళ్ళిపో. కొంత ఆకలి తీరుతుంది' అంటుంది. తినేస్తాడు దారిలో వీళ్ళందరినీ. తినేసి వెళుతూ వుంటే మళ్ళీ దారిలో బాగా పైకి వెళ్ళిన తర్వాత, తండ్రి దర్శనం చేసుకుని ఆయన ఆశీర్వాదం కూడా తీసుకుందాం అనుకుంటాడు. ఈ కథలన్నీ విపులంగా చదువుకుంటే, మనం చేయాల్సినవి కూడా చాలా తెలుస్తాయి ఇందులో. తల్లి ఆశీర్వచనం తీసుకొని, తండ్రి ఆశీర్వచనం కోసము వెళతాడు. ఈ పనిమీద వెళుతున్నానంటే తండ్రి సంతోషించి ఆశీర్వదిస్తాడు. ఆశీర్వదించాక 'తల్లి చెప్పినట్లుగా భోజనం చేశాను కానీ ఈ అమితమైన శరీరానికి దానివల్ల ఆకలేమీ తీరలేదు. మీరేమైనా మార్గం చెప్తారా' అంటే 'ఫలానా చోట ఒక సరస్సు వున్నది. అక్కడ ఒక ఏనుగు, ఒక తాబేలు ఎప్పుడూ పోట్లాడుకుంటూ వుంటాయి. ఆ రెంటినీ నీవు తినేసెయ్. నీ ఆకలి తీరుతుంది' అంటాడు. అని వాళ్ళ పూర్వజన్మ వృత్తాంతము చెప్తాడు తండ్రి అయిన కశ్యపుడు. వెళ్ళే దారిలోనే వాళ్ళుంటారు. రెండూ చాలా పెద్ద దేహములు కలిగినవి. రెంటినీ రెండు కాళ్ళతో పట్టుకుంటాడు. ఎక్కడో ఒకచోట పెట్టుకు తినాలి కదా! తినాలని అటూ ఇటూ చూస్తుంటే, ఎక్కడ దిగాలన్నా ఏ చెట్టు మీద పెట్టుకుందామన్నా చెట్టు విరిగిపోయేటట్లుంది. పక్షులు నేల మీద దిగవు. కలికాలంలో పక్షుల్లాగా వుండవవి. అందుకని చూసి చూసి ఒక రావి చెట్టు మీద దిగుతాడు. దిగితే కొమ్మ విరిగిపోతుంది. కొమ్మ విరిగిపోయే సమయంలో చూస్తే, ఆ కొమ్మనానుకుని కొంతమంది తలక్రిందులుగా తపస్సు చేస్తూంటారు. ఇందులో చాలా సంకేతాలున్నాయి. ఈ 'వాలఖిల్యులు' అనేవాళ్ళు తేజోమయ మూర్తులు. ఆ తపస్సు చేసేవారు తలక్రిందులుగా తపస్సు చేస్తూంటారు. వారు 60 వేల మంది అంటారు. ఇవన్నీ సంకేతాలే. సూర్యుని నుంచి మనకి దిగివచ్చే కిరణాలన్నీ కూడా ఈ చెట్టు కొమ్మల్లాంటివే. దాన్నుంచి మన దగ్గరికి వస్తూ, వాళ్ళు అట్లా సూర్యుని చూస్తూ తలకాయ అటు పెట్టి దిగుతూ వుంటారన్నమాట ప్రతిరోజూ భూమికి వచ్చే

ముందు. అత్యంత ప్రేమ వున్న చోటు నుంచి వెళ్ళేటప్పుడు మనం ఏం చేస్తాం? వెనక్కి చూస్తూ వెళ్తూ వుంటాం. అట్లాగే ఈ వాలఖిల్యులు సూర్యుని దగ్గర నుంచి తలక్రిందులుగా దిగివస్తూ వుంటారు. ఎందుకంటే అట్లా పుట్టుక స్థానాన్ని చూసుకుంటూ దిగివచ్చి, ప్రపంచంలో ఈ ప్రాణికోటి అందరికీ కూడా సూర్యరశ్మి అందించే మహర్షులు వాళ్ళు. అక్కడ తపస్సు చేసుకుంటున్నారు. ఆ కొమ్మ విరిగితే, అది నేల మీద పడితే, వీళ్ళందరికీ తేడా వచ్చేస్తుంది. అందుకని 'ఈ రెండు జంతువుల్నీ, కొమ్మని పట్టుకొని పరుగెట్టుకొని వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్తాడు. నీవు చెప్పిన ఆహారం కోసం వెళ్ళాను. దొరికాయి. తింటానికింతవరకు నోచుకోలేదు. ఈ చెట్టు కొమ్మమీద వాలితే వీళ్ళందరూ ఇట్లా అయిపోయారు. వీళ్ళను కనుక నేల మీద పడేస్తే, నేను చాలా శాపాలకు గురి అవుతాను. అందుకని మీరే నాకు కర్తవ్యాన్ని బోధించండి'. అంటే అప్పుడు కశ్యపుడు వాలఖిల్యులతో' ఇతడు తన భార్య అయిన వినత తనయుడనీ, వినతను కద్రువ దాస్యం చేస్తున్న వృత్తాంతము, వినతకు వలన, ఆమె సంతానమైన సర్పముల వలన ఏర్పడిన కష్టము తెలియజేసి, అతను తన తల్లి దాస్య విముక్తికై చేస్తున్న ఒక పవిత్ర యజ్ఞంలో భాగంగా ఈ సంఘటన జరిగిందనీ' చెప్తాడు. ఈ వాలఖిల్యులు అంతకుముందు కశ్యపుని చేత ఉపకారం పొందిన మహాత్ములు. వాళ్ళు అందుచేత ఆశీర్వదించి వెళ్ళిపోతారు. అంటే అప్పటికేమైందంటే తల్లి, తండ్రి, గురువుల ఆశీర్వచనం మూడూ దొరికాయి. ఇంక వాడికి తిరుగులేదు ప్రపంచంలో. ఈ మూడు ఆశీర్వచనాలున్న వాడిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. It is for sure. అప్పుడు బయలుదేరి వెళ్తాడు. వారు ఆశీర్వదించగానే సంతోషిస్తాడు. ఆ కొమ్మ మీద కూర్చొని వీటిని తిని బయలుదేరుతాడు. ఇంద్రలోకం వద్ద వెళ్తూ వుంటే వాళ్లందరికీ ప్రకంపనం మొదలవుతుంది. 'ఏంటి ఈ అపశకునాలు ఎందుకు వస్తున్నాయి' అని ఇంద్రుడు బృహస్పతిని అడుగుతాడు. అడిగితే చెప్తాడు నీకు మూడిందని. 'నీవు ఇదివరకు వాలఖిల్యులతో తగాదా పెట్టుకున్నావు. ఇప్పుడు వాళ్ళ ఆశీర్వచనాల బలంతో ఒకడొస్తున్నాడు. వాడితో నీకు కష్టం. నీవేమీ చేయలేవు. వాడు అందర్నీ జయిస్తాడు. అమృతం కోసం వస్తున్నాడు. ఇచ్చేసి పంపిస్తే బాగుంటుంది. ఇవ్వకపోతే తన్ని లాక్కెళ్తాడు. ఇస్తే మర్యాదగా వుంటుంది' అని చెప్తాడు. ఎంత గురువు చెప్పినా మనకు కొన్ని ఇవ్వబుద్ధి కాదు కదా! సరే ఇవ్వడు. చూద్దాం అంటాడు. వాడ్నీ వీడ్నీ, ఐరావతాన్ని పంపిస్తాడు. మొత్తం అందర్నీ చావగొట్టేస్తాడు.

ఎవ్వరూ చాలరు గరుత్మంతుని ముందు. గరుత్మంతుని యొక్క తత్వం అటువంటిది. మనలో కూడా ఆయన్ని ఆవాహన చేసుకుంటే ఎవరూ చాలనంత అమితమైన బలం మనకి ఏర్పడుతుంది. ఈ కథ చదువుకోవడం వల్లే మనలో అలా జరుగుతాయని చెప్పాడు వ్యాసమహర్షి. ఇదంతా చూస్తూ వుంటాడు విష్ణుమూర్తి ఒక ప్రక్కనుంచి. చూసి మరీ ప్రచండంగా రేగి, ఇంద్రుడినే ఎందుకూ కాకుండా అందరితో పోట్లాడుతూ వుంటే, 'చాలా సంతోషించి నిన్ను చూస్తుంటే నాకు చాలా ఆనందంగా వుంది. నీవేదన్నా వరం కోరుకో ఇస్తానంటాడు'. అంటే గరుత్మంతుడు 'ఇప్పుడు నా తల్లి దాస్య విముక్తి అవగానే నా life program అయిపోతుంది. ఈ జన్మ సాఫల్యం అవ్వాలి. నేనెప్పుడూ శాశ్వతుడనై అమృతత్వం పొందాలంటే నీ సేవలో వుంటే నాకది దక్కుతుంది. కాబట్టి నీ వాహనంగా వుండే వరం నాకు ఇమ్మని' కోరుతాడు. 'అంతేకాదు అమృతత్వస్థితి నాకివ్వు. ఈ అమృతం వాళ్ళ కోసం పట్టుకెళ్తున్నానే తప్ప, ఇందులో ఒక్క చుక్క ముట్టుకోను. నాకవసరం లేదు. నీ దర్శనం జరిగింది. నీవు నాకు అమృతత్వస్థితి ఇవ్వు. నీ వాహనంగా నన్ను వాడుకో. ఇది ఇచ్చేసి వచ్చేస్తాను' అని చెప్తాడు. అలాగే, అంటాడు విష్ణుమూర్తి. విష్ణుమూర్తి చాలా ఆలోచిస్తాడు. భారతం చదివితే ఎంత బాగుంటుందో అక్కడ. ఉంటే ఇటువంటిదేదైనా వాహనంగా వుండాలి. లేకపోతే రోజూ రిపేర్లు వచ్చే కార్లు, స్కూటర్లు ఏమి ఉపయోగం? దీంట్లో ఏ లోకాన్నుంచి ఏ లోకానికైనా వెళ్ళవచ్చు. బలం చూస్తే ఇంద్రుడు కూడా చాలేట్టు లేడు అనే భావన కలుగుతుంది. 'నీకు వరం ఇచ్చేస్తున్నాను తీసుకో' అంటాడు. ఆ వరం ఆయన కూడా సద్వినియోగం చేస్తాడు మహాత్ముడు కాబట్టి. తను వాహనంగా ఏర్పడడానికి వరం పుచ్చుకొని, అమృతత్వాని పొంది ఆ అమృతభాండం పట్టుకొస్తుంటే ఇంద్రుడు ఇంక పట్టలేక వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. వజ్రాయుధానికి తిరుగులేదు. తిరుగులేని వజ్రాయుధాన్ని ప్రయోగిస్తే, అది వచ్చి గరుత్మంతుని తాకితే ఆయన చూస్తాడు. చూసి, ఇప్పుడు ఈ వజ్రాయుధం దెబ్బకి మనకేమీ కాదు. ఎందుకంటే నాలుగు ఆశీర్వచనాలున్నాయి. తల్లి, తండ్రి, గురువు, దైవం యొక్క ఆశీర్వచనాలున్నాయి. ఇంక వాడ్ని ఏం చేస్తారు ఎవరన్నా? చూస్తాడు కానీ ఇంద్రుడిని చూస్తే గౌరవిద్దాం అనిపిస్తుంది. అనిపించి ఏం చేస్తాడంటే, ఆ వజ్రాయుధం తనకెక్కడ తగిలిందో ఆ రెక్క మీద నుండి ఒక ఈకని అక్కడ పడేస్తాడు. అంటే వదిలేస్తాడు. ఏది? As a mark of respect to the thunder. పిడుగు పడితే ఒక వెంట్రుక

పారేసినట్లన్నమాట. ఒక ఈక అక్కడ రాలుస్తాడు. రాల్చి, నాకు నీమీద వుండే గౌరవం కొద్దీ, నీ వజ్రాయుధము మీద ఉండే గౌరవం కొద్దీ నా రెక్కల మీద వుండే ఒక ఈకను వదులుతున్నాను అని చెప్తాడు. అప్పుడు దేవతలు చూసి అమితానందం పొందుతారు. It was never before అంతటి అపూర్వమైన విషయం. అప్పుడు దేవతలందరూ 'సుపర్ణుడు, సుపర్ణుడు' అంటారు. అదీ సుపర్ణుడంటే! సహస్రనామం లో 'సుపర్ణ' నామం అట్లా వచ్చింది. సుపర్ణుణ్ణి చూసి ఇంద్రుడికి కూడా వీడు బలవంతుడు, వీడితో పోట్లాట పెట్టుకుంటే ఎప్పటికైనా ఇబ్బందే అని తెలుస్తుంది. కానీ ఆయనకి ఎప్పుడూ కుర్చీ problem. ఇంద్రుడికి ఎప్పుడూ కూడా తనకన్నా బలవంతుడు వస్తున్నాడంటే ఇందుకోసం వస్తున్నాడని భయం. అందుకు ఏం చేస్తాడంటే మనం friendship చేసుకుందామా అని అడుగుతాడు. అంటే గరుత్మంతుడు అంతకన్నా కావలసిందేముంది? I am friendly always, అని చెప్తాడు. అప్పుడు ఈయన, ఆయన స్నేహితులవుతారన్నమాట. స్నేహితులై నీ పని నేను చేసి పెడ్తాను, నా పని నీవు చేసి పెడుతూ ఉండు, అంటాడు. నిజానికి బలవంతుడితో స్నేహం చేసుకోవడం వలన ఇంద్రుడికి సుఖం. ఏ భయమూ వుండదు. మనకు విదురుడు చెప్తాడు. బలవంతుడితో శతృత్వం వుంటే రాత్రిపూట నిద్ర పట్టదని. మూడు కారణాలు చెప్తాడు. అందులో ఇది ఒకటి. బలవంతుడితో శతృత్వం వుంటే నిద్ర పట్టదు. ఎందుకంటే వాడెప్పుడొచ్చి మనల్ని జయిస్తాడో అన్న భయం. ఇంద్రుడితో స్నేహం చేస్తే ఇంద్రుణ్ణి వరమడుగుతాడు గరుడుడు. నీతో స్నేహానికి ఒప్పుకున్నాను కాబట్టి నాకొక permission ఇవ్వు. ఈ పాములన్నింటినీ తినేస్తాను, అంటాడు. ఇంద్రుడు అనేది మనలోని మనసుకు ప్రతీక. పాముల్ని తినడం అంటే ఇందాక చెప్పాను, విషజంతువుల్ని తినడానికి మనసు యొక్క permission కోరుకోవడం అంటే చాలా విషయాలున్నాయి అందులో. మనసు అనుమతి తీసుకోకపోతే మనం ఇటు నుంచి లోపలికి వెళ్ళలేం. ఎందుకని? ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చేయడం అంటే అది గుర్తుపెట్టుకుని చేయడమే కదా! అంటే మనసు దాని మీద పెట్టడమే కదా! మనసు ఉచ్ఛ్వాస నిశ్వాసాల మీద పెట్టకపోతే, ఉచ్ఛ్వాస నిశ్వాసాల ద్వారా లోపల వుండే విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళడానికి వీలులేదు. మీరు ప్రయత్నం చేసినా కూడా ఏమవుతుంది అంటే ఈ 'సోహం' అనే మంత్రం రెండుసార్లో, మూడుసార్లో చేయనిస్తుంది మనసు. ఆ తర్వాత పో, అంటుంది ఎటో వెళ్ళిపోతుంది. చాల్లే

చేశావులే, చాలామందిని చూశాను. చూస్తాను. తగుదునమ్మా అని ఇవాళ మొదలు పెట్టావా నువ్వు, అని అనిపించి తీసేస్తుంది. అక్కడ నుంచి పట్టుకుపోతుంది. చాలా కష్టం. అంత సులభమేమీ కాదు. ఇంద్రుడి వరం కావాలి. మనసు యొక్క అనుమతి తీసుకోవాలి. చూడమ్మా కాసేపు ఈ పని చేసుకుందాం మనం అని చెప్పి దాన్ని నయానా భయానా, దాంతో స్నేహం చేసి తీసుకెళ్ళాలి. గరుత్మంతుడు ఇంద్రుడితో స్నేహం చేసుకోవడం అంటే మనం కూడా మనసుతో అట్లా స్నేహం చేయాలి. మనసుని నిర్భందిస్తే అసలు మాట వినదు. మొండికేస్తుంది. కొంతమందిని కోప్పడితే పని అసలు చేయరు కదా! వాడికి నెమ్మదిగా చెప్పుకోవాలి. మర్యాద చేయాలి. స్నేహం చేయాలి. చేసి నెమ్మది నెమ్మదిగా దారిలో పెట్టుకోవాలి. అదన్నమాట అక్కడ సంకేతం. ఈ సంకేతం మనకు భారతంలో కనిపిస్తుంది. ఇంద్రుడితో స్నేహం చేసిన గరుత్మంతుడు పాముల్ని తినడం మొదలు పెట్టాడన్నమాట. మనక్కూడా అంతే. గరుత్మంతుడే ఉచ్ఛ్వాస నిశ్వాసాల కార్యక్రమం లోపల ఇట్లా జరిపిస్తూ వుంటాడు. ఆయనకి మనసు తోడైతే కానీ లోపలికి పోలేం. లేకపోతే దాని దారిన అది జరుగుతూ వుంటుంది. దీని దారి దీనిది. ఇంద్రునికి, గరుత్మంతునితో స్నేహం లేకపోతే మనకు యోగం లేదండీ. అది ఒక simple point. అతి పవిత్రమైన, అతి రహస్యమైన విషయం. మనసుకి, శ్వాసకి కనక స్నేహం లేకపోతే మనిషి ఎందుకు కొరగాడు. రెండు ప్రక్కల ఇద్దరు పెళ్ళాలు తలో పక్కా పీకిన పరిస్థితి వచ్చేస్తుంది. తలో, కాలో పట్టుకొని అటొకరు, ఇటొకరు లాగేస్తే ఏమవుతుందో అదే పరిస్థితి మనిషి మనసుకి, శ్వాసకి సంబంధం లేకపోతే కూడా. మనకి ఎప్పుడో పోయింది. మనం బావుండాలంటే ఇదే చేయాలి. గరుత్మంతుడు ఇంద్రుణ్ణి వీడేం పెద్ద మనకన్న? వీడితో friendship చేయాల్సిన అవసరం నాకేంటి, అని అనుకోలేదు. నిజానికి ఇంద్రుడి అతి శక్తివంతమైన ఆయుధం గరుత్మంతుడి ఈకతో సమానం. అటువంటి వాడితో గరుత్మంతుడు ఎందుకు చేయాలి స్నేహం? అయినా చేసాట్ట. అంటే మనం కూడా అంతే చెయ్యాలి. ఏం చెయ్యాలంటే మనసుతో friendship. ఇక దాంతో కలిస్తే మనకు విష్ణుదర్శనం సులభమవుతుంది. మన స్వస్వరూపం మనకు సులభంగా తెలుస్తుంది. మనసు మనకి అధీనంలోకి వచ్చిందంటే ఈ విష బీజములు ఉత్పత్తి అయ్యే కార్యక్రమం ఇంక మనలో వుండదు. అదీ పాములు యొక్క సంహారం. పాములు రెండు రకాలున్నాయి. తర్వాత ఇంకో పాము గురించి మళ్ళీ చెప్తా. అన్ని పాములు

అలాంటివేనని అనుకుంటామేమోనని సుపర్ణుని తరువాత 'భుజగోత్తముడు, చెప్పారు. ఋషులకి మనమంటే చాలా భయం. ఎందుకంటే we are prone for all kinds of misunderstandings spontaneously and instantly. అతి త్వరితగతిని మనం దురభిప్రాయాలు ఏర్పర్చేసుకోగలం. అందుకని వెంటనే సుపర్ణుని ప్రక్కనే భుజగోతముణ్ణి పెట్టారు. ఆ విధంగా గరుత్మంతుడిని మనం ఆరాధన చేసుకోవడం అంటే అసలు గరుత్మంతుడు ఒకడు మనలో వున్నాడని గుర్తించాలి. గుర్తించాలంటే ఇంద్రుడి cooperation కావాలి. అంటే మన మనసు cooperation కావాలి. మనసుని ఆధారం చేసుకుని నాసాగ్రం మీదుగా మొదలుపెట్టి, నాసాగ్రం అంటే మళ్ళీ discussion. కొంతమందికి ముక్కు చివరా? పైనా? అని. రంద్రాలు వుండేవి మొదలా? లేక భ్రూమధ్యం మొదలా? అని పోట్లాడుకుంటూ వుంటారు. ఇప్పుడు చెప్పే విషయానికి సంబంధించినంతవరకు ముక్కుపుటాలే మొదలు. ఇక్కడ నుంచే గరుత్మంతుని ముక్కు కూడా. అందుకనే గరుత్మంతుని ముక్కు చాలా పెద్దదిగా వేస్తారు మనకి గుర్తు చేయడానికి. గరుత్మంతుని ముక్కు చూడగానే మనకు వెంటనే మన ముక్కు, ఇందులోంచి పీల్చే గాలి, అందులోంచి ఉఛ్వాస నిశ్వాసలు, అందులోంచి ప్రాణ స్పందన అట్లా పోవాలి. ఎందుకంటే భగవంతుణ్ణి పట్టుకొస్తాడు గరుత్మంతుడు. వాహిక కదా! He is the vehicle of the lord. అయ్యగారు ఎక్కడికి వెళ్తున్నాడోయ్? అని driver ని అడిగితే చెప్పేస్తాడు. Direction ఇస్తాడు మనకి అయ్యగారి దగ్గరికి. జీవితంలో మనం సమస్యల్లో ఇరుక్కుని ఎటుపోవాలో తెలియని పరిస్థితిలో గరుత్మంతుణ్ణి తలుచుకుంటే వెంటనే దారి దొరుకుతుంది. ఇది ఒక సత్యం. He is the lord of direction. ఎటూ దిక్కుతోచని పరిస్థితి వచ్చిందనుకోండి ఒక్కసారి గరుత్మంతుడికి దణ్ణం పెట్టుకుంటే దారి చూపిస్తాడు. ఎందుకని? భగవంతుడే ఆయన direction ప్రకారం అటూ ఇటూ వెళ్తూంటాడు కాబట్టి. మనకి direction ఇవ్వడం ఆయనకి పెద్ద విషయం కాదు. కాబట్టి ఆ విధమైన మార్గదర్శకత్వం చూపిస్తాడు. అన్నిటికన్నా అతి పవిత్రమైన మార్గము, పరమ పదమునకు తీసుకువెళ్ళే మార్గము మనకిచ్చేవాడు గరుత్మంతుడు. అందుకని ఎవరికైనా ముక్కు కొంచెం పెద్దగా వుంటే గరుత్మంతుని ముక్కల్లే వుంది వీడి ముక్కు అంటారు. నిజంగా గరుత్మంతుని ముక్కల్లే ఎవరికి వుంటుందంటే ఉఛ్వాస నిశ్వాసల యందు మనసు నిలిచిన వాడికి వుంటుంది. ఇక్కడ shape పట్టి పోకూడదు. Quality పట్టి పోవాలి. Quality is

more important than the shape. కాబట్టి భావం ఆ విధంగా మనం పెట్టుకొని ఇక్కడ నుంచి నెమ్మదిగా ఏ విధంగా ఉచ్ఛ్వాస వెళ్తోంది? ఏ విధంగా వస్తోంది? గమనించడం మనకు ఒక పెద్ద కార్యక్రమం. అది చేసుకుంటే మనల్ని తీసుకెళ్ళి గరుత్మంతుడు హంసకప్పచెప్తాడు. చూడండి ఒకళ్ళకొకళ్ళు ఎలా అప్పచెప్పుకుంటారో! చెప్పినవన్నీ సరైనటువంటి మార్గంలో జీవితాన్ని నడిపితే మనసు, ప్రాణప్రవృత్తులు ఏకమైనప్పుడు చైతన్య స్వరూపులుగా మనమెవరో మనకు తెలుస్తుంది. మామూలుగా మన జీవితాలు రెండు పాయలుగా నడిచిపోతూ వుంటాయి. ఒక పాయ ఏమిటంటే మనం చేసే ఆలోచనలు, పనులు, వాటికోసం పరిగెత్తడం. ఇది మనం అనుకునే జీవితం ఒకటుంటుంది కదా! అది ఒక పాయ. అట్లా నడుస్తూ వుంటుంది. ఇంకో పాయ లోపల సూక్ష్మ స్పందనం, దాన్నుంచి స్పందనం, స్పందనం నుంచి గుండె కొట్టుకోవడం, గుండె కొట్టుకోవడం నుంచి నీ ఉచ్ఛ్వాస నిశ్వాసలు, ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసల నుంచి ఈ ప్రాణ ప్రవృత్తి, ప్రాణ ప్రవృత్తి నుంచి మంచి రక్తాన్ని చెడు రక్తం చేయడం, చెడు రక్తాన్ని మంచి రక్తం చేయడం, Recycling. ఈ కార్యక్రమాలన్నీ ఒక పాయ చేస్తూ వుంటుంది. ఇంకో పాయ ఏం చేస్తోంది అంటే మనకేం కావాలి? ఎవర్ని తిట్టాలి? ఏమి చేయాలి, ఏమి సంపాదించాలి. ఎవరిని కొట్టాలి? ఎవరిని క్రింద పడేయాలి? ఇవన్నీ చేస్తూ వుంటుంది. ఒక పాయని 'ఇడ' అంటారు. ఇంకొక పాయని 'పింగళ' అంటారు. ఒకటి అంతర్గతంగా జరుగుతూ వుంటుంది. ఇంకొకటి బహిర్గతంగా జరుగుతూ వుంటుంది. రెండింటికీ పుట్టుక స్థానం ఒక్కటే. పుట్టుక స్థానం దగ్గర ఇంకొకటి వుంటుంది. అది 'ఓంకారం'. ఎప్పుడైతే ఈ రెండు పాయలు కలుస్తాయో అక్కడ 'ఓంకారం' వినిపించడం మొదలు పెడుతుంది. దాన్ని 'అనాహతం' అంటారు. అంటే అనకుండా వినబడే ఓంకారమది. ఈ ఓంకారం దగ్గరికి చేరుస్తాయి ఈ రెండు పాయలూ. ఇదీ త్రివేణిసంగమమంటే! త్రివేణీ సంగమంలో కూడా పైకి కనిపించేవి రెండే నదులు. గంగ, యమున. మూడవదేదిరా అంటే 'అంతర్వాహినండీ' అంటారు. కోస్తున్నాడు వీడు. మూడోది లేదిక్కడ రెండే వున్నాయి అనిపిస్తుంది. కానీ ఈ రెండూ కలిస్తే మూడవది కనిపిస్తుంది. అట్లాగే అంతర్వాహినిగా మనలో సుషుమ్నలో బ్రహ్మరంధ్రంలో 'ఓంకారం' నడుస్తూ వుంటుంది ఒక ప్రవాహం లాగా. దానికి రెండు బహిర్వాహినులు. ఒకటేమిటయ్యా అంటే స్పందనం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆ కార్యక్రమం. ఇంకొక పాయ ఆలోచనలు, ఇంద్రియాలు, శరీరం,

వాటిలోంచి పనిచేయడం. ఒకటి తెలివి, ఇంకొకటి ప్రాణం. తెలివి, ప్రాణం రెండూ కలిసినచోట మనం ఓంకారంలో నిలబడడం ఉంటుంది. చైతన్యంలో నిలబడటం ఉంటుంది. చైతన్య స్వరూపులుగా మనకి మనం తెలియాలంటే దానికి కావలసిన సమస్త మార్గం ఈ శ్లోకంలో వాళ్ళు ఒకచోట పొందుపరచి వుంచారన్నమాట. ఇలా చేస్తే లోపలికి వెళ్తే లోపల Vertical గా ఇంకో పాము కనబడుతుంది. అదే భుజగోత్తముడు.

## 201 భుజగోత్తమః

భుజగోత్తముడు అంటే ఉత్తమ భుజగము, భుజంగము అని. ఇవన్నీ భగవంతుని యొక్క అవతరణములే. హంస గాని, సుపర్ణుడు గాని ఇవన్నీ మనలోనూ సృష్టిలోనూ భగవంతుని అవతరణములే. మన ఇంద్రియాలతో, ఇంద్రుడితో స్నేహం వున్న గరుడుడు హంస దగ్గరికి వెళ్తాడు. హంస స్వరూపుడౌవుతాడు. హంస స్వరూపుడైతే లోపల అనాహతంలో ఓంకారం చూస్తామన్నాము కదా! అది జరిపే ఒక చైతన్యమునే "కుండలినీ చైతన్యము" అంటారు. ఈ కుండలినీ చైతన్యాన్ని గురించి చెప్పడమే 'భుజగోత్తముడి' గురించి చెప్పడం. భుజగోత్తముడంటే భుజమంటే చెయ్యి భుజ-గ అంటే 'గ' అన్న శబ్దానికి అర్థం ఏమిటంటే కదిలేది అని. గణపతి, గమ్ గణపతయే నమః 'గం' అనే శబ్దానికి వ్యాపనము చెందుతుంది అని అర్థం. 'భుజగ'అంటే అర్థం ఏమిటంటే వంకరగా నడిచేది అని. చుట్టలు చుట్టలుగా తిరుగుతూ నడిచేది అని. చుట్టలు చుట్టలుగా తిరుగుతూ నడుస్తూ వుంటుందిట అంటే ఆ విధంగా చరిస్తూ వుంటుంది. ఆ విధంగా నడుస్తూ పాకుతూ వుంటుంది. అది ఎవరూ అంటే మనకు పాము అనిపిస్తుంది. పాము కూడా అట్లా తిరుగుతుందే తప్ప, ఈ పాము పుట్టక ముందే అట్లాంటిది ఇంకొకటి వుంది. 'లత' చూడండి ఎట్లా పాకుతుందో! అట్లా చుట్టలు చుట్టలు చుట్టుకుంటూ లత ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేస్తుంది కదా! రాధామాధవం అనే ఒక లత వుంది. అట్లాగే చాలా లతలున్నాయి. 'లత' అని పేరు పెట్టుకుంటే అర్థం ఏమిటంటే దేని చుట్టూనో పాకుతూ పైకి వెళ్తుంది అని. పాకుతూ పైకి వెళ్ళేది, పాకుతూ క్రిందకు కూడా రాగలదు. ఇది పైనుంచి క్రిందకు పాక్కుంటూ వచ్చింది. అట్నుంచిటు పాక్కుంటూ వచ్చిందన్నమాట ఈ లత. ఎక్కడి నుంచి పాక్కుంటూ వచ్చిందంటే నారాయణ లోకంనుంచి చుట్టలు చుట్టలుగా దిగి క్రింద వరకు వచ్చిందన్నమాట. కనుక చుట్టల మీద ఆయన వుంటాడు. ఆయన అక్కడ విశ్రాంతి తీసుకుంటూ వుంటాడు చుట్టల మీద. పాము చుట్టల మీద భగవంతుడు విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఒక రూపాన్ని వాళ్ళు మనకిచ్చారు. ఇట్లా వుండదు పైకి మీరు వెళ్ళి వెతికితే. అట్లా వెతికితే హిరణ్యకశిపుడు వెదికినట్లుగా వుంటుంది. అతడెవడో ఒక పాము మీద పడుకున్నాడట వెతకండిరా అంటే, ఎక్కడా ఎవడూ అట్లా పాము పడగ విప్పి పరుపల్లె వేసి, దానిమీద నీలం ఆకారంలో నాలుగు చేతులు పెట్టుకొని

పడుకొని, చేతుల్లో శంఖం, చక్రం, గదా పద్మాలతో కనిపించడు. సృష్టిలో అట్లా వెతకడం మొదలు పెడితే, ఇంకో హిరణ్యకశిపుడు అవుతాడు. వాడికైతే ability వుంది అన్ని చోట్లకి వెళ్ళడానికి. మనకి లేదు, మన భూమి తప్ప. ఇది కూడా అంతా తిరగలేము. కాబట్టి అట్లా చూడకూడదు. దీనికంతా సంకేతార్థమే! అంటే సృష్టి కతీతంగా వుండే భగవంతుడు సృష్టిలోకి దిగిరావడమనేది. నారాయణుడు పడుకున్న ఆదిశేషుడు లేక అనంతుడు, 'అనంతుడు' అంటే అంతం లేని వాడు. మనం చూడలేం అతడి అంతం. ఎందుకంటే అతడిలోంచి పుట్టుకొచ్చిన వాళ్ళం. అతడి అంతం మనమెక్కడ చూస్తాం? The part can never comprehend the whole, అన్నారు. దేంట్లోంచి మనం పుట్టుకొచ్చామో దాన్ని మనం చూడలేము. మనం పుట్టేటప్పుడు కూడా ఎట్లా పుట్టామో మనకు తెలియదు కదా! ఏదైనా అంతే! మనకి పుట్టుక స్థానమే కాదు, ఈ భూమికి పుట్టుక అట్లా జరుగుతుంది. ఈ సూర్య మండలాలన్నింటికీ పూర్తిగా అట్లా జరుగుతుంది. అట్లా గుండ్రం గుండ్రంగా తిరుగుతూ దిగివస్తూ వుంటుంది. ఇలా తిరుగుతూ పైకి వెళ్ళి, తిరుగుతూ క్రిందికి వచ్చేదాన్ని మనం spiral అంటాం. ఆ spiral ని మన భాషలో 'అనూరాధ 'అంటారు. అనురాధ అనే తీగ అట్లా పైకి పోతూంటుంది. మనలో కుండలినీ చైతన్యం కూడా ఆ విధంగానే move అవుతూ వుంటుంది మూలాధారం నుండి సహస్రారం వరకు. అది సహస్రారం నుండి మూలాధారం వరకు దిగివచ్చి వున్నది. అంటే భగవత్తత్వం భూమి వరకు దిగి వచ్చిందని మనం అర్థం చేసుకోవాలి. నారాయణ లోకం నుంచి ఏడు లోకములు ఏర్పాటు చేసుకొని చివరికి భూమి వరకు దిగివచ్చి, భూమి మీద స్థిరపడి వున్నదని అర్థం చేసుకోవాలి. అంటే ఇన్ని రకములైన మండలాలన్నీ కూడా అది దిగివచ్చే చుట్టలలోంచి ఏర్పడిన బంతులే. గుండ్రం గుండ్రంగా ఎందుకంటే అది గుండ్రంగా తిరుగుతుంది కాబట్టి ఇవి గుండ్రంగా ఏర్పడుతుంది. దీన్ని 'సర్పరజను'అంటారు. అంటే 'సర్పము యొక్క ధూళి' అని అర్థము. అట్లా దిగి వస్తుంది చైతన్యం. అది ఊర్ధ్వలోకముల నుంచి అధోలోకముల వరకు కూడా వ్యాపించి యున్నది. అందుకని 'అనంతుడు' అన్నారు. అంతం లేని వాడని చెప్పారు. 'ఆదిశేషుడు.' ఈయన కథ చాలా వుంది మనకి. ఈయన కూడా పాములవాడే. ముందు తత్వాన్ని అవగాహన చేసుకుందాం. వేయి పడగలతో వున్నవాడు, భగవంతుని నుంచి దిగివచ్చిన వాడు. ఆయన దిగిరావడమే ఈ సృష్టిగా దిగిరావడము. ఆ చైతన్యమే కుండలినీ చైతన్యంగా చెప్తారు. అది

మూడు లోకములు లేదా ఏడు లోకములు దాటి వుంటుంది. లేక పదునాలుగు లోకములు ఆక్రమించి వుంటుంది. అది చుట్టలు చుట్టలుగా దిగి వస్తుంటే అందులోంచి ఏర్పడినవే లోకములు. ఆ లోకములలో ఏర్పడినవే ఈ గోళములు, మండలములు. ఇవన్నీ ఆయన ఆధారంగా ఏర్పడినవే. మనలో కూడా వున్నాయి ఇవన్నీ. మన అదృష్టం ఏమిటంటే మానవుడిగా ఈ మొత్తాన్ని మనలో కూడా దర్శనం చేయవచ్చు. మన సహస్రారంలో వుండే వేయిదళముల పద్మము ఏదైతే వుందో, అది వెయ్యి తలల పాము. వెయ్యి తలలు ఆదిశేషుడికి ఎలా వున్నాయో, మన సహస్రదళ పద్మానికి వెయ్యి దళాలున్నాయి. ఆ వెయ్యి దళాల్లో ఒక కాంతి వుంటుందిట. ఒక మణిమయమైన కాంతి. అది ఒక భగవత్తత్వం. ఆ తత్వం ఆధారంగా అక్కడ నుంచి దిగివస్తూ వుంటుంది. దిగివచ్చి ఏడు లోకములు మన ఏడు కేంద్రములుగా సహస్రారము, ఆజ్ఞ, విశుద్ధి, అనాహతము, మణిపూరకము, స్వాధిష్ఠానము, మూలాధారము ఇన్నీ చేరుకొని, క్రింద నిలబడి, క్రింది వరకు వచ్చి, భూమి వరకు ఏర్పడి, అక్కడ నుంచి పాతాళలోకానికి వెళుతుంది. పాతాళ లోకాలలో అనంతుడు, వాసుకి ఇటువంటి ఉత్తమమైన భుజంగములున్నాయని పురాణాలు చెప్తాయి. వీళ్ళేమి చేస్తున్నారటయ్యా అంటే ఈ సృష్టి భారమంతా మోస్తున్నారని చెప్తారు. సృష్టి భారం మోయడం అంటే మనం అనుకుంటాం, మనకి మోయడం అంటే, మనకొక concept వుంది. తల మీద పెట్టుకుంటేనే మోసినట్లు కదా! తలమీద పెట్టుకునే మోయనక్కరలేదు. ఒక పూల దండ వుంది. ఆ పూలను మోస్తున్నది ఎవరు? దారం! అందులో దారం పూలన్నిటినీ మోస్తోంది. పూలన్నీ దారం పైన వున్నాయా? దారం చుట్టూ వున్నాయా? ఈ పూల దండలో వుండే దారం పూలను మోస్తోందా? లేదా? ఇట్లా మనం పట్టుకుంటే ఏది ఆధారంగా అవన్నీ అట్లా కలిసివున్నాయి? "సూత్రే మణిగణా ఇవః"అంటారు కదా భగవద్గీతలో. మణులన్నీ ఒక సూత్రానికి ఎక్కిస్తే అన్నీ కలిసి వున్నట్లుగా ఈ మొత్తం సృష్టిలో వున్న సమస్త సూర్యమండలములు అందులో వున్న గోళములు అన్నీ పూసకెక్కించిన ఈ తత్వం. అది ఆదిశేషుని తత్వం! అంటే వీటన్నిటికీ ఆధారమైన చైతన్య శక్తి. దాన్నే 'కుండలము' అని ఎందుకు చెప్పారంటే చుట్టలు చుట్టలుగా వుంటుంది కాబట్టి 'కుండలము' అన్నారు. కుండలాలు పెట్టుకుంటారు కదా చెవులకి. చెవులకి కుండలాలు పెట్టుకుంటే ఎట్లా వుంటాయి? చతురస్రంగాను, త్రిభుజాకారంగాను ఏదో ఇప్పుడు కలికాలం కాబట్టి మనం రకరకాలు పెడుతున్నాం. ఇదివరకు వాళ్ళు

కుండలాలంటే గుండ్రంగా వుండేవి. గుండ్రంవే పెట్టుకునేవాళ్ళు. ఏది పడితే అది పెట్టుకోవడం మనకి ఉండేది కాదు. మనం చాలా దూరం వచ్చేసాం కాబట్టి ప్రకృతి సిద్ధం జీవితం నుండి ఏవేవో పెడుతూ వుంటాం. నిజంగా పెట్టుకునేవాళ్ళు కుండలాలు గుండ్రంగా పెట్టుకుంటారు. గుండ్రం గుండ్రంగా తను తిరుగుతూ. దిగివస్తూ అన్ని గుండ్రం గుండ్రంగా తయారు చేసి, అన్నిటిమధ్యా తనే వుంది ఆధారంగా. అదీ మొయ్యడం అంటే! మొయ్యడం అంటే ఎక్కడో క్రింద మనకి ఒక బొమ్మ వేస్తారు ఓ వెయ్యి పడగల క్రింద. వెయ్యి పడగలు ఎట్లాగూ కాగితం మీద పట్టవు. కాబట్టి కొన్ని పడగలు గీసి ఏదో మోసేస్తున్నట్లుగా వేస్తారు. అట్లా మొయ్యదు. మనలో కూడా కుండలినీ చైతన్య శక్తి మన శరీరం మొత్తాన్ని మోస్తోంది వెన్నెముక ఆధారంగా. లేకపోతే ఇదేమీ పనికిరాదు కదా! వెన్నెముక విరిగితే బండికి chasis విరిగినట్లే! ఈ మొత్తం శరీరాన్ని నిలబెట్టి వుంచింది ఏది? వెన్నెముక! వెన్నెముక కాల్షియంతో చేసిన ఒక గొట్టం కాదు. అందులోపల చాలా ప్రజ్ఞలు పనిచేస్తున్నాయి. అందులో ప్రవహించే ప్రజ్ఞ ఆదిశేషుని ప్రజ్ఞ. సహస్రారము లేక నారాయణ లోకం నుంచి మూలాధారము, అక్కడ నుంచి క్రింద ఏడు లోకాలు, అక్కడ నుంచి పై అన్ని లోకాలూ ప్రవహిస్తూ అన్నిటికీ ఆధారంగా వున్నది. ఆ ఆదిశేషుడే లేకపోతే ఇవన్నీ పడిపోతాయి. మన లోపల జరిగే ఆ ఝుంకారము, ఆ ఓంకారము తప్పుకుంటే అప్పుడు ఈ system అంతా అంటే శరీరము పడిపోతుంది. అట్లాగే సృష్టి శరీరం కూడా పడిపోతుంది ఆదిశేషువు కనక మళ్ళీ వెనక్కి తిరిగి చుట్టలు చుట్టుకుంటూ వెళ్ళిపోతే. ఎక్కడ తను బయటకు వస్తే అక్కడది పడిపోతుంది. దారంలో ఎక్కడ దారం తెంపితే అక్కడ పూవు పడిపోవాల్సిందే కదా! ఆ విధంగా ఆదిశేషుడి తత్వంగా భగవంతుడు వలయాకారంగా,( మనం గుండ్రం గుండ్రంగా మెట్లు అంటే spiral steps కట్టుకున్నట్లుగా) మెలికలు వేసుకుంటూ దిగివస్తాడు. అవరోహణానికి, ఆరోహణానికి ఆ మెలికలే దారి. మూలాధారం నుంచి సహస్రారానికి వెళ్ళాలన్నా, సహస్రారం నుంచి మూలాధారం రావాలన్నా అదే దారి. దేవతలందరూ ఈ దారిలో దిగివస్తూ వుంటారు, పైకి వెళ్తూ వుంటారు. ఇది ఒక నిచ్చెన. ఇది అవ్యక్తమైన లోకం నుంచి వ్యక్తమైన లోకములకు ఏర్పడిన నిచ్చెన. ఈయన ఆదిశేషుడు. ఈయన కూడా ఆ పాముల్లో ఒకడే. కానీ ఆ పాములన్నీ ఏం చేశాయంటే వాళ్ళమ్మ ఒక తప్పుడు పని చేయమంటే చేశాయి. సృష్టిలో అనంతుడు

ఒక్కడే అని చెప్పరాదు. చెప్తే మనకి వైష్ణవ bias వుందనుకుంటారు. అలా వుండకూడదు కదా! మనకి తత్వం అంటే  భగవంతుడు కావాలి. కశ్యప ప్రజాపతి భార్యలు వినత, కద్రువ. ఓ రోజు వారిద్దరూ సాయంకాలం వ్యాహ్యాళికి వెళ్తే అక్కడ ఒక తెల్లటి గుర్రం కనిపించింది. 'చూసావా గుర్రం ఎంత తెల్లగా వున్నదో! ముఖం నుండి తోక వరకు ఒకే తెలుపుతో' అని చెప్తుంది వినత కద్రువతో. వినత అంటే విశేషించి వినయంగా వుండే, 'నత' అంటే నమస్కారం అనే భావం ఎప్పుడూ కలిగినవాళ్ళు. వినత అంటే విశేషించి, సృష్టి ధర్మాలకు వినయపడినామె. ఆమెకి అంతా తెల్లగా కనిపించింది. కొంతమందికి సృష్టి అంతా తెల్లగా కనిపిస్తుంది. కొంతమందికి సృష్టి అంతా నల్లగా కనిపిస్తుంది. మన బట్టి మనకి ప్రపంచం వేరేగా కనిపిస్తుంది. అది వేరే కథ. అయితే ఈ కద్రువకి ఒప్పుకోబుద్ధి కాదు. ఎవరైనా ఏమన్నా చెప్తే ఒప్పుకోబుద్ధి కాకపోవడమే మొదటి నలుపు. వున్నది చెప్తే ముందు చెప్పింది కాబట్టి అది ఒప్పుకుంటే ఇక మన గొప్పతనమేముంటుంది? మనం ఇంకోటి చెప్పాలి కదా! అందుకని 'అబ్బే ఆ తోకలో కొన్ని నల్ల దారాలున్నాయి. అది నీకు కనపడటం లేదు. నీకు దృష్టిలోపం' అని చెప్తుంది. 'ఏం కాదు మొత్తం అంతా తెలుపే' అంటుంది వినత. 'లేదు ఖచ్చితంగా తోకలోని వెంట్రుకలు నల్లగా వున్నాయంటుంది' కద్రువ. చూద్దాం అంటే అప్పటికే చీకటి పడిపోతుంది. 'చీకటి పడింది కదా రేపు చూద్దాం' అంటుంది కద్రువ. ఇంటికి వచ్చేస్తారు. కద్రువ తన పాము పిల్లలన్నిటినీ పిలిచి సభ పెడుతుంది. 'ఆవిడతో నేను పందెం కట్టాను. పందెం ఏమిటంటే అవి నల్లగా వుంటే మీ దొడ్డమ్మ వినత నాకు దాస్యం చేసేటట్లు. అవి అన్నీ తెల్లగా వుంటే నేను తనకి దాస్యం చేసేటట్లు.  నిజానికి అవి నల్లగా లేవు. తెల్లగానే వున్నాయి. అయితే ఆ తోక నల్లగా కనిపించాలంటే మీలో కొందరు ఆ తోకలో దాక్కోవాలి. గుర్రం తోకలో మీరు చుట్టుకుంటే కొంచెం నల్లగా కనిపిస్తుంది కదా! అప్పుడు నేను పందెం గెలుస్తాను. అప్పుడు దొడ్డమ్మ మనందరికీ దాస్యం చేస్తుంది' అని ప్రలోభ పెడుతుంది కద్రువ. కద్రువ ఎప్పుడూ వినతని లొంగతీసుకుందామనే ప్రయత్నం చేస్తూంటుంది. అందరూ వింటారు. ఆ మాటలు అందరికీ బాధ కలిగించినా వినక పోతే ఆమె శాపం పెడుతుందన్న భయంతో వింటారు. అసలే పాములకు తల్లి. మరి ఇంకేమి చెప్పగలం. పుట్టుక స్థానం కదా! అందుకే భయం. చాలామంది వింటారు. కానీ కొంత అసమ్మతి వర్గం ఏర్పడుతుంది. వీళ్ళు 'మమ్మల్ని క్షమించు నువ్వు శాపం పెట్టినా మాకు వరమేను,

ఈ అధర్మం వల్ల జరిగే నష్టం  మాత్రం మేము భరించలేం' అంటే వాటికి శాపం పెడుతుంది. అందులో వాసుకి, అనంతుడు ఇలా కొంతమంది వున్నారు. అందులో ఆదిశేషువు కూడా వుండి బాధపడతాడు. తల్లి శాపం పెడితే పరిస్థితి ఏమిటి? తల్లే శాపం పెడ్తే, ఇంక తండ్రి, గురువు వీళ్ళ సంగతేమిటి? అని ఆదిశేషువు బాధపడి బ్రహ్మ కోసం తపస్సు చేస్తాడు. తపస్సుతో బ్రహ్మ అనుగ్రహం పొంది, భగవంతునికి వాహనమై సృష్టికార్యంలో భాగమై ఈ ప్రపంచానికి, ఈ సృష్టికి ఆధారభూతుడైన స్థితిలోనికి ఉద్ధరింపబడతాడు. ఆదిశేషుడి గురించి భారతంలో ఏం చెప్తారంటే, మన నుదుటి మీద నువ్వు గింజ పెడితే మనకెలా వుంటుంది? అట్లా వుంటుందిట ఆదిశేషువుకి ఇన్ని వలయాలతో కూడిన మండలాలన్నీ మోస్తుంటే. అక్కడ్నుంచి ఆయన మీద పవళించిన వాడి సంగతి ఆలోచిస్తే? అందుకని చెప్పలేం ఈయన గురించి. 'అనంతుడు' అని చెప్పారు. 'కాలస్వరూపుడు' అని చెప్తారు. ఆయన పొలుసుల నుండి ఈ సృష్టి మొత్తం, ఎన్నెన్ని పుట్టుకు వచ్చినాయో ఎవరికీ అవగాహన కాదు. అటువంటివాడు. ఈయనకి ధీటైనవాడు వాసుకి. వీరిద్దరి కథలు, భుజగోత్తములుగా తప్పకుండా చెప్పుకోవాలి. వాసుకి, అనంతుడు వీరిద్దరూ భుజగోత్తములు. వీరి రూపంలో వున్న భగవంతుని మనం దర్శనం చేయాలి. సర్పములలో కూడా నాగసర్పములు ఉత్తమమైనవి. అన్నీ నేల మీదే పాకేవే అయినా నాగసర్పములు పైకి తలెత్తి నిలబడగలవు. మనం నిలబడేటట్లుగా నిలబడగలవు. వాటి మీద మణులుంటాయి. అన్ని పాములూ ఒకటి కాదు. అందుకే ఈ నాగసర్పములను కార్తీక మాసంలో పూజ చేసుకోవాలని చెప్తారు. ఎందుకంటే కార్తీకమాసం అధోలోకానికి ప్రతీక. ఆ పాతాళ లోకంలోని ఉత్తమనాగుల్ని మనం పూజ చేస్తాం కాబట్టి ఉత్తమమైన భావములు కలిగి వుండడం వలన ఊర్ధ్వగతికి చేరడానికి అవకాశం ఏర్పడుతుంది. 'భుజగ' అంటే వలయాకారంగా తిరిగేటటువంటి ప్రజ్ఞ. అందులో ఉత్తమమైనట్టి వారు వాసుకి, అనంతుడు మొదలగువారు. ఇతరులు ఉత్తమమైన నాగజాతికి చెందినవారు. అందుకే చాలామంది మహాత్ములు తాము కైవల్యం చెందిన తర్వాత, అంటె భగవత్ తత్వాన్ని అవగాహన చేసుకున్నాక ఎక్కువగా నాగుపాము రూపాల్లో వుంటూంటారు. అదొక సరదా. అదొక తమాషా. అన్నీ తెలిశాక ఏ రూపం అయితే నేమిటి? హనుమంతుడు కోతి రూపంలో వున్నట్లు. ఈ రూపం అయితే బాగుంటుంది, ఈ రూపం అయితే బావుండదు అనేది రూపం మీద అభిమానం వుండే వాళ్ళకి.

అభిమానం దాటిన వారు ఎక్కువమంది నాగదేవతలుగా, నాగుపాములుగా వుండడం వుంటుంది. వారందరినీ మనం 'భుజగోత్తమః' నామంలో స్మరించాలి. అందుకని మనకి మహాత్ముల గురించి వర్ణన చేసినపుడు నాగులలో ఉత్తమమైనట్టి అనంతుడు లాంటి వాడివి, వాసుకి లాంటివాడివి అని పోలుస్తారు. అదేంటి? పాములతో పోలుస్తారు అనుకుంటాం. అక్కడ అది పాము కాదు. కుండలినీ చైతన్యము సహస్రారమును స్పర్శనము చేసి, అక్కడనుండి ఇక్కడి వరకు తత్త్వమంతా అవగాహన చేసుకుని, పరిపూర్ణుడైన ప్రతివారూ భుజగోత్తములే. ఆ రూపంలో వుండే వాళ్ళందరిలో కూడా మనం భగవంతుణ్ణి చూస్తాం. మహాత్ములు, గురువులు అని ఎవరి పాదాలైతే పూజ చేసుకొంటున్నామో, సేవలు చేసుకొంటున్నామో వారందరూ కూడా ఈ నామం కిందే వస్తారు. ఈ రూపాల్లో భగవంతుడే మనకి ప్రత్యక్షమై వున్నాడని మనం తెలుసుకోవాలి. భుజంగము అంటే మెలికలు మెలికలుగా చుట్టలు చుట్టలుగా కదిలేటటువంటి లతలాగా తిరిగేటట్టి ఒక ప్రజ్ఞ మనం తెలుసుకున్నాం. అలా తిరిగే వాటిలో సర్పములు వస్తాయి. ఆ సర్పములలో ఉత్తమ సర్పాల గురించి భావన చేసుకున్నాం. ఉత్తమ సర్పాలలో అనంతుడు ఒకడు. ఎందుకంటే అనంతుడు అనే భగవన్నామం మళ్ళీ వస్తుంది. ఇక్కడ చెప్పిన నామం 'భుజగోత్తముడు' కాబట్టి ఉత్తమ భుజంగముగా వున్నవారు భగవంతుడుగా మనం భావించాలి. నాగదేవతలుగా, నాగసర్పాలుగా భావన చేసి పూజలు చేసేట్టి సర్పం రూపంలో కుండలినీ చైతన్యముగా భూమి మీద వున్నట్టి, అస్తిత్వం కలిగినట్టి ప్రజ్ఞలన్నిటినీ భగవంతుని యొక్క అస్తిత్వంగా భావన భావన చేయాలి. భూమి మీద వుండే చైతన్యము, భూమి చైతన్యము కుండలినీ శక్తి ఎట్లా వుంటుందో దాని ప్రతీకగా మనకి నాగసర్పాలున్నాయి. కుండలినీ చైతన్యములాగానే మొత్తం ఈ భూమి, సూర్య మండలం, ఒక సూర్య మండలం ఇంకో సూర్య మండలానికి మధ్య ఒకదానికొకటి అనుసంధానం చేసే ప్రజ్ఞగా ఈ చైతన్యము పనిచేస్తూంటుంది. అది అనంతమైనది కాబట్టి అనంతుడి నామం గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ ఉత్తమ సర్పాలలో 'వాసుకి' అని ఇంకో సర్పం వున్నది. ఈ వాసుకి కూడా కద్రువకి కశ్యపునికి పుట్టిన సర్పాలలో ఒకటి. వినతకి కశ్యపునికి గరుత్మంతుడు, అనూరుడు అని ఇద్దరు కుమారులని మనం చెప్పుకున్నాం. కద్రువకి లెక్కలేనన్ని సర్పాలు కలిగాయని పురాణాల్లో చెప్పడం జరిగింది. పెద్ద పెద్ద, చిన్న చిన్న సర్పాలు అంటే మనం అవగాహన చేసుకోవాల్సింది

'కాలస్వరూపాలు'గా. కాలానికి సర్పాన్ని సంకేతంగా చెప్పి వున్నారు. అందుకని ఏవైనా పురాణ కథలలో ఒక సర్పం గనుక చెప్పబడినట్లయితే అక్కడ నుండి జరిగే కథ మారుతూంటుంది. ఒక సర్పం కనిపించిందనుకోండి కథ మారుతుంది. నలుడికి సర్పం కనిపించింది. అంతే కథ మారింది. పరీక్షిత్తు సర్పాన్ని మెడలో వేశాడు. కథ మారింది. అట్లాగే బైబిల్ కథలో కూడా సర్పం దిగివచ్చింది అని చెప్తారు. ఇహ అంతటితో కథ మారుతుంది. ఆదాము, అవ్వకి భౌతికమైన శరీరాలు ఏర్పడ్డట్లుగా చెప్తారు. Vedic system లో ఎక్కడైతే సర్పాన్ని గూర్చి చెప్తారో, అక్కడ కాలం గురించి చెప్పినట్లుగా అవగాహన చేసుకోవాలి. కాలం మార్పు మనకి చూపడానికి సర్పాల గురించి చెప్పడం జరిగింది. అనంతమైన చైతన్యము మన లోపల నిండి వుండి, అది ఇరుసుగా మన చుట్టూ మన దేహం ఏర్పడ్డట్లుగా, భూమికి కూడా ఇరుసుగా అదే సర్పం వుంటే దాని చుట్టూ దేహంగా ఏర్పడుతూ అట్లాగ కూడా సర్పాన్ని అవగాహన చేసుకోవలసిన అవసరం ఒకటి వున్నది. అలాగే సర్పము యొక్క చైతన్యము మనలో కుండలినీ చైతన్యములాగా ఎలా వున్నదో, సర్పము యొక్క విషము మనకి మృత్యువుని కలిగించే దారిగా చెప్తారు. మృత్యువుకు తార్కాణంగా చెబుతారు. మృత్యువుని కలిగించే శక్తి కూడా సర్పానికి వున్నది. చైతన్య స్థితిలోకి తీసుకువెళ్ళే స్థితి కూడా సర్పానికి వున్నది. మృత్యువును తీసుకువచ్చే సర్పాన్ని 'తక్షకుడు' అంటారు. ఏ సర్పం అయితే మృత్యువును కలిగిస్తుందో అది 'తక్షకుడు'. ఈ తక్షకుడు కూడా ఉత్తమ సర్పాల్లో ఒకటిగా చెప్తారు. సృష్టి విధానంలో విద్య మీద అవిద్య అనే ఆవరణం ఏర్పడటం వలన సృష్టి ఏర్పడుతుంది. మాయ వలన సృష్టి ఏర్పడుతుంది. మాయ లేకపోతే వివిధత్వం వుండదు. వివిధత్వం లేకపోతే సృష్టి వుండదు. కాబట్టి వివిధత్వం కోసం మాయ కల్పించాలి. మీరు మేము అన్న తేడా కల్పించాలి. రకరకములైన పదార్థములుగా ఏర్పరచాలి. రకరకములైన జీవులను ఏర్పరచాలి. ఆ విధంగా తక్షకుణ్ణి మృత్యువు కలిగించేవాడుగా చెప్తారు. అలాగే ఉత్తమ సర్పాలలో అనంతుడిగా సమస్త సృష్టి తనయందు ధారణ చేసిన మహా చైతన్యంగా చెప్తారు. ఈ నామాల్లో దిగి వచ్చింది నేనే సుమా అని భగవంతుడు చెప్పినట్లుగా మనకు తెలుస్తుంది. వాసుకి కథ ఏమంటే ఒక మహా యజ్ఞంలో మృత్యువు వాటిల్లుతుందని తల్లి శాపం ఇస్తుంది వాసుకికి. ఆ శాపం విని విరక్తి కలిగి అనంతుడు అనే తత్వం తపస్సు చేసుకుని బ్రహ్మ మెప్పు పొంది సృష్టి కార్యంలో భాగంగా చేరిపోతాడు. వాసుకి సర్పం తన

సోదరుడు గురించి బాధపడతాడు. పెద్దాయన తన సంగతి తను చూసుకున్నాడు. వీరందరి సంగతి ఎవరు చూస్తారు? సాధన మార్గంలో ఎప్పుడూ రెండు మార్గాలుంటాయి. తను బ్రహ్మస్థితి పొంది, మోక్షం పొంది మళ్ళీ తిరిగి రాని పద్ధతిలో భగవంతునిలో ఐక్యం అయిపోవడం ఒక పద్ధతి. మనం బ్రహ్మస్థితి పొందిన తర్వాత మన పొందిన అనుభూతి మిగతా వాళ్ళకి లేదే! వాళ్ళంతా మృత్యుముఖంలో పడి కొట్టుకుపోతున్నారే! వాళ్ళని కూడా మనం ఈ విధంగా ఉద్ధరింపచేసే మార్గంలో పెడితే బావుంటుంది అనే పద్ధతిలో మరికొందరు దిగి వస్తారు. ఇది రెండో పద్ధతి. రెండు పద్ధతుల్లో ఏది గొప్ప, ఏది తక్కువ? అని ఏం లేదు. రెండు పద్ధతులు మొదట్నుండీ వున్నాయి. అందులో భాగంగా వాసుకి తను తపస్సు చేసి, బ్రహ్మ యొక్క అనుభూతి పొంది, బ్రహ్మ తత్వాన్ని తెలుసుకొని తర్వాత, తన తోటి వారంతా నాశనమైపోతున్నారనే బాధతో వుండగా అతడికి భగవద్విషయంగా తెలిసినదేమిటంటే, తన సోదరి అయిన 'జగత్కారి'కి, మరో ముని అయిన 'జగత్కారుని' కిచ్చి వివాహం చేస్తే వారిద్దరికీ పుట్టే పిల్లవాడి వలన, ఈ సర్పజాతికి నాశనం లేకుండా ఆపేటటువంటి ఒక మహర్షి జన్మిస్తాడని. ఆ కార్యక్రమానికి పూనుకొని, అది నిర్వర్తించగా వారికి  కుమారుడు జన్మిస్తాడు. అతడే అస్తీకుడు. ఆయన ద్వారా సర్పాలన్నిటికీ కూడా రక్షణ జరిగేట్లు చేస్తాడు. తర్వాత తను కూడా తన అన్నవలె సృష్టి భారం వహించడానికి పాతాళలోకములలో  ఉండి, ఈ లోకములను ధారణ చేయడానికి పూనుకుంటాడు. మనభూమి వరకు ఆ విధంగా వాసుకి పాతాళములో నివసించి ఉన్నాడు. ఆ వాసుకి అర్జునుడు పుట్టే సమయములోను, పెళ్ళి చేసుకొనే సమయములోను, భీముడు విషాన్నం తిని నీటిలో పడి  మునిగిపోయినప్పుడు రక్షించిన  సందర్భములోను బాగా సహాయం చేస్తాడు. అంటే భగవత్కార్యములలో ఎప్పుడూ ఇమిడి ఉన్నవాడిని మనము భగవంతుడిగా భావించాలి. అనంతుడు ఏ విధం గా విష్ణుమూర్తికి పానుపై ఉంటాడో, వాసుకి ఆ విధంగా శివుడికి మెడలో హారంగా ఉంటాడు. ఏ విధంగా క్షీరసాగర మధనం చేసి అనంతుడు ఏ విధంగా విష్ణుమూర్తికి పానుపు అయ్యాడో, వాసుకి ఆ విధంగా శివుడి మెడలో హారంగా ఉంటాడు. ఈయన సృష్టిలో ఒక పెద్ద కార్యక్రమం చేయడం జరిగింది. క్షీరసాగరమధనము చేసి  అమృతాన్ని ఉద్భవింపచేయాలనే కార్యక్రమము ప్రారంభమైనప్పుడు మందర పర్వతాన్ని గరుత్మంతుడు తీసుకు వచ్చి అక్కడ

నిలబెడతాడు. తర్వాత దాన్ని అటు ఇటు చిలకడానికి తాడులాగ ఎవర్ని ఉపయోగించాలని ఆలోచిస్తుంటారు. అప్పుడు వాసుకిని ఉపయోగించాలని నిర్ణయిస్తారు. ఆ వాసుకిని పాతాళ లోకము నుండి ఎవరు తీసుకువస్తారంటే, ఈ మందరపర్వతాన్ని నేనే తెచ్చాను కదా ఆ వాసుకిని కూడా నేనే తీసుకు వస్తానని గరుత్మంతుడు వెళతాడు. గరుత్మంతుడు అత్యంత మహిమాన్వితుడు, బలపరాక్రమము కలవాడు, ఎదురులేని ధీశక్తి కలిగినవాడు, అన్నిటికన్నా భగవంతుని వాహనముగా ఉన్నట్టివాడు. ఆయన వాసుకి వద్దకి వెళ్ళి, 'ఇలా దేవతలు దానవులు క్షీరసాగరమధనము చేయడానికి నిర్ణయించుకున్నారు, దీనికి తాడుగా నిన్ను నియోగించుదామని నిర్ణయించుకున్నారు. కాబట్టి నువ్వు కూడ ఈ జగత్కళ్యాణ కార్యక్రమములో పాల్గొంటే బావుంటుంది.' అంటాడు. అప్పుడు వాసుకి అతి ముఖ్యమైన కార్యక్రమము అయితే తప్పక వస్తాను, అంటాడు. అయితే వెంటనే రా, అంటాడు గరుత్మంతుడు. అంటె, నేను వెంటనే రాలేను time పడుతుంది. కానీ ఎలా రావాలి అంటాడు వాసుకి. అయితే నేనే తీసుకు వెళతాను అంటాడు గరుత్మంతుడు. అని చెప్పి నువ్వున్న స్థితిలోనే ఉండు నీ మధ్య భాగాన్ని నా ముక్కుతో పట్టుకొని నిన్ను తీసుకు వెళతాను, అంటాడు. అప్పుడు వాసుకి సరెనంటాడు. అప్పుడు వాసుకి యొక్క మధ్య భాగాన్ని తన ముక్కుతో పట్టుకొని ఊర్ధ్వ లోకాలకి బయలుదేరుతాడు. మనకి 30 వేల, 40 వేల అడుగుల ఎత్తులో మన విమానాలు వెళ్తాయి కదా. దానికన్నా చాలా పై ఎత్తులో ఆకాశంలోకి ఎగురుతాడు. అయినా వాసుకి తోక, పడగ/తల రెండూ పాతాళంలోనే వుంటాయి. ఏంటి ఇంతున్నావంటాడు. అందుకే నేను అన్నాను టైం పడుతుందని అంటాడు వాసుకి. ఏం చేద్దాం అంటాడు. అయితే ఓ పని చెయ్యి. రెండు మడతలు వేసి కూర్చో. మధ్యలో పట్టుకుంటాను అని మళ్ళీ ఎగురుతాడు. మళ్ళీ ఎత్తినా, మళ్ళీ అదే పరిస్థితి. అంటే కాలము యొక్క స్వరూపము అయినప్పుడు ఇంత అని చెప్పడానికి వీలులేదు. సర్పమునకు రకరకాల సంకేతాలు. కాలం రూపంలో వున్న భగవంతుణ్ణి ప్రార్ధన చేసుకోవాలి వీళ్ళందరిగా. అప్పుడు నాలుగు మడతలు వేసుకున్నా అదే పరిస్థితి. ఆ విధంగా గరుత్మంతుడికి మొట్టమొదటిసారిగా గర్వభంగం జరుగుతుంది. అంతవరకు అతనికి అంతా జయమే! ఏది ముట్టుకుంటే అది. ఇంద్రుణ్ణి గెలిచాడు. విష్ణువు దగ్గర వరాలు తను పుచ్చుకోవడమే కాకుండా, విష్ణువుకి తను వరాలిచ్చాడు. అంతటివాడు. ఇంద్రుడంతటివాడు వజ్రాయుధం వేస్తే ఒక ఈకముక్క

ఆ వజ్రాయుధం మీద గౌరవం కొద్దీ వదులుతున్నానని చెప్పగలిగినంతటివాడు. ఆ స్థితిలో వున్నట్టివాడికి, అన్ని సర్పాలను తినేయగలను అనే స్థితిలో వున్నవాడికి, వాసుకిని చూశాక అర్థమవుతుంది. మనలాంటి వాళ్ళు, మనకన్నా గొప్పవాళ్ళు ఇంకా వున్నారని. అప్పుడు ఏం చేద్దామంటే, వెళ్ళి దేవతలనే అడుగు, అంటాడు వాసుకి. అప్పుడు దేవతల వద్దకు వెళ్ళి చెప్తే, వాళ్ళు చాలా ఆశ్చర్యపడి, వాళ్ళ పితామహుడు బ్రహ్మ వద్దకు వెళ్ళి అడిగితే, బ్రహ్మ తపస్సు లోకి వెళ్ళి, శివుడు తప్ప వాసుకిని తేగలడని, ఆ పని ఇంక ఎవ్వరూ చేయలేరని చెప్తాడు. శివుడు ఒక్కడే అని చెప్పడంలో విశేషమేమంటే, సృష్టిలో దిగివచ్చిన భగవంతుణ్ణి మనం 'విష్ణువు' అంటాం. దిగిరాని భగవంతుణ్ణి 'నారాయణుడు' అని, 'శివుడు' అని చెప్తూంటాం. శివుడికి లోపల, వెలుపల వుండదు. దిగిరావడమనేది వుండదు. దిగివచ్చిన వారంతా కాలానికి లోబడి వుండవలసిందే. సృష్టిలో కాలానికి అతీతమైన వారికి తప్ప, మిగిలిన వారికి కాలం మాట వినదు. మిగిలిన వారంతా కాలం మాట వినవలసిందే తప్ప, కాలాన్ని అతిక్రమించి ఏం చేయలేరు. కాలం వారి మాట వినేదేలేదు. కాలం ఆ పై నుండే భగవంతుడి మాట వింటుంది. అందుకని సృష్టితత్వాలన్నీ కాలానికి లోబడి వుంటాయి. కాలం భగవంతుడికి లోబడి వుంటుంది. భగవంతుడు కాలస్వరూపుడై దిగివస్తూంటాడు అని చెప్తారు. ఈ మూడు statements చాలా important. సృష్టి తత్వాలు అన్నీ కూడా కాలానికి లోబడి వుంటాయి. 24 తత్వాలూ కాలమనే 25 వ తత్వానికి లోబడి వుంటాయి. అందుకని అన్ని యంత్రాలకి చుట్టూ ఒక సున్నా చుట్టి వుంచుతారు. అది కాలం. దానికి లోపల వున్నవన్నీ కూడా దానికి లోబడి వున్నటువంటివే. యంత్రం అంతా దానికి లోబడి వుంటుంది. దానికవతల వున్నదంతా కూడా దిగిరాని భగవత్ తత్వము. దిగిరాని భగవత్తత్వము శివుడు కాబట్టి శివుణ్ణి అడిగితే, మీకు వాసుకి కావాలా! దానికి మీరంతా తాపత్రయపడతారా! వుండండి నేను పిలుస్తానని, ఇలా చెయ్యి పెట్టి పిలుస్తాడు వాసుకిని. పిలిస్తే, శివుడి కుడిచేతిలో సెనగ బద్ధంత అయిపోతాడు వాసుకి ఆయన చేతిలో వచ్చేసరికి. దీంట్లో రెండు dimensions వున్నాయి. అంటే భగవంతుడినీ, కాలాన్ని పోల్చి చూస్తే proportions ఎలా వుంటాయో తెలుస్తుంది. ఒక సృష్టికి ఒక కాల పరిమితి వున్నప్పుడు, అటువంటి సృష్టిలో దిగిరాని భగవత్తత్వాన్ని ఒక శరీరంగా తీసుకుంటే, ఒక సృష్టి ఒక సెనగబద్ధంత వుంటుంది. మొత్తం చోటులో, చాలా కొద్ది చోటు మాత్రమే సృష్టిగా

మారుతూంటుంది. ఆ కొద్ది చోటునే మనం 'కురుక్షేత్రం' అంటున్నాం. ఆ కొద్ది చోటే వెలిగింపబడిన చోటు. అది అసలు తత్వం. నామ రూపాతీతమైన భగవత్తత్వంలో ఈ సృష్టి అతి చిన్నవిషయం అని తెలపడానికి మనకి సంకేతపరంగా చెప్తారు. సరే అప్పుడు వాసుకి వస్తాడు. వాసుకిని వాడుకొని అమృతత్వాన్ని పొందుతారు. అది కాలానికి సంబంధించిన కథ. అది మనలోనూ జరుగుతూంటుంది. సృష్టిలోనూ జరుగుతుంటుంది. సృష్టిలో వాసుకిని ఒకవైపు దానవులు లాగుతూంటే, మరోవైపు దేవతలు లాగుతూంటారు. అంటే కాలం ఒకసారి ఇటువిషయాలు, కొంచెం సేపు అటువిషయాలు చూపిస్తుంది. ఎప్పుడూ ఒకే పద్ధతిలో వెళ్ళదు. అదే మెలిక అంటే. ఇట్లా వచ్చి అలా వెళ్తుంది. మెలిక పడ్డది అంటే 8 అంకె. అందుకే 8 అంకెకు 'భుజగ' మని పేరు. మెలిక తిరిగి వుంటుంది. కింద ఆకు, దాని opposite ఆకుతో corresponding గా వుంటుంది. ఇవతల వున్న ఆకు, పైనున్న ఆకుతో corresponding గా వుంటుంది. అందుకని It is a reflection of the circle. 8 అంకె ఒక circle దాని reflection జరిగినప్పుడు ఏం జరుగుతుందంటే కుడిప్రక్కది ఎడంప్రక్క, ఎడంప్రక్కది కుడిప్రక్క కనిపిస్తుంది. ఆ reflection ని మళ్ళీ మనం invert చేస్తే తప్ప అసలు స్థితి మనకి అవగాహనలో రాదు. సృష్టిలో ఈ కాలంరూపంలో సర్పం కుడి ఎడమల ప్రజ్ఞలుగా పనిచేస్తూంటుంది. అందుకని కాసేపు కుడివాళ్ళకి బలం ఇస్తుంది. కాసేపు ఎడమ వాళ్ళకి బలం ఇస్తూంటుంది. అటు ఇటు, ఇలా సాగుతూంటుంది. సాగడంలో నుండి సృష్టి పుడుతుంది. ఈ సృష్టి పుట్టడంలో ఒక్కొక్కటి పుట్టుకొస్తూ ముందు విషం పుడుతుంది. చివరకు కదా అమృతం పుడుతుంది. క్షీరసాగర మథనంలో అన్నీ అవి ఇవి పుట్టి, అవి పుట్టే ముందు విషం పుడుతుంది. విషం, అమృతం కూడా గొంతులో వుంటాయి. మనం ఈ గొంతుని వాడుకునే పరిస్థితిని బట్టి ఇందులో విషం బయల్దేరి దేహాన్ని పాడు చేస్తుంది. ఈ గొంతుని సరైన పద్ధతిలో వాడుకోవడాన్ని బట్టి ఇదే ప్రదేశంలో నుండి అమృతం పుడుతుంది. ఏ చోట్లోంచి విషం పుడుతుందో, ఆ చోట్లోంచే అమృతం పుడుతుంది. అదే మనకి క్షీరసాగరమథనం కథలో ఏ సముద్రంలో నుండి హాలాహలం పుట్టిందో, ఆ సముద్రం నుండే అమృతం పుట్టింది. కాబట్టి రెండూ ఒకే చోట పుడతాయి. రెండూ ఒకదానికొకటి counter parts. అందుకే వాసుకి ఎప్పుడూ కంఠం చుట్టూ వుంటాడు. అంటే మీకు విషాన్నయినా, అమృతాన్నయినా ఇవ్వగలడు. అది మనం ఈ విశుద్ధి యొక్క వినియోగాన్ని బట్టి ఏర్పడుతుంది.

విశుద్ధి యొక్క వినియోగంలో చాలా రహస్యాలు ఇమిడియున్నాయి. అంతర్లోకాలకి, బహిర్లోకాలకి సంబంధించిన కీలకమైన స్థానం విశుద్ధి వహిస్తుంది. అంతర్లోకాలన్నీ కూడా సహస్రారము, ఆజ్ఞ, హృదయ కేంద్రాలుగా వుంటే, బహిర్లోకాలు మణిపూరకం, స్వాధిష్ఠానం, మూలాధారంగా వుంటే ఈ రెంటి లోకాలకి మధ్య కీలక స్థానాన్ని వహించేది విశుద్ధి. అది వాడబడడాన్ని బట్టి అమృతత్వసిద్ధో, మృత్యువో వస్తుంది. మృత్యువు వచ్చినప్పుడు గొంతులో నుండి నురగలు వస్తూంటాయి. నురగలు కక్కుతుంటే కిందకు దింపేస్తారు. అమృతం పొందేవాడికి కూడా అక్కడే పడుతుంది. అదే కొండ నాలుక పైన ఉన్న అంగుట్లో పై నుండి గొంతులో అక్కడే పడుతుంది. దాన్నే 'సోమపానం' అంటారు. రెండూ కూడా విశుద్ధిలోనే జరుగుతూంటాయి. ఈ రెంటినీ సృష్టి యొక్క alternating currents గా వాసుకిని, వాసుకి తత్వాన్ని అర్థం చేసుకోవాలి. అనంతతత్వం verticles. వాసుకితత్వం horizontals. దిగిరావడం అనంతుడు. దిగివచ్చిన మొత్తం అంతాకూడా ఆయనలో నిండి వుంటుంది. ఏర్పడినవన్నీ ఆయనలో ఏర్పడినవే. ఆయన ధరించి వున్నాడు. ఈ సమస్త లోకములను, సృష్టిని అంతా తనయందు ధరించియున్నాడు. పూలదండను దారం ఏ విధంగా పూలను ధరించియున్నదో, ఆ విధంగా మనలోని సుషుమ్నలోని కుండలినీ చైతన్యం ఈ శరీరాన్ని ఏ విధంగా ధరించియున్నదో, ఇరుసు ఆధారంగా భూమి ఎలా వున్నదో అలా మొత్తం సృష్టిని పూసల్లో దారం లా తను ధరించి వున్నాడు తప్ప, నెత్తి మీద పెట్టుకొని మొయ్యడం కాదు. That is the vertical aspect of uttama bhujanga. Vasuki is horizontal. Left and right principles. ఎడమవైపుకి లాగినప్పుడల్లా పదార్థం వైపుకి మొగ్గుతుంది సృష్టి. అలాగే కుడి వైపుకి లాగినప్పుడు సృష్టి చైతన్యం వైపుకి మొగ్గుతూ వుంటుంది. ఎక్కువగా రాక్షసులు బాగా లాగుతూంటారు. దేవతలు మళ్ళీ మంత్రాలేవో చదువుకొని లాక్కుంటూంటారు. పదార్థం వైపుకు లాగేదంతా అంటే spirit becoming matter. అదంతా left side. Matter becoming spirit అంతా right side. అందుకే 27 నక్షత్రాలు తీసుకుంటే ఒక దేవగణం, ఒక రాక్షసగణం ఒక మనుష్యగణం, అట్లా వుంటాయి. అక్కడ కూడా alternative గా ఎందుకుంటాయి అంటే సృష్టి balance కావాలంటే రెండూ equal గా పనిచేయాలి. రెండు సమతూకంగా వున్నప్పుడు మానవుడు equi poise situation లో వుంటాడు.

మానవుడు అటు దైవత్వానికి, ఇటు దానవత్వానికి equi distant గా వుంటాడు. ఎడం ప్రక్కకి వెళ్తే మానవుడు దానవుడిగా అవుతాడు. దానవుడిగా అవడం అంటే పదార్థాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తాడు. కుడికి వెళ్తే దేవుడవుతాడు. దేవుడిగా అవ్వడం అంటే చైతన్యంలో తాను ఇమిడిపోవడం. He has two possibilities. అందుకని వీడెప్పుడూ మధ్యలో వుంటాడు. మానవుడికున్న possibilities మిగతా వాళ్ళకి లేవని చెప్తారు. Left and right movements తోనే సృష్టి జరుగుతుంది. అవి మనలో బాగా జరిగినప్పుడు మనలో మధనం జరిగి అమృతత్వస్థితి పుట్టే అవకాశం వుంటుంది. సృష్టి పుట్టుకు రావడం ఒక పద్ధతి. Return path లో అమృతత్వం పుట్టడం మరొక పద్ధతి. ఇలా అమృతత్వాన్ని పొందిన మిథిలా నగర వాసుల గురించి చెప్పుకున్నాం. వాళ్ళు 'మిథిల' అంటే మధించబడినట్టి వాళ్ళు. మధనం చేయబడినట్టి వాళ్ళు. ఈ విధంగా మధనం చేయడానికి ఉపయోగపడే కాలస్వరూపాన్ని 'వాసుకి' గా భావన చేసుకోవాలి. భగవంతుడు వాసుకి తత్వంగా పనిచేస్తున్నట్లుగా ఈ నామంలో చెప్పుకోవాలి. భుజగోత్తమః లో అనంతుణ్ణి, వాసుకిని చెప్పుకోవాలి. ఒకళ్ళు విష్ణు దేవునికి పానుపు అయితే, ఇంకొకళ్ళు శివుడికి కంఠహారంగా వుంటారు. ఇద్దరి చరిత్రలు చాలా వివరంగా పురాణాల్లో మనకిచ్చారు. వాసుకి గురించి వచ్చినప్పుడు కాలం యొక్క హెచ్చుతగ్గులు అంటే పూర్ణిమ అమావాస్యలు, ఉత్తరాయణం దక్షిణాయనం, పగలు రాత్రి ఇలా వుంటుంది. సృష్టి చైతన్యాన్ని పదార్థంగా తీసుకు వెళ్ళడం, పదార్థాన్ని మళ్ళీ చైతన్యంగాను తీసుకు వెళ్ళడం అనే vertical part ని అనంతుడు చేస్తున్నట్లుగా భావన చేసుకోవాలి. ఇది భుజగోత్తముని గురించి కొంతవరకు మన అవగాహన.

## ౨౦౨,౨౦౩ హిరణ్యనాభః, సుతపాః

హిరణ్యనాభుడు అంటే బంగారు బొడ్డు కలిగినవాడని. భగవంతుడి బొడ్డు బంగారం. భగవంతుడి బొడ్డు అంటే  జ్యోతిషపరంగా కన్యారాశి వెళ్ళి, తులారాశి వస్తున్న ప్రదేశం. ఉద్భవస్థానం అన్నమాట. ఉద్భవం అంటే భగవంతుడు ఉద్భవించే స్థానం బంగారువర్ణం కలిగి వుంటుంది. మనలో కూడా భగవంతుడు ఉద్భవిస్తూ వుంటే మనలో బంగారుపు వన్నె/ఛాయ పెరుగుతూంటుంది. ఆ వచ్చే బంగారురంగు అమ్మవారు. ఉద్భవిద్దాం అనే భగవంతుని సంకల్పం ముందు అమ్మవారుగా వ్యక్తం అవుతుంది. అందుకనే అమ్మవారిని "హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం" అని హిరణ్య నామంతో ప్రారంభించి స్థుతిస్తాం. సువర్ణం అంటే బంగారానికి మరో పేరు. సువర్ణం అంటే మంచి రంగు కలిగినదని అర్థం వుంది. భగవంతుణ్ణుండి భగవతి పుట్టే స్థానం భగవంతుని బొడ్డు అంటారు. పుట్టుక అక్కడ నుండి జరుగుతుంది. 'హిరణ్యనాభుడు' అంటే హిరణ్యము నాభిగా కలిగిన వాడు. బంగారు వర్ణము నాభిగా కలిగినవాడు. లేక సృష్టి ఉత్పత్తిస్థానము హిరణ్యగర్భంగా కలిగినవాడు. అందుకే ఈ మొత్తం అంతా కూడా హిరణ్యం అనే అండంలో నుండి పుట్టుకొచ్చింది అంటారు. The Golden egg/ బంగారు గుడ్డులో నుండి మొత్తం సృష్టి అంతా వచ్చిందని చెప్తారు. బంగారు గుడ్డు అంటే ఏం లేదు. నిర్మలమైన సంకల్పం తనలోంచి వచ్చినప్పుడు ఆ నిర్మలమైన సంకల్పం యొక్క మొదటి స్వరూపం golden hue గా వుంటుంది. ఒక్కసారిగా భళ్ళున బంగారు వర్ణం మెరిస్తే ఏ విధంగా వుంటుందో ఆ విధంగా ఉత్పత్తి అవుతుంది. అందులోంచి పుడతాడు తపస్సు చేసే బ్రహ్మ. అందులోంచి పుడతారు ప్రజాపతులు. అవన్నీ మనకి సృష్టికి పుట్టుక స్థానం అని చెప్పడానికి భగవంతుడే ఆ విధంగా మార్పు చెందుతాడు. తన నుండి వస్తున్న సంకల్పం, తనలోంచి ఉద్భవిస్తున్నప్పుడు దానికి హిరణ్యమైన వర్ణం ఏర్పడుతుంది. నీలదేహుడని చెప్పడం ఎందుకంటే ఆకాశం అంతా నీలంగా వుంటుంది. దానికేమీ రూపురేఖలు వుండవు. దానిమీద ఉత్పత్తి అయ్యే హిరణ్య వర్ణం ఆధారంగా మిగతావన్నీ పుట్టుకొస్తాయి. అందుకని నీలవర్ణుడైన భగవంతునికి హిరణ్యవర్ణం గల ఆభరణాలు, హిరణ్య వర్ణంతో కూడిన బట్టలు ఉంటాయి. మనమంతా అందుకే పట్టు పంచెలు ధరించడం. ఎందుకంటే హిరణ్యవర్ణానికి అతీతమైన తత్వం భగవత్తత్వం. అది మొదట వ్యక్తం అవడం హిరణ్య వర్ణంగా వ్యక్తం

అవుతుంది. హిరణ్యవర్ణంగా వున్న తత్వానికి లోబడి మిగిలినవన్నీ పనిచేస్తాయి. అది బంగారానికి వున్న రహస్యం. అందుకని బంగారం పెట్టుకుంటే ఆ విధమైన భావం వుంటుందని విలువ ఎరిగి పెట్టుకోవడం. విలువ అంటే దాని రూపాయల విలువనెరిగి పెట్టుకోవడం కాదు. మనలో వుండే చైతన్య స్థితి హృదయమునందు హిరణ్య వర్ణంగా గోచరిస్తుంది. మొట్టమొదట సాధకుడు భగవత్సాన్నిధ్యంలోకి ప్రవేశించినప్పుడు ఇచ్చే మొట్టమొదటి దర్శనం హిరణ్య వర్ణం. ఆ హిరణ్యవర్ణానికి వెలుపలగా లోకాలు వుంటాయి. లోపల భగవత్తత్వం వుంటుంది. అందుకే ఆ హిరణ్యవర్ణాన్ని పొందిన వారు లోకాల మీద పరిపూర్ణమైనట్టి ఆధిపత్యం కలిగివుంటారు. 'హిరణ్యవర్ణుడు' అనేవాళ్లు సృష్టిలో ఇద్దరు కనిపిస్తారు. ఒకడు హిరణ్యక్షుడు, ఇంకొకడు హిరణ్యకశిపుడు. హిరణ్యాక్షుడు ముందు బయటకు వస్తాడు. హిరణ్యకశిపుడు ముందు లోపలికి వెళ్తాడు. కవల పిల్లల్లో మనం పెద్దవాడనుకునేవాడు చిన్నవాడు. మనం చిన్నవాడనుకునేవాడు పెద్దవాడు. అందుకే చిన్నవాడు పెద్దవాడికన్నా ఎక్కువశక్తిమంతుడిగా కనిపిస్తాడు. కారణం ఏమంటే గర్భంలోకి మొదట వెళ్ళిన వాడు వెనకాల వస్తాడు. హిరణ్యాక్షుడు ముందు బయటికి వచ్చాడు అంటే చిన్నవాడన్నమాట. హిరణ్యకశిపుడు పెద్దవాడు. తర్వాత వస్తాడు. అందుకనే వీడికి, వాడికన్నా program ఎక్కువ వుంటుంది. భరద్వాజుడు కూడా అలాగ పుట్టినవాడే! హిరణ్యకశిపుడు అంటే వాడి substance అంతా కూడా హిరణ్యమే. అందుకే అందులోంచి పుట్టుకొచ్చిన దేవతలు వాణ్ణి ఏం జయిస్తారు? హిరణ్యాక్షుడు అంటే వాడినుండి ప్రసరించే కిరణాలన్నీ బంగారమే. మహత్తరమైన ఇద్దరు కొడుకులు కావాలంటుంది దితి కశ్యపుడ్ని సాయంత్రం వేళ. ఇప్పుడు కాదంటాడు కశ్యపుడు. లేదు ఇప్పుడే అంటుంది. అది రాక్షస సమయం. అయినా ఆయన తేజస్సు అలాంటిది. అందువల్ల బంగారువర్ణం తో కూడిన ఇద్దరు పిల్లలు కలుగుతారు. అయితే కశ్యపుడికి భయం వేసింది. బంగారు వర్ణంలో వున్నా, వీరు పుట్టిన time బాలేదు. కనక కష్టం రావచ్చని హిరణ్యవర్ణం నామాలే పెట్టి వుంచుతాడు. ఎందుకంటే అది భగవత్తత్వానికి కూడా చాలా దగ్గర. బంగారం భగవత్తత్వానికి దగ్గర, మామూలు commercial దానికి దగ్గర కదా! వీళ్ళకి ఈ పేర్లు పెట్టాక చాలా సహజంగా they find that they are the most powerful beings on the planet. ఎందుకంటే వాళ్ళనింకెవరూ జయించలేరు. ఎందుకు జయించలేరంటే భగవంతుని నాభి రంగు కలిగిన వాళ్ళు. భగవత్తత్వంలో

నుండి పుట్టుకొచ్చిన వాళ్ళు. భగవంతుడు తప్ప ఇంకెవరూ జయించలేని తేజస్సు కలిగిన వాళ్ళు. తర్వాత పుట్టిన దేవతలు ఎవరూ కూడా వాళ్ళని జయించలేరు. అందుకే వారి చేతిలో 14 లోకాల వాళ్ళూ ఓడిపోతారు. వెళ్ళిన వారెవ్వరూ ఎదురు చెప్పలేదు, వీళ్ళకి ఎదురు చెప్తే మనం అవమానాల పాలవుతామని ఉద్దేశ్యంతో. వీళ్ళు దానికి పైబడ్డ తత్వం వద్ద మాత్రమే లోకువ! ఈ హిరణ్యాక్షుడు అన్ని లోకాలకూ, నన్ను జయిస్తావా? అంటూ వెళ్తాట్ట. Challenge చేసినవాణ్ణి చావగొట్టేసేవాడు. చేయకపోవడమే ఉత్తమం. అలా వాడు తిరిగి తిరిగి పాతాళ లోకానికి వెళ్తే, అక్కడ పాతాళ లోకాల అధిపతిగా వరుణుడు వుంటాడు. వరుణుడు కూడా విష్ణువు లాగే వుంటాడు ఆకారంలో. 'నన్ను గెలుస్తావా? నాతో పోట్లాడగలవా?' అని అడుగుతాడు. 'మాతో పోట్లాడ్డమెందుకు? లోపల వాడున్నాడు ఇంకోడు. వాడి వద్దకు వెళ్ళు. వాడితో పోట్లాడు. నీకు సరదా తీరుతుందంటాడు.' ఎవడు వాడు, అని అడిగితే, నువ్వెళ్ళిచూస్తే కనబడతాడు, అంటాడు వరుణుడు. అలా చెప్పి వరాహమూర్తి వద్దకు direct చేస్తాడు. అక్కడొక వింత రూపంలో, శ్వేత వరాహ రూపంలో ధగధగాయమానమైన తెలుపు కాంతితో గోచరిస్తాడు. White in its depth it is blue. మనకి సూర్యుడు వచ్చినప్పుడు తెల్లగా కనిపించే ఆకాశం, సూర్యుడు ఆ మూలో, ఈ మూలో వెళ్ళిపోయిన సమయంలో నీలంగా కనిపిస్తుంది. అంటే లోతు ఎక్కువయ్యే కొలది తెలుపు, నీలంగా అవుతుంది. నీలవర్ణుడు వీడికి తెల్లగా గోచరిస్తాడు. లోతుల్లోని వాడు వ్యక్తమైనాడని అర్థం శ్వేత అంటే. మరీ లోతుల్లోకి వెళ్తే కృష్ణుడైపోతాడు. వ్యక్తమయితే విఠలుడౌతాడు. విఠలుడంటే తెల్లటి కాంతి. పాండురంగడంటే తెల్లటి రంగు. పాండు అంటే తెలుపు. పాండురాజు అంటే తెల్లటి రాజు అని అర్థం. స్వచ్ఛమైన స్వభావము కలిగిన వాడు. అందుకు తెల్లటి వాడు, అని అంటారు. అట్లాగే భగవంతుడు కృష్ణుడుగా వ్యక్తమైతే నీలం రంగు వస్తుంది. కృష్ణుడు అసలు మరీ నలుపు. అది బాగా లోతు. ఆ లోతుల్లోంచి నీలంరంగు, ఆ నీలం రంగులోంచి వ్యక్తమైతే తెలుపు రంగు. వరాహమూర్తి తెలుపు రంగులో గోచరిస్తాడు. ఆయనొక్కడే వీణ్ణి గెలవగలడు. ఈ వరాహమూర్తి భూమిని తన కోరల మీద నిలబెట్టి వున్నట్లుగా కనిపిస్తాడు హిరణ్యాక్షునికి. అంటే సమస్త సృష్టికి తను ఆధారభూతుడని చెప్పడం అన్నమాట. ఈ గోళం అంతా నీది కాదు! మొత్తం నాదే. నువ్వేంటి? నా గోళం పట్టుకెళ్తున్నావంటాడు, హిరణ్యాక్షుడు. వినకుండా అలా

చూస్తూంటాడు వరాహమూర్తి. వాడు తిడుతూంటాడు. యుద్ధంచెయ్యి నాతో, అని కవ్విస్తాడు వరాహమూర్తిని. పైకి ఎగిరి, గోళాన్ని చోటులో అలా నిలబెడతాడు భగవంతుడు. అంటే ఈ గోళాలన్నీ నిలబడడానికి కారణం భగవంతుని బలం అని చెప్పడం. అప్పుడు మొట్టమొదటిసారిగా హిరణ్యాక్షుడి కళ్ళల్లోకి చూస్తాడు. ఈయన చూపుతో వాడిలో హిరణ్యమైన బలం అంతా ఆకర్షింపబడిపోతుంది. ఎందుకంటే దాని sourse ఇది. దానికి పుట్టుక స్థానం. హిరణ్య వర్ణానికి పుట్టుక స్థానం నీలవర్ణం. ఎప్పుడైతే ఈ వర్ణం వచ్చి ఆ వర్ణం మీద పడ్డదో, హిరణ్య వర్ణంలో మంచి నీలవర్ణం వేస్తే హిరణ్య వర్ణం వెలుగు ఎలా తగ్గిపోతుందో అలా తగ్గిపోతుంది హోమంలో తేనె వేసినట్లుగా. జబ్బొచ్చిన వాడిలా weak అయిపోతాడు హిరణ్యాక్షుడు. అప్పుడు వాడిని చంపేస్తాడు. అలాగే శ్రీకృష్ణుడు కూడా తన నీలవర్ణాన్ని ప్రసరింపజేసి, కురుక్షేత్ర యుద్ధంలో వారిలో వున్న హిరణ్యవర్ణమైన బలాన్ని తన చూపులతో లాగేస్తాడు. ఎందుకంటే ఎవరిలో బలం వున్నా అది అమ్మవారి శక్తే! దాని యొక్క వర్ణము హిరణ్యం. ఆ బలంతోనే ఈ సృష్టి అంతా ఏర్పడింది. భగవంతుని యొక్క మొట్టమొదట వ్యక్త రూపం లేక అమ్మవారు దాన్నే 'హిరణ్యము' అంటారు. దాన్ని బొడ్డులో కలిగిన వాడు. బొడ్డంటే అక్కడ నుండి అన్నీ పుట్టుకొస్తాయి కాబట్టి 'హిరణ్యనాభుడు' అంటారు. మొత్తం భగవత్తత్వంలో అమ్మవారి తత్వం బొడ్డంత వుంటుంది. అక్కడి నుండి ఆమె వ్యక్తమై పెద్ద గుడ్డంత అవుతుంది. అందులోంచి ఒకాయన పుట్టుకొస్తాడు. సుతపుడు. 'హిరణ్యనాభః సుతపాః' అని బ్రహ్మకి ఒక పేరు. 'పద్మనాభః ప్రజాపతిః' అన్నీ related నామాలే! ఈ బొడ్డు నుండి హిరణ్య వర్ణం ఎప్పుడైతే వచ్చిందో, అందులో నుండి ఒక కమలం ఉద్భవమై, ఆ కమలంలో నుండి ఒకాయన బయటికి వచ్చాడని పురాణాల్లో చెప్తారు. అంటే మనం కూడా నిద్ర మేల్కొంచేటి స్థితిలో నుండి వచ్చిన తర్వాత పూర్తిగా బయటకి వస్తాం. మంచి నిద్రలో వుంటాం అనంతపద్మనాభుడి లాగా. మెలుకువ వచ్చింది. వచ్చాక లేచి కూర్చొనే పరిస్థితి వుంటుంది కదా! Vertical గా కాక horizontal గానే వుంటాం. ఇంకా horizontal గా వున్నప్పుడు హిరణ్యనాభ స్థితి. అంటే We have emerged from the state of apparent no existence but pure existence. వున్నాం అని తెలియదు కానీ పరిపూర్ణంగా వున్నాం. ఎట్లా వున్నామంటే మనకి కూడా మనం వున్నామని తెలియని స్థితిలో. ఇంకోడు లేని స్థితి. అక్కడనుండి మెలుకువ రావడం అనేది 'హిరణ్యనాభ' స్థితి. అంటే మనకు

ఉదయం వచ్చే రంగు లాగన్నమాట. మెలుకువ వచ్చాక మనం బయటకి వస్తాం కదా! అంటే నిలబడతాం. Vertical అవుతాం. అయినప్పుడు వచ్చే ఆలోచనేమిటి? మనం ఏం చేయాలి? ఇది ఏ వారం? ఏం పనులున్నాయి? ఇలా గుర్తొస్తాయి. మనకి మనకే ఆడియో కేసెట్ వినిపిస్తుంది. ఎవ్వరూ వచ్చి చెప్పరు. అంతా లోపలే కదా! లేచి నిల్చోగానే నీ పేరిది. నువ్వు ఈ ఊళ్ళో వున్నావు. నువ్వీపనులు చేసుకోవాలి. ఇలా అన్నీ చెప్తారు లోపల. ఎవరు? మనకి మనమే. ముందు పడుకున్న వాళ్ళమే ఇలాగై, ఇదిగో ఈ అవతారంలో నుండి ఆ అవతారంలోనికి అయిపోతాం. అలాగ ఈ బ్రహ్మగారు లేచాక నేనెవరు? నేనేం చెయ్యాలి? అని చాలా తపన చెందుతూంటే లోపల నుండి ఒక శబ్దం వినిపించిందిట. 'తప' అని. ఏం చెయ్యాలో తెలియాలన్నా, నువ్వు ఎవరో తెలియాలన్నా తపస్సు చేయాలి అని చెప్పారట. అక్కడనుండి వచ్చింది మనకు తపస్సు. ఇప్పటికీ ఎవరికైనా తపస్సు చేసుకోవడం వలన చాలా సమస్యలకి పరిష్కారాలు దొరుకుతాయి. తపస్సు చేసుకోవడం వలన తమకు తామెవరో తెలుస్తారు. ఆ తపస్సుకు ముందుగా ఆత్మ పరిశీలన వుండాలి. seif introspection. అది వానికి పుట్టింది. పుడ్తే ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి అంటే 'తప' అని రెండే అక్షరాలు వినిపిస్తాయి. తపస్సు చేస్తాడు. ప్రొద్దుటే ఒక్కోసారి మనకి మనం ఎక్కడ మేల్కొంచామో తెలియని స్థితి ఏర్పడుతూంటుంది. మనం అప్పుడప్పుడు నిద్ర పోయినప్పుడు పొద్దునా? సాయంకాలమా? అని ప్రశ్న వస్తూంటుంది కదా! ముఖ్యంగా మధ్యాహ్నాలు నిద్ర పోయినప్పుడూ, క్రొత్త ప్రదేశంలో నిద్రపోయి లేచినప్పుడు ఇలాగ అనిపిస్తూంటుంది ఒక్కోసారి. అలాగ తనెవరో, ఏం చెయ్యాలీ? ఎలా తెలుస్తుందతనికి? అక్కడ ఇంకెవ్వరూ లేరు కదా! అప్పుడు ఇంకా వాడే మొదలు. లోపల నుండి చూస్తే తను కమలంలో కూర్చుని వున్నాడు. క్రింద పెద్ద కాడ. ఆ కమలం కాడ పట్టుకొని ఎక్కడ పుట్టుకొచ్చిందో చూడ్డానికి వెళ్తాడు. ఆ కమలం కాడ పట్టుకొని వెళ్ళీ వెళ్ళీ, ఎంత వెళ్ళినా తెమలదు. చాలా దూరం వెళ్తే చీకట్లు వచ్చేస్తాయి. ఏం కనబడదు. ఇతడికి భయం వేస్తుంది. ఏం గోల ఇదేం మనకు అర్థం కావడం లేదు, ఎందుకొచ్చిందని మళ్ళీ వెనక్కి పద్మంలోకి వచ్చి కూర్చుంటాడు. పట్టుకొని క్రిందకి వెళ్తే అంతు పొంతు లేని లోతుల్లోకి వెళుతూంటుంది. అసలక్కడ ఏమీ లేదు. చోటే! మనం కూడా ఎప్పుడైనా ఆపదలో వుంటే వున్నచోటే వుండడం సుఖం అనిపిస్తుంది. Train లో వెళ్తాం. Train అంతా నీరు వచ్చేస్తుంది. అప్పుడు అందరి phylosaphy ఏమంటే

వున్నచోటే వుందామని. అనిపించదూ! అలాగ అతడు భయపడి వున్న స్థానంలోనే వుండడం మంచిదని వెనక్కి వచ్చి కూర్చుంటాడు. కూర్చున్నాక ఏం చేద్దాం అనుకుంటే 'తప' అని వినిపించిందట. అప్పుడు తపస్సు చేశాట్ట. తపస్సు చేస్తే వీడి లోపల నుండి తను ఎవరో, ఏం చేయాలో తట్టిందట. ఆ తట్టించిన వాడెవడు? సుతపుడు. అందుకని తపస్సు బాగా చేస్తే దొరికేవాడు. తపఃఫలం! ఆ విధంగా తపస్సు చేస్తే అప్పుడు మళ్ళీ అనంతతత్వంలో నుండి అంతర్యామి తత్వంలోనికి పుట్టుకొచ్చిన వాళ్ళని, తననుండి మళ్ళీ ఆ తత్వమే పుట్టుకు వచ్చి చాలా తయారు చేస్తుందని, దానికి తాను సహకరించాలని, ఇటువంటివన్నీ తెలుస్తాయి బ్రహ్మకి. తెలిసి, దానికి సహకరించడం వుంటుంది. మనలో కూడా సుతపుడు. పనిచేస్తుంటాడు. అది ఎలా పని చేస్తుందంటే, అసలు ఇదంతా ఏమిటి? ఇదంతా ఎందుకిట్లా వుంటుంది? ఈ భూమి తన చుట్టూ తాను తిరగడమేమిటి? తిరుగుతూ తలకాయ అటూ ఇటూ ఆడించడమేమిటి? ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? ఇవన్నీ అసలు ఇట్లా ఎవరు ఏర్పరిచారు? చెప్పిన దేవుళ్ళందరూ ఈ రూపాల్లోనే వుంటారా? ఇట్లాంటి ప్రశ్నలు లోపల నుండి పుట్టి ఒక తపస్సు ముందు తపనగా మొదలవుతుంది. ఏమిటిదంతా? అనే తపన మనలో కలిగించేవాడు 'వాడు'. అందుకని మనలో వాడు వుండి, మనల్ని ఒక జిజ్ఞాసువుగా తయారు చేస్తాడు. అక్కడ నుండి వాణ్ణి చూపించే లోగా మన కథ నడుస్తుంది. ఈ కథ నడిచేలోగా మధ్య మధ్యలో మనం జారిపోతూంటాం. కదా! కొన్నాళ్ళు అయినాక చాల్లే బోర్ కొడుతోంది అనిపించి, మళ్ళీ పాత పద్ధతిలోకి వెళుతూంటాం. వెళ్తే రెండు మూడు నెలల తర్వాత విసుగు పుట్టినప్పుడు అది గుర్తు చేస్తుంది. చూసావా విసుగ్గా వుంది. అదే continue చేస్తే బాగుండేది కదా! అనిపించి discontinue లో నుండి మళ్ళీ continue లోనికి తీసుకు వస్తూంటుంది. అట్లా మనలో 'సుతప' తత్వంగా, ప్రజ్ఞగా భగవంతుడు పని చేస్తూంటాడు. అది బ్రహ్మ విషయంలో continuous. మూడ్స్, మధ్యలో ఆపడం, మళ్ళీ మొదలు ఇలా వుండదు. అందుకు భగవంతుడు బ్రహ్మలో అనుస్యూతంగా, నిరంతరంగా ఈ తపస్సు అనే పద్ధతిలో సృష్టి నిర్వహించే ప్రజ్ఞగా పనిచేస్తూంటాడు. అతడిని సుతపుడంటారు. మనలో కూడా కొంతమంది కొన్ని కొన్ని కార్యాలు చేపడితే అవి పరిపూర్ణం అయ్యేంతవరకు sideways వుండవు. దిక్కులు చూడరు. ప్రక్క చూపులు చూడరు. అది పూర్తి చేయాలనే భావనలో వుంటారు. ఏది పట్టుకుంటే అది పూర్తి చేయాలనే భావన, దానికి సంబంధించిన

తపన, పట్టుదల, కార్యదీక్ష గా మనలో పని చేసే భగవత్తత్వాన్ని 'సుతపుడు' గా భావించాలి. అలా పని చేస్తాడు. హిరణ్యనాభుడు ఎలా పనిచేస్తాడంటే, వెలుగుకి దారి చూద్దాం అనే పద్ధతిలో వచ్చే సంకల్పాలన్నీ కూడా మనలో హిరణ్యనాభుడిగా పనిచేస్తూంటాయి. హిరణ్యనాభ స్థితి కలిగినప్పుడు అప్పుడప్పుడు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు లాగా తయారవడానికి ఎప్పుడూ రెండు possibilities వుంటాయి. బ్రహ్మ అతీతస్థితికి వెళ్ళే వరకు మనమే అంతా అనుకోవచ్చు. కాదనరు ఎవరూ. ఎందుకంటే వాడేం మాట్లాడేవాడు కాదు. మనం పడిపోయినప్పుడు మనం కాదని తెలుస్తూంటుంది. పడకుండా వున్నప్పుడు కూడా వాడే అని తెలుసుకుంటే సరిగ్గా ఉంటాం. తెలుసుకోకపోతే పడిపోయే అవకాశం వున్నది. అందుకని తత్వంలో మనకు జ్ఞానం పెరుగుతున్నకొలదీ, మనలో ఈ హిరణ్యవర్ణం విచ్చుకొనడం ఎక్కువైన కొద్దీ, అహంకారం కూడా విచ్చుకునే అవకాశం చాలా ఎక్కువగా వున్నది. మన గురించి మనకు కొన్ని estimates వస్తూంటాయి. ఆ వచ్చే జ్ఞానం అంతా కూడా భగవత్తత్వం యొక్క సాన్నిధ్యమే అని గుర్తున్నవాడికి అహంకారం పెరగదు. భగవంతుడి సాన్నిధ్యం పెరగడం వలన అక్కడ హిరణ్యవర్ణం పెరిగింది తప్ప, భగవత్సాన్నిధ్యం లేకుండా హిరణ్యవర్ణానికి బలం లేదు. కనుక ఆ బలం, మన బలం అనుకోకుండా వాడి బలం అని గుర్తున్నవాడు ఇంకా పెరుగుతూంటాడు ఈ హిరణ్యమైన లోకాల్లో. ఇంకోటి 'ఒక యోగి ఆత్మకథ'లో పరమహంస గారికి యుక్తేశ్వరులు దేహం వదిలేసిన తర్వాత 14 సంవత్సరాలకి కనిపిస్తారు. అంతవరకూ కనిపించరు. ఈ 14 ఏళ్ళు గురుతరమైన బాధ్యతలు అప్పజెప్పబడి వుంటాయి. పైగా ఆత్మవిశ్వాసం పైన కొంచెంగా అహంభావం కలిగిన స్థితి వుంటుంది. గురువుగారు దేహం వదిలేసే సమయం లో, నువ్వెక్కడికి వెళ్ళబోక. నేను రేపో మాపో దేహం వదిలేయవచ్చు. గనక నువ్విక్కడే వుండు, అంటే, పర్వాలేదు. నేను లేని సమయం లో అలా కాదు, అనే ధైర్యం తో వదిలేసి వెళ్ళిపోతాడు. ఏవో మంచి పనులకే వెళ్తాడు. కానీ గురువాజ్ఞ తక్షణ కర్తవ్యం అనుకోలేదు. కానీ ఆ సమయంలోనే గురువు దేహం వదిలేస్తాడు. మళ్ళీ ఎన్నాళ్ళికీ ఈయన కనిపించడు. కనబడక, కనబడక 14 సంవత్సరాల తర్వాత ఓ నాడు కనిపిస్తాడు. ఎట్లా కనిపిస్తాడంటే ఆయనెక్కడో బొంబాయిలో ఓ హోటల్లో పడుకుంటే ఒక కిటికీలో నుండి ఆయన హిరణ్యవర్ణం కలిగి దిగి వస్తాడు. అలా ఆకాశంలో నుండి, కిటికీలో నుండి ఈయన గదిలోకి వస్తాడు. అమాంతం ఆయన

కాళ్ళు గట్టిగా పట్టేసుకుంటాడు. Tangible అది. భావన కాదు. కాళ్ళ మీద పడి ఇన్నాళ్ళు నన్ను మీరు నిరాదరణ చేశారని బాధ పడుతూ ఏడుస్తాడు. ఆయన దానికి నవ్వి ఏ సమాధానం చెప్పడు. ఇప్పుడు మీరేం చేస్తున్నారు? ఎక్కడున్నారు? అని అడిగితే, అప్పుడు యుక్తేశ్వర్ గిరి ఈ హిరణ్యలోకాలను వర్ణిస్తారు. ఆ హిరణ్యలోకాల్లో తను చేసే పని చెప్తాడు. అది వీలుంటే చదువుకోండి. 43 వ chapter. అది చదువుకుంటే ఆ లోకాల వర్ణన వుంటుంది. ఆ లోకాలు ఎంత సత్యమో మనం కనీసం చదువుకుంటే, మన లోపల వుండే చైతన్యానికి ఒక రకంగా దాన్ని గుర్తు చేసిన వాళ్ళమై, అది ఒకసారి నిద్రలో వున్నా రుచి చూడగలిగే స్థితి ఏర్పడుతుంది. ఆ విధంగా సత్సంకల్పముల ద్వారా, సద్భావముల ద్వారా, సత్కార్యముల ద్వారా, భగవంతుని ప్రశంస, స్తోత్రముల ద్వారా ఈ బంగారు రంగుని మనలో పెంచుకొనవచ్చును. దాని continuity కి 'సుతపుడు' పని చేస్తూంటాడు. దాన్నే 'Fiery aspiration' అంటారు. అంటే చాలా పట్టుదలతో కూడిన తపస్సది. మనలో అప్పుడప్పుడు breaks వస్తూంటాయి కదా! Arising out of ignorance. మనలో వుండే అవిద్య కారణంగా ఏర్పడిన అలవాట్లు రకరకాలుగా వున్న స్థితి నుండి ప్రక్కకు లాగుతూంటాయి. ఎడం ప్రక్కకు లాగడం అన్నమాట. ఎడమవైపు లాగడమంటే మనం చేస్తున్నవి, మనం చేద్దామనుకున్న సత్సంకల్పాలకు అంతరాయాలు. అంతరాయాలు రాకుండా చూసుకోవాలంటే సుతపుడనే నామాన్ని గుర్తుపెట్టుకోవాలి. సుతపుడంటే బాగా తపస్సు చేసినవాడు. సుతపుడనే ఒక ప్రజాపతి వున్నాడు. అతడు బ్రహ్మ నుండి పుట్టుకొచ్చిన ప్రజాపతులలో ఒకడు. ఆయన 12 వేల దివ్య సంవత్సరాలు తపస్సు చేస్తాడు భార్యతో గూడి. ఆ తపస్సు కారణంగా మూడు సార్లు భగవంతుడు అతనికి కుమారుడిగా జన్మించేంత స్థితిని పొందుతాడు సుతపుడు. అందుకని సుతపుడన్నారు. 12 వేల దివ్య సంవత్సరాలు భగవంతుణ్ణి గురించి తపస్సు చేస్తాడు. తపస్సు చేయమని ఆయన తండ్రి అయిన బ్రహ్మ చెప్తాడు. బ్రహ్మ తను తపస్సు చేసి సత్యం తెలుసుకున్నాడు, గనక తన నుండి వచ్చిన వాళ్ళకి కూడా ఆయన తపస్సు చేయమని చెప్తాడు. అందుకని పెద్దలు ఎవరికైనా ఎక్కువ doubts వస్తే వ్యాఖ్యానించరు. మౌనం ప్రసాదిస్తారు. వ్యాఖ్యానం చేసేవాడు విజ్ఞాన లోకాల్లో విహరించేవాడు. బాగా తెలిసినవాడు కాసేపు మౌనం ప్రసాదించి, మళ్ళీ అడిగితే అదే సర్దుకుంటుంది, మీకే తెలుస్తుంది అని చెప్పి పంపేస్తాడు. ఎందుకు మీకే

తెలుస్తుందంటే, మీకు కొంచెం మౌనం ఇచ్చాడు కాబట్టి, ఆ మౌనంలో నుండి మనలోనున్న సుతపుడనే ప్రజ్ఞకు ప్రేరణ ఇస్తాడు. ప్రేరణ ఇచ్చేసరికి మనకే తెలుస్తుంది నెమ్మదిగా. భృగువు, వరుణుడు తండ్రీ కొడుకులు. తండ్రిని కొడుకు అడుగుతాడు. తండ్రి పరిపూర్ణమైన జ్ఞానం కలిగిన వాడు. కొడుకు తపన వున్నవాడు. వాడు తండ్రి వద్దకు వచ్చి, నాన్నా! ఈ లోకం అంతా అర్థమయిపోయిందంటాడు. ఏంటి అర్థమైంది అంటాడు తండ్రి. ఇదంతా పదార్థం, అంతకన్నా లేదంటాడు. మనమైతే వెంటనే కాదంటాం. వాడికన్నా మనకు ఎక్కువ తెలుసని. అది కూడా సత్యమే కానీ part of the truth కానీ, total truth కాదు. అందుకే ఆ తండ్రి 'నువ్వు చెప్పింది సత్యం. అయినా ఇంకొంచెం తపస్సు చెయ్యి' అంటాడు. "సతపోతప్యత్ సతపస్తప్త్వా". మనకి తైత్తరీయోపనిషత్తులో బ్రహ్మవల్లి నుండి వస్తుంది. చేసిం తర్వాత కొన్నాళ్ళైనాక 'నాన్నా! ఈ పదార్థం అంతా నీళ్ళలోంచి పుట్టింది. అందుకని నీళ్ళు దీని కన్నా ముందున్నాయి. కాబట్టి నీళ్ళు అన్నిటికీ పుట్టుక స్థానం. ఈ జలరాసులూ, జీవాలూ ఇలా సమస్త జీవకోటి నీళ్ళలోంచే పుట్టుకొచ్చిందంటాడు'. 'ఎలా వుంది నా అవగాహన' అని అడుగుతాడు. 'చాలా సత్యం నువ్వు చెప్పింది. ఇంకొంచెం తపస్సు చెయ్యి' అంటాడు తండ్రి. తపస్సు చేస్తాడు. కొన్నాళ్ళైనాక మళ్ళీ వస్తాడు. ఏరా అంటే 'ఈ నీళ్ళకి ఆధారంగా వేడిమి వున్నట్లుగా తోస్తోంది నాకు. కనుక వీటన్నిటికీ అగ్ని ఆధారం అనిపిస్తున్నది. అగ్ని ముందున్నది. అగ్నిలో నుండి నీళ్ళు, నీళ్ళలో నుండి పదార్థం ఇలా పుట్టుకొచ్చినాయి. ఇంతే మొత్తం అంతా' అంటాడు. 'చాలా బావుంది. ఇంకొంచెం తపస్సు చెయ్యి' అంటాడు. మళ్ళీ తపస్సు చేసి వచ్చి, 'ముందు కన్నా నాకింకొక dimension తెలిసిందంటాడు'. ఏంటంటే, 'వాయువు' అంటాడు. వాయువు లో నుండి అగ్ని, అగ్నిలో నుండి నీరు, నీరులోనుండి పదార్థం పుట్టాయంటాడు. 'సత్యం. ఇంకొంచెం తపస్సు' చేయమంటాడు. 'ఆకాశంలో నుండి అన్నీ పుట్టాయంటాడు' తిరిగి వచ్చి. ఇంకా తపస్సు చేయమంటాడు. ఇలా తపస్సు చేయమంటూండడమే. చేస్తే తెలుస్తుంది తప్పా, చెప్పేస్తే information తప్ప, సత్యమనే అనుభూతి రాదు. ఈరోజుల్లో ఇంత చెప్పకుంటున్నాం కానీ ఇదివరకు రోజుల్లో ఇంత చెప్పేవారు కాదు. ప్రతి వాడికి ఒక చిన్న puzzle లాగా తయారుచేసి, కళ్ళు మూసుకొని కూర్చోరా, అని చెప్పేవారు. వాడికేమన్నా doubt వస్తే, ఒక క్షణం చెప్పి పంపేసేవారు. మళ్ళీ అదే పని. తపస్సు ద్వారా సత్యాన్ని దర్శనం చెయడం అనేది ఒక మార్గం. బాగా చైతన్య స్థితిలోనికి

వెళ్ళిపోయిన మహాత్ములు చాలా తక్కువ వ్యాఖ్యానము చేస్తూ వుంటారు, రమణ మహర్షి లాగా. ఆయన వద్దకి ఎవరైనా వస్తే, అలా చూసి పంపేసేవారు. వెళ్తూండగా దారిలోనో, ఇంటికి వెళ్ళిన రెండు మూడు రోజులకో, లేదా ఏ రెండు మూడు సంవత్సరాలకో  వెలిగేది వాడికి. అలా చాలా కథలు కనిపిస్తాయి. మౌనంలో నుండి ఎక్కువ ప్రసాదించవచ్చు. ఎందుకంటే ఈ 'తప' అనే తత్వాన్ని పెరగనివ్వచ్చు కనుక. బొడ్డు లోంచి అమ్మవారి తత్వం పుట్టుకొచ్చాక ఆ తత్వం ఊరుకోదు. అది భగవత్తత్వానికీ, భగవతీతత్వానికి వున్న తేడా. ఊరుకునే విషయం కాదు. అలా విచ్చుకోవడమే. "పద్మప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మ దళాయతాక్షి" అలా విచ్చుకుంటూ పోవడమే. Continuous process. పద్మాలు పద్మాలుగా, కమలాలు కమలాలుగా విచ్చుకుంటుంది. Chain action అమ్మవారిది. మనలో భగవత్తత్వంగా ఆయనొకడున్నాడు కదా! భగవత్ తత్వంగా వున్న 'నేను' అనే చైతన్యానికి వెనకాల 'వున్నాను' అనే స్థితిలో గనక వుంటే, అది ఆధారంగా మనస్సు విచ్చుకొని పరంపరలుగా ఆలోచనలు వస్తాయి. అదంతా అమ్మవారి తత్వం.

## 204 పద్మనాభః

ఆలోచనలన్నీ ఎక్కడి నుంచి వస్తున్నాయంటే, బొడ్డులోంచి వస్తాయంటాడు. అందుకే మన వాళ్ళు "ఎన్ని ఆలోచనలున్నాయిరా నీ బొడ్లో" అంటారు. Physical aspect బుర్రలో వుంది తప్ప, root aspects మాత్రం బొడ్డులోనే వుంటాయి. ఆ విధంగా అమ్మవారి తత్వం విచ్చుకుంటూంటుంది. అందుకే అమ్మవారు పద్మంలో కూర్చుంటుంది. చేతిలో కమలాలు పట్టుకుంటుంది. కమలాల దండ వేసుకుంటుంది. చెయ్యి కమలంలా వుంటుంది. కన్ను కమలంగా వుంటుంది. పద్మాలంటే ఆమెకి చాలా ఇష్టమట. అంటే అలా విచ్చుకోవడం. అందుకే పెళ్ళైన తర్వాతే అందరికీ పెరుగుతుంది సంసారం. వీడు శివుడయితే, ఆమె శక్తయితే ఇప్పుడు పెరుగుతుంది. మనం శివులం కాదనుకోండి. ఎందుకంటే మనం already అర్ధనారీశ్వరులం. శివపార్వతులం. అర్ధనారీశ్వర తత్వం వుంది కనుకే మనకి అవి కావాలి, ఇవి కావాలి అనే కోర్కెలు పుడుతూంటాయి. ఎప్పుడైతే అమ్మవారు ఏర్పడిందో, ఇద్దరి మధ్య కామం అనేది పుడుతుంది. దాని ఆధారంగా అన్నీ పుట్టుకొస్తూంటాయి. కనక పెళ్ళి చేసుకొని ఇంకో అమ్మవారిని తెచ్చుకుంటే, మనకిల్లుండాలి కదా అంటుంది. అంతే వీడికి పెద్ద program ఇచ్చేసినట్లే. పిల్లలు వుండాలి కదా అంటే వీడికి పెద్ద program. ఇంక అవి వుండాలి ఇవి వుండాలి లోంచి సృష్టి వస్తుంది. మనం కమలం అంటే గుర్తుపెట్టుకోవలసినది "unfolding concept". తిరోధానం కాదు పురోగమనం. విచ్చుకుంటుంది. కమలానికి మరో dimension ఏమంటే, ఏం చూసి విచ్చుకుంటుంది? భగవత్ తత్వాన్ని చూసి విచ్చుకుంటుంది. భగవత్తత్వం సహకారం లేకుండా విచ్చుకోదు కమలం. మనం విచ్చుకోడం కూడా అలా వుంటే, సృష్టిలో వారు ఎలా పరిపూర్ణంగా నిండి వున్నారో, మన సృష్టిలో మనమూ అలాగే పరిపూర్ణంగా నిండి వుండవచ్చు. మన విచ్చుకోడాలు, తత్వంతో సంబంధంలేని విచ్చుకోడాలు అయిన కారణంగా మనకి బాగా పెద్ద పెద్ద ముళ్ళు పడిపోతాయి. "పద్మనాభ" నామం ఎందుకు తీసుకుంటామంటే ఆయనలో నుండి పుట్టుకు వచ్చిన అమ్మవారి తత్వం, హిరణ్యతత్వం పద్మంగా విచ్చుకొని, ఆ విచ్చుకోడాలు అనేది అట్లా series గా జరుగుతూంటుంది. ఒక గొలుసు కథలాగా జరుగుతూంటుంది. అయిపోవడం అంటే ప్రతి అయిపోవడం ఇంకో మొదలు అన్నట్లుగా వుంటుంది. అయిపోవడం

అనేదేం లేదు. ఈ సృష్టిలో అయిపోవడం అనేదే వుండదు. అయిపోతే, ఇంకో మొదలుకే ఈ అయిపోవడం. అంతవరకూ అయిపోవడం వుండదు. Every ending is for a fresh beginning. అంతం కాదు ఇది ఆరంభం అంటామే అలా అంతులేని కథ. మనకు వచ్చే ఆలోచనలు కూడా ఒకటైపోతే సరిపోతుందా? ఇంకోటి వస్తుంది కదా! అదీ అమ్మవారి తత్వం. అది పద్మానికి చిహ్నం. అలాంటి పద్మాన్ని నాభియందు కలిగినవాడు అని అర్థం. మనకొచ్చే విచ్చుకోలుకానీ, సృష్టి విచ్చుకోలు గానీ వీటన్నిటి పుట్టుక స్థానం భగవంతుడు అని తెలియడానికి ఈ నామం పని చేస్తుంది.

## 205 ప్రజాపతిః

21 ప్రజాపతులని, ఏడు కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రానికి ముగ్గురు బ్రహ్మలు చొప్పున 21 మంది బ్రహ్మలు ఏడు లోకాల్లోనూ సృష్టి చేస్తున్నారు. అందులో మనమెరిగిన ఏడవలోకమైన భౌతిక లోకంలో కర్దముడనే ప్రజాపతి అధిపతిగా ఈ సృష్టి జరుగుతున్నది. మొట్ట మొదట బ్రహ్మ కదా! ప్రజాపతులు ఆ బ్రహ్మ నుండి పుట్టుకొచ్చి, ఒక్కొక్క లోకం ఒక్కో branch గా పెట్టారు. అక్కడొక బ్రహ్మ. ఆ లోకం విచ్చుకోలు అంతా ఆయన చూసుకుంటాడు. ఆయనకిద్దరు అనుయాయులు. Triangular functioning. అలా 21 బ్రహ్మలుగా ప్రజాపతులుగా మొత్తం అంతా ఈ మూలతత్వమే ఇన్నిగా ఏర్పడింది. మూలతత్వం ఆధారం లేకుండా ఎవరూ ఏమీ చెయ్యలేరు. తనే ఇవన్నీగా మారి చేస్తూంటాడు కాబట్టి మారుతూ చేస్తున్న ప్రజాపతి కూడా నువ్వు మాత్రమే! ప్రజాపతులు నీవు. ప్రజాపతుల ఉత్పత్తి స్థానమైన బ్రహ్మం నువ్వు. బ్రహ్మకి ఉత్పత్తి స్థానమైన పద్మనాభం నువ్వు. పద్మనాభానికి మూలమైన హిరణ్య గర్భానివి నువ్వు. ఇవన్నీ ఈ విధంగా జరుగుతూండడానికి జరిగే తపస్సు కూడా నువ్వే. ఇట్లా అన్నిటికీ సృష్టిలోని మహత్తర తత్వాలన్నిటినీ వేరువేరుగా దర్శనం చేయడం కాకుండా ఇన్నిటిగా నువ్వే వున్నావని దర్శనం చేయించడానికి ఈ నామం ఇస్తారు. అప్పుడేమవుతుందంటే ఒకే తత్వం తెరమీద, ఇన్ని ఏర్పడుతున్నాయని తెలిసే అవకాశం ఏర్పడుతుంది. అందుకే ప్రతి దాన్లోంచి మళ్ళీ వాడినే చూపించడం, అన్నిట్లోంచి వాడినే చూపించాలి. అప్పుడు సత్యాన్ని దర్శనం చేయించిన వాళ్ళమవుతాము. ఆ విధంగా మనకి ఋషులు ఈ సహస్రనామం ఇచ్చారు.

★★★★★★★★★★★

భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడటం అనేది, మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకొని భగవత్ అనుభూతిని పొందటానికి ఒక సులభమైన మార్గం, మనకి కలియుగంలో భగవంతుడైన శ్రీకృష్ణుడు ఇచ్చిన మార్గం. ఏకాదశ స్కంధం చూసుకున్నట్లైతే కలియుగంలో అతి సులభమైన పద్ధతిలో భగవంతుడి అనుభూతి పొందటానికి అవకాశం ఎక్కువగా వున్నదని తెలుస్తోంది. కారణం ఏమిటంటే, ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్ధ్యములు కలియుగంలో మానవుడికి ఉండదు కాబట్టి కొంత అలసత్వం కొంత మంద బుద్ధి వుండటం వలన, స్తోత్రాదుల ద్వారా భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకోడం ద్వారా, సులభముగా తన్నుతాను పవిత్రీకరించుకొని, భగవంతుని యందు నిలబడడానికి అవకాశము ఏర్పడుతుంది, అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పడం జరిగింది. ఆ మార్గంలోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు మనకి భగవతి పేరున, భగవంతుని పేరున యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ వున్నట్లయితే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికంగా భగవంతుని నామ పారాయణం చేసుకోడం ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకుంటూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించడానికి భక్తి శ్రద్ధలతో ప్రయత్నం చేయాలి. భగవంతుని ఈ మార్గంలో అనుభూతి చెందడానికి శ్రద్ధ, ఓర్పు బాగా కావాలి. ఓర్పు చాల అవసరమైన విషయము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ వుంటుంది. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుంటుంది. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకుంటూ మనం మనని పవిత్రీకరించుకుంటూ, కాలం యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించడానికి అవకాశం కల్పించుకోవాలి.

-కంభంపాటి పార్వతి కుమార్